
చరిత్ర

# ప్రాచీన దక్షిణ భారత చరిత్ర



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org | Mobile App: Free Gurukul | email: support@freegurukul.org

Facebook: www.facebook.com/freegurukul | Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# ప్రాచీన దక్షిణ భారత చరిత్ర

రచన

నండూరి రామకృష్ణమాచార్య

ప్రచురణ

కవితాప్రభాన గ్రంథమండలి

1967

# మున్నుడి

**చరిత్రకు అంతరాత్మ సత్యము :**

సత్యము కాలగర్భమున చిరకాలము అజ్ఞాతవాసము చేయుట కద్దు. చరిత్రకారుడు సలుపవలసిన అసిధారావ్రతము, కాలగర్భమున మాటువడిన సత్యమును సాక్షాత్కరింప జేయుటయె.

'సత్యమను మేలిమునుగు ధరించి మెలకువతో మెలగగలుగు కట్టుకథయే చరిత్ర' అనునది ఒక ఛలోక్తి. . నిత్యచరిత్రశ్రవణమును తన దినచర్యలో అపరిహార్యమైన అంశముగా పాటించిన ఒకచక్రవర్తి, ప్రతిసాయంసమయమున చారిత్రకపౌరాణికుని "ఆ అబద్ధాల కోరును రమ్మని ఆహ్వానించు చుండెడివాడట !! ఆ అపప్రథ చరిత్రకారుని కఠోరకర్తవ్యమునకు ఉద్దీపనవిభావమే.

భారతీయచరిత్ర - ఐదంయుగీనులు నేర్చిన క్రొత్తవిద్య. ప్రాచీన దక్షిణ భారతచరిత్రకు న్యాయము చేకూరలేదు. ఎందరో మహానుభావులు - విదేశీయులు భారతీయులు ఈ లోటును పూరించుటకు ఉగ్గడింపదగిన కృషి చేసినారు. అందరకును నా వందనములు. ఈ గ్రంథమున నా కృషిగా పేర్కొనదగినది కాళిదాస మహాకవి చిరస్మరణీయవాక్యమును ఉదాహరింపనగుచో మణులను ఏర్చి కూర్చిన దారము మాత్రమే.

చరిత్ర అనిన, రాజులు - యుద్ధముల అనుక్రమణిక అను సంకుచిత భావమునకు కాలదోషము పట్టినది. యుగయుగాంతరముల దక్షిణభారతసంఘము - అలనాటి నిత్యప్రజాజీవితవృత్తములు ఈ "ప్రాచీన దక్షిణ భారతచరిత్ర" లో సహృదయులకు మెరపు తీగలవలె నైన సాక్షాత్కరించినచో నాజన్మ తరించినట్లు భావించుకో గలను. ఈ గ్రంథముద్రణకు రు 3000 లు సాయముచేసిన ఆంధ్ర ప్రదేశ ప్రభుత్వమునకు నా కృతజ్ఞత.

మాతృభాషలో ఉన్నతవిద్యాభ్యాసము జరుగనున్న యుగమునకు ఈ గ్రంథము ప్రావేశికీధ్రువగాన మగుగాత.

రచయిత.

# ప్రాచీన దక్షిణ భారత చరిత్ర

## తొలియుషస్సులు

దక్షిణాపథము భారతదేశములో దక్షిణ భూభాగమగు ద్వీపకల్పము. కన్యాకుమారినుండి వింధ్యపర్వతశ్రేణికి మధ్యనున్న ప్రదేశమంతయు భృశార్థమున దక్షిణాపథముగ నిర్వచింపవచ్చును. వింధ్యపర్వతశ్రేణికి హిమాలయపర్వతపంక్తులకు మధ్యనున్న ప్రదేశము, గంగాసింధుబ్రహ్మపుత్రనదీవిలసితమైనప్రదేశము వేదకాలమునుండి ఆర్యావర్తముగ సుప్రసిద్ధము. మానవచరిత్రలో తొలిగ్రంథముగ వినుతి కెక్కిన ఋగ్వేదము ఆర్యావర్తమున ఉదయించినది. ఆర్యనాగరికతకు, ఆర్యసంస్కృతికి వేదయుగమున వింధ్యపర్వతపంక్తులు దక్షిణావధి. వింధ్యపర్వతపంక్తులకు ఆర్యులు పెట్టిన "పారియాత్రము" అను పేరు ఈ అర్థమునే సూచించుచున్నది.

దక్షిణభారతద్వీపకల్పము భౌగోళికముగ ఆర్యావర్తముకంటె ప్రాచీనతరము. హిమాలయ పర్వతములకంటె దక్కను పీఠభూమి యందలి కొండలు వయస్సున పెద్దవి. హిమాలయములు సముద్ర గర్భమునుండి పైకి ఉబుకక పూర్వమే, గంగాసింధుమైదాన మనునది భూగోళమున అవతరించకపూర్వమే దక్కనుపీఠభూమి వివిధపర్వత పంక్తులతో, కృష్ణాగోదావరీతుంగభద్రాకావేరీనదీవిలసితమై స్థిరరూపము దాల్చియున్నది.

భూగోళమున తొలి మానవుడు ఎప్పుడు? ఎక్కడ? ఉద్భవించె ననునది చరిత్రకారులు ఇంతవరకును పరిష్కరింపలేకపోయినసమస్య. దక్షిణాపథమున తొలిరాతియుగమునకు చెందిన ప్రాక్తనమానవుని

సమాధులు పలుతావులలో లభించినవి. కృష్ణాగోదావరీతుంగభద్రా నదీగర్భములు ప్రాక్తనమానవునకు ఆటపట్టులు. అంతేకాక పరిణామ వాదమును బలపఱచు చారిత్రకసాక్ష్యము - ప్రపంచమందు వేరొక చోటు లభ్యముకానిది - దక్షిణాపథము ప్రసాదించుచున్నది. నరునకు పితామహుడు వానరుడని పరిణామవాదము. రామాయణగాథల ప్రకారము శ్రీరాముడు దక్షిణాపథమున పంపాసరోవరప్రాంతమున వానరపట్టణములను సందర్శించెను. వానరులు వాలిసుగ్రీవాదులు నరులకు పరిణామక్రమమున పితామహసంతతివారు. రామాయణ సారస్వతమున లభించిన ఈసాక్ష్యమునకు ఉపపత్తిగ ఏ వానరకంకాళ మైనను అధునాతనపురాతత్త్వపరిశోధకులు భూగర్భమునుండి వెలువ రించి చూపకలిగినచో డార్విన్‌మనీషి తనసమాధినుండి సజీవుడై లేచి నాట్యము సలుపవచ్చును. ఇది పురాతత్వశాస్త్రజ్ఞులు, చరిత్రకారులు మున్ముందు తేల్చవలసిన విషయము. భూగోళమున ప్రాచీనతమభూ ఖండములలో ఒకటి యగు దక్కను పీఠభూమి చరిత్రకు పూర్వపు చరిత్రను తనయొడిలో లాలించి పెంచినట్టి తల్లిగడ్డ అని చెప్పకతప్పదు.

ప్రాచీనకాలమునుండియు దక్షిణాపథపదప్రయోగమునకు వివిధ న్నార్థములు కలవు. ప్రపంచార్థమున, *"దక్షిణస్య సముద్రస్య తథా వింధ్యస్యచాంతరే" - దక్షిణాపథమని చెప్పవచ్చును. పురాణ కాలమున నర్మదానదికి దక్షిణముననున్న ద్వీపకల్పము దక్షిణాపథ మను నామధేయమున విలసిల్లినది. వాయుపురాణమున సహ్యాద్రినుండి ఉదయించిన కృష్ణాగోదావరీనదులు దక్షిణాపథములోని నదులుగా నుదాహృతములు. కాని తపతీ నర్మదానదులు దక్షిణాపథనదులలో చేరలేదు. †మత్స్యపురాణము దక్షిణాపథమునకు ఉత్తరపు ఎల్లగా "కారుషమును" పేర్కొనినది. (వింధ్యపర్వతపంక్తులలో తూర్పున

* భరతుని నాట్యశాస్త్రము.

† వాయుపురాణము - 45 - 104 శ్లో.

నున్న కైమూరుప్రాంతము.) జాతకకథలు అవంతిని (పశ్చిమ వింధ్యప్రాంతము) ఉత్తరపు టెల్లగ పేర్కొనినవి. "పేటవత్థు" దమిళ విషయమును దక్షిణాపథమున చేర్చినది. హరిసేనుడు మహానదినుండి కంచివఱకు దక్షిణాపథమున చేర్చెను. రాజశేఖరుని కావ్యమీమాంసలో దక్షిణాపథము మాహిష్మతీ (నర్మద) తీరము వఱకును వ్యాపించియున్నది. దేశీయసారస్వతమునకు శాసన వాఙ్మయమునకు సుపరిచితమైన దక్షిణాపథమును విదేశీయులుకూడ ప్రాచీనకాలమునుండి గుర్తించియేయున్నారు. "పెరిప్లస్" గ్రంథకర్త (క్రీ॥ శ॥ మొదటి శతాబ్ది గ్రీకు నావికుడు.), "ఫాహియాన్" (క్రీ॥ శ॥ 5 వ శతాబ్ది చీనాయాత్రికుడు.) "టాలెమీ" (క్రీ॥ శ॥ 2 వ శతాబ్ది గ్రీకు రచయిత) దక్షిణాపథమును పేర్కొనినారు. పెరిప్లస్ గ్రంథకర్త దక్షిణాపథమును నర్మదానదికి దక్షిణప్రదేశముగ వర్ణించెను. దీనినుండి "దమేరికా" ద్రమిడదేశమును వేరుచేసెను. రామాయణముకూడ దక్షిణాపథమునుండి ద్రవిడదేశమును వేరుగ గుర్తించినది. మహాభారతమందు సహదేవుడు పాండ్యరాజును నిర్జించిన పిమ్మట దక్షిణాపథమున కేగినట్లు వర్ణింపబడినది. కిష్కింధగుహ (తుంగభద్రాతీరము) దక్షిణాపథపు పొలిమేరలో నుండెను.

"ఏష పంథా విదర్భానాం అసౌ గచ్ఛతి కోసలాన్
అతః పరంచ దేశోఽయం దక్షిణా పథః ‒ ‒"

ఈ మార్గము విదర్భకు పోవును. ఆ మార్గము కోసలకు పోవును. ఆ చివర దక్షిణదిక్కున దక్షిణాపథమున్నది. చాళుక్యశాసనములు, దక్షిణాపథమును "సేతునర్మదామధ్యం దక్షిణాపథం" అని విస్తృతార్థముననే స్వీకరించినవి.

దక్షిణాపథమును భౌగోళికముగ మూడు ముఖ్యవిభాగములు చేయవచ్చును. మొదటిది దక్కనుపీఠభూమి. త్రిభుజాకారముగ నున్న ఈ ఉన్నతప్రదేశమునకు ఉత్తరమున "సాత్‌మాల" కొండ

లున్నవి. తూర్పు కనుమలు, పడమటి కనుమలు మిగిలిన రెండు భుజములు. అవి దక్షిణమున నీలగిరివద్ద కలియుచున్నవి. పీఠభూమి యెత్తు సముద్రపు మట్టమునకు సుమారు 1000 అడుగులనుండి 3500 అడుగుల వఱకుండును. అచ్చటచ్చట సుమారు 7000 అడుగులవఱకు ఎత్తైన పర్వతశ్రేణులు కలవు. రెండవ విభాగము : పడమటి కనుమలకును, పశ్చిమ సముద్రమునకును మధ్యగల తీరప్రదేశము. ఈ ప్రదేశమువెడల్పు 30 మైళ్లనుండి 60 మైళ్ళవరకు వ్యాపించియున్నది. పడమటి కనుమలు ప్రకృతిసిద్ధమైన పెద్ద గోడల వలె వ్యాపించి యున్నవి. పశ్చిమతీరప్రదేశమునుండి పీఠభూమికి ప్రయాణమార్గములు మృగ్యము. కోయంబత్తూరు పాల్‌ఘాట్ మార్గమొకటి ప్రాచీన కాలమునుండి రహదారిగ ఉపకరించుచున్నది. మూడవ విభాగము: తూర్పు కనుమలకును సముద్రమునకును నడిమి ప్రదేశము. తూర్పు కనుమలు పడమటి కనుమలవలె అవిచ్ఛిన్నముగ ఉత్తరమునుండి దక్షిణమువఱకు వ్యాపించలేదు. అందుచే పీఠభూమికి తూర్పునుండి అనేకప్రయాణమార్గములు కలవు. కనుమలకును సముద్రమునకును మధ్యగల ప్రదేశము 30 మైళ్ళనుండి 100 మైళ్ళవరకు విస్తరించి యున్నది. పడమటి కనుమలలో పుట్టిన నదులు పీఠభూమిగుండ ప్రవహించి తూర్పుతీరమున సముద్రములో కలియుచున్నవి. కృష్ణా గోదావరీ కావేరీ ముఖద్వారములు పేర్కొనదగినవి. టాలెమీ కృష్ణా ముఖద్వార సమీపమునుండి ప్రాచీన కాలమున నానాదేశములకు నౌకలు వెడలుచుండెడివని వ్రాసెను. తూర్పుకనుమలను చీల్చుకొని "పాపికొండల"గుండ గోదావరి పీఠభూమినుండి తూర్పుతీరమును చేరుట ప్రకృతిలోని అద్భుతదృశ్యములలో నొకటి.

దక్కను పీఠభూమికి పశ్చిమముననున్న కొండలు ప్రాచీన వాఙ్మయమున సహ్యాద్రిపంక్తులుగ సుప్రసిద్ధము. సుమారు నాలుగు వేల అడుగుల యెత్తున ఉత్తరమున వింధ్య పాత్‌పూల శ్రేణిమండి

సముద్రతీరమునంటి దక్షిణమున నీలగిరివద్ద తూర్పుకనుమలను కలియుచున్నవి. దక్షిణాపథమందలి నదులకు సహ్యాద్రి పుట్టినిల్లు. తపతి నర్మదానదులు మాత్రము తూర్పునుండి పడమరకు ప్రవహించు నదులు. కృష్ణా గోదావరీ కావేరీ మహానదీనదులకు సహ్యాద్రిశ్రేణియే జన్మస్థలము. దక్కనుపీఠభూమి ఉత్తరభాగమున తపతీనర్మదానదుల స్థావరమును ప్రత్యేకముగ విభజింప వచ్చును. అట్లే గోదావరీనదీ స్థావరము ప్రత్యేకమైనది. గోదావరికి వ్యుత్పత్త్యర్థము గోదానము నిచ్చుట లేక జలదానము నిచ్చుట అని చెప్పవచ్చును. కాని గోదావరి 'గోద'=సరిహద్దు శబ్దమునుండి యేర్పడిన సంస్కృతీకరణమని ఒక వాదము కలదు.† భౌగోళికముగ గోదావరి దక్కనుపీఠభూమిని ప్రత్యేకవైలక్షణ్యములు గల రెండు భూభాగములుగ విభజించు చున్నది. బ్రహ్మపురాణమునందు గౌతమీమాహాత్మ్య మభివర్ణితము. గోదావరి జన్మస్థలము నాసికాత్ర్యంబకము. అచ్చట గోముఖమునుండి సన్నని ధారగ వెలువడి పంచవటిని దాటి పయనించి ప్రతిష్ఠానమును చేరుచున్నది. పూర్ణ, మంజీర, ప్రాణహిత, పెన్‌గంగ, వార్ధ (వరద) వెయిన్ గంగ, మొదలగు ఉపనదులను స్వీకరించి ఆగ్నేయముగ తిరిగి తెలంగాణమును చేరుచున్నది. ప్రాణహితా సంగమమునుండి సుమారు ముప్పదిమైళ్ళలో ఇంద్రావతి వచ్చి గోదావరిని కలియు చున్నది. తరువాత గోదావరి భద్రాచలమును చేరుచున్నది. తరువాత గోదావరిని చేరిన ఉపనది శబరి. గోదావరి పాపికొండలను దాటి రాజమహేంద్రవర సమీపమున వాసిష్ఠి, విశ్వామిత్రి, వామదేవి, గౌతమి, భారద్వాజి, ఆత్రేయి, జామదగ్ని అను పాయలుగ చీలి సప్తగోదావరమై సముద్రమును చేరుచున్నది. గోదావరి పొడవు సుమారు తొమ్మిది వందల మైళ్ళు. జలస్వీకారప్రదేశము సుమారు 1,12,000 చదరపు మైళ్ళు.

---

† క్రూక్ దొర అభిప్రాయము,

దక్షిణాపథమున గోదావరి తరువాత పేర్కొనదగినది కృష్ణానది లేక కృష్ణవేణి. "కృష్ణ" - వ్యుత్పత్త్యర్థము నల్లరంగు. ఈ నది ప్రవహించు ప్రదేశము నల్ల రేగడి భూమి. కారు నాడు ▶ కర్ణాడు ▶ నల్లని భూమి. కృష్ణకు జన్మస్థలము సహ్యాద్రిలోని మహాబలేశ్వర పీఠభూమి. కృష్ణానది పొడవు సుమారు 800 మైళ్లు. పేర్కొనదగిన ఉపనదులు తుంగభద్ర, భీమలు. జలస్వీకారప్రదేశము సుమారు 95,000 చదరపు మైళ్లు. కృష్ణతుంగభద్రసంగమప్రదేశము రాయచూరు అంతర్వేది, దక్షిణాపథమున చరిత్రప్రసిద్ధికెక్కిన అపరకురుక్షేత్రము. పశ్చిమసముద్రమునుండి గోదావరి పుట్టిన చోటు దూరము సుమారు 50 మైళ్లు. కృష్ణ పుట్టినచోటు సంద్రమునుండి 40 మైళ్లు మాత్రమే! కృష్ణాగోదావరులు తూర్పునకు తిరుగుటచేతనే ఇంతటి పెద్దనదులు కాగలిగినవి. పశ్చిమమునకే ప్రవహించియున్నచో అవి సెలయేరులై యుండెడివి. దక్షిణాపథచరిత్రయే వేరుగ నుండెడిది. కృష్ణాగోదావరి తుంగభద్రాకావేరిమహానదులు చరిత్రకు ఆటుపట్టులు.

తుంగభద్ర కృష్ణ కుపనదియైనను చారిత్రకదృష్టితో ప్రత్యేకముగ పేర్కొనదగినది. తుంగ భద్ర అను నదులు చేరి తుంగభద్రయైనది. తుంగభద్ర, కృష్ణను కూడలివద్ద కలియుచున్నది. తుంగభద్ర దక్షిణాపథచరిత్రలో యుగయుగాంతరములు అనేకరాజ్యములకు సరిహద్దుగ నిల్చినది. విద్యానగరసామ్రాజ్యము తుంగభద్రానదీతీరమునన్నే విస్తరిల్లినది. బాదామి చాళుక్యులు, కళ్యాణి చాళుక్యులు, రాష్ట్రకూటులు, పల్లవులు, చోళులు, గాంగులు తుంగభద్రను దాటుటకు ఉవ్విళ్ళూరిన సన్నివేశములు చరిత్రకే గగుర్పాటును కలిగించును. కృష్ణ తుంగభద్ర సంగమప్రదేశము రాయచూరుఅంతర్వేది, చరిత్రోదయమునుండి అపరకురుక్షేత్రమై రక్తరసప్లావితమైనది. తుంగభద్ర దక్షిణాపథచరిత్రలో పలుమారులు రక్తపువరదలతో పొంగిపొరలి

ప్రవహించినది. తుంగభద్రలో ప్రవహించినది నీరుమాత్రమే కాదు; రక్తసిక్తమైన చరిత్రయే యనిపించును.

బ్రహ్మగిరివద్ద ఉద్భవించిన కావేరి సుమారు 475 మైళ్ళు ప్రవహించి తంజావూరు మండలమున సముద్రమును చేరుచున్నది. తమిళ కవులు తనివిదీర కావేరీమాహాత్మ్యమును వర్ణించియున్నారు. కావేరికి పెక్కు జలపాతములు కలవు. శివసముద్రజలపాతము పేర్కొనదగినది. కబ్బని, హేమావతి, అర్కవతి, భవాని మున్నగునవి కావేరి కుపనదులు. ఉత్తరమున మహానది కలదు. దక్షిణమున పెన్న, తామ్రపర్ణి, పాలేరు, వేగై మొదలగు చిఱునదులు కలవు. నర్మదా నది పొడవు సుమారు 800 మైళ్లు. జలస్వీకారప్రదేశము సుమారు 36,000 చదరపుమైళ్లు. సాత్పూరా పర్వతపంక్తులలో పుట్టి, బ్రోచ్ (భరుకచ్ఛ) సమీపమున సముద్రమును చేరుచున్నది. తపతీనది కూడ సాత్పూరపర్వతశ్రేణిలో పుట్టి, 436 మైళ్ళు ప్రవహించి పశ్చిమ సముద్రమును చేరుచున్నది. దక్షిణాపథమునకు మూడు వైపుల సముద్ర ముండుటచేత, విస్తారమైన తీరరేఖ యుండుటచేతను, ప్రాచీన కాలమునుండియు సామీప్య ద్వీపద్వీపాంతరములతో, దూరదేశములతో, నౌకావ్యాపారసంబంధములను పెంపొందించుకొనగలిగినది.

## ప్రాక్చారిత్రకయుగము

దక్షిణాపథమున జీవకోటి ఉత్తరాపథమునకంటె ముందే వర్ధిల్లినదని విశ్వసింపవచ్చును. ప్రాచీనతమభూఖండములలో నొకటిగ నెన్నదగిన దక్కనుపీఠభూమి కృష్ణాగోదావరీతుంగభద్రా నదుల లోయలు, నరునకు పితామహుడైన వానరునకు ఆటపట్టులై యుండెనని రామాయణ గాథలబట్టి ఊహింపవచ్చును. పరిణామ క్రమమున నరుడుద్భవించినది లేక యెచ్చటినుండి వచ్చినది

ఊహకు కూడ అందని విషయమే. దక్షిణాపథమందెల్లెడ లభించిన ప్రాచీనసమాధిస్థలముల పరిశోధనలవలన పాతఱాతి యుగము క్రీస్తుపూర్వము 5,00000 సంవత్సరములకు పూర్వమే వర్ధిల్లెనని చెప్పవచ్చును. అప్పటి వాతావరణము ఇప్పటి వాతావరణమునకు ఎక్కువ వ్యత్యాస మున్నదనుట నిశ్చయము. అంతేగాక భౌగోళికముగ కూడ పేర్కొనదగిన వ్యత్యాసముండి యుండును. మదరాసు, బళ్ళారి, జబ్బల్‌పూరు, వింధ్యపర్వతశ్రేణులలో లభించిన కొఱముట్లలో భిన్నయుగములకు చెందిన వైవిధ్యము గోచరించును. వీనికిని దక్షిణ ఆఫ్రికా ఖండములో లభించిన వానికిని గల పోలికలు గమనింపతగినవి. ప్రాతఱాతి యుగమునుండి క్రొత్తఱాతి యుగమువఱకు – మధ్యగల సంధియుగము చాలకాలము పట్టినది.

క్రొత్త ఱాతి యుగపు కొఱముట్లు దక్షిణభారతమున చాలచోట్ల దొరికినవి. సేలం, మైసూరు, కూర్గు, బళ్ళారి, అనంతపురం, కర్నూలు మున్నగుస్థలములలో లభించిన కొఱముట్లలో మదరాసు మ్యూజియము నందు 73 రకములు కన్పించుచున్నవి. క్రొత్తఱాతియుగమునందలి వివిధదశలకు కీలకప్రాయమైనది బ్రహ్మగిరి. ఇచ్చట క్రొత్త ఱాతి యుగపు మనుష్యులు వాడిన కుండ పెంకులుకూడ లభించినవి.

దక్షిణాఫ్రికాలో క్రొత్తఱాతియుగము తఱువాత ఇనుప యుగము ఆరంభించినది. అచట ఱాతియుగమునకు, ఇనుపయుగము నకును మధ్య తామ్రయుగ మున్నటుల కనుపించదు. అట్లే దక్షిణ భారతమునందును క్రొత్తఱాతియుగము తరువాత, ఇనుపయుగ మారంభించినదని ఇటీవలవరకు విద్వాంసులు విశ్వసించి యున్నారు. కాని రాయచూరులో బ్రహ్మగిరివద్ద లభించిన పరికరములనుబట్టి ఇనుపయుగమునకుముందే తామ్రయుగము విలసిల్లినదని చెప్పక తప్పదు.

ప్రాచీన శిలాయుగమున నవీనశిలాయుగమున దక్షిణభారతము యొక్క శీతోష్ణస్థితికి నేటి శీతోష్ణస్థితికి మిక్కిలి వ్యత్యాసమున్నది. అతి వర్షకాలములు వానిమధ్య రెండు సమవర్షకాలములు ఉండెడివని తెలియుచున్నది. ముఖ్యముగా దోర్ణకల్లు, అత్మకూరు కనుమదగ్గర, తరువాత గిద్దలూరు గ్రామముదగ్గర శిలాపరికరపరిశ్రమ బాగుగ సాగి నట్లు విశదమగుచున్నది. (1)• బేతంచర్లకు దగ్గరగానున్న "బిల్ల సర్గం" కొండగుహాలలో ప్రాక్చారిత్రక యుగమునకు సంబంధించిన జంతువుల అస్థిపంజరములు, ప్రాచీనశిలాయుగపరికరములు దొరికినవి. అప్పటి మానవునకు ఆహారమును పండించుకొను విధానము తెలి యదు. ఇది ఆహారాన్వేషణయుగముగనే యుండెను. ప్రాచీనశిలాయుగ మానవుడు అలనాటి ప్రకృతి నిర్మించిన చెరసాలలోనుండి తప్పించు కొనలేక గుహాంతరముల నివసించుచు వేటయే జీవనాధారముగ బ్రదికినవాడు.

నూతన శిలాయుగమున మానవుడు సున్నితమైన రాతిపరికరము లను తయారు చేసికొనగలిగెను. అతిరమ్యమైన రంగురాళ్ళను కత్తులవలె మలచికొనగలిగెను. నూతన శిలాయుగము, మానవుడు ప్రకృతిపై సలిపిన స్వాతంత్ర్యసమరములో సాధించిన ప్రథమ విజయ మని చెప్పవచ్చును. ఈ కాలముననే మానవుడు ఆహారవృక్షములను కనిపెట్టి, విత్తులు చల్లి, తిరిగి ఆ మొక్కలను పెంచనారంభించినాడు. దీనికి ఆహారోత్పత్తియుగము అనికూడ పేరు పెట్టవచ్చును. ఇట్లు విత్తులు చల్లి పంటలు పండించు వ్యవసాయకళ మానవునకు కైవస మయినతోడనే ప్రకృతి చెరసాలనుండి యాతనికి విముక్తి కలిగినది. వ్యవసాయమునకు వీరుపయోగించిన రాతి గొడ్డళ్ళు, రాతి నాగలి కఱ్ఱు, దానికి చివర కట్టిన సూది రాయి ముఖ్యముగ పేర్కొనదగినవి.

(1) • బెండపూడి సుబ్బారావు. (ఆంధ్రవిజ్ఞాన సర్వస్వము-చరిత్ర పూర్వయుగము.

ఈ పరికరములు సుమారు నలుబది కలవు. నవీనశిలాయుగమునాటి జనులు నల్ల శాణపు రాతి కొండలలో నివసించుచుండెడివారు. వీరు వ్యవసాయముతో బాటు గొఱ్ఱెలు, మేకలు మొదలగు జంతువులను కూడ పెంచుచుండెడి వారు.

నవీనశిలాయుగము కాలక్రమమున ఇనుపయుగమునకు దారితీసినది. ఇనుపయుగమునాటి పనిముట్లు ప్రాచీనసమాధులలో దొరకుచున్నవి. ఈ సమాధులకు వ్యవహారభాషలో "రాక్షసిగుళ్ళు"అనిపేరు. (ఆంగ్ల నామము మెగాలిత్స్) ఈ సమాధులు వివిధప్రదేశములలో వింత వింతగ కన్పించుచున్నవి. నిలువురాళ్ళు [చిరురాతికంబములు] మృత జన స్మారకచిహ్నములుగా పాతిపెట్టుచుండెడివారు.

రాతిపెట్టెలు మరియొకరకమైన సమాధులు. నలువైపుల రాతి పలకలు, పైన రాతికప్పు, తూర్పువైపుననున్న పలకకు ఒక గుండ్రని కన్నముగల యీ రాతిపెట్టె సమాధులు [డాల్‌మెన్] కృష్ణ, గోదావరి, చిత్తూరు, బళ్ళారి మండలములలో కానవచ్చుచున్నవి. దక్షిణా పథమందు పలుతావులలో పెట్టె ఆకారముతో భూమిలో పెట్టి గుండ్రని రాళ్లను చుట్టును పేర్చుచుండిరి. (సిస్ట్స్.) వీనికిని తూర్పున కన్న ముండును.

ఇంకొకరకమైన సమాధి పీనుగుతొట్టె. మట్టితో పెద్ద తొట్టెజేసి దానిలో అస్థికలు, కుండలు పెట్టి దానిని భూమిలో పాతిపెట్టుట పరిపాటి. ఇట్టివి చిత్తూరు, కర్నూలు, అనంతపురం మండలములలో నున్నవి. ఈ శవపేటికలకు చుట్టు 6 లేక 8 కాళ్ళు ఉండును.

భారతదేశమంతటిలోను అద్వితీయము, అసమానమునైన శవ పేటిక కడపమండలములోని శంకవరమునందు దొరికినది. ఇది గొఱ్ఱె ఆకారముకల 6 కాళ్ళ పెట్టె ‡ ఈ వివిధసమాధులలో ఒకే రకమైన

‡ శ్రీ బెండపూడి సుబ్బారావు- విజ్ఞాన సర్వస్వము- చరిత్ర పూర్వ యుగము.

ఇనుప పరికరములు కుండలు దొరుకుచున్నవి. ఇట్టివి ఉత్తరహిందూ స్థానమునందుకూడ దొరికినవి. వీనికి గల అన్యోన్యసంబంధము భావి పరిశోధనలవలన తేలవలసిన విషయము. సబర్మతిలోయలో ఏనుగు పాదములు గలిగిన శవపేటిక బయలుపడినది. అట్టిదే సిరియాలో కూడ బయలుపడినది. దక్షిణాపథమందలి సమాధుల వంటివి, దక్షిణ ఆసియాలో పలుతావుల బయటపడినవి.

తామ్రపర్ణి తీరమునందలి ఆదిచెన్నళ్ళూర్‌వద్ద ప్రాక్చారిత్ర యుగమునకు సంబంధించిన శ్మశానవాటిక బయలుపడినది. ఇవి యన్నియు అస్థిభాండములు. ఇందు ఇనుప ఆయుధములు, కుండలు, బంగారు ఉష్ణీషము, ఇత్తడి పాత్రలు, రాతి పరికరములు వీనితోపాటు లభించినవి. ఇచ్చట లభించిన ఇనుప త్రిశూలములవంటివి "పాలెస్తీనాలో" లభించుట గమనింపదగినది. ఆదిచెన్నళ్ళూరు అస్థిభాండముల వంటివి సిరియాలోకూడ లభించినవి. ఇట్టివి దక్షిణాపథమునందే కాక ఉత్తరాపథమందును లభింపకుండుటచేత, ప్రాచీనకాలమున ఆదిచెన్నళ్ళూరుప్రాంతమునకు, మధ్యధరాసముద్రతీరప్రాంతమునకు మధ్యవ్యాపారసంబంధములుండి యుండునను ఊహకు దోహద మొసంగుచున్నది. ఆదిచెన్నళ్ళూరు ప్రాంతములోనుండు ప్రాక్తన మానవుఁడు వరి పండించెడివాడు. అచట లభించిన పాత్రలలో వరి బియ్యపు గింజలు, ఊక పొట్టు ఉన్నవి. దక్షిణభారతమందలి ఇనుప యుగపు మానవులకు ఉత్తరభారతమందలి వారితో మాత్రమేకాక ద్వీపాంతరము వారితోకూడ సంబంధముండి యుండవచ్చునని యూహింపవచ్చును.

## చరిత్రోదయము - ఆర్యవిస్తరణ

ఉత్తరాపథమున గంగాసింధుమైదానములలో ఆర్యులు స్థిరనివాస ముల నేర్పరుపకమునుపే దక్షిణాపథమున ప్రాగైతిహాసికయుగమున

ప్రాక్తనమానవుడు ప్రాచీన నవీనశిలాయుగములలో వర్ధిల్లియుండిరి. ఆ కాలమున ఉత్తరాపథమునకూడ అట్టి ప్రాక్తనమానవులు వర్ధిల్లి యుండవచ్చును. ఆర్యులు ఉత్తరాపథమును ఆక్రమించికొనినపుడు క్రమక్రమముగ అట్టివారు దక్షిణాపథమునకు వలసపోయిరని యొక వాదము. చాల కాలము ఆర్యసంస్కృతి వింధ్యపర్వతములను దాటు లేదు.

దక్షిణాపథమున నేడు కనుపించు భాషలను మూడు కుటుంబ ములుగ వర్గీకరింపవచ్చును. ఇండోఆర్యనుభాష మరాఠీ; తరువాత తెలుగు, కన్నడము, మళయాళము, గోండు, కొడగు, తుళు మొద ళగునవి ద్రావిడభాషాకుటుంబమునకు చెందినవి. ముండారి, కార్య, జ్వాంగ్, సవర, గదబ, కుర్కు, ఆస్ట్రో, ఆసియాభాషాకుటుంబము నకు చెందినవి. బెలూచిస్థానమందలి "బ్రోహి" భాష ఆర్యభాషా సముద్రమందున్న ద్రావిడభాషాద్వీపమని చెప్పవచ్చును. కావున భాషాశాస్త్రజ్ఞులు మొదట ముండారిభాషలను తరువాత ద్రవిడభాష లను, తరువాత ఆర్యభాషలను భారతదేశమున వర్ధిల్లినట్లు చెప్పు చున్నారు. ప్రాచీన ఆసియామైనరునందు, "అసియనులు" తమ్ము "త్రిమ్మలై" లని పిల్చుకొనుచుండెడివారు. ద్రమిళ శబ్దమునకు, త్రిమ్మలైకిని గల నామసాదృశ్యము గమనింపదగినది. నూసియన్ భాషకు ద్రావిడభాషకు గల సంబంధమును కాల్డ్‌వెల్ గుర్తించెను. ద్రావిడభాషలు దక్షిణాపథమున ఆర్యసంస్కృతి అవతరించుటకు పూర్వమే వర్ధిల్లెనని చెప్పకతప్పదు. గుణాఢ్యుడు సంస్కృతప్రాకృత ములనేకాక దేశభాషనుకూడ పేర్కొనెను. గుణాఢ్యునకు కొన్ని శతాబ్దులు పూర్వమే దక్షిణాపథమున "మూలద్రావిడభాష" వివిధ మాండలికములతో విలసిల్లినది. ద్రావిడభాషకు మొదటి వ్యాకర్తగ అగస్త్యుడు పేరుకెక్కెను.

ఆర్యసంస్కృతిని దక్షిణాపథమున అవతరింపచేసిన ప్రథమ ప్రచారకుడు అగస్త్యమహర్షి. అగస్త్యునకును దక్షిణదిక్కునకును గల అవినాభావసంబంధము జగత్ప్రసిద్ధము. ఆర్యసంస్కృతికి దక్షిణావధియైన వింధ్యపర్వతపంక్తులను దాటి దక్షిణాపథమును ప్రవేశించిన తొలి ఋషి అగస్త్యుడు. అగస్త్యుని గూర్చిన కమ్మని కథలు ఐతిహ్యములుగా ప్రచారములో నున్నవి. ఆర్యసంస్కృతి దక్షిణాపథమున విస్తరిల్లుటలో అగస్త్యుడు మార్గదర్శకుడైన మహర్షి యనుటలో సందేహము లేదు.

ఆర్యసంస్కృతి దక్షిణాపథమున విస్తరించుటకు చాల కాలము పట్టినది. వేదములలో దక్షిణాపథమునకుగాని, గోదావరి, కృష్ణానదులకు గాని ప్రసక్తి కన్పించదు. ఐతరేయబ్రాహ్మణమందు మాత్రమే ఆర్యావర్తపు పొలిమేరలలో నివసించిన దస్యులు, పుళిందుల ప్రస్తావన కలదు. ఐతరేయబ్రాహ్మణమున భోజుల ప్రస్తావన కలదు. భోజులు పురాణకాలమునుండి విదర్భప్రాంతముల నివసించినవారు. ఐతరేయ బ్రాహ్మణమున విదర్భరాజగు భీముని ప్రస్తావన కలదు. కుండిన నగరము విదర్భకు రాజధాని.

రామాయణ మహాభారతములకు దక్షిణాపథమందలి వివిధ రాజ్యములు సుపరిచితములే. మహాభారత యుద్ధము క్రీస్తుపూర్వము 3,000 సంవత్సరములకు ముందు జరిగినది. అందు దక్షిణాపథ రాజులు పలువురు పాల్గొనినట్లు అభివర్ణితము. ఈ వర్ణనలో ఎంత భాగము చరిత్ర యిమిడియున్నదో, ఎంత భాగము కల్పన యిమిడి యున్నదో నిర్ణయించుట కష్టము. మహాభారత రచనాకాలమునకు అనగ శౌనకాది ఋషులకు ఆ కథను చెప్పిన సూతుని కాలమునకు దక్షిణాపథమున పాండ్య, కళింగ, ద్రవిడ, కేరళాదిరాజ్యములన్నియు ప్రసిద్ధినొంది యున్నవి. ఖారవేలుని "హాతిగుంఫ" శాసనమును బట్టి కళింగరాజ్యము ప్రాచీనతమమైనదని యూహింప వచ్చును. శ్రీకృష్ణుని పట్టమహిషి

విదర్భరాజపుత్రిక. మహాభారత యుద్ధకాలమునాటికే అనగా సుమారు క్రీస్తుపూర్వము 3,000 సంవత్సరముల నాటికే దక్షిణాపథమున కళింగ, విదర్భమున్నగు రాజ్యములార్యసంస్కృతితో అవినాభావసంబంధమును పెంపొందించుకొని విలసిల్లియుండినవని చెప్పవచ్చును.

రామాయణకథకు దక్షిణాపథమునకు నవినాభావసంబంధము కలదు. రామాయణగాథలో అంతర్వాహినిగా కాన్పించునది దక్షిణాపథమున ఆర్యసంస్కృతి ప్రభావవిస్తరణకథయే! చారిత్రకదృష్టితో చూచిన రాముడు దక్షిణాపథమున ఆర్యసంస్కృతిని విస్తరించుటకు పూనుకొనిన కారణజన్ముడు. రాముడు దండకారణ్యమున అగస్త్యుని సందర్శించెను. అగస్త్యుడు దక్షిణాపథమున ఋషివాటికలు ఎట్లు వర్ధిల్లుచున్నవో వివరించి, రాక్షసుల బారినుండి వారిని రక్షింపుమని రాముని కోరెను. దక్షిణాపథమును ప్రవేశించి, ఆశ్రమవాటికలను నెలకొల్పి, ఆర్యసంస్కృతి విస్తరణకు ప్రప్రథమమున ఆర్యఋషులు నడుముకట్టుకొనియుండిరి. దక్షిణాపథమున ఆదిమనివాసులుగ నున్న దస్యులు ఈ ఆర్యఋషుల ప్రశాంతదండయాత్రను నిరసించి వారికవరోధములను గల్పింపజూచుట సహజమే. ఆర్యసంస్కృతికి దక్షిణాపథమున ఆదిమనివాసులైన దస్యులకు మధ్య జరిగిన ఈ పోరాటమున చరమదశలో శ్రీరాముడు ప్రవాసియై దండకారణ్యమును ప్రవేశించి ఆర్యసంస్కృతిని రక్షించెను. ఆర్యసంస్కృతికి శ్రీరామరక్ష లభించుటచే దక్షిణాపథమున విజయముసిద్ధించినది.

శ్రీరాముని చేతిలో క్రొత్త విల్లు సిద్ధి పొందినది. అనాగరికులైన దస్యులు రామబాణమునకు నిలువకలేకపోయిరి. రాముడు లంకవరకు దిగ్విజయయాత్ర సలిపి అయోధ్యకు తరలిపోయెను. శ్రీరామపాద సంస్పర్శవలన దక్షిణాపథమున అహల్యాశాపవిమోచనము సంభవించినది. గోదావరీతీరమున వరి పండించి సప్తర్షులకు అన్నప్రదానము కావించిన గౌతమముని ఆర్యుల వ్యవసాయ విద్యను దక్షిణాపథమున

ప్రవేశపెట్టినట్లు ఎంచవచ్చును. సీత అనగ నాగటిచాలు. సీతాకల్యాణము, అహల్యాశాపవిమోచనము శ్రీరాముని మూర్తిమత్త్వము లోని వెలుగురేకలు. రామాయణగాథయందలి వివిధనామధేయములు చారిత్రకములైనను కాకపోయినను, ఆ కథ యంతయు అర్థవాద రూపమున అంతర్లీనముగ దక్షిణాపథమున ఆర్యసంస్కృతి విస్తరణమును ప్రతిబింబింపచేయుచున్నదనుట నిశ్చయము.

పురాణయుగానంతరము దక్షిణాపథమున విలసిల్లిన రాజవంశములలో ఆర్యసంతతికి చెందినవారు దక్షిణకోసల నేలిన ఇక్ష్వాకులు, విదర్భ నేలినభోజులు, మాహిష్మతినేలిన హైహయులు. దక్షిణాపథమందలి ఆదిమనివాసులగు ఆంధ్రులు, శబరులు, పుళిందులు ఆర్యసంస్కృతికి చెందిన విశ్వామిత్రుని సంతతివారు కలసిపోయిరి.

బ్రాహ్మణముల కాలమున ఆర్యసంస్కృతి విదర్భవరకు వ్యాపించినది, పాణిని (క్రీస్తుపూర్వము 7 వ శతాబ్దికి పూర్వికుడు) గోదావరీప్రాంతమందలి అశ్మకదేశమును పేర్కొనెను. కాత్యాయనుడు – నందరాజుల కాలమునాటివాడు – పాండ్య, చోళ, కేరళ పథములను వివరించెను. ఐతరేయ ఆరణ్యకమునందు చేరుల ప్రస్తావన కలదు. వారు అనాచారులుగ నభివర్ణింపబడిరి. సూత్తనిపాతమునందు కోసలదేశమునుండి "బావరి" పండితుడు దక్షిణాపథమునకు పోయి అచ్చట "అస్సక" దేశమున గోదావరీతీరమందలి యొకపల్లెలో స్థిరనివాస మేర్పరచుకొని నటుల కథ కలదు. అతడు వేదవేదాంగ పారంగతుడు. సోమయాజి. ఆతని శిష్యులు ఉత్తరాపథమునకు బుద్ధునికలిసికొనుటకు పోయిరి. వారు పోయిన మార్గమున "పతిష్ఠాన", మాహిష్మతి (మాంధాత), ఉజ్జయిని నగరములు కలవు. పాండ్య రాజధాని మధుర. దక్షిణమధురను శ్రీకృష్ణుని కూతురు రాణియై యేలిన కథను గ్రీకురాయబారి మెగస్తనీసు అభివర్ణించి యున్నాడు.

బోధాయనుడు ధర్మసూత్రములలో దాక్షిణాత్యులవిగ పంచవైలక్షణ్యములను వివరించియున్నాడు. అనుపేతులతో సహాభోజనము, స్త్రీలతో సహాపంక్తిభోజనము, చలిదిఅన్నము తినుట, మేనమామ కూతురును వివాహమాడుట, మేనత్త కూతురును వివాహమాడుట. చివరి రెండు ఆచారములును ఉత్తరాపథమున నిషిద్ధములైనను, దక్షిణాపథమున అన్ని వర్గములందును నేటికిని నిల్చియుండుట గమనింపదగిన విశేషము.

కాలక్రమమున బౌద్ధజైనములు దక్షిణాపథమున ప్రవేశించినవి. దక్షిణాపథమున రాజకీయాధిపత్యమును సంపాదించిన ప్రథమ రాజవంశము వారు నందులు. వారి రాజధాని పాటలీపుత్రము. ఉగ్రసేన మహాపద్మనందనుడు శత్రువుల నందరిని జయించి యేకచ్ఛత్రాధిపత్యముగ నేలెనని పురాణకథనము. నందులు కుంతల దేశమును ఏలినట్లు 13 వ శతాబ్దినాటి శాసనమున గలదు. నందరాజులు కళింగమును జయించి మగధకు కొనిపోయిన జినవిగ్రహమును ఖారవేలుడు తిరిగి కొనితెచ్చెను. గోదావరీ తీరము నందలి "నాందేర్" (నౌనందదేరా) నందరాజ్యచిహ్నమని కొందరు చరిత్ర కారుల యభిప్రాయము. నందసామ్రాజ్యమును చంద్రగుప్తమౌర్యుడు కౌటిల్యుని సహాయమున క్రీ. శ. 322 సంవత్సరమున కూలద్రోసెను. ఈ సన్నివేశము పురాణవాఙ్మయమున, ముద్రారాక్షసమున, మహావంశ టీకలో, జైనపరిశిష్టపర్వమునందును ప్రతిఫలించినది. చంద్రగుప్తుడు 6 లక్షల సైన్యముతో భారతదేశమునంతటిని జయించెనని "ప్లూటార్చు" కథనము. చంద్రగుప్తుడు తనజీవితమునందలి అపరసంధ్యాసమయమును మైసూరురాష్ట్రమునందలి శ్రావణబెల్గోలాలో గడపినట్లు జైన వాఙ్మయము ముక్తకంఠముతో వచించుచున్నది. ఆతని గ్రీకురాయబారి మెగస్తనీసు, కళింగరాజునకు 600,000 కాల్బలము, 1,000 అశ్వికబలము, 700 గజబలము కలవని చెప్పెను. ఆంధ్రుల కనేకగ్రామ

ములు, 30 కోటలు, లక్ష కాల్బలము, 2000 అశ్వికబలము, 1000 గజబలముండెడిది. కళింగరాజ్యమునకును, మగధరాజ్యమునకును మధ్య నందరాజుల కాలము నుండియు అనేకపర్యాయములు యుద్ధములు జరిగినవని యూహింపవచ్చును. అందు చిట్టచివరి యుద్ధము అశోకుని కళింగదండయాత్ర. ఈ మధ్యకాలమున ఉత్తరాపథమునకును దక్షిణాపథమునకును మధ్య వర్తకవ్యాపారములు అభివృద్ధి యగుట సహజము. మౌర్యసామ్రాజ్యకాలమున ఉత్తరదక్షిణభారతముల మధ్య గల వ్యాపారసంబంధములను పేర్కొనుచు కౌటిల్యుడు అర్థశాస్త్రమున వ్రాసిన మాటలు పేర్కొనదగినవి.

"భూమార్గములలో హిమాలయములకు పోవు వ్యాపారమార్గమే దక్షిణాపథమునకు బోవు మార్గముకంటె శ్రేష్ఠతరమని మా గురుదేవుల యభిప్రాయము. అటు ఉత్తరమున ఏనుగులు, గుఱ్ఱములు, దంతము, చర్మములు, సుగంధద్రవ్యములు, వెండి, కాంచనవస్తువులు దొరుకును." కాని కౌటిల్యుడు గురువుగారి యభిప్రాయముతో నేకీభవింప లేదు.

"నా అభిప్రాయము వేరు. దక్షిణాపథమున ఉన్ని, చర్మములు, గుఱ్ఱములు లభింపకపోయినను, అచ్చట వజ్రములు, శంఖములు, వివిధరత్నములు, పగడములు, కాంచనవస్తువులు లభించును. అంతేగాక దక్షిణాపథమునకు పోవు మార్గమధ్యమున విలువైన గనులు, కలవు. వివిధవ్యాపారవస్తువులు లభించును. అనేకవర్తకులు కూడుచుందురు. ప్రయాణము సులభము కావున దక్షిణాపథమార్గమే శ్రేష్ఠతరము" - దీనిని బట్టి కౌటిల్యుని ఆచార్యుని కాలము వఱకు మగధసామ్రాజ్యవర్తకవ్యాపారము ఉత్తరాభిముఖముగ సాగుచుండెడిదనియు, నందసామ్రాజ్యము, మౌర్యసామ్రాజ్యము వలన పరిస్థితులు తారుమారై దక్షిణవ్యాపారమార్గమునకు ఎక్కువ ప్రాముఖ్యమేర్పడినదనియు చెప్పవచ్చును. దక్షిణమున లభించువానిలో

వజ్రములు, కాంచన వస్తువులను కౌటిల్యుడు పేర్కొనుట గమనింప తగినది. సులభప్రయాణసౌకర్యములును కలవని కంఠోక్తిగ పలికినాడు. అర్థశాస్త్రమున పగడవిభేదమును వర్ణించుచు తామ్రపర్ణీ నదిలో దొరకు "పాండ్యకవాటమును" పేర్కొనెను. అర్థశాస్త్రమున మధురలోని వస్త్రములను గూర్చిన ప్రశస్తి కలదు. దక్షిణమున లభించు వైడూర్య రత్నమును గూర్చి, చందనమును గూర్చియు విశేషప్రశస్తి కలదు.

మౌర్యసామ్రాజ్యము దక్షిణాపథమున విస్తరించిన సంగతి తమిళవాఙ్మయమునకూడ ప్రతిఫలించినది. "మామూలనార్" కవి నందుల ధననిక్షేపమును ఉదాహరించెను. ఒక విరహిణి నోట వెలువడిన మాటలు.

"నా ప్రియునింతకాలము ఆకర్షించి నా నుండి వేరుచేయగలిగిన విశేషమేమై యుండును. పాటలీపుత్ర సౌభాగ్యము ప్రోగుచేసి యుద్ధములలో జయశీలురైన నందులు గంగానదిలో దాచిన ధననిక్షేపమై యుండునా !" "మామూలనార్" కవీశ్వరుడు ప్రకరణాంతమున మౌర్యదండయాత్రను వివరించెను. కోసరులు శత్రువులపై దండయాత్ర నారంభించి యనేక విజయములను సాధించిరి. కాని "మోహూర్ల నాయకుడు" లొంగలేదు. అందుచే కోసర్లకు సహాయముగ 'మోరియార్' మహాసైన్యమును దక్షిణమునకు పంపెను. ఆ సేనాముఖమున మహావీరులగు వడగరులు కలరు. మౌర్య సామ్రాజ్య పతనానంతరము 4 శతాబ్దులు తరువాత మామూరనార్ రచించిన పై వృత్తాంతములోని "వంబమోరియార్" అను ప్రయోగము నూతనముగ నేర్పడిన మౌర్య సామ్రాజ్యసూచకమని గుర్తింప వచ్చును. వడుగర్ లనగా ఉత్తరాదివారని యర్థము. దక్షిణాపథమున కొనభాగమునజరిగిన సంఘటనలపైకూడ పాటలీపుత్రభావము సుస్పష్టముగ కన్పించుచున్నది. దక్షిణాపథముపై మౌర్యసామ్రాజ్యము యొక్క ఆధిపత్యము బలవత్తరమైనదిగనే యెంచవచ్చును. మౌర్యులు

దక్షిణభారతముపై దండెత్తి దక్షిణపుకొనసున్న పొదియ పర్వతముల వరకు వచ్చిరి.

తమిళదేశములో దక్షిణకొనసున్న గుహలలో నున్న బ్రాహ్మీ శాసనములు క్రీస్తుపూర్వము 3 వ శతాబ్దినాటివని చెప్పవచ్చును. ఈ శాసనాక్షరములు భట్టిప్రోలు అక్షరములను పోలుచున్నవి. వీనినింకను పరిశోధింపవలసి యున్నను తేలిన కొన్ని యంశములను వివరింప వచ్చును. ఇందులో ఒక గుహపేరు "కడుగుమళై". బౌద్ధవాఙ్మయ మున చిరస్మరణీయమైన గృధ్రకూటమున కనువాదము. ఇట్టిగుహలు నెల్లూరు మండలమందలి మాలకొండలో కూడ బయలు వెడలినవి. జైనబౌద్ధములేకకాలముననే దక్షిణాపథమున ప్రవేశించెనని విశ్వసింప వచ్చును. పైన పేర్కొనబడిన శాసనలిపి దక్షిణబ్రాహ్మీ. ఈ శాసన మందలి దాతలలో ఒక సింహళీయుడు, వర్తకుడు (వణికర్) ఒక వనిత కలరు. దీనినిబట్టి పర్వతగుహాంతరములలో నివసించు ఋషీశ్వ రులపై అలనాటి ప్రజానమూహమునకు గల గౌరవాభిమానములు వ్యక్తమగుచున్నవి. కాని బౌద్ధజైనములాకాలమున నధికసంఖ్యాకుల యాదరాభిమానమును చూఱగొనెనని చెప్పజాలము. తమిళసంఘ వాఙ్మయము చెప్పు సాక్ష్యమునుబట్టి ఆ కాలమున జనసామాన్యములో వైదికమతాభినివేశము, యజ్ఞయాగాదులపై గౌరవము ప్రగాఢము గనే నాటుకొని యుండెననియే విశ్వసింపవచ్చును.

# శాతవాహనయుగము

## ప్రాక్ శాతవాహన చరిత్ర

దక్షిణాపథమున ఆర్యసంస్కృతివిస్తరణకు వేదకాలమున అగస్త్యుడు మున్నగు ఋషులు శాంతియుతప్రయత్నములు చేసిరి. కాని ఆర్యసంస్కృతికి విముఖులై యజ్ఞయాగాదుల విధ్వంస మొనర్చిన రాక్షసులు - ప్రాక్తనదండకారణ్యవాస్తవ్యులు రామాయణ ప్రసిద్ధులు. ఆర్యసంస్కృతి విస్తరణకు ఆయుధసాహాయ్యము అందించినది కోదండ రాముడు. ఐతరేయ బ్రాహ్మణకాలమునాటికి ఆంధ్రులు శబరులు పుండ్రులు పుళిందులు మూతిబులు విశ్వామిత్ర సంతతివారు. వారు శాపగ్రస్తులై ఆర్యనివాసప్రదేశములకు గడి సీమల నివసించుచున్న వారు. సాంఖ్యాయనశ్రౌతసూత్రము ప్రకారము శబరులు సంకరజాతివారు. ఐతరేయ బ్రాహ్మణసమయమునాటికే ఆర్యదస్యు సాంకర్య మేర్పడినది. ప్రాక్తన వైదికవాఙ్మయమును చారిత్రకదృష్టితో అనుశీలించినచో - ఆర్యులలో కొందరు విడివడి - అనార్యులతో లీనమైపోవుటచే దస్యులుగా మారిరనిభావింపనగును. ఇట్టి పరిణామము క్రొత్త సన్నివేశము గాదు. ఇరాను దేశమున ఆర్యసంతతివారు కొందరు విడివిడి అచ్చటి అనార్యులతో కలిసి పర్షి యను జాతికి పితామహులైరి. ఆర్యులలో చేరని అనార్యులు కొండగుహలలో గహనారణ్యములలో నివసించిరి. అచ్చటచ్చట వారి సంతతులలో నేటికిని గిరిజనులుగా మిగిలిన వారున్నారు. దక్షిణాపథప్రదేశముల జయించిన ఆర్యరాజవంశీయులలో ప్రథములు దక్షిణకోసల నేలిన ఇక్ష్వాకులు, విదర్భ నేలినభోజులు మాహిష్మతి నేలిన హైహయులు.

జైమినీయఉపనిషద్బ్రాహ్మణము విదర్భను పేర్కొను చున్నది. విదర్భరాజపుత్రుడు భీముని ఐతరేయబ్రాహ్మణము పేర్కొను

చున్నది. బ్రాహ్మణములకాలమున ఆర్యులు బేరారువరకు విస్తరించిరి. నందులకాలమునాటి కాత్యాయనునకు పాండ్య చోళ కేరళ పదములు చిరపరిచితములు. మహాభారత రామాయణములలో దక్షిణాపథ మంతయు సుగమము.

ఆర్యసంస్కృతి నందమౌర్యసామ్రాజ్యముల విస్తరణతో దక్షిణా పథమున సుప్రతిష్ఠితమైనది. విప్లవాత్మకమై, సర్వమానవసమానత్వము సౌభ్రాత్రము బోధించు బౌద్ధజైనమత ప్రచారము పరోక్షముగ ఆర్య సంస్కృతివిస్తరణకు దోహదము కల్పించినది. బ్రాహ్మణముల కాలముననే 'ఏకచ్ఛత్రాధిపత్య,' 'ఏకరాట్'-'అధిరాట్'ప్రయోగములు, వాజ పేయ రాజసూయ అశ్వమేధయాగములు రాజ్యాంగతంత్రమునకు సామ్రాజ్యనిర్మాణవాంఛను నెలకొల్పినవి. † (1) పురాణములు"ఉగ్ర సేనమహాపద్మనందుడు క్షత్రియుల నిర్మూలించి ఏకరాట్టయ్యె"నని చెప్పు చున్నవి. క్రీ. శ. పదుమూడవ శతాబ్దినాటి శాసనము, కుంతలమును తొలుత నందులు పిమ్మట మౌర్యులు పరిపాలించినట్లు నుడువుచున్నది. ‡ (2) క్రీ. శ. పదునొకండవ శతాబ్దినాటి శాసనము నందశకమును సూచించుచున్నది. ఖారవేలుని హాతిగుంఫ శాసనమునుబట్టి నంద కాలమాన మున్నట్లు స్పష్టము.

ఖారవేలుని హాతిగుంఫ శాసనము, నందరాజు యుద్ధవిజయ

† (1) బ్రాహ్మణముల కాలము భండార్కరు మతములో క్రీ. పూ. 1200 - 900. బాలగంగాధర తిలక్ - అంతరంగిక ఖగోళ సాక్ష్యములబట్టి బ్రాహ్మణముల కాలమును క్రీ. పూ. 3000 ప్రాంతమని నిర్ణయించినారు. బ్రాహ్మణములకాలము ఆంగ్లమానసపుత్రులైన చరిత్రకారులు ఊహించినదానికంటె ప్రాచీనమని నిరూపించుచున్న అభినవచరిత్రకారుల సంఖ్య నానాటికి అధికమగుచున్నది.

‡ (2) E, C, VII Pli 225

లాంఛనముగ మగధకు ప్రథమజినవిగ్రహము నుతరలించుకొనిపోయిన సంగతి విస్పష్టముగ చెప్పెను.

నందరాజుల కళింగవిజయము చారిత్రక సత్యము గావున వారు ఇంకను దక్షిణమునకు చొచ్చుకొని వచ్చియుండవచ్చును. గోదావరీ తీరస్థనగరము నౌనందడెహర=నందెర్ ఈ ఊహకు బలము చేకూర్చు చున్నది. కౌటిల్యుని అర్థశాస్త్రమున దక్షిణాపథవాణిజ్యము వహించిన ప్రాముఖ్యము పూర్వోక్తము. మహాపద్మనందుడు - అతని పుత్రులు ప్రజానురంజకులు కాలేకపోయిరి. ప్రజాకంటకులైన వారిపై అసంతృప్తి అధికమై దూరదేశములు స్వతంత్రములైనవి. చంద్రగుప్తుడు చాణక్యసాహాయ్యముతో క్రీ.పూ. 322 సంవత్సరమున నందసామ్రాజ్య మును కూలద్రోసి మౌర్యసామ్రాజ్యమును నెలకొల్పెను. పురాణము లలో, ముద్రారాక్షసమునందు, మహావంశటీకయందు, జైనుల పరిశిష్ట పర్వమున ఈ సంఘర్షణ ప్రతిఫలించినది. చంద్రగుప్తుడు, 600000 కాల్బలముతో భారతదేశమును జయించినట్లు 'ప్లూటార్క్' రచన. రుద్రదాముని జూనాగడ్ శాసనమున చంద్రగుప్తుని ఉద్యోగి త్రవ్వించిన తటాకప్రసక్తిచే మౌర్యసామ్రాజ్యము సౌరాష్ట్రము (కాథియావార్) వరకు విస్తరించినదని చెప్పవచ్చును. జైనవాఙ్మయము శ్రావణ బెళ్గొలాకు చంద్రగుప్తుని ఆగమనమునుగూర్చి సాక్ష్యము చెప్పుచున్నది. ప్రాచీన తమిళ వాఙ్మయమున దక్షిణాపథమున నందుల దండ యాత్రను మౌర్యుల విజయములను ప్రస్తావించు రచనలు గలవు. మెగస్తనీసు ప్రకారము కళింగాధిపతికి, 600000 కాల్బలము, 1000 అశ్వికబలము 700 ఏనుగులు ఉండెడివి. ఆంధ్రులకు 100000 కాల్బలము, 2000 అశ్వికదళము, 1000 ఏనుగులు, 30 దుర్గములు, అనేక గ్రామములు ఉండెడివి. 'అమిత్రఘాత' బిరుదాంకుడైన బిందుసారుడు పూర్వాపర సముద్రమధ్యప్రదేశమును పాలించిన సార్వభౌముడుగ తారానాథుడు వర్ణించెను. గ్రీకులకు బిందుసారుడు అమిత్రఘాతుడుగ

పరిచితుడు. అశోకుని శాసనములు రాయచూరు అంతర్వేదిలో మస్కి, కోప్‌బల్ ప్రదేశముల కన్పించినవి. ఆతని శిలా స్తంభ శాసనములు 1 నుంచి 13 వరకు కర్నూలు మండలమందలి ఎఱ్ఱగుడిలో దొరికినవి. సువర్ణగిరి - తోసలి పరిపాలకులైన రాజసుతుల అధీనములో దక్షిణా పథములోని పెక్కు ప్రాంతము లుండెడివి. అశోకుని ధర్మామాత్యులకు రాజదండనల సమీక్షించు అధికారము ఉండెడిది. అశోకుని శాసనములు దొరికిన దక్షిణావధి సిద్ధాపూర్ జతింగ రామేశ్వర, బ్రహ్మగిరి ప్రాంతము దాటి దక్షిణాపథమున మౌర్యసామ్రాజ్యము విస్తరించలేదు. అశోకుని సామ్రాజ్యమున చేరని రాజులు చోళులు - పాండ్యులు కేరళపుత్రులు సాతీయపుత్రులు. జైనము శ్రావణ బెళ్గొలాలో ప్రతిష్ఠితమై దక్షిణాపథ చరిత్రపై మతసాంస్కృతిక రంగములలో యుగ యుగాంతములు ప్రభావము వహించెను. అశోకుని కాలమున మహాదేవుడు మాహిష్మతీ మండలమున మహాధర్మరక్షితుడు మహారాష్ట్రమున బౌద్ధమతప్రచారకు లైరి. మహాదేవుడు అమరావతి కడ చైత్యాకారబౌద్ధము నెలకొల్పెను. క్రీ.పూ. 386 లో జరిగిన 'బౌద్ధ సంగీతి' † (1) తదనంతరము బౌద్ధము రెండు పాయులై బౌద్ధమతప్రచారకులు స్థవిరులు మహాసాంఘికులుగ విడివడిరి. మహాసాంఘికులలో ఒక ఉపశాఖ చైత్యారాధనకు ప్రాముఖ్యము కల్పించిరి. ‡ (2) అశోకుని తరువాత, మౌర్యసామ్రాజ్య ప్రాభవము క్షీణించుటతో ఆర్య సంస్కృతి విస్తరణమునకు విఘాత మేర్పడినది. పుష్యమిత్రుడు మౌర్య బృహద్రధుని కథ చంద్రగుప్తుడు సింహాసన మధిష్ఠించిన 137 సంవత్సరములకు జరిగినది. అనగా క్రీ.పూ. 185. పుష్యమిత్రుడు స్వామిద్రోహముచే సంపాదించినది మౌర్యసింహాసనమేగాని మౌర్యసామ్రాజ్యముగాదు. కాళిదాను మాళవి కాగ్నిమిత్రమున విదర్భరాజునకు పుష్యమిత్రునికి జరిగిన ఘోరసంగ్రామ

†-(1) అఖిల బౌద్ధ మతాచార్య సమ్మేళనము.

‡-(2) N. Datta. నాగార్జునకొండ శాసనములు.

మును పేర్కొనినాడు. అందు విజయము పుష్యమిత్రునికే లభించినను, దక్షిణాపథము మగధసామ్రాజ్యమునుండి విడిపోవుటకు సల్పుచున్న ప్రయత్నములకు నాందీపూజ జరిగినట్లు నిదర్శన మేర్పడినది. మౌర్య సామాజ్య మస్తమించుటతో, శాతవాహనరాజ్యము చేది(=చేత=చేతి) రాజ్యములు - వింధ్యసమీపము వరకు వ్యాపించియున్న రాజ్యములు విస్తరింపసాగినవి.

ఐతరేయబ్రాహ్మణము విశ్వామిత్రమహర్షి కుమారులు శాపోపహతులై, ఆర్యాశ్రమవాటికలకు వెలుపల నివసింపవలసివచ్చినదని, వారే ఆంధ్రులు, పుండ్రులు, శబరులు, పుళిందులు, మూతిబులు అని పేర్కొనుచున్నది. దస్యులలో అధికసంఖ్యాకులకు శాపోపహతులైన విశ్వామిత్రుని పుత్రులు మూలపురుషులు. మహాభారతమునందు పై జాతులను వసిష్ఠుడు తన కామధేనువునుండి సృష్టించి విశ్వామిత్రునికి విరోధులుగ కావించినట్లు కలదు. సాంఖ్యాయనశ్రౌతసూత్రములందు శబరులు తక్కువజాతివారు. వైదికసాహిత్యమునుబట్టి పై జాతులు దక్షిణాపథవాసులని తేల్చవచ్చును. ఆర్యసంస్కృతి దక్షిణాపథమున వ్యాపించినకొలది వర్ణసంకరత్వమేర్పడి విశ్వామిత్రసంతతి వంటి వారీ జాతులతో కలసిపోయి మిశ్రసంస్కృతికి దారితీసిరని యూహింపవచ్చును. ఆర్యసంస్కృతి వింధ్యపర్వతములను దాటినప్పుడు ఆంధ్రులు కృష్ణాగోదావరీ ప్రాంతముల స్థిరనివాసమేర్పరచుకొనిరి.

మౌర్యసామ్రాజ్యకాలమునాటికే ఆంధ్రరాజ్యము సుప్రసిద్ధము. గ్రీకురాయబారి మెగస్తనీసు ఆంధ్రులకు 100000 కాల్బలము, 1000 గజబలము, 20,000 అశ్వికదళము కలవని, వారి యేలుబడిక్రింద 30 దుర్గములు, అనేకగ్రామములు కలవని చెప్పియున్నాడు. తొలి బౌద్ధవాఙ్మయము మహానది కుపనది యగు "తెలివాహ" కు దక్షిణమున ఆంధ్రరాజ్యము కలదని తెల్పినది. "సూత్తనిపాతము"న అంధకరట్టము గోదావరీతీర మని కలదు. క్రీస్తుశకము 130 ప్రాంతము

వాడగు గ్రీకు భూగోళశాస్త్రజ్ఞుడు టోలిమీ ఆంధ్రదేశము కృష్ణాముఖ ద్వారమునుండి పశ్చిమమునకు వ్యాపించిన ప్రదేశమని చెప్పి యున్నాడు. అటులనే క్రీ. శ. 50 ప్రాంతమున అలెగ్జాండ్రియా వాస్తవ్యుడైన వణిజుడు వ్రాసిన "పెరిప్లసు"అను గ్రంథమునుబట్టియు కృష్ణాగోదావరీముఖద్వారములనుండి పశ్చిమమునకు వ్యాపించిన ప్రదేశము ఆంధ్రరాజ్యమని గుర్తింపవచ్చును. మౌర్యసామ్రాజ్యమునాటికే ఆంధ్ర రాజ్యము సుప్రసిద్ధమైన రాజ్యములలో ఒకటి. నందరాజులు, మౌర్యులు దక్షిణాపథమున దిగ్విజయయాత్రలను నలిపి అనేకరాజ్యములను తమ సామ్రాజ్యములలో చేర్చుకొనియుండిరి. ఆంధ్రరాజులు నంద సామ్రాజ్యమునకు సామంతులుగ నుండినను, నుండకపోయినను మౌర్యసామ్రాజ్యమున సామంతులై అశోకుని మరణమువఱకు సామంతులుగ నుండిరని చెప్పవచ్చును. అశోకుని శిలాశాసనము లాంధ్రదేశమునందలి కర్నూలుమండలమునకూడ లభించినవి.

ఆంధ్రరాజులు మౌర్యసామ్రాజ్యములో సామంతులుగ నుండుట మాత్రమేకాక, ఆంధ్రరాజవంశీయులు ఆంధ్రభటులు మౌర్యసామ్రాజ్య మున ప్రముఖపాత్రలను నిర్వహించిరని చెప్పవచ్చును. చంద్రగుప్తుని 6,00000 కాల్బలములో దక్షిణాపథభటులు, ముఖ్యముగ నాంధ్ర భటులు, చేరియుండుట సహజమే! ఆంధ్రరాజవంశీయులు, (ఆంధ్ర భృత్యులు, ఆంధ్రసజాతీయులు) మౌర్యసామ్రాజ్యమున ఉన్నతపదవుల నధిష్ఠించి, పాటలీపుత్రమువరకు పోయియుండిరి. ఆంధ్రుల్లలో బహుశాఖలు కలవని మహాభారతమునకలదు.(2)

తమిళకవి మామూళనారు వ్రాసిన వాక్యములు మిక్కిలి అర్థవంతములైనవైనను చరిత్రకారు లంతవరకు గుర్తించినట్లు కన్పింపదు. (3) కోసరులకు సాహాయ్యముగ మౌర్యులుపంపిన (తమిళ

(2) 'ఆంధ్రాశ్చ బహవః'
(3) నీలకంఠశాస్త్రిగారి దక్షిణాపథచరిత్ర.
(4)

దేశమునకు) సేనాగ్రభాగమున రణకుశలులైన వడగర్లు తరలివచ్చిరి. తమిళవాఙ్మయమున వడగరులనిన తెలుగు వారని ఆంధ్రులని అర్థము నిచ్చు బహుప్రయోగములు కలవు. మౌర్యసామ్రాజ్యసేనలో ఆంధ్ర భటులు, ఆంధ్రరాజవంశీయులు చాల కాలము ప్రముఖపాత్రను వహించి, అశోకుని మరణానంతరము స్వతంత్రరాజ్యమును నిర్మించిరని యూహింపవచ్చును.

అశోకుని మరణానంతరము స్వతంత్రరాజ్యమును స్థాపించిన వారిలో శాతవాహనులు పేర్కొనదగినవారు. పురాణములు శాతవాహనులను ఆంధ్రభృత్యులుగను, ఆంధ్రసజాతీయులుగను, ఆంధ్రులుగను వర్ణించినవి. ఈ పదమునకు అర్థవివరణమున నేకాక శాతవాహనులకు చెందిన పలు విషయములలో చారిత్రకులకు ఏకాభిప్రాయము కుదురలేదు. శాసనము లందెచ్చటను శాతవాహనులు ఆంధ్రులమని చెప్పుకొనలేదు. శాతవాహనరాజ్యము తొలిదశలో మహారాష్ట్రదేశమున విస్తరించినదనియు, మలిదశలోగాని కృష్ణా గోదావరీప్రాంతమున విస్తరింపలేదనియు అందుచే శాతవాహనులాంధ్రులు కారనియు నొక వాదము. ఆంధ్రభృత్యులు అను సమాసము నకు అర్థమేమి? భండార్కరుగారు పురాణములలోని ఆంధ్రశాతవాహనులును, చరిత్రలోని శాతవాహనులును ఒకరే యని యంగీకరించి యాంధ్రభృత్యసమాసమునకు భృతులైన ఆంధ్రులని రూపకార్థమును నిరూపించిరి. చాలమంది చరిత్రకారులు తొలుత మౌర్యసామ్రాజ్యమున భృత్యులుగనున్న ఆంధ్రులు మలికాలమున స్వతంత్రులై రాజ్యమును స్థాపించుటచే ఆంధ్రభృత్యులుగ నభివర్ణింపబడిరని తలపోయు చున్నారు. మరికొందరు చరిత్రకారులు 'సుప్తాంకరు' ప్రభృతులు శాతవాహనులాంధ్రులే కారని వాదించుచున్నారు. మరికొందరు ఆంధ్రభృత్యులు అను సమాసమునకు తత్పురుషార్థమే సంఘటమని, శాతవాహనులు ఆంధ్రులకు భృత్యులుగాని, ఆంధ్రు లెట్లుగుదురని

సందేహించుచున్నారు. పురాణములు కంఠోక్తిగ శాతవాహనులు, ఆంధ్రసజాతీయులు, ఆంధ్రభృత్యులు, ఆంధ్రులని ముప్విధములకూడ పేర్కొనినవి. విప్రతిపన్నములైన ఈ వివిధవాదములను సమన్వయింప వచ్చును. మౌర్యసామ్రాజ్యమున ఆంధ్రరాజులకు సజాతీయులును, ఆంధ్రరాజులకు భృత్యులును, ఆంధ్రులుననగు శాతవాహనులు, ఆంధ్రులలో నొక తెగవారు మౌర్యసామ్రాజ్యమున నున్నతపదవి నధిష్ఠించి యశోకుని మరణానంతరము మొట్టమొదట మహారాష్ట్రము నందలి నాసికాప్రాంతమున స్వతంత్రరాజ్యమును స్థాపించి, కాల క్రమమున జన్మస్థానమగు ఆంధ్రదేశమువరకు విస్తరించిరని చెప్ప వచ్చును. ఒకానొకనాడు శాతవాహనులు దక్షిణాపథమునే కాక ఉత్తరాపథమందలి రాజ్యములను మగధనుండి అవంతివరకు తమ యేలుబడి క్రిందికి తెచ్చుకొనగల్గిరి. మొదటి నుండియు మహారాష్ట్ర ముతోపాటు ఆంధ్రదేశమును, శాతవాహనుల పరిపాలనక్రిందనే యుండియుండవచ్చును. హాలుడు (మత్స్యపురాణమునందలి 17 వ శాతవాహనరాజు) సంకలించిన 'సత్తసయి' (గాథా సప్తశతి)లో గోదావరి పుట్టి ప్రవహించి, సముద్రములో సంగమించుప్రదేశమును పాలించు శాతవాహనులకు ఈడైన రాజవంశము భారతవర్షమునందు లేదని వర్ణించిన గాథ కలదు. "లీలావతీ పరిణయ" కథానుసారము హాలుని వివాహము సప్తగోదావరీప్రాంతమున జరిగినది. శాతవాహన రాజులలో తొలి కాలమునకు చెందిన శాతకర్ణి అశ్వమేధము, రాజ సూయము సలిపిన చక్రవర్తి యనియు, నీతడు దక్షిణాధిపతియనియు "నానాఘాటు" శాసనము వర్ణించుచున్నది. అతని రాజ్యములో ఆంధ్రదేశము చేరలేదనుట కెట్టి యాధారములును లేవు. పెరిప్లసు గ్రంథకర్త ప్రకారము "దమెరికా" (ద్రమిళ) దేశమువరకు దక్షిణా పథము వ్యాపించియున్నది. శాతవాహను లాంధ్రులు, ఆంధ్రరాజులకు సజాతీయులనియు తొలి రోజులలో ఆంధ్రరాజులకు భృత్యులై,

మౌర్యసామ్రాజ్యమున, మౌర్యసైన్యమున ప్రముఖపాత్రవహించి స్వతంత్రసామ్రాజ్యము నిర్మించినవారని యేర్పడుచున్నది. ఆంధ్రుల జన్మస్థానము కృష్ణాగోదావరీముఖప్రాంతమునుండి పశ్చిమమువరకు వ్యాపించిన ప్రదేశమని చరిత్రకారులంగీకరించిన విషయమే!

ఆంధ్రులైన శాతవాహనులు ప్రాకృతము నేల వాడిరి? శాతవాహనుల మాతృభాష ప్రాకృతమని చెప్పుట కే యాధారమును లేదు. మౌర్యసామ్రాజ్యకాలమునుండి ప్రాకృతము విరివిగా ఆంధ్రదేశమునందు వ్యాపించినది. అది అలనాటి రాజభాష. క్రీస్తు పూర్వము మూడవ శతాబ్దినుండి క్రీస్తుశకము 3 వ శతాబ్దివరకు ఆంధ్రదేశమునందలి శాసనము లన్నియు ప్రాకృతశాసనములే. భట్టిప్రోలు, అమరావతి యందలివికూడ ప్రాకృతశాసనములే. ఆనాడు ప్రాకృతము భారతదేశ మందంతటను రాజభాషగ, విద్యావంతుల భాషగ వ్యాప్తినంది యుండెను. బౌద్ధ, జైనప్రబోధకులు వాడిన పాళి ప్రాకృతమునకు ప్రాచీన స్వరూపమే! ప్రాకృతభాష వాడినంతమాత్రమున శాతవాహనులు ఆంధ్రులు కారని చెప్పుట సమంజసము కాదు. పరిపాలనా విషయమున మౌర్యసామ్రాజ్యమును ఒజ్జబంతిగ స్వీకరించిన శాతవాహనులు ప్రాకృతభాషను స్వీకరించుటలో విప్రతిపత్తి లేదు.

శాతవాహన శబ్దమున కర్థము చెప్పుటలో చరిత్రకారుల కింకను ఏకవాక్యత కుదురలేదు. పురాణములలో శాతవాహనశబ్దమున కనేక పర్యాయపదములు కలవు. శాతకర్ణి స్వాతికర్ణి శాంతికర్ణి. శాలివాహన శబ్దము శాతవాహనశబ్దమున కపభ్రంశమని హేమచంద్రుడు తన వ్యాకరణమున నుడివెను. అభినవచింతామణియందు వాహనయోగ సౌఖ్యమును పొందిన వాడని యర్థము కలదు. (శాతం దత్తసుఖం వాహనం యస్య ఇతి.) మౌర్యసామ్రాజ్యమున ఉన్నతవాహనయోగము లేక పదవిని అధిష్ఠించిన వారని కొందరు అర్థము చెప్పుచున్నారు. శాతకర్ణి శబ్దమునకు సరియైన యర్థము నేటివారికి మాత్రమేకాక

నాటివారికిని నిష్కర్షగ తెలియదనుటకు కథాసరిత్సాగరమందలి కథ నిదర్శనము. శాతవాహనులనాటి బృహత్కథ కథాసరిత్సాగరమునకు మాతృక. "అపుత్రకుడైన దీపకర్ణి మహారాజు మృగయావినోదార్థ మడవికి బోయి, సింహారూఢుడైన బాలకుని గాంచి, సింహముపై బాణమును ప్రయోగించెను. సాతుడను గంధర్వుడు శాపవశమున సింహరూపమున కుమారుడైన బాలకునితో తిరుగుచుండెను. శాప విముక్తుడైన సాతుడు శాతకర్ణికి బాలుని అర్పించెను. సాతుని వాహనముగా గల్గిన యా బాలుడు సాతవాహనవంశమునకు మూలపురుషుడైనాడు." ఈ గాథవలన బృహత్కథలోని కథాకల్పనా చాతుర్యము వెల్లడియగుటయే గాక, శాతవాహనవంశోదయమును గురించి సమకాలీనులకు గూడ తీరని జిజ్ఞాసయుండెడిదని తేలుచున్నది.

దక్షిణాపథచరిత్రలోని పెక్కు రాజవంశముల యుత్పత్తికి ఉత్ప్రేక్షలే మూలము. వాచ్యార్థము అగమ్యగోచరమే.

ఇటులనే శాతవాహనుల కులమునుగురించియు వాదోపవాద ములు కలవు. బౌద్ధజైనములు వర్ణాశ్రమధర్మములపై దండయాత్ర నారంభించిన నాటినుండియు వైదికమతప్రాబల్యము క్షీణింపసాగి నది. ఎందరో క్షత్రియరాజులు యజ్ఞయాగాదుల నుజ్జగించి, బౌద్ధ జైనముల నాదరింపసాగిరి. ఉగ్రసేనమహాపద్మనందుని వంశము కూడ నుక్షత్రియవంశము కాదని జనశ్రుతి. మౌర్యునివంశము క్షత్రియవంశమే కాదు. సనాతనవైదికధర్మసంరక్షణకు నడుముకట్టి, బ్రాహ్మణులే రాజ్యాధికారమును స్వీకరించుటకు పూనుకొనిరి. మౌర్యసామ్రాజ్యా నంతరము మగధనేలిన శుంగులును, కణ్వులును బ్రాహ్మణులే. పుష్య మిత్రశుంగుడు బ్రాహ్మణుడైనను సింహాసనమధిష్ఠించి, క్షత్రియోచితము లైన, అశ్వమేధరాజసూయములను నిర్వర్తించెను. అదియుగధర్మము. అట్టిచో దక్షిణమునగూడ గ యుగధర్మమే ప్రతిబింబించుట వింత కాదు. గౌతమిబాలశ్రీనాసికశాసనములో గౌతమీపుత్రశాతకర్ణి ఏక

బ్రాహ్మణుడని అభివర్ణితము. అంతియకాక అతడు క్షత్రియులగర్వమును అణచిన వాడనికూడ చెప్పబడినది. అందుచే కొందరు చరిత్రకారులు శాతవాహనులు "ఇదం బ్రాహ్మ్య మిదం క్షాత్రం" అని క్షత్రియధర్మమును స్వీకరించిన బ్రాహ్మణులని అభిప్రాయపడుచున్నారు. శాతవాహనులు క్షత్రియులమని తమనుగూర్చి స్పష్టముగ నెచ్చటను చెప్పుకొనలేదు. వారు బ్రాహ్మణులు కారని చెప్పుటకుకూడ తగిన సాక్ష్యము లభింపలేదు. కాని గౌతమిబాలశ్రీ తానురాజర్షివధువునని చెప్పుకొనెను. ఇచ్చట రాజశబ్దము క్షత్రియకులసూచకము కాకపోవచ్చును. ఆ యుగమున క్షత్రియులు కాని రాజు లనేకులు కనిపించుచున్నారు. శాతవాహనులు పుట్టుకచే బ్రాహ్మణులు కావచ్చును గాని, అనుష్ఠానమున క్షత్రియులే.

## శా త వా హ న వం శ ము

పురాణములు శాతవాహనరాజులను ఆంధ్రసజాతీయులుగను, ఆంధ్రభృత్యులుగను పేర్కొనుచున్నవి. ఒక మత్స్యపురాణపు వ్రాతప్రతినిబట్టి కట్టకడపటి శాతవాహనరాజుకాలములో విరచితమని ఊహింప నవకాశ మున్నది. §(1) తక్కిన పురాణములు మత్స్యపురాణమునకు అర్వాచీనములు. పురాణములలో నిచ్చిన ఆంధ్రజాతీయులగు ఈ రాజుల నాణెములు శిలాశాసనములు చారిత్రక పరిశోధకులకు లభించుచున్నవి. ఇవి పురాణవాక్యములతో సరిపోవుచున్నవి. పురాణములు తొలిరూపములలో యదార్థచారిత్రక కథనములు. శాతవాహనకాలమునకు పురాణరచనాకాలమునకు అంతరము

§(1)- శ్రీయజ్ఞశ్రీ శాతకర్ణి 9, 10 రాజ్యకాలమున మత్స్యపురాణము వ్రాతప్రతులలో ఐదింటిలో మూడు వ్రాయబడినట్లు సూచన గలదని పర్గీటరు అభిప్రాయము.

విశేషము గాదు. కావున అంధ్రశాతవాహనచరిత్రరచనకు పురాణములు ఆద్యప్రకృతి.

శాతవాహన రాజుల నాణెములు కొన్ని బయల్పడినవి. జోగలు తంబిలో గౌతమీపుత్రశాతకర్ణి పునర్ముద్రణము వేయించిన పదమూడువేల నాణెములు దొరికినవి. కొల్హాపూరులో కొన్ని నాణెములు బయల్పడినవి. కృష్ణాగోదావరీ - మండలములలో అమరావతీ స్థూపమునను హైదరాబాదు ప్రభుత్వ పురాతత్వశాఖవారు ప్రతిష్ఠాన నగరమునందు (పైఠాను) త్రవ్వించినప్పుడు కొన్ని నాణెములు లభించినవి. లండను నగరమున బ్రిటిషు మ్యూజియములోనున్న శాతవాహననాణెముల వర్ణన రాప్సను గ్రంథములో లభించును. ‡(2)-నానాఘాట్, నాసిక్ గుహలవద్దను, చిన్న గంజామువద్దను అమరావతీస్తూపమునను శాతవాహనరాజుల శిలాశాసనములుగలవు. కాని, దక్షిణభారత ద్వీపకల్పమును, సుమారు 400 సంవత్సరములు అవిచ్ఛిన్నముగా ఏలి ఉత్తరాపథమున అవంతి, అపరాంత, ఉజ్జయిని రాజ్యముల జయించి మౌర్యసామ్రాజ్యసింహాసనమగు మగధరాజ్యమును పరిపాలించి ఏకచ్ఛత్రాధిపత్యము వహించిన శాతవాహనరాజులు ముప్పది ముగ్గురు రాజులకు సుమారు 24 శిలాశాసనములు లెక్కపెట్టదగినవి కావు.

శాతవాహనవంశమునకు మూలపురుష డెవ్వడు? 'శాతవాహన' 'శాలివాహన' శాతకర్ణి నామములకు అర్థమేమి? ఈ ప్రశ్నలకు చరిత్రజ్ఞులు సమాధానము నింకను అన్వేషించుచున్నారు. ఐతిహ్యము కమ్మని కథలను చెప్పుచున్నది.

వీరి ఆదిమనివాసస్థానము కృష్ణాగోదావరీ మండల ప్రాంతమనియే విశ్వసింపవచ్చును. అశోకునికాలమున, అంధ్రరాజ్యము ఆ ప్రాంతమనియే ఊహింపవచ్చును. చరిత్రలో ప్రాక్తనకాలమున

‡-(2) A Catalogue of Indian coins.

ప్రాచీననాగరకతలు నదీముఖముల ఉదయించినవి. పురాణముల ప్రాచీనసాక్ష్యమును శంకింపక చారిత్రక సంప్రదాయమునుబట్టి క్రీస్తు పూర్వము మహోజ్వల సామ్రాజ్యమును స్థాపించినశాతవాహనుల స్వస్థానము కృష్ణాగోదావరీముఖప్రదేశమని చెప్పవచ్చును.

పురాణములు ఆంధ్రజాతీయులగు ఈ రాజుల రాజ్యకాలమును పేర్కొనుచున్నవి. పురాణములలోనున్న శాతవాహనరాజుల నామములు శిలాశాసనములలో, నాణెములలో గన్పించుచున్నవి. కాని ఇంకను, పురాణములలోని శాతవాహనరాజుల కొన్ని నామము లే శాసనములోను, నాణెములలోను కన్పించుట లేదు.

## శాతవాహన రాజ్య స్థాపకుడు

పురాణములలో "శిశుకో ఆంధ్రసజాతీయః" ఆంధ్రసజాతీయుడైన శిశుకుడు రాజ్యమును స్థాపించెను. అతని సోదరుడు కృష్ణుడు. శాతవాహనకులమున జన్మించెను.కావున 'శాతవాహన'నామము ఆ వంశమునకు శిముఖుని (4) వలన సంక్రమింపలేదు.

శాతవాహనవంశము 460 సంవత్సరములు పరిపాలించునట్లు మత్స్యపురాణమును, 411 సంవత్సరములు పరిపాలించునట్లు వాయుపురాణమును చెప్పుచున్నవి.

---

4 శిముఖుని పేరు భిన్న పురాణములు భిన్న రీతుల వచించుచున్నవి. 'శ్రీముఖ' అను కొనుటకు ప్రాకృత మూలము 'సిరిముఖ' ఉండవలెను. లేక శివముఖ అనికొందఱు

| వాయుపురాణము | రాజ్య సంవత్సరములు | |
|---|---|---|
| 1. సింధుక | 23 | |
| 2. కృష్ణ | 10 | |
| 3. శాతకర్ణి | 56 | |
| 4. అపీలవ | 12 | |
| 5. పతిమావి | 24 | |
| 6. నెమికృష్ణ | 25 | |
| 7. హాల | 1 | |
| 8. సప్తకలేక మండలక | 5 | |
| 9. పురికసేన | 21 | |
| 10. చకోర శాతకర్ణి | ½ | |
| 11. శివస్వాతి | 28 | |
| 12. గౌతమీపుత్ర | 21 | |
| 13. యజ్ఞశ్రీ శాతకర్ణి | 29 | |
| 14. విజయ | 6 | |
| 15. దండశ్రీశాతకర్ణి | 3 | |
| 16. పులోమావి | 7 | |

| మత్స్య | రాజ్య సం॥రములు | విష్ణు | భాగవత |
|---|---|---|---|
| 1. శిశుక | 23 | సిప్రల్ | ........శూద్రః |
| 2. కృష్ణ | 18 | కృష్ణ | కృష్ణ |
| మల్లకర్ణి | 10 or 18 | శ్రీశతకర్ణి | శతకర్ణ |
| పూర్ణోత్సంగ | 18 | పూర్ణోత్సంగ | పూర్ణమాన |
| స్కంద స్తంభి | 18 | | |
| 3. శతకర్ణి | 56 | శతకర్ణి | |
| లంబోదర | 18 | లంబోదర | లంబోదర |

| మత్స్య | రాజ్య సంవత్సరములు | విష్ణు | భాగవత |
|---|---|---|---|
| 4. అపీటక | 12 | ఐవీలక | హివీలక |
| మేఘస్వాతి | 18 | మేఘస్వాతి | మేఘస్వాతి |
| స్వాతి | 18 | | |
| స్కంధస్వాతి | 7 | | |
| మృగేంద్రస్వాతికర్ణ | 3 | | |
| కుంతలస్వాతి | 8 | | |
| స్వాతికర్ణ | 1 | | |
| 5. పూలోమావి | 36 | పుతుమల్ | ఆత్మాన |
| 6. గౌరకృష్ణ or నౌరికృష్ణ | 25 | అరిష్టకారమాన్ | అనిష్టకర్మన్-హావేయ |
| 7. హాల | 5 | హాల | |
| 8. మండులక | 5 | పట్టాలక | తాలక |
| 9. పురీంద్రసేన | 5 | ప్రవిలసేన | పురిసభీరు |
| సుందరస్వాతికర్ణ | 1 | సుందర | సునందన |
| 10. చకోరస్వాతికర్ణ | 1/3 | చకోర | చకోర |
| 11. శివస్వాతి | 28 | స్వాతి | శివస్వాతి |
| 12. గౌతమీపుత్ర | 21 | గౌతమీపుత్ర | గౌతమీపుత్ర |
| పూలోమత్ | 28 | పూలోమల్ | పూరిమాన్(గుల్) |
| శివశ్రీ | 7 | శివశ్రీ | యేదశిరస్ |
| సివస్కంధ | 7 | సివస్కంద | సివస్కంద |
| 13. యజ్ఞశ్రీశాతకర్ణి | 29, 9, or 20 | యజ్ఞశ్రీ | యజ్ఞశ్రీ |
| 14. విజయ | 6 | విజయ | విజయ |
| 15. చంద్రశ్రీశాతకర్ణి | 10 | చందశ్రీ | చంద్రవిజ్ఞ |
| 16. పులోమావిల్ | 7 | పులోమార్చిస్ | సులోమాధి |

శాతవాహనవంశచరిత్ర పురాణపురుముల నామములతో కేవలము అంధకారబంధురమైనది గాదు. నానేఘాట్ గుహాలలో రాయశిముకుని ప్రతిమలను పేర్కొను శిలాశాసనములు గలవు. అతని

తమ్ముడు కృష్ణశాతవాహనుని కాలములోని శిలాశాసనము, శాతకర్ణి శిముకుని కుమారుడు భార్య రాణినాయనిక శిలాశాసనము నాసికలో గలవు.(5)అమరావతీస్తూపములో క్రీ.శ. మూడవశతాబ్దికి రెండవశతాబ్దికి ఒకటవ శతాబ్దికి చెందిన శిలాశాసనములు గలవు. ఈ శాసనముల లిపినిబట్టి వీని కాలమును నిర్ణయింపవచ్చును. ఈ శిలాశాసనము లన్నియు, శాతవాహనరాజవంశస్థాపకులగు శిముకుని గాని, అర్వాచీన రాజులనుగాని పేర్కొనుట లేదు. కాని క్రీ. శ. 2 వ శతాబ్దికి చెందిన ఇద్దరు శాతవాహనరాజులను పేర్కొనుచున్నవి. రాణి నాయనిక, తన కుమారచక్రవర్తి రాజ్యమున జరిగిన యజ్ఞయాగాదిగములు, పేర్కొనిన శాసనములు నానాఘాట్‌వద్ద నున్నవి కాని కృష్ణాగోదావరీముఖముల లేవు. గౌతమిబాలశ్రీ నాసికశిలాశాసనము ఆంధ్రదేశమును పేర్కొనుట లేదు. ఐతిహ్యములో శాతవాహన రాజధానియైన ప్రతిష్ఠానపురికి నానాఘాటు సుమారు 120 మైళ్ళ దూరముననున్నది. అశోకునికి, అద్యతనభావిలోనున్న భట్టిప్రోలు స్తూపము. ఈ శాసనములు ఖుబీరకరాజును అతని తండ్రి స—ను పేర్కొనుచున్నవి. గౌతమీపుత్ర శ్రీశాతకర్ణి మూడు శిలాశాసనములు నాసిక, కార్లేలోనున్నవి. కావున ఆంధ్రదేశము అనగా కృష్ణాగోదావరీ మధ్యమండలము శాతవాహన రాజ్యారంభకాలమున భిన్నరాజులు పరిపాలించినారని శాతవాహనులు పరిపాలింపలేదని శ్రీ గోపాలాచార్యులుగారి అభిప్రాయము(6)

శాతవాహనరాజుల శిలాశాసనములు 24 లో 8 నాసికలో 5 కన్హేరి 3 కార్లే 1 భీల్సా 2 నానాఘాట్ (శిలాప్రతిమలక్రిందనున్న వేను గాక) 1 మైకదోని 1 చిన్నగంజాము 2 అమరావతి 1 కొండవలిలో కన్పించుచున్నవి. పశ్చిమమున ప్రతిష్ఠానపురిలో చక్రవర్తికి తూర్పున

(5) భండార్కరు. (6) గోపాలాచారి P 7

కృష్ణానదీముఖమున ధాన్యకటకములో రాజప్రతినిధిగ రాజకుమారుటు పరిపాలించుచున్నారని భండార్కరుగారి అభిప్రాయము. శ్రీముఖుడు మున్నగు శాతవాహనులు రాజ్యారంభకాలమున ఆంధ్రదేశమును పరిపాలింపలేదని ప్రతిపాదించుటకు ప్రత్యక్షప్రమాణములు లేవు. అర్వాచీనశాతవాహనులు ఆంధ్రదేశము నేలిన రాజుల జయించినట్లు ప్రమాణములు లభింపలేదు. పురాణములుగూడ ఈ విషయమును పేర్కొనుట లేదు. ఆంధ్రజాతీయులైన శాలివాహనులు అశోకుని కాలమునుండియు మహాభోజులు మహారథులతోను గలసి పశ్చిమమున రాజ్యపరిపాలనాభారమును వహించిరి. మౌర్యసామ్రాజ్య పతనానంతరము వారు పశ్చిమోత్తరదేశమునందే స్వతంత్రరాజ్యముల స్థాపించి అరంభమునుండియు కృష్ణాగోదావరీముఖముల రాజప్రతినిధుల ద్వారా పరిపాలించుచున్నారని చెప్పవలసివచ్చును.

శీ ము ఖు డు : సి ము కు డు

పురాణములలో శిముకుడు లేక సింధుకుడు 23 సంవత్సరములు రాజ్యము చేసినట్లు గలదు. నానాఘాటుగుహలలో కుడ్యప్రతిమలలో రాయసిముక సాతవాహన అని యున్నది.

క న్హ

సిముకుని తర్వాత అతని సోదరుడు కన్హుడు సింహాసన మధిష్ఠించెను. మత్స్య, వాయు, బ్రహ్మాండ, భాగవత, విష్ణు పురాణములు అన్నియు కన్హుడు సిముకుని సోదరుడని ఏకగ్రీవముగా వచించుచున్నవి. నానాఘాట్ కుడ్యప్రతిమలలో ఇతడు కన్పింపకపోవుటగూడ దీనిని సూచించుచున్నది. (7)

కన్హుని కాలమున శాతవాహన రాజ్యము

గోవర్ధనాహారమువరకు (నాసికమండలము) వ్యాపించినది.

---

(7) 24. Rapson of cit. p. X l. X

నాసికలో మహామాత్ర అను రాజోద్యోగి శ్రామణకులకై గుహను త్రవ్వించెను. అశోకుని శిలాశాసనము మహామాత్రులను పేర్కొను చున్నది. కావున శాతవాహనపరిపాలనావిధానము మౌర్యపాలనా విధానమును ఒరవడిగ గ్రహించినదని చెప్పవచ్చును. (8) ఇతడు 18 సంవత్సరములు పాలించెనని మత్స్యపురాణము.

## సి రి సా త క ర్ణి I

నానాఘాట్ గుహలో కుడ్యప్రతిమలలో రాయసిముక, సిరిసాత కర్ణి, అతనిరాణి, కుమారభాయ ............ మహారథిత్రణకయిరో (నాయనిక తండ్రి) కుమారహకుశ్రీ, సాతవాహన. ఆ ప్రతిమలు శిథిలములై పోయినవి. కాని కాళ్లు మాత్రము మిగిలినవి. నాయిన కుమారభాయ తరువాతనున్న స్థలములో వేదిశ్రీ, కుమారశతిశ్రీ ప్రతిమలుండవచ్చును. కాని కణ్ణునికి ఆ ప్రతిమలో స్థానమున్నట్లు కన్పింపదు.

వేదశ్రీ బాల్యమున రాణి నాయనిక శిలాశాసనము, అశ్వ మేధము, రాజసూయము, అగ్న్యాధేయము ఇత్యాది యజ్ఞాదికములు పేర్కొనుచున్నది. ఇందు శాతకర్ణి, 'అప్రతిహతచక్ర, వీరశూర దక్షిణా(పథ) ప(తి)గా ప్రశంసితుడైనాడు. శాతకర్ణి అశ్వమేధయాగ మును రెండుమారులు సల్పెను. ఈ యజ్ఞయాగాదికములలో అర్థాంగి యైనరాణి నాగనిక భర్తతోగూడియుండెను. పతివ్రతయైనరాణి శాతకర్ణి మరణించిన తర్వాత, భర్తకీర్తిని శిలాక్షరములలో ప్రతిష్ఠించెను. (9)

(8) గోపాలాచార్యులుగారు.

(9) ఈ యాగములు రాణినాగనిక సల్పెనని బహాలరు అభి ప్రాయము. స్త్రీకి యజ్ఞాధికారము లేదని భండార్కరు గారు ఖండించిరి.

## శతకర్ణి : పుష్యమిత్రుడు
## ఖారవేలుడు : డెమిట్రియస్ :

కళింగచక్రవర్తి ఖారవేలుని హాతిగుంఫశిలాశాసనము దక్షిణాధిపతియైన శతకర్ణిని పేర్కొనుచున్నది. ఈ శతకర్ణి నానాఘాట్ శాసనములోని శతకర్ణి కావచ్చునని జయస్వాలు గారి అభిప్రాయము(10) నానాఘాట్ శిలాశాసనములో శతకర్ణి 'అప్రతిహతచక్ర' రాజసూయాది యాగములనేగాక రెండు మారులు అశ్వమేధయాగమును సల్పెను.

భారతదేశమునంతయు ఏకచ్ఛత్రాధిపత్యముగ పరిపాలించిన మౌర్యసామ్రాజ్య మస్తమించిన తర్వాత చక్రవర్తిత్వమునకు నలుగురు ప్రయత్నించిరి. మగధసింహాసనమును ఆక్రమించిన పుష్యమిత్రుడు, గ్రీకు రాజు డెమిట్రియను కళింగాధిపతియైన ఖారవేలుడు దక్షిణాధిపతియైన శతకర్ణి. డెమిట్రియను మధురవరకు ఆక్రమించెను. కాని స్వదేశమున ప్రత్యర్థియైన యూక్రిటైడీను నెదుర్కొనుటకు మధురను విడిచి పోవలసివచ్చెను. అప్పుడే ఖారవేలుడు మధురను ముట్టడించెను. (11) డెమిట్రియను మధురను వీడి స్వదేశమునకు పోయెను. అప్పుడు పుష్యమిత్రుడుగూడ అశ్వమేధయాగమును చేసియుండును. (12) ఖారవేలుడు కృష్ణవేణానదీతీరమునకు, దక్షిణాధిపతియైన శాతకర్ణిని లెక్కచేయక దండయాత్ర సల్పెను. అంతకుపూర్వమే శాతకర్ణి మొదటి అశ్వమేధమును సల్పియుండును. తరువాత ఖారవేలుడు మగధను జయించి పాటలీపుత్రములోని సుప్రసిద్ధమైన సుగాంగేయప్రాసాదమును తన మత్తేభము నెక్కి

(10) ఈ శతకర్ణి మరియొకరు. శతకర్ణి ii కావచ్చునని శ్రీ గోపాలాచార్యులగారి అభిప్రాయము P 37

(11) Hathigurphe Inscription J. B. or gs Jayaswal.

(12) పుష్యమిత్రుడు రెండుసారులు అశ్వమేధయాగమునల్పెను.

ప్రవేశించెను. ఖారవేలుడు గూడ రాజ్యాభిషేకసమయమున ఈ దిగ్విజయమున కుపపత్తిగ అశ్వమేధయాగమును సల్పెను. కాని ఖారవేలుడు మరణించిన తర్వాత ఉత్తరాపథమున పుష్యమిత్రుడును దక్షిణాపథమున శతకర్ణియు తిరిగి రెండవ అశ్వమేధయాగమును చేసి ఉత్తర దక్షిణాపథములకు తమతమ చక్రవర్తిత్వములను స్థిరపరచుకొనిరి. ఖారవేలుడు మగధరాజ్యమును జయించినాడు కాని దక్షిణాపథమున శాతకర్ణిని ఓడించినట్లు చెప్పుకొనలేదు. "ఆలోచింపకుండ" (అచింతయ) కృష్ణవేణానదివరకు సేనలతోపాటు మూషికనగరమును ముట్టడించె నను మాటచే శాతకర్ణి ప్రాభవము స్వయంవ్యక్త మగుచున్నది. అట్టి శాతకర్ణి 'అప్రతిహతచక్ర' వీర శూర అని ప్రశంసితుడైన నాగనికభర్త నానాఘాటు శతకర్ణియే యని యెంచవచ్చును. ఇతనిని పురాణములు గూడ "మహాన్" మహాశాతకర్ణి యని పేర్కొనుట ఈ యూహకు దోహదము కల్పించుచున్నది. డెమిత్రియసు ఖారవేల పుష్యమిత్ర, శాతకర్ణులు సమకాలీనులు కానిచో, పుష్యమిత్ర శాతకర్ణుల ద్వితీయాశ్వమేధ కథనమునకు ఉపపత్తి లభింపదు.

## శ త క ర్ణి ii

శతకర్ణి 56 సంవత్సరములు రాజ్యమేలినట్లు పురాణములలో గలదు. 'రాజ్ఞోసాతకన్నిస' అను నాణెములు పశ్చిమ హిందూదేశములో లభించుచున్నవి. (13) ప్రాచ్యమాళవ నాణెములతో ఈ నాణెములు సంవదించుచున్నవి. ఈ నాణెములలోని శతకర్ణి ప్రాచ్యమాళవరాజ్యమును పరిపాలించియుండును. ఈ శాతకర్ణి అపిలకునకు ప్రాచీనుడు కావలెను.

## హ కు సి రి

చైత్యస్తంభముపై శిలాశాసనము మహాహకుసిరిని అతని మనుమరాలు 'భట్టపాలిక' ను (అరహాలియుని కూతురు అగియతన

13. Rapson.

కుని భార్య) పేర్కొనుచున్నది. ఈ మహాహకుసిరి నానాఘాటు శిలా శాసనములో నున్న కుమారహకుసిరి కావచ్చును. శిలాక్షరవికాసమును బట్టిగూడ బుహలరుగారు ఈ శాసనమునకు మిక్కిలి ప్రాచీనత నాపాదించుచున్నారు. (14)

## స తి సి రి

నానాఘాట్‌శాసనములో రాణినాయనిక కుమారుడుగ నున్న సతిసిరియే జైనగాథలలోని శక్తికుమారుడు గావచ్చును. (15) పురాణములలో శతకర్ణి తరువాత పూర్ణోత్సంగుడు సింహాసన మధిష్ఠించినట్లు గలదు. నానాఘాట్‌లోని సతిశ్రీమతో వాయుపురాణములోని పూర్ణోత్సంగుడు కావచ్చునని గోపాలాచార్యులుగారి అభిప్రాయము. (16) నానాఘాటు శాసనము ప్రకారము వేదిశ్రీ శాతకర్ణి తరువాత సింహాసనమునకు రావలసియున్నది. వేదిశ్రీయే పురాణములలో 'పూర్ణోత్సంగుడు' కావచ్చును. పురాణములలోమాత్రమే స్కంధస్తంబి పేరు కన్పించుచున్నది.

## అ పి ల క

మధ్యపరగణాలలో 'అపీలకు'ని నాణెము దొరికినది. దీనినిబట్టి పురాణములు 8 వ రాజుగా పేర్కొనిన అపీలకుని నామము ఋజువగుచున్నది.

## కు ం త ల శా త క ర్ణి

అపీలకుని తరువాత పురాణములలోని నామములు చాలవరకు చరిత్రలో కనుపించుటలేదు.(మేఘస్వాతి,స్వాతి,స్కంధస్వాతి,మృగేంద్ర

(14) B. G. V. or xvi p 608 E I Vol VII: p 92 quoted by Rapson A catologue of Indian coins in Bhi 2. sh museum

(15) Buhler Asw. Vol, V p 62 : Rapson also quoted this.

(16) గోపా 38.

శతకర్ణి)........కుంతలశాతకర్ణి నామము పురాణములలో గన్పించుచున్నది. ఈ రాజులకాలమున చారిత్రకులు ఊహించినంతవరకు శాతవాహనరాజ్యము అభ్యుదయములో నుండియుండును. క్రీ. పూ 73 నుండి యావత్ భారతవర్షమును ఏకచ్ఛత్రాధిపత్యముగ పరిపాలించిన మగధసింహాసనముగూడ శాతవాహనరాజులు ఆక్రమించిరి. పాటలీపుత్రమున విద్యాభ్యాసము సల్పిన శాతవాహనాస్థాన బ్రాహ్మణునకు కణ్వవంశమునకు చెందిన మగధరాజు సుశర్మ పుత్రిక నిచ్చెనని కథాసరిత్సాగరము చెప్పుచున్నది. -కథాసరిత్సాగరములో విక్రమాదిత్యుని వర్ణనగలదు. (17) అతడుదిగ్విజయము సల్పెను. అతని సేనాపతి విక్రమశక్తి.అతనితండ్రి మహేంద్రాదిత్యుడు.పురాణములలో మహేంద్ర శాతకర్ణి కుమారుడు కుంతలశాతకర్ణి. కావున కథాసరిత్సాగరములోని విక్రమాదిత్యుడు కుంతలశాతకర్ణి యని నిరూపింపవచ్చును.

ఇది వేరొకవిధముగా ఋజువగుచున్నది. సోమదేవుడు కథాసరిత్సాగరములో విక్రమాదిత్యుని భార్య మలయవతి యను మలయరాజకన్యక యని చెప్పినాడు. వాత్స్యాయనుడు కామసూత్రములలో 'మలయవతి' యను రాణి కుంతలశాతకర్ణి ప్రణయాశ్లేషములో మరణించెనని చెప్పినాడు. దీనినిబట్టి కుంతలశాతకర్ణియే సోమదేవుని విక్రమాదిత్యుడని చెప్పవచ్చును.

ఇచ్చటగూడ విక్రమాదిత్యునికి, ఉజ్జయినితో గల సంబంధము బలపడినది. అతడు దిగ్విజయమును సల్పెను. మధ్యదేశ, సౌరాష్ట్ర, అంగ వంగ కస్థలను జయించెను. కాశ్మీరమునుండి కప్పము గొనెను. మ్లేచ్ఛులను జయించెను. అతడు సింహళ రాజకన్యకను, కళింగ రాజకన్యకను, మలయరాజ కన్యకను వివాహమాడినాడు. ఉజ్జయినిలో పట్టాభిషిక్తుడయ్యెను. ఆ పట్టాభిషేకమునకు గౌడ, కర్ణాటక, లాట, కాశ్మీర, సింధు, వింధ్యబల, భిల్ల పారశీక రాజులు వచ్చిరి. వారి

(17) Jayaswal : J. B. 1930

పేరులు శక్తికుమార, జయధ్వజ, విజయవర్మన్, సునందన, గోపాల నిర్మకులు.

## గౌ త మీ పు త్ర శ త క ర్ణి

గౌతమీపుత్రశతకర్ణి తల్లి బాలశ్రీ శిలాశాసనము నాసికలో పులమావి 19 వ సంవత్సరమున కన్పించుచున్నది. బాదరాయణ బౌద్ధభిక్షుకుల కొరకు ఆ గుహనిర్మితము. అందు గౌతమీపుత్ర శతకర్ణి అనేకరాజుల శాసించిన చక్రవర్తిగ ప్రశంసితుడు. అసిక, అశ్మక, మూలక, సురాష్ట్ర, కుకుర, అపరాంత, అనూప, విదర్భ, అకారావంతిదేశములకు ప్రభువు. వింధ్యవల్, పారియాత్ర, సహ్య, కృష్ణగిరి, మలయ, మహేంద్ర, శ్రేష్ఠగిరి, చోకరపర్వతములకు అధినాథుడు. సామంతరాజులు అతని శాసనములను శిరసావహించి పాదపద్మముల పూజించిరి. అతని వాహనములు త్రిసముద్రముల నీరు త్రాగినవి. శరణన్నవారిని రక్షించి ప్రజల సౌఖ్యమే ఆత్మసౌఖ్యముగ భావించినాడు. పురుషార్థము లన్నిటికి సమానప్రతిపత్తి నిచ్చి సంరక్షించినాడు. ఏకబ్రాహ్మణుడు. వర్ణసాంకర్యము గాకుండ రక్షించినాడు. బ్రాహ్మణప్రీతిపాత్రుడు. అతని పరాక్రమ కృత్యములు రామ, కేశవ, అర్జున, భీమసేనాదులతో తులతూగినవి. నహుష, జనమేజయ, సాగర, యయాతి, రామ, అంబరీషాదులతో తుల్యుడు. క్షత్రియుల గర్వము అణచినాడు. శకులను యవనులను పల్లవులను నాశనము చేసినాడు. క్షగారాటవంశమును మూలనాశము చేసి శాతవాహన కులకీర్తికారుడైనాడు.

"గౌతమీపుత్ర" అను విశేషణమునకు పండితులు పలువిధముల వ్యాఖ్యానము చేయుచున్నారు. కాళిదాసు శాకుంతలములో కణ్వాశ్రమములో "గౌతమి" కన్పించుచున్నది. గౌతమి అనిన పరివ్రాజకాశ్రమమును స్వీకరించిన సన్యాసిని. గౌతమీపుత్రశాతకర్ణి

అగర్భచక్రవర్తి. భర్త మరణింపగ రాణి బాలశ్రీ గౌతమియై రాజ్యమును శాసించి అగర్భపుత్రుని పేర రాజ్యము నేలినది. ఈ వీరమాత పుత్రుని జగదేకవీరునిగ దిద్దినది. ఆ కాలమున నున్న ఆచారము ప్రకారము గౌతమీపుత్రుడు 24 వ యేట పట్టాభిషిక్తుడై నాడు. (18) అప్పటికే అతడు దిగ్విజయము సల్పిన మహావీరుడై యుండును. గౌతమియై సన్యాసినియైన వీరమాత యగు తన తల్లి పేరు చిరస్మరణీయము చేయుటకుగాను శాతకర్ణి గౌతమీపుత్ర శతకర్ణి యని నామధేయము ధరించియుండును. "యథా రాజా తథా ప్రజా" అన్నట్లు అంతవరకు శాతవాహనవంశములో తల్లిపేరు పెట్టుకొనని రాజపుత్రులు, రాజవంశీయులు, దండనాథులుగూడ తమ నామధేయములకు ముందు తల్లిపేరునుంచు ఆచారము ప్రచారములోనికి వచ్చియుండును.

## దిగ్విజయము :

బాలశ్రీశాసనము గౌతమీపుత్రశాతకర్ణిని దక్షిణా (పథ) ప (పతి) గా పేర్కొనుచున్నది. గౌతమీపుత్రశాతకర్ణి 18 వ రాజ్య సంవత్సరమున వైజయంతిలో సేనావిజయోత్సవభవనమునుండి గోవర్ధనాహారమున అమాత్యుడగు విష్ణుపాలితునకు శాసనమును పంపినారు. త్రిరాశ్మిపర్వతగుహాలలో వసించుచున్న భిక్షుకులకు వృషభదత్తుని అధీనములో అంతవరకునున్న ఒక గ్రామమును ఇచ్చుటకు ఆ శాసనము ఆజ్ఞాపించుచున్నది. దీనిని బట్టి వృషభదత్తుని అధీనములో నున్న రాజ్యప్రదేశములు గౌతమీపుత్రునికి సంక్రమించినవని చెప్పవచ్చును. ఈవిషయమును కార్లేలోని ఇంకొక శిలాశాసనమును

(18) అశోకునికి పట్టాభిషేకము రాజ్యమునకు వచ్చిన 4 సంవత్సరములవరకు జరుగలేదు. కి. చూ. ఖారవేలుడు.

చెప్పుచున్నది. (గౌతమీపుత్రశతకర్ణి) 1 (8) వ సంవత్సరమున మామలాహారమునయున్న అమాత్యునికి ఆదేశరూపమున నున్న శిలా శాసనము. వలూరక గుహలలోనున్న భిక్షుకులకు కారజాక గ్రామమును ఇచ్చుచున్నది. ఆ కారజిక గ్రామమునే ఇదివరలో వృషభదత్తుడు వలూరకగుహలో నివసించు బౌద్ధభిక్షుకులకు దానము చేసెను. కావున, గౌతమీపుత్రశతకర్ణి 18 వ సంవత్సరమున విజయము సిద్ధించినదని చెప్పవచ్చును.

## వృ ష భ ద త్తు డు

వృషభదత్తుని నాశిక శిలాశాసనమువల్ల కొన్ని చారిత్రక విషయములను నిరూపింపవచ్చును. అతడు 'క్షహరాటా' రాజు నహపాణుని అల్లుడు. దీనీక కుమారుడు. అతని శిలాశాసనములో ప్రభాస, బారుకచ్ఛ, గోవర్ధన, సోపార మున్నగునవి కన్పించు చున్నవి.

"మాళయులు వర్షఋతువులో ముట్టడించిన ఉత్తంభద్రుల రాజును విడిపించుటకు పోయినాను - నారాకవిని మాళయులు పారిపోయినారు. చాలమంది ఉత్తంభద్రులకు చిక్కినారు. తరు వాత పుష్కరసరస్సులో అభిషేకము జరిగినది. మూడు వేల గోవులను ఒక గ్రామమును దానము చేసినాను." ఉత్తంభద్రులు క్షత్రియులు. మాళయులు దక్షిణభారతదేశములోని మలయపర్వత నివాసులు అని బుహ్లారు అభిప్రాయము. మాలవదేశీయులని భగవానులు గారి అభిప్రాయము. బుహ్లారు అభిప్రాయముతో రాప్సను ఏకీభవించు చున్నారు. పుష్కరసరస్సు అజ్మీరు ప్రాంతమందలి పోకరసరస్సు.

బుహాలరు రాప్సను గారల అభిప్రాయము సరియైనదిగాదు. అజ్మీరుసరస్సు ఎక్కడ? దక్షిణాపథమందలి మలయపర్వతమెక్కడ? ఉత్తంభద్రులు క్షత్రియులు, గౌతమీపుత్రశతకర్ణి క్షత్రియుల గర్వ

మడంచినట్లు బాలశ్రీ శిలాశాసనములో గలదు. వృషభదత్తుడు నహోయము చేసిన ఈ ఉత్తంభద్ర క్షత్రియులగర్వమునే గౌతమీ పుత్రుడు అణచియుండును. మాళయులకు క్షత్రియులకు వైరము. ఈ మాళయులు మాళ్వదేశీయులు. క్రీ. పూ. ప్రథమశతాబ్దిలో వారి జయమును సూచించు, మాళవుల గణప్రభుత్వము నాణెముల గ్రుద్దినది. (19) మాళవానాం జయ, మాళవస్యజయ అను అక్షరములు క్రీ. పూ. ప్రథమశతాబ్దిని సూచించుచున్నవి. (20)

నహపాణుని అల్లుడు వృషభదత్తుడు. నహపాణుడు క్షహోరాట వంశమునకు చెందిన క్షత్రపుడు. ఇతని నాణెములపై క్షహోరాట వంశీయుడని యున్నది. (21) జున్నారు శిలాశాసనము నహపాణుని మంత్రి లయమ వేసినది అతనిని మహాక్షత్రపుడని పేర్కొనుచున్నది. (22) అది నహపాణుని 46 వ సంవత్సరము. 42 వ సంవత్సరము వరకు అతడు క్షత్రపుడు. (మహాక్షత్రపుడుగాడు) గౌతమీ శిలా శాసనమువల్ల గౌతమీపుత్రశతకర్ణి యవనులను, శకులను, పల్లవులను జయించినట్లు, క్షహోరాటువంశమును నిరవశేషముగ నిర్మూలము చేసినట్లును గలదు. 13000 నహపాణుని నాణెములను గౌతమీ పుత్రుడు పునర్ముద్రణము వేయించినవి జోగలుతంబిలో దొరికినవి. (23)

ప్రాచీన జైనగాథలుగూడ నహపాణుని పేర్కొనుచున్నవి. నయయుక్తికి (58 B C. 150 A D) చూర్ణి అను వ్యాఖ్యానము జినదాసగణి (733 A. D.) రచించెను. అందు, బారుకచ్ఛ నహపాణుని

---

(19) Smith C. I. M. N. 170, 173 Plate xx

(20) Jayaswal, J. B. O. Rs 1930 Vol 16,

(21) Rapson catalogue of Indian Coins.

(22) Rapson in a Kshatriya family. Catalogue of Indian Coins Buhler A S. W. IV p 103

(23) Rapson. Catalogue of Indian Coins.

రాజధాని. వృషభదత్తుడు అతని సామంతుడు. శాలివాహనుడు బారుకచ్ఛపై దండెత్తివచ్చెను. ఆ యుద్ధములో నహపాణుడు మరణించెను. ఉజ్జయిని అవంతి జైనగాథలు నహపాణుని పేర్కొనుచున్నవి. (24)

నహపాణుడు శకుడని జినసేనుడు. నహపాణునికి పూర్వము రాజ్యము భూముకక్షాత్రపు డేలెను. ఇతని నాణెములు గలవు. (25) ఈ క్షాత్రపులు శకులో, పహ్లవులో, యవనులో చెప్పుట కష్టము. వీరు విదేశీయులు. ఉజ్జయిని అవంతి రాజ్యములు వీరి అధీనములో నుండెను. వీరు ఎట్లు దక్షిణాపథమును జయించినది తెలియదు. గౌతమీపుత్రుడు వీరిని ఓడించుటకు పూర్వము సాతవాహన రాజ్యములగు గోవర్ధనాహారాదులు (నాసిక) మున్నగునవి వీరి అధీనములోనికి శతకర్ణి I తరువాత వచ్చియుండును.

## హాల

హాలుడు 5 సం. మత్స్యపురాణము ప్రకారము, 1 సం. వాయుపురాణము ప్రకారము రాజ్యమేలెను. హాల, శాతకర్ణి ఇత్యాది పదములు అర్వాచీనులు సమానార్థకములుగా ప్రయోగించిరి. ఇతడు 'సప్తశతి' అను గ్రంథమును సంతరించెను. ఈ గ్రంథము 700 పద్యములు గల పద్యకావ్యసంపుటి. మహారాష్ట్రప్రాకృతమున విరచితము.

## లీలావతి

సింహళరాజు శీలమేఘునకు గంధర్వసతివల్ల లీలావతి యను పుత్రిక గలదు. ఆమె సప్తగోదావరము (దక్షిణము) వద్ద నుండెను. సేనాపతి విజయానందుడు ఈ విషయము రాజు హాలున కెరిగించును. వెంటనే రాజు అచటికిపోయి, ఆమెను చెరగొన్న రాక్షసుని వధించి

(24) J. B Or. orp. Jayaswal 1930 Vol. 6

(25) Rapson, A Catalogue of Indian Coins.

లీలావతిని వివాహమాడును. ఈ గాథ ప్రాకృతకావ్యమైన లీలావతిలో గలదు. (26)

## పు లో మా వి

టోలిమీ దక్షిణాపథమును పరిపాలించుచున్న పులోమావిని ఉజ్జయినిని పాలించుచున్న చస్తానుని పేర్కొనినాడు. ఈ పులోమావి కాలమునుండి క్షాత్రపులకును శాతవాహనులకు తిరిగి సంఘర్షణము ప్రబలియుండును.

## శి వ శ్రీ శ త క ర్ణి

ఆంధ్రదేశమునందలి నాణెములలో వసిష్ఠిపుత్ర శివసిరిశాతకర్ణి యే పురాణములలోని శివశ్రీ శాతకర్ణి గ ఎంచవచ్చును. వసిష్ఠిపుత్ర శతకర్ణి రాణి కర్దమక రాజుల వంశీయురాలు. మహాక్షత్రపరుద్ర....ని పుత్రిక శాసనము. కన్హేరిలోగలదు. (27)

## ప శ్చి మ క్షా త్ర పు లు
## శా త వా హ ను లు

టోలిమీ చస్తానుడు ఉజ్జయిని పరిపాలించుచున్నట్లు పేర్కొని నాడు. అప్పటికి పులమావి ప్రతిష్ఠానపురమును శాసించుచున్నాడు. క్రీ. శ. 130 ప్రాంతపు గాథ. వీరికి నహపాణునికి ఏమి సంబంధము కలదో చెప్పలేము. 'క్షాత్రప' నామము వీరికి సమానధర్మము. వీరు పరిపాలించిన దేశములు ఒకటే కావున, నహపాణుని తరువాత ఆ వంశీయులు ఉత్తరాపథమునకు పోయి కాలమును వేచి చస్తానుని కాలమున తిరిగి ఉజ్జయినిని ఆక్రమించిరని చెప్పవచ్చును. అతడు పులమావికి సమకాలికుడు. చస్తానుని పుత్రుడు జయదమనుడు

(26) M. Ramakrishna కవిభారతి Vol 1g part I, pp 3 ff

(27) Rapson 17 Buhler A. S W., V. p 78 Catalogue of Indian Coins.

క్షాత్రపుడు మాత్రమే. మహాక్షాత్రపుడు గాడు. ఇతని కాలమున శాతవాహనులు తిరిగి క్షాత్రపరాజ్యములను ఆక్రమించి యుందురు.

## రు ద్ర మా న్

రుద్రమాన్ కాలక్రమమున స్వతంత్రుడయ్యెను. ఇతని గిర్నారు శిలాశాసనము 72 శక× క్రీ. శ. 150 సంవత్సరమును పేర్కొనుటచేత, శాతవాహన కాలనిర్ణయమునకు గీటురాయిగ పరిగణింపబడుచున్నది. గాలివానకు శిథిలమైన సుదర్శనసరస్సునకు, ఆనకట్ట కట్టుటను ఆ శాసనము వర్ణించుచున్నది. దానిని చంద్రగుప్తుని కాలమున, పరిపాలకుడు వైశ్యపుష్యగుప్తుడు కట్టించినాడు. దానిని తుషాస్పుడు యువనరాజు అశోకసామంతుడు సంరక్షించినాడు. పూర్వాపరాకారావంతి అనుప, ఆనర్త, సురాష్ట్రదేశములకు రుద్రమాన్ అధిపతి, దక్షిణా పథాధిపతి యైన శాతకర్ణిని రెండు మారులు జయించినాడు. శాతకర్ణిని బాంధవ్యసంబంధముచేత విడిచిపెట్టినట్లు చెప్పినాడు. దీనినిబట్టి, శాతకర్ణిని రుద్రమాన్ ఓడించినట్లు తోచుచున్నది. మహాక్షాత్రపపదవిని సంపాదించినాడు.

## శివమఖశద ( శాతకర్ణి )

శివశ్రీశాతకర్ణి అనంతరము పురాణములు ఏకగ్రీవముగ శివస్కంధుని పేర్కొనుచున్నవి. అమరావతిలో పులమావి తరువాతి శిలాశాసనము 'శివకకశద'ను పేర్కొనుచున్నది. ఇతడే శకసేన.

మాఢరిపుత్ర శకసేనశాతకర్ణి నాణెములలో 'శకశద' కనిపించుచున్నాడు. ఈతని కన్హేరి శిలాశాసనములోని అక్షరములు యజ్ఞశ్రీ శాసనాక్షరములను పోలుచున్నవి. కావున ఇతడు యజ్ఞశ్రీకి అవ్యవహిత పూర్వమునకో లేక అవ్యతనభావిలోనో రాజ్యము సల్పి యుండును.

## గౌతమీపుత్ర శ్రీయజ్ఞశాతకర్ణి

పురాణములు ఇతడు 29 సంవత్సరములు రాజ్యము నేలినట్లు చెప్పు

చున్నవి, ఇతని చిన్నగంజాము శిలాశాసనము27సంవత్సరమునయున్నది. కావున పురాణవాక్యమును యథార్థముగ స్వీకరింపవచ్చును. ఇతని కాన్హేరి, నాసిక, చిన్నగంజాము శాసనములు, చందాజిల్లా, కృష్ణా గోదావరీమండలముల దొరికిననాణెములు, ఇతని కాలములో శాత వాహనరాజ్యము ఆంధ్రమహారాష్ట్ర దేశములనే గాక అపరాంతదేశము వరకు ప్రాకినదని చెప్పవచ్చును. (29)

హూన్‌త్సాంగు నాగార్జున పురుమని పేర్కొనినాడు. ఇతడు శతోపుహరాజునకు సమకాలికుడు. ఆ రాజు అతనికొఱకు పొలొమో లొకిలివద్ద గుహ త్రవ్వించెను.

## వాసిష్ఠీపుత్ర చదసాతి

వాసిష్ఠీపుత్రచదసాతి నాణెములు కృష్ణాగోదావరీ మండలముల లభించినవి. కావున ఇతడే పురాణముల స్కంధస్వాతి యని రాప్సను అభిప్రాయము. చదసాతి తగరము నాణెములనుబట్టి పురాణముల లోని చంద్రశ్రీ అని, రాప్సను అభిప్రాయము. కావున ఇద్దరు ఒకరే యని చెప్పవచ్చును. వశిష్ఠీపుత్ర చదసాతి కాలములో నున్న కొడ వోలు శిలాశాసనములనుబట్టి ఇద్దరు చదసాతులు లేరనిచెప్పవచ్చును. ఆ శాసనమునుబట్టి కళింగగూడ ఆ కాలమున సాతవాహన రాజ్య ములో కలసినదని చెప్పవచ్చును.

## పులుమావి

పురాణములు అన్నియు పులుమావిని శాతవాహన మహారాజ్య మున అంతిమచక్రవర్తిగా పేర్కొనుచున్నవి. మ్యాకదోనిలో ఒక శిలాశాసనము, వేపురక గ్రామవాసి ఒక తటాకమును రాజ్ఞో శాత వాహనసంసిరిపులు మావిస! 8 వ రాజ్యసంవత్సరమున నిర్మించిన శాసనాక్షరములు నాగార్జునకొండ లిపిని పోలుచున్నవి.

(29) పూధరి పుత్ర శకసింహుడు యజ్ఞశ్రీ సివముక శదలకు మధ్యనున్న అపరాంతను జయించినకీర్తి అతనికి దక్కవలెను.

పురాణములలోని నామములు ఇంకను చరిత్రలో గనిపించుట లేదు. పురాతత్వజ్ఞుల భూగర్భపరిశోధనలవల్ల, చారిత్రక పరిశోధకుల శాసనములవలన భావికాలములో శాతవాహనరాజులనుగురించి ఇంకను చారిత్రకాధారములు లభింపగలవని ఆశింపవచ్చును.

## శా త వా హ న కా ల ని ర్ణ య ము

### I

శాతవాహనరాజుల కాలనిర్ణయము దక్షిణాపథచరిత్రలో మిక్కలి వివాదగ్రస్త విషయము.

పురాణములనుబట్టి మౌర్యులు 137 సంవత్సరములు, శుంగులు 112, కాణ్వులు 45 సంవత్సరములు ఏలినట్లు తెలియుచున్నది. పురాణముల సాక్ష్యము అన్యోన్యవిరుద్ధముగను, కొన్నిచోట్ల స్వవచోవ్యాఘాతముగనుగూడ కన్పించుచున్నది. వాయు విష్ణు భాగవత పురాణములనుబట్టి ఆంధ్రరాజులు 30 మంది పరిపాలించినట్లు తెలుచున్నది. మత్స్యపురాణము ఆంధ్రరాజుల సంఖ్య 29 గ చెప్పినను, పట్టికలో ముప్పదిమంది పేరుల నిచ్చినది. మత్స్యపురాణానుసారము ఆంధ్రరాజుల పరిపాలనకాలము 460, విష్ణు భాగవత పురాణముల ప్రకారము 456, వాయుపురాణానుసారము 411 లేక 300 సంవత్సరములు. మత్స్యపురాణమునందలి పట్టికలో 30 రాజులు గలరు. వాయుపురాణమునందలి పట్టికలో 17 గురు రాజులు గలరు. వాయుపురాణకర్త పీఠికలో ప్రధానరాజనామములనే పేర్కొందునని చెప్పియున్నాడు.(1) కావున వాయుపురాణపట్టికలో లేని శాతవాహనరాజులు కొందరు రాజ్యము చేసియుండినట్లు ఎంచవచ్చును. పట్టికలోని రాజుల పరిపాలనవత్సరములు కూడిన 272¼ సంవత్సరములు. వాయుపురాణకారుడే మొత్తము 30 మంది రాజులని పేర్కొనియున్నాడు. అట్లే

---

(1) ప్రాధాన్యతః ప్రవక్ష్యామః

11/369
6338

# శాతవాహనయుగము

మత్స్యపురాణము రాజులసంఖ్య 29 అని చెప్పి పట్టికలో 30 మందిపేర్ల నిచ్చినది. వారల పరిపాలనవత్సరములకూడిన 448½ [460 చెప్పిన మొత్తము.] విష్ణుపురాణపట్టికలో 24 రాజులు గలరు. అట్లే భాగవత పురాణము. పురాణములలోని పేర్లు కల్పితములని త్రోసివేయుటకును వీలులేదు. – శాసనములనుబట్టి నాణెములనుబట్టి పురాణపట్టికలలోని పెక్కురాజుల నామములు చరిత్రకు తెలియును.

శాతవాహనరాజుల సమగ్రచరిత్ర నిర్మించుటకు మత్స్యపురాణ పట్టిక మిక్కిలి యుపకరించును. ఇంతవరకు మత్స్యపురాణపట్టికను త్రోసిపుచ్చుటకు తగిన ఆధారములు లభింపలేదు. మత్స్యపురాణము పేర్కొనని రాజులనామధేయములు కొన్ని శాసనాధారములనుబట్టి నాణెములను బట్టి చరిత్రకు లభించినవి. వారు శాతవాహనవంశజు లైనను. మూలవంశమునకు సామంతులై యుండుటచే ఆ పట్టికలో చేరియుండకపోవచ్చునని ఒక వాదము. ఇంకొక వాదమును గలదు. మత్స్యపురాణము శాతవాహన సామ్రాజ్యపు చివరిరోజులలో – యజ్ఞశ్రీ శాతకర్ణి కాలమున రచింపబడినట్లు ఎంచవచ్చునని పర్గిటురుగారి అభిప్రాయము. అందుచే మత్స్యపురాణరచనానంతరము ఏలిన రాజుల పేరులా పట్టికలో చేరకపోవుటలో విప్రతిపత్తి లేదు.

శాతవాహనయుగమునందే విరచితమైన మత్సపురాణమున తత్కర్త ఆ వంశవృక్షమును తప్పుగ ఇచ్చియుండడనియు, పురాణ పట్టికలలో నది సమగ్రమైనదనియు, లభించిన శాసనాధారములనుబట్టి నాణెములనుబట్టిగూడ అ పట్టిక నికరముగనే యున్నదనియు నందుచే ఆ పట్టికను యథాతథముగ స్వీకరింపవచ్చుననియు శ్రీ గొర్తి వెంకట్రావుగారి అభిప్రాయము ఎన్నదగినది. మత్స్యపురాణమునకును వాయుపురాణమునకును ఇచ్చినంతవరకు రాజుల పేరులలో రాజ్య సంవత్సరములలో చెప్పదగినంత భేదము లేదు – అయినను ఈ క్రింది భేదములు గమనింపదగినవి :

| రాజు పేరు | మత్స్య రాజ్య వత్సరములు | వాయురాజ్య వత్సరములు |
|---|---|---|
| పులోమావి | 36 | 24 |
| హాలుడు | 5 | 1 |
| పులింద్రసేన | 5 | 21 |
| చండశ్రీ (దండశ్రీ) | 10 | 3 |

మత్స్యపురాణము వాయుపురాణముగూడ గౌతమీపుత్ర శాతకర్ణి రాజ్యపరిపాలన వత్సరములు 21గ నిచ్చుచున్నవి. శాసనములను బట్టి ఆతడు 24 సంవత్సరములు రాజ్యము చేసినట్లు కొందరు భావించు చున్నారు. ఈ 4 సంవత్సరములు మత్స్యపురాణములో కొదువయైన 11½ సంవత్సరములలో చేరునేమో- (460 పీఠికలో చెప్పిన కాలము-పట్టికలోని రాజుల మొత్తపు రాజ్యకాలము 448½ సం.లు) ఇట్లే మిగిలినరాజుల రాజ్యసంవత్సరములలోగూడ చిరుమార్పులకు తావుండ వచ్చును.

శాతవాహనరాజ్యకర్తగ పురాణములు పేర్కొనిన శిశుకుడు (శాసనములందలి శిముకుడు) ఎప్పుడు పరిపాలించెను ? అనునది పెద్ద సమస్య. మౌర్యుల తరువాత శుంగులు- పిమ్మట శాతవాహనులు రాజ్యమేలినట్లు పురాణవచనము - మౌర్య బృహద్రథుని చంపి పుష్యమిత్రశుంగుడు రాజ్యము నాక్రమించుట క్రీ. పూ. 185 సంవత్సర ప్రాంతము. శుంగవంశము 112 సంవత్సరములు కాణ్వాయన వంశము 45 సంవత్సరములు పరిపాలించిరని పురాణకథనము.

పుష్యమిత్రశుంగునకు సమకాలీనులు దక్షిణాపథమున తూర్పున ఖారవేలుడు పశ్చిమమున శతకర్ణి యునని హాతిగుంఫశాసనము కంఠోక్తిగ చెప్పుచున్నది. కావున శాతవాహనులు శుంగులకు కాణ్వులకు గూడ సమకాలీనులుగ రాజ్యము నేలిరనుట భూతార్థము.

శాతవాహన కాలనిర్ణయమున సమన్వయములతో నిమిత్తము లేకుండ నిష్కర్షగ నిరూపింపదగిన అంశములు చరిత్రకారులు పేర్కొన గలరా ? ఈ సూటిప్రశ్నకు సమాధానము అన్వేషింపదగినది.

1. ఖారవేల - యవనరాజు - దిమిత్ర - (డెమిట్రియస్) పుష్యమిత్ర - శతకర్ణి సమకాలీనత. ఇది కాలనిర్ణయము చేయగలిగిన అంశమే. (1)
2. గౌతమీపుత్ర - నహపాణుల సమకాలీనత. ఇది వివాదగ్రస్త విషయమే.
3. చస్తానుడు - ఉజ్జయిని నేలుచున్నప్పుడు పులోమావి ప్రతిష్ఠానము (పైఠాను) పరిపాలించుచున్నట్లు గ్రీకు (భూగోళ)రచయిత టోలిమీ ప్రవచనము, త్రోసిపుచ్చుటకు వీలులేని బలవత్తర సాక్ష్యము.
4. చస్తానుని మనుమడు రుద్రదాముని గిర్నారుశాసనము క్రీ. శ. 150 నాటిదనుట నిర్వివాదము.
5. చస్తానుడు క్రీ. శ. 130 సంవత్సరమున సజీవుడైయున్నట్లు 'అంధే' శాసనమువలన తెలుచున్నది.

శాతవాహన కాలనిర్ణయము పై అంశములను సమన్వయించ వలసియున్నది.

ఖారవేలుని హాతిగుంఫశాసనము, అతని 8 వ రాజ్యసంవత్సర మున యవనరాజు దిమితుని జయించి ఆతనిని స్వదేశమునకు పార ద్రోలినట్లు చెప్పుచున్నది. గార్గిసంహిత యవనులు భారతదేశము నుండి నిష్క్రమించుటకు స్వదేశపరిస్థితులు కారణమని సూచించు

---

(1) ప్రకరణాంతరమున ఖారవేలుడు - కళింగదేశచరిత్ర అను అధ్యాయమున ఈ అంశము సవిస్తరముగ చర్చింపబడినది.

చున్నది. గ్రీకు చరిత్రలో యూక్రటీడీసు, డెమిత్రియసు సంఘర్షణ క్రీ. పూ. రెండవ శతాబ్దినాటిది. మేయరు ప్రకారము డెటిత్రియసు భారతదేశనిష్క్రమణము క్రీ. పూ. 175 సంవత్సరమున జరిగినది. అది ఖారవేలుని ఎనిమిదవ రాజ్యసంవత్సరము. కావున ఖారవేలుని మొదటి రాజ్యసంవత్సరము క్రీ. పూ. 182. రెండవరాజ్యవత్సరమున ఆతడు శతకర్ణిని లెక్కచేయక పశ్చిమదండయాత్ర సాగించెను. ఖారవేలుని రెండవ రాజ్యసంవత్సరము క్రీ. పూ. 181 సంవత్సరమున శతకర్ణి పశ్చిమము నేలుచుండెను. అతని దక్షిణాపథపతిగ హాతిగుంఫశాసనము పేర్కొనుచున్నది.

ఆ శతకర్ణి మత్స్యపురాణమునందలి అరవవాడని కొందరు, మూడవ వాడని మరికొందరు వాదించుచున్నారు. చరిత్రకారులలో పలువురాతని పురాణములు 'మహాన్' అని ప్రశంసించి, 56 సంవత్సరములు రాజ్యము చేసినట్లు రెండు అశ్వమేధయాగములు చేసినట్లు అభివర్ణించిన శతకర్ణియే యని చెప్పుచున్నారు. హాతిగుంఫశాసనమున ఖారవేలుడు శతకర్ణిని జయించినట్లు చెప్పలేదు. ఆతనిని లెక్కచేయక పోవుటయే తనకు మహాగౌరవసూచకమనినట్లు శబ్దప్రయోగము సూచించుచున్నది. స్వదేశాభిముఖుడై స్వచ్ఛందముగ మరలిపోవుచున్న డెమిత్రియసును జయించినట్లు ఆత్మోపకర్షగ అభివర్ణించుకొనిన ఖారవేలుడు శతకర్ణి విషయమున చేసిన అప్రమత్తశబ్దప్రయోగముచే ఆతడు రెండు అశ్వమేధయాగములు చేసినట్లు పురాణములు కొనియాడిన శతకర్ణి (మత్స్యపురాణములోని అరవరాజు) అని చెప్పవచ్చును. మత్స్యవంశరాజగణములో ఖారవేలుని సమకాలీనుడు మూడవవాడైనను అరవవాడైనను క్రీ. పూ. 28 సంవత్సరమున సుశర్మను వధించిన శాతవాహనుడు మొదటివాడు శిముఖుడు కాజాలడు. ఆ చర్చవలన నిష్కర్షగా తేలిన సారాంశము ఖారవేలుడు క్రీ. పూ. 182 సంవత్సరమున సింహాసనమధిష్ఠించెను. పుష్యమిత్రుడు

బృహ్ద్రథుని వధించి మగధసింహాసన మధిష్ఠించుట క్రీ. పూ. 185 గ చారిత్రక నిర్దేశము. క్రీ. పూ. 181 సంవత్సరమున శతకర్ణి దక్షిణాపథ పతి. డెమిత్రియను వారికి సమకాలీనుడు.

## గౌతమీపుత్ర శతకర్ణి

జోగల్‌తంబి నిధిలోని 13270 నాణెములలో 9270 గౌతమీ పుత్ర శతకర్ణి పునర్ముద్రణ వేయించినవి. అవి నహపాణుని నాణెములు. నహపాణుని పూర్వికుడు భూమకుని శాసనములు దొరికినవి. నహపాణుని తరువాతివారి నాణెములు దొరుకలేదు. నహపాణుని అల్లుడు ఉసవదతుడు కరజక గ్రామమును దానము చేసెను. ఆ గ్రామమునే గౌతమీపుత్రుడు తిరిగి భిక్షుకులకు 18 వ రాజ్యసంవత్సరమున దానము చేసెను. దీనినిబట్టి గౌతమీపుత్రుడు నహపాణుని తన 18వ రాజ్యసంవత్సరమున జయించెనని ఒకవాదము. నహపాణుడు 46 సంవత్సరమువరకు రాజ్యము చేసెను. నహపాణుడు వాడినది విక్రమ శకమని పలువురు చరిత్రకారులు భావించుచున్నారు.

విక్రమశకము క్రీ. పూ. 59 లో ఆరంభము. విక్రమశక 46 = క్రీ. పూ. 12 నహపాణ మరణము. అప్పటికి 18 సంవత్సరములనుండి గౌతమీపుత్రశతకర్ణి రాజ్యమేలుచున్నాడు. అనగా క్రీ. పూ. 30 లో అతడు సింహాసన మధిష్ఠించెను. పురాణము లతడు 21 సంవత్సరములు ఏలినట్లు చెప్పుచున్నవి. శాసనసాక్ష్యమాతడు 25 సంవత్సరము లేలినట్లున్నది. అందుచే అతడు క్రీ. పూ. 5 వ సంవత్సరమువరకు రాజ్యమేలినట్లును, పిమ్మట పులుమావి క్రీ. పూ. 5 నుండి 28 సంవత్సరములు క్రీ. శ. 24 వరకు రాజ్యమేలెను అని చెప్పవలసివచ్చును. క్రీ. శ. 130 లో వయోవృద్ధుడైన చస్తానుడు పులుమావికి సమకాలీనుడనుటలో విప్రతిపత్తి ఏర్పడును. టోలిమీ కాలమునుగూర్చి భిన్నాభిప్రాయములు గలవు.

అయినను, క్రీ. శ. 147 నాటికే టోలిమీ 40 సంవత్సరముల నుండి పరిశీలనలు జరుపుచున్న భూగోళవేత్త అని గ్రీకు ఒలింకిడోరసు ప్రవచనము. క్రీ. శ. 120 ప్రాంతమున వర్ధిల్లిన 'మరినోసు' నావికుని రచనలు తనకు ఆధారములని టోలిమీ కృతజ్ఞతతో స్మరించును. అందుచే క్రీ. శ. 5 వ సంవత్సరమునుండి 28 వర్ధిల్లిన పులుమావియు క్రీ. శ. 130 లో నున్న చస్తానుడు సమకాలీనుడగుట పొసగదు.

అంతేగాక నహపాణుని గౌతమీపుత్రుడు సంహరింపలేదని అతని తల్లి తన పుత్రుడు క్షహరాటవంశ నిరవశేషకరుడని ప్రశంసించి నదే గాని నహపాణుని పేర్కొనలేదని కొందరు వాదించుచున్నారు. మఱియు నహపాణుని నాణెములు జోగలుతంచినిధిలోనివి - గౌతమీ పుత్రునకు పునర్ముద్రణకు పూర్వము, తదనంతరము గూడ బహుళ ప్రచారములోనున్నవని నిపుణులవాదము. అందుచేత, ఈ చర్చల వలన నహపాణుని కాలముగాని గౌతమీపుత్రుని కాలముగాని విస్పష్టముగ తేలుటలేదు.

అయినను, క్రీ. శ. 130 సంవత్సరములో చస్తానుడు వయో వృద్ధుడై జీవించియున్నాడు గావున - పులుమావి గూడ ఆకాలమువాడై యుండకతప్పదు. శ్రీ గొ_ర్తి వేంకటరావుగారు వ్రాసినట్లు కొంతకాలము ఇరువదేండ్లపాటు వారిరువురు సమకాలీనులై యుండవచ్చును.

ఇక గిర్నారు శాసనము క్రీ. శ. 150 నాటిదనుట అందరు అంగీక రించినదే. అందు రుద్రదాముడు తాను రెండు మారులు శతకర్ణి ని జయించి బాంధవ్యబంధముచే విడిచిపుచ్చెనని పేర్కొనుచున్నాడు. ఆ శతకర్ణి ఎవరు? ఇదిగూడ వాదోపవాదగ్రస్తమైనను, ఆ శతకర్ణి యజ్ఞశ్రీయని శ్రీ గొ_ర్తి వెంకట్రావుగారి అభిప్రాయము. రుద్రదాముని అల్లుడు వాశిష్ఠీపుత్ర చంద్రసాతి.

## III

ఇట్లు శాతవాహన కాలనిర్ణయము బహుళవివాదగ్రస్తమైనది. అందు ముఖ్యమైన సమస్యలతో పరిశోధకులలో ఏకవాక్యత కుదుర లేదు. పుష్యమిత్రసుంగునకు ఖారవేలునకు సమకాలీనుడైన శతకర్ణి ఎవరు? మగధనాక్రమించిన శాతవాహన రాజెవ్వరు? శిముఖుడు కాదనుట స్పష్టము. నహపాణుని సంవత్సరము లే శకమునకు సంబంధించినవి?

గౌతమీపుత్రశతకర్ణి - నహపాణుడు సమకాలీనులా? పెరిప్లస్ గ్రంథము సమకాలీనుడైన నహపాణుని పేర్కొనుచున్నదా? నహపాణుని రాజ్యమును పేర్కొనినదా? నహపాణుని తరువాత తద్వంశీయులు రాజ్యము సల్పిరా? 'పెరిప్లసు' కాలమేది? గౌతమీపుత్రశతకర్ణి - అతని పుత్రుడు పులోమావి కలిసి రాజ్యము సల్పిరా? పులోమావి చస్తానుడు సమకాలీనులని పేర్కొనిన టోలిమా కాలమేది? చస్తానుడు అతని మనుమడు రుద్రదాముడు కలిసి రాజ్యము చేసిరా? పై సమస్యల నన్నింటిని బండార్కరులు - బుహ్లారు - శ్రీ నీలకంఠ శాస్త్రిగారు - రాప్సను, స్మిత్ - జయస్వాలు - హరిచరణఘోష్ - ఆర్. సి. ముజుందార్ - ఆర్. డి. బెనర్జి - డాక్టర్ మారేమండ రామారావు, శ్రీ గొర్తి వేంకట్రావు ప్రభృతులు కూలంకషముగ చర్చించి యున్నారు.

శ్రీ గొర్తి వేంకట్రావుగారు - శాతవాహన చరిత్రలోని సమస్యలపై కూలంకషచర్చ సల్పి (క్రీ. శ. 1930 లో) చేసిన సమన్వయము అనుశీలింపదగినది.

శ్రీ గొర్తి వేంకటరావుగారి కాలనిర్ణయము :—

| రాజులసంఖ్య వాయు | మత్స్య | రాజుపేరు | రాజ్యవత్సరములు వాయు | మత్స్య | అంగీకృతమైనది | కాలము క్రీ. పూ. |
|---|---|---|---|---|---|---|
| 1 | 1 | శిముక | 23 | 23 | 23 | 271-248 |
| 2 | 2 | కృష్ణ | 18 | 18 | 18 | 248-230 |
| | 3 | సాతకర్ణి I | ,, | 10 | 10 | 230-220 |
| | 4 | పూర్ణోత్సంగ | ,, | 18 | 18 | 220-202 |
| | 5 | స్కంద స్తంభి | ,, | 18 | 18 | 202-184 |
| 3 | 6 | ప్రాతకర్ణి I | | 56 | 56 | 184-128 |
| | 7 | లంబోదర | ,, | 18 | 18 | 128-110 |
| 4 | 8 | అపీలక | 12 | 12 | 12 | 110- 98 |
| | 9 | మేఘస్వాతి | | 18 | 18 | 98- 80 |
| | 10 | స్వాతి | ,, | 18 | 18 | 80- 62 |
| | 11 | స్కందస్వాతి | | 7 | 7 | 62- 55 |
| | 12 | మృగేంద్ర | | 3 | 3 | 55- 52 |
| | 13 | కుంతలస్వాతి | ,, | 8 | 8 | 52- 44 |
| | 14 | స్వాతికర్ణ | ,, | 1 | 1 | 44- 43 |
| 5 | 15 | పులోమావి 1 | 24 | 36 | 24 | 43- 19 |
| | | | | | | క్రీ. శ. |
| 6 | 16 | గౌరికృష్ణ | 25 | 25 | 25 | 19- 6 |
| | | | | | క్రీ. శ. | |
| 7 | 17 | హాల | 1 | 5 | 1 | 6- 7 |
| 8 | 18 | మండులక | 5 | 5 | 5 | 7- 12 |
| 9 | 19 | పురీంద్రసేన | 21 | 5 | 21 | 12- 33 |
| 10 | 20 | సుందరస్వాతికర్ణి | 1 | 1 | 1 | 33- 34 |
| 11 | 21 | చకోరస్వాతికర్ణి | ½ | ½ | ½ | 34- 34 |
| 12 | 22 | శివస్వాతి | 28 | 28 | 28 | 34- 62 |

| రాజులసంఖ్య |  | రాజు పేరు | రాజ్యవత్సరములు |  |  | కాలము |
|---|---|---|---|---|---|---|
| వాయు | మత్స్య |  | వాయు | మత్స్య | అంగీకృతమైనది | క్రీ. పూ. |
| 13 | 23 | గౌతమీపుత్ర సాతకర్ణి | 21 | 21 | 24 | 62– 86 |
|  | 24 | పులోమావి | ,, | 28 | 28 | 86–114 |
|  | 25 | శివశ్రీ |  | 7 | 7 | 114–121 |
|  | 26 | శివస్కంద |  | 7 | 7 | 121–128 |
|  | 27 | యజ్ఞశ్రీ | 29 | 29 | 29 | 128–157 |
|  | 28 | విజయ | 6 | 6 | 6 | 157–163 |
|  | 29 | చంద్రశ్రీ | 3 | 10 | 3 | 163–166 |
|  | 30 | పులోమావి III | 7 | 7 | 8 | 166–174 |

పై పట్టికలో వాయుపురాణమందలి రాజ్యవత్సరసంఖ్య స్వీకృతము. గౌతమీపుత్రుని విషయమున పులోమావి III విషయమున శాసనస్థసాక్ష్యము స్వీకృతము. శ్రీ గొర్తి వెంకట్రావుగారు వాయు సాక్ష్యమును మత్స్యసాక్ష్యముకంటె మేల్తరమని ఏల భావించినది సహేతుకముగ వివరింపలేదు. శ్రీ గొర్తివారి కాలనిర్ణయము బహుళ సమస్యలకు యుక్తియుక్తమైన సమన్వయము. ఏ కాలనిర్ణయమైనను, సాతకర్ణి - డెమిట్రియసు - పుష్యమిత్రసుంగ - ఖారవేలుని సమకాలీనత, సహపాణుని వత్సరములు - పెరిప్లసు సహపాణాభివర్ణన, గౌతమీపుత్రునిచే సహపాణుని నాణెముల పునర్ముద్రణ - టోలిమీ చెప్పిన చస్తాన పులోమావి సమకాలీనత, అంధేశాసనమున క్రీ. 135 నాటి చస్తానుని ప్రస్తావన, గిర్నారు రుద్రదాముని క్రీ. శ. 150 నాటి శాసనమును సమన్వయించవలసి యున్నది. శ్రీ గొర్తి వేంకటరావు గారి కాలనిర్ణయము పై సమస్యలనన్నిటిని సమన్వయించుచున్నది.

ఖారవేల దిమిత్ర పుష్యమిత్ర సమకాలీనుడైన సాతకర్ణి మత్స్య పురాణానుక్రమణికలోని 6 వ రాజుగ అంగీకరింపవచ్చును. అతని

భార్వ నాగనిక "నానాఘాట్ శాసనలిపి – ఖారవేలుని హాతిగుంఫలిపి ఒకటే యని చెప్పవచ్చును." బహ్లారు నానాఘాట్ శాసనసమయము క్రీ. పూ. 200-150 గ ప్రవచించినారు. రెండవ శతకర్ణి (మత్స్య 6 వ సంఖ్య) పుష్యమిత్రుని సమకాలీనుడనుటకు మరియొక ఊహ బలము చేకూర్చుచున్నది. అతడు రెండు అశ్వమేధములు చేసెను. మౌర్యసామ్రాజ్యపతనానంతరము ఉత్తరాపథమున అశ్వమేధయాగము చేసి పుష్యమిత్రుడు, దక్షిణాపథమున అశ్వమేధయాగముచేసి శతకర్ణి సార్వభౌమత్వము స్థాపించుకొనిరి. రాజసూయము చేసిన ఖారవేలుడు ఉభయుల సార్వభౌమత్వమును నిరసించెను. అతని మరణానంతరము ఉభయులు తిరిగి రెండు మార్లు అశ్వమేధయాగము లొనరించిరి. యథాపూర్వము తమ తమ సార్వభౌమత నిల్పుకొనిరి. రెండవ శతకర్ణి 56 సంవత్సరాలు పరిపాలించి శాతవాహనరాజ్యమును విస్తరించెను. అతని నాణెములవలన అతడు పశ్చిమమాళవదేశమును జయించినట్లు రాప్సను, కన్నింగుహాము స్థిరపరచిరి.

ఉజ్జయిని రాజధానియైన అవంతి, భిల్సా రాజధానియైన అకర రాజ్యములు, శుంగులకుగాని కణ్వులకుగాని లోబడి యుండలేదు. ఆ నాణెములపై 'రానో సిరి సాతన' అక్షరములయొక్కయు నానా ఘాట్ శిలాప్రతిమల క్రింది అక్షరములయొక్కయు సామ్యమునుబట్టి రాప్సను, రెండవ సాతకర్ణి ఆ దేశముల జయించినట్లు ప్రతిపాదించెను. అత డే సంవత్సరమున సింహాసన మధిష్ఠించినది చెప్పుటకష్టము. శిముఖుని సంతతివాడైన శతకర్ణి II పుష్యమిత్రునకు సమకాలీను డైనప్పుడు పుష్యమిత్రుని తరువాత కణ్వసుశర్మను సంహరించిన శాతవాహనుడు శిముకుడు కాజాలడు. కాణ్వవంశము నంత మొందించి మగధనాక్రమించిన శాతవాహను డెవరు?

శ్రీ గొర్తి వేంకట్రావుగారు, సుశర్మను వధించి మగధ నాక్ర మించినది పులోమావి I మత్స్యపట్టికలోని 15 వ రాజని నిరూపించి

నారు. పురాణములు ఆంధ్రులను పౌలోములు, పులోముని సంతతి వారని చెప్పుచున్నవి. 'సింధుకో ఆంధ్రజాతీయః ప్రాప్స్యతీమాం వసుంధరామ్' అనునప్పుడు లక్షణార్థమున సింధుకునకు ఆంధ్రజాతికి సంబంధించినవాడని ఔపచారికముగ అర్థము స్వీకరింపనగును. అతని పిమ్మట ఆ పేరు మరిఇద్దరకు గలదు. సుగృహీతనామధేయుడైన అతడు మగధను జయించి, శాతవాహనసామ్రాజ్యమును యావత్ భారతీయ సామ్రాజ్యస్థాయికి దెచ్చెను. క్రీ.శ. 28 వత్సరము సుశర్మ వధ గావున శాతవాహన కాలనిర్ణయమునకది తోడ్పడగలదు. వాయుపురాణాను సారము పులోమావిI 36 సంవత్సరములు వాయుపురాణానుసారము 24 సంవత్సరములు రాజ్యమేలెను. "అతడు మగధను జయించుటకు పూర్వము 15 ఏండ్లైనను పాలించియుండవలెనని" శ్రీ గొ_ర్తి వేంకట్రావు గారు ప్రతిపాదించినారు. అందుచే అతడు సింహాసన మధిష్ఠించుట క్రీ. పూ. 43 వ సంవత్సరమని నిర్దేశించినారు. అతనిముందు 14 గురు 228 సంవత్సరాలు రాజ్య మేలిరి. అందుచే శిముకుడు క్రీ. పూ. 271 లో రాజయ్యెను. అని శ్రీ వేంకట్రావుగారి వాదము. అయితే. ఇంత నిష్కర్షగ, శిముకుని రాజ్యారంభ సంవత్సరమునుగాని పులోమావి రాజ్యసంవత్సరమునుగాని నిర్ణయించుటకు వలనుపడదు. శ్రీ గొ_ర్తి వేంకట్రావుగారి నిర్దేశము యాథార్థ్యమునకు సన్నిహితముగా నుండ వచ్చునని అంగీకరించినను, అందులో వారి ఊహ ఏ కొంతమాత్రముగానైనను చేరియుండుటచే-పూర్వపక్షము లేని సిద్ధాంతముగా స్వీకరించుటకు వీలు లేకున్నది.

అయితే - శాతవాహన కాలనిర్ణయము విప్పుటకు వీలు లేని చిక్కుముడిగనేయుండునా ? అది భావి పరిశోధకులు వహింపవలసిన భారము. అయినను, లోకములో ఇన్నివాదము లున్నప్పుడు ఇంకొక్కవాదమున్న వచ్చిన నష్టము లేదు. కనుక నాబుద్ధికి తోచిన వాదమును ప్రతిపాదించుచున్నాను.

మత్స్యపురాణపట్టిక - సర్వసమగ్రముగ నున్నది. ఇంతవరకు- ఆ పట్టికలో అసంగతములు - చారిత్రక వైరుధ్యములు కన్పింపలేదు. గౌతమీపుత్ర సాతకర్ణికి మత్స్యపురాణమున 21 వత్సరముల పాలన గలదు. అతని శాసనము 24 వ సంవత్సరమునాటిది గలదు. అయితే- 21 వత్సరములపిమ్మట అతడు వానప్రస్థము స్వీకరింపగ యువరాజు పరిపాలించుచును గౌరవము చొప్పున అతని రాజ్యసంవత్సరమునే శాసనమున పేర్కొనియుండవచ్చును. వాయుపురాణముకూడ అతని పరిపాలన 21వత్సరములనియే చెప్పుచున్నది. పులోమావి 3 పట్టికలో 7, 8 వ వత్సరపు శాసనము గలదు. అయితే ఆ పట్టిక పూర్తివత్సరములనే పేర్కొనినట్లు భావింపనగును. మత్స్యపురాణకర్తకు లభించినది శాత వాహనుల అధికారపట్టిక యని విశ్వసింపనగును. మత్స్యపురాణము పులోమావి IIIకి అద్యతనభావిలో రచింపబడినట్లు పలువురు చారిత్రకులు అంగీకరించుచున్నారు. శ్రీ గొర్తి వేంకట్రావుగారుగూడ మత్స్యపురాణ కథనమునకు ప్రాధాన్యమిచ్చియు, వాయుపురాణమునందలి రాజ్య వత్సరసంఖ్యను ఎడనెడ, నిర్హేతుకముగ స్వీకరించినారు.

ఇక - ఈ ముప్పదిమంది శాతవాహనరాజులలో ఏ ఒక్కరు సింహాసన మధిష్ఠించిన వత్సరమును నిష్కర్షగ నిర్ణయింపనగుచో మత్స్యపురాణానుసారము పూర్వాపరరాజుల కాలములు నిర్ణయింప వగునని తోచుచున్నది.

గౌతమీపుత్రశతకర్ణి - శాతవాహనరాజులలో సుప్రసిద్ధుడు శకులను జయించి ఉజ్జయిని ఆక్రమించి 'విక్రమాదిత్య' బిరుదమును వహించెను. (విక్రమాదిత్యుడు) ఉజ్జయినీపాలకుడు అని ఐతిహ్యాము- అశోకునకు పిమ్మట పశ్చిమోత్తరమున శకులు విజృంభించి, యమునా తీరమువరకు రాగలిగిరి.

అలెగ్జాండరు మరణానంతరము యవనులు చంద్రగుప్త మౌర్యుని కాలమునుండియు పశ్చిమోత్తరప్రాంతమున నదివరకు

వి స్తరించియుండిరి. ఆతనికిని సెల్యూకసునకు జరిగిన సంఘర్షణ చరిత్ర ప్రసిద్ధము. గ్రీకుకన్యక చంద్రగుప్తుని వధువైనది. మెగస్థనీసు మగధ రాజధాని పాటలీపుత్రమున రాయబారి యయ్యెను. బాక్ట్రియారాజులు యూతిడెమొసు వంశీయులు అశోకుని మరణానంతరము విజృంభించిరి. మౌర్యసామ్రాజ్యములో ఉజ్జయినిని సంప్రతి, పాటలీపుత్రమును దశరథుడు, కాశ్మీరమును జలేకుడు, గాంధారమును వీరసేనుడు పరిపాలించిరి. ప్రాయశః వీరసేనుని బంధువగు సుభగసేనునితో 'అంటియోకోసు' చక్రవర్తి క్రీ. పూ. 206 ప్రాంతమున వియ్యమందెను. క్రీ. శ. 200 నుండి డెమిత్రియసు అపొల్లొడటను మీనాండరు భారతభూభాగమున అనేక విజయములు సాధించి యవనరాజ్య సంస్థాపకులైరి. ఆనాటి యవనరాజ్యమున గాంధారము, పాంచాలము సింధుముఖద్వారము, సురాష్ట్రము చేరియుండెను. అలెగ్జాండరు గూడ భారతభూభాగమున అట్టి యవనసామ్రాజ్యసంస్థాపనమును కలలో గూడ ఊహించి యుండడు. ఒకానొకప్పుడు యవనరాజ్యము యమునా నదిని చేరియుండెను. గార్గిసంహితయందలి యుగపురాణమున అతిలోలుపులైన శకులు సాకేతమును జయించి మధురనాక్రమించినట్లు చెప్పుచున్నది. పతంజలి, అద్యతనభూతమునకు ఉదాహరణముగ "యవనులు సాకేతమును ముట్టడించుచుండిరి; యవన మాధ్యమికా దేశమును ముట్టడించుచుండిరి." అని చేర్చిన వాక్యముల గరుదేరక అనుశీలించుట సాధ్యముగాదు.

యవనుల బారినుండి దేశమును రక్షించు వీరునికై దేశము ఎదురుచూచినది. శంకాసంకుచితాంతరంగుడైన బృహద్రథుడు సేనా సమీక్ష కరుగుదేర, సేనాపతి పుష్యమిత్రుడాతని వధించి, యవను లతో పోరాడి పాటలీపుత్రమును రక్షించెను. క్రీ. 185 లో రాజహంతను దేశసంరక్షకునిగ ప్రజలు అగ్గించిరి. శత్రుభీకరుడైన నాయకునికై దేశము ఎదురుచూచుచున్నది. పుష్యమిత్రుడు వీరుడై ముందుకు

వచ్చి, నాయకుడు కాగల్గెను. అంతలో యవనులలో అంతర్యుద్ధము ఆరంభమయ్యెను. యూతిడిమొసు - య్యూక్రటిడీసు వంశీయులు తలపడిరి. డిమిత్రియసు భారతభూమిని వీడి గృహోన్ముఖుడాయెను. అప్పుడు ఖారవేలుడు క్రీ. పూ. 175 లో మధురనుండి దిమిత్రుని పార ద్రోలినట్లు చెప్పుకొనెను. సింధునదీతీరమున శుంగరాజవంశీయుడు వసుమిత్రునకు యవనులకు జరిగిన పోరాటమును కాళిదాసు మాళవి కాగ్నిమిత్రమున పేర్కొనెను. పుష్యమిత్రుని యజ్ఞాశ్వము సంఘర్ష ణకు కారణము. య్యూక్రటిడీసు క్రీ. పూ. 166 లో క్రొత్తనాణెములు వేయించుటచే అవి డెమిత్రియసు మరణసూచకముగ భావింపనగును. విజృంభించుచువచ్చిన య్యూక్రటిడీసును - మీనాండరు ఎదుర్కొనెను. అంతలో మైత్రిదితుడు యుక్రటిడిసు నోడించి యుద్ధనిహతుని చేసి అతనిరాజ్యము నాక్రమించెను. కావున మీనాండరు అప్రతిహతుడై మధురనుండి గాంధారమువరకు రాజ్యమేలెను. మీనాండరు క్రీ.పూ. 145 లో మరణించెను. (పుష్యమిత్రుని మరణము క్రీ. పూ. 148)

డిమిత్రియసు తనయ మీనాండరుభార్య, అగతోక్లియబాలు డైన పుత్రుడు స్ట్రాటోపక్షమున రాజ్యభారము వహించెను. హీలియో కిల్సు - య్యూక్రటిడీసు తనయుడు- భారతభూభాగముపైకి ఎండెత్తెను. స్ట్రాటో సింధునదికి తూర్పునను చేరెను. మీనాండరు సామ్రాజ్య విచ్ఛిత్తి కది దారితీసినది. సౌరాష్ట్ర సింధురాష్ట్రములు స్వతంత్రత వహించినవి. అంతియలకిడను - హెలియోకిల్సు పుత్రుడు క్రీ. పూ. 130 ప్రాంతమున రాజయ్యెను. మగధలో అతని రాయబారి హెలియొ డొరను. పార్థియాదేశమందలి శకులు - మైత్రిదితునకు ప్రాతేను వకు అర్థబనునకు ఇంతింతనరాని తలనొప్పి కల్గించిరి. శకులు నిరంకుశులు. స్వతంత్రులు విప్లవాకప్రవర్తనతో ప్రభుత్వమునకు లొంగక విచ్చలవిడిగ విహరించిరి. రెండవ మైత్రిదితమహారాజు వారి విజృంభణ అరికట్టగల్గెను గాని, వారి మాతృదేశము పరాక్రాంత మగు

టచే -(యూచిఆక్రమించుటచే) వారికి స్థిరనివాసమేర్పరచుకొనుటకు అధినివేశరాజ్యము కావలసివచ్చెను. అందుచే వారు భారతభూమిని చేరి సింధు సౌరాష్ట్రముల నాక్రమించిరి. క్రీ. పూ. 70 నాటికి వారు మౌలెను నాయకత్వమున, జీలమ్ ప్రాంతమును జయించి, తక్షశిల, పశ్చిమపాంచాలము గాంధారము నాక్రమించిరి. ఆ సమయముననే వొనొనిను - పహ్లవనాయకుడు సీస్తను అరవోషియాలను ఆక్రమించి 'రాజాధిరాజ' బిరుదము వహించెను. అజన చక్రవర్తి మౌలెను - వొనొనిను రాజ్యముల రెంటికి ప్రభువు కాగలిగెను. అతడు మధుర వరకు రాజ్యము విస్తరించి క్రీ. పూ. 58 లో విక్రమాదిత్యనామముతో ఉజ్జయినిలో పట్టాభిషిక్తుడై విక్రమాదిత్యశకము నారంభించెనని చెప్పుదురు. అతని సామ్రాజ్యము యూఫ్రిటీసునుండి యమునవరకు విస్తరించెను.

క్రీ. పూ. 73 లో సుంగవంశము -అంతరించినది. అజనుని విస్తరణ మరికట్టువారు లేకపోయిరి. అప్పుడు స్కందస్వాతి మృగేంద్రస్వాతి శకుల నరికట్టుటకు యత్నించియుందురు. ఇది ఊహ మాత్రమే. మృగేంద్రస్వాతి 3 సంవత్సరములు మాత్రమే పరిపాలించెను. క్రీ. పూ. 57 లో స్కందస్వాతి మరణము, క్రీ. పూ. 58 లో విక్రమాదిత్య శకస్థాపనముగూడ గమనింపదగిన విశేషములు. క్రీ. పూ. 54 నుండి 46 వరకు పరిపాలించిన కుంతలసాతకర్ణి - తండ్రిమహేంద్ర సాతకర్ణికి సాయముగ శకులతో పోరాడియుండును. చివరకు క్రీ. పూ. 54-46 మధ్య అతడు విక్రమాదిత్యునిజయించి, ఉజ్జయిని నాక్రమించుటయే గాక ఆ విజయగర్వముతో దక్షిణమునయున్న కుంతలమునుగూడ జయించి సాతవాహనసామ్రాజ్యపు ఉత్తర దక్షిణావధులు విస్తరింప చేసెను. (1)

---

(1) కుంతల సాతకర్ణి ఆరంభించిన ఉద్యమము పులోమావి పూర్తిచేసెను. కుంతలుని తరువాత స్వాతికర్ణి రాజ్యమేలి

విక్రమాదిత్యశకము క్రీ. పూ. 58 నుండి అరంభము. ఆ శకమును ఆరంభించిన విక్రమాదిత్యు డెవరు? ఎవ్వరైనను క్రీ. పూ. ఉజ్జయినీ ప్రభువైన 'విక్రమాదిత్య' పౌరుషనాము డెవడో యుండియుండవలె ననుట తథ్యము. విక్రమాదిత్యుని శకారియైన శాలివాహనుడు జయించుటగూడ ఐతిహ్యము కంఠోక్తిగ చాటుచున్న అంశమే. ఆ శకారి శాలివాహనుడెవడు? అతడు కుంతలశాతకర్ణి అనుటకు నిదర్శనములున్నవి. వాత్స్యాయన కామసూత్రములలో కుంతలసాతకర్ణి భార్య మలయవతి, విక్రమాదిత్యునిభార్య మలయవతియని కథా సరిత్సాగరమున గలదు. గుణాఢ్యుని బృహత్కథ కథాసరిత్సాగరమునకు మాతృక. అందు విక్రమాదిత్యుని తండ్రిపేరు మహేంద్రాదిత్యుడు. మత్స్యపురాణ పట్టికలో కుంతలసాతకర్ణి తండ్రి మృగేంద్ర లేక మహేంద్రస్వాతి. అందుచే శకారియైన కుంతలసాతకర్ణి - ఉజ్జయినీ విక్రమాదిత్యుని జయించి విక్రమాధిత్య పౌరుషనామధేయమును ధరించినట్లు విశ్వసింపనగును.

కాళిదాసమహాకవి విక్రమాదిత్యుని ఆస్థానకవి యనుట సుప్రసిద్ధము. అతనికి ఉజ్జయినికి గల సంబంధము ఐతిహ్యము కంఠోక్తిగ

నది 1 సంవత్సరమే. ఈతడు విఫలప్రయత్నుడై మరణించెనా? ఈతని తరువాత రాజ్యమేలినది పులోమావి. కుంతలస్వాతికర్ణి సువిశాల సామ్రాజ్యమునకు వారసుడు. మగధరాజ్యమున వసుదేవుని కూలద్రోసిన దేవభూతి ఆక్రమించినది సింహాసనము గాని సామ్రాజ్యము గాదు. పులోమావి సింహాసన మధిష్ఠించిన 7 సంవత్సరాలలో సుశర్మ మగధ సింహాసన మధిష్ఠించెను. కుంతలస్వాతికర్ణి శకుల విస్తరణ నరికట్టియుండెను. ఇక మిగిలినది మగధ. మగధ పతనము నిశ్చితపూర్వము. క్రీ. పూ. 28 లో సుశర్మను వధించి పులోమావి మగధ నాక్రమించెను.

యుగయుగాంతరములు ఘోషించుచుండుటమాత్రమేగాక మాళవికాగ్ని మిత్రమును, మేఘసందేశము అనుశీలించినవారికి స్వయంవ్యక్తము కాగలదు. కాళిదాసు "మేఘుడు" దక్షిణాపథమునుండియే జంగమ ప్రణయలేఖావతార మైత్రి ప్రేమసందేశహరుడై బయలుదేరెను. మేఘుడు 'రామగిరి' నుండి బయలుదేరెను. మేఘుడు దాటని నదులు గోదావరి కృష్ణా. దాటినవి నర్మదా తపతి వింధ్య పర్వతములు. దక్షిణాపథమునుండి ఉజ్జయినికి గల మార్గమంతయు, కాళిదాసునకు అనుభవసుగమమై మేఘసందేశమున కాననగును. కాళిదాసు మేఘుని వక్రపథమైనను ఉజ్జయినికి పొమ్మని ఆదేశించును.

కాళిదాసు ఉజ్జయినినుండి ఎప్పుడు దక్షిణాపథము చేరెను ?

కాళిదాసు విక్రమోర్వశీయమున అన్యాపదేశముగా విక్రమాదిత్యునే నాయకునిగ స్వీకరించుట సాహిత్యసంప్రదాయము. అందు విక్రమాదిత్యుని రాజధాని "ప్రతిష్ఠాన" పురమని సుస్పష్టముగ చెప్పినాడు. ప్రతిష్ఠానము శాతవాహనుల రాజధాని యనుట చారిత్రక ప్రసిద్ధము. ఉజ్జయినీశకులు సంస్కృతము నాదరించిరి. కుంతల సాతకర్ణి అంతఃపురమున ప్రాకృతభాషనే వాడుచుండెనని, పిమ్మట సంస్కృతవిదుషీమణియైన రాణిమూలమున సంస్కృతమును పట్టుదలతో అభ్యసించెనని బృహత్కథారచనకు ఉపపత్తిని కల్పించు కథలో చెప్పబడినవి. 'మోదకైస్తాడయ' కథ సుప్రసిద్ధము. కుంతల సాతకర్ణి మంత్రి శర్వవర్మ, కాతంత్రవ్యాకరణము వ్రాసి ఆరునెలలలో రాజును సంస్కృతవిద్వాంసుని చేసెనని కథ. పండ్రెండేండ్లు వ్యవధి కోరిన గుణాఢ్యుడు ఓడిపోయి, భాషాత్రయమును (సంస్కృత, ప్రాకృతదేశభాషల) ఉజ్జగించి పైశాచీభాషలో బృహత్కథను వ్రాసెనని ఐతిహ్యము.

కాళిదాసు ఉజ్జయినీ నగరమునుండి ప్రతిష్ఠానమునకు విచ్చేసి, విక్రమోర్వశీయమును-మేఘసందేశమును వ్రాసెనని యెంచవచ్చును(1) కుంతల శతకర్ణి మాత్రమే గాక శకులను జయించిన విజేతయైన 'శకారి' తరువాత చరిత్రలో 'విక్రమాదిత్య' పౌరుషనామధేయము వహించెను. [ఉజ్జయిని జయించి శకులను పారద్రోలిన శకారి గుప్తచంద్రగుప్తుడు సుప్రసిద్ధుడు.]

కుంతలసాతకర్ణి తరువాత ఉజ్జయిని జయించిన 'శకారి' సుప్రసిద్ధవిజేత - గౌతమీపుత్ర సాతకర్ణి. ఆతడు శకులను జయించి ఉజ్జయిని నాక్రమించి 18 వ రాజ్యసంవత్సరమున విజయోత్సవ సూచకముగ శాలివాహనశకము నారంభించెను. పెరిప్లసు గ్రంథము నహపాణుని పేర్కొనుచున్నది. నహపాణుడు క్షహరాటవంశజుడు. ఈతని శాసనములలో చివరిది 46 వ సంవత్సరమున ఆతని మంత్రి అయముని 'జూనార్' శాసనము గలదు. ఆతని అల్లుడు ఉసవదత్తుడు ఇచ్చిన గ్రామదానమును గౌతమీపుత్రుడు 18 వ సంవత్సరమున తిరిగి దానము నల్పెను. అందుచే నహపాణుని 46 వ సంవత్సరము గౌతమీపుత్రుని 18 వ సంవత్సరమని కొందరు తలపోసినారు. కాని నహపాణుని సంవత్సర మేశకమునకు సంబంధించినది? అది శాలివాహనశకము కాదనుట అందరు అంగీకరించినదే. పెరిప్లసు క్రీ. శ. 50 నాటిది. అయినను పెరిప్లసు పేర్కొనినది, నహపాణుని రాజ్యముగాని, సజీవ నహపాణుడు గాడు. గౌతమిబలశ్రీ తన పుత్రుడు క్షహరాటవంశనిరవశేషకరుడని వర్ణించినది గాని నహపాణుని వధించినట్లు చెప్పలేదు. జోగల్‌తంబిలో దొరికిన 13720 - నహపాణుని నాణెములలో బొమ్మలు ఒకే ముఖమును సూచించవు. అందు గౌతమి పుత్రసాతకర్ణి పునర్ముద్రణ వేయించిన నాణెములు - పునర్ముద్రణకు

(1) **Kalidasa and his times** - అను నీ గ్రంథమునందు ఈ విషయము విపులముగ చర్చింపబడినది.

పూర్వము, తదనంతరముగూడ బహుళప్రచారగతములు అని అభిజ్ఞుల సాక్ష్యము. వాయుపురాణము విదిశను పాలించిన నఖపానజ, దండ ధర్మ, వంశములను పేర్కొనుచున్నది. నఖపానజుడు నహపాణుని పుత్రుడని పేరు సాక్ష్యము చెప్పుచున్నది. గౌతమీమిత్రుడు క్షహ రాటవంశమును "నిరవశేషము" చేసిన పిమ్మట నహపానజు డుండుట అసంభవము. కావున గౌతమీపుత్రుడు క్షహరాటవంశమును నిరవ శేషమొనర్చి 18 వ రాజ్యసంవత్సరమున శాతవాహనచరిత్రలో మరి యొకమారు శకారియై ఉజ్జయిని నాక్రమించి విక్రమాదిత్యబిరుదము వహించెను. సాతవాహనుల నాణెములపైగల ఉజ్జయినీముద్ర సుప్ర సిద్ధము. పట్టావళి జైనగాథలలో విక్రమాదిత్యుడు రాజ్యాభిషేకము నకు (ఉజ్జయినీ వీరాభిషేకమునకు) పూర్వము 18 సంవత్సరములు పాలించినట్లు గలదు. అందుచే గౌతమీపుత్రుని 18 వ రాజ్యసంవత్స రము = శాలివాహన శకారంభము = క్రీ. శ. 78. కావున గౌతమీ పుత్రసాతకర్ణి క్రీ. శ. 60 వ సంవత్సరమున శాతవాహన సింహాసన మధిష్ఠించెనని గణితము.

శాలివాహనశకమని యుగయుగాంతరములు పేరు నిలిచినను దానిని శకులు ఆరంభించిరనువాదము కలదు. ఇది ప్రజ్ఞావాదము. క్రీ. పూ. 58 నాటి శకమును శక విక్రమాదిత్యుడు గాని మరియే శకరాజుగాని ఆరంభించియుండవచ్చును. దానిని శకరాజు 'అజస'రాజు ఆరంభించెనని చరిత్రకారుల మతము. నిర్ణీతదినమునుండి కాలపరిగణన శకాచారమై, తరువాత శాలివాహనుడు ఆరంభించిన కాలమానమునకు శాలివాహనశక మను పేరు గల్గినది.

శాతవాహనరాజుల అధికారికపట్టికయేమత్స్యపురాణమునగలదు. గౌతమీపుత్రుని రాజ్యారంభము క్రీ. శ. 60 వ శాతవాహనుల రాజ్య కాలనిర్ణయమును మత్స్యపురాణ పట్టికప్రకారము నిర్ణింపనగును.

| | రాజు పేరు | రాజ్య సంవత్సరములు | కాలము క్రీ. పూ. |
|---|---|---|---|
| 1 | శిముక | 23 | 273 – 250 |
| 2 | కృష్ణ | 18 | 250 – 232 |
| 3 | శాతకర్ణి I | 10 | 232 – 222 |
| 4 | పూర్ణోత్సంగ | 18 | 222 – 204 |
| 5 | స్కంద స్తంభి | 18 | 204 – 186 |
| 6 | శాతకర్ణి II | 56 | 186 – 130 |
| 7 | లంబోదర | 18 | 130 – 112 |
| 8 | అపీలక | 12 | 112 – 100 |
| 9 | మేఘస్వాతి | 18 | 100 – 82 |
| 10 | స్వాతి | 18 | 82 – 64 |
| 11 | స్కంద స్వాతి | 7 | 64 – 57 |
| 12 | మృగేంద్ర | 3 | 57 – 54 |
| 13 | కుంతలస్వాతి | 8 | 54 – 46 |
| 14 | స్వాతికర్ణ | 1 | 46 – 45 |
| 15 | పులోమావి I | 36 | 45 – 9 |
| 16 | గౌరికృష్ణ | 25 | 9 – క్రీ.శ. 16 |
| 17 | హాల | 5 | క్రీ.శ. 16 – 21 |
| 18 | మండులక | 5 | 21 – 26 |
| 19 | పురిందసేన | 5 | 26 – 31 |
| 20 | సుందరస్వాతికర్ణి | 1 | 31 – 32 |
| 21 | చకోరస్వాతికర్ణ | ½ | 32 – 32 |
| 22 | శివస్వాతి | 28 | 32 – 60 |

| | రాజు పేరు | రాజ్య సంవత్సరములు | కాలము క్రీ. పూ. |
|---|---|---|---|
| 23 | గౌతమీపుత్రశాతకర్ణి (1) | 21 | 60 - 81 |
| 24 | పులోమావి II | 28 | 81 - 109 |
| 25 | శివశ్రీ | 7 | 109 - 116 |
| 26 | శివస్కంధ | 7 | 116 - 123 |
| 27 | యజ్ఞశ్రీ | 29 | 123 - 152 |
| 28 | విజయ | 6 | 152 - 158 |
| 29 | చంద్రశ్రీ | 10 | 158 - 168 |
| 30 | పులోమావి | 7 | 168 - 175 |

మార్గాంతరమున సాధించినను పై కాలనిర్ణయము శ్రీ గొ_ర్తి వేంకటరావుగారి కాలనిర్ణయమునకు చేరువగనున్నది.

పైకాలనిర్ణయమునకు టోలిమీ పేర్కొనిన చస్తాన-పులోమావి సమకాలీనత ఉపస్కారకమే. చస్తానుడు 130 సంవత్సరమున వయోవృద్ధుడు. అప్పటికి అతని మనుమడే మహాక్షాత్రపుడై యున్నాడు. చస్తానుడు గౌతమి బలశ్రీ శాసనము పులమావి 19 వ రాజ్యసంవత్స

(1) గౌతమీపుత్రుడు 21 సంవత్సరములు పరిపాలించెనని పురాణముల ఏకగ్రీవసాక్ష్యము. గౌతమిబలశ్రీని జీవసుతగా గౌతమీపుత్రుని 24 వ సంవత్సరమును పేర్కొను శాసనము గలదు. ఇది ఈ శాసనమునకు అపార్థము గల్పించినారు. ఆమె విగతపుత్రకయైన పిమ్మట - తాను జీవసుతగా చేసిన దానమును మార్పుచేసి గౌతమీపుత్రుని 24 సంవత్సరమున తిరిగి చేసిన దానమది. ఏతల్లియు తనయుడు బ్రదికియున్నప్పుడు తాను "జీవసుత" యని చెప్పుకో నవసరము లేదు. ఆమె విగతసుతయై బ్రదికిన సంగతి మరువరాదు.

రము క్రీ. శ. 100 అంతవరకు ఉజ్జయిని అతని అధీనమందుండి యుండును. లేకపోయినచో, ఆశాసనమున యథోచితమైన గౌతమీ పుత్రుని పొగడ్త, పులోమావియెడ అనౌచిత్యపూరితమైన తెగడ్తగ పరిణమించును. అందుచే చష్టానుడు క్రీ. శ. 100 తరువాత ఉజ్జయినిని జయించెనని భావింపనగును. అంతకు పూర్వముగూడ వారిరువురు సమకాలీనులు. టోలిమీ 147 నాటికే వయోవృద్ధుడు. అతని వ్రాతలకు 120 ప్రాంతపువాడైన మెరినోసు రచనలు మాతృకలు. అందుచే టోలిమీ సాక్ష్యముగూడ పై కాలనిర్ణయమునకు అనుగుణముగ నప్పుచున్నది.

పూర్వోక్తమైన శాతవాహన కాలనిర్ణయము, గౌతమీపుత్రుని ఉజ్జయినీ విజయోత్సవమునాధారముగా చేసికొని మత్స్యపురాణ పట్టిక ఆధారముగ నిర్మించినది. 'శాతవాహనచరిత్రలో ఏర్పడిన సమస్యల కన్నింటికి సమన్వయము సాధించుచున్నదని నా మనవి.

## శా త వా హ న యు గ ము

పూర్వోక్తపరిగణనము ప్రకారము, చారిత్రకసమీక్ష * శిముకుడు క్రీ. పూ. 273 లో చారిత్రక క్షితిజమున ఉదయించుచున్నాడు. అనగా అశోకుడు సింహాసన మధిష్ఠించుటకు ఒక వత్సరము ముందు. బౌద్ధగాథలు, అశోకుడు సింహాసనమధిష్ఠించుటకు పూర్వము రక్తపాతపూరితమైన వారసత్వయుద్ధమున చిక్కుకొనినట్లు చెప్పుచున్నవి. ఆ కాలమున మౌర్యసామ్రాజ్యమునకు సరిహద్దుననున్న

* బహుళ వివాదగ్రస్తమైన శాతవాహనచరిత్రలో కాలనిర్ణయము, రాజుల చరిత్రపిమ్మట సింహావలోకనప్రాయమైన సమీక్ష అవసరము. ఈ సమీక్ష పూర్వోక్తమైన నా శాతవాహన కాలనిర్ణయముపై ఆధారపడి యుండుటచే 'సమన్వయ' ప్రయత్నమిది.

శిముఖుడు ప్రాముఖ్యము వహించుట వింతగాదు. అతడు తొలుత జైనుడై పిమ్మట నిరంకుశుడై ప్రజలను పీడించుటచే పదచ్యుతుడై నట్లు జైనగాథలలో గలదు. అతని తమ్ముడు కణ్వుడు మౌర్యప్రాభవమునకులోనయి బౌద్ధమతవ్యాప్తికి తోడ్పడెను. నాసిక శాసనమున అతని మహామాత్యుడు బౌద్ధభిక్షుకులకై ఒక గుహను నిర్మించెను. కణ్వుడు పాలించిన 18 సంవత్సరములలో 14 సంవత్సరములవరకాతడు అశోకుని సమకాలీనుడు. ఉత్తరాపథమునందలి రాజ్యతంత్ర ప్రభావము దక్షిణాపథమున సుస్పష్టముగ ప్రతిఫలించినది. శాతవాహనయుగమున నిర్మితమైన గుహాపరంపరలో అది మొదటిది. "ఆ గుహ కట్టినది శాతవాహనులేయైనను ఒరవడి పెట్టినది అశోకుడే"(1)

అశోకుని అనంతరము మౌర్యసామ్రాజ్యము క్షీణింప నారంభించినప్పుడు యవనులు విజృంభించుట కారంభించిరి. ఆ విషయము పూర్వోక్తము. మౌర్యసామ్రాజ్యము విచ్ఛిత్తి కాగానే పుష్యమిత్రునకు సమకాలీనుడైన రెండవ శతకర్ణి రెండు అశ్వమేధములు సలిపి, దక్షిణాపథపతి యయ్యెను. మౌర్యసామ్రాజ్యమును ఆ నాడు పంచుకొనినది పశ్చిమోత్తరమున యవనులు - కళింగమున ఖారవేలుడు - మగధలో సుంగులు - దక్షిణమున శాతవాహనులు. రెండవ సాతకర్ణి ఉత్తరాపథమందలి మాళవరాజ్యమును జయించెను. అతని శాసనము సాంచీతోరణమున గలదు. కాని ఉజ్జయినీరాజ్యము అయిదు శతాబ్దులలో చాలసారులు చేతులు మారినది. భాగభద్రుని 14 వ సంవత్సరమున గ్రీకురాయబారి హెలియొడారసు, వాసుదేవుని విజయస్తంభమును పేర్కొనుచు వేసిన బెస్‌నగర శాసనము (భిల్సా సమీపమున) గలదు. భాగభద్రుడు - సుంగరాజు క్రీ. పూ. 115 నుండి 83 వరకు రాజ్యము

(1) "The cave is Asokan inspiration and Satavahana in execution" Sri G. V. Rao. Early History - Deccan 114 Page Vol I.

సల్పెను. అందుచే ఆతని విదిశావిజయము క్రీ. పూ. 100 నాటిది. ఆ సంవత్సరమే అపీలకుని రాజ్యాంతము. అపీలకుని మరణము-వాసుదేవుని విదిశావిజయము ఏకకాలికములు. ఆ కాలమున ఉత్తర ప్రదేశముల శాతవాహనులు కోల్పోయియుందురు. అపీలకుని తరువాత కుంతలసాతకర్ణి వరకు శాతవాహనులు సాధించినది లేదు. కుంతల సాతకర్ణి అటు ఉజ్జయినినుండి ఇటు కుంతలమువరకు సామ్రాజ్యము వేలి శకారియై విక్రమాదిత్యబిరుదాంకితు డయ్యెను. ఆతని ఆస్థానమున కొంతకాలము కాళిదాసమహాకవి వర్ధిల్లెను. అతని తరువాత 25 వత్సరములో సింహాసన మధిష్ఠించిన పులోమావి సుశర్మను వధించి మగధను క్రీ. పూ. 28 లో ఆక్రమించెను. ఆంధ్ర – మగధ రాజమార్గములో ఉజ్జయిని గలదు. ఉజ్జయినివరకు కుంతలశతకర్ణి జయించియుండెను. పులోమావి కర్తవ్యము సుకరమైనది. కాని పులోమావి మరణానంతరము గౌరికృష్ణుడా రాజ్యమును నిలుపుకోలేదు. ఆతనిని పురాణములు తిట్టిపోసినవి. ఆతనిగూర్చి పురాణములోని రిక్తవర్గ, వికృష్ణ, అరిష్టకర్మ, అనిష్టకర్మ ప్రయోగములు అర్థవంతములు. ఆ కాలమున నహపాణుడు విజృంభించి ఉత్తరమున మాళవ బారుకచ్ఛ ప్రదేశముల పెద్దరాజ్యమును విస్తరింపజేసెను. గౌరకృష్ణుని పిమ్మట, వచ్చిన హాలుడు సాహిత్యప్రియుడు. గౌతమీపుత్రుడు క్రీ. శ. 60 లో సింహాసనమధిష్ఠించువరకు క్షత్రప క్షహరాటు విజృంభణ చెల్లినది. ఉజ్జయిని జయించి, శకారియై విక్రమాదిత్యబిరుదము వహించి గౌతమీపుత్రుడు శాతవాహనసామ్రాజ్యమును పునరుద్ధరించెను. ఆతనికి కాలముగూడ కలిసివచ్చినది. శకపహ్లావరాజ్యములలో చీలిక లేర్పడినవి. గొండొఫార్నిసు క్రీ. శ. 45 పిమ్మట మరణించెను. ఆతని తరువాత రాజు పచోరిసు కాలమున శకపహ్లావ సామ్రాజ్యము విచ్ఛిన్నమైనది. పెరిప్లసులో శకపహ్లావులు సతతము అన్యోన్య కలహములతో ఆధిపత్యము కొరకు పోరాడుచుండిరని కలదు. కుషాణప్రభువు

'ఖాడఫైసేసు' గాంధారమును జయించెను. అతని తక్షశిలశాసనము క్రీ. శ. 78 నాటిది ఆతనిని రాజాధిరాజుగ అభివర్ణించుచున్నది. అదే సంవత్సరమున గౌతమీపుత్రుడు ఉజ్జయినిని జయించి వీరాభిషిక్తుడై నూతన శకమునారంభించుట కేవలము యాదృచ్ఛికము కాజాలదు. ఆదండయాత్రకు ముందాతడు యుద్ధసన్నద్ధుడై చేసిన విశ్వప్రయత్నము అతని శాసనములలో అనుశీలింపదగినది.

పులోమావి గౌతమీపుత్రుని సామ్రాజ్యమునకు వారసుడయ్యెను. కాని క్రీ.శ.135నాటికి ఉజ్జయిని పాలకుడుగా తిరిగి చస్తానుడు సాక్షాత్కరించుచున్నాడు. క్రీ. శ. 100 ప్రాంతమున చస్తానుడు ఉజ్జయినిని జయించెను. అమరావతి ధరణికోటలో గల పులుమావి శాసనములబట్టి ఆతనిదృష్టి ఉత్తరమునుండి దక్షిణమునకు మరలినట్లు ఊహింపనగును.

శాతవాహనులు సులభముగా పశ్చిమోత్తరరాజ్యముల వీడలేదు. యజ్ఞశ్రీ కాన్హేరిశాసనము ఆతని 16 వ సంవత్సరమునాటిది. క్రీ. 145 ప్రాంతమున అతని రుద్రదాముడు జయించియుండును. క్రీ. శ. 150 లో గిర్నారుశాసనము. యజ్ఞశ్రీ పిమ్మట శాతవాహనులు ఆంధ్ర దేశమాత్రపాలకులైరి.

## ఖా ర వే లు డు; క ళిం గ దే శ ము

దక్షిణభారతద్వీపకల్పమున ప్రాచీనదేశములలో కళింగదేశమొకటి. గోదావరీముఖమునకు ఉత్తరమున మహానదీముఖమువరకు సముద్రతీరమునందలి దేశము ప్రాచీనకళింగము. కళింగాధిపతి మహాభారతయుద్ధమున పాల్గొనినాడు. కాని మహాభారత రామాయణములలో ప్రక్షిప్తములు అనేకములు. భారతము ఆదిమస్వరూపముగాని వీతత్కాలముగాని నిర్ణయించుట సులభసాధ్యము గాదు,

బింబిసారుని కాలమున కళింగదేశము మౌర్యసామ్రాజ్యమున చేరినది. కాని అనతికాలములో స్వాతంత్ర్యము సంపాదించియుండును. అశోకుని కాలమున తిరిగి ఘోరయుద్ధ ఫలితముగ మౌర్యసామ్రాజ్యమున కనుబంధ మయ్యెను. కాని అశోకుని కళింగదండయాత్ర కళింగచరిత్రను మార్చినను మార్చకపోయినను, ప్రపంచచరిత్రను మార్చివైచినది. రక్తవాహినీసిక్తమైన కళింగసంగ్రామరంగమును జూచిన అశోకచక్రవర్తి హృదయమున కల్గిన పరిణామముకంటె ప్రపంచచరిత్రలో మహోజ్వలమైన పరిణామము బౌద్ధమతసంస్కృతి రూపమున వెల్లివిరిసినది. అశోకుని చక్రవర్తిత్వము కళింగదేశమునకు దక్కినది. విశ్వమునకు బుద్ధభగవానుని ధర్మచక్రవర్తిత్వము లభించినది.

మౌర్యసామ్రాజ్య పతనానంతరము కళింగదేశము స్వతంత్రమైనది. స్వతంత్రకళింగదేశమును పరిపాలించిన ఖారవేలుని హాతిగుంఫ శిలాశాసనము ప్రాచీన కళింగచరిత్రకేకాక, అద్యతన చారిత్రక పరిశోధనలకు జయస్తంభము.

ఈ శిలాశాసనము జైనమతానుగుణముగ, అర్హతులకు సిద్ధులకు నమోవాకములతో ఆరంభించుచున్నది. ఖారవేలుడు 15 వ ఏట యౌవరాజ్యపట్టాభిషేకము నందెను. 24 వ సంవత్సరాంతమున మహారాజాభిషేకము నందెను. అతని వంశనామములు, ఐర, మహామేఘవాహన. 1వ సంవత్సరము కళింగరాజధానీ నగరప్రాకారములను (గాలివానచే శిథిలములయిన) బాగు చేయించెను. తటాకములను, ఉద్యానవనములను నిర్మించెను. పంచత్రింశచ్ఛతసహస్రప్రకృతి జనముల రంజింపచేసెను. ద్వితీయసంవత్సరమున, పశ్చిమాధిపతియైన శతకర్ణిని గురించి ఆలోచింపకుండ, సేనలతో కృష్ణవేణీనదివరకు దండెత్తి మూషిక నగరమును నాశనము చేసెను. తృతీయసంవత్సరమున గంధర్వవేద నృత్యగీతములతో రాజధానిలో ఉత్సవములతో గడపెను;

చతుర్థ సంవత్సరమున కళింగరాజభవనమును విద్యాధరాధివాసమును పునర్నించెను.

నర్వరాష్ట్రికభోజకులను పాదావనతుల సల్పెను. పంచమ సంవత్సరమున 300 సంవత్సరములకు పూర్వము నందరాజకాలమున త్రవ్విన కాలువను తిరిగి ప్రతిష్ఠించెను. షష్ఠసంవత్సరమున రాజసూయ యాగమును సల్పెను. పౌరజానపద సంఘములకు అనేకాభ్యుదయ ములు ప్రసాదించెను. సప్తమసంవత్సరమున గృహిణి కుమారుని కన్నది. అష్టమసంవత్సరమున మహావాహినితో గోరథగిరిని ముట్టడించి రాజగృహమును పీడించెను. సేనావాహినితోవచ్చిన అతనిని ఎదుర్కొనక యవనరాజు డిమితి మధురను విడిచి మరలిపోయెను. నవమ సంవత్స రమున బ్రాహ్మణులకు సువర్ణరత్న కల్పవృక్షములను దానము చేసెను. ప్రాచీనదీతీరముల విజయప్రాసాదమును కట్టించెను. దశమ వర్షమున భారతవర్షమునకు మహాప్రస్థానమను దండయాత్రకు వెడలెను. పృథోదకదర్భ యను పట్టణములో 1300 సంవత్సరములకు పూర్వము ప్రతిష్ఠాపితమైన కేతుభద్రుని దారుప్రతిమను ఊరేగించెను. ఏకాదశ వర్షమున, పిథుందనగరమును గార్ధభములచే దున్నించెను. 113 సంవత్సరములనుండియున్న ద్రవిడరాజ్యసమ్మేళనము నంత మొందించెను.

ద్వాదశ సంవత్సరమున ఉత్తరాపథ రాజులు భయపడునట్లు, మగధరాజు బృహస్పతి మిత్రుని పాదాక్రాంతుని జేసెను. నందరాజులు తీసికొనిపోయిన కళింగజిన విగ్రహమును తిరిగి తీసికొనివచ్చెను. మగధరాజ్యసంపదను కొల్లగొట్టెను. తన మత్తేభముతో సుగాంగేయ రాజ ప్రాసాదమును ప్రవేశించెను. పాండ్యదేశరాజునుండి అనేక మణిరత్నరాసులను హస్తి నౌకలను కప్పము గొనెను.

త్రయోదశ సంవత్సరమున కుమారీపర్వతమున శ్రామణులకు భిక్షుకులకు గుహలను నిర్మించెను. (ఖారవేలుడు ఇందు భిక్షురాజు,

క్షేమరాజు. కళింగచక్రవర్తి, ధర్మరాజు, రాజర్షివంశీయుడు సర్వ మతములను గౌరవించువాడు.) శ్వేతాంబరులకు చీనాంశుకముల నిచ్చెను.

పోయిన 64 శాఖలుగల చతుర్వర్గములు గల అంగసప్తికను పునఃప్రతిష్ఠించెను.

## శా త క ర్ణి

ఈ శిలాశాసనమున ఖారవేలుడు, శాతకర్ణిని గణింపక కృష్ణవేణీ నదీతీరమువరకు దండయాత్ర సల్పెను. మూషికనగరమును నాశనము చేసెను. పశ్చిమముననున్న ఈ శాతకర్ణి శాలివాహనచక్రవర్తి అని చెప్పవచ్చును - ఖారవేలుని శాతకర్ణి ప్రశంసనుబట్టి అతడు మహాబల సంపన్నుడని తోచుచున్నది. మగధరాజ్యమును జయించినాడు. ఉత్తరాపథమును దిగ్విజయము సల్పినాడు. కాని శాతకర్ణిని ప్రత్యక్షముగ జయించినట్లు చెప్పుకొనలేదు. దీనినిబట్టి నానాఘాట్ శిలాశాసనములో "అప్రతిహతచక్రు"ని రాణి నాగనిక పేర్కొనిన శాతకర్ణి II యేయై యుండును. పురాణములుగూడ ఇతనిని మహాన్ మహాశాతకర్ణి యని పేర్కొనుచున్నవి. శాతకర్ణి అశ్వమేధయాగమును రెండు సారులు సల్పెను. ఖారవేలుడు శాతకర్ణి ప్రథమాశ్వమేధయాగము తరువాత అతనిని లెక్కచేయక కృష్ణవేణీనదీతీరమువరకు దండయాత్ర వెళ్ళెను. కావున ఖారవేలుని అనంతరము, శాతకర్ణి దక్షిణాపథమున అప్రతిహతచక్రవర్తిత్వమును పునఃప్రతిష్ఠించుకొనుటకు ద్వితీయాశ్వమేధయాగము సల్పియుండును.

## బృ హ స్ప తి మి త్ర

ఖారవేలుని సమకాలికుడు మగధరాజు బృహస్పతిమిత్రుడు. బృహస్పతిమిత్రుని నాణెములు అగ్నిమిత్రునికి ప్రాచీనములు. బృహస్పతికి అధిష్ఠానసక్షత్రము పుష్యనక్షత్రము. కావున బృహస్పతి

మిత్రుడే పుష్యమిత్రుడు. ఖారవేలుడు గోరథగిరిని ముట్టడించి రాజగృహమును పీడించెను. గోరథగిరి మౌర్యసామ్రాజ్యమున కేంద్ర సేనాశిబిరము. మగధరాజ్యముపై దండయాత్రకు పూర్వరంగముగ ఖారవేలుడు గోరథగిరిని ముట్టడించి కొంతనష్టము కల్గించియుండును. కాని, ఆ దండయాత్ర జయప్రదముకాలేదు. ఆ సమయముననే యవనరాజు డెమిట్రియసు మథురవరకు వచ్చి, మరలిపోయెను. కాని ఖారవేలుడు తిరిగి నాలుగు సంవత్సరములలో మగధపై దండెత్తెను. మగధరాజు బృహస్పతిమిత్రుడు పాదాక్రాంతుడయ్యెను. మగధరాజ్య సంపదను, నందరాజులు కొనిపోయిన కళింగజిన విగ్రహమును తిరిగి తీసికొనివచ్చెను. దీనినిబట్టి నందరాజ్యకాలములోకూడ కళింగ మగధ రాజ్యమున కలిసియుండెనని తెలియుచున్నది. ఖారవేలుడు సుప్రసిద్ధమైన సుగాంగేయరాజప్రసాదమును తన మత్తేభముతో ప్రవేశించెను.

అయోధ్యశిలాశాసనము పుష్యమిత్రుని ద్వితీయాశ్వమేధయాగమును పేర్కొనుచున్నది. ఖారవేలునిచేగల్గిన అపజయమును మాపుకొనుటకు, ఖారవేలుని మరణానంతరము శాతకర్ణి వలె తిరిగి రెండవ అశ్వమేధయాగమును సల్పియుండును. అశ్వమేధయాగము చక్రవర్తిత్వచిహ్నము.

భారతదేశమును మౌర్యసామ్రాజ్యము ఏకచ్ఛత్రాధిపత్యముగ పరిపాలించినది. ఆ సామ్రాజ్యపతనానంతరము బృహ ద్భా ర త చక్రవర్తిత్వమునకు నల్గురు పోరాడిరి.

౧ మౌర్యసామ్రాజ్యము నాక్రమించిన పుష్యమిత్రుడు.
౨ శాతవాహనసామ్రాజ్యమును పాలించిన దక్షిణాధిపతి అప్రతిహతచక్ర వీరశూరశతకర్ణి.
౩ మథురవరకు దండెత్తివచ్చిన గ్రీకురాజు డెమిట్రియసు.
౪ అందరిని తిరస్కరించి దిగ్విజయము సల్పిన కళింగచక్రవర్తి ఖారవేలుడు.

## డెమిత్రియసు

ఖారవేలుని శిలాశాసనము యవనరాజు డెమిత్రియసును పేర్కొనుచున్నది. గర్గసంహితలో యవనులు సాకేతమును ముట్టడించి మధుర, పాంచాల, సాకేతములను జయించి పాటలీపుత్రముపై దండెత్తుచున్నట్లు గలదు. పతంజలి వ్యాకరణభాష్యమును వ్రాయుచున్నప్పుడు మగధరాజు యజ్ఞమును ముగింపలేదు. ఖారవేలుడు ఉత్తరాపథమున నున్నప్పుడు, డెమిత్రియసు - గర్గసంహితలోని దక్షమిత్రుడు - మధురనుజయించి సాకేతమువరకు దండయాత్ర నల్పుచుండి యుండవలెను. ఖారవేలుని దండయాత్ర విని, డెమిత్రియసు మధురను వీడి మరలిపోయెను. ఖారవేలుడు డెమిత్రియసును జయించినట్లు చెప్పుకోలేదు. బాక్ట్రియను చరిత్రలో కూడ డెమిత్రియసు స్వదేశమునకు - తన ప్రత్యర్థియైన యూక్రిటైడీసును ఎదుర్కొనుటకు మరలిపోవు ప్రస్తావన గలదు. (1) ఈ విషయము ఖారవేలుని శిలాశాసనకథనముతో తూచినట్లు సరిపోవుచున్నది. బాక్ట్రియను చరిత్రలో డెమిత్రియసు స్వదేశమునకు మరలివచ్చుట క్రీ. పూ. 175 ప్రాంతమని నిర్దేశము. అది ఖారవేలుని 8 వ రాజ్యసంవత్సరము కావున, ఖారవేలుని ప్రథమరాజ్యసంవత్సరము క్రీ. పూ. 183 ప్రాంతమై యుండును. (2) ఇతని కాలమును నిర్ణయించుటకు వేరొకఆధారము పుష్యమిత్రుని కాలము. (3)

---

(1. **Encyclopaedia Britanica IX 88 p**

(2) ఖారవేలుని కాలమును నిర్ణయించుటకు వేరు ఆధారములు లేవు. ఒకానొకసమయమున నందరాజ్యశకము ఈ శిలాశాసనములో నున్నదని తలచిరి. కాని, తరువాత అది మృగతృష్ణ యని తేలినది.

(3) **Jayaswal J. B. ORS.**

క్రీ. పూ. 236 అశోకచక్రవర్తి మరణము
236 కుణాలుడు సింహాసన మధిష్ఠించుట
228 దశరథుడు
220 సంప్రతి
211 సాలీశుక
195 బృహద్రథ
188 బృహద్రథుని పుష్యమిత్రుడు సంహరించుట. పుష్యమిత్రుడు సింహాసన మధిష్ఠించుట.

దీనినిబట్టి ఈ శిలాశాసనమునకు సంబంధించిన చారిత్రక సన్నివేశముల కాలనిర్ణయము సల్పవచ్చును.

క్రీ. పూ. 207 ఖారవేలుని జననము
192 యౌవరాజ్యాభిషేకము
188 పుష్యమిత్రుడు మగధసింహాసన మాక్రమించుట.
183 ఖారవేలుడు సింహాసన మధిష్ఠించుట.
182 శాతకర్ణి పశ్చిమమున రాజ్యము సల్పుట.
193 రాష్ట్రికభోజకులపై ఖారవేలుని దండయాత్ర
177 రాజ్యాభిషేకము, రాజసూయము.
175 గోరథగిరి ముట్టడి. యువరాజు డెమిట్రియను మధురను వీడుట. పుష్యమిత్రుని ప్రథమాశ్వమేధము
173 భారతవర్ష దండయాత్ర
172 జైనగ్రంథ సంపాదన
171 పుష్యమిత్రుని జయించుట. సుగాంగేయ ప్రాసాద ప్రవేశము.
170 కుమారగిరిపై గుహారామములు.

క్రీ. పూ. 173 లో ఉత్తరదేశమునుండి ఖారవేలుడు కళింగదేశమునకు మరలివచ్చి తిరిగి క్రీ. పూ. 171 లో బృహస్పతిమిత్రుని

జయించెను. కావున మహావాహినులను ఖారవేలుడు అంత శీఘ్రముగ నడుపుటకు ఆ రోజులలో భారతదేశమునందు రాచబాటలుండి యుండవలెను. ఆ ప్రాచీనకాలమున ఖారవేలుని సేనల శీఘ్రగమనము నవీనులగూడ నాశ్చర్యపరవశుల చేయనగును.

## ద్రవిడ దండయాత్ర

ఏకాదశవర్షమున, ఖారవేలుడు పితుంధనగరమును నాశనము చేసెను. 113 సంవత్సరముల నుండియునున్న ద్రవిడరాజ్యసమ్మేళనము నంతమొందించెను. కావున పితుంధనగరము ద్రవిడదేశమున దక్షిణమున నుండునని గోపాలాచార్యులుగారి అభిప్రాయము. 12 వ వర్షమున పాండ్యరాజు నుండి కాంచనరత్నరాశులతోపాటు హస్తి నౌకలను బహుమానముగ పొందెను - కావున, పితుంధ పాండ్య దేశమునకు దగ్గరగా తూర్పున నుండి యుండును. ఐలియను తామ్రపర్ణి ద్వీపమునుగురించి వ్రాయుచు,

"ఈ ఏనుగులు భారతద్వీపకల్పములోని ఏనుగులకంటె పెద్దవి. తెలివి గలవి. ద్వీపములో అరణ్యములలో దొరకు దారువులచే నావలను గట్టి ఈ ఏనుగులను ఎగుమతి చేయుదురు. అవి అక్కడ నుండి కళింగ రాజునకు చేరును." అని వ్రాసినాడు. ఇది మెగస్థనీసునుండి సంగ్రహించిన యెడల ఈ ఏనుగులు కళింగమునకు చేరు ఆచారము చాలకాలమునుండి యుండును. ఏనుగులు ఆనాటి యుద్ధతంత్రమున మిక్కిలి ప్రాముఖ్యము వహించినవి.

## ప్రాచీన దక్షిణ భారత ద్వీపకల్పము
## సంఘవృత్తములు
## (క్రీ. పూ. 3 వ శతాబ్దినుండి క్రీ. శ. 3 వ శతాబ్ది మధ్యమువఱకు)
## రాజ్యతంత్రము

ప్రాచీనకాలమున రాజ్యతంత్రమున రాజు సర్వాధికారి. రాజ్యాధికారము 'కులపురుషపరంపరాగతము'. రాజు 25 వ సంవత్సరమున

కాని పట్టాభిషిక్తుడుకాడు. 15వ సంవత్సరమున యౌవరాజ్యపట్టాభిషేకము జరుగును. (1) రాజాచారములు ధర్మశాస్త్రవిహితములు. రాజు బౌద్ధుడైనను, జైనుడైనను, ఆర్షమతస్థుడైనను ధర్మవిహితమైన ఈ కర్మకాండ సమానముగనే వర్తించును. రాజు బహుభార్యాపరుడైనను, రాజ్యమునకు వారసత్వయుద్ధములు ఆనాడు కన్పింపవు. యౌవరాజ్యపట్టాభిషేకము ఇట్టి వివాదముల నరికట్టినది. రాజు బాలుడైన తల్లి కుమారుని పేర రాజ్యమును శాసించును. (2)

పురుషార్థనిర్వహణమునకు యథోచితావకాశములను ప్రజలకు కల్పింపవలసిన భారము రాజుమీద నున్నది. ప్రజలను కన్నబిడ్డలవలె పాలింపవలెను. పన్నులను యథాశాస్త్రముగనే విధింపవలెను. పక్షపాతము ఏ మాత్రము కూడదు. (3) ప్రజలను సంతోషపెట్టుటయే రాజు పరమావధి. ఖారవేలుడు 35,000 ప్రకృతిని రంజింపజేసినట్లు పొగడుకొనెను. (4) రాజునకు అమాత్యవర్గ ముండెడిది. అందు కొందఱు విశ్వాసామాత్యులు. (5) రాణులు రాజమాతలు శిలాశాసనములలో కన్పించుచున్నారు. కాని రాజ్యతంత్రమున వీరెంత అధికారము నిర్వహించిరో చెప్పుట కష్టము. రాణి నాయనిక, గౌతమీ బాలశ్రీ రాజ్యాధికారమును వహించినారు.

---

(1) ఖారవేలుని శిలాశాసనము. కళింగదేశము. అశోకుని పట్టాభిషేకము అతడు రాజ్యమునకు వచ్చిన 4 సంవత్సరముల వరకు జరుగలేదు.

(2) గౌతమి; నాయనిక.

(3) **E, Vol VII 1, 61, 62**

(4) కళింగదేశము —

(5) కానేరి ; **No. 11 ASW, Vol V**

## రా జ ప్ర తి ని ధు లు

రాజవంశమునకు చెందిన రాజకుమారులను పాలితదేశముల పరిపాలనకై వినియోగించుట ప్రాచీనాచారము. కొల్హాపూరులో 'గౌతమీపుత్ర విలివాయకుర' అను నామముగల నాణెములు దొరికినవి. ఈ 'గౌతమీపుత్ర విలివాయకుర'ను గౌతమీపుత్రశాతకర్ణికి అభేదము కల్పించుటకు వీలు లేదు. (6) ఇతడు గౌతమిపుత్రుడు గనుక గౌతమీపుత్ర శాతకర్ణికి తమ్ముడై కొల్హాపూరుప్రాంతమున రాజప్రతినిధియై పరిపాలించినాడని కొందరి యూహ. శాతవాహన రాజ్యము కొల్హాపూరుకు దక్షిణముననున్న వైజయంతి వరకు ఆనాడు వ్యాపించినది. వీరు స్వయముగ నాణెములను ముద్రించి పరిమితస్వాతంత్ర్యము గల్గిన మండలాధిపతులు. రాప్సను 'ఉజ్జయిని చిహ్నము అర్వాచీన శాతవాహనుల నాణెములపై గనుపించుచున్నది గాని విలివాయకుర నాణెములపై లేదని వచించిరి. విలివాయకుర నాణెములపై ధనుస్తూణీరములు చిహ్నములు.

అర్వాచీనశాతవాహనుల ఉజ్జయిని చిహ్నము, వారు ఉజ్జయినిని జయించుటను సూచించుచున్నది. ఆ చిహ్నము సామ్రాజ్యములోని నాణెములన్నిటిమీద నుండనక్కరలేదు. రాజులు మారినను నాణెముల స్వరూపము మారకపోవుట ప్రాచీనాచారము. రాజప్రతినిధి లేక సామంతులైన మహారథులుకూడ అక్కడక్కడ స్వతంత్రముగ నాణెములను ముద్రించిరి.

## సా మ ం తు లు

రాజ్యతంత్రమును అధికారపరంపర నిర్వహించుచుండిరి. అనేక సామంతదండనాథు లుండెడివారు. మహారథులు, మహాభోజులు అను వారు ఉన్నతోద్యోగులు. మహాసామంత, మహాసేనాపతి, మహాదండనాయక పదవులు ఇట్టివే. ఖారవేలుడు రాష్ట్రికులను భోజులను

(6) గోపా 60 p.

జయించెను. వీరు శాతవాహన సామంతులని ఆ శాసనములో సూచన గలదు. (7) అశోకుని శాసనములలో రథికులు భోజకులు కన్పించు చున్నారు. వీరు ప్రాంతీయ పరిపాలకులు. నానాఘాటుకుడ్యప్రతిమ లలో మహారథి త్రనకయిరో ప్రతిమ రాజు రాణి యువరాజు తరువాత రాజకుమారులకు ముందు గలదు. దీనినిబట్టి వీరి అధికార పదవిని నిరూపింపవచ్చును. శాతవాహనరాజులు మహారథుల పుత్రికలను వివాహము చేసికొన్నారు. వీరు మౌర్యసామ్రాజ్యకాలమున రథికులై స్వతంత్ర శాతవాహనసామ్రాజ్యస్థాపనకు తోడ్పడియుందురు. కావున శాతవాహనసామ్రాజ్యములో ఈ రథికులు మహారథులుగా, భోజకులు మహాభోజులుగా కన్పించుచున్నారు. శాతవాహనచక్రవర్తులు అధికార బంధమును ప్రగాఢవివాహసూత్రములచే బిగించినారు. ఈ మహారథి, మహాభోజనాయకులు వంశపారంపర్యముగ వచ్చుటచేత వీరిని సామంతరాజులుగ పరిగణింపవచ్చును. ఒక శిలాశాసనములో "మహాభోజి" - సాదగేరీ విజయాకంద పాలితుడను కుమారునితో కనిపించు చున్నది. కావున, శాతవాహనరాణులవలె, రాజ్యాంగమున మహాభోజి రాణులుగూడ అధికారమును పుత్రులతో గలసి నిర్వహించిరి. మహారథులు అమాత్యులకంటె ఉన్నతశ్రేణిలోని పాలకులు. వీరు సామంతులనుటకు ప్రబలాధారములు గలవు. వారు శాతవాహనచక్రవర్తి రాజ్యసంవత్సరములలో, స్వతంత్రముగ గ్రామములను దానమొసంగిరి. కాని, అమాత్యులు రాజాజ్ఞానుసారము దానములను నిర్వహించిరి.

## మ హా సే నా ప తి

వాసిష్ఠీపుత్ర సామిసిరిపులమావి 22వ సంవత్సరమున ఒక నాసిక శిలాశాసనము మహాసేనాపతిని పేర్కొనుచున్నది. ఒక శిలాశాసనములో మహాసేనాపతి శాసనపత్రమును లిఖించినట్లు గలదు.

(7) ఖారవేలుని శిలాశాసనము.

రాజ్యము 'ఆహార'ములుగ విభక్తమయ్యెను. గోవర్ధనాహార, సోపారహార, మామలాహార, శాతవాహనీహార ఉదాహరణములు. ఆహారములకు అమాత్యులు అధికారులు. ఇది వంశక్రమానుగతమైన పదవిగాదు. హాలునిస ప్తశతి గ్రామాధికారులను గ్రామికులను పేర్కొనుచున్నది. పులుమావి జంగ్లిగుండు శాసనములో గ్రామికుడు కన్పించుచున్నాడు.

ఇంకను, మహాతారకులు, మహాఆర్యకులు, భాండాగారికులు, హిరణ్యకులు, మహామాత్యులు, మహామాత్రులు, నిబంధికారులు, ప్రతీహారులు, దూతకులు, మహాతారకులు, అంతఃపురదౌవారికులు, మహాఆర్యకులు, బౌద్ధవిహారాధికారులు కన్పించుచున్నారు.

అల్లూరులో ఒక శిలాశాసనము సమష్టిదానమును పేర్కొనుచున్నది. దాతలలో ఒక రాజు గలడు. రాజనామమును పేర్కొనలేదు. ఈ దానశాసనములు పేర్కొనిన దానకర్తలలో మహాతలవారును ఆతని భార్య, మనుమడు కన్పించుచున్నారు. ఇందుగల దానములలో ఒక విహారము వేటరకుధి – పొలిమేరలలో కొన్ని నివర్తనముల భూమి, పాపికల అవధులలో కొన్ని నివర్తనముల భూమి, 500 గోవులు 64 బండ్లు 140 సేవకులు, కొన్ని పాత్రలు, 2 ఇత్తడి గంగాళములు 4 ఇత్తడిబిందెలు, దీపస్తంభములు, అతరగిరి సమీపమున ఒక తటాకము 1000 పురాణ కాహాపణములు శాశ్వతధర్మముగ 52 నివర్తనముల భూమి తలవారుకుటుంబ మిచ్చినది. (8)

## సంఘస్వరూపము

దక్షిణభారతద్వీపకల్పములోని ప్రాచీనసంఘ స్వరూపము అమరావతీ భట్టిప్రోలు స్తూపశిథిలావశేషములలో శిలాశాసనములలో బౌద్ధశిల్పములలో దిఙ్మాత్రముగ ప్రతిబింబించుచున్నది. ప్రాచీనసంఘ

(8) గోపాలాచారి.

చిత్రము ఖండఖండములుగ శిథిలస్థూపములలో, జీర్ణ విహారములలో ప్రాచీనశిల్పఖండములలో, పూడిపోయిన మట్టిదిబ్బలలో, విరిగిపోయిన ప్రతిమలలో, చెరిగిపోయిన అక్షరములలో లభించుచున్నవి. ఒకనాడు దక్షిణభారతద్వీపకల్ప మందలి పర్వతగుహలు బుద్ధభగవానుని దివ్య సందేశమును మానవకళ్యాణమునకై విశ్వవ్యాప్తముచేయ దీక్షాచారులైన బౌద్ధభిక్షకుల కాషాయాంబరకాంతులచే స్నిగ్ధగంభీరముగ శోభించుచుండెడివని నేడు ఊహించుకొనుట కష్టము. నేడు నాగార్జునకొండ అను శ్రీపర్వతశ్రేణిలో కృష్ణానదీతీరమున నున్న విశాలపర్వతసానువుల దేశదేశములనుండివచ్చిన నౌకలు, వ్యాపార పదార్థములను దింపుచుండెడివని చిత్రించుకొనుట కష్టము. శ్రీపర్వతమును బుద్ధధాతునిక్షిప్తమైన మహాచైత్యము. కాశ్మీరము, చీనా, తామ్రపర్ణి-వీనినుండి వచ్చు బౌద్ధభిక్షుకులకు నిత్యయాత్రాస్థలము. అమరావతి, భట్టిప్రోలు, నాగార్జునకొండ, జగ్గయ్యపేట, చిన్నగంజాము ప్రాంతముల బౌద్ధవిహారములు వేనవేలు భిక్షుకులతో కలకలలాడుచుండెడివి. ఇవన్నియు ఇక్ష్వాకులనాటి చరిత్రలు. శాతవాహనుల నాటిపురాణ కథలు. ఈజిప్టునుండి అనుకూలవాత ప్రేరితములై వర్తక నౌకలు క్రీ. శ. మొదటిశతాబ్దిలో దక్షిణభారతభూమిని చేరుచుండెడివి. రోమక సామ్రాజ్యములోని నాణెములు ఎన్నో లభించినవి. పులుమావి నాణెములపై సముద్రయానమును సూచించుచు రెండుతెరచాపలుగల నావల బొమ్మ లున్నవి.

చాతుర్వర్ణ్యవిభాగము ప్రాచీనదక్షిణభారత సంఘములో శిలాక్షరములలోగూడ సాక్షాత్కరించుచున్నది. గౌతమీపుత్రశాతకర్ణి వర్ణసాంకర్యము కల్గకుండ రక్షించెను. అతడు ఏకబ్రాహ్మణుడు. (9)

(9) ఏకబ్రాహ్మణ శబ్దార్థమునుగురించి చారిత్రకులకు ఏకవాక్యత కుదుర లేదు. బండార్కరుగారు, బ్రాహ్మణులను సంరక్షించుటలో అద్వితీయుడని చెప్పుచున్నారు. మరి కొందరు దీనినిబట్టి శాతవాహనులు బ్రాహ్మణులని నిర్ధారించినారు.

బౌద్ధమతప్రభావమువలన సంఘములో వర్ణ విభేద ప్రాబల్యము తగ్గిన దని ఊహింపవచ్చును. కాన్హేరి శిలాశాసనములో గజసేన, గజమిత్ర క్షత్రియసోదరులు వాణిజ్యకారులుగ కన్పించుచున్నారు. క్షత్రియులు కొందరు వర్తకవృత్తితో జీవించిరి. ఇంకను హాలికులు, మూర్ధకులు క్షత్రియులు గోలికులు (గోపాలురు) కన్పించుచున్నారు.

యవనులు

వాఙ్మయములో యవనమ్లేచ్ఛశబ్దములు విదేశీయ సామాన్య వాచకములు. అశోకుని శిలాశాసనములు గ్రీకులను యవనులుగా పేర్కొనుచున్నవి. (10) అశోకుని సామ్రాజ్యములోని సురాష్ట్రమును యవనరాజు తుశాస్ఫు పరిపాలించెను.(11)కాని అర్వాచీనశిలాశాసన ములు యవన, శక, శబ్దములు పర్యాయపదములుగా గాకపోయిన విదేశీయులకు సామాన్యవాచకములుగా ప్రయోగించినవి. యవనులు ఎప్పుడు దక్షిణాపథమున ప్రవేశించినది చెప్పుట కష్టము. బుద్ధనిర్వా ణమునకు 250 సంవత్సరముల అనంతరము యవనుడైన ధర్మరక్షి తుడు, అపరాంతదేశమునకు బౌద్ధమతాచార్యుడుగ వెళ్ళెను. మహా రక్షితుడను బౌద్ధాచార్యుడు యవనదేశమునకు వెళ్ళినట్లు "మహా వంశము" లో నున్నది. మీనాండరు, యమునాతీరమువరకు దండ యాత్ర సల్పి, సురాష్ట్రమును జయించెను. పెరిప్లసు గ్రంథకర్త అతని కాలములో బారుకచ్ఛలో మీనాండరు, అపొలొడటసునాణె ములు చెలామణిలో నున్నవని వచించెను. కార్లె శిలాశాసనములు, భారతీయులుగా మారిపోయిన యవనుల నెందరినో పేర్కొనుచున్నవి.

---

(10) అశోక శిలాశాసనములలో పశ్చిమోత్తరమున గాంధార కాంభోజదేశస్థుల మధ్య నున్నారు. అలెగ్జాండరు తర్వాత పశ్చిమోత్తరమున సైలిక్యూను గ్రీకు రాజ్యమును స్థాపించెను.

(11) వృషభదముని శిలాశాసనము.

ఇవి చైత్యస్తంభములపై నున్నవి. శిలాక్షరములనుబట్టి ఇవి క్రీ. పూ. మొదటి శతాబ్దినాటివని చెప్పవచ్చును. కార్లే శిలాశాసనములలో దానముల నిచ్చిన యవనకుటుంబములు సింహధాయకుటుంబము, యశవర్ధనకుటుంబము, ధర్మదాయకుటుంబము- వీరందరు ధేనుకటక నివాసులు. కావున ఆ నాడు ధేనుకటకము యవనకూటమని చెప్ప వచ్చును.(12) యవనులు, హిందూమతములో, బౌద్ధమతములో చేరి కలిసిపోయిరి. వారి నామములు కుటుంబములు అన్నియు భారతీయ ములే. వారి ఆచారవ్యవహారములు, సంప్రదాయములుకూడ భారతీయములై యుండవచ్చును. వారి శిలాశాసనములలో ప్రాకృత ముపయోగించిరి. వారు బౌద్ధులతో హిందువులతో కలసి మెలసి తిరుగుచుండిరి. కార్లే చైత్యము యవనుల బౌద్ధుల సమష్టిదానము.

## శకులు

యవనుల వలె శకులుకూడ భారతీయసంఘమున లీనమై పోయిరి. నహపాణుని అల్లుడు భారతీయనామమును-(వృషభదత్తుడు)- ధరించెను. అతని తండ్రి పేరు మాత్రము దీనిక. అగ్నివర్మన్ శకుడు. అతని కూతురు విష్ణుదత్తా. నహపాణుని కూతురు దక్షమిత్ర.

వృషభదత్తుడు హిందూమతావలంబి. ఇతడు బ్రాహ్మణులకు ఇచ్చిన అనేకదానములు, ఈ విషయమును స్వయంవ్యక్తము చేయు చున్నవి. (13) పుష్కర తీర్థములలో అభిషేకము నొంది గోదానము చేసినవారితో యవనులు శకులు చాలమంది హిందువులు గలరు. బౌద్ధులు గలరు. వృషభదత్తుడు, నాసికలో యదార్థమతతత్వమును గ్రహించి "ధర్మాత్మనా" తిరాశ్మి పర్వతగుహలను బౌద్ధభిక్షుకులకు నిర్మించి ఇచ్చెను. దీనినిబట్టి "వృషభదత్తుడు మతమును మార్చె

(12) E. Vol. Nos 4,6 to 10 E. I. Vol. X VIII Nos 3,4,9,11
(13) Nasik 32, Rapson Senary E. I. p 82 Buller Asw, IV p 402 బ్రాహ్మణము 70,000 కర్షపణముల నిచ్చెను.

బౌద్ధుడయ్యేనా యని నిష్కర్షగా చెప్పలేము" అని సేనార్డు పండితుని వాక్యము. కాని, వృషభదత్తుడు తరువాత బ్రాహ్మణులకు దానములు సల్పెను. వృషభదత్తుడు బౌద్ధుడు కాలేదు. (14) శాతవాహనరాజులు శకరాజపుత్రికలనుకూడ వివాహ మాడిరి.

గౌతమీపుత్రశాతకర్ణి "శకయవన, పహ్లావనిషూదనుడు" శాతవాహనులకు శకరాజులకు యుద్ధములు జరిగినవి. దీనినిబట్టిగూడ క్రీ. శ. 2 వ శతాబ్దిలో శకరాజులు దక్షిణాపథమున పాతుకొని పోయిరని తెలుచున్నది. (15)

అమరావతీస్తూపమున గాంధారరోమను శిల్పకళాప్రభావము కన్పించుచున్నది. తెలుగులో గండారుశబ్దము గండారో గాంధారో శబ్దభవము. పశ్చిమక్షాత్రపరాజకన్యకను వీరపురుషదత్తుడు వివాహ మాడిన తర్వాత తూర్పునకూడ దక్షిణాపథమున శకులు ప్రవేశించిరి. నాగార్జునకొండ శిలాఖండము మోద అను శకుని, బుద్ధి అను అతని సోదరిని పేర్కొనుచున్నది. ఒకశిలా స్తంభమున సైనికులు ఇద్దరు కన్పించుచున్నారు. వారు ఆంధ్ర రాజాంతఃపురమున ద్వారపాలకులుగ నుండిరని లాంగహారుగారి ఊహ. (17) గృహములో యజమానిభార్య, సోదరులు, పుత్రులు, పుత్రికలు, కోడలు, ఇది కుటుంబక్రమము. దానశాసనములో ఈ క్రమము గన్పించుచున్నది. ఏకకుటుంబజీవనము ఆ కాలములో నున్నదని తలపవచ్చును.

## స్త్రీలు

సంఘములో గృహిణికి ఉన్నతస్థానము గలదు. రాణులు కుమారుల బాల్యములో రాజ్యములను శాసించిరి. 'మహాభోజి, మహా

(14) నాసికగుహ 42 లో నిర్మించెను.
(15) రుద్రదామన్ - గిర్నారుశాసనములు.
(17) Longhurst Archaeological survey of India Nagarjuna Konda.

రథిని' కన్పించుచున్నారు. అమరావతిలో స్తూపశిలలు, తోరణములు ఎన్నియో దానము చేసినది భారతగృహిణులు. అమరావతి శిలాశాసన ములు 145 లో 72, కుదాలో 30 లో 13 నాశికలో 29 లో 16 స్త్రీలను వారి దానములను పేర్కొనుచున్నవి. నాశికలో కూడ చైత్యగృహ ములు స్త్రీలు కట్టించినవి. జంబూద్వీపములో సుందరతమశిల్ప నిర్మాణమగు కార్లేచైత్య నిర్మాణములో స్త్రీలు పురుషులతో కలసి దానములు చేసినారు. రాజద్వారమున కిరుప్రక్కల నున్న అలంకృత శిల్పనిర్మాణములు ఇద్దరు సన్యాసినుల దానములు. ఒక గృహిణి, భిక్షుకుని దానశిల్పములుగలవు. నాసికలో ఒకశకయువతి, విష్ణుదత్తా, నాసిక 'సంఘ' మునకు 35000 కర్షపణములను దానము చేసినది. అమరావతి శిల్పావశేషములలో స్త్రీలు, జంత్రగానపరాయణులయి అతిపూజాపరులయి. బౌద్ధారాధనా నిమగ్నలయి నాట్యసంగీత వినోద పరాయణలయి పురుషులతో సభావేదికలలో కలసి మెలిసి కన్పించు చున్నారు. అతిథులను అభ్యాగతులను గృహిణులు భర్తలతో కలిసి ఆదరించినారు. ఒక వివాదసన్నివేశమును చిత్రించిన సభలో ప్రేక్షకు లలో స్త్రీల సంఖ్యయే అధికము. విగతభర్తృకలు ఆత్మసంయమముతో, విషయపరాఙ్ముఖలై జీవితమును గడపినారు.

మనుధర్మశాస్త్రము - చాణక్యుని అర్థశాస్త్రము రాజ్యతంత్ర నిర్వహణమున మిక్కిలి ప్రభావము వహించెను.

శాతవాహనుల తొలి రాజధాని ధాన్యకటకము. మలి రాజధాని ప్రతిష్ఠానము. శాతవాహనుల సామ్రాజ్యము వింధ్యాద్రి- కృష్ణానదీ మధ్యప్రదేశముగ ఎన్నవగును - ఒకానొకప్పుడు అది కృష్ణకు దక్షిణమున కుంతలమును, వింధ్యకు ఉత్తరముననున్న మాళవదేశ మును ఆక్రమించెను. శాతవాహనులు మగధను జయించినట్లు చెప్పబడినది. కాని, వారి పరిపాలన ఎంతకాలము సాగినది తెలియ

రాదు. మాళవరాజ్యము పలుమారులు చేతులు మారినది. శకశాత వాహనులమధ్య నాలుగు శతాబ్దులపాటు మాళవదేశము యుద్ధస్పర్ధకు హేతువైనది.

రానొ వశిష్టిపుత్ర విలివాయకుర- రానొ మాధరిపుత్ర శివలకుర రానొ గోతమిపుత్ర విలివాయకుర రాజుల నాణెములు కొల్హాపూరు ప్రాంతమున లభించినవి. అందు ఉజ్జయిని చిహ్నము కానరాకపోవుటచే వారు శాతవాహనసామంతులుగ పరిగ్రహింపనగును.

గ్రామ పరిపాలనను మహాసభలు నిర్వహించెడివి.

జైనబౌద్ధములు సనాతనసంఘమున విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిపెట్టినవి. యజ్ఞయాగాది క్రతువులను పునరుద్ధరించిన ప్రథమ గౌరవము పుష్యమిత్రునకు చెందునని హరివంశకథనము. అతనివలె దక్షిణమున - అనేకయజ్ఞయాగములు చేసినది రెండవసాతకర్ణి. సుంగులు బ్రాహ్మణులైనను క్షాత్రము వహించిరి. బుద్ధుని వలన మహావీరుని వలన క్షత్రియులు బౌద్ధ జైనప్రభావములకు లోనగుటచే బ్రాహ్మణులు సనాతనమతము నుద్ధరించుటకు పూనుకొనవలసి వచ్చినదని ఒక వాదము. శాతవాహనులలో గౌతమీపుత్రుడు ఏకబ్రాహ్మణుడని చెప్పబడినది. అందుచే శాతవాహనులు బ్రాహ్మణులని పలువురు చరిత్రకారులు భావించుచున్నారు. "ఏకాంకుశస్య - ఏకధనుర్ధరస్య ఏకశూరస్య ఏకబ్రాహ్మణః" (అని ప్రాకృతమునకు సంస్కృతచ్ఛాయ) అందుచే ఏకైకశూరుడు ఏకైకబ్రాహ్మణుడు అను అర్థమునే చెప్పవలసియున్నది.

శాతవాహనయుగమున పేర్కొనదగినవి అలనాటి శ్రేణులు. అవి వర్తకసంఘములు. అవి నేటిబ్యాంకులవలె ధనమును స్వీకరించి వడ్డీ ఇచ్చుచుండెడివి. సాలెవారి వర్తకసంఘము 2000 కార్షాపణ

ములను శాశ్వతమూలధనముగా స్వీకరించినది. ఆచంద్రతారార్కము, ఆ మూలధనముపై వార్షికముగ వచ్చు వడ్డీ నాసికాగుహాభ్యంతరముల నివసించు భిక్షుకులకు వస్త్రాదికముల నొనగూర్చుటకు వ్యయింప నంగీకరించెను. వడ్డీ వార్షికముగ 12%. అట్లే మరియొక 1000కాహాప ణములకు 9 వడ్డీ లభించినది. దీనివలన హెచ్చుమొత్తములకు హెచ్చువడ్డీ లభించునని తెలుచున్నది. సాలెవారి సంఘములు ఆర్థిక ప్రాబల్యమును పుంజుకొనుటకు కారణము సముద్రాంతవర్తకము. ఆ నాడు దక్షిణాపథవస్త్రములకు రోమకసామ్రాజ్యమునగల 'మోజు' అపారము. ప్లినీ రోమకశాసనసభలో రోమకయువతులు సహజమైన సిగ్గువిడిచి, భారతదేశమునుండి దిగుమతియైన గాలితో నేయబడిన సాలెగూళ్ళ వంటి వస్త్రములను ధరించి, తిరుగాడుచున్నారనియు, అపారమైన సువర్ణప్రవాహము తత్ఫలితముగ భారతదేశము చేరు చున్నదని వాపోయెను. హాలుని సప్తశతిలో విదేశగతుడైన భర్త విరహార్తయైన లేజవరాలిశృంగారము పలుతావుల కాననగును.

శాతవాహన నాణెములపైగూడ సముద్రయాన సూచకమగు 'ఓడ' ముద్ర గలదు. వినుకొండ నెల్లూరు కడప నాగార్జునకొండ ప్రాంతముల రోమక నాణెములు దొరికినవి. రోమకనాణెమగు దీనారము శ్రీనాథునివరకు సుప్రసిద్ధము.

## వా ఙ్మ య ము

శాతవాహనయుగమందు రాజభాష ప్రాకృతమే. ప్రాకృతమున వెలసిన 'గాథాసప్తశతి' మహోజ్వలకావ్యము. యథార్థమునకది అనేక కావ్యముల సమాహారము. అది సంకలన గ్రంథము. హాలుడు పలువురు కవుల రచనలను ఏరికూర్చెను. ధ్వని ప్రధానమైన ఉత్తమోత్తమ కవితకు సప్తశతియంతయు ఉదాహరణ ప్రాయమే.

గాథలందు, గేయకథలందు పీణియ
పలుకులందు ప్రౌఢమెలంతలందు
కలుగు మేలి చవులు కానగ లేని వా
రవని నున్న వారి కదియె శిక్ష. (16)

సంగీతరసికులుకానివారికి మరణశిక్ష వేయవలెనని షేక్స్పియరు మహాకవి సూచించెను. హాలకవి చక్రవర్తి అరసికులకు మరణము కంటె జీవితమే గొప్పశిక్ష అన్నాడు!

శాతవాహనయుగమున కథావాఙ్మయమున ప్రపంచమున అగ్రతాంబూలము సమర్పింపవలసిన బృహత్కథ గుణాఢ్యునిచే పైశాచీప్రాకృతమున రచింపబడినది. అది నేడు ఉపలభ్యమానము కాక పోయినను, ఆ మాతృక ననుసరించి వెలువడిన సంస్కృతగ్రంథములు సోమదేవుని కథాసరిత్సాగరము క్షేమేంద్రుని బృహత్కథామంజరి, బుద్ధస్వామి బృహత్కథా శ్లోకసంగ్రహము - ఆ మహాకావ్య ప్రతిష్ఠకు విజయధ్వజములు. బోదిస, చాలుహ అమరరాజు కుమారిల మకరంద సేన శ్రీరాజ ప్రభృతులు సప్తశతిలో పేర్కొనబడిన కవులలో కొందరు.

లీలావతీ పరిణయము హాలలీలావతుల ప్రణయగాథ నుల్లేఖించి నది. రుద్రదాముని గిర్నారుశాసనము సంస్కృతగద్యకృతి.

కాళిదాసమహాకవి ఉజ్జయినీ విక్రమాదిత్యుని ఆస్థానమునుండి ప్రతిష్ఠానమునకు విచ్చేసి మేఘసందేశమును వ్రాసెనను వాదము అనుశీలింపదగినది.

నాగార్జునుడు సంస్కృతమున బహుళగ్రంథకర్త. ఆతని ప్రజ్ఞా మూలశాస్త్రము మున్నగు గ్రంథము లనేకములు చీనాభాషలోనికి అనువదింపబడినవి. (17)

---

(16) శ్రీరాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి అనువాదము- గాథాసప్తశతి.
(17) ప్రకరణాంతమున నాగార్జునుని చరిత్రలో కాననగును.

శాతవాహనులనాటి సాంఘికవృత్తము తెలిసికొనుటకు చరిత్రను శాసనములను అనుశీలించిన తెలియు అంశములు అత్యల్పము. కాని, గాథాసప్తశతి చదివినచో శాతవాహనులనాటి సంఘము కన్నులకు గట్టును. సంఘమునకు సాహిత్యమునకు బింబప్రతిభావము గలదు.

గాథాసప్తశతి శాతవాహనులనాటి సంఘము ప్రతిఫలించెడి అద్దాల మేడ.

అమరావతి నాగార్జునకొండ భట్టిప్రోలు గుడివాడ - మున్నగు సంఘారామముల శిల్పసంపద విశ్వవిఖ్యాతము.

# ఉత్తర శాతవాహన యుగము

శాతవాహన సామ్రాజ్యపతనాంతరము, పలురాజవంశములు దక్షిణాపథమున ఆయా సీమల పరిపాలించినవి. దక్షిణాపథమునంతటిని ఏకచ్ఛత్రాధిపత్యముతో అయిదుశతాబ్దులు పరిపాలించి ఒకానొకప్పుడు ఉత్తరాపథమున పాటలీపుత్రము ఉజ్జయిని జయించిన రాజవంశము అంతరించుటవలన దక్షిణాపథరాజ్యతంత్రమున అంతర్వ్యాహినిగనున్న ఐక్యము ప్రస్ఫుటమైన భిన్నత్వమునకు తావిచ్చినది. నందులనుండి అవిచ్ఛిన్నముగావచ్చిన దక్షిణాపథరాజ్యాంగవ్యవస్థ ఛిన్నాభిన్నమైనది.

శాతవాహన సామ్రాజ్యపతనానంతరము దక్షిణాపథమున వర్ధిల్లిన రాజవంశములు ఆభీరులు, చూతులు, ఇక్ష్వాకులు, పల్లవులు, బృహత్ఫలాయనులు, వాకాటకులు, కదంబులు, శాలంకాయనులు, విష్ణుకుండినులు.

పశ్చిమోత్తరమున ఆభీరులు, దక్షిణమున చూతులు, మధ్యప్రదేశమున శాతవాహనవంశీయులు, పిమ్మట పల్లవులు దక్షిణమునను, ఇక్ష్వాకులు, బృహత్ఫలాయనులు, శాలంకా యనులు, విష్ణుకుండినులు ఆంధ్రదేశమునను రాజ్యము లేలిరి.

ఆభీరులు విదేశీయులు. వారు పశ్చిమోత్తరమున శకక్షాత్రపుల సేనానులుగనుండి శాతవాహనసామ్రాజ్యపతనానంతరము స్వతంత్ర రాజ్యము స్థాపించి 67 సంవత్సరములు రాజ్యమేలిరి. నాశిక్ శాసనము మాధరీపుత్ర ఈశ్వరసేనుని పేర్కొనుచున్నది. ఆ ఆభీరరాజు పుత్రుడు శివదత్తుడు. ఈశ్వరసేనుడు ప్రారంభించిన శకము క్రీస్తుశకము 249 - 250 నుండి గణనము. తరువాత కలచురి = చేది శకముగా ప్రసిద్ధమైనది.

మహారాష్ట్ర కుంతలదేశముల రాజ్యమేలిన చూతులగూర్చి తెలియనగునదిగూడ స్వల్పమే. వీరినాణెములు ఉత్తరకనర, చితల్ దుర్గ ప్రాంతముల దొరికినవి. వీరి శాసనములు కాన్హెరి, బనవాసి మాలవల్లికడ నున్నవి. అశ్వముఖముద్రతో నున్న వీరి నాణెములు – 'హారితి' అక్షరాన్వితములు అనంతపుర, కడపమండలములలో దొరికినవి. (హారీతి చూతులపేరు) కొందరు చరిత్రకారులు చూతులు శాతవాహనవంశీయులని తలపోయుచున్నారు. చూతశతకర్ణి బనవాసి ప్రభువు కుంపల్లి దేవాలయమునకు దానమొసంగెను.

కదంబులు చూతులను నిర్మూలించి, వారి రాజ్యము నాక్రమించినారు.

ఇక్ష్వాకులు శ్రీపర్వతీయులను పేరుతో కృష్ణాతీరభూమినేలిరి. 'నాగార్జునకొండ' ప్రాచీన శ్రీపర్వతము. (1) వీరు 57 వత్సరములు రాజ్యమేలిరి.

ఇక్ష్వాకుల తదనంతరము రాజ్యమేలిన బృహత్ఫలాయనులలో చరిత్రకుతెలిసిన ఏకైకరాజు జయవర్మ.

అతని ఏకైకదానశాసనము దేవాదాయముల పేర్కొనుచున్నది. దీనినిబట్టి బౌద్ధజైనముల క్షీణత సనాతనవైదికమతపునర్వికాసము ఊహింపనగును.

పల్లవులు కాంచీపట్టణము రాజధానిగ రాజ్యమేలిరి.

పల్లవుల చరిత్ర మూడు ముఖ్య విభాగములు చేయవచ్చును. ప్రాచీనపల్లవులు. ప్రాకృతశాసనములవలన తెలియనగు వంశము మొదటిది. ప్రాచీనపల్లవులలో అర్వాచీనశాఖ – సంస్కృతశాసనముల వలన తెలియనగువారు. రెండవ వంశము. మూడవవంశము న...

(1) ఇక్ష్వాకులచరిత్ర "ఇక్ష్వాకులు" అను అధ్యాయమున సవిస్తరముగ గలదు.

వర్మవంశీయులు. ప్రాచీనపల్లవులు అగ్నిష్టోమ, వాజపేయ, అశ్వమేధాది యజ్ఞములొనర్చి సనాతన సంస్కృతిని పునరుద్ధరించిన వారు. (1) సముద్రగుప్తుని దక్షిణదేశదండయాత్రలో కంచిలో ఆతని కెదురుపడినది విష్ణుగోపుడు. ఆతనిగూర్చి, మరి యే విశేషములు తెలియరాకుండుట శోచనీయము.

## పల్లవవంశవృక్షము

కుమారవిష్ణు I (325 - 50)
|
స్కంధవర్మ I (350 - 75)
|
వీరవర్మ (375 - 400)
|
స్కందవర్మ II (400 - 36)

| | | |
|---|---|---|
| సింహవర్మ I (436 - 60) | యువమహారాజ విష్ణుగోపవర్మ I | కుమారవిష్ణు I |
| స్కంధవర్మ III (460 - 80) | సింహవర్మ II (480 - 500) | బుధవర్మ |
| నందివర్మ | విష్ణుగోపవర్మ II | కుమారవిష్ణు III |

పై వంశవృక్షమునకు ఆధారము దానశాసనములు. క్రీ. శ. 325 నుండి 500 వరకు గల పల్లవరాజకీయచరిత్ర అజ్ఞాతముగనే యున్నది. సముద్రగుప్తుని సమకాలీనుడైన విష్ణుగోపుడు మొదటి కుమార విష్ణువు సహోదరుడై యుండనోపు.

సింహవర్మ - సింహవిష్ణువు తండ్రి ఆరవ శతాబ్దిలో సుప్రసిద్ధ మైన పల్లవవంశ మూలకర్తకు గూడ పైవంశవృక్షమున స్థానము లేదు.

ఈ చారిత్రక సేతువులను నిర్మించి, సమస్యలను పరిష్కరింప వలసినవారు భావి చారిత్రకపరిశోధకులు.

సముద్రగుప్తునకు సమకాలీనుడైన హస్తివర్మ క్రీ. శ. 350 ప్రాంతమున వేంగిపాలకుడు. వేంగి కొల్లేరు సరోవరతీరమందలి జల దుర్గము. హస్తివర్మ శాలంకాయనవంశీయుడు. శాలంకాయనవంశీయులలో ప్రాచీనుడు దేవవర్మ. ఈతడు వహించిన భట్టారకబిరుదము స్వతంత్రప్రతిపత్తిసూచకము. దేవవర్మ హస్తివర్మకు ప్రాచీనుడు. ఉభయుల సంబంధబాంధవ్యము తేలలేదు.

హస్తివర్మ పిమ్మట అతని పుత్రుడు నందివర్మ రాజయ్యెను క్రీ. శ. 375. అతని రాజ్యములోనిదే గృధ్రహారవిషయము. అతని రాజ్యము కృష్ణానది కిరుపైపుల విస్తరించియుండెను. మొదటి నంది వర్మ తరువాత అతనిపుత్రుడు రెండవహస్తివర్మ, తరువాత అతని పుత్రుడు స్కంధవర్మ రాజ్యమేలిరి. స్కంధవర్మ తరువాత రెండవ నందివర్మ క్రీ. శ. 430 ప్రాంతమున రాజ్యమేలెను. శాలంకాయనులు పల్లవులవలె వృషభలాంఛనులు. సూర్యోపాసకులు. అయినను, విష్ణువును శివునిగూడ ఆరాధించిరి.

శాలంకాయనరాజ్యతంత్రమునకునుపల్లవరాజ్యతంత్రమునకును చాలపోలికలు కన్పించుచున్నవి. శాలంకాయన శాసనలిపికిని ఇండో చినా, మలేసియా ప్రాచీన శాసనలిపికినిగల సామ్యము సుప్రసిద్ధము. వేంగిదేశమందలి ప్రజలు సముద్రాంతరమున ఆనాడు అధినివేశరాజ్యములు నెలకొల్పిరనుటకు ప్రబలసాక్ష్యములున్నవి. (1)

---

(1) ఈ విషయము బృహదాంధ్రభారతము - బృహదాంధ్రము అను అధ్యాయమున సవిస్తరముగ అనుశీలింపవనగును.

సముద్రగుప్తుని దండయాత్రానంతరము కళింగము నేలిన రాజులు మాఢవ వంశీయులు. వీరుగూడ వర్మాభిధానులే. పిష్టపుర, సింహపుర, వర్ధమానపురరాజ్యము నేలిన రాజన్యులు ఏడుగు శాసనములు గలవు. వారి వంశవృక్ష మేర్పరచుటకు వలను పడదు. మాతృనామధేయోపసర్గులై శాసన వచనమున శాతనాహనుల ఒరవడి తీర్చినను, వీరు అర్వాచీనులనుట స్పష్టము. శాసనభాషసంస్కృతము. వీరుకళింగాధిపతులమనియు పరమమాహేశ్వరులమనియు చెప్పుకొనిరి. వీరి పరిపాలన క్రీ. శ. 375 నుండి 500 వరకు సాగినట్లెంచవచ్చును.

వేంగిమండలమును శాలంకాయనుల పిమ్మట విష్ణుకుండిను లేలిరి. వీరు శ్రీపర్వతస్వామిపదారాధకులు.

వీరి వంశవృక్షము వివాదగ్రస్తము. మాధవవర్మ వంశకర్త. అతడు పదునొకండు అశ్వమేధయాగము లొనర్చినట్లు అగ్నిష్టోమము లొనర్చినట్లు చెప్పబడినది. అతనిభార్య వాకాటకరాజపుత్రిక. అతని పుత్రుడు విక్రమేంద్రుడు, ఉభయవంశోద్ధారకుడుగ అభినుతుడు. ఇంద్రభట్టారకుడు అనేకయుద్ధ విజేత. త్రికూటాధిపతిని జయించెను. అంతేకాక పూర్వగాంగవంశీయుడైన ఇంద్రవర్మ నోడించి తనరాజ్యమును విస్తరింపజేసెను. గోవిందవర్మ 'విక్రమాశ్రయ' బిరుదాంకుడు. విక్రమాశ్రయుని పుత్రుడే జనశ్రుతిలో సుప్రసిద్ధుడైన (రెండవ) మాధవ వర్మ.

మాధవవర్మ జనాశ్రయ బిరుదాంకితుడు. అతడు హిరణగర్భ యాగ మొనరించెను. అతడు గోదావరిని దాటి గాంగుల జయించి వేంగీమండలముమ కళింగమువరకు విస్తరించెను. రెండవపులకేశి ఘోరసంగ్రామములో జయించువరకు, వేంగిమండలమును విష్ణుకుండినులు పరిపాలించిరి. (1)

(1) ఆ ఉదంతము రెండవ పులకేశి చరిత్రలో అనుశీలింపనగును.

విష్ణుకుండినరాజ్యమునకు పల్లవరాజ్యమునకు మధ్య(ప్రస్తుతపు గుంటూరు రేపల్లె తాలూకాల ప్రాంతము) ఆనందగోత్రికుల రాజ్య ముండెడిది. వారిరాజధాని కందరపురము. కందరుడు వంశకర్త. కందరుడు తనపుత్రికను పల్లవరాజకుమారునకిచ్చి వివాహమొనర్చెను.

దామోదరవర్మతండ్రి అశ్వమేధయాగకర్త. అత్తివర్మ కందరుని మనుమడు - చేజర్ల శిలాశాసనకర్త ఆ వంశీయులే. దామోదరవర్మ బౌద్ధుడు. మిగిలినరాజులు శైవులు. వార పరమతసహనము కొనియాడ దగినది.

## వాకాటకులు

క్రీస్తుశకము నాలుగు అయిదు శతాబ్దులలో మధ్యప్రదేశమును పరిపాలించిన వాకాటకరాజవంశము దక్షిణాపథచరిత్రలో మిక్కిలి ప్రాముఖ్యము వహించుచున్నది. ఉత్తర దక్షిణములమధ్య సాంస్కృతిక సేతువు సర్మించిన రాజవంశమది. అటు గుప్తసమ్రాట్టులతో ఇటు విష్ణుకుండిన, కదంబప్రభువులతో వియ్యమందిన రాజనీతిదురంధరులు. అజంతా గుహాభ్యంతరముల చిత్రకళారంజితము లొనర్చుటలో వారు వహించి భూమిక ఉగ్గడింపదగినది.

చరిత్రకారులలో వారి వంశోత్పత్తినిగూర్చి ఏకవాక్యత కుదుర లేదు. కొందరు, వారు బగత్‌గ్రామవాస్తవ్యులని ప్రతిపాదించిరి. మరికొందరు వారు ఆంధ్రులని సిద్ధాంతీకరించుచున్నారు. పురాణము లనుబట్టి వింధ్యశక్తి వాకాటకవంశకర్త. పురికాపురి వారి ప్రాక్తన రాజధాని. వారి సామ్రాజ్యము వింధ్యాద్రిని దాటి విదిశవరకు విస్తరిల్లినదని పురాణవర్ణనము. క్రీ. శ. మూడవశతాబ్దిచివర వాకాటకులు స్వతంత్రసామ్రాజ్యము నేర్పరచిరి. అప్పుడు శాతవాహనసామ్రాజ్యము క్షీణించినది. శకక్షాత్రపులు నిర్వీర్యులై అణగిపోయిరి. వాకాటకులు విజృంభించిరి.

వింధ్యశక్తి కుమారుడు మొదటిప్రవరసేనుడు క్రీ. శ. 280నుండి 340 వరకు పరిపాలించెను. "సమ్రాట్" ప్రవరసేనుడు దిగ్విజయ యాత్ర సలిపి, అనేకరాజ్యముల జయించి వాకాటకసామ్రాజ్యమును విస్తరింపజేసెను. జ్యేష్ఠసుతుడు గౌతమీపుత్రుడు తండ్రికిపూర్వమే గతించెను. రెండవసుతుడు సర్వసేనుడు దక్షిణబేరారుప్రాంతమును పరిపాలించెను. క్రీ. శ. 304 – 342 సంవత్సరములమధ్య శకనాణె ములవైరళ్యము చేతను మహాక్షాత్రపబిరుదము కన్పింపకపోవుటచేతను ఆ సమయమున వాకాటకరాజ్యము క్షాత్రపరాజ్యము నాక్రమించెనని తలంపవచ్చును. ప్రవరసేనుడు నాలుగు అశ్వమేధములను – వాజ పేయయాగమును ఒనరించెను. గౌతమీపుత్రుని పుత్రుడు ప్రవర సేనుని మరణానంతరము సింహాసనమధిష్ఠింపగ రాజప్రతినిధులై రాజ్యము లేలుచున్న పితృవ్యులు స్వాతంత్ర్యము ప్రకటించిరి. ఆతడు మాతామహుడైన భావనాగుడు పద్మావతీరాజ్యప్రభువు సాయమున ఇరువురను జయింపగల్గెనుగాని సర్వసేనుడు మాత్రము స్వతంత్రుడై పాలింపసాగెను.

రుద్రసేనుడు అదృష్టవంతుడు. గుప్తరాజవంశముతో ఆతనికి గల నెయ్యమువలన, సముద్రగుప్తుని దండయాత్ర అతనిని బాధింప లేదు. శకులు తిరిగి తలయెత్తి క్రీ.శ. 346 నుండి మహాక్షాత్రపబిరు దాంకితులై విలసిల్లిరి. రుద్రసేనుని పుత్రుడు పృథ్వీసేనుడు సర్వసే నుని వంశీయులకు కుంతలదేశము నాక్రమించుటకు తోడ్పడెను. అతడు క్రీ.శ. 365 నుండి 390 వరకు రాజ్యమేలెను. ఆతని చరిత్రలో పేర్కొనదగినది ఆతడు చంద్రగుప్తునితో వియ్యమందుట. రెండవ చంద్రగుప్తుని పుత్రిక ప్రభావతిని పృథ్వీసేనుని పుత్రుడు రెండవ రుద్ర సేనుడు వివాహమాడెను. కాని రుద్రసేనుడు అకాలమృత్యుముఖమున బడెను. అతడు రాజ్యమేలినది అయిదువత్సరములు మాత్రమే రాకు మారు లిద్దరు బాలురు. విగతభర్తృకయైన రాణి రాజ్యమేలసాగినది.

ఆమె రాణిగానుండగనే రెండవ చంద్రగుప్తుడు గుజరాతు కాధియవార్ రాజ్యముల జయించెను. ప్రభావతి తండ్రికి సముచిత సాహాయ్య మొనరించినది. జ్యేష్ఠపుత్రుడు దివాకరసేనుడు మరణించుటచే కనిష్ఠసుతుడైన దామోదరసేనుని (=రెండవప్రవరసేనుడు) పక్షమున క్రీ.శ. 410 వరకు ప్రభావతి రాజ్యమేలెను. రెండవప్రవరసేనుడు (క్రీ.శ. 410-45) లలితకళాప్రియుడు. అతడే సేతుబంధకావ్యరచయిత యందురు. అది కాళిదాస పరిష్కృతమని ఒకవాదము. ప్రవరసేనుడు నూతన రాజధాని ప్రవరపురమును నిర్మించెను. యువరాజైన నరేంద్ర సేనుడు కదంబకకుత్సవర్మ పుత్రికను వివాహమాడెను. నరేంద్ర సేనుని (క్రీ.శ. 445-65) రాజ్యపాలన ప్రశాంతముగ సాగలేదు. నలాధి పుడు భావదత్తవర్మ వాకాటకరాజ్యముపై దండెత్తెను. విజయలక్ష్మి అతని వరించినట్లే కన్పించినది. హూణులతో యుద్ధమున చిక్కుకొని యున్న కుమారగుప్తుడు, నరేంద్రసేనునకు సాయమొనరింపలేక పోయెను. అయినను, నరేంద్రసేనుడు నలాధిపునోడించి మాళవమేఖల కోసలరాజ్యములపై ఆధిపత్యము వహించెను. నరేంద్రసేనుని పుత్రుడు (రెండవ) పృథ్వీసేనుడు, రెండుసారులు శత్రువులతో బహుశః నలా ధిపునితో తలపడి పోరాడవలసివచ్చినది. ఆతనితో వాకాటక ప్రధాన శాఖ అస్తమించినది.

సర్వసేనుని సంతతివారు బాసింశాఖీయులలో సమకాలీనుడైన హరిసేనుడు (క్రీ. శ. 480 - 515) ప్రధానశాఖకు వారసుడై వాకాటక వంశకీర్తిని ఉద్ధరించెను. ఆతని అజంతాశాసనము ననుసరించి గుజ రాత్, మాళవ, దక్షిణకోసల కుంతలరాజ్యములు ఆతని సామ్రా జ్యములోనివి. అతని తరువాతి రాజులు ప్రయోజకులు కాకపోవుటచే క్రీ. శ. 515 నుండి 550 సంవత్సరములమధ్య ఛటిస్ఘర్ సోమవాశు లకు, దక్షిణమహరాష్ట్రము కదంబులకు ఉత్తరమహారాష్ట్రము కల చురిప్రభువులకు మాళవ మధ్యప్రదేశములు యశోధర్మునకు దక్కినవి.

చివరకు బాదామి చాళుక్యుల హస్తగతమై వాకాటకరాజ్యము అస్తమించెను.

సముద్రగుప్తుడు జయించినరాజులలో కోసలరాజు మహేంద్రుడు, మహాకాంతారాధీశుడగు వ్యాఘ్రరాజు, కౌరాళరాజగు కుంతరాజు పిఠాపురమహేంద్ర కొత్తూరాధీశుడగు స్వామిదత్తుడు ఐరండపల్లి పాలకుడగు దమనుడు, కాంచీపురాధీశ్వరుడగు విష్ణుగోపుడు, అవముక్తా ధీశుడగు నీలరాజు; పాలక్క పరిపాలకుడగు ఉగ్రసేనుడు, వేంగీపురా ధీశ్వరుడగు హస్తివర్మ, దేవరాష్ట్రాధీశుడగు కుబేరుడు, కుస్థలపురా ధీశుడగు ధనంజయుడు కలరు.

## క దం బు లు

సముద్రగుప్తుని దండయాత్రానంతరము, నాలుగవ శతాబ్ది మధ్యభాగమునుండి కదంబులు స్థాపించిన బనవాసిరాజ్యము వర్ధిల్లినది. కదంబుల తొలిశాసనము ప్రాకృతమున చూతశాసనమునకు క్రింద ఒక స్తంభమున కాననగును. కదంబులు బ్రాహ్మణులు. హారీతి వంశీయులు. మాణవ్యగోత్రికులు. వారు వేదవేదాంగవేత్తలై యజ్ఞ కర్తలై విలసిల్లిరి. వేదాధ్యయనమునకై కాంచీపురిలో ఘటికలో బ్రహ్మచారిగనున్న మయూరశర్మ ఒకనాడు యాదృచ్ఛికముగ(పల్లవ) అశ్వికభటునితో తలపడవలసివచ్చినది. ఆ కలహము మయూరశర్మను "వర్మ"గా రూపొందించినది. అతడు బ్రాహ్మ్యముతోపాటు క్షాత్రమును స్వీకరించి శ్రీపర్వతారణ్యప్రాంతములలో స్వతంత్రరాజ్యమును స్థాపించి, మొట్టమొదట పల్లవసామంతులైన బృహద్బాణులను లోబరచుకొనెను. పల్లవులతో అతడనేక యుద్ధములొనర్చెను. చిట్టచివరకు పల్లవులాతని స్వతంత్రప్రతిపత్తిని గుర్తించి, అతని ప్రహరా పశ్చిమాంబుధి వలయితసీమకు రాజుగ గుర్తించిరి. ప్రహరా పదమునకు తుంగభద్ర లేక మలప్రభ అర్థము కావచ్చును. చంద్రవల్లి కడ

మయూరశర్మ శిలాశాసనము ఒకతటాకమును పేర్కొనుచున్నది. అందు కన్పించు ఆభీర శకస్థాన, సయిందవ పున్నాట ముఖరి శబ్దము లకు అర్థసమన్వయము కుదురలేదు.

అర్వాచీన జనశ్రుతిలో మయూరవర్మ పదునెనిమిది అశ్వమేధ యాగము లొనర్చి బ్రాహ్మణులకు అగ్రహారముల నిచ్చి, ఐశ్వర్యమును పంచిపెట్టినట్లు అనేకకథలు గలవు. ఐతిహ్యామాతనిని అపరపరశురాముని చేసినది. కాని, ఆ వంశీయుల తొలిశాసనము లా విశేషముల నుగ్గ డించుట లేదు. రాజకీయపరిస్థితుల ప్రాబల్యమువలన 'శర్మ' లు 'వర్మ' లగుటకు కదంబవంశకర్తకథ భారదేశచరిత్రలో మొదటి ఉదా హరణము కాజాలదు. వర్ణవ్యవస్థ వేదకాలమున వృత్తిప్రాధాన్య ముచే ఏర్పడినదని అందరు అంగీకరించినదే. మౌర్యుల కాలమున గాని శాతవాహనుల కాలమునగాని సుంగుల కాలమునగాని కాణ్వా యనుల కాలమునగాని కదంబుల కాలమునగాని వర్ణవ్యవస్థ ఏ యే పరిణామముల అంతర్గర్భితము చేసికొని యుగయుగాంతరముల పిమ్మట నేటి రూపుదాల్చినదో చెప్పలేము. కదంబ, విష్ణుకుండిన గుప్తవాకాటక రాజవంశములలో అన్యోన్యవైవాహికసంబంధములు ప్రవర్తిల్లినసంగతి విస్మరింపరాదు.

మయూరశర్మ క్రీ. శ. 345 నుండి 360 వరకు పరిపాలించెను. అతనిపుత్రుడు కంగవర్మ 360 నుండి 385 వరకు రాజ్యము నల్పెను. ఇతనికాలములో వాకాటకులు కుంతలముపై దండెత్తిరి. 'వైజయంతి' (బనవాసి) కదంబ రాజ్యమునకు రాజధాని. పాలశిఖ (హాల్సి) ఉపరాజధాని.

కంగవర్మ తరువాత రాజ్యమేలినది భగరథుడు. (క్రీ. 385-410) పిమ్మట అతని అగ్రసుతుడు రఘువు క్రీ. శ. 410 నుండి 425 వరకు రాజ్యమేలెను. కదంబరాజ్యమునకు స్వర్ణయుగము కల్పించినది.

కకుత్సవర్మ క్రీ. శ. 425 నుండి 450 వరకు రాజ్యమేలెను. అతని వైవాహికరాజనీతి ఎన్నదగినది. అతడు రాజకన్యకలను సుప్రసిద్ధ వంశములందలి రాజపుత్రులకిచ్చెను. ఒక పుత్రికను గుప్తరాజపుత్రున కొసగెను. అతని పుత్రుడు శాంతివర్మ క్రీ. శ. 450 నుండి 475 వరకు రాజ్యమేలెను. ఈతడు శత్రుభీకరుడై మూడు కిరీటముల సంపాదించి నట్లు అభినుతుడు. ఈతని కాలమున పల్లవుల ప్రమాదము అధిక మయ్యెను. శాంతివర్మ ఆ ప్రమాదము నెదుర్కొనుటకు కదంబరాజ్యము నందలి దక్షిణభాగమునకు, తన తమ్ముడైన కృష్ణవర్మను పాలకునిగ నియమించెను. దానివలన కదంబరాజ్యము రెండుగ విభక్తమయ్యెను. కృష్ణవర్మఅశ్వమేధయాగమొనర్చుటచేసర్వతంత్రస్వతంత్రుడుగవ్యవహ రించెనని చెప్పనొప్పును. పల్లవులతో సల్పిన యుద్ధములలో కృష్ణవర్మ నిహతుడయ్యెను. ఆతనిపుత్రుడు విష్ణువర్మ పల్లవసామంతుడయ్యెను. శాంతివర్మ పుత్రుడు (క్రీ. శ. 470 - 88) అశ్వగజసంచాలనచతు రుడు గాంగులపై పల్లవులపై విజయములు సాధించిన వీరుడుగ అభి నుతుడు. పాలశిఖలో ఆతడు తండ్రిపేర జినాలయము కట్టించి, దాన శాసనములు నెలకొల్పెను.

మృగేశవర్మ పుత్రుడు రవివర్మ (క్రీ. శ. 500 - 538) విష్ణు వర్మను యుద్ధమున సంహరించెను. కదంబవంశములోని ఉభయ శాఖలఅంతర్యుద్ధములు రాజ్యవినాశనమునకు దారితీసినవి.ఆతడుకాంచీ పురాధిపతిని జయించిన ప్రశస్తికి అర్థము విష్ణువర్మకు సాయమొనర్చిన పల్లవులను జయించుట అనియేయని చెప్పనొప్పను. రవివర్మ తిరిగి కదంబరాజ్యము నేకీకృతమొనర్చెను. రవివర్మ పుత్రుడు హరివర్మ (క్రీ. శ. 538 - 50) శాంతికాముడు. క్రీ. శ. 545 లో పులకేశి బాదామి రాజధానిగ చాళుక్యరాజ్యము స్థాపించుటలో కదంబరాజ్యమందలి ఉత్తరార్థ మందు కలిసిపోయినది. అంతర్యుద్ధముల కో క్షీణించిన కదంబ రాజ్యమును చాళుక్యవంశకర్తయైన పులకేశి పుత్రుడు కీర్తివర్మ సులభ

ముగ జయించెను. అప్పుడు హరివర్మ సుతుడు (క్రీ. శ. 550-65) లేదా అతనిసుతుడు అజవర్మ కదంబరాజ్యము పరిపాలించుచుండి యుండవచ్చును.

## ప శ్చి మ గా ం గు లు

పశ్చిమమున కదంబరాజ్యమునకును తూర్పున పల్లవరాజ్యమునకు మధ్యనున్నది 'గంగవాడి' - గాంగులు పరిపాలించుటచే ఆ రాజ్యమున కాపే రేర్పడినది. ప్రాక్తనగంగరాజ్యచరిత్ర, అనేక కుహనాతామ్రశాసనములచే అవ్యవస్థితమైనది. లభించిన ప్రామాణికాధారములబట్టి ఏర్పరుపనగు వంశవృక్షము.

- కీర్తివర్మ క్రీ. శ. 400
  - మాధవవర్మ I క్రీ. శ. 425
    - ఆర్యవర్మ 450
      - మాధవవర్మ II = సింహవర్మ 475
        - అవినీతుడు 500
    - కృష్ణవరర్మ 450
      - సింహవర్మ 475
      - పీరవర్మ (యువరాజు)

పశ్చిమగాంగ వంశకర్త కొంగణివర్మ. జాహ్నవేయకులుడు. కాణ్వాయనగోత్రుడు 'ధ ర్మ మ హా ధి రా జు' బిరుదాంకితుడగుటచే స్వతంత్రరాజ్యము నేలినట్లు భావింపనగును. అటుపిమ్మట సుదీర్ఘకాలము దక్షిణాపథచరిత్రలో గాంగరాజులుసామంతులుగనేయున్నారు. కొంగణివర్మ క్రీ. శ. 400 ప్రాంతమువాడు. అతని రాజధానిని పేర్కొనుశాసనము గానరాదు. జనశ్రుతినిబట్టి కువలాల (కోలారు)

అతని ప్రాక్తనరాజధాని. తరువాత గాంగరాజధాని తలకాడు. కొంగణి వర్మ పుత్రుడు మహాధిరాజ మాధవుడు (క్రీ. శ. 425). అతడు (దత్తక సూత్ర) గ్రంథకర్త. జనశ్రుతిలో అతడు మేధావిగ అభినుతుడు. ఆర్య వర్మ అతని సుతుడు, పండితుడు. ఇతిహాసబహుపురాణశాస్త్ర కోవిదుడు. అతడు పల్లవసింహవర్మ సామంతుడు. అతని సోదరుడు కృష్ణవర్మ అతనికి ప్రత్యర్థియగుటచే సింహవర్మ సాయమొనర్చి యుండును. హరివర్మ ఇతని నామాంతరము. ఇతడే తలకాడు రాజ ధాని నిర్మాతయని శాసనకథనము. ఆర్యవర్మ సుతుడు రెండవమాధవ వర్మ = సింహవర్మయు, కృష్ణవర్మసుతుడైన సింహవర్మయు పల్లవ సామంతులై పల్లవసింహవర్మకు కృతజ్ఞత సూచించుటచే గాంగ రాజ్యము వారిరువురు విభక్తము చేసికొని పాలించిరని భావింప నగును. రెండవమాధవవర్మ పల్లవస్కంధవర్మ సామంతుడై కదంబ కృష్ణవర్మ సహోదరిని వివాహమాడెను. ఈ దంపతులకు ఉద్భవించిన సుతుడు అవినీతుడు - క్రీ. శ. 500 ప్రాంతమున శిశువుగ నుండగనే సింహాసనస్థుడయ్యెను. గాంగులు పల్లవరాజ్యతంత్రమునే అనుస రించిరి.

## ఇక్ష్వాకులు

పురాణములలోని శ్రీపర్వతీయులైన ఆంధ్రభృత్యులే నాగార్జున కొండ జగ్గయ్యపేట శిలాశాసనములలోని ఇక్ష్వాకులు. శ్రీశైలమునుండి నాగార్జునకొండవరకు విస్తరించియున్న పర్వతపంక్తికి 'నల్లమల' లేక శ్రీపర్వతపంక్తి యని పేరు. నాగార్జునకొండ శిలాశాసనములలో 'గిరి' పర్వతశ్రేణిలోని ఏకదేశమున శృంగపరముగ ప్రయుక్తము. 'చులధమ్మగిరి' నేటి 'నాహరాళ్ళబోదు' దీనిపై బోధిశ్రీ విహారమును కట్టించినది. నాగార్జునకొండశాసనములు అపర్వతపంక్తిని శ్రీపర్వతమని పేర్కొనుచున్నవి.

శాతవాహనసామ్రాజ్యము అస్తమించిన తరువాత నేటి గుంటూరు కృష్ణామండలప్రాంతమును ఇక్ష్వాకులు పరిపాలించినారు. నాగార్జునకొండ శిలాశాసనములలోని దీర్ఘరేఖారమణీయమైన అలంకారికలిపి చినగంజాములోని యజ్ఞశ్రీశాతకర్ణి శాసనాక్షరములకు పులోమావి III, జంగ్లిగుండు శిలాశాసనాక్షరములకు సుందరపరిణామ వికాసము. ఇక్ష్వాకురాజుల నామధేయములలోని సిరి-సామి పదములు శాతవాహన ప్రభావమును స్ఫురణకు దెచ్చును. ఇక్ష్వాకుల రాజధాని విజయపురి చులధమ్మగిరికి పశ్చిమమున నుండెను. 148 సాతవాహన నాణెములు (తగరము) నాగార్జునకొండపై దొరికినవి. ఇక్ష్వాకులకు పూర్వము దీనినిబట్టి ఈ ప్రాంతమును సాతవాహనులు పరిపాలించిరనుట సుస్పష్టము. శాతవాహన సామ్రాజ్యము అస్తమించిన తరువాత ప్రాచ్యభాగమున ఇక్ష్వాకులు ప్రతీచీభాగమున శకులు గార్ధభిల్లులు, అభీరులు, దక్షిణమున చూతులు ప్రబలినారు.

మత్స్యపురాణానుసారము ఇక్ష్వాకులు 'ద్విపంచశతవర్షములు పరిపాలించినారు. వారు పురాణమున 'ద్వైఅర్థశత' సంవత్సరములు పరిపాలించినట్లు గలదు. కావున52సంవత్సరములు ఇక్ష్వాకులు రాజ్యము చేసినట్లు నిర్ణయింపవచ్చును.

పురాణములనుబట్టి ఇక్ష్వాకులు ఆంధ్రులు. ధర్మామృతమను కన్నడగ్రంథమున క్రీ. శ. 2 లేక 3 వ శతాబ్దినాటి 'వసుపూజ' నామధేయుడగు 12 వ తీర్థంకరుని కాలమున ఆంధ్రదేశమందలి ప్రతిపాలపురమును, అంగదేశమును పాలించిన ఇక్ష్వాకురాజు యశోదరుడు నిర్మించినట్లు గలదు. ప్రతిపాలపురమును నేటి భట్టిప్రోలుగ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు గుర్తించినారు. ఇక్ష్వాక రాజులు సూర్యవంశీయులని అయోధ్యను పరిపాలించిరని దక్షిణకోసలమున కోశస్థలిని కుశరాజు స్థాపించినట్లు పురాణకథనము,

కృష్ణామండలములోని నందిగామ తాలుకాలోని అల్లూరి గ్రామములోని బ్రాహ్మీశిలాశాసనములో 'మహాతలవర' ప్రసక్తి గలదు. అక్షరరేఖావిన్యాసమునుబట్టి ఈ శాసనము వాసిష్ఠీపుత్రసామి సిరి పులోమావి అమరావతీశాసనమునకు ప్రాచీనము. మహాదండనాయక, మహాతలవర పదములు ఇక్ష్వాకులలో సామాన్యములు.

ఇక్ష్వాకులు ప్రథమమున శాతవాహనరాజ్యమున మహాతలవరులై యుండిరని నిర్ణయింపవచ్చును. శాతవాహనసామ్రాజ్యము అస్తమించిన తరువాత 'సిరిచాంతమూల'రాజు ఇక్ష్వాకురాజ్యమును ప్రాచ్య భాగమున స్థాపించెను.

'సిరి - చాంతమూల' - 'అపతిహతసంకప'. ఇక్ష్వాకురాజవంశ మూలపురుషుడు శ్రీ చాంతమూలుడు, అప్రతిహతసంకల్పుడు - వసిష్ఠిపుత - సిరి - చాంతమూలుని సోదరీగణము ప్రస్తుతించినారు. కాని అతని తండ్రిని ఎవరును పేర్కొనలేదు. ఇతని పుత్రిక అడవి చాంతిసిరి. సోదరి చాంతిసిరి.

చాంతమూలుడు అతని మనుమడు. చాంతమూలుడు దీనిని బట్టి ఇక్ష్వాకురాజవంశమునకు మూలపురుషుడుగా కన్పించుచున్నాడు. స్మారకశిలాశాసనములోని ఇతని 'మహారాజు' బిరుదు రాజపదవిని స్వయంవ్యక్తము చేయుచున్నది. (1) అతని రాణులు, సోదరీగణము ఎత్తించిన ఈ స్మారకశిలాశాసనస్థంభము వినా, అతని శిలాశాసనములు మృగ్యములు. సిరిచాంతమూలుడు, అగ్నిష్టోమ, అగ్నిహోత్ర, అశ్వమేధ, వాజపేయ యజ్ఞములను సల్పినాడు. అశ్వమేధ వాజపేయ యజ్ఞములు చక్రవర్తి లాంఛనములు. ఇతడు కాంచననిధులను హలములను (గోసతసహస - హల - పదాయిన) గోవులను - శత సహస్రములను దానము చేసినాడు. చాంతిసిరి శిలాశాసనమున గల

(1) E I Vol XXI, L Memorial

చాంతమూలుని ఆకృతి ఈ విషయమునే చిత్రించుచున్నది. రాజదండ విలసితుడై పాదుకాపాదాంకితుడై దానధారాజలమును పురోహితుడు పోయుచుండ 5 గురు బ్రాహ్మణులకు ఈ మహారాజు దానము సల్పు చున్నట్లు అందుగలదు. అందు ఒక బాలుడు దానమును పరిగ్రహించు చున్నాడు- నేలమీద సువర్ణసహస్రములు ఎన్నియో కలవు. చాంత మూలుని హిరణ్యపిండదానమే ఈచిత్రము. అనేక 'హిరణ్యకోటి గోశత సహస్రము' లను అతడు దానము సల్పినాడు. శాతవాహనచక్రవర్తి సిరిశతకర్ణి, రాజకుటుంబముయొక్క కుడ్యశిల్పములు తరువాత ఇక్ష్వాకుచాంతమూలుని రాజకుటుంబమును మాత్రము చరిత్రలో శిల్ప కళ ప్రసాదించుచున్నది.

స్మారకశిలా స్తంభములోని శిల్పప్రతిమలలో చతుర్వర్ణములలో చాంతమూలుడు రాజకీవితో కన్పించుచున్నాడు. చతుర్థవర్గమున చాంతమూలుడు మత్తేభమును అధిష్ఠించినాడు. అతని ప్రక్కననున్న అనుచరుడు అతని శిరస్సుపై మౌక్తికచ్ఛత్రమును పట్టినాడు. అతనిని అనుసరించిన అనుయాయులు అయిదారుగురిలోఒకడు మరగుజ్జు.ఇతనికి ఈ శిలాప్రతిమలలో ఇద్దరు రాణులు కన్పించుచున్నారు. శిలాశాసన ములోకూడ సరసికాకుసుమలతలు ఇద్దరు కన్పించుచున్నారు. "హంమసిరినికా, చాంతిసిరి" సిరిచాంతమూలుని చెల్లెండ్రు. ఈ రాజపుత్రిక లిద్దరు బౌద్ధమతప్రియులు. చాంతిసిరి, వాసిష్ఠీపుత్రిక. ఈమె మహాతలవరు వాసిష్ఠీ పుతఖుండసిరి (పూకీయవంశీయుని) భార్య. ఈమె నాగార్జునకొండ లోయలోని బౌద్ధవిహారముల నిర్మించినది.

## వీరపురిసదత

మాధరీపుత సిరి వీరపురిసదత మహారాజు చాంతమూలుని పుత్రుడు. ఇతని కాలమున కృష్ణానదీముఖద్వారమున బౌద్ధమతము మహోన్నతముగ ప్రజ్వలించినది. శ్రీవీరపురుషదత్తుని 6 వ సం.

శిలాశాసనములో మహాదేవి రుద్రధరభట్టారిక ఉజెనిక మహారాజబాలిక, ఒక స్తంభమును 170 దినారి మాసకములను దానము నల్పినది. (2) ఈమె వీరపురుషదత్తుని భార్యయైయుండును. ఈమె మహాచైత్య నిర్మాణమునకు 6 స్తంభములు దానము నల్పుటచే ఈమె వివాహము అంతకుపూర్వమే జరిగియుండవలెను. ఉజ్జయిని టోలిమీ ప్రకారము చస్తానుని రాజధాని. పశ్చిమక్షాత్రపులనామములలో 'రుద్ర' సామాన్య పదము. కావున రుద్రభట్టారిక, రుద్రసేన I (122-144శక) రుద్రసింహ I (రుద్రదాముని పుత్రుడు) పృథ్వీసేన (రుద్రసేనుని I పుత్రుడు) శక 144 - 58 రాజులలో ఒకరి పుత్రిక కావచ్చును. ఛతిసిరి, బపిసిరినిక వీరపురుషదత్తుని రాణులు. ఒకతె హంమసిరి పుత్రిక. వేరొక రాణి భట్టిదేవాకన్య. ఈమె చాంతిసిరినిక పుత్రిక. చాంతిసిరినిక వీరపురుష దత్తుని అల్లునిగా పేర్కొనుచున్నది. (అపనో జామాతుక) భట్టిదేవా పుత్రుడు వీరపురుమని 20 తరువాత సింహాసనమధిష్ఠించినాడు.

క్రీ. శ. 3 వ శతాబ్ది ప్రాంతమున కార్వారినుండి అనంతపురము వరకు చూతురాజ్యము విస్తరించినది. చూతుశాతకర్ణి క్రీ. శ 3 వ శతాబ్ది ప్రాంతమున మాపల్లి శాసనములో వైజయంతి చూతురాజ్యము నకు రాజధాని అనిగలదు. (3) ఇహువుల సిరి చాంతమూలుని 11 వ సంవత్సరమున మహాదేవి కొండబలిసిరి దానశాసనము గలదు. ఈమె వీరపురుషదత్తుని భగిని. వనవాసమహారాజు భార్య. వైజయంతి వన వాసి లేక బనవాసికి నామాంతరము. ఇక్ష్వాకులకు చూతురాజులకు

---

(2) దీనారి - నాణెములు రోమకనాణెములు. ఆకాలమున కృష్ణానదీముఖద్వారదేశములకు రోమకసామ్రాజ్యమునకు గల వ్యాపారసంబంధములు సువిదితములు వినుకొండలో క్రీ. శ. 68 - 217 నాటి రోమకనాణెములు దొరకినవి (JRAS 1904).

(3) I. A. Vol. XIV P. I, EC Vol VII P. 2

గల వైవాహికసంబంధబాంధవ్యములు రాజ్యాంగసంబంధసఖ్యములకు దోహదము కల్పించియుండును.

## బౌ ద్ధ శి ల్ప ము లు

చాంతిసిరి నాగార్జునకొండలోయలోని బౌద్ధశిల్పనిర్మాణములకు గర్భకేంద్రము. ఈమె "మహాదానపతిని" 'వేలామికదాన పతిభాగవో చిమ్మధారపదాయిని' (4) వీరపురుషదత్తుని 6 వ సం॥న బుద్ధధాతుని నిక్షిప్తమైన మహాచైత్యనమును వినిర్మించినది. ఆ స్తూపము వ్యాసము 25 అడుగులు. ధర్మచక్రాకారముననున్నది. ఈ శిల్పనిర్మాణములలో రాజకాంతలు ఇతర బౌద్ధధర్మప్రియు లనేకులు తోడ్పడినారు. రుద్రధర భట్టారికామహాదేవి, ఒక అయకఖంభము దానము చేసినది. ఇట్లే అడవి చాంతిసిరి, చాపిసరినికాదేవి, చుల-చాంతి సిరికాదేవి (కులహాక కన్యక) అయకఖంభములను దానము చేసినారు. స్తూపముల సమీపమున విహారములు 'చెతియఘర' లు నిర్మించినారు. చాంతిసిరి వీరపురుషదత్తుని 18 వ సం. మున అతని ఆయుర్విజయునకు మహాచైత్య సమీపమున ఒక ఆలయమును కట్టించినది. (అపనో జామాతుకస రాజ్ఞో మాఢరీపుతస - ఇక్ష్వాకునం సిరి విరాపురి సదతస ఆయు - వధనికె విజయికె-) ఈ ఆలయమునకు ప్రాచ్యభాగమున 36 శిలాస్తంభఖండములు నేడు కన్పించుచున్నవి. ఈ స్తంభముల మీదనున్నశాసన ఖండములను సరిపోల్చిచదివిన, ఇచ్చట (చామసాల పరిగహీతం) ఒక మండపముండెడిదని చెప్పవచ్చును. 15 వ సం., వర్షఋతువులో 8 వ పక్షమున ఇది నిర్మితము. నాగార్జున కొండ లోయలోని ప్రాచీనబౌద్ధ విహార శిల్పవిలాసములు, శిథిలస్తూప సౌందర్యరేఖా విన్యాసములు చాంతిసిరి అమృతహృదయమునకు అమరత్వమును కల్పించుచున్నవి.

---

**(4) $C_8$ Eg Vol XIV p 331 : ASW I Vol v p 86**

రాజకాంతయైన చాంతిసిరితో పాటు నాగార్జున కొండలోయలోని బౌద్ధశిల్పములను సౌందర్యరేఖావిన్యాసములను తీర్చిదిద్దిన సామాన్య కుటింబిని బోధిశ్రీ చిరస్మరణీయ. ఈమె బుద్ధాంబికా రేవతుల పుత్రిక. నివాసస్థానము గోవగ్రామము. (5) కోశాధిపతియైన భద్రుని మేనకోడలు. ఈమె రెండు 'చెతియ - ఘర'లకు పునాదులు కట్టించినది. చులధమ్మగిరిపై ఈమె కట్టించిన విహారము సింహళ బౌద్ధభిక్షుకుల ప్రత్యేకావాసము. ఇంకను, కులహ విహారము, బోధి వృక్షాలయము, సిహళవిహారము, మహాధమ్మగిరిపై ఒకగుహ, మహావిహారములో ఒక మండప స్తంభము, దేవగిరిపై ఒక ధ్యానమండపము, ఒక తటాకము, పూర్వశైలమున ఒక మండపము, కంటకశిలవద్ద గల మహాచైత్య ద్వారమున శిలామండపము, హిరుంతువ వద్ద మూడుగుహలు పపిలా సమీపమున సప్తగుహలు - పుష్పగిరివద్ద ఒక శిలామండపము ఇత్యాదులు ఈమెదాన కార్యములు.

## ఇహువుళ చాంతమూల

మాధరీపుత సిరి వీరపురిసదత్తునికి, వాసిష్ఠి భట్టిదేవాదేవికి పుట్టిన సుతుడు, ఇహువుళచాంతమూలుడు. ఇతని భగిని కొదబలసిరిశాసనముబట్టి ఇతడు 11 సం. రాజ్యము సల్పినట్లు నిర్ణయింపవచ్చును. ఈ మహారాజు ద్వితీయసంవత్సరమున భట్టిదేవామహాదేవి భిక్షుకుల కొరకు కట్టించిన "దేవీవిహారము" పూర్తియైనది. ఈ విహారము నాగార్జునపర్వతపాదమునకు ఈశాన్యదిశను ఇటికరాళ్ళబోదుపైనున్నది. 11 వ సం. మున కొదబలిసిరి మహిశాసక భిక్షుకులకొరకు ఒక విహారమును, ఒక చైత్యమును కట్టించినది. ఈ చైత్యము నాగార్జునపర్వతసమీపమున కొట్టంపలగు దిబ్బమీాదనున్నది. దీనిపై

(5) గోవగ్రామము సింహళములోని గోణగ్రామకమని కొందరి యూహ.

గల 20 గుహల మధ్యనున్న శిలాస్తంభనిర్మితమైన మండపమునుండి కృష్ణానదీప్రవాహవిన్యాసము రమణీయదృశ్యముగా సాక్షాత్కరించును. 36 పాలరాతిస్తంభములు 60 చతురపుటడుగుల వైశాల్యముగల మండపమున నున్నవి.

చాంతిసిరి విశ్వసంసారమునకు స్వకుటుంబ....నకు ఐహికాముష్మికసుఖములను అర్థించినది. నాగార్జునకొండ బుద్ధశిలాప్రతిమలు మహాయానమును సూచించుచున్నవి. హీనయానవర్గము లెన్నియో నాగార్జునకొండ శిలాశాసనములలో గన్పించుచున్నవి. ఆనాడు హీనయానమహాయానములు పడుగుపేకవలె అల్లుకొనియున్నవి. సింహళమునకు నాగార్జునకొండకు ఆనాడు సన్నిహితసంబంధ ముండెడిది. నాగార్జునుని శిష్యుడు ఆర్యదేవుడు సింహళీయుడు అతని అస్థికలుగల భాండము గుంటూరు మండలమున లభించినది. (6) సింహళబౌద్ధ భిక్షుకులకు నాగార్జునపర్వతమున ప్రత్యేకవిహారము గలదు. సింహళ బౌద్ధమతస్థుడు, ఒక విహారము నాగార్జునపర్వతమున కట్టించినాడు (7) నాగార్జునకొండలోయలోని కంటకొసిల, పెద్దవ్యాపారకేంద్రము ....... ఇదే టోలిమీ కృష్ణాముఖద్వారమున పేర్కొనిన కంకనోసిల యని నిర్ణయింపవచ్చును.

## నాగర్జునాచార్యులు

బౌద్ధమతప్రపంచమున మాధ్యమికవాదమును ప్రపంచించిన తత్వవేత్త నాగార్జునుడు. బౌద్ధవేదాంతమున శూన్యవాదప్రవక్త. హీనయానము బౌద్ధప్రాచీనస్వరూపము. అర్వాచీనశాఖ మహాయానము నాగార్జునాచార్యుల కాలములలో మహాయానము నూత్నచైతన్యముతో విలసిల్లినది. నాగార్జునుని నాగలోకయాత్ర ప్రజ్ఞాపారమితసిద్ధాంతమునకు మూలము. ఐతిహ్యము నాగార్జునుని సర్వజ్ఞునిగా ప్రస్తుతించు

---

(6) **Gopalachari p 146**

(7) ,, ,,

చున్నది. బౌద్ధగాథలు సిద్ధపురుషునిగా పేర్కొనుచున్నవి. నాగార్జునుని గ్రంథములు ప్రాచీన చీనాసారస్వతమున పరివర్తనములై కన్పించుచున్నవి. భారతదేశమున నాగార్జునుని గ్రంథములు ఉపలభ్యమానములుగా లేవు. అర్వాచీన భారతీయగ్రంథములలో నాగార్జునుని స్మరించని ప్రాచీనవైద్యగ్రంథము లేదు. (1) అతడు శుశ్రుతమును పునరుద్ధరించెను. ఆరోగ్యమంజరిని కక్షపుతతంత్రమును రచించినాడు. నాగార్జునుని నేత్రనిదానము చీనాలో సుప్రసిద్ధము. విషవైద్యములో నాగార్జునుని చికిత్సను బాణుడు ప్రశంసించినాడు. వివిధరోగములకు నాగార్జునుని చికిత్సలు శిలాక్షరములుగా చీనాదేశమున స్తంభముల చెక్కించినారు. ఇతిహ్యాము అతడు అమృతయోగమును అందుకొన్నాడని కమ్మని కథలు చెప్పుచున్నది. నాగార్జునునకు సమకాలీనుడైన శాతవాహనరాజు 150 సంవత్సరములు జీవించినాడని, ........ యువరాజు ప్రార్థనచే నాగార్జునుడు జీవితమును త్యజించినాడని అంతటితో శాలివాహనరాజుగూడ నాగార్జునునితో మరణించినాడని జనశ్రుతి. రసరత్నాకరములో నాగార్జునుని నివాసము శ్రీపర్వతముగా కన్పించుచున్నది.నేడు నాగార్జునకొండగానున్న ప్రాచీనశ్రీపర్వతముపై నాగార్జున సంఘారామములలో రసాయనికపరిశోధనలు జరుగుచుండెడివి.రసరత్నాకరములోని పాదరసయోగములు,వజ్రశోధనమును బట్టి నాగార్జునుడు భారతరసాయనికశాస్త్రమునకు మూలపురుషుడని చెప్పవచ్చును. నాగార్జునుడు సమకాలీనుడు స్కందుడను సుప్రసిద్ధ రసాయనిక పరిశోధకుని పేర్కొనినాడు. నాగార్జునుడు ఖనిజశాస్త్రనిష్ణాతుడు. అతని రసాయినికశోధనలు సుప్రసిద్ధములు. అన్నభేదిని ప్రథమమున నిర్మించినది అతడే. ........ ఓషధీశాస్త్రము రసాయనిక విద్య, ఖనిజప్రయోగములు శ్రీపర్వతబౌద్ధ విశ్వవిద్యాలయమున

(1) P. C. Ray: History of Indian Chemistry.

నాగార్జునుని ఆచార్యపీఠమున విశ్వవిఖ్యాతి గడించినవి. యువాన్ చాంగ్ నాగార్జునుడు రసవాదములోగూడ సిద్ధహస్తుడని వర్ణించినాడు.

ప్రజ్ఞాపారమితశాస్త్రము (2) ప్రజ్ఞామూలశాస్త్రటీకము (3) ప్రజ్ఞాప్రదీపశాస్త్రకారికలు(4)మూలమాధ్యమికశాస్త్రము శూన్యసప్తాధి(5) మధ్యాంతానుగమశాస్త్రము (6) దశభూమిలిభాష. శాస్త్రము (7) ద్వాదశనికాయశాస్త్రము (8) వివాదసమానశాస్త్రము. ప్రయాణ విహేతనము ఉపాయకౌశల్యహృదయశాస్త్రము. విగ్రవ్యావర్తిని కారికము మున్నగునవి చీనావాఙ్మయములో ఉపలభ్యమానము లగుచున్న నాగార్జునుని గ్రంథములు.

ఈ జగత్తు కేవలము మిథ్యగాదు. కేవలము తథ్యమును గాదు. జగత్తు పరిమితసత్యము. ఏ పదార్థమునకు నిరపేక్షికమైన అస్తిత్వము లేదు. జగద్వలయము సదా ఈ సత్యము కేంద్రముగా పరిభ్రమించు చుండును. సృష్టిలయములు, అస్తిత్వ, నాస్తిత్వ సంబంధ భావములు, అన్నియు మిథ్యములు. కావున మన భ్రమలకు ఆద్యప్రకృతు లగుచున్నవి. అశాంతిదుఃఖములకు ఆలవాలమైన ఈ భ్రమలను మానవుడు వీడలేనంతకాలము, సుఖదుఃఖానుభవ డోలాకలితమైన జీవితమునుండి విముక్తి లేదు-పరిమితత్వ మున్నచోట సత్యము లేదు. సత్యమును చేరుటకు పరిమితత్వమునుండి విముక్తి గల్గవలెను. అప్పుడు సత్యము లేక శూన్యము సాక్షాత్కరించును. శూన్యము లేక నిర్వాణము నిర్వికల్పమైన వైరుధ్యము లన్నియు అదృశ్యమైన అపరిమితత్వము. (9)

---

(2) Catalogue of Chinese Tripitaka No, 1169, an encyclopaedia of Mahayana.
(3) Giles : History of Chinese literature.
(4) See (2) 1185.
(5) No. 1246.
(6) See (2) 1180; (7) 1186; (8) 1251.
(9) S. C. Vaidyabhushanam.

శాతవాహనచక్రవర్తి నాగార్జునునికొఱకు ఒక పర్వతమును దొలిపించి విహారమును కట్టించెను. నాగార్జునుని గ్రంథములలో కనిష్కుడు, అశ్వఘోషుడు మున్నగు నామములు కన్పించుచున్నవి. నాగార్జునుని శిష్యుడు ఆర్యదేవుడు సింహళరాజవంశచరిత్రయగు మహా వంశములలో క్రీ. శ. 3 వ శతాబ్దిలో పరిపాలించిన విహారతిష్యునికి అభయునికి (209-219) సమకాలీనుడని కలదు. చీనావాఙ్మయ చరిత్రలో నాగార్జునుని ప్రజ్ఞామూలశాస్త్రము క్రీ. శ. 196-221 సం॥ మధ్య వ్యూకన్ పరివర్తించినట్లుగలదు. (10) కావున నాగార్జునుడు క్రీ. శ. 2 వ శతాబ్ద్యంతమున లేక 3 వ శతాబ్ద్యాదిని జీవించినాడని చెప్పవచ్చును. క్రీ. శ. 401, నాగార్జునుని గ్రంథములను చీనావాఙ్మయమున- కుమారవిజయుడు పరివర్తించినాడు.

నాగార్జునుడు శాతవాహనరాజునకు వ్రాసిన సహృల్లేఖ వలన శాతవాహనరాజునకు సమకాలీనుడని తేలుచున్నది. ఇది ఛందోబద్ధమైన కవిత. దీనిని ఇట్సింగు తామ్రపర్ణిద్వీపములో చీనాభాష లోనికి పరివర్తన జేసెను. తారానాధుడు, నాగార్జునుడు అమరావతీ స్తూపములోని అంతర్భాగమున బుద్ధధాతువును నిక్షిప్తముచేసి ప్రతిష్ఠించెనని వ్రాసెను.

నాగార్జునుడు వేదాంతి, కవి. రసాయనికవిద్యానిష్ణాతుడు. ఖనిజశాస్త్రపరిశోధకుడు. తార్కికుడు. ప్రాచీనభారతచరిత్ర నాగార్జునుని వంటి పూర్ణపురుషుని ప్రసాదింపలేదు. వేదాంతములో నాగార్జునుని శూన్యవాదము, మిథ్యాతత్వము శంకరుని మాయావాదమునకు ఆద్యప్రకృతి. నాగార్జునుడు శంకరాచార్యులకు పూర్వరంగ ప్రవర్తకుడు. శ్రీ పర్వతమున బౌద్ధవిశ్వవిద్యాలయమునకు నాగార్జునుడు కులపతి. శ్రీ పర్వతసంఘారామము రసాయనిక జిజ్ఞాసువులకు, ఖనిజపరిశోధనలకు తీర్థభూమియైన ప్రయోగశాల.

(10) Giles History of Ehinese literature.

ఆర్యదేవుడు, నందుడు, నాగుడు నాగార్జునుని శిష్యులు. భావవివేకుడు, దిజ్నాగుడు మున్నగు తాత్వికులు నాగార్జునునికి అర్వాచీనులు. దిజ్నాగుని ప్రమాణసముచ్చయము తర్కప్రపంచమున సుప్రసిద్ధము. వీరందరు నాగార్జునికి శిష్యులు కాకపోయినను, నాగార్జునునిప్రభావముద్ర వీరిరచనలపై తత్త్వముపైగనుపించుచున్నది.

ఆ కాలమున నాగార్జునవిహారవిశ్వవిద్యాలయముజగత్ప్రసిద్ధమై దేశదేశములనుండి జిజ్ఞాసువుల నాకర్షించినది.

## పల్లవులు

శాతవాహనరాజ్యము అస్తమించిన తర్వాత దక్షిణమున స్వతంత్రరాజ్యమును పల్లవరాజులు నెలకొల్పినారు. గౌతమీపుత్ర శాతకర్ణి పహ్లవులను యవనులను శకులను జయించి క్షహరాట వంశమును నిర్మూలించినట్లు శిలాశాసనమున గలదు (1) పల్లవుల నాణెములు శాతవాహనరాజుల నాణెములను పోలుచున్నవి. ప్రాచీన పల్లవశాసనములు గౌతమీపుత్రశాతకర్ణి శాసనములను పోలుచున్నవి (2) కావున గౌతమీపుత్రశాతకర్ణి జయించిన పహ్లవులే పల్లవులకు మూలపురుషులని సిద్ధించుచున్నవి. పల్లవులు శాతవాహనకాలమున సామంతులైయుండి అర్వాచీనకాలమున స్వతంత్రులైరని ఒకవాదము.

సింహళరాజచరిత్ర 'మహావంశము'లో దుత్తగామిని నెరపిన మహోత్సవమునకు పల్లవబొగ్గనుండి అనేకబౌద్ధభిక్షుకులు వచ్చినట్లు గలదు. 'పల్లవబొగ్గ' ఆంధ్రదేశములోని రాజ్యము. ఇది పల్లవనాడు పలనాడు, పల్నాడుగ కాలాంతరమున మారినది. బౌద్ధజాతక కథలలో కాలుడను నాగరాజు కృష్ణాముఖద్వారదేశమునకు పాలకుడు. ప్రాచీన పల్లవరాజులలో కాలనాముడు కనపడుచున్నాడు. సింహళదేశములో

**(1) Nasik,**

**(2) E I Vol VI p84, Vol I p2, Vol VI I p143.**

గూడ బౌద్ధమతము మిక్కిలి ప్రాచీనము. అనేక బౌద్ధకథలు ధ్యాన కటకప్రాంతమందలి వజ్రాలదిబ్బను సింహాళమును ముడిపెట్టు చున్నవి. కావున "పల్లవభాగ" నేటి పలనాడుకు ప్రాచీనరూపమని, ప్రాచీనకాలమున పల్లవులకు వాసస్థానమని మరియొక వాదము.

గౌతమీపుత్రశాతకర్ణి నాటి పహ్లావులు విదేశీయులని ఊహింప వచ్చును. వారిని యవనులు, శకులతో కలిపి పురాణములు శిలా శాసనములు పేర్కొనుచున్నవి. రుద్రమాన్ రాజ్యములోని పరిపాలకు డొకడు పహ్లావుడు కన్పించుచున్నాడు. శాతవాహనకాలమున, ఈ యవనులు, శకులు, పహ్లావులు భారతీయనామములుధరించి, హిందూ మతము లేక బౌద్ధమతమును స్వీకరించి భారతీయసంఘములో కలిసి పోయిరి. ఈనాడు, ఆర్యులను విదేశీయులనిన ఎంతసత్యమో పల్లవు లను విదేశీయులనిననుఅంత సత్యమే. హిందూమతము, బౌద్ధమతము ఆనాడు వివృతద్వారములతో అన్యమతస్థులను ఆహ్వానించినవి. వివిధజాతులు మహానదిలో జేరు ఉపనదులవలె కలిసిపోయినవి.

పహ్లావులు శాతవాహనరాజ్యకాలమున 'పల్లవబొగ్గ'లో వాస స్థాన మేర్పరచుకొనిరి. ప్రాచీనపల్లవశాసనములు బళ్ళారి, గుంటూరు నెల్లూరు మండలములలో దొరికినవి. సింహవిష్ణుని ప్రాచీనశాసనములు గుంటూరు నెల్లూరు జిల్లాలలో నున్నవి. ప్రాచీన శిలాశాసనములను బట్టి పల్లవరాజ్యము కృష్ణానదికి దక్షిణప్రాంతముగ నెంచవచ్చును. క్రీ. శ. 6వ శతాబ్దివరకు పల్లవరాజ్యములో అధికభాగము కృష్ణానదికి దక్షిణముననున్న తెలుగుదేశమే. తెలుగుదేశములో ప్రాచీనైతిహ్యాము, శాసనములు చాళుక్యరాజును ముదివేలువద్ద నెదుర్కొని చంపిన త్రిలోచనపల్లవుని పేర్కొనుచున్నవి. కావున పల్లవరాజ్యము తెలుగు దేశమందు గుంటూరుమండలమున ఆరంభించి క్రమక్రమముగా విస్తరించినదని యెంచవచ్చును.

వేలూరు పాలయము తామ్రశాసనము (9 శతాబ్ది) వీరకూర్చుడు నాగకన్యకను వివాహమాడి రాజ్యమును సంపాదించెనని చెప్పుచున్నది. ఐతిహ్యములో పల్లవుడు అశ్వత్థామకు నాగకన్యకకు జన్మించినట్లు గలదు. ప్రాచీనకాలమున పల్లవనాడు లేక పల్లవభోగ్గ ప్రాంతమును నాగులు పాలించినారు. ఈ నాగులు ఆదిమనివాసులలో ఒకజాతి అని తోచుచున్నది. వీరు బౌద్ధమతమును స్వీకరించినారు. బౌద్ధకథలు నాగరాజును పేర్కొనుచున్నవి. అమరావతీస్తూపమున నాగరాజుల చిత్రములు గలవు. బుద్ధుని ధాతువులతో నాగరాజులను ముడిపెట్టు కథలు గలవు. అమరావతీ నాగార్జున కొండస్తూపములలో బుద్ధధాతువులు నిక్షిప్తము లయినవి. ఇద్దరు మనుష్యులు బుద్ధుని అస్థికలను పట్టుకొని పడవపైనుండి తీరమున దిగుచున్నప్పుడు, నాగరాజు స్వాగతమిచ్చుచున్న చిత్రము అమరావతీస్తూపమున గలదు. తామ్రలిప్తినగరమునకు సింహళద్వీపమునకును మధ్యనున్న వజ్రాల దిన్నెకు(ధాన్యకటకము - అమరావతి) బౌద్ధకథలు, బుద్ధుని అస్థికలకు ముడిపెట్టుచున్నవి. దీనినిబట్టి బౌద్ధమతమును స్వీకరించుటకు పూర్వము, ఆదిమవాసులు నాగులు అనిగాని 'నాగ' మతావలంబులు అనికాని నిర్వచింపవచ్చును. ఆంధ్రదేశములోని ఆదిమనివాసులతోకలిసి పల్లవులు ........ రాజ్యమును స్థాపించికొనియుందురు. పల్లవుల అర్వాచీనరాజ్యము పల్లవభోగ్గ నాగుల ప్రాచీనావాసము.

టోలిమీ బస్సరా నాగులను పేర్కొనెను. (4) ప్రాచీన తమిళ వాఙ్మయము ఓవియనాగులను పేర్కొనుచున్నది. (5) పల్లవులు, నాగకన్యకలను వివాహమాడి, నాగమండలమున రాజ్యమును స్థాపించిరి. ఈ పల్లవులే గౌతమీపుత్రశాతకర్ణినాటి విదేశీయులైన పహ్లావులనుట

(4) **Ptolemy Macindle.**

(5) **S. K. R. Subrahmanyamgar.**

ఊహామాత్రమైనను సత్యదూరము కాదు. యవనులు, పల్లవులు, ఇక్ష్వాకులు శాతవాహనుల వీరికి అన్యోన్యవివాహబంధములు కన్పించుచున్నవి. మత్స్యపురాణము ఆకాలమున ఇట్టి సాంఘిక విప్లవ విపరిణామమును సూచించుచున్నది.

ప్రాచీనపల్లవచరిత్ర గుంటూరు, నెల్లూరు, బళ్ళారి మండలములలో లభించిన మైదవోలు, కందుకూరు, హిరడగళ్ళి తామ్రశాసనములవలన లభించుచున్నది. (6) ఈ శాసనములు అక్షరసామ్యమును బట్టి ఏకయుగమునకు చెందినదని ఊహింపవచ్చును.

బప్పదేవ
|
శివస్కంధవర్మ మహారాజు లేక విజయస్కంధ మహారాజు
|
యువరాజు బుద్ధవర్మ : చారుదేవి.
|
బుధ్యాంకుర

పూర్వోక్తమైన ఈ వంశవృక్షము ఆ శాసనములవలన నిర్మింపవచ్చును (7)

బళ్ళారిమండలములోని శాతవాహనచక్రవర్తి మ్యాకదోని శాసనము క్రీ. శ. 225 ప్రాంతము నాటిది. బళ్ళారిమండలములోని శివస్కంధవర్మమహారాజు హిరడగళ్ళి శాసనములో అతని తండ్రి బళ్ళారిమండలమును క్రీ. శ. 225 సం.ము తరువాత పరిపాలించియుండును. క్రీ. శ. 225 ప్రాంతము శాలివాహనసామ్రాజ్యమునకు అపరసంధ్యాసమయము. శివస్కంధవర్మ మహారాజు ఆ ప్రాంతమున

(6) E I Vol VI p 84. M. E R. 1900 P 4
(7) K. R. Subrahmanyam E I, Vol 1 1-2 E. I. Vol VIII P 148.

స్వతంత్రుడై యుండును. మైదవోలుశాసనములో శివస్కంధవర్మ యువమహారాజు, పల్లవవంశీయుడు తండ్రిపదవ రాజ్యసంవత్సరమున గ్రీష్మఋతువు పంచమినాడు ఆంధ్రపథములోని "విరిపర" గ్రామమును దానము చేసినాడు. ఈ ఆజ్ఞాపత్రము ధాన్యకటకములోనున్న తనవ్యాపృతునకు ఇచ్చినది. మైదవోలు శాసనము కాంచీపురమున ప్రకటితము. కావున శాసనములో రాజ్యసంవత్సరములనుబట్టి, అక్షర స్వరూపమునుబట్టి, ప్రాచీనప్రాకృతభాషాప్రయోగమునుబట్టి ఇది శాతవాహనరాజశాసనములను పోలుచున్నది. కావున కాంచీపురమును శివస్కంధవర్మమహారాజు తండ్రి జయించియుండునని, యువరాజుగ శివస్కంధవర్మమహారాజు తండ్రికి తోడ్పడియుండునని ఊహింపవచ్చును. శివస్కంధవర్మకు అవ్యవహితపూర్వము పరిపాలించినరాజు కాలమున పల్లవరాజ్యము కాంచీపురమునుండి ధాన్యకటకమువరకు వ్యాపించినది. ధాన్యకటకప్రాంతమును శివస్కంధవర్మ యువరాజుగ రాజప్రతినిధిగ పరిపాలించినాడు.

శివస్కంధవర్మను రాజాధిరాజుగ హిరాహాడగల్లి శాసనము పేర్కొనుచున్నది. ఇతడు అగ్నిష్టోమము, వాజపేయము, అశ్వమేధము మొదలగు యజ్ఞములను సల్పినాడు. శివస్కంధవర్మకు పూర్వము పరిపాలించిన 'బప్ప' మహారాజు లక్షయకరములను; నాగళ్ళను, దుక్కిటెద్లను బ్రాహ్మణులకు దానము చేసినాడు. ఈ దానము అరణ్యములనుకొట్టి,భూములను సాగుచేయు వ్యవసాయమునకు దోహదము కల్పించు బృహత్ప్రణాళికను సూచించుచున్నది. (ఇక్ష్వాకుల శతసహస్రహలప్రదానము స్మర్తవ్యము.)

శివస్కంధవర్మకు సమకాలమున వేంగిని బృహత్ఫలాయనులు పరిపాలించిరి. ఇక్ష్వాకులు శ్రీశైలము మొదలు దక్షిణకోసలను గోదావరీముఖద్వారమున ఉత్తరతీరమును పరిపాలించిరి. ఇక్ష్వాకుల

రాజ్యము అమరావతివరకు కొంతకాలము విస్తరించియుండును. కాంచీపురికి దక్షిణమున పల్లవరాజ్యము ఎంతవరకు విస్తరిల్లినదో చెప్పుటకు చారిత్రకాధారములు లేవు. పల్లవులకు అర్వాచీనకాలమున చోళులు కాంచీప్రాంతముల పరిపాలించినారు. బళ్ళారిమండలము కర్ణాటదేశము కొంతభాగము పల్లవరాజ్యమున శివస్కంధవర్మ కాలమున నున్నది. కాని, అర్వాచీనకాలమున బృహద్బాణునితో గలిసి కదంబులు కర్ణాటము నాక్రమించిరి. శివస్కంధవర్మ తరువాత రాజుల చరిత్రపై ప్రస్తుతము పొగమంచుగ్రమ్మియున్నది. చారుదేవి మామగారైన విజయస్కంధవర్మ రాజ్యమున నారాయణదేవాలయమునకు దానము చేసినది.

అర్వాచీనపల్లవరాజులలో సముద్రగుప్తచక్రవర్తి అలహాబాదు శాసనము పేర్కొనిన విష్ణుగోపమహారాజు కన్పించుచున్నారు. క్రీ. శ. 340 వరకు పల్లవులు కాంచీరాజ్యమును పరిపాలించినారు. సముద్రగుప్తుడు విష్ణుగోపుని ఓడించిన తర్వాత కాంచీరాజ్యచరిత్ర తెలియుట లేదు. శాలంకాయనులు వేంగిరాజ్యమును పరిపాలించినారు. కదంబబ్రాహ్మణులు పశ్చిమ క్షేత్రమున ప్రజ్వరిల్లినారు. చోళరాజ్యము విస్తరించినది. కాంచీ రాజ్యము చోళసామ్రాజ్యములో అణగిపోయినది. సముద్రగుప్తుని దండయాత్ర దక్షిణదేశప్రాచీనరాజ్యముల పునాదులతో పెకలించినది.

స్కంద శిష్యుని తరువాత (8) నున్న కుమారవిష్ణు తిరిగి కాంచీ రాజ్యమును ఆక్రమించినాడు. కుమారవిష్ణుని కుమారుడు బుద్ధవర్మ, చోళసముద్రవాహినులకు బడబాగ్ని(9) కాంచీపట్టణమును చోళులు తాత్కాలికముగ జయించినారన్న విషయముపై చారిత్రకులకు

(8) వేలూరు పాలయము శాసనము. స్కందవర్మకు – స్కంద శిష్యునికి అభేదము కల్పింప వచ్చునా ?

(9) Ibid.

ఏకవాక్యత కుదుర లేదు. డాక్టరు ఎస్. కె. అయ్యంగారు చోళులు కాంచిని, కుమారవిష్ణునకు పూర్వము ఆక్రమింపలేదని, బుద్ధవర్మ చోళసముద్రము, చోళకాలభ్రులకు చెందునని వాదించుచున్నారు. విష్ణుగోపుని తర్వాత పల్లవరాజ్యము యుద్ధములలో మునిగినది. పల్లవులు కదంబులతో ఎడతెగని యుద్ధములు చేసినారు. కాని కదంబ రాజ్యము ఒకనాడు తమిళదేశమునంతయు ఆక్రమించి విస్తరిల్లినది.

## బృహద్భారతము - బృహదాంధ్రము

భారతద్వీపకల్పమున సముద్రతీరమంతయు దక్షిణాపథమును ఆవరించుచున్నది. దక్షిణాపథరాజ్యములు ప్రాచీనచరిత్రలో నౌకా యానమున మిక్కిలి ప్రసిద్ధివహించినవి. చీనా, రోమకసామ్రాజ్యము లకు దక్షిణాపథమునకు క్రీ. పూ. 2, 3, శతాబ్దులలో గల నౌకావర్తక సంబంధములకు అనేక నిదర్శనములు గలవు.

కృష్ణా గోదావరీ పినాకినీ వంశధారానదీముఖములు ప్రాచీన కాలమున సముద్రయానములో నౌకాశ్రయములుగ వర్ధిల్లినవి. ఆంధ్ర మహాసామ్రాజ్యమున గోదావరీకృష్ణానదులు వ్యాపారనౌకలకు రహదారులు. రోమకసామ్రాజ్యమునుండి చీనాదేశమునుండి సుమిత్ర యవద్వీపమునుండి, సువర్ణకామరూపభూములనుండి సముద్రనౌకలు కృష్ణానదీముఖద్వారమున ఆంధ్రశాతవాహనరాజ్యమును ప్రవేశించు చుండెడివి. నాగార్జునకొండ మహాచైత్యములో ఇక్ష్వాకులనాటి శిలా శాసనమునుబట్టి అచటికి సింహళ చీనా....యాత్రికులు వచ్చుచుండెడి వారు అని చెప్పవచ్చును.

నాగార్జునకొండలలో ఒకపర్వతసానువు విశాలవేదికగా గన్పించు చున్నది. ఆంధ్రసామ్రాజ్యమునుండి చీనారోమకసామ్రాజ్యములనుండి సముద్రనౌకలు, ఈ విశాల పర్వతసానువేదికపై సరకులను దింపు కొనుచుండెడివని ఊహింపవచ్చును. ఆంధ్రశాతవాహన చక్రవర్తి

పులోమావి నాణెములపై సముద్రయానమును సూచించు రెండు తెర చాపల నావబొమ్మ కలదు.

## రోమక సామ్రాజ్యము - దక్షిణాపథము

దక్షిణాపథములో చాలచోట్ల రోమక సామ్రాజ్య చక్రవర్తుల నాణెములు దొరికినవి. ఆంధ్రదేశమున గుంటూరుమండలమున వినుకొండలో గూడ రోమకనాణెములు బయల్పడినవి. రోమకసామ్రాజ్యములో శాసనసభ్యుడు ప్లినీ (80. ఎ. డి.) గోదావరిముఖద్వారము నావలకు సంగమస్థానమనియు, అక్కడనుండి నావలు గంగానదీ ముఖమువరకు పోవుచుండెడివని వ్రాసెను. ప్లినీ రోమకశాసన సభలో భారతదేశమునకు రోమకదేశమునుండి బంగారము అమితముగ ప్రవహించుచున్నదనియు రోమకస్త్రీలు భోగపరాయణతచే భారతదేశములోని నూలువస్త్రములకు విరుగపడుచున్నారనియు విచారించినాడు. అలెగ్జాండ్రియా వాస్తవ్యుడైన వ్యాపారి వ్రాసిన పెరిప్లను గ్రంథములో కృష్ణాగోదావరీతీరముల రేవుపట్టణములను (80. ఎ. డి.) పేర్కొనినాడు. గ్రీకుభూగోళజ్ఞుడు టోలిమీగూడ కృష్ణాగోదావరీ నదులనుండి వర్తకనౌక విదేశములకు పోవుటను సూచించినాడు (140 A. D.). (1) పెరిప్లసు గ్రంథకర్త తీరయానమునకు- విదేశయానమునకు రెండు విధములగు నావలను పేర్కొనినాడు.

నికోలను డెమోస్కినోజు ఒకసారి అగస్టసుసీజరు వద్దకు భారతదేశమునుండి వచ్చిన రాయబారులను చూచినానని చెప్పినాడు. (2)

---

(1) Schoff - Periplus prof Gerini - Researches on Ptolemy's Geography P. 743.

(2) Macerindle - Quoted by K. A. Nilakanta Sastry. Foreign notices of South India

## వాణిజ్యము

పెరిప్లసు గ్రంథము సన్ననినూలు, రంగురంగుల వస్త్రములు అద్దకములు వాణిజ్యకేంద్రములగు వాగరా, ప్రతిష్ఠానపట్టణములకు బండ్లపై మైసోలోను (కృష్ణా గోదావరీ మధ్యదేశము) నుండి చేరు చుండెడివని చెప్పుచున్నది. ఆ కాలమున మచిలీపట్టణము తత్సమీప మునన్ను సోపట్టణము గొప్ప రేవుపట్టణములు. టోలిమీ, కంట కోసిల, కొట్టీసు కొద్దూర, అల్లోసిగినె గోదావరీ ముఖద్వారసమీపమున పేర్కొనెను. ఇచటనుండి సువర్ణభూమికి నావలు పోవుచుండెడివి. (3) తూర్పుదేశమునకు సరకులు పాదౌకె, మెలాంగె, సోపట్టణము లకు నావలమీద ఈజిప్టునుండి వచ్చుచుండెడివి. (4) మలయ, సుమిత్ర ద్వీపములలోని సుగంధద్రవ్యములు, తూర్పుసముద్రములలోని పగడ ములు, కర్పూరము, చీనాంబరములు ఆంధ్ర పట్టణములలోని వణిగ్వీ ధులలో సుపరిచితములు. (5)

## చీనా

క్రీ.శ. మొదటి శతాబ్దివాడు పాన్‌కౌ అను ప్రాచీనచీనారచయిత దక్షిణాపథమునకు చీనాదేశమునకు క్రీ. పూ. 2 వ శతాబ్దినుండి క్రీ. శ. మొదటి శతాబ్దివరకు గల వ్యాపారసంబంధములను పేర్కొనెను. (6)

"జీనమ్ ద్వారములనుండి (ఉత్తర అన్నాము) అయిదు నెలలు నావలో ప్రయాణము చేసిన తాన్‌యువాను రాజ్యమును చేరవచ్చును. మరినాలుగు నెలలతర్వాత ఐ-కౌ-మొ. ఇరువదిదినముల తర్వాత

(3), (4), (5) టోలిమీ

(6) Discovered by Paul Pelliot Quoted by K A, Nilakantha Sasty, in Foreign Notices of South India

చెన్-లి రాజ్యము. అక్కడనుండి పదిరోజులు నేలమీద పయనించిన పౌ-కన్-టౌ-వౌ చేరవచ్చును. అక్కడనుండి సముద్రమున రెండు నెలలు ప్రయాణము చేసిన హాంగ్-చీ రాజ్యము చేరుదురు - (కాంచీ రాజ్యము) ఈ రాజ్యములు జనసమ్మర్దముగల దేశములు, 'వౌ' చక్రవర్తి కాలమునుండియు క్రీ. పూ. 140-86 ఈ రాజ్యములనుండి చీనాకు సరకులు చేరుచున్నవి. రాజప్రాసాదమునకు చెందిన ద్విభాషులు నావికులతో కలసి ఈ దేశములకు పోయి బంగారమును, చీనాంబరములను ఇచ్చి, పగడములను, వైడూర్యములను, రత్నములను కొను చుండిరి. వీరిని విదేశనావికులు తమనావలపై చీనాదేశమున దింపు చుందురు. సముద్రయానమున తుపాను భయంకరమైనది. యువాన్‌చె చక్రవర్తి (క్రీ. శ. 1-6) చీనానుండి కాంచీరాజునకు కానుకలను పంపెను.

'హంగ్‌చీ' రాజ్యమునుండి ఎనిమిది నెలల సముద్రయానమున మవ పీ' చింగ్‌ద్వీపమును (మలయద్వీపకల్పమునకు పశ్చిమమున నున్నద్వీపము) చేరుదుము"

ఖారవేలుడు క్రీ. పూ. 170 ప్రాంతమున బౌద్ధభిక్షుకులకు చీనాంబరములను బహూకరించెను. (7) కాళిదాసు పతాకముగా నెగురుచున్న చీనాంశుకమును పేర్కొనెను. (8) నాగార్జునుని ప్రజ్ఞా మూలశాస్త్రము చీనాభాషలోనికి క్రీ. శ. 196-221 మధ్య వ్యూకన్ అనువదించినాడు. (9) పాహియాను, యువాన్‌చాంగ్ అను సుప్రసిద్ధ యాత్రికులు హిందూదేశమునకు వచ్చిరి. పాహియాన్ తామ్రపర్ణి (సింహళద్వీపమున) ఓడనెక్కి చీనాదేశమునకు మరలిపోయెను.

---

(7) హాతిగుంఫ శిలాశాసనము.

(8) అభిజ్ఞానశాకుంతలము.

(9) Giles History of Chinese Literature

(బాణుడు ఆంధ్రరాజులను త్రిసముద్రాధి పతులుగ పేర్కొనెను కావున ఆంధ్రనౌకలు ప్రాచ్యదేశములకు పోయి వ్యాపారానుబంధములను పెంపొందించెనని ఎంచవచ్చును.)

టోలిమీ భారతదేశమునకు ఇరుగుపొరుగుననున్న దేశములను పేర్కొనినాడు. ఆ దేశముల నామములు, పట్టణములు, వర్తక వ్యాపారవిశేషములు, ఆ దేశములకు భారతదేశమునకు అందు దక్షిణాపథమునకు ఆంధ్రకళింగదేశములకు గల ప్రాచీనానుబంధములను స్వయంవ్యక్తము చేయుచున్నవి. అరకాన్ రాజధాని త్రిలింగ. కాకుళము ఒక పట్టణము. ఈ నామములను ఆంధ్రనావికులు ప్రాచీన కాలమున తమ అధినివేశములకు ఆప్యాయముతో పెట్టిన పేరులు. బర్మాలో దక్షిణాపథవాసులు నిర్మించిన అధినివేశరాజ్యములు క్రీ. పూ. ఏడవశతాబ్దినుండి గలవని గెరిని అభిప్రాయము. (9) పాండురంగ, అమరావతి, విజయ, కాహిర, తకోల, లిగరు, సింహపురము కళింగ, భోజ – ఇత్యాది నామములు ప్రాచీనభారతదేశములోని నామములకు ప్రతిబింబములు. జావాద్వీపమునకు ప్రాచీననామము కళింగ ద్వీపము. నేటికిని జావా బోర్నియోద్వీపములలోని ప్రాచీనశిలలు పర్వతగుహలు, బుద్ధమూర్తులు ఆంధ్రసంస్కృతికి వానికిగల పూర్వానుబంధములగూర్చి మౌనముగా సాక్ష్యమిచ్చుచున్నవి. ప్రాచ్యదేశములకు, దక్షిణభారతదేశమునకుగల ఈ సంబంధము అర్వాచీనకాలమున 12 వ శతాబ్దివరకు కూడ సాగినది. శక్తివర్మన్, రాజరాజ II, తూర్పు చాళుక్యరాజుల నాణెములు అరకాను సయాములో దొరికినవి. (10)

---

9 See Buddistic remain of Andhra
K. R. Sobrahmanyam p. 133

10 I. A. Vol. XIX P79 Burnell South Indian Paleagraphy

రప్పించుకొనెను. ఈ త్రైలింగరాజు వేగిని పరిపాలించిన శాలంకాయన వంశీయుడు. (17)

## మలయ ద్వీపకల్పము : చంప

ప్రాచీనకాలమున చీనానుండి హిందూదేశమునకు సముద్ర యానమున మలయద్వీపకల్పము ఒక మజిలీగా పాన్ కా పేర్కొనినాడు. (18) దీనిని ప్రాచీనులు సువర్ణభూమియని, వ్యవహరించిరి. ఇచ్చట ప్రాచీనవిగ్రహములలో భారతీయకళ ప్రతిబింబించినది. ప్రస్తుత ఇండోచీనాదేశము ప్రాచీనకాలమున అమరావతి, విజయ పాండురంగరాష్ట్రములు. మూడవశతాబ్దికి చెందిన శిలాశాసములోని అక్షరములు వాసిష్ఠీపుత్ర శాతకర్ణి కాన్హేరి అక్షరములను పోలుచున్నవి. ఈ లిపి, ఆంధ్రకళింగమునుండి 'చంప' దేశములకు చేరియుండును. (19) ఇండోచీనా (చంప) దేశపులిపి ప్రాచీన దక్షిణాపథలిపిని పోలుచున్నది. భద్రవర్మ మహారాజు పల్లవరాజులు ఇట్టి బిరుదమునే వహించి హిందూదేశమునకు రాయబారము నంపెను. (250 A. D.) (20). చంపారాజులు చంద్రవర్మ, దేవవర్మ, జయవర్మ ఇత్యాదినామములు వేగిరాజుల నామములే. చంపారాజ్యములోని శాసనములన్నియు సంస్కృతభాషలోనున్నవి. అర్వాచీనశాసనములలో శాతవాహనశకము ప్రయుక్తము.

## సింహళము

సింహళద్వీపమునకు ఆంధ్రదేశమునకు చరిత్రలో పురానుబంధములు గలవు. ప్రాచీనకాలమున దేశాంతరములకు ప్రాకినది

---

17. J. O. R. Madras Vol II P. P. 112, 14.
18 Foreingn Notices of South India K. A. Nilakanta Sastry.
19. K. R. Subrahmanyam,
20. — ,, —

బౌద్ధసంస్కృతి. బుద్ధునిధాతువులు అమరావతీస్థూపములో నాగార్జున కొండ మహాచైత్యములో నిక్షిప్తమయినవికావున దేశదేశములకు ఆంధ్రభూమి బౌద్ధకేంద్రమైనది. నాగార్జున విహారమున సింహళ భిక్షుకులకై ప్రత్యేకవిహారమున్నది. ఈ భిక్షుకులు కాశ్మీర, గాంధార, చీనా, కోసలి, అపరాంత, వంగ, వనవాస, యవన, ద్రమిళ, సింహళ దేశీయులకు బౌద్ధదీక్ష నిచ్చినట్లు శిలాశాసనము గలదు. సింహళ దేశమునుండి ఏనుగులు దక్షిణాపథమునకు ప్రత్యేకనౌకలలో ఎగుమతి యగుచుండెడివని చంద్రగుప్తుని ఆస్థానములోని గ్రీకురాయబారి వచించినాడు. (21) దత్తగ్రామణి ఆంధ్రదేశమునుండి సంపాదించిన బౌద్ధధాతువునకు మహాస్థూపమును సింహళములో గట్టించెను. ఆ మహోత్సవమునకు మహాదేవునితో వేనకువేలు బౌద్ధభిక్షుకులు పల్లవ బొగ్గనుండి వచ్చిరి. పల్లవబొగ్గ గుంటూరుమండలములోని పల్లవ నాడు - పలనాడునకు ప్రాచీనరూపము. సింహళములో ఉండవల్లి గుహాలవంటి పర్వతాలయములు గలవు.

నాగార్జునాచార్యులు వారిశిష్యులు సింహళములో కొంతకాలము వసించిరి.

సుమిత్రయవ, బోర్నియో, మధుర ద్వీపములకు ఆంధ్రభూమిలో గల సంబంధము పురాప్రసిద్ధము. యవద్వీపములోని బరోబదూరు శిల్పములు, స్థూపము ఆంధ్రదేశములోని అమరావతీసంఘారామస్థూప ములకు ప్రతినిధులు. (22) బరోబదూరులో పర్వతపాషాణములను స్వర్గసౌందర్యముతో ప్రతిష్ఠించిన శిల్పుల ప్రతిభ వర్ణనాతీతము. చరిత్రలో ప్రాచ్యద్వీపద్వీపకల్పములకు ఆంధ్రదేశమునకు గల పురాను బంధములనుగురించి కావ్యములకన్న బరోబదూరుశిల్పములే ఎక్కువ తెలుపగలవు. శిలాప్రతిమలకు మాటలు వచ్చిన, బరోబదూరు పర్వత

21. Megasthenese Macrindle.

22. Ferguson Indian & Easterrn Architecture.

పాషాణశిల్పప్రతిమలు చరిత్రకారునికంటె సుందరముగా ప్రాచీనాంధ్ర శిల్పకళోన్నతిని ప్రాచ్యదేశపురానుబంధములను ప్రపంచమునకు చాటి చెప్పగలవు.

తీరుతీయములలో, పల్లవశిల్పప్రభావము స్వయంవ్యక్తమగు చున్నది. క్రీ. శ. నాలుగవశతాబ్దిలో ఈ ద్వీపములో బౌద్ధమతము ఫాహియాను వాక్యములననుసరించి క్షీణదశను పట్టినదని చెప్ప వచ్చును. తరువాతిశతాబ్దిలో హిందూమతావలంబి పూర్ణవర్మ శాస నములు కన్పించుచున్నవి. మూలవర్మ శిలాశాసనాక్షరములబట్టి సుమిత్రలోని ఆదిరాజు ఆదిత్యధర్ముడు ఏడుఅంతస్థుల బౌద్ధవిహారమును గట్టించెను. (క్రీ. శ. 656) ఈ ద్వీపములో బుద్ధప్రతిమలు అమరావతీ బుద్ధప్రతిమలను పోలుచున్నవి.

# త్రైరాజ్య సంఘర్షణము

[బాదామి చాళుక్యులు - కాంచీపల్లవులు - మధురపాండ్యులు]

క్రీ. శ. అరవ శతాబ్ది ద్వితీయపాదమునుండి సుమారు మూడు శతాబ్దులు దక్షిణాపథచరిత్ర బాదామిచాళుక్యులు- కాంచీపల్లవులు - మధురపాండ్యులు-ఈ త్రైరాజ్య సంఘర్షణగ పరిణమించినది. క్రీ.శ. ఎనిమిదవ శతాబ్దిలో బాదామి చాళుక్యులు రంగమునుండి నిష్క్రమించుట ఆ స్థానమును మాన్యఖేట రాష్ట్రకూటులు ఆక్రమించుట జరిగినది. (1) బాదామిచాళుక్యుల వంశీయులు - లాటదేశమును వేంగిదేశమును స్వతంత్రప్రతిపత్తితో పరిపాలించిరి. వేంగి (తూర్పు) చాళుక్యులు, వేంగిమండలమును సుమారు అయిదు శతాబ్దులు పరిపాలించి పిమ్మట చోళవంశమున విలీనమైరి. (2) తూర్పుచాళుక్యులు, మైసూరు గాంగులును ఈ త్రైరాజ్య సంఘర్షణలో ఎడనెడ చేతులు కలిపి పేర్కొనదగిన ప్రాముఖ్యమును వహించిరి. చోళవంశీయులీయుగమున అజ్ఞాతముగ రాయలసీమ ప్రాంతమున సామంతులై అణగియుండిరి. దక్షిణాపథమంతయు త్రైరాజ్య సంఘర్షణలో చిక్కుకొనియున్నను భక్తిప్రధానమైన కవిత, వేదవేదాంతాభినివేశము, దేవాలయశిల్పము-సంగీతచిత్రకళానివేశము సాంఘికజీవితమున వెల్లివిరిసినవి. బౌద్ధ-జైన మతములు క్షీణించినవి. హైందవ సంస్కృతి పునరుజ్జీవనము ద్వీపాంతరములకు గూడ ప్రాకినది.

---

(1) రాష్ట్రకూటులు సుమారు మూడుశతాబ్దులు పరిపాలించిరి. వారి చరిత్ర ఈ గ్రంథమున "రాష్ట్రకూటులు" అను అధ్యాయమున అనుశీలింపనగును.

(2) ఈ గ్రంథమున "తూర్పు చాళుక్యులు" "చోళులు" అను ప్రత్యేకాధ్యాయముల నవిస్తరచరిత్రకై అనుశీలింపవచ్చును.

చాళుక్యరాజవంశమున చారిత్రక మూలపురుషుడు మొదటి పులకేశి. పులకేశి పౌరుషనామధేయమనియు [పుల = గొప్ప కేశి = కేసరి = పులకేశి = గొప్పసింహము] ఆ శబ్దమున కర్థము గొప్ప సింహమనియు చరిత్రకారుల వ్యాఖ్యానము. క్రీ. శ. 544 ప్రాంతమున పులకేశి బాదామి సమీపమున అభేద్యమైన గిరిదుర్గమును నిర్మించి అశ్వమేధయాగ మొనరించెను. మాలప్రభాతీరమునకు ఆ దుర్గము సుమారు మూడు మైళ్ళ దూరములో నుండెను. తూర్పున మహాకూట పర్వతము గలదు. అయిదు మైళ్ళలో నదికి దిగువ పట్టడకల్లు- మరి ఎనిమిది మైళ్ళలో ఐహోలు గలవు. ఈ ప్రాంతమంతయు పురాతనచాళుక్యశాసనములతో ప్రాచీనచాళుక్యదేవాలయ శిథిలములతో సంకీర్ణము. పులకేశి కట్టించిన ఆలయములు, సల్పిన అశ్వమేధయాగము సనాతన సంస్కృతిపునర్వికాసమునకు నిర్వికల్పమైన నిదర్శనములు. కీర్తివర్మ క్రీ. శ. 567 నుండి 597 వరకు సుమారు ముప్పది సంవత్సరములు పరిపాలించి చాళుక్యసామ్రాజ్యమును విస్తరింపఁజేసెను. బనవాసి కదంబులపై, కొంకటమౌర్యులపై అతడనేక యుద్ధములు చేసి విజయపరంపరల సాధించెను. బస్తరు జయపూర్ ప్రాంతదేశమును పరిపాలించిన నలులను గూడ అతడు జయించెను. కొంకణవిజయమువలన రేవతీద్వీపము (నవీనగోవా) చాళుక్యసామ్రాజ్యములో చేరినది. కీర్తివర్మ మరణసమయమున అతని పుత్రుడు (రెండవ) పులకేశి బాలుడగుటచే రాజ్యభారమును సోదరుడైన మంగలేశుడు వహించెను.

మంగలేశుడుగూడ అన్నగారి మార్గమునే అనుసరించి చాళుక్యరాజ్యమును విస్తరింపజేసెను. మాల్వగుజరాత్, ఖాండెష్ ప్రాంతముల పరిపాలించిన కలచురి బుద్ధరాజుతో మంగలేశుడు యుద్ధమొనరించి అతని రాజ్యములో కొంతభాగము నాక్రమించెను. కొంకణ సామంతుడు తిరుగబడగ, అతని యుద్ధమున నోడించి చాళుక్య

సామ్రాజ్యాధిపత్యమును పటిష్ఠమొనరించెను. కాని - యుక్తవయస్కుడైన (రెండవ) పులకేశికి సింహాసనము నప్పగింపక తానే రాజగుటకు యత్నించెను.

పులకేశి రాజధానిని వీడి, స్వామిభక్తులైన సామంతదండనాథుల కూడగట్టుకొని యుద్ధమున పితృవ్యుడైన మంగలేశుని వధించి క్రీ. శ. 610 సంవత్సరప్రాంతమున పట్టాభిషిక్తుడయ్యెను.

### రెండవ పులకేశి
### క్రీ. శ. 610 - 642.

రెండవపులకేశి పితృవ్యుడైన మంగళేశునకు మధ్య జరిగిన అంతర్యుద్ధముచే చాళుక్యరాజ్యము బీటలు వారినది. నలుగడల సామంతులు స్వతంత్రులు కాఁజొచ్చిరి. తరుణమునకై వేచియుండిన శత్రువులు తలయెత్త సాగిరి. యువకుడైనను, పులకేశి ధైర్యసాహసములతో ప్రతికూలపరిస్థితుల నెదుర్కొని నిలిచెను. తిరుగుబాటు లేవదీసిన "అప్పాయిక" సామంతుని భీమరథీనదీతీరమున జరిగిన సంగ్రామములో జయించి, శరణన్న ఆతని మిత్రుడు గోవిందునకు అభయ మొసంగి రక్షించెను. పిమ్మట, కదంబరాజధాని బనవాసిపై దండెత్తి విజయము సాధించెను. మైసూరుగాంగులు, దక్షిణకనర ఆలుపులు అతనికి లోబడి సామంతులై కప్పముకట్టుటకు అంగీకరించిరి. గాంగరాజు దుర్వినీతుడు తన పుత్రికను రెండవపులకేశికిచ్చి వివాహము గావించెను. ఆమెయే విక్రమాదిత్యుని తల్లి. ఉత్తర కొంకణముపై దండెత్తి మౌర్యులను జయించి పులకేశి, 'పశ్చిమాంబుధి రాజ్యలక్ష్మిని చేపట్టెను.'

రెండవ పులకేశికి ఉత్తరాపథమున సమకాలీన చక్రవర్తి శ్రీహర్షుడు. ఇరువురు ఉద్ధతుల మధ్య పడిన లాట మాళవ ఘూర్జర దేశాధీశులు భయభ్రాంతులై ఎట్టకేలకు పులకేశికి సామంతులై

శరణుజొచ్చి అభయమునందిరి. శ్రీహర్షుడు దక్షిణాపథదండయాత్రకు ఉపక్రమింపగ రెండవపులకేశి అతనిని జయించి చరిత్రలలో సుస్థిర కీర్తి నార్జించెను. అపజయము నెరుగని విజేత – ఉత్తరాపథ సువిశాల సామ్రాజ్యచక్రవర్తి శ్రీహర్షుని యువకుడైన పులకేశి నర్మదాతీరమున నెదుర్కొని మత్తేభయూథములతో మత్తిల్లిన ఆతని సేనానివహముల నిరవశేషముగ నిర్మూలించిన అత్యద్భుత సన్నివేశము భారతదేశ చరిత్ర ననుశీలించు చదువరులను పులకింపచేసెడి ఘట్టము. ఆ పరాజయము శ్రీహర్షుని జీవితచరిత్రను మార్చివేసినది. శ్రీహర్షుడు అశోకుని వలె యుద్ధమునుజ్జగించి జీవితశేషమును బోధిసత్త్వదీక్షతో ఆత్మ సంయముతో గడపెను.

శ్రీహర్షునిపై సాధించిన ఘనవిజయము పులకేశి కలలకు రెక్కలు తొడిగినది. ఆతని ఐహోలుశాసనమున కాళిదాసస్తుతి గలదు (3) కాళిదాసు వర్ణించిన రఘుమహారాజు దిగ్విజయయాత్ర పులకేశికి భవ్యకవితావేశము కల్పించియుండును. పులకేశి దక్షిణాపథమును జయించి ఏకచ్ఛత్రాధిపత్యము నెలకొల్పు సంకల్పముతో దిగ్విజయ యాత్ర కుపక్రమించెను.

పులకేశి, అవరజుడైన కుబ్జవిష్ణువర్ధనుని యౌవరాజ్యపట్టాభి షిక్తుని గావించి రాజధాని సంరక్షణకు నియోగించి తాను దిగ్విజయ యాత్రకు బయలుదేరెను. దక్షిణకోసలము – కళింగము ఆతడు తొలుత జయించిన దేశములు. తరువాత పిఠాపురము దక్షిణ కళింగ రాజధానిపై దండయాత్ర నెరపి జయించెను. పిమ్మట కునాల సరోవరతీరమున (కొల్లేరు సరస్సు) ఘోరసంగ్రామము జరిగినది. వేంగిరాజధాని వేంగిపురము అభేద్యమైన జలదుర్గముగా ప్రఖ్యాతి

(3) కాళిదాసమహాకవిని ప్రస్ఫుటముగ ప్రస్తుతించిన ప్రథమ శాసనమను ప్రశస్తి – సుప్రసిద్ధమైన ఐహోలు శాసనమునకే దక్కినది.

కెక్కినది. తమ్మిలేరు, రామిలేరు కొల్లేరుసరస్సులో పడుచున్నవి. ఆ రెండేరులమధ్య వేంగిరాజధాని గలదు. అట్లే కృష్ణాగోదావరీనదులు తూర్పుసముద్రము తమ్మిలేరు రామిలేరు కొల్లేరుకు సమాంతరమై వేంగి రాజ్యమును సంరక్షించుచున్నవి. వేంగిరాజధాని జలదుర్గము మధ్య వర్ధిల్లిన జలదుర్గము. కృష్ణా గోదావరీ సముద్ర సంగమమున ఏర్పడిన త్రిభుజజలరాశికి గరిమనాభి వేంగిరాజధాని. సహస్రసరోవర విలసిత మైన సారవంతమైన పంటభూములచే సస్యశ్యామలమై వర్ధిల్లు వేంగి రాజ్యమును పులకేశి ఘోరసంగ్రామానంతరము జయించెను. అంతటితో వేంగి నేలు విష్ణుకుండిన వంశ మంతరించినది. దిగ్విజయ యాత్ర ముగిసిన పిమ్మట క్రీ. శ. 631 ప్రాంతమున పులకేశి, తమ్ముడైన కుబ్జవిష్ణువర్ధనుని వేంగీమండలమునకు రాజప్రతినిధిగ పంపించెను. విష్ణువర్ధనుడు - అన్నగారి అనుమతితో - వేంగీమండల మునకు స్వతంత్రపాలకుడై చరిత్రలో తూర్పుచాళుక్య రాజవంశకర్త యయ్యెను. తూర్పుచాళుక్యులు వేంగిమండలమును అయిదు శతాబ్దులు పరిపాలించి చోళవంశమున లీనమగుట ప్రకరణాంతరమున ఈ గ్రంథమున సవిస్తరముగ వర్ణింప బడినది.

వేంగివిజయము సాధించి పులకేశి దక్షిణ దిగ్విజయయాత్ర కుపక్రమించెను. ఆ సమయమున చాళుక్యరాజ్యమునకు దక్షిణమున నున్న కాంచీరాజ్యమును పరిపాలించుచున్న రాజవంశము పల్లవులు.

చిరకాలము కల్రభులు కల్పించిన అల్లకల్లోలమునుండి దక్షిణ దేశమును సంరక్షించి శాంతిభద్రతలతో కూడిన సామ్రాజ్యములు క్రీస్తు శకము ఆరవశతాబ్ద్యారంభమున కంచిరాజధానిగ పల్లవులు, మధుర రాజధానిగ పాండ్యులు ఏర్పరచిరి. అప్పటి పల్లవరాజు సింహవిష్ణు. పాండ్యభూపతి కడుంగోన్. సింహవిష్ణుమహారాజు కల్రభులను జయించుటయే గాక రాజ్యమును కావేరీతీరమునకు విస్తరింపజేసెను. పల్లవులకు - పాండ్యులతో సింహళీయులతో సంఘర్షణ యేర్పడినది.

అతడు విష్ణుభక్తుడు. అవనిసింహ బిరుదాంకితుడు. మహాబలిపురము నందలి వరాహగుహాలో అతని విగ్రహము, అతని కుమారుడు మొదటి మహేంద్రవర్మ విగ్రహము స్వరూపశిల్పములై భాసించుచున్నవి. సింహావిష్ణు క్రీ. శ. 575 నుండి 600 వరకు రాజ్యమేలెను. అతని పుత్రుడు మొదటి మహేంద్రవర్మ బహుముఖశేముషీధురంధరుడు. కార్యఖడ్గనిపుణుడు. 'మత్తవిలాస' 'విచిత్రచిత్త' 'గుణాభర' బిరుదాంకితుడు. కవి, గాయకుడు, శిల్పి. తొలుత జైనమతాభిమానియైనను, తుదకు 'అప్పార్' ప్రభావమునకు ముగ్ధుడై శైవుడయ్యెను. అతడు సింహాసనమధిష్ఠించిన సమయమున పల్లవరాజ్యము కృష్ణాతీరమువరకు విస్తరించి విష్ణుకుండిన రాజ్యమునకు నడి దేశమయ్యెను.

పులకేశి విష్ణుకుండిన రాజ్యము వేంగీమండలమును ఆక్రమించిన పిమ్మట పల్లవ రాజ్యముపై దండెత్తెను. మహేంద్రవర్మ పులకేశికి జోడైన ప్రత్యర్థి. చాళుక్యసైన్యములు రాజధాని కాంచీనగర సమీపముననున్న పుల్లలూరువరకు విజృంభింప గలిగినవి. అచ్చట ఘోరసంగ్రామము జరిగినది. అది సమయుద్ధముగా పరిణమించుటచే కాంచీపట్టణమును పల్లవులు సంరక్షించుకో గల్గినను, పల్లవ రాజ్యమందలి ఉత్తరప్రాంతము చాళుక్యుల వశమయ్యెను. మహేంద్రవర్మ క్రీ. శ. 600 నుండి 630 వరకు రాజ్యమేలెను.

పులకేశి పర్షియా రాజాస్థానమునకు రాయబారుల నంపెను. బహుశః పర్షియా రాయబారులు చాళుక్యరాజాస్థానమునకు (రెండవ ఖుస్రూ కాలమున) విచ్చేసినట్లు భావింపనగును.

మహేంద్రవర్మ మరణానంతరము కాంచీ సింహాసనమును మొదటి నరసింహవర్మ అధిష్ఠించెను. ఆ తరుణమును పులకేశి జారవిడువక ద్వితీయదండయాత్ర కుపక్రమించెను. రాయలసీమ ప్రాంతమును పల్లవసామంతులు బాణులేలుచుండిరి. పులకేశి తొలుత

వారి రాజ్యముపై దండెత్తి, ఆ రాజ్యమును జయించి పల్లవరాజ్యముపై విజృంభించెను. చాళుక్య సేనలు రాజధాని కాంచీసమీపమున మణిమంగలము వరకు చేరుకో గల్గినవి. (4) అచ్చట జరిగిన ఘోరసంగ్రామములో నరసింహవర్మ, రెండవ పులకేశిని ఓడించగల్గెను. శ్రీహర్షుని జయించి అపజయ మెరుగక దిగ్విజయపాత్ర నలిపిన విజేత రెండవపులకేశి పల్లవరాజు నరసింహవర్మచే ఓడింపబడెను. మణిమంగళ సంగ్రామమున పల్లవరాజధానిలో ప్రవాసిగనున్న ఈ సింహరాజ కుమారుడు మానవర్మ, నరసింహవర్మకు తోడ్పడెను. నరసింహవర్మ కృతజ్ఞతతో మానవర్మ సింహళసింహాసనము తిరిగి సంపాదించుటకు తోడ్పడెను. నరసింహవర్మ మణిమంగళ విజయానంతరము విజయోత్సాహముతో చాళుక్యసేనలను వెంట తరిమి బాదామి నాక్రమించెను. రెండవ పులకేశి వీరస్వర్గమలంకరించెను. నరసింహవర్మ వాతాపి కొండ బిరుదాంకుడు. ఆతని శాసనము వాతాపిలో మల్లికార్జున దేవాలయప్రాంగణమున ఆతని 13 వ రాజ్యసంవత్సరమునాటిది కలదు.

రెండవపులకేశి అస్తమయముతో చాళుక్యసామ్రాజ్యము ఛిన్నభిన్నము కా జొచ్చినది. సామంతులు స్వతంత్రులు కా జొచ్చిరి. పులకేశి పుత్రు లిరువురు రాజప్రతినిధులుగ నున్నవారు - అగ్రజులు - స్వతంత్రప్రతిపత్తి వహించి సంతృప్తి చెందిరి. కాని-మూడవ పుత్రుడైన విక్రమాదిత్యుడు - గాంగరాజదుర్వినీతదౌహిత్రుడు - మాతామహ సాహాయ్యముతో వంశకీర్తి పునరుద్ధరించుటకు దీక్ష వహించెను. ఆతడు నరసింహవర్మను రాజధాని నుండి తరిమి, అగ్రజులను ఓడించి సామంతులందరిని లోబరచుకొని, క్రీ. శ. 655 సంవత్సరప్రాంతమున పైతృకసింహాసనమధిష్ఠించెను. అవరజుడైన జయసింహవర్మ అగ్రజుడైన విక్రమాదిత్యునితో సహకరించి లాటదేశమునకు రాజప్రతినిధియై అచ్చట చాళుక్యశాఖకు మూలపురుషుడయ్యెను.

---

(4) మణిమంగలము కాంచికి ఇరువది మైళ్ళ దూరముననున్నది.

నరసింహవర్మ సాయమున సింహళసింహాసన మధిష్ఠించి, అనూరాధపుర రాజధానిని చేరిన మానవర్మ విక్రమాదిత్యుని విజయానంతరము తిరిగి ప్రవాసియై కాంచీరాజధానిని చేరుకొనెను.

నరసింహవర్మ చోళ చేర పాండ్యులను కలభ్రులను జయించినట్లు చెప్పుకొన్నాడు. ఆ యుద్ధముల వివరములు చరిత్రకు అందనివి. ఆతడనేక ఆలయములను నిర్మించెను. మామల్లపురము - పల్లవ సామ్రాజ్య మందలి సుప్రసిద్ధ నౌకాశ్రయము ఆతని కాలమున వన్నె చిన్నెలతో విరాజిల్లినది. చీనాయాత్రికుడు యువాన్-చాంగ్ బాదామి పతనమునకు పూర్వము పల్లవ చాళుక్య రాజ్యములలో పర్యటించి తన అనుభవములను సవిస్తరముగ వర్ణించెను. క్రీ. శ. 668 సంవత్సర ప్రాంతమున నరసింహవర్మ మరణించెను. అతని తరువాత పల్లవ సింహాసనమధిష్ఠించినది అతని అగ్రసుతుడు రెండవమహేంద్రవర్మ - అతడు పరిపాలించినది రెండేండ్లు. ఆ రెండేండ్లలో చాళుక్య విక్రమాదిత్యునితో యుద్ధము తప్పలేదు. రెండవమహేంద్రవర్మ మరణానంతర మాతని పుత్రుడు పరమేశ్వరవర్మ రాజయ్యెను. చాళుక్యవిక్రమాదిత్యుడు పాండ్యరాజు అరికేసరితో పొత్తుకుదుర్చుకొని పరమేశ్వరవర్మపై దండెత్తెను.

ఇచ్చట పాండ్యరాజ్యచరిత్ర అను సంధేయము. క్రీ. శ. 590 ప్రాంతమున మధురాసింహాసన మధిష్ఠించిన కడుంగోన్ పాండ్య రాజ్యమును క్రీ. శ. 620 వరకు పరిపాలించెను. అతని పుత్రుడు మారవర్మ అవని చూడామణి క్రీ. శ. 620 నుండి 45 వరకు పరిపాలించెను. వారు మధురాప్రాంతమున కలభ్రుల నుక్కడంగించిరి. మూడవ పాండ్యరాజు చేరప్రభువును సంహరించి వానవాన్ బిరుదాంకితుడయ్యెను. అతని పుత్రుడే అరికేసరి మారవర్మ. అతడు క్రీ. శ. 670 నుండి 700 వరకు పాండ్య భూమినేలెను. ఆతడనేక

యుద్ధముల ఆరితేరిన అతిరథుడు. ఈతడు పల్లవరాజ్యముపై పలుమారులు దండెత్తి అనేక యుద్ధము లొనర్చెను.

ఈతనికిని చాళుక్య విక్రమాదిత్యునకు - పొత్తుకుదురుటకు హేతువు ఉభయులకును పల్లవులు శత్రువులగుటయే. శత్రువుయొక్క శత్రువు పరమమిత్రుడను కౌటిల్యరాజనీతి అనుభవపునరుక్తము.

విక్రమాదిత్యుడు పల్లవులపై చరిత్రలో స్థిరకీర్తి నార్జించిన తండ్రిని చంపిన పగతీర్చుకొనుటకై స్థిరసంకల్పుడై పరమేశ్వరవర్మపై దండెత్తెను.యథాప్రకారముచాళుక్యసేనలుకాంచీపురసమీపమువరకు విజృంభించినవి. పరమేశ్వరవర్మ రాజధానివీడి పారిపోయెను. విక్రమాదిత్యుడు కావేరీతీరమువరకు శత్రువును వెంటాడి ఉత్తైయూరువద్ద దండువిడిసెను. అచ్చట చాళుక్యసేనలతో పాండ్యసేనలు వచ్చి చేరినవి. విక్రమాదిత్యుని పక్షము వహించిన గాంగభూవిక్రమునకును పరమేశ్వరవర్మకును విళందెవద్ద ఘోరయుద్ధము జరిగినది. ఆ యుద్ధమున పరమేశ్వరవర్మ పరాభూతుడై 'ఉగ్రోదయ' రత్నరాజము-పల్లవ కిరీటహారనాయకమణిని కోల్పోయెను. అయినను, పట్టుదల వీడక పరమేశ్వరవర్మ చాళుక్యరాజ్యముపైకి తనసేనలను పంపించి, ఉఱయూరు సమీపమున శత్రువులతో తలపడెను. ఆ యుద్ధమున అతడు శత్రువుల జయింపగల్గెను. విజయాదిత్యుడు విక్రమాదిత్యుని మనుమడు కొడుకు పల్లవరాజ్యము వీడి చాళుక్యరాజ్యసంరక్షణకై తరలిపోయిరి.

విక్రమాదిత్యుని పుత్రుడు వినయాదిత్యుడు (క్రీ. శ. 681-96) శాంతిప్రియుడు. ఆతడు పల్లవులతో యుద్ధమునకు తలపడ లేదు. అతని పుత్రుడు విజయాదిత్యుడు క్రీ. శ. 696 నుండి 733 వరకు 38 సంవత్సరములు సుదీర్ఘకాలము రాజ్యమేలెను. ఆతని పరిపాలనలో శాంతిభద్రతలతో సుభిక్షముగ ప్రజలు సుఖించి రని చెప్పవచ్చును.

అతఁడనేకదేవాలయములను నిర్మించెను. అతని పుత్రుడు రెండవ విక్రమాదిత్యుడు క్రీ. శ. 733 నుండి 44 వరకు పరిపాలించెను. ఈతని కాలమునందే సింధులో రాజ్యమేర్పరచుకొనిన అరబ్బులు ఇరుగు పొరుగు రాజ్యముల జయించి దక్షిణపథములోనికి తమ రాజ్యము విస్తరింప యత్నించిరి. కాని పులకేశి (మొదటి విక్రమాదిత్యునికి అండగ నిలిచిన అవంరజుడు జయసింహుని పుత్రుడు) ముస్లిముల ధాటి నరికట్టెను. రెండవ విక్రమాదిత్యుడు ముస్లిముల జయించిన పులకేశిని, 'అవని జనాశ్రయ' బిరుదముతో సత్కరించెను. రాష్ట్రకూట సామంతుడైన "దంతిదుర్గుడు" గూడ ముస్లిము దండయాత్ర నరికట్టుటలో పులకేశికి తోడ్పడెను.

క్రీ. శ. ఎనిమిదవ శతాబ్ద్యారంభముననే భారతదేశచరిత్రలో ముస్లిముదండయాత్ర ఆరంభమైనది. వారి ధాటిని చాళుక్య రాజకుమారుడు పులకేశి రాష్ట్రకూట దంతివర్మ అరికట్టక పోయినచో భారతదేశచరిత్రయే వేరుగ నుండెడిది.

కాని- రెండవ విక్రమాదిత్యుని జీవితపరమార్థము పల్లవులపై పగ సాధించుటయే. మొదటి విక్రమాదిత్యునిపై మొదటి పరమేశ్వర వర్మ విజయముసాధించిన పిమ్మట కీ. శ 680 వరకు రాజ్యమేలెను. అతనిపుత్రుడు నరసింహవర్మ II (రాజసింహుడు) కీ. శ 680 నుండి 720 వరకు రాజ్య మేలెను. రాజసింహుని సుదీర్ఘ పరిపాలన శాంతి భద్రతలతో సమకాలీన చాళుక్య రాజన్యుల పరిపాలనవలె సుభిక్ష మైనది. కాంచీపురమందలి కైలాసనాథాలయము మామల్లపురమందలి తీరస్థదేవాలయములు అతని కాలమున కట్టబడినవే. సుప్రసిద్ధకవి అలంకారికుడు దండి అతని ఆస్థానమందు వర్ధిల్లెను. రాజసింహుడు చీనాదేశమునకు రాయబారుల నంపించెను. అతని కాలమున సముద్ర వ్యాపారమభివృద్ధిచెందెను. అతని తరువాత అతని పుత్రుడు రెండవ

పరమేశ్వరవర్మ క్రీ. శ 720 నుండి 731 వరకు రాజ్యమేలెను. తిరువడిలో శివాలయమును ప్రప్రథమున నిర్మించిన దీరాజన్యుడేయందురు. ఇతని శాసనము పలుమారులు పునర్నిర్మాణము జరిగిన తిరువడి దేవాలయ కుడ్యము నలంకరించుచున్నది.

క్రీ. శ 731 ప్రాంతమున రెండవ విక్రమాదిత్యుడు కాంచిపై దండెత్తెను. అతనికి తోడ్పడినది గాంగరాజకుమారుడు ఇఱియప్ప. (శ్రీ పురుమని పుత్రుడు) పల్లవరాజు పరమేశ్వర వర్మ, సంధిచేసుకొని కాంచిని సంరక్షించుకొనవలసి వచ్చినది.

శ్రీ పురుమనిపై పగసాధించుటకు పరమేశ్వరవర్మ ప్రయత్నించెను గాని విళందెకడ గాంగరాజు అతనిని యుద్ధమున సంహరించెను. గాంగశ్రీపురుమనకు పల్లవుల వెల్లగొడుగు 'పెర్మానడి' బిరుదు సంక్రమించెను.

పరమేశ్వరవర్మ మరణము పల్లవ రాజ్యమునకు విషమపరిస్థితి తెచ్చిపెట్టినది. అతనికి సంతానము లేదు. రాజోద్యోగులు - ఘటికా పండితులు ప్రముఖులు కలిసి పల్లవశాఖీయుడైన నందివర్మను, హిరణ్యవర్మ తనయుని రాజుగా ఎన్నుకొనిరి. (5) వైకుంఠపెరుమాళ్ ఆలయమునందలి శాసనమున పల్లవవంశచరిత్ర పురాణకాలమునుండి నందివర్మ II, సింహాసనమధిష్ఠించువరకు సవిస్తరముగ నున్నది. అతనికి ప్రత్యర్థులు లేకపోలేదు. అతని కాంచీప్రవేశము నడ్డగించిన ప్రత్యర్థి ఒకడు అనుపులను బాసెను. 'చిత్రమాయ' మరియొక ప్రత్యర్థి కొంతబలమును చేకూర్చి కొంతకాలము అతని నెదిరింపగల్గెను.

పాండ్యరాజ్యమున అరికేసరి పరాంకుశుని తరువాత పుత్రుడైన కోచ్చడైయన్ రణధీరుడు క్రీ. శ. 700 నుండి 730 వరకు రాజ్యమేలెను. ఈతడు 'కొంగు' దేశమును జయించెను. అనేకయుద్ధము లొనర్చి

(5) పల్లవవంశవృక్షమును అనుశీలించునది.

సార్థకనాముడయ్యెను. తిరువాన్మూరు ప్రాంతమందలి 'అయ' సామంతుని పీచమడంచెను. అతని పిమ్మట పాండ్యరాజ సింహాసన మధిష్ఠించిన మారవర్మరాజసింహుడు చిత్రమాయ పక్షమవలంబించి పల్లవమల్ల నందివర్మపై అనేకవిజయములు సాధించి అతడు తల దాచుకొనిన నందిగ్రామదుర్గమును ముట్టడించెను. కాని - సుప్రసిద్ధ పల్లవసేనాని "ఉదయచంద్రుడు" నందిగ్రామదుర్గ సంరక్షణకేతెంచి పాండ్యసేనలనోడించి చిత్రమాయ శిరస్సును ఖండించెను. ఉదయ చంద్రుడు నెల్లూరు ప్రాంతమందలి శబరపతి ఉదయనుని, నిషాదా ధీశ్వరుడు పృథ్వీవ్యాఘ్రుని జయించి (తూర్పు చాళుక్య విక్రమా దిత్యుని II సామంతులు) పల్లవరాజ్యమును విస్తరించెను (6) క్రీ. శ. 740 ప్రాంతమున బాదామి చాళుక్య ప్రభువు విక్రమా దిత్యుడు II, నందివర్మనోడించి రాజధాని కాంచీనగరమును తాత్కాలికముగ ఆక్రమించి "కులపగ" తీర్చుకొనెను. మొదటి నందివర్మ చాళుక్యరాజధాని బాదామి నాక్రమించిన సన్నివేశము స్మర్తవ్యము. రెండవ విక్రమాదిత్యుడు కాంచీవిజయమున అప్రమత్తుడై ఆత్మసంయమముతో మెలగెను. కైలాసనాధాలయమునకు తక్కిన దేవాలయములకు చెందిన కాంచనమణిమయాంబరములను ఆ యా ఆలయములకు సమర్పించెను. కైలాసనాధాలయ స్తంభమున తన దిగ్విజయయాత్రాకథనమును కన్నడశాసనమున వెలయించి, బాదామికి మరలి వెళ్ళెను. విక్రమాదిత్యుడు అనేక దేవాలయములను నిర్మించెను. క్రీ. శ. 745 ప్రాంతమున రెండవ కీర్తివర్త రెండవ విక్రమాదిత్యుని పుత్రుడు చాళుక్యసింహాసన మధిష్ఠించెను. గాంగ సామంతుడు శ్రీపురుషుడు రెండవకీర్తివర్మ పాండ్యరాజు మారవర్మ రాజసింహునితో యుద్ధమొనర్చిరి. రాజసింహుడు కావేరీనదిని దాటి

(6) తూర్పు చాళుక్యుల చరిత్ర అనుశీలింప నగును.

మాలకొంగం దుర్గమును జయించి చాళుక్య సేనలను 'వెణ్బై'యుద్ధమున ఓడించెను. చాళుక్యులు సంధి చేసికొనిరి. శ్రీపురుమడు గాంగరాజ కన్యకను పాండ్యరాజపుత్రునకిచ్చి వివాహమొనరించెను.

కీర్తివర్మ బాదామి చాళుక్యరాజవంశమున కడపటిరాజు. ఇతని కాలముననే రాష్ట్రకూటసామంతుడు ప్రబలుడై, విజృంభించి, మాళవఘూర్జరులను, కోసల కళింగదేశములను జయించి నర్మదా నదినుండి శ్రీశైలమువరకు తన రాజ్యమును విస్తరించెను. అంతేగాక దంతిదుర్గ, పల్లవరాజు నందివర్మతో సంధి చేసికొని తన తనయ నాతనికిచ్చి వివాహము చేసెను. నందివర్మ గాంగరాజ్యముపై దండెత్తి శ్రీపురుమని జయించి ఉగ్రోదయ మణిహారమును తిరిగి సంపాదించి "కులపగ" బాపుకొనెను. పల్లవ సామంతుడు బాణజయనందివర్మకు గాంగరాజ్యమందలి కొంతభాగము లభించినది.

క్రీ. శ. 753 ప్రాంతమున రెండవ కీర్తివర్మను జయించి రాష్ట్రకూటరాజు దంతిదుర్గుడు స్వతంత్ర రాష్ట్రకూట సామ్రాజ్యమును నెలకొల్పెను. కీర్తివర్మ రెండు మూడు సంవత్సరములు నామమాత్రావశేషుడై బ్రదికియుండెను. అతని కాలమున చాళుక్యశ్రీ భూలోకము నుండి అదృశ్యమయ్యెనని అర్వాచీన శాసన వర్ణన.

నందివర్మ II పాండ్యులతో గూడ తలపడెను. క్రీ. శ. 765-815 సంవత్సరముల మధ్య పరిపాలించిన పాండ్యరాజు జటిలపరాంతక నెడుంజడైయన్=వరగుణ మహారాజు [పాండ్యరాజసింహుని పుత్రుడు] పల్లవనందివర్మల మధ్యయుద్ధములు జరిగినవి. క్రీ. శ. 775 ప్రాంతమున జరిగిన కావేరీదక్షిణతీరమున పెణ్ణాంగడ యుద్ధమున పల్లవసేనలు పరాభూతములైనవి.

నందివర్మ, పాండ్యవిజృంభణ నరికట్టుటకు, కొంగుకేరళ ధర్మపురి ప్రభువులతో కలిసి సమష్టి కూటము నేర్పాటు చేసెను.

పాండ్య వరగుణమహారాజా శత్రుకూటమును ఓడింప గల్గెను. ధర్మపురి ప్రభువు అదిగైమాన్ పలాయనము సాగించెను. కొంగు ప్రభువు యుద్ధమున పట్టుబడి మధురలో కారాగార బద్ధుడయ్యెను. ఆ విధముగ కొంగుసీమ పాండ్యరాజ్యములో కలిసిపోయెను.

పల్లవనందివర్మ, క్రీ. శ. 795 వరకు రాజ్యమేలెను. అతడు అనేక దేవాలయములను నిర్మించెను. కాంచీనగరమందలి వైకుంఠ పెరుమాళ్ దేవాలయము ఎన్నదగినది. పల్లవరాజచరిత్ర శిల్పకథా రూపమున ఆ దేవాలయకుడ్యముల నలంకరించినది. సుప్రసిద్ధ వైష్ణవాచార్యుడు తిరుమంగయాళ్వారు పల్లవనందివర్మకు సమకాలీనుడు.

నందివర్మ తరువాత పుత్రుడు దంతివర్మ క్రీ. శ. 795 నుండి 845 వరకు రాజ్యమేలెను. దంతివర్మ, ఉద్ధతుల మధ్య పడి నలిగిపోవలసివచ్చినది. దక్షిణమున పాండ్యవిజృంభణము, ఉత్తరమున రాష్ట్రకూటవిస్తరణము. (7) అతడు రాజ్యమేలిన సుదీర్ఘకాలములో అతడు ఏమియు సాధించలేక ఉత్తరమున దక్షిణమునగూడ పలు ప్రాంతములను కోల్పోయెను. అతని తరువాత మూడవనందివర్మ పల్లవసింహాసన మధిష్ఠించెను. అతడు పాండ్యరాజు శ్రీమార శ్రీవల్లభుని ఎదురించుటకై సమష్టిరాజ్యకూటమును ఏర్పాటుచేసెను. ఆ కూటమిలో గాంగులు చోళులు రాష్ట్రకూటులునుగూడ చేరినారు. ఉత్తరఆర్కాటు మండలమందలి 'తెల్లేరు' వద్ద ఘోరసంగ్రామము జరిగినది. ఆర్కాటుమండలము తెల్లేరు వరకు పాండ్యసేనలు చొచ్చుకొనిరాగలుగుట గమనింపదగినది. అందుచేతనే పల్లవ నందివర్మతో అందరు రాజులు చేరిరి. ఆ సంగ్రామమున పాండ్యులు ఓడిపోయిరి. 'తెల్లేరు' యుద్ధముతో దక్షిణాపథచరిత్ర మలుపు తిరిగినది. పల్లవ సేనలు పాండ్యరాజ్యములోనికి వేగైనదీ తీరమువరకు చొచ్చుకొని

(7) రాష్ట్రకూటులు అను అధ్యాయము అనుశీలింపదగును.

పోగలిగిరి. కాని క్రీ. శ. 859 సంవత్సరమున శ్రీ పాండ్య శ్రీమారుడు కుంభకోణ యుద్ధమున పల్లవ నందివర్మను- సమష్టిశత్రుకూటమును ఓడించగల్గెను. అయినను క్రీ. శ. 860 ప్రాంతమున నందివర్మపుత్రుడు నృపతుంగుడు అరిసిల్ (కావేరిపాయ) సాగరసంగమము కరైక్కల్ కడ పాండ్యులనోడించి కుంభకోణ పరాజయమును మాపివేసెను.

నందివర్మ పల్లవసామ్రాజ్యప్రతిష్ఠను పునరుజ్జీవింప చేసిన మహా రాజు. అతని కాలమున పల్లవనౌకాబలము అభివృద్ధి చెందినది. సంగీతసాహిత్యకళాప్రియుడై కవిగాయకులను పోషించెను. సయాము నందలి తమిళశాసనము- అతని సముద్రాంతరప్రాభవమునకు నిదర్శ నము. అవని నారాయణతటాకము, విష్ణ్వాలయము నాతడు సయా ములో నిర్మించెను.

నందివర్మ పిమ్మట సింహాసనమధిష్ఠించిన నృపతుంగుడు "పర చక్రకోలాహల" బిరుదాంకితుడైన పాండ్యభూపతి శ్రీమారునిపై అరి సిల్ తీరమున సాధించిన ఘనవిజయము పూర్వోక్తము. అతడు క్రీ. శ. 896 వరకు పరిపాలించెను. అతని పిమ్మట అతని పుత్రుడు అపరా జితుడు క్రీ. శ. 897 వరకు రాజ్యమేలెను.

నృపతుంగుని కాలమునందే గాక - అపరాజితుని సమయమున గూడ పాండ్యవైరుధ్యము సమసి పోలేదు. శ్రీమారవల్లభుని అరిసిల్ పరాజయమునకు ప్రతీకారముగ అతని పుత్రుడు పాండ్యవరగుణవర్మ, చోళదేశముపై దండెత్తెను. ఇడవై నడ కావేరీతీరమున పాండ్యసేనలు విడిసినవి. క్రీ. శ. 879 సంవత్సరప్రాంతమునాటిదా సన్నివేశము. తిరిగి పాండ్యులకు సమష్టిశత్రుకూటము "పరచక్రకూటమి" ఎదురయ్యెను. ఆ సేనలకు పల్లవయువరాజు అపరాజితుడు నాయకత్వము వహించెను. పల్లవసామంతుడు చోళ ఆదిత్యుడు I, గాంగ పృథ్వీపతి I అతని చేరిరి. కుంభకోణ సమీపమునందలి

శ్రీ పెరంబియంకడ ఘోరసంగ్రామము క్రీ. శ. 880 సంవత్సరమున జరిగినది. పాండ్యసేనలు ఓడిపోయి చెల్లాచెదరైనవి. గాంగపృథ్వీపతి వీరస్వర్గమలంకరించెను. సామంతుడైన చోళ ఆదిత్యునకు, అతని తండ్రి ముత్తరాయరనుండి సంపాదించిన ప్రదేశముతో పాటు మరికొంత రాజ్యభాగము సంక్రమించినది.

కాని – పల్లవసామంతుడైన ఆదిత్యుడు I సంతృప్తి వహింప లేదు. కొంతకాలమునకు ఆదిత్యుడు తొండైమండలము నాక్రమించెను. తత్ఫలితముగ క్రీ. శ. 897 సంవత్సరమున జరిగిన యుద్ధమునం దాతడు అపరాజితు డధివసించిన ఏనుగుపైన ఆకస్మికముగ అధిరోహించి అతని సంహరించెను. గాంగపృథ్వీపతి II, మొదటి పృథివీపతి మనుమడు ఆదిత్యుని అధిపత్యము నంగీకరించి సామంతుడయ్యెను. పల్లవసామ్రాజ్యము అస్తమించి చోళసామ్రాజ్యము ఉదయించెను.(8)

రాజు రాజ్యతంత్రమున సర్వాధికారి. విషయాధిపతి- సామంతుడు – గ్రామభోజికుడు మహత్తరుడు – రాజశాసనపరిపాలకులు. యువరాజు విక్రమాదిత్యుని లక్ష్మేశ్వరశాసనమున అలనాటి రాజ్య తంత్రము సువ్యక్తము. ఆ శాసనము 18 ప్రకృతులను మహాజనులను నగరవ్యవస్థను పేర్కొనుచున్నది. కంచగారశ్రేణి, తెలిగశ్రేణి మున్నగునవి వర్తకసంఘములు. పన్నులు (తెఱ) ప్రతివత్సరము దేశాధిపతులకు వైశాఖమున శ్రేణులకు కార్తికమున చెల్లింపవలెను. 'గాముండు'డు గ్రామాధికారి. అతనితోపాటు కరణమును ఆడూరు శాసనము పేర్కొనుచున్నది. గ్రామపరిపాలన, గ్రామమహాజనసభ అధీనము. విజయాదిత్యుడు భూమిని మహాజనప్రజాసమ్మతితో దేవాలయమునకు దానము చేసెను. సంఘమున వేశ్యలకున్న స్థానము

(8) "చోళులు" అను అధ్యాయము అనుశీలింపనగును.

విశిష్టమైనది. విజయాదిత్యుని ప్రేయసియైన వారవనిత వీణాపోతి చేసినదానములు, ఆమె ఐశ్వర్యప్రాభవమునకు నిదర్శనములు.

తూకములు బరువుల విషయమై చరిత్రలో యుగయుగాంతరములు దక్షిణాపథవైవిధ్యము సుప్రసిద్ధము. బాదామిచాళుక్యశాసనములలో ఒకచో 'రాజమానము' కన్పించుట ముదావహము.

యువాన్‌చాంగ్ - క్రీ. శ. 7 వ శతాబ్దిలో భారతదేశమును సందర్శించిన చీనాయాత్రికుడు- ఉత్తరాపథమున శ్రీహర్షుని రాజ్యమున దక్షిణమున పులకేశిరాజ్యమున పర్యటించి ప్రత్యక్షానుభూతితో వ్రాసిన వాక్యములు ఉదాహరింపదగినవి. అతడు మహారాష్ట్రరాజ్యమున ప్రజలను గూర్చి, "ఆదేశవాస్తవ్యులు ఆత్మాభిమాన ధురంధరులు. ఉపకారులయెడ కృతజ్ఞులు. అపకారులయెడ పగబూనిన త్రాచులు. ఆపదలోనున్నవారిని ఆదుకొను జాలిగుండె కలవారు. యుద్ధమున అరిభీకరులు. వీరి రాజు క్షత్రియుడు. అతని కీర్తి దిగంతవిశ్రాంతము. ఆతని సామంతులు స్వామిభక్తి పరాయణులు. రణరంగమున వీరభటులకు మత్తేభములకు కల్లుపోసి డీకొల్పుట వారి సంప్రదాయము. ఆ రాజు తనకు గల వీరభట నికాయమును మత్తేభయూథములను చూచుకొని, పరరాజులను తృణీకరించుట కద్దు." జయశీలురైన చాళుక్య వీరులను జయించిన గర్వస్ఫూర్తి రాష్ట్రకూట శాసనములలో సువ్యక్తము. ఓడిపోయిన సేనానులకు స్త్రీవేషము వేయించి అగౌరవించుట అలనాటి వింత ఆచారము. ఆత్మాభిమాన ధురంధరులైన సేనానులు ఆ అవమానమును తప్పించుకొనుటకు ఆత్మహత్య చేసికొనుటగూడ కద్దు. బౌద్ధము - ఉచ్ఛదశయందు లేదు. యువాన్‌చాంగ్ రచన ప్రకారము మహారాష్ట్రమున ఉభయ యానములకు చెందిన భిక్షుకులు 5000 మంది ఉండెడివారు. శైవులు (భస్మధారులు) గూడ చాలమంది కలరు. చాళుక్యరాజులు శివ

భక్తులు కొందరు, విష్ణుభక్తులు మరికొందరు. జైనాలయములకు గూడ వారనేకదానములు చేసినను, రాజులెవ్వరు జైనమతమును స్వీకరించలేదు. మంగళేశుడు కార్తిక ద్వాదశీనాడు ఉపవాసముండెడివాడు. చాళుక్యరాజులు యజ్ఞము లొనరించిన వైదికమతస్థులు. విష్ణువర్ధనుని సతరాశాసనము, బ్రాహ్మణసోదరులకు 'బలిచరు వైశ్వదేవాగ్నిహోత్రహవనపంచమహాయజ్ఞోత్సర్పణార్థము' చేసినదానమును పేర్కొనుచున్నది. గంగాతీరవాస్తవ్యుడైన జ్ఞానశివాచార్య దేశికుడు పట్టుడకల్లులో విజయేశ్వరాలయమందలి అర్చకుడు. ఉత్తర దక్షిణముల మధ్య గల సామరస్యమునకిది నిదర్శనము. ఈ ఆచార్యుడు 30 నివర్తనములభూమి, 30 గద్యాణములు వెచ్చించి, మతప్రచారార్థము పూజా పురాణప్రసంగముల నిమిత్తము దేవాలయమునకు దానము చేసెను. ఆ కాలమున ఒక నివర్తనము వెల ఒక గద్యాణమని భావింపనగును.

రవికీర్తి, పులకేశి II, ఆదరాభిమానములతో ఐహోలునందు జినాలయమును నిర్మించెను. అనేక శాసనములు వర్ధిల్లుచున్న జైనమత ప్రాబల్యమును ప్రతిఫలించుచున్నవి.

గుటిగిరె వద్ద కుంకుమదేవి కట్టించిన జినాలయము, అన్నిగెఱె వద్ద జైనతలవరి కట్టించిన ఆలయము ఉదాహరణప్రాయములు.

## సంస్కృతము

సంస్కృతము రాజభాషయై సభాపూజ్యత నందినది. ఉత్తరాపథమున హర్షవర్ధనుని కాలమున బాణుని కాదంబరీమహాకావ్యమునందలి రీతిసుభగమైన గంభీరశైలి దక్షిణాపథమున చాళుక్యరాజ్యమున వర్ధిల్లుచున్నట్లు శాసనవాఙ్మయ రచనారీతులనుండి గ్రహింపనగును. ఐహోలుశాసనము కాళిదాసుకవికే అంజలిఘటించినది. మంగళేశుని మహాకూటశిలాస్తంభశాసనము కాదంబరీశయ్యకు ధ్వజస్తంభము. ఆ శాసనమున రామాయణ రఘువంశ కావ్యములనుండి

అర్థశాస్త్రమునుండి అనేకప్రయోగముల నుల్లేఖించినది. ఐహోలు శాసనమునందలి పులకేశి దిగ్విజయయాత్ర- జైనకవి రవికీర్తిరచనకు మాతృక కాళిదాసు రఘువంశమందలి రఘుమహారాజ దిగ్విజయ యాత్ర యనుట సుస్పష్టము. పులకేశి II, మామగారు దుర్వినీతుడు శబ్దావతార మను సంస్కృతవ్యాకరణ గ్రంథకర్త. విజయభట్టారిక చంద్రాదిత్యునిభార్య సంస్కృతకవయిత్రి. జైనేంద్ర వ్యాకరణకర్త పూజ్యపాదుడు నిరవద్య - ఉదయదేవపండితుని గురువు. (క్రీ. శ. 729) వేములవాడచాళుక్యుల ఆస్థానకవి సోమదేవసూరి యశస్తిలక చంపుకావ్యకర్త. అతని నీతివాక్యామృతము, అర్థశాస్త్రముతో ధర్మోప దేశము జోడించినది.

## కన్నడము

కన్నడభాషయందలి తొలిరచనలు చాలవరకు ఉపలభ్యమాన ములు గావు. చాళుక్యులు సంస్కృతముతోపాటు దేశభాషకు కూడ ప్రోత్సాహము కల్పించిరి. రాష్ట్రకూటరాజు నృపతుంగుని కవిరాజ మార్గము కన్నడమందలి తొలి అలంకారికగ్రంథము. దుర్వినీతుడు సంస్కృతకవియేగాక కన్నడగద్యకర్తగకూడ విఖ్యాతుడు. శ్రీ వర్ధ దేవుడు = తుంబులూరాచార్యుడు తత్వార్థమహాశాస్త్రముపై వ్యాఖ్యాన పూర్వకమైన మహాగ్రంథమును 96000 పద్యాలతో వ్రాసెనని చెప్పు దురు. అది నేడు ఉపలభ్యమానము గాదు. క్రీ. 1604 నాటి కన్నడ వ్యాకర్త భట్టాకలంకుడు ఆ గ్రంథము కన్నడవాఙ్మయమునకు మకుటాయమానమైన దని ప్రశంసించెను. బహుభాషాకోవిదుడైన సాహిత్యవేత్త శ్యామకుండాచార్యుడు తుంబుళాచార్యుని సమకాలీ నుడు (క్రీ. శ. 650).

కన్నడమున ప్రాతఃస్మరణీయుడైన పంపమహాకవి, క్రీ. శ. 902 లో జన్మించెను. తన పూర్వికులు వేంగివాస్తవ్యులని పంపకవి

చెప్పుకొనెను. అతడు వేములవాడ చాళుక్యరాజు రెండవ అరికేసరి ఆస్థానకవి. అతని ఆదిపురాణము మొదటి తీర్థంకరుని చరిత్ర. విక్రమార్జున విజయము సంగ్రహభారతకథ. అందు అరికేసరికి అర్జునునకు అభేదాధ్యవసాయము అనుసంధింపబడినది. పంపమహాకవి, కన్నడకవులలో అగ్రసరుడు మాత్రమే గాక ఆంధ్రవాఙ్మయమున ఆదికవిగ ప్రాతః స్మరణీయుడైన నన్నయ భారతమునకు భవ్యకవితావేశము కల్పించిన మార్గదర్శకుడు. మహాకవి - వ్యాసవిధేయుడు గాక, భారతకథనే యథేచ్ఛగ మార్చెను. 'కృష్ణద్వైపాయనముని వృషభాభిహిత మహాభారతబద్ధ నిరూపితార్థ మేర్పడ' ఆంధ్రభారతము వ్రాయుటకు ఉద్యుక్తుడైన నన్నయ - పంపని తత్వమును నిరసించినను - పంపభారతమందలి సుదీర్ఘసమాసములను పదగుచ్ఛములను యథాతథముగ తన భారతమున ప్రయోగించెను.

## చోళ చరిత్ర

సంఘవాఙ్మయయుగము: ఐతిహ్యమున,చోళమండలము ఉత్తరమున 'వెళ్ళారు' అను పేరుగల నది, దక్షిణమున గూడ వెళ్లారు అను పేరుగలనది, తూర్పున సముద్రము, పశ్చిమమున కొత్తైకరై ఎల్లలుగా గల దేశము. ప్రస్తుతము తంజావూరు తిరుచురాపల్లి మండలములు పుదుకోట్టలో కొంతభాగము కలిసి ప్రాచీనకాలమున చోళదేశముగా విలసిల్లినది. కావేరీమహానది, ఉపనదులతో సముద్రప్రవణమైన ఈ మైదానముపై ప్రవహించుచున్నది. తిరుచురాపల్లి మండలమున గాని చిన్న చిన్న కొండలు కన్పింపవు. తమిళసాహిత్యము కావేరీనదితో పాటు పొంగిపొరలినది. కాంతరాజు ఉపాసనచే అగస్త్యుని జలకలశమునుండి సూర్యవంశీయుల నుద్ధరించుటకు కావేరీనది ఉద్భవించినది. చోళరాజ్యమునకు కావేరి పొంగి పొరలునపుడు ప్రతిసంవత్స

రము మహోత్సవము. కావేరీముఖద్వారమున 'కావేరి' పట్టణము మిక్కిలి ప్రాచీనము. కారైక్కాళనుండి 10 మైళ్ళ దూరములోనున్న నాగపట్టణమునే టోలిమీ పేర్కొనినాడు. నేటి తిరుచురాపల్లి సమీప మునమన్న ఉరైయూరు ప్రాచీననగరము. దక్షిణఆర్కాటుమండలమున గంగైకొండచోళపురము 11, 12 శతాబ్దులలో చోళరాజధాని. నేటికిని అచ్చట జీర్ణదేవాలయములు ప్రాచీన శిథిలావశేషములు కన్పించు చున్నవి.

చోళ శబ్దవ్యుత్పత్తిని నిరూపించుట కష్టము. పరిమేలళగరు ప్రకారము చోళశబ్దము పాండ్యచేర శబ్దములవలె రాజవంశనామము. గెరిని సేనాని చోళశబ్దమునకు సంస్కృతకాల శబ్దమునకు ముడిపెట్టి, ఆర్యులకు పూర్వముగల నల్లని ఆదిమ నివాసుల నామమని అర్థము చెప్పుచున్నాడు. ఇట్లే చోళశబ్దమును చోర, చోళకు శబ్దముల నుండి సాధించుట నిరర్థకము. కిళ్ళి, వళవాన్, శెంబియాన్ శబ్దములు చోళశబ్దమునకు పర్యాయపదములు. కిళ్ళి శబ్దము నెడుంగిల్లి, నలంగిల్లి, మున్నగు చోళనామములతో కన్పించుచున్నది. కాని అర్వాచీన కాలమున కన్పించుటలేదు. వలవన్ అనిన వళమ్ - సారవంతమైన - భూమికి పాలకుడు అని అర్థము కాబోలు. శెంబియాన్ అనిన శిబివంశీయుడు. ప్రాచీన చోళగాథలలో జాతకగాథలలో పురాణము లలో గల శిబిమహారాజు చోళవంశమున 'పురుషరు.' చోళవంశమునకు రాజలాంఛనము వ్యాఘ్రము.

కాత్యాయనుడు చోళులను ప్రస్తావించినాడు (1) అశోకుని శిలాశాసనములు చోళులను పేర్కొనుచున్నవి.(2) అందు చోళరాజ్యము సామంతరాజ్యములలో గాక మిత్రరాజ్యములలో నున్నది. పాండ్య,

(1) మహాభాష్యము Ed Keil horn 11 p 270

(2) Hultzsch - Asoka insvipt on India V Chola.

చోళ శబ్దములు ఆ శిలాశాసనములో బహువచనములో నుండుటచే ఆ కాలమున అనేక పాండ్యచోళ రాజులున్నట్లు ఊహింపవచ్చును.(3) సంఘకవులలో కొందఱు దక్షిణమునకు (మోరియారుల) మౌర్యదండ యాత్రను సూచించుచున్నారు. మామూలనార్ పాటలీ పుత్రమున గంగానదీ నిక్షిప్తమైన నందరాజుల నిధులను ప్రస్తావించినాడు. నందులు దండయాత్రాసంరంభమున పర్వతశిలలను దొలిచి రథములకు మార్గమును నిర్మించినట్లు ముువ్వురు కవులు చెప్పుచున్నారు. పై మౌర్యదండయాత్ర ప్రాగశోకము.

ప్రాచీకాలమున దక్షిణభారతద్వీపకల్పముననున్న పాండ్య చోళాదిదేశములకు చీనా సింహళ యవ సుమిత్రాదిదేశములకు రోము మున్నగు పశ్చిమదేశములకు నౌకావర్తక సంబంధములు కన్పించు చున్నవి. అలెగ్జాండ్రియా నగరమున వర్తకుడొకడు వ్రాసిన 'పెరి ప్లసు' గ్రంథమునుబట్టి (క్రీ. శ. 81 - 96 మధ్య) చరిత్రకారుడు ప్లినీని బట్టి దక్షిణభారతమునకు పశ్చిమదేశములకు గల సంబంధము స్వయంవ్యక్తమగు చున్నది. పెరిప్లసులో 'కొల్చి' దాటిన తర్వాత ఖండాంతర్భాగమున 'అర్గరు' దేశమున్నది. దీనినిబట్టి ఆనాడు, చోళ మండలము తీరప్రదేశము, దేశాంతర్భాగము, భిన్నరాష్ట్రములుగ నున్నదని సూచన కన్పించుచున్నది. అవియే 'పుహార' ఉరయూరు రాజ్యములు. తీరస్థదేశమునకు పట్టినప్పాలై రాజధాని. పెరిప్లసులో తీరస్థరాజ్యము రేవుపట్టణము నానుకొనియున్నట్లు గలదు. పెరిప్లసు లోని 'అర్గరు' ఉరయూరు. పెరిప్లసు 'పాండియను' చెరో బొత్రను పేర్కొని చోళను పేర్కొనుటలేదు. 'చమర, పొదుచ, సోపట్నము' లను వర్తకకేంద్రములుగ పెరిప్లసు పేర్కొనుచున్నది. సోపట్నమే తమిళసాహిత్యములోని 'శోపట్టినము'. అది కాలాంతరమున మార్గాణ ముగా మారియున్నది. 50 సంవత్సరముల తరువాత గ్రీకు భూగోళ

(3) D. R. Bhandarker Asoka p 38.

జ్ఞాడు టోలిమీ, కావేరీపట్టణమును (ఖబేరిస్) కావేరీముఖద్వారమున నేగపట్టణమును (నికమ) పేర్కొనినాడు.

పాలిబౌద్ధవాఙ్మయములో చోళ, కావేరి పట్టణ ప్రసక్తి కలదు. క్రీస్తుశకారంభమున కోలపట్టణము అనాటి రేవుపట్టణములలో మణిపూసగా ప్రస్తుతింపబడినది. ఇది కావేరి పట్టణమే కావచ్చును. అకీర్తి, అనుయాయులకు దూరముగ నుండదలచి వారణాసి నుండి కావేరీ పట్టణ సమీపముననున్న ఉద్యానవనమునకు పోయినాడు. 'మహావంశములో' క్రీ. పూ. 2 వ శతాబ్ది మధ్య చోళరత్తనుండి ఈళారుడు అను ఉన్నతవంశీయుడు సింహాళమునకు వచ్చి అచ్చటి అసేల రాజును జయించిన చరిత్ర కలదు. ఈళారుడు 44 సంవత్సరములు పక్షపాతము లేకుండ, శత్రు మిత్ర వివక్షత లేకుండ రాజ్యమేలినాడు. అతని ధర్మపరాయణతకు ఉదాహరణముగ అనేక కథలు గలవు. రథమును గోవత్సముపై నడిపిన నేరమునకు ఆ మహారాజు తన ఏకైకసుతునకు మరణదండన విధించినాడు. అతని రాజ్యము దక్షిణాగ్రమున నుండి ఉత్తరమున మహాగంగవరకు విస్తరిల్లినది. తరువాత ఈళారునికి దుత్తగామణికి యుద్ధము సంభవించినది. దుత్తగామణి తండ్రి అసేరుడు తమిళులతో యుద్ధమునకు సమ్మతింపలేదు. దుత్తగామణి బౌద్ధుడు. ఈ మహాయుద్ధమువలన, సింహాళమును ఏకరాజ్యముగా చేసి బౌద్ధధర్మమును పునఃప్రతిష్ఠితమొనర్ప సంకల్పించినాడు. మహావంశములో ఈ యుద్ధవర్ణన విపులముగా నున్నది. (4) దుత్తగామణి జయించినాడు. ఈళారుడు అనూరాధపురమున మరణించినాడు. ఈళారునికి వీరమర్యాదలతో దుత్తగామణి దహనసంస్కారములు నిర్వహించినాడు. ఆ స్థలమున స్మారకచిహ్నమును నిర్మించి దానిని పూజాస్థలముగ నిర్మించినాడు. క్రీ. శ. 6 వ శతాబ్దిలో మహావంశములో ఈ భాగమును వ్రాసిన మహానమాన్ కాలమున సింహాళరాజపుత్రులు

(4 Geiger trans p. 290-1

సంగీతసన్నాహములను ఈ పూజావిధుల ననుసరించి జరిపెడి వారు. ఈళారుని వృత్తాంతము తమిళసారస్వతమున కన్పించుటలేదు.

## ప్రాచీన తమిళ సారస్వతము : చోళులు

ప్రాచీనతమిళవాఙ్మయము "శంఘసారస్వతము" క్రీస్తుశకారంభమున వర్ధిల్లినది. అందలి కవుల కాలము, కావ్యముల అనుపూర్విని నిష్కర్షగా నిర్ణయించుటకు వీలులేదు. సంఘవాఙ్మయము విశేషముగ ప్రస్తుతించిన రాజులు కరికాలుడు గోచ్చెంగణాన్ రాజులు. వీరి కాలానుక్రమమునుగాని వీరికి వీరితోపాటు కన్పించుచున్న ఇతరరాజులకు గల సంబంధమునుగాని నిష్కర్షగా తేల్చుటకు వీలులేదు. పుహారు, కావేరీ పూంపట్టిన ప్రసిద్ధి కరికాలునితో అరంభించినట్లైన; పుహారు ఉరయూరులలోనున్న చోళశాఖలలో ప్రజ్వరిల్లిన అంతఃకలహము కరికాలునకు అర్వాచీనము అని చెప్పవలెను. పుహారు, ఉరయూరు చోళవంశములమధ్య జరిగిన అంతర్యుద్ధములు సంఘవాఙ్మయమునకు సామాన్యకథావస్తువులు.

చోళవంశోత్పత్తినిగురించి పుక్కిటిపురాణములు ఐతిహ్యములో, ప్రాచీనవాఙ్మయములో కన్పించుచున్నవి.చోళులు సూర్యవంశీయులు. అర్వాచీనకాలములో సూర్యునినుండి వంశవృక్షములు తామ్రశాసనములలో కన్యాకుమారీ శిలాశాసనములలో కన్పించుచున్నవి. ఈ పురాణకథనమున కాంతరాజు అగస్త్యునకు పరశురామునకు సమకాలీనుడు. అతడు అగస్త్యునిఉపాసించి కావేరీని జలకలశమునుండి ఉద్భవించునట్లు చేసినాడు. అతడు, కావేరీ పూంపట్టణమును, పూహారు, కాకండి (చంప)ను ఏలినాడు. పరశురాముని క్రోధమునుండి తప్పించుకొనుటకు కాకండి అను అనౌరసపుత్రునకు తాత్కాలికముగ రాజ్యమర్పించినాడు. అసురుల విమానదుర్గములను విధ్వంస మొనర్చిన, తుంగేయ ఫేరిందతొడిత్తోట్ శేంబియాన్ ఇంకొక పురాణపురుషుడు,

రాజకుమారునకు గోవత్సవముపై రథము తోలిన అపరాధమునకు మరణదండన విధించిన రాజుగాథ, పావురమును డేగనుండి రక్షించిన రాజుగాథ సంఘవాఙ్మయములో కన్పించుట లేదు. ప్రప్రథమమున ఈ గాథలు కొన్ని శిలప్పదిగారమ్ మణిమేఖలైలలో ప్రవేశించినవి. ఈ రెండుకావ్యములు కరికాలునకు అధమపక్షము కొన్ని పురుషాంతరములైనను అర్వాచీనములు.

కరికాలుడు సంఘవాఙ్మయములో సుప్రసిద్ధుడు. అతడు ఇళ్ళజ్జేచ్చణి పుత్రుడు. 'కరికాల' అనగా బాల్యమునందు 'కాలినకాలు' గలవాడు అని అర్థము. సంస్కృతపండితులు, అర్వాచీనకాలమున, ఏనుగులకు మృత్యువని చెప్పిరి. ఈరీతి వ్యుత్పత్తులు తెలివితేటలు ప్రసరించినంతవరకు నూత్ననూత్నముగ పుట్టుచునే యున్నవి. కరికాలుడు ఆగర్భమహారాజు అని కవుల వర్ణన. బాల్యమున శత్రువులు ఇతనిని బంధించినారు. కరికాలుని బంధవిముక్తి అనేకకవుల కావ్యములకు ఇతివృత్తము. బంధవిముక్తుడై కరికాలుడు 'వెన్ని' సమీపమున ఘోరయుద్ధమును సల్పి పాండ్య చేర రాజులను జయించినాడు. ఈ వెన్ని తంజావూరునకు 15 మైళ్ళ దూరములోనున్న కోవెలవెన్నిగా చారిత్రకనిర్దేశము. వెన్నిక్కుయత్తియాన్‌కవి కరికాలుని సంబోధనము: "కరికాల కళవ! గజయూథాధిప! తెరచాప నెత్తినపుడు తన నౌకలకు అనుకూలప్రచారము సలుప వాయుదేవుని శాసించిన వీరుని సంతతివాడవు! నీకు మహావిజయము సిద్ధించినది! పరాజితుడైన నీ శత్రువు వీరోచితముగ, పృష్ఠభాగమున సంభవించిన ఘాతమునకు ఆత్మప్రాయశ్చిత్తముగ ప్రాయోపవేశముచే వెన్ని సమీపమున మరణించినాడు." సమకాలీనుడైన పరణరు కవి కరికాలుడు వాకై పరందలైవద్ద, సామంతులను ఓడించినట్లు చెప్పినాడు. పట్టినప్పాలై గ్రంథకర్త ఉరుత్తిరంగణ్ణనార్ కరికాలుని వర్ణించుచు "కరికాలుడు ఒలియరులను జయించినాడు, అరువాళారు అతని ఆజ్ఞలను శిరసా వహించినారు,

ఔత్తరాహువులు కాంతివిహీనులైనారు. పాశ్చాత్యులు క్రుంగిపోయి నారు. ఇరున్ గో వేళ వంశమును అంతమొందించినాడు. ఒలియరులు నాగులు. కరికాళుడు అటవికులైన వారిని నాగరకులుగ చేసినాడు. 'అరువానాడు'లోని ప్రజలు అరువాళారులు కావేరికి ఉత్తరభాగమున నున్నవారు. కరికాలుడు, అడవులను కొట్టించి, తటాకములను నిర్మించి వ్యవసాయమునకు దోహదము కల్పించినాడు.

అర్వాచీనకాలమున నచ్చినాక్కినియర్, కరికాలుడు నాంగూరు లోని వేళిర్ కన్యకను వివాహమాడినట్లు చెప్పినాడు. 'ఆదిమంది' కరికాలుని పుత్రిక. ఈమెపై అనేక పద్యములు కలవు. ఈమె భర్త ఆట్టన్ అత్తి కావేరిలో మునిగి మరణించినపుడు ఈమె తన పాతివ్రత్య మాహాత్మ్యమున భర్తను పునరుజ్జీవితునిగా నొనర్చినది.

శిలప్పదిగారములో కరికాలుని ఉత్తరాపథదండయాత్ర వర్ణితము. హిమాలయములవరకు కరికాలుడు దండయాత్రను సాగించి, వజ్ర మగధ అవంతి దేశములను జయించినాడు. త్రిలోచనపల్లవునితో గల ఈతని వైరుధ్యము తెలుగుచోడుల శాసనములలో గలదు. కావేరీ తీరమును నిర్మించినాడు. కాళుమాళమ్‌నుండి బయలుదేరిన రాజ మత్తేభము, ఇతనిని పూలమాలతో చోళసింహాసనచక్రవర్తిగ కారూ రులో వరించినది. అతడు కాంచిని జయించి, ఆశ్రితులకు భూములను ఇచ్చినాడు. ఈ విధముగా కరికాలుని ఇతివృత్తముగా స్వీకరించి బయలుదేరిన ఈ పుక్కిటిపురాణములను అద్యతనచరిత్రకారులు కొందరు యథార్థ చారిత్రకసన్నివేశములుగా పరిగ్రహించుచున్నారు.

ప్రాచీనసంఘవాఙ్మయము, నలంగిల్లి, నెడుంగిల్లి మధ్య జరిగిన యుద్ధములను పేర్కొనుచున్నది. వీరు పుహారుఉఱైయూరు చోళ వంశములకు చెందినవారని ఇవి అంతర్యుద్ధములని ఊహించవచ్చును. ఈ అంతర్యుద్ధములలో నెడుంగిల్లి కారియాఱువద్ద మరణించినాడు.

మణిమేఖలైలో కారియాఱు యుద్ధప్రసక్తి కలదు. ఆ యుద్ధములో ఇళంగోన్ రాజపుత్రుడు పాండ్య చేర రాజులను జయించినాడు. ఈ యుద్ధము, నెడుంగిల్లి మరణించిన కారియాఱు యుద్ధమేయని చరిత్రకారుల నిర్దేశము. దీనినిబట్టి, మణిమేఖలైలోని ఇళన్‌గోన్ రాజపుత్రుడే నలంగిల్లి అని ఊహింపవచ్చును.

నలంగిళ్ళికి శేచ్చేణ్ణి - నలంగిల్లి అను పేరుగలదు. కావున అతడు, కరికాలుని తండ్రియైన ఇళాఞ్జేచ్చెణ్ణికి మనుమడని కొందరు ఊహించుచున్నారు. కేవలనామైకదేశసాదృశ్యమే యీ ఊహకు ఆధారము.

పుఱనానూఱులో పదునాలుగు ఖండములు నలంగిల్లిపై గలవు. కోవూరు కిళారుకవి సప్తఖండికలలో ఇతనిని ప్రస్తుతించినాడు. నలంగిల్లి సాహిత్రీప్రియుడు. కవి. అతడు ఒక ఖండకావ్యములో-

"నన్ను ప్రార్థించిన నారాజ్యసర్వస్వమును ప్రేమతో దానధారగా సమర్పింపగలను. కాని, గ్రుడ్డివాడు బయలులో నిద్రించుచున్న వ్యాఘ్రమును త్రొక్కినట్లు, నన్ను ధిక్కరించినవారిని ప్రాణములతో పోనివ్వను" అని చెప్పుకొన్నాడు. నలంగిల్లి ఆధీనములోనున్న కావేరీ పూంపట్టణము, వాణిజ్యాభ్యుదయముతో విలసిల్లినది. యజ్ఞయాగాదికములు ప్రచారములో నున్నవి. అతడు ఇలవందిగైప్పళ్ళిలో మరణించినాడు.

నెడుంగిళ్ళి నలంగిళ్ళి ప్రతిస్పర్థి. కోపూరికిళార్ కవి ఇతనిని యుద్ధములు మానుమని ప్రబోధించుచు ఖండకావ్యమును వ్రాసినాడు. ఇతడు అయూరిలో నుండగ ఆ దుర్గమును నలంగిల్లి ముట్టడించినాడు. ఆముట్టడిని వర్ణించుచు కవి-

"కొదమ ఏనుగు గున్నలు, ఆడఏనుగులతో తటాకములలో క్రీడాస్నానములతో విహరింపక నేతితో కలిసిన అన్నముముద్దలను

ఆహారముగ భుజింపకపోవుటచేత, యూపస్తంభములవద్ద ఘీంకారములతో నేలపైబడి దొర్లుచు గర్జించుచున్నవి. పసిపిల్లలు పాలు లేక ఏడ్చుచున్నారు. పౌరాంగనల వేనలిలోని పువ్వులు వాడిపోయి నేలపైబడి దొర్లుచున్నవి. నీరులేక మలమల మాడుచున్న పిపాసార్తుల దీనారావములు నగరహర్మ్యరేఖలలో ప్రతిధ్వనించుచున్నవి. ఇకనైన ముట్టడిని మాన్పింపుము. మహారాజా! దయామయుడవై ఈ దుర్గద్వారములను తెరిపింపుము - లేక వీరుడవైన నీ సైనికులతోదుర్గము తెరచి శత్రువును ఎదుర్కొనుము. కాని ఈదుర్గములో ఈమహోన్నత కుడ్యముల మధ్య భీరువువలె ఒకమూల ఒదిగి దాగుకొనుట సిగ్గుచేటు." అని నెడుంగిల్లికి ప్రబోధించినాడు. కోవూరుకిలారు నలంగిల్లిని గూడ ఉరయూరుముట్టడిని మానుమని జయాపజయము లెవరివైనను, చోళకుటుంబమే నష్టపడునని ఉద్బోధించినాడు.

కిల్లివలవవాన్‌ను ఒక పద్యములో కోవూరుకిళారుకవి ప్రశంసించినాడు. ఈ రాజు కుళముఱ్ఱమువద్ద మరణించినాడు. కురూప్‌పల్లి వద్ద మరణించిన ఇంకొక కిల్లివలవవాన్ కన్పించుచున్నాడు. ఇద్దరు ఒకే వ్యక్తులని కొందరియూహ. కురూప్‌పల్లి, కుళముఱ్ఱము ఒకే స్థలమునకు చెందును. కిళ్ళివవాన్‌పై పదునెనిమిది ఖండకావ్యములు భిన్నకవులు వ్రాసినారు. అతడుకూడ తన మిత్రుడైన కళిఖకూడి రాజు పణ్ణన్‌ను ప్రశంసించుచు ఒక ఖండకావ్యమును వ్రాసినాడు. అతడు ఉఱైయూరు రాజధానిగా పరిపాలించినాడు. చేరరాజధాని కారూర్‌ను ముట్టడించి జయించుట ఇతడు నెరవేర్చిన మహాకార్యము. కారూర్‌నగర పతనానంతరము కవయిత్రి మాఱొక్కట్టునప్పశాత్తియార్ ఆ శిథిలములను చూచి కన్నీరుగార్చుచు కవితాత్మిక లాలపించినది. అహనానూఱులో నక్కీరాశ్ వ్రాసిన పద్యములలో పాండ్యసేనాని పళైయాన్ మధుర దుర్గద్వారములవద్ద కిళ్ళివలవాన్ ఓడిపోయినట్లుగలదు.

నక్కీరారు పేర్కొనిన కిళ్ళివళవాన్ కులముత్తమువద్ద మరణించినట్లు పూర్వపక్షము నెలకొనువరకు పరిగ్రహింపవచ్చును. ఇతడు మలయమానుని జయించినట్లు గలదు. ఈ రాజు మరణముపై కవయిత్రి మారోక్కట్టునప్పాశలై, కవి మాశాత్తనార్ స్మారకగీతికలు వ్రాసినారు.

## కొ ప్పె రుం గో ళ న్

కరికాలునివలె సంఘవాఙ్మయమున కన్పించుచున్న మరియొక పురాణపురుషుడు కొప్పెరుంగోళన్. ఇతడు ఉఱైయూరు రాజధానిగా పరిపాలించినాడు. అతడు కవిమిత్రుడు. అండైయార్ పొత్తియార్ కవులు ఇతని ప్రాణమిత్రులు. 'అండై' అనిన గుడ్లగూబ. ఇతని అసలు నామ మేదో తెలియదు. ఇతడు పాండ్యదేశస్థుడు. పాండ్యరాజు అఱివుడైకు హితోపదేశము సల్పినాడు. పొత్తియారు ఉఱైయూరు వాస్తవ్యుడు. కొప్పెరుంగోళనుకు అతని పుత్రులకు విరోధము. అంతఃకలహములు మానుమని పుల్లాట్టూరుకవి ఇతనికి ప్రబోధము చేసినాడు. కొప్పెరుంగోళన్‌తోపాటు అండైకూడ మరణించినాడు. -నదీగర్భమున, విశాలవృక్షచ్ఛాయలలో అండై ప్రాయోపవేశముచే మరణించినాడు - పొత్తియార్‌కూడ మిత్రులతోకలసి మరణింప నిశ్చయించినాడు - కాని, రాజు, అతనికి పుత్రుడు ఉద్భవించువరకు వేచియుండు మని ప్రార్థించినాడు. రాజు మరణానంతరము పొత్తియార్ స్మారకగీతములు రచించినాడు.

పెరునాన్‌కిళ్ళి అనురాజు రాజసూయయాగమును సల్పినాడు. ఇతడు గొప్పరాజుగ కన్పించుచున్నాడు.

## కో చ్చెం గ నా న్

సంఘవాఙ్మయములో కరికాలుని వలె ప్రశంసితుడైన పురాణ పురుషుడు కోచ్చెంగనాన్. అర్వాచీనకాలమున ఈ రాజు పేరుచుట్టు

సాలెపురుగు గూడువలె పుక్కిటి పురాణములు చుట్టుకొన్నవి. పుఱనానూఱులోని పద్యము, పొయి గైయార్ రచించిన కాళవళిలోని నలుబదిపద్యముల కావ్యఖండము కోచ్చెంగనానుని పేర్కొను ప్రాచీన వాఙ్మయఖండములు. తిరుజ్ఞానసంబంధర్, తిరుమంగయాళ్వార్ కూడ ఇతనిని పేర్కొనుచున్నారు. కాని వారు ఇతని మతమునకు సంబంధించిన సన్నివేశములపై నిష్ఠగనపరచినారు. అర్వాచీన తామ్రశాసనములు ఇతనిని చోళవంశవృక్షములో మూలపురుషులలో పేర్కొనుచున్నవి. 'ఇతడు పూర్వజన్మలో సాలెపురుగు'గా జన్మించెనట.

కాళవళ్ళి కరువూరు సమీపమున జరిగిన కళుమాళమ్ యుద్ధమును పేర్కొనుచున్నది. అందు శేంగణాన్ చేరరాజును జయించి బంధించినాడు. పొయ్‌గై కవి చోళరాజును ప్రస్తుతించి, మిత్రుడైన చేరరాజును విడిపించినాడు. పుఱనానూఱులోని పద్యమును చెఱసాలలో నున్న చేరరాజు రచించినాడు. పొయ్‌గై కవియే వైష్ణవ ప్రపంచమున సుప్రసిద్ధుడైన పొయ్‌గై ఆళ్వారు.

## కాలనిర్ణయము

సంఘవాఙ్మయములో ప్రశంసితులైన రాజులు చారిత్రక యుగమునకు ప్రాచీనులు. కాని వీరి కాలమును నిష్కర్షగా నిరూపించుటకు వీలులేదు. చరిత్రలోని ఉఱయూరు, కావేరీ పట్టణముల ప్రాచీనచరిత్రను నిరూపించు ఆధారములు లభించుట లేదు. చేరరాజు శెంగుట్టువాన్ సింహళమును క్రీ. శ. 113 సం. నుండి 135 వరకు పాలించిన గజబాహువు సమకాలీనులని శిలప్పదిగారము ప్రకారము కుమారస్వామిగారు సూచించినారు. నామ సాదృశ్యమును బట్టి (శిలప్పదికారములోని గజబాహువు మహావంశములోని సింహళగజబాహువని) చారిత్రక నిర్దేశము నెలకొల్పి మహావంశములోని ప్రాచీన ఖండములు ఐదవ శతాబ్దిలో ప్రాచీనాధారములను పురస్కరించుకొని

వ్రాయబడినవి. సంఘవాఙ్మయము క్రీ. శ. మొదటి శతాబ్దినుండి నాల్గవ శతాబ్దివరకు వ్రాసినట్లు చెప్పవచ్చును.

## సంఘ వాఙ్మయము : సంఘ వృత్తములు

సంఘవాఙ్మయమునకు 'మన్ట్రమ్' సభామండపము 'పొదియిల్' సమాగమస్థానము ఆలవాలములు. 'అవై' సభ సాహిత్యమునకే గాక రాజ్యతంత్రమునకు కూడ సమాగమస్థానము. ఆ సభలో రాజుకొలువు దీరి ధర్మాసనంబుండి వివాదములు పరిష్కరించుచుండెడివాడు. మలయమాన్ పుత్రుల విచారణ ఆ సభలో జరిగినది. కొప్పెరుంగోలన్ రాజు లేని మన్ట్రమును అతని కవిమిత్రుడు పొత్తయార్ చూడలేక పోయినాడు. ఇట్లే రాజధానులలోవలె జనపదములలో కూడ మన్ట్రము లుండెడివి. ఇవియే అర్వాచీనకాలమున స్వయంసంపూర్ణమైన గ్రామ ప్రజాస్వామ్యములుగ మారినవని ఊహింపవచ్చును.

రాజు సర్వాధికారి. కాని కవులు, పండితులు అమాత్యులు రాజునకు ధర్మప్రబోధము చేయుచుండెడివారు. సంఘవాఙ్మయములోని రాజులు ఎందరో కవులు. కవిమిత్రులు.

భూమిపన్ను రాజ్యమునకు ప్రధానాదాయము. ఎగుమతి దిగుమతి పన్నులవలన విశేషాదాయము వచ్చెడిది. పట్టినప్పాలైలోని యీక్రింది వాక్యముల వలన ఈ విషయము స్వయం వ్యక్తమగు చున్నది.

"రాజోద్యోగులు సముద్రతీరమున ప్రతిదినము విరామములేక సుంకములమీద సుంకములను విధించుచుందురు. సముద్రజలము మేఘముల ద్వారా నదులను నదుల ద్వారా సముద్రమును చేరుచున్నట్లే వ్యాపారవస్తువులు సముద్రమునుండి భూమికి భూమినుండి సముద్రమునకు చేరుచున్నవి. అనేక వస్తువులును, కాంచనమణిసముదాయములును

రాజరక్షితములైన భవనములనుండి వ్యాఘ్రలాంఛన ముద్రా ముద్రితములై నౌకలను చేరుచున్నవి.'

రాజులు సర్వసేనాపతులై స్వయముగా యుద్ధములను నిర్వహించినారు. చేరరాజు వీపుమీద దెబ్బతిని అవమానమునకు ప్రాయశ్చిత్తముగ ప్రాయోపవేశముచే మరణించినాడు. వీరమరణము స్వర్గప్రవేశము. పరాజితులైన రాజుల కాంచనరత్నకిరీటములు విజేతల నూపురములుగా మారిపోయెడివి.

రాజులు సాహిత్యసంగీతప్రియులు. కవులు రాజాస్థానముల నలంకరించినారు - కుశీలవులు నృత్తగీతాదులు ప్రదర్శించుచు పల్లెపల్లెలు రాజాస్థానములు గమించి పోయెడివారు. నృత్తములు మార్గదేశి విభాగములు కన్పించుచున్నవి. శిలప్పదిగారములో నృత్త ప్రశంస కలదు. తాంబురా చితారు పిల్లనగ్రోవి ఇత్యాదులు జంత్ర గానములు. నృత్తవిద్యను రాజులు ప్రజలు అభిమానించినారు.

పుహారు, కావేరీపట్టణము సముద్రతీరమున సుప్రసిద్ధ ప్రాచీన పట్టణములు. శిలప్పదిగారములో పుహారు నగరమునకు దేశదేశములలో నున్నవస్తువులు, నౌకలలో వచ్చుచున్నట్లు గలదు. తెరచాపలు దింపకుండ, విదేశనావలు వస్తువులను పుహారుతీరమున దించుచుండెడివి. పుహారునగరవర్ణన శిలప్పదిగారములో గలదు. కావేరీ తీరమునగల ఆ నగరము మరువూరుప్రక్క సముద్రమునకు చెంత నున్నది. పట్టినప్పక్కము దాని నంటియున్నది. మరువూరులో యవనుల సౌధములు, విదేశీయుల గృహములు, సాలెలు, రత్నవర్తకులు, మున్నగువారి వసతులు గలవు. పట్టణములో విపణివీధి గలదు. అందు ధాన్యవర్తకులు, బ్రాహ్మణులు జ్యోతిష్కులు వ్యవసాయకులు నివసించెడి వారు. రాజప్రాసాదము చుట్టు అంగరక్షకులు, కవులు వంధిమాగధులు, నటులు, గాయకులు, మాలాకారులు ఉండెడివారు.

పట్టినప్పాలై పుహారు వాణిజ్యాభ్యుదయమును పేర్కొనుచున్నది. 'అనేకభాషలు మాటాడు విదేశవర్తకులు సుహృద్భావముతో పుహారు నగరమున నివసించెడివారు. సముద్రమార్గమున జవనాశ్వములు చేరెడివి. ఉత్తరపర్వతములలోని రత్నములు, పశ్చిమపర్వతముల నుండి చందనము, దక్షిణసముద్రమునుండి ప్రవాళములు, పశ్చిమ సముద్రమునుండి పగడములు గంగాతీరమునుండి అనేకవస్తువులు, సింహళమునుండి ఆహారపదార్థములు, కాళగల (సుమిత్రాద్వీపము) నుండి వస్తుసముదాయములు పుహారునగర వీథులలో రాసులు రాసులుగా కన్పించుచుండును. పేరుంబాణాఱ్ఱుప్పడై లో, తీరముననున్న ఉన్నత దీపస్తంభము రాత్రుల ప్రయాణముచేయు నౌకలను ఆహ్వానించుచున్నట్లు వర్ణన గలదు.

భారతదేశమునకు క్రీ. శ. ప్రథమశతాబ్దులందు ప్రతీచీదేశములతో నౌకావ్యాపారబంధము లున్నట్లు ప్రాచీనగ్రీకుగ్రంథములనుండి గూడ తెలియుచున్నది. భారతీయరాజాంతఃపురములకు కన్యకలను రోమకవర్తకులు గొనిపోవుచుండెడివారని పెరిప్లస లో గలదు. సంస్కృతనాటకములలో అంతఃపురముల యవనకన్యకలు గలరు.తమిళదేశములో ప్రాచీన రోమకనాణెములు దొరికినవి. ప్లినీ ప్రతిసంవత్సరము పదిలక్షల సెస్టర్సిలు భారతదేశమునకు చీనా అరేబియాలకు గ్రీకుదేశమునుండి పోవుచున్నట్లు వచించినాడు. అలెగ్జాండ్రియావాస్తవ్యుడు హిప్పారకస్ అనుకూలవాయుప్రసారమును వర్షఋతువులో వీచునట్లు కనుగొనినాడు. ఆ ఋతువాయువునకు హిప్పారకస్ అనిపేరు. అనుకూలవాయుప్రేరితములై ప్రతిసంవత్సరము నౌకలు ఈజిప్టునుండి దక్షిణహిందూదేశమునకు ప్రయాణమై పోవుచుండెడివి. పెరిప్లసు కాలమున ఈ మార్గము ప్రచారములో నున్నది. టోలిమీ కాలమున ఈ వర్తకము భారతదేశమునుండి సుమిత్ర జావా చీనా వరకు విస్తరించినది. ఈ వ్యాపారము క్రీ. శ. మూడవ శతాబ్దిలో

సన్నగిలినది. మూడవశతాబ్దినాటి రోమక నాణెములు భారతదేశములో విరళములుగా కన్పించుచున్నవి. పెరిప్లసు భారతదేశములో త్రివిధములైన నావలను పేర్కొనినాడు. చిన్న చిన్న పడవలు, పెద్ద పెద్ద దారువులతో నిర్మించిన "సంగర" ములు. అంతకంటె గంగాతీరమునకు చంపారాష్ట్రమునకు పోవు చోళందియ నావలు పెద్దవి. రుద్రంగణ్ణనార్ కవి పుహారురేవులోనున్న చిన్న చిన్న పడవలను తెరచాపలతో సముద్రయానము చేయు పెద్దనావలను పేర్కొనినాడు. ఈ చోళందియ నావలు పెరిప్లసులోని వర్ణననుబట్టి ఈజిప్టునావల కంటె పెద్దవని చెప్పవచ్చును.

నూలువస్త్రములకు, పట్టువస్త్రములకు దక్షిణభారతదేశము ప్రాచీనకాలమున ప్రసిద్ధి వహించినది. రోమకసామ్రాజ్యమునకు ఎగుమతియైన వస్తువులలో నూలువస్త్రములు ప్రాముఖ్యము వహించినవి. ఉఱైయూరు నూలునేతకు ప్రసిద్ధివహించినది. పొరునరాఱ్ఱుప్పడైలో పాముకూసమువంటి నూలువస్త్రముల వర్ణన గలదు. నూలు కంటికి కనపడనంత సన్నమైనది.

అతిథులకు వీడ్కోలు నిచ్చుటకు అతనితో ఏడడుగులువేయుట సంస్కృతాచారము. దీనికి సప్తపది అనిపేరు. కరికాలుడు ధవళాశ్వచోదితమైన రథమును అధిరోహింపుమని అతిథిని కోరుటకు పూర్వము అతనితో ఏడు అడుగులు నడిచి వెళ్ళినాడు. గోహత్య బ్రహ్మహత్య మహాపాతకములు. సహగమనము కేవలము స్వచ్ఛందము. మరణించిన భర్తలతో సహగమనము చేసిన భార్య మహాపతివ్రత యని సంఘగౌరవము.

ప్రాచీనకాలమున బౌద్ధజైనమతములు దక్షిణ తమిళదేశముల వరకు వ్యాపించినవి. చేరరాజు, ఆండైకవి అతని మిత్రుడగు రాజు ప్రాయోపవేశముచే మరణించినారు. ఈ సల్లేఖనవ్రతము జైనసంప్ర

దాయము. వీరు జైనులు లేక జైనమతప్రియులై యుందురు. మణి మేఖలై 'అరవణవడిగల్' అను బౌద్ధభిక్షువును పేర్కొనుచున్నది. ఇతడు చారిత్రక పురుషుడు కాకపోయినను, అలనాటి నగరములలో సంచరించిన బౌద్ధభిక్షుకులకు ఆలంకారిక ప్రతినిధి యని చెప్ప వచ్చును.

## అజ్ఞాత చోళ యుగము

ప్రాచీన సంఘవాఙ్మయ యుగము తరువాత క్రీ. శ. నాల్గవ శతాబ్దినుండి తొమ్మిదవశతాబ్దివరకు చోళచరిత్రలో అజ్ఞాతయుగము. అప్పుడు తమిళదేశమును కడుంగోన్ వంశీయులైన పాండ్యరాజులు సింహవిష్ణు వంశీయులైన పల్లవులు శాసించినారు. తొమ్మిదవ శతాబ్ది మధ్యభాగమున విజయాలయుడు సింహాసనమధిష్ఠించువరకు తమిళ చరిత్రలో పొగమంచుతెరలు గ్రమ్మియున్నవి. శిలాశాసనములు, సాహిత్యసాక్ష్యములు కొంతవరకు మార్గదర్శకము లగుచున్నవి. ఈ కాలమున చోళులు, ఒకమూల పాండ్యరాజ్యమునను, మరియొక మూల పల్లవరాజ్యమునను ఒదిగి పడియున్నారు. కాని వీరు ఉఱైయూరు ప్రాంతమున సామంతులై యున్నట్లు అనుమానింపవచ్చును. కొందరు చోళవంశీయులు దూరదేశములకు విధిప్రేరితులై పోయి యుందురు. అందుచే, కొడుం బలూరు, (పుదుకోట్టై) శియ్యాళి (షియాలి) హేమవతి, మాలేపాడు మున్నగు దూరస్థలముల వీరు కన్పించు చున్నారు.

వేల్వికూడి పాండ్యరాజశాసనము దక్షిణాపథమున అరాజకము నకు కారణభూతులైన కలభ్రులను పేర్కొనుచున్నది. క్రీ. శ. ఆరవ శతాబ్ద్యంతము కలభ్రులను జయించి పల్లవ పాండ్య రాజ్యములు తిరిగి తలలెత్తినవి. ప్రాచీనచోళరాజ్యముగూడ కలభ్రుల దండయాత్ర లచే విచ్ఛిన్నమైనట్లు ఊహింపవచ్చును. విజయాలయుని శిలాశాస

నములలో ఈ ప్రస్తావన లేకపోవుట సహేతుకమే. కలభ్రులు అంతరించిన వెంటనే చోళులు తలయెత్తలేదు. పాండ్యపల్లవరాజ్యములలో అణగియుండిరి. కాని బుద్ధదత్తుని రచనలలో చోళదేశమున కలభ్రపరిపాలన ప్రసక్తి గలదు. బౌద్ధవాఙ్మయానుశీలనమునకయి సింహళమునకు సాహితీయాత్రికుడై మొట్టమొదట బుద్ధదత్తుడు పోయియుండును. ఇతడు అజ్ఞాతచోళయుగములో నివసించినవాడనుట యథార్థము. అభిదమ్మావతారములో కావేరీపట్టణవర్ణన గలదు. అచ్చట ఖండదాసుడు నిర్మించిన విహారములో సుమతి ప్రార్థనానుసారము అతడు ఆ గ్రంథమును రచించినాడు. కావేరీ తీరమున చోళదత్తలోనున్న భూతమంగల నగరములో వెణ్హునాసుడు నిర్మించిన విహారములో 'వినయ వినిచ్ఛయ' మును రచించినట్లు చెప్పినారు. ఈ గ్రంథమును అతడు అచ్యుత విక్కంత మహారాజు కలభ్ర వంశీయుడు రాజ్యమేలుచున్నప్పుడు అరంభించి ముగించినాడు. (1) ఈ అచ్యుతుడే తమిళసాహితీలోకములో చేరచోళపాండ్యప్రభువులను బంధించిన అచ్చుతుడు. (2) 10 పదవశతాబ్దిలో యాప్పరుంగిలక్కారికై రచించిన అమితసాగరార్ ఇతనిపైగల కొన్ని పాటల నుదాహరించినాడు. అచ్చుతుడుకూడ బౌద్ధుడైయుండును. కలభ్రులను కవిరాజులుగ, బ్రహ్మదేయములను నిగ్రహించినవారిగ వేల్వికూడి దానశాసనము పేర్కొనుచున్నది.

అచ్యుతరాజు అనంతరము కొంతకాలమునకు, పల్లవ పాండ్య రాజులు కలభ్రులను జయించినారు. చోళులు ఈ నూత్నరాజ్యముల మధ్య కావేరీతీరమున అణగి పడియుండిరి. ఈ నూత్నరాజ్యపాలకులు

---

(1) అచ్యుత అచ్యుత విక్కంతే కలభకుల వర్ధనే
మహీం సమనుశాసతే అరబ్ధో చ సమాపితో

(2) తమిళనావలార్ చరితై VV 154 – 57

చోళరాజకన్యకలను పరిగ్రహించి వారికి రాజ్యములో పదవులు ప్రసాదించినారు.

క్రీ. శ. 639 - 640 సం. మధ్య యువాన్‌చాంగ్ అను చీనా యాత్రికుడు అమరావతీ కాంచీపురముల కొన్ని నెలలు గడపినాడు. అమరావతికి కాంచికి మధ్య అతడు చు-వి-య రాజ్యమును దక్షిణమున పేర్కొనినాడు. చీనాయాత్రికుని వచనములను బట్టి ఆ రాజ్యము నేటి కడప మండలమున ప్రాచీనకాలమున విలసిల్లినట్లు కన్నింగు హామ్‌గారి నిర్దేశము. కడపమండలములోని అనేక శిలాశాసనములు ఒక తామ్రదానశాసనము కరికాలుని మూలపురుషునిగా పేర్కొను చున్న ఒక వంశవృక్షమును నాలుగు పురుషాంతరములవరకు పేర్కొను చున్నవి. వారి రాజ్యము రేనాండు 7000 కుందేరునదీప్రాంతమున కుందేరు కడప కర్నూలు మండలములో నున్నది. పురాతత్త్వజ్ఞులు ఈ శిలాశాసనములు క్రీ. శ. ఎనిమిదవ శతాబ్దినాటివని మాలేపాడు తామ్రశాసనము ఏడవ శతాబ్దినాటిదని చెప్పుచున్నారు. వీరి బిరుదావళులను బట్టి వీరికి చాళుక్యపల్లవరాజ్యములకు సన్నిహిత సంబంధమున్నట్లు ఎంచవచ్చును. వారి రాజలాంఛనము వ్యాఘ్రము గాదు. తోక సారించిన జూలు సింహము. మేలేపాడు తామ్రశాసనము లోని వారి వంశవృక్షము:

నందివర్మ — కశ్యపగోత్రము

సింహావిష్ణువు    నందరనంద    ధనంజయవర్మ

ధనంజయవర్మ
|
చోళమహారాజు మహేంద్ర-విక్రమవర్మ
ముదితశిలాక్షరనవరామ-చోళకేరళ
పాండ్యదేశాధీశుడు

గుణముదిత    పుణ్యకుమార పోర్మ్ముఖిరామ
పృథ్వీవల్లభ మార్దవచిత్త మదనవిలాస

కడపమండలములో ధనంజయుని శిలాశాసన మొకటి గలదు. చోళమహారాజు మహేంద్రవర్మ చోళకేరళపాండ్యదేశాధీశుడు. కాని ఇతని పరిపాలననుగురించి చారిత్రకసాక్ష్యములు లభించుటలేదు. పుణ్యకుమార పోర్మ్ముఖమహారాజు పృథ్వీవల్లభబిరుదు, అతని రాణి వసంతపోటిచోళమహాదేవి (3) నామము అతనికిగల చాళుక్యసంబంధ మును ద్యోతకమొనర్చుచున్నది. వీరిలో ఎవరు యువాన్ చాంగ్ కాలమున పరిపాలించినారో చెప్పలేము. చోళమహారాజాధిరాజ విక్ర మాదిత్యసత్యాదిత్యుడు అతని రాణి ఇళంచోళ మహాదేవి (4) ఈ చోళవంశమువారే. విక్రమాదిత్య II రాజు చోళులను గూడ జయించి నట్లు గలదు. (5) నందివర్మ III పల్లవమహారాజు 6 వ సం॥రం వేలూరు పాలయము శాసనములో కుమారాంకుశచోళమహారాజు

---

(3) 384 of 1904

(4) 393 and 400 of 1904

(5) S II i p 148 E I, V p 204

ప్రసక్తి గలదు. (6) వీరి చరిత్ర భావిపరిశోధనలవలనగాని నిర్మించుటకు వీలులేదు.

తమిళదేశములోని చోళులచరిత్ర మరింతఅజ్ఞాతముగ నున్నది. అలహాబాదు శిలాశాసనములో చోళరాజ్యప్రస్తావన లేదు. వేలూరు పాలయము శాసనములో బుద్ధవర్మ చోళసేనాసముద్రబడబాగ్నిగా ప్రశంసితుడు. (7) సింహవిష్ణు క్రీ. శ. 75 - 600 కావేరీ సిక్తమైన చోళరాజ్యమును జయించినారు. (8) ఆ కాలమున చాళుక్యులు కూడ చోళులను జయించినట్లు గలదు. (9) ఈ విజయము సత్యమైన వారు రేనాండుచోళులు గావచ్చును. క్రీ. శ. 600 - 630 మహేంద్రవర్మ చోళరాజ్యమును పరిపాలించినాడు. శివుని ఆదేశానుసారమున ఆ రాజు తిరుచునాపల్లి కొండపై ఆలయమును కట్టించినాడు. నరసింహవర్మ 1 కూరమ్‌దానశాసనము వింతగా పేర్కొనుచున్నది. పులకేశి 634 లో, ఐహోలుశాసనములో పల్లవులరాజ్యమును కాంచీపురము దాటకుండ చేసి పాండ్యకేరళచోళరాజ్యములకు అభ్యుదయము కూర్చినాడు (10) పులకేశి తరువాత సింహాసనమధిష్ఠించిన విక్రమాదిత్యుడు చోళరాజ్యమును జయించినట్లు, ప్రాచీనచోళరాజధాని ఉత్తైయూరున విడిసినట్లు క్రీ. శ. 674 గద్వాలుశాసనము పేర్కొనుచున్నది. (11) శ్రీమార శ్రీవల్లభుడు క్రీ. శ. (6815 - 62) పాండ్యరాజుతోపాటు చోళులను ఓడించినట్లు శిన్నమనూర్ శాసనములో గలదు.

---

(6) S II ii 509 V 26
(7) SII ii p 508 l. 14.
(8) Ibid
(9) Kilhorn's List of SII No S E ', Vii
(10) E I, Vi p6 Verse 29 - 31.
(11) E I X p 103 ఉరగపురి

మతవాఙ్మయము ఈ యుగమునగూడ చోళులు కావేరీప్రాంతమున నున్నట్లు సాక్ష్యమిచ్చుచున్నది. 12 వ శతాబ్దిలోని పెరియ పురాణములో తిరునానసంబందర్ సమకాలికుడైన పాండ్యరాజునకు మంగైయార్క్కరాశి అను చోళకన్యక భార్యయని గలదు. ఉఱైయూరును పాలించిన పుగళ్‌చోళనాయనార్ శివభక్తుడు. ఇట్టి వెన్నో గలవు. శేక్కిళార్ రచించిన పెరియపురాణములోని ఈ కథలకు కొన్నిటికి నంబిఅండార్ 'అందాది' మాతృక. సుందరమూర్తివంటి నామములు క్రీ. శ. 8 వ శతాబ్దిని సూచించుచున్నవి. వైష్ణవగ్రంథములు గురుపరంపర, దివ్యసూరిచరితకూడ చోళరాజులను పేర్కొనుచున్నవి. తొండరడిపొడియాళ్వారు హృదయమును మాధుర్యతరంగితము చేసిన వేశ్యకన్యక దేవదేవి ఉఱైయూరులోని చోళరాజాస్థానమున నర్తకి. ఉఱయూర్‌నాచ్చియార్ మర్త్యులను వివాహమాడక రంగనాథుని వరించిన చోళరాజకన్యక. తిరుమంగయాళ్వారు తొలిజీవితమున చోళసేనాని. ఈ గ్రంథములు చోళసామ్రాజ్యమున్నతస్థితిలో నున్నప్పుడు విరచితములైనను, ఇందలి కథలకు మాతృక యథార్థమైన ఐతిహ్యము కావచ్చును.

క్రీ. శ. నాలుగవ శతాబ్దినుండి తొమ్మిదవ శతాబ్దివరకు చోళరాజులు రేనాండు మండలమున కావేరీతీరమున అజ్ఞాతవాసము గడపినారు. బౌద్ధమతము జైనమతము తమిళరాజ్యమును ఈ మధ్యకాలమున ఏలినవి. నాగపట్టణముననున్న బౌద్ధవిహారములో కాంచనబుద్ధవిగ్రహ ముండెడిది. దానిని తిరుమంగయాళ్వారులు కొల్లగొట్టినట్లు గురుపరంపరలో గలదు. ఆళ్వారులు నాయనారులు దేశమును భక్తిభావ తరంగితము చేసి వేదమతమును పునఃప్రతిష్ఠిత మొనర్చినారు.

## చోళ సామ్రాజ్యము

### విజయాలయుడు

దక్షిణభారత చరిత్రలో ఒక నూతనయుగము శ్రీపురంబియము యుద్ధభూమిలో అరంభించినది. అందు పాండ్యరాజు వరగుణుడు ఓడిపోయినాడు. ఉదయేందిరము దానశాసనములో గాంగపృథ్వీ మహారాజు II తనపూర్వికుడైన పృథ్వీపతి శ్రీపురంబియము యుద్ధములో వరగుణుని ఓడించి, మిత్రుడైన అపరాజితుని, యథార్థముగా అపరాజితుని చేసి, వీరస్వర్గ మలంకరించినట్లు చెప్పినాడు. పాండ్యరాజు ఈ ఓటమినుండి తిరిగి కోలుకొన లేదు. యుద్ధరంగమున విజయము సిద్ధించినను పల్లవులు, అటు పాండ్యులతో ఇటు చాళుక్యులతో సలిపిన యుద్ధములతో అలసిపోయినారు. పల్లవరాజమిత్రులలో గాంగరాజుతో పాటు చోళరాజుకూడ కలడు. చోళరాజు ఆదిత్యుడు, అదను గ్రహించి రాజ్యసంస్థాపనను అరంభించినాడు. పృథ్వీపతి (I) రాజు శాసనములు క్రీ.శ. 879 సం. నుండి కన్పించుచున్నవి. కావున అతడు మరణించిన శ్రీపురంబియము యుద్ధకాలము క్రీ. శ. 879 ప్రాంతమైయుండును.

ఆదిత్యుడు విజయాలయుని పుత్రుడు. తిరుచురాపల్లి మండలము లోని ఒకశాసనము పూర్వము పరకేసరి విజయాలయుడు ఇచ్చిన దాని పునః ప్రదానమును పేర్కొనుచున్నది. (1) చోళరాజ్యము తిరిగి ఉఱయూరుప్రాంతమునుండియే ఆరంభించినదని దీనినిబట్టి ఊహింప వచ్చును. తిరువాలంగాడు దానశాసనములో విజయాలయుడు తంజా పూరీను సుకరముగ ఆక్రమించినట్లు గలదు. (2) అచ్చటి 'నిసుంభ

(1) 675 of 1909 రాజరాజుకాలమున దేవాలయమునకు సేవా వృత్తిలభించు బ్రహ్మదేయగ్రామములో విజయాలయ చతుర్వేది మంగలము కన్పించుచున్నది.

(2) SII (iii) No. 205 V V 45, 46

నూదిని' అలయము అతడు ప్రతిష్ఠించినారు. ఉత్తరఆర్కాటు మండలములో కిళ్‌పుత్తూరులో విక్రమచోళుని ఐదవ సం.మున శాసనము విజయాలయుని నాల్గవ సం.మునన్న శిలాశాసనము నుదాహరించుచున్నది. పల్లవసామంతుడయ్యు ఇతడు స్వతంత్రముగ రాజ్యసంవత్సరములను పేర్కొనుటనుబట్టి, పల్లవరాజ్యము క్షీణదశలోనున్నట్లు స్వయంవ్యక్తమగుచున్నది.

విజయాలయుని తంజావూరువిజయకాలనిర్ణయమునకుముందు విజయాలయుని కాలమును సమీక్షింపవలెను. ఇతని మనుమడు పరాంతకుడు 15 జనవరి 25 జూలై మధ్య క్రీ. శ. 907 సం. సింహాసనమధిష్ఠించినట్లు కీల్‌హారన్ నిర్ణయించినాడు. (3) అతని తండ్రి ఆదిత్యుడు కనీసము 27 సం.లు రాజ్యముచేసినాడు. తిరుక్కళుక్కున్ఱమ్‌లోని ఒక శిలాశాసనము రాజకేసరి 27 వ సం. నాటిది. (4)

దాతపల్లవరాజు స్కందశిష్యుడు. పాడావికొండ నారసింగపొత్తరైయారు కాలమున ప్రచారములోనున్న దానమును ఈ శాసనము పునః ప్రతిపాదించుచున్నది. రాజు మారినప్పుడు పునఃప్రదానము ప్రాచీనాచారము. ఆదిత్యుడు పల్లవులను జయించుట సుప్రసిద్ధచారిత్రకసన్నివేశము. కావున ఈ శాసనము ఆదిత్యునిదే యని నిర్ణయించుటలో విప్రతిపత్తి లేదు. అంతేకాదు, అర్వాచీనచోళశాసనములు ఆదిత్యుని 'రాజకేసరి' అని మాత్రమే పేర్కొనుచున్నవి. (5) తిరుక్కళుకున్ఱమ్ తరువాత ఆదిత్యుడు ఎంతకాలము పరిపాలించినాడో చెప్పుట కష్టము. తక్కోలములోని ఒక శాసనము రాజకేసరి 24 వ సం.మున క్రీ. శ. 894 కి 895 లోని సూర్యగ్రహణమును పేర్కొను

(3) E I V II/ p 260

(4) 167 of 1894 E I III p 279

(5) **Anbil plates E I xx VV 17, 18.**

చున్నది. (6) దీనినిబట్టి ఆదిత్యుడు 870 ప్రాంతమున సింహాసన మధిష్ఠించినట్లు చెప్పవచ్చును. 870 కు పూర్వము విజయాలయుడు 850 ప్రాంతమున పరిపాలన అరంభించియుండును.

విజయాలయుని రాజ్యారంభము, దీనిని బట్టి శ్రీపురంబియములో ఓడిపోయిన వరగుణుడు పాండ్యరాజు సింహాసనమధిష్ఠించుటకు ఇంచుకపూర్వము వరగుణుని తండ్రి కాలమున అరిశిల్ యుద్ధములో ఓడిపోయినను, పాండ్యరాజ్యము ప్రబలముగనే యున్నది. (7) ఆ కాలమున తంజావూరులో కావేరీ ముఖద్వారమును ముత్తరైయార్ రాజులు పరిపాలించినారు. వారి శాసనములు శేందలైలో తంజావూరును పాలించుచున్నట్లు వచించుచున్నవి. (8) వీరు పల్లవులకు, పాండ్యులకు యథోచితముగ సామంతులై పరిపాలించినట్లు వీరి బిరుదావళుల వలన ఊహింపవచ్చును. వరగుణుని కాలమున వీరు పాండ్యులతో కలసినారు. దీనినిబట్టి, పల్లవప్రోత్సాహముతో చోళరాజు విజయాలయుడు తంజావూరును సుకరముగ ఆక్రమించినట్లు తేలినది. పల్లవరాజు చోళసామంతులను ప్రోత్సహించుట పులిపిల్లలకు నెత్తురు రుచి మరగించినట్లైనదని ఆచార్య శ్రీనీలకంఠశాస్త్రిగారి ప్రవచనము. విజయాలయుడు తన తంజావూరువిజయను చోళసామ్రాజ్యసౌధమునకు పునాదిరాయి అగునని కలలోకూడ తలచియుండడు. పాండ్యరాజు వరగుణవర్మ ప్రతిక్రియ సల్పుటకు బయలుదేరి సేనలతో 'ఇడవై' వరకు వచ్చి విడిసినాడు. (9) కాని నృపతుంగవర్మ తరువాత సింహాసన మధిష్ఠించిన పల్లవరాజు అపరాజితవర్మ సామంతులందరును జేర్చి ఎదిరించినాడు. ఇందు గాంగరాజు పృథ్వీపతి ప్రముఖపాత్ర నిర్వహించి

(6) E I XIX No. 12.

(7) K. A. Nilakantha sastry.

(8) E I XIII p p 134 Hf.

(9) 690 of 1905.

నాడు. విజయాలయుని పుత్రుడు ఆదిత్యుడు, అప్పటికి రాజ్యమునకు వచ్చినాడు. కావున చారిత్రకాధారములు లభింపకపోయినను ఈ యుద్ధములో పల్లవులకు తోడ్పడినట్లు ఊహింపవచ్చును. లేక విజయాలయునికి పల్లవులతో అసలే సంబంధము లేకపోవచ్చును. అతడు పాండ్యపల్లవుల యుద్ధములలో పరస్పరము పోరాడకుండ, అదను గ్రహించి తంజావూరును ఆక్రమించి రాజ్యమును విస్తరించి యుండును. అట్లే అతని పుత్రుడు ఆదిత్యుడు యథోచితముగ రాజ్యమును విస్తరించి యుండును - లేక శ్రీ పురంబియము యుద్ధములో ఆదిత్యుడు వరగుణుని పక్షమున పోరాడినట్లు ఊహించిన యుద్ధములో ఓటమి తరువాత అతడెట్లు అపరాజితుని ఓడింప గల్గినదియు ఊహించుట కష్టము - ఆదిత్యుడు తనతండ్రి ముత్తరాయాన్ నుండి జయించిన తంజావూరునే గాక, ఏతత్ప్రాంతములనుగూడ పరిపాలించుటనుబట్టి చూడ అతడు పల్లవపక్షమున లేక తటస్థుడుగ నున్నట్లు సువ్యక్తమగుచున్నది.

## ఆదిత్యుడు
## (క్రీ. శ. 871 – 907)

తిరువాలంగాడు దానశాసనములో ఆదిత్యుడు పల్లవరాజు అపరాజితుని ఓడించి అతని రాజ్యమును కలుపుకొనినట్లు గలదు. (10) కన్యాకుమారి శాసనములో అతడు మత్తేభముపై నున్న పల్లవరాజును చంపినట్లు గలదు. తిల్లైస్థానములోని శిలాశాసనమునుబట్టి రాజకేసరి తొండై మండలమును శాసించినట్లు తెలియుచున్నది. (11) ఆదిత్యుడు పల్లవులను జయించి చోళరాజ్యమున రాష్ట్రకూట సామ్రాజ్యమువరకు విస్తరించినాడు. అపరాజితుని శాసనములు అతని పదునెనిమిదవ రాజ్య

(10) V 49 (11) 286 of 1911

సంవత్సరము వరకు కన్పించుచున్నవి. ఆదిత్యుని శాసనములు తొండై మండలములో అతని 23 వ రాజ్య సం. పూర్వము మృగ్యము. ఒక దేవదానము 21 సం. నున్నది. (12) కావున ఆదిత్యుడు క్రీ. శ. 890 ప్రాంతమున అపరాజితుని జయించినట్లు ఊహింపవచ్చును.

గాంగరాజు ఆదిత్యుని ఆధిపత్యము నంకగీకరించి సామంతుడై నాడు. ప్రితిపతియార్ వూతమరై యార్ పుత్రుడు తక్కోలము దేవాలయమునకు ఒక రజితపాత్రను రాజకేసరి 24 వ సంవత్సరమున బహూకరించినాడు. ఈగాంగరాజు ఉదయేందిరము శాసనముపేర్కొనిన మారసింహుని కుమారుడు. పృథ్వీపతి!! రాజు. ఉదయేందిరము శాసనములో పరాంతకుని కాలమున చోళాధిపత్యము ప్రత్యక్షముగ నుదాహృతము. పూర్వోక్తమైన తిరుక్కలుక్కుఅమ్ శాసనములో పల్లవదానములు పునః ప్రోక్తములైనవి.

కొంగుదేశరాజక్కళ్, ఆదిత్యుడు తంజావూరులో పట్టాభిషిక్తుడైన తరువాత కొంగు దేశమును జయించి తలైకాడును పరిగ్రహించి పరిపాలించినట్లు వచించుచున్నది. అర్వాచీనమైన ఈ గ్రంథములోనున్న అసత్యములను వదలి, ఈ విషయమును నమ్మవచ్చును. కొంగుదేశములో పరాంతకుని శాసనములు కన్పించుచున్నవి. దీనిని అతడు జయించినట్లు కన్పింపదు. తలైకాడ్ ప్రస్తావననుబట్టి ఆదిత్యుడు దీనిని పశ్చిమగాంగులనుండి గైకొనియుండును. ఈ సమయమున పాండ్యరాజు శ్రీ పరాంతకవీరనారాయణుడు కొంగుదేశమున పోరాడినట్లు చెప్పుకొన్నాడు. కావున కొంగులో కొంతభాగము పాండ్యరాజునుండి గైకొనియుండును. అన్‌బిల్ శాసనములలో ఆదిత్యుడు కావేరినుండి సహ్యాద్రిమీద తీరరేఖపై పొడుగునను శివాలయములు కట్టించినట్లు గలదు.

(12) Sii, iii NO. 142.

తిల్లైస్థానములోని ఒక శాసనమునుబట్టి ఆదిత్యుడు చేరరాజు స్థాణురవి మిత్రులని తెలియుచున్నది. ఈ శాసనములో ఇద్దరురాజులు, సామంతుడు విక్కిఅణ్ణన్‌కు సింహాసనము పల్లకి, భేరి మున్నగునవి ప్రసాదించి వంశపారంపర్యమగు శేంబియాన్ తమిళవేళ అను బిరుదును అనుగ్రహించినట్లు అతని భార్య కదంబమాదేవి చెప్పుచున్నది. (13) అక్కిఅణ్ణాన్, చేరసేనాని అని అతడు కొంగుదేశమున పాండ్యరాజును ఎదిరించి పోరాడి ఈ ఇద్దరు రాజుల మన్ననలను పడసినట్లు ఊహింపవచ్చును. ఆదిత్యుని పుత్రుడు పరాంతకుడు చేరరాజ కన్యకను వివాహమాడినాడు.

ఆదిత్యుడు తొండైమానాడ్‌లో కాళహస్తికి సమీపమున మరణించినాడు. పరాంతకుడు అతని హస్తికలపై కోదండరామేశ్వర లేక ఆదిత్యేశ్వరాలయమును నిర్మించినాడు. (14) వేయిమంది బ్రాహ్మణులకు పర్వదినముల సంతర్పణ జరుగునట్లు ఏర్పరచినాడు.

## పరాంతకుడు

శ్రీపురంబియము యుద్ధకాలమున కావేరీతీరమున ఉఱైయూరు ప్రాంతమున చిన్నరాజ్యమును చోళులు పాలించుచుండిరి. 25 సంవత్సరములలో ఆదిత్యుడు పల్లవ అపరాజితవర్మను జయించి చోళరాజ్యమును విస్తరించిరాడు. కొంగుదేశము చోళరాజ్యమున కలసినది. గంగవంశరాజు ఆదిత్యుని అధికారమును శిరసా వహించినాడు. క్రీ. శ. 907 సం. అతని పుత్రుడు పరాంతకుడు సింహాసన మధిష్ఠించు నాటికి ఉత్తరమున కాళహస్తి దక్షిణమున కావేరి, పశ్చిమమున మైసూరు పీఠభూమి కేరళదేశము, తూర్పున సముద్రము చోళరాజ్యమునకు ఎల్లలు.

---

(13) 286 of 1911

(14) 286 of 1906 and 230 of 1903

పరాంతకుని శాసనములు 45 వ రాజ్యసంవత్సరమువరకు గన్పించుచున్నవి. (15) అతని 46 వ రాజ్యసంవత్సరమును తంజావూరు సమీపముననున్న కండియూరు శాసనము పేర్కొనుచున్నది. పరాంతకుడు అనేక విజయములను సాధించి చోళసామ్రాజ్యమును విస్తరించినాడు. పాండ్యరాజ్యమును ఓడించి కన్యాకుమారివరకు చోళరాజ్యమును విస్తరించినాడు. పల్లవులను నిర్విశేషముగా ఓడించి ఉత్తరమున నెల్లూరువరకు వ్యాపించినాడు. బాణులను జయించి గాంగరాజు హస్తిమల్లుని సామంతుని చేసినాడు. కాని పరాంతకుని జీవిత చరమసంధ్యాసమయమున రాష్ట్రకూట చక్రవర్తి కృష్ణమహారాజు పరాంతకుని పుత్రుని రాజాదిత్యుని యుద్ధములో చంపి చోళసామ్రాజ్యమును ఆక్రమించినాడు.

పరాంతకుడు సింహాసనమును అధిష్ఠించిన వెంటనే పాండ్యరాజ్యముపై దండెత్తినాడు. అతని మూడవ రాజ్య సం. మున 'మధురై కొండ' మధురాంతక బిరుదు వహించినాడు. (16) కాని మధురరాజ్యాక్రమణము క్రమయుద్ధబద్ధమై చాలకాలము పట్టినది. పాండ్యరాజ్యమున అతని 24 వ సం॥ కాని శాసనము కన్పించుటలేదు. (17) శిన్నమనూరు, ఉదయేందిరము శాసనములు ఆనాటి పాండ్యరాజును రాజసింహుడని పేర్కొనుచున్నవి. 'మహావంశము'నుబట్టి కస్సపుడు (క్రీ. శ. 913 - 23) పాలించుచుండగ చోళరాజు పాండురాజును యుద్ధములో జయించినాడు. పాండురాజు సైన్యసహాయము నపేక్షించుచు, లంకాధీశునకు కానుకలు పంపినాడు. లంకాధీశుడు సక్కసేనాపతి అధ్వర్యమున సేనను మహాతీర్థమువరకు సాగనంపి, వారిని ప్రోత్సహించి పంపినాడు. సక్కసేనాపతి పాండురాజును కలిసి

(15) 465 of 1918.

(16) 157 of 1928 and 11 of 1931.

(17) 446 of 1917

కొన్నాడు. పాండురాజు అతనిని ఆహ్వానించి ఆతిధ్యమిచ్చి 'జంబూ ద్వీపమునంతటికిని' ఇక జయించుట సుకరమని సంతోషించినాడు. కాని ఆ సైన్యము చోళరాజును జయింపలేకపోయినది. అంతేగాక ఉపసర్గ (ప్లేగు) వ్యాధిచే సేనాపతి మరణించినాడు. సైన్యము మరణింప సాగినది. ఈ విషయమును గ్రహించి లంకాధీశుడు, మిగిలిన సైన్యమును స్వరాజ్యమును చేర్చినాడు.

మహావంశములోని చారిత్రకకథనమునుబట్టి ఈ యుద్ధక్రమము మొట్టమొదట పాండ్యరాజు పరాజయము, తరువాత సింహళపాండ్య పరాజయము, తరువాత సక్కసేనాని మరణముగ మూడు దశలు కన్పించుచున్నవి. శాసనములనుబట్టిగూడ మహావంశకథనము ఋజువగుచున్నది. శాసనములు ఉపసర్గవ్యాధిలో సక్కసేనాని మరణమును ప్రస్తావించుటలేదు.

మహావంశములోని ప్రథమదశ పరాంతకు పరిపాలనారంభమున మధురపై నడపిన దండయాత్రను సూచించుచున్నది. ఉదయేందిరము శాసనము రెండవదశను పృధ్వీపతికాలమున క్రీ. శ. 921-2 లో వర్ణించినది.

"పరాంతకుడు పాండ్యరాజును - అతని సైన్యమును గజతురగభటయోధములను సంహరించి మధురను ఆక్రమించినాడు. లంకాధీశుడు పంపిన గజతురగభట వర్గములను తృటిమాత్రలో సంహరించినాడు. పాండ్యరాజు రాజసింహుని ఓడించి, పరాంతకుడు 'సంగ్రామ రాఘవ' బిరుదు సంపాదించినాడు." క్రీ. శ. 923 నాటి ఉదయేందిర శాసనమునకు పూర్వమే ఈ యుద్ధములు జరిగినవి.

పరాంతకుడు, పండ్రెండవ రాజ్య సం. మున వెల్లూరు యుద్ధమున పాండ్యసింహళసేనలను ఓడించినట్లు గలదు. (18) ఒక శాసనమ్ము

(18) 231 of 1926

శేన్నిప్పేరరైయన్ ఆధ్వర్యమున సింహళపాండ్యసేనల నెదుర్కొని, మునుముందు మరణించిన నల్గురు భటులను పేర్కొనుచున్నది. (19) వేలూరుదగ్గర జరిగిన ఘోరయుద్ధము క్రీ.శ. 915 ప్రాంతమైయుండును.

పరాంతకుడు వేలూరు యుద్ధానంతరము క్రమక్రమముగ పాండ్యరాజ్యమును ఆక్రమించినాడు. పాండ్యరాజు రాజసింహుడు స్వరాజ్యమును వదలి సింహళమునకు ప్రవాసిగా పారిపోయినాడు. దప్పులరాజు కాలమున మహావంశములో "పాండ్యరాజు చోళరాజునకు భయపడి నావలో మహాతీర్థమును చేరినాడు. లంకాధీశుడు, అతనికి ఆతిధ్యమిచ్చి, నగరోపాంతమున ఒకప్రాసాదమును విడిదిగా నిచ్చి, జీవనోపాధిగల్పించినాడు. లంకాధిపతి చోళరాజును జయించుటకు సైన్యము నాయత్తపరుప, సామంతులు తిరుగబడి విప్లవమును నెలకొల్పినారు. పాండ్యరాజు తన కిరీటమును రత్నహారములను అచట వదలి కేరళదేశమునకు తరలిపోయినాడు." అని యున్నది. తిరువాళంగాడు శాసనములోని శ్లోకము ఈ విషయమును పేర్కొనుచున్నది.

పాండ్యరాజు పరాంతకపరాక్రమాగ్నికి తాళలేక పైతృకరాజ్యమును వదలి సముద్రమును (లంకను) ప్రవేశించినాడు. (20) రాజసింహుని తల్లి వానవన్ - మహాదేవి కేరళదేశ కన్యక. కాని కేరళరాజులుచోళులకు మిత్రులు. కావున మొట్టమొదట రాజసింహుడు కేరళమును చేరుటకు సందేహించినాడు. పరాంతకుడు, జయించిన పాండ్యరాజ్యమునకు సార్వభౌముడుగ మధురలో పట్టాభిషిక్తుడగుటకు సంకల్పించినాడు. కాని కిరీటము మున్నగు రాజలాంఛనములు రాజసింహుడు సింహళమునకు కొనిపోయినాడు. కిరీటహారాదులను

(19) S I I iii No. 99
(20) నెం. 51.

తెచ్చుటకు సింహాళముపైకి సేనలను 'ఉదయరాజు II' (945–53) కాలమున పంపినాడు. మహావంశములో "పట్టాభిషిక్తుడు కాగోరి పాండ్యకిరీటమును పంపమని లంకాధీశునకు చోళరాజు రాయబారులను పంపినాడు. కాని లంకాధిపతి దానికి సమ్మతింపలేదు. చోళరాజు మహాసైన్యమును లంకపై పంపించినాడు. ఆ యుద్ధములో లంకారాజ్య సేనాపతి మరణించినాడు. అప్పుడు లంకాధిపతి కిరీటమును గైకొని రోహణమున దాగినాడు – రోహణమును ప్రవేశింపలేక చోళసేనలు మరలిపోయినవి."

సింహాళదండయాత్రాకాలమును నిష్కర్షగా నిర్ణయించుటకు వీలులేదు. పరాంతకుని రాజ్యాంతకాలమున జరిగియుండును.

పాండ్యదండయాత్రలలో పరాంతకునకు వేళిర్ వంశీయులైన కొడుంబాలూర్ రాజులు తోడ్పడినారు. కేరళరాజు, కేళప్పలువూరు రాజులైన పళువేట్టరైయారులు మిత్రులుగా నుండిరి. పరాంతకుని రాజ్యారంభముననున్న ఒకశాసనములో అతని కుమారుడు, అరికులకేసరి కొడుంబాలూరు రాజవంశములోని తెన్నవాన్ ఇళంగోవేళార్ పుత్రిక. పూది అదిచ్చపిదారి కన్యకను వివాహమాడినట్లుగలదు. రాజసింహునికి కొడుంబాలూరు రాజులకుగల వైరుధ్యము అతని శిన్నమానూరుశాసనము (క్రీ. శ. 916) లో స్వయంవ్యక్తమగుచున్నది. రాజసింహుడు అందు తంజై రాజులను నైప్పూరువద్ద జయించినట్లు, కొడుంబాలూరువద్ద యుద్ధము చేసినట్లు గలదు. దీనినిబట్టి, మహావంశ కథనమునుబట్టి, పాండ్యరాజునకు పరాంతకునికి మధ్య అనేక యుద్ధములు జరిగినవని ఊహింపవచ్చును.

పాండ్యయుద్ధములు జరుగుచున్నప్పుడు మధ్యమధ్య పరాంతకుడు పొరుగురాజ్యములపై దృష్టిమరల్చినాడు.

షోలింగపూరు శిలాశాసనము తొమ్మిదవ రాజ్య సం॥మున పరాంతకుడు గాంగరాజు పృధ్వీపతి ii వల్లాళవద్ద ప్రదర్శించిన పరాక్రమమునకు మెచ్చి అతనికి 'బాణాధిరాజు' బిరుదు ప్రసాదించినాడు. (21)పృధ్వీపతి ఉదయేందిరము శాసనములో పరాంతకుడు ఇద్దరు బాణ రాజులను నాశనము చేసి వైదుంబులను జయించినట్లు గలదు. (22) బాణులు ప్రాచీన రాజవంశీయులు పెరుబాణప్పాడిని పరిపాలించినారు. ఇది పాలారునకు ఉత్తరమున కాళహస్తి పుంగనూరు మధ్యదేశము. అంతిమదశలో వారి రాజధాని పటివి. షోలంగపూరు శాసనములోని ఈ పరివి అనంతపూరు మండలములో, నేటి పరిగి కావచ్చును. ఈ వంశములోని కడపటిరాజు మూడవ విక్రమాదిత్య విజయబాహు రాష్ట్రకూట కృష్ణమహారాజు మిత్రుడు.

విజయాదిత్య ii ప్రభామేరువు బాణరాజ్యమును క్రీ. శ. 909 వరకు స్వతంత్రముగ పరిపాలించినాడు. హస్తిమల్లుడు బాణరాజాధిరాజ బిరుదమును 916 నకు ముందు పరాంతకునిచే పడసినాడు. పరాంతకుడు బాణరాజ్యమును ఈ ఏడు సం॥ల మధ్య జయించినాడు. విజయాదిత్యప్రభామేరువు మునిమనుమడు రాష్ట్రకూట కృష్ణరాజు మిత్రుడుగా ఉదయేందిర శాసనములో నున్నది.

బాణునితోపాటు వైదుంబులను పరాంతకుడు జయించినాడు. వీరు తెలుగురాజులు. తొమ్మిదవ శతాబ్దిలో వీరు రేనాండు 7000 ను పాలించినారు.

తిరునొట్టియూరు శాసనములు రెండు, నెల్లూరు మండలముపై దండయాత్రను ప్రస్తావించుచున్నవి. (26) మాఱన్‌పరమేశ్వరన్ అను

(21) SII iii 96
(22) E. I iV p - 221-5
(23) SII, ii No. 76 V 9
(24) 160, 236 of 1912

పరాంతకుని సేనాని నెల్లూరును నాశనము చేసి, 'శీత్పుళి'ని జయించి నాడు. మార్గమధ్యమున తిరునొట్టియూరులో ఆగి మహాదేవునికి వందనము లర్పించి భూదానము చేసినాడు. ఆ దానశాసనకాలము పరాంతకుని ముప్పదినాలుగవ సంవత్సరము అనగా క్రీ. శ. 941.

క్రీ. శ. 940 ప్రాంతమున రాష్ట్రకూటసింహాసనమును 3 వ కృష్ణమహారాజు అధిష్ఠించినాడు. 940 ప్రాంతమున పరాంతకుని రాజ్యమున స్థితిగతులు మారినవి. సామ్రాజ్యము స్వల్పకాలములో అధికముగా విస్తరిల్లినది. గంగపృథ్వీపతి ii మరణించినాడు. అతని పుత్రుడు విక్కియణ్ణుడు తండ్రికి పూర్వమే గతించినాడు. పృథ్వీపతికి పుత్రులు లేరు. భూతుగుడు రాష్ట్రకూటకన్యకను రేవకాదేవి కృష్ణ మహారాజు సోదరిని వివాహమాడినాడు. అతడు గంగరాజ్యమునకు రాజు అయినాడు. అతని సోదరుడు రాచమల్లుని చంపి అతని రాజ్యమునుగూడ కలుపుకొన్నాడు. (25) బాణరాజు గజబాహు కృష్ణరాజునకు మిత్రుడై ఆయన సాయము నపేక్షించినాడు. పరాంతకుడు తనపుత్రుడైన రాజాదిత్యుని గజహయ యూథములతో తిరుమునైప్పాడినాడున నిలిపినాడు. (26) అతనికి తోడ్పడుచు అతని సోదరుడు అరికులకేసరికూడ ఆ ప్రాంతమునను న్నాడు. (27) పరాంతకుడుకూడ రాష్ట్రకూటదండయాత్ర నెదుర్కొనుటకు సకాలమున ఈ సన్నాహములను చేసినాడు. కృష్ణమహారాజు దక్షిణమునకు దండెత్తి వచ్చినాడు. భూతుగుని ii అతూ్కరుశాసనము క్రీ. శ. 949 - 50 లో తక్కోలము యుద్ధమును పేర్కొనుచున్నది. (28) పరాంతకుని శాసనములు ఉత్తరదక్షిణఆర్కాటు మండలములలో క్రీ. శ. 948 సం.న కన్పించు

[25] Rice - Mysore and Coorge p 45
[26] A S, 1905-6 p 181. Also 180 of 1921 A R E. 1921 II 25,
[27] 1280 of 1902,
[28] E I VI p 51

చున్నవి. (29) 948 సంవత్సరము తరువాత ఆ ప్రాంతముల అతని శాసనములు కన్పించుటలేదు. కావున 949 లో తక్కోలము యుద్ధము వరకు పరాంతకుని రాజ్యమున కృష్ణమహారాజు ప్రవేశింపలేదని ఆచార్య శ్రీ నీలకంఠశాస్త్రిగారి అభిప్రాయము.

కృష్ణరాజు 5 వ రాజ్య సం. దక్షిణఆర్కాటు మండలములోని సిద్ధలింగమడము శాసనము కృష్ణరాజు తంజావూరు విజయము పేర్కొను చున్నది. (30) అనగా క్రీ. శ. 945 ప్రాంతము. వీరరాజేంద్రుని కన్యాకుమారి శాసనములో అజేయుడైన పరాంతకుని జయించినట్లు గలదు - కావున కృష్ణరాజునకు పరాంతకునకుమధ్య కొంతకాలము యుద్ధము జరిగియుండును. అందు తాత్కాలిక జయాపజయములను పురస్కరించుకొని శాసనములు బయలుదేర వచ్చును. కాని క్రీ. శ. 949 తక్కోలము విజయము దక్షిణమున కృష్ణరాజు ఆధిపత్యమును సుప్రతిష్ఠిత మొనర్చినది. సిద్ధలింగమడము శాసనమును కృతకమని ఆచార్య నీలకంఠశాస్త్రిగారు పూర్వపక్షము నెలకొల్పినారు. (31)

తక్కోలము యుద్ధము ఆర్కోణమునకు 6 మైళ్ళ దూరములో క్రీ. శ. 949-50 లో జరిగినది. (32) భూతుగుని ఆర్కాటు శాసనములో తక్కోలయుద్ధవర్ణన విపులముగా గలదు. యుద్ధ సంరంభములో గురిచూచి భూతుగుడు, ఏనుగు అంబారీమీదనున్న రాజాదిత్యుని బాణముతో సంహరించినాడు. దీనికి కృష్ణరాజు సంతోషించి అతనికి బనవాసి 12000 బెల్వోల 300 బహూకరించినాడు. (33) చోళశాసనములు ఈ విషయము పేర్కొనుచున్నవి. తిరువాళం

[29] 419 of 1903, 184, 313 of 1906, 149 of 1916.
[30] 375 of 1909.
[31] Colas p 138.
[32] E I IV p 331 n 3.
[33] ఈ గ్రంథములో రాష్ట్రకూట చరిత్రపై అధ్యాయమును చూడుడు.

గాడు శాసనములో రాజాదిత్యుడు, అప్రతిహతుడైన కృష్ణరాజును కంపింపజేసి, బాణోపహతుడై, త్రిజగత్కీర్తితుడై దివ్యవిమానమున స్వర్గలోకమును అధిష్ఠించినట్లు గలదు. (34) తక్కోలవిజయముతో కృష్ణరాజు పరాంతకుని రాజ్యమును సంపూర్ణముగ ఆక్రమింపలేదు. కృష్ణరాజు పదునారవ రాజ్య సం. తరువాత గాని దక్షిణఆర్కాటు మండలమున అతని రాజ్య సం.ల పేర్కొను శాసనములు విరివిగా కన్పించుటలేదు. 952, 954 లలో దక్షిణ ఆర్కాటు లోని చిన్నచిన్న సామంతుల రాజ్యములు పరాంతకుని రాజ్యసంవత్సరమునగాని కృష్ణ రాజు రాజ్య సంవత్సరమునుగాని పేర్కొనుట లేదు. (35) కృష్ణరాజు 16 వ రాజ్యసంవత్సరమునుండి 30 వ సం.వరకు ఎన్నియో శాసనములు ఈమండలముల లభించుచున్నవి.'కచ్చియుంతంబైయుంకొండ' అను బిరుదును కృష్ణరాజు వహించినాడు. కాంచి, తంజావూరులను ఇతడు జయించినట్లు చెప్పవలెను. అతని కర్హాడ్ శాసనములో 959 లో మేల్పాడిలో దక్షిణ ఆర్కాటులోనుండి చోళరాజును నాశనముచేసి రాజ్యమున ఆశ్రితులను అధికారులుగా నియోగించినాడు. (36) కృష్ణరాజుదిగ్విజయమున ఆ శాసనములో అతడు రామేశ్వరమున జయస్తంభమును నెలకొల్పి సింహళరాజునుండి కానుకలు గ్రహించినట్లు గలదు. (37)సింహళరాజులకును పరాంతకునికిని గల వైరుధ్యము సుప్రసిద్ధము. దానిని పురస్కరించుకొని పరాంతకుని గెల్చిన కృష్ణమహారాజునకు లంకాధిపతి కానుకలు పంపియుండవచ్చును. కృష్ణమహారాజు కాలమున చోళసామ్రాజ్యము ముకుళించినది.

---

(34) A S S I, IV, 106–7 p 11, 42–45.

(35) 338, 356 of 1902 తిరువణ్ణామలై.

(36) ఈ గ్రంథమున రాష్ట్రకూటుచరిత్ర - చూడుడు.

(37) E 1, IV p 280.

## చోళచరిత్ర - సంధియుగము

పరాంతకుని తరువాత రాజరాజు సింహాసన మధిష్ఠించువరకు మధ్యనున్న మూడు దశాబ్దుల వ్యవధి చోళచరిత్రలో సంధియుగము. పరాంతకుని కాలమున చాళుక్యసామ్రాజ్యము మెఱపుతీగవలె మిరుమిట్లు గొలిపి అదృశ్యమైనది. రాజరాజు కాలమున చాళుక్యసామ్రాజ్యము స్థిరసౌదామనివలె వెలిగినది. కాని యీ మధ్యకాలమున చోళరాజులు రాష్ట్రకూటసామ్రాజ్యమున అణగి మణగి పడియుండిరి. పరాంతకుని తరువాత చోళసింహాసనము నధిష్ఠించిన రాజుల అనుపూర్విని గురించి, వారి కాలనిర్ణయమును గూర్చి చరిత్రజ్ఞులకు ఏకవాక్యత కుదురలేదు.

కన్నరదేవుని శిలాశాసనములు చెంగల్పట్టు - ఉత్తర అర్కాటు మండలములలో 28 వ రాజ్య సం.ము వరకు కన్పించుచున్నవి. అనగా క్రీ. శ. 966 వరకు కృష్ణరాజు చోళరాజ్యమును శాసించినాడు. ఇవి కాక మరికొన్ని శిలాశాసనములు మదురై కొండ రాజకేసరి, 5 వ రాజ్య సం.మునుండి 17 వరకు మధురాంతక పాండియన్‌తలై-కొండపరకేసరి శాసనములు - పార్థివేంద్ర శాసనములు 13 వ రాజ్య సం.ము వరకు కన్పించుచున్నవి. ఉత్తమచోళుని శాసనములు 16 వ రాజ్య సం.మువరకు కలవు. ఈ శాసనములనుండి సంగ్రహించిన నామములను ఆచార్య నీలకంఠశాస్త్రిగారు ఈ క్రింది వంశవృక్షముగా నిచ్చినారు.

పరాంతకుఁడు

కోక్కిళన్‌వలన్
- రాజాదిత్యుడు. తక్కోళము యుద్ధమున మరణించినాడు.
- గండరాదిత్యుడు.
  - మధురాంతక ఉత్తమ సరకేసరి.

కేరళకన్యకవలన
- అరింజయుఁడు. వైదుంబకన్యక కల్యాణిని వివాహమాడినాడు.
  - సుందరపరాంతక రాజకేసరి.
    - 2 వ ఆదిత్యుఁడు.
    - రాజరాజు.

ఈ శాసనములోని రాజ్యసంవత్సరములనుబట్టి రాజులు సమకాలీనులుగ ఏలినట్లు కన్పించుచున్నది. శ్రీ నీలకంఠశాస్త్రిగారి క్రింది విధముగ నిర్ణయించినారు.

| | | | |
|---|---|---|---|
| రాజకేసరి గండరాదిత్యుడు | — | క్రీ. శ. | 949 - 957 |
| పరకేసరి అరింజయుఁడు | — | ,, | 956 - 957 |
| రాజకేసరి సుందరచోళుఁడు మధురకొండై | — | ,, | 956 - 973 |
| పరకేసరి ఆదిత్యుడు II పార్థివేంద్రకరికాలుడు | — | ,, | 956 - 969 |

## గండరాదిత్యుఁడు

రాజకేసరి గండరాదిత్యుఁడు రాజ్యమును శాసించినట్లు తిరువాలంగాడు - లియోదిన్ శాసనములు సూచించుటనుబట్టియే గాక పిళ్లెయార్ - ఆళ్వార్ - అరికులకేసరిదేవుని పేర్కొనుచున్న రాజకేసరి

8 వ రాజ్యసం.రమున శాసనమువలన గూడ తెలియుచున్నది. (38) కాని అతఁడు క్షీణించిన చోళ రాజ్యమును శాసించినాఁడు. 957 లో రాష్ట్రకూట కృష్ణమహారాజు తొండై మండలమున ఆశ్రితులకు రాష్ట్రములను పంచియిచ్చుచున్నాడు. గండరాదిత్యుఁడు కుమారుడు ఉత్తమ చోళుఁడుపసిపాపగా నుండఁగా మరణించినాఁడు. అతనిరాణి శేంబియన్ మహాదేవి క్రీ. శ. 1001 వరకు జీవించినది. (39) ఈమె చేసిన దానములు కట్టించిన శివాలయములు ఆమె ధర్మతాత్పర్యమును చాటుచున్నవి. మేర్కిలందరుళిన - దేవర్ (పశ్చిమమునకు వెళ్ళినరాజు) ఇతని నామాంతరము (40) చిదంబరములోని ఆలయములోని తిరువిశైప్పా ఇతఁడు రచించియుండును. ఇందు పరాంతకుడు పాండ్యదేశమును జయించి నటరాజు దేవాలయమును సువర్ణమయమొనర్చినట్లుగలదు.

## అరింజయుఁడు

అరింజయుఁడు అన్నగారైన గండరాదిత్యరాజకేసరి తరువాత రాజ్యమేలినాఁడు. అతని రాణులు విమర్ కుండవై యార్, కోడైపిరాత్తి యారులు అతని మరణానంతరము అతని కుమారుని రాజ్యమున దానములు చేసినారు. అరింజయుడు అఱ్ఱూరులో మరణించినాఁడు. (41) అఱ్ఱూరులో మరణించిన చోళరాజునకు రాజరాజు స్మారకాలయమును మేలపాడివద్ద నిర్మించినాఁడు. (42) కావున అరింజయుఁడు చోళసామ్రాజ్యపునరుద్ధరణకు పూనుకొని యుద్ధములో మరణించినట్లు అతని దివ్యస్మృతిని రాజరాజు అర్వాచీనకాలమున ఆలయమును వెలయించినట్లూహింపవచ్చును.

---

(38) 176 of 1907, 570, 574 of 1908.
(39) 200 of 1904
(40) 540 of 1920
(41) 587 of 1920
(42) 511 (111) 17

## సుందర చోళుఁడు

అరింజయుని తర్వాత అతనికి వైదుంబకన్యక కల్యాణికి ఉద్భవించిన పుత్త్రుఁడు సుందరపరాంతక ii మధురైకొండ రాజకేసరి రాజ్యమేలినాఁడు. లియదిన్ శాసనములో పరాంతకుఁడు 'చేవూరు' యుద్ధమున రక్తవాహినులను ప్రవహింపఁజేసినట్లు అతని కుమారుఁడు ఆదిత్యుఁడు సింహకిశోరమువలె వీరపాండ్యమత్తేభముపై లంఘించినట్లు వర్ణన కలదు. చేవూరు యుద్ధములో ఓడిపోయిన వీరపాండ్యుని, చోళసైన్యములు కొడుంబాలూరు పరాంతక శిరియవేలారు నాయకత్వమున వెంబడించినవి. వీరపాండ్యుఁడు అరణ్యములలో దాగినాఁడు. (43) పాండ్యరాజునకు సింహళసేనలు తోడ్పడినవి. శిరియవేలారు సింహళముపై దండయాత్ర సుందరచోళుని 3 వ రాజ్య సం. రము క్రీ. శ. 959 ప్రాంతమున సాగించినాఁడు. (44) మహేంద్రుని IV పాలనము (956 - 72 లో) మహావంశములో ఈ క్రింది కథనము కలదు. (45)

"వల్లభరాజు నాగదీపముపై సైన్యము నీ దేశమును జయించుటకు పంపినాఁడు. లంకాధిపతి సేనాపతిసేనుని వల్లభరాజు సేనపై పంపినాఁడు. సేన సేనాపతి వల్లభరాజు సైన్యమును ఓడించినాఁడు. వల్లభరాజు లంకాధిపతితో సంధిచేసికొని వెడలిపోయినాఁడు" వేస్సగిరి శిలాశాసనము (మిహిందుని) ద్రమిళులను సేనసేనాపతి జయించినట్లు పేర్కొనుచున్నది. (46)

---

(43) 302 of 1908 కన్యాకుమారి శాసనము V 63
(44) 116 of 1896, I 11 V 980
(45) Ch 54 VV 12 - 16.
(46) E 2 - i pp 2966.

"వల్లభ" రాష్ట్రకూట రాజబిరుదము కావున మహావంశములోని దండయాత్ర కృష్ణరాజుదని కొందఱూహింపవచ్చును. వేస్సగిరి శిలాశాసనము ద్రమిళులను పేర్కొనుటచేత- చోళశాసనము సింహళ దండయాత్రను పేర్కొనుటచేత- చోళులకు 'వళవ' అనురూపాంతరము కలదు కావున నీ దండయాత్ర చోళులకు సంబంధించినదని ఆచార్య శ్రీ నీలకంఠశాస్త్రిగారి అభిప్రాయము.

రెండవ ఆదిత్యునితోపాటు, వీరపాండ్యుని జయించినట్లు కొడుంబాలూరు భూతి విక్రమకేసరి చెప్పుకొన్నాడు. ఈ శిలాశాసనములో విక్రమకేసరి కాలికేసలములను పల్లవరక్తశోణితములు చేసి వంశివేల్ను నాశనముచేసి కొడుంబాలూరునుండి పరిపాలించినట్లు గలదు. (47) అతని యిద్దరు కుమారులకు పరాంతక- ఆదిత్య అను పేర్లను పెట్టినారు. పరాంతక శిఱియవేలారు పూర్వోక్తమైన సింహళ దండయాత్రను నడిపినాడు. దీనినిబట్టి కొడుంబాలూరు విక్రమకేసరి, అతని కుమారుడు సుందరచోళునకు వీరపాండ్యునితోడి యుద్ధములో సహాయమొనర్చి నాడని చెప్పవచ్చును. సుందరచోళుడు రాష్ట్రకూట విజయముచే జీర్ణించుచున్న చోళసామ్రాజ్యమును పునరుద్ధరించినాడు. అతడు కాంచిపురమున సువర్ణభవనమున మరణించినాడు. 'పొన్ మాళిగెత్తుంజినదేవుడు' అని అతనికి అప్పటినుండి పేరువచ్చినది. (48) అతని రాణి వానవన్ మహాదేవి, మలైయమాన్ కన్యక భర్తతో సహగమనము సల్పినది.

సుందరచోళుని అవసానకాలమున ఆదిత్యుడు హత్య గావింపబడినాడు. రాజకేసరి రెండవ సం. మున ఉదయగిరి శాసనములో శ్రీవీరనారాయణ చతుర్వేదిమంగళములోని సభవీరపాండ్యుని శిరస్సును

(47) 129 of 1907 pd 14 [Text]
(48) SII [III] N 288 of N 5

ఖడించిన కరికాలచోళుని హత్యగావించిన రాజద్రోహమునకు హంతకుల ఆస్తిని సంగ్రహించి వేలము వేయుట గలదు. (49) ఈ శాసనము సుందరచోళునిది. లేక రాజరాజునదై యుండవలెను.

రెండవ రాజ్య సం. మునుబట్టి సుందరచోళునిది కాదని సిద్ధించుచున్నది. అయిన రాజరాజునదై యుండవలెను. శాసనాక్షరములు. అందలి జ్యోతిషనిర్దేశములు ఈ నిర్ణయమునకు దోహదము కల్పించుచున్నవి. దీనినిబట్టి ఆదిత్యుని హత్యకు 16 వ సం.ము దాటినంతవరకు ప్రతిక్రియ జరుగలేదు. సుందరచోళుని తరువాత అతని తమ్ముడైన ఉత్తమచోళుడు రాజ్యమును కాంక్షించినాడు. ఈ హత్యలో అతనికి ప్రత్యక్షముగ - లేక - పరోక్షముగ సంబంధ మున్నట్లూహించుట సత్యదూరము కానేరదు. తిరువాలంగాడు తామ్రశాసనము ఉదయార్గుడి శాసనమును పరిశీలించిన ఈ విషయము స్వయంవ్యక్తము కాగలదు. ఆ శాసనములో -

"ఆదిత్యుడు స్వర్గమును జూడగోరి అస్తమించిపోయినాడు. (అస్తంగతవాన్-ఆదిత్యశబ్దముపై శ్లేషగలదు.) పౌరులు కలికాలములో పెరిగిపోవుచున్న పాపాంధకారమును త్రోసివేయ "అమమొళివర్మ" (రాజరాజు)ను ప్రార్థించినను, అతడు క్షాత్త్రధర్మమును పాలించి, తన పినతండ్రి తన రాజ్యమును కోరుచున్నంతవరకు రాజ్యమును తనకు కావలెనని అంతరాత్మలో కూడ కాంక్షించలేదు."

ఆదిత్యుం డస్తమించినాడు. పాపాంధకారము నలుగడల గ్రమ్మినది. పౌరులు దానిని త్రోసివేయ రాజరాజును కోరినారు. రాజరాజు పిరికిపంద కాడు. కాని పినతండ్రి రాజ్యము నపేక్షించినాడు. అందుచే తలయొగ్గి ఊరకున్నాడు. కాని పినతండ్రి కూడ తన

(49) 577 of 1920.

కొడుకులకు రాజ్యము నివ్వక రాజరాజునే యువరాజును చేసినాడు. తిరువాలంగాడు శాసనములో - అరుమోళి సాక్షాద్విష్ణ్వవతార మని గ్రహించి మధురాంతకు డతనిని యువరాజుగ జేసి తాను రాజ్యభారము వహించినట్లున్నది. మధురాంతకగండరాదిత్తన్, ఉత్తమచోళుని పుత్రుడు రాజరాజు కాలమున ఉన్నతరాజోద్యోగియై అతనికి తోడ్పడినాడు. దీనిని బట్టి ఉత్తమచోళుని నిస్వార్థము రాజరాజు రాజ్యతంత్రజ్ఞత ప్రదర్శిత మగుచున్నది.

## ఉ త్త మ చో ళుఁ డు

ఆదిత్యపరకేసరి వీరపాండ్యుని ఓడించి రాష్ట్రకూట సామ్రాజ్యమున కలిసిపోయి ఉత్తరచోళరాష్ట్రమును పునరుద్ధరించినాడు. ఉత్తర మేరూరు, కాంచీపురము, తక్కోలము, తిరువణ్ణామలైలో లభించిన ఆనాటి చోళశాసనములనుబట్టి తిరిగి ఉత్తర దక్షిణ ఆర్కాటుమండలములు, చెంగల్పట్టుమండలములు చోళరాజ్యమున చేరినవని తెలుచున్నది. తిరుచునాపల్లి మండలములోని కొన్ని శాసనములు ఉత్తమచోళుని ఉద్యోగి అంబలవన్ పళువూర్‌నక్కన్‌ను పేర్కొనుచున్నవి. ఇతనికి ఉత్తమచోళుడు విక్రమశోలమారాయర్ అను బిరుదునిచ్చినాడు. ఇతడే రాజరాజుకాలమున నున్నాడు. ఇతనికి ముమ్మడిశోకాన్ రాజరాజపల్లవరాయన్ బిరుదులుకూడ నున్నవి. (51) మధురాంతక గండరాదిత్యుడు ఉత్తమచోళుని పుత్రుఁడు.

## రా జ రా జు

రాజకేసరి అరుమోళివర్మ రాజరాజు తొలినామధేయము. చాల కాలము యువరాజుగనుండి క్రీ. శ. 985 వ సం. ము పట్టాభిషిక్తుడైనాడు రాజరాజు పరిపాలించిన 30 సం.లు చోళరాజ్యమున స్వర్ణయుగము. రాష్ట్రకూటదండయాత్రలో ముకుళించిన చోళసామ్రాజ్యమును విస్త

(51) 168, 184 of 1929

రింపజేసినాడు. ఉత్తమచోళుని తల్లి శేంబియన్ మహాదేవిని గౌరవముతో సోదరికుందవైని అనురాగముతో చూచినాడు.

పరిపాలనారంభమున రాజరాజు ముమ్ముడిచోళదేవ బిరుదాంకితుడు. (52) ఈ బిరుదునకుగల అర్థము నిర్ణయించుటకు వీలులేదు. సింహాసనమధిష్ఠించిన వెంటనే రాజరాజు కేరళదేశముపై దండెత్తినాడు. కాందలూర్ - శాలైక్కల మఱుత్త - అనుబిరుదు రాజరాజు నాల్గవరాజ్యమునుండి కన్పించుచున్నది. (53)

కాందలూరు, ప్రస్తుతము వలియశాలై,(సంస్కృతమున జ్వాలా) ప్రాచీనకాలమున తిరువేందిరములో నేకదేశమని గోపీనాథరావుగారి నిర్దేశము. పాండ్య కేరళదేశములలో రాజరాజు శాసనములు 8 వ రాజ్య సం.మునకు పూర్వము కన్పించుట లేదు. తిరువాలంగాడు శాసనములో రాజరాజు దిగ్విజయమును దక్షిణమునుండి ఆరంభించినాడని పాండ్యరాజు అమరభుజంగుని చెరపట్టినాడని గలదు. రాజరాజు తన శాసన పీఠికలలో చారిత్రకాంశములను ప్రస్తావించు బిరుదులను చేర్చినాఁడు. ఈ ఆచారమును అర్వాచీన చోళరాజులు అనుసరించినారు. 20 వ రాజ్య సం. మున అతడు మధురను నాశనము చేసి 'కొల్లమ్కొల్ల' దేశములను 'కోడుంగోలూరు' రాజులను జయించినాడు. (54)

పశ్చిమదండయాత్రలను నడిపినది యువరాజైన రాజేంద్రుడే యై యుండును. (55) అతఁడర్వాచీనకాలమున వేంగి గంగమండలములకు దండనాయకుఁడు. అతఁడు తులువ, కొంకణములను

(52) 453 of 1908 (yr 3)
(53) 395 of 1922.
(54) 394 of 1911 ARE 1912 1122.
(55) E C 111 Sr. 125.

ఆక్రమించినాడు. మలయదేశమును నిగ్రహించి చేరులను తెలుఁగు రట్టులను తరిమివేసినాడు. (56) రాజేంద్రుఁడు గంగమండల సేనాధి కారిగ, మాలవ్వి (కూర్గు) గ్రామమును క్షత్త్రియశిఖామణి-కొంగాల్వ బిరుదమును మణిజునికి రాజాజ్ఞానుసారము సమర్పించినాడు. కొంగాల్వ వంశీయులు ఒక శతాబ్దివరకు చోళసామంతులై చిన్న రాజ్యము నేలినారు.

ఈళమ్ లేక సింహళమును రాజరాజు జయించినట్లు క్రీ. శ. 993 శాసనములో గలదు. (57) అష్టదిక్కుల కీర్తి కెక్కి సింగళులు పాలించుచున్న ఈళమండలమును జయించినాఁడు. (58) 29 వ సం. మున (1014లో) తంజావూరులో నిర్మించిన ఆలయమునకు రాజ రాజు సింగళములోని అనేకగ్రామములను దానము చేసినాడు. (59) తిరువాలంగాడు శాసనములో "రాముడు వానరసహాయముతో సేతు వును కష్టపడి నిర్మించి లంకాధిపతిని జయించినాడు. కాని ఈ రాజు రాము నతిక్రమించి నావలలో సైన్యముతో సముద్రమును దాటి లంకాధి పతిని తగులబెట్టినాఁడు" అని కలదు. సింహళముపై రాజరాజు పుత్రుడు రాజేంద్రుడు నావికా దండయాత్రను సాగించినప్పుడు మహిందుడు V రాజ్యమును శాసించియుండును. మహావంశములో రాజరాజు దండయాత్రప్రస్తావన లేదు. దీనికి కారణము మహిందుని V 10 వ రాజ్య సం.ము లోని చరిత్రాంశములు అవ్యవస్థితముగ నుండుట. (991 A. D.) ఈ సం. రము జరిగిన సైనికవిప్లవకారణమున మహిం దుడు పర్వతాకీర్ణమైన 'రోహణ' ప్రదేశమునకు తరలిపోయినాడు.

---

(56) 5 of 1895 yr 28.
(57) 261 of 1910.
(58) SII (iii) 4, 15
(59) SII (ii) 92 Paras 12 - 15

రాజరాజు అదనుగ్రహించి ఉత్తరసింహళమును జయించినాడు. నాటి నుండి అది ముమ్మడి శోలమండలముగా విలసిల్లినది. (60)

రాజరాజు సైన్యము 1000 సం.ముల నుండి సింహళరాజధాని యైన అనూరాధపురమును విధ్వంసమొనర్చినది. 'పోలొన్నరువ', ప్రాచీన రాజ్యసైన్యశిబిర ప్రదేశము నూతనరాజధాని యైనది. కందమారనువర' (సేనాశిబిరదేశము) ఈ రాజధానికి నామాంతరము. 'పోలొన్నరువ'ను చోళులు జననాథమండలముగ మార్చినారు. (61) రాజరాజు శిలాశాసనములు సింహళములో కన్పించుచున్నవి. (62) ఆ రాజధానిలో నేటికిని నిల్చియున్న శివాలయము రాజరాజు నిర్మించి యుండును. తంజావూరు దేవాలయము ఈ శివాలయ శిల్పనిద్మాణము నేకకుటుంబమునకు చెందినవే. ఈ దేవాలయమున ప్రాచీన శిలాశాసనములు రాజేంద్రునితో ఆరంభించుచున్నవి. చోళరాజోద్యోగి కుమరన్ రాజరాజపురమును మహాతీర్థమున రాజరాజేశ్వరాలయమును వెలయించినాడు. (63)

గంగపాడి నొలుంబపాడి, తడిగైపాడి లేక తడిగైవళి (ప్రస్తుత మైసూరు రాజ్యములోని) రాజ్యములు రాజరాజు కాలమున చోళ రాజ్యములో కలిసిపోయినవి. శాలై విజయానంతరము, రాజరాజు తత్తపాడి, తలైక్కాడు, నొలుంబపాడి, పిరుదిగంగర్- వళనాడు వద్ద విజయములు సాధించినాడు. నొలంబులపై గంగులపై నడిపిన దండయాత్ర రాజరాజు 9 వ రాజ్య సం.ము మొట్టమొదట కన్పించుచున్నవి. (64) క్రీ. శ. 991 లో ననే 6 వ రాజ్య సం. ము మైసూరురాజ్యమున

(60) SII (ii) 92 **Para** 12
(61) **A S C** 1906 or 27
(62) **A S C** 1891 **p** 12 **Nos.** 78 - 80
(63) 67 **of** 1923 **A R E** 1923 ii 27
**(64)** **97 of 1921.**

చోళనారాయణుని(రాజరాజు)శాసనము కన్పించుచున్నది. (65) క్రీ. శ. 998 లో అయ్యపుని పుత్త్రుడు గన్నరసదేవుడు దళిగపాడిని రాజరాజు సామంతుడుగా పరిపాలించినాఁడు. (66) ఒక నొలంబాధిరాజు రాజ రాజు సేనాని. (67) శక 933 లో నొలంబాధిరాజు చోరయ్య చోళ సామంతుడు. (68) కావున గంగసామంతులైన నొలంబుల సహాయముతో రాజరాజు గంగరాజ్యమును జయించినట్లూహింపవచ్చును.

2 వ తైలరాజు ఆహవమల్లుఁడు రాష్ట్రకూటరాజ్యమును ఆక్రమించినాఁడు. క్రీ. శ. 992 లో తైలరాజు చోళరాజును జయించినట్లు శాసనములో గలదు. (69) తైలరాజు పశ్చిమచాళుక్య సత్యాశ్రయుని జయించి, కొల్లగొట్టిన ధనమును తంజావూరు దేవాలయమునకు సమర్పించినట్లును గలదు. (70) క్రీ శ. 1003 ప్రాంతమునుండి రాజరాజు శాసనములలో అతడు రట్టపాడి 7500000, రాజ్యమును జయించినట్లు గలదు. (71) తిరువాలంగాడు శాసనములో సత్యాశ్రయుఁడు చోళసముద్రము నెదుర్కొనలేక యుద్ధభూమిని వీడి పారిపోయినట్లు గలదు. క్రీ. శ.. 1007 లో సత్యాశ్రయుని హొట్టూరు శాసనములో నూర్మడి చోళరాజేంద్ర విద్యాధరుఁడు, రాజ రాజ నిత్య వినోదుని పుత్త్రుఁడు చోళకులాలంకారుఁడు బిజాపురీమండలమున నున్న దోనూరువరకు దండయాత్ర సాగించి - 900000 సైన్యముతో రాజ్యమును కొల్లగొట్టి-స్త్రీలను పిల్లలను బ్రాహ్మణులను వధించి కన్యకలను చెఱబెట్టినట్లు గలదు. ఆ శాసనమే "తిగుళమారి" సత్యాశ్రయుఁడు

(65) MAR 1917 P 42.
(66) 169 of 1911 yr 13.
(67) E C x M b 208.
(68) ibid of 118.
(69) 36 of 1904. I. A. V. N. 17
(70) 911. ii 1 Para 92.
(71) 333 of 1927 yr 18 ARE 1927 ii 11. 97 of 1921.

చోళులను తరిమివేసి, వారి వస్తువాహనములను పరిగ్రహించి దక్షిణదేశమును తిరిగి ఆక్రమించినట్లు చెప్పుచున్నవి. (72) నొలంబవాడి గంగపాడిలో చోళశాసనములు కన్పించుటలేదు. కావున చోళులు రట్టపాడిపై దండయాత్రను నెరపినను, చిట్టచివరకు మరలిపోవలసి వచ్చినట్లు ఎంచవచ్చును. గుంటూరు మండలములోవి చేబ్రోలు వద్ద ఆహవమల్ల సత్తిగుని సామంతుని శాసనము శక 928 లో కన్పించుచున్నది. దీనిని బట్టి సత్యాశ్రయుఁడు ఈ యుద్ధములో తూర్పుచాళుక్య రాజ్యమైన వేంగిదేశసహాయమును సంపాదించినట్లూహింపవచ్చును. రాజరాజు వేంగిదండయాత్రకు ఈ ఊహ ఉపపత్తిని కల్పించుచున్నది.

## వేంగి దండయాత్ర

పరాంతకుని కాలమున చోళరాజ్యము నెల్లూరువరకు విస్తరిల్లినది. రాష్ట్రకూటదండయాత్రతో ఉత్తరరాజ్యములు స్వతంత్రము లైనవి. పరాంతకుని తరువాత చోళరాజ్యము ఉత్తరమున చెన్నపురి ప్రాంతమున నున్న తిరువొట్టియూరును దాటలేదు. రాజకేసరి అరవరాజ్య సం.మున కాంచీపురములోని శాసనము దుర్గాలయమునకు గొఱ్ఱెలమందను రాజు దానముగా పేర్కొనుచున్నది. రాజరాజు 8 వ రాజ్య సం. మున గూడూరు తాలూకాలోని రెడ్డిపాలెములో ఒక శాసనము ముమ్మడి వైతుంబమహారాజన్ లేక దుర్గై అరసన్ దానమును పేర్కొనుచున్నది. ఇతఁడు రాజరాజు రాజోద్యోగియై యుండును.

వేంగిమండలముతో రాజరాజునకుగల ప్రత్యక్షసంబంధము రట్టపాడి దండయాత్రకు అర్వాచీనము - తూర్పుచాళుక్యుల తామ్ర శాసనములు విరివిగా లభించుచున్నవి. ఆ కాలమున వేంగిచరిత్రను సమగ్రముగ చిత్రించుటకు తోడ్పడుట లేదు. రెండవ అమ్మరాజు

(72) E1, XVI N. 74,

(క్రీ. శ. 945-70) కాలమున వేంగి రాజ్యమున అంతఃకలహములు ఆరంభించినవి. రాష్ట్రకూట చక్రవర్తి కృష్ణరాజు iii తంత్రాంగము ఈ అంతఃకలహములకు దోహదము కల్పించినది. అమ్మరాజు 11 రాజ్య సం. తరువాత కళింగమునకు పోయి (కృష్ణరాజు కోపకారణమున) తలదాచుకొన్నాడు. (73)

బాడపుని ఆరంబాక శాసనములో కృష్ణరాజుతో మైత్రి నొనగూర్చుకొని బాడపుఁడు అమ్మరాజును తరిమివేసి వేంగిని ఆశ్రితులో గలిపి ధర్మముగా పాలించినట్లు గలదు. (74) శక్తివర్మ ప్రభుబట్టు శాసనపత్రములు ఈ అంతఃకలహములకు స్వస్తివాక్యమును పఠించుచున్నవి. (75)

అమ్మరాజు తరువాత దానార్ణవుడు, అతని సోదరుఁడు సింహాసనమధిష్ఠించినాడు. క్రీ. శ. (970-3) దానార్ణవుని తరువాత 27 సం. అరాజకము ప్రబలినది. ఆరంబాకశాసనపత్రములు కృష్ణరాజ సహాయముతో బాడపుడు అమ్మరాజును పారద్రోలినట్లు గలదు. కాంచీపుర శాసనమును బట్టి తూర్పు గంగకామార్ణవుడు కనిష్ఠశాఖకు సహాయము చేసి దానార్ణవునెదుర్కొని యుద్ధమున మరణించినట్లు తెలియుచున్నది. (76) తాలరాజు శ్రీ పూండి తామ్రశాసన పత్రములలో వేంగి రాజ్యముపై కనిష్ఠశాఖకు ధర్మాధికారమున్నట్లు తాళ I తాల II రాజుల మధ్య అంతరమును వినిర్మించినవి. తైలరాజు ii జ్యేష్ఠసోదరుఁడైన బాడపునితరువాత స్వతంత్రమున పాలించినది లేనిది తెలియదు.

(73) మాగల్లు శాసనము – అగమత్ కృష్ణకోపాత్ కళింగమ్.
ARE 1917, 11,24

(74) EI XIX No 34 See chapter on Rashtrakutas.

(75) Journal of the Telugu academy ii pp 399

(76) 237 - 238 of 1931 జాతచోడుడు తెలుగుచోడుల మూలపురుషుడు. ఐతిహ్యము.

కాని బాడప, తాలరాజుల శాసనములు ఈ అరాజకకాలమునకే చెందుచున్నవి.

క్రీ. శ. 925 లో 1 వ తాళరాజు రాజ్యము నాక్రమించినప్పటి నుండి ఆరంభించిన అంతర్యుద్ధము అమ్మిరాజు కాలమున విషమించి క్రీ. శ. 999 పూర్వము 27 సం. లు అరాజకములో మునిగినది. వీనిని రణస్థపూండి శాసనము "దైవదుశ్చేష్టిత" మనుచున్నది. ప్రభుబట్టుశాసన పత్రములలో శక్తివర్మ, "ద్రమిళాహవమున చోడభీముని సేనను ఓడించినాడు." తిరువాలంగాడు శాసనపత్రములు రాజరాజు తెలుఁగు భీమునిపై దండయాత్ర నడపినట్లు చెప్పుచున్నవి. ఈ యుద్ధములో శక్తివర్మ రాజరాజు తెలుఁగువోడుడైన భీముని ఎదిరించినట్లు సిద్ధించు చున్నది. కాంచీపురమున క్రీ. శ. 1001 (శక 923) శాసనములో రాజరాజు అనేక బిరుదాంకితుడైన చోడభీముని చెఱబట్టినట్లు గలదు.(77) దీనినిబట్టి శక్తివర్మ రాజరాజాశ్రయమును కాంక్షించినట్లు చెప్పవచ్చును. కాని, ఈ భీమునిపై దండయాత్ర శక్తివర్మను వేంగిసింహాసనమున పునఃప్రతిష్ఠించుటకు నడిపినట్లు నిష్కర్షగా నిర్ణయించుటకు వీలు లేదు. విమలాదిత్యుఁడు వేంగిసింహాసనమును క్రీ. శ. 1011 మే 10 వ తేదీన అధిష్ఠించినాఁడు. (78) అతని జ్యేష్ఠ సోదరుఁడు, అవ్యవహితపూర్వముగ 12 సం. లు పరిపాలించిన శక్తివర్మ 999 లో సింహాసనమధిష్ఠించి యుండును. శక్తివర్మ శాసనపత్రములలో చాళుక్యనారాయణ బిరుదాంకితుఁడు. ఈ బిరుదు రాజరాజునకు గల చోళనారాయణ బిరుదును స్ఫురణకుఁ దెచ్చుచున్నది. రాజరాజు అనుగు పుత్రిక

---

[77] 237, 238 of 1931 ARE 1931, 11, 10.

[78] E I VI N 349.

కుందవాకన్యకను విమలాదిత్యుడు వివాహమాడినాడు. (79) శక్తివర్మకు వేంగిరాజ్యసంపాదనకు రాజరాజు చేసిన సహాయము సుస్పష్టము.

మహేంద్రగిరిలోని రెండుశాసనములు తమిళసంస్కృతములలో రాజేంద్రచోళుడు కులూతరాజుపై నెరపిన దండయాత్రను పేర్కొను చున్నవి. (80) ఆ రాజుపేరు విమలాదిత్యుడు. ఈ శాసనములు మహేంద్రగిరిశృంగమున రాజేంద్రుడు ఎత్తించిన జయస్తంభమును పేర్కొనుచున్నవి. రాజరాజు 'కళింగ విజయము'నకీ దండయాత్ర ఉపపత్తిని కల్పించుచున్నవి. కాని యీ దండయాత్రను కృష్ణశాస్త్రిగారు రాజేంద్రుని గంగాసలిలసేకరణమునకు ముడిపెట్టుచున్నారు. అందు అతడు జయించిన దేశములలో కులూతనామము లేదు. రాజరాజు అల్లుడైన విమలాదిత్యుడు 1014 లో చోళసామ్రాజ్యములోని తిరువైయాఱు ఆలయమునకు దానములు చేసినాడు. (81) రాజరాజు పేర్కొనిన అంతిమవిజయము మాల్‌దీవులను జయించుట. సముద్రము లోని ఈ దీవులను జయించుటనుబట్టి రాజరాజునకు నావికాసైన్యము ముఖ్యాంగముగా నున్నట్లు స్వయంవ్యక్త మగుచున్నది. సింహళ దండయాత్రకూడ దీనికి తార్కాణము.

క్రీ. శ. 1012 సం. మున రాజేంద్రునకు రాజరాజు యౌవరాజ్య పట్టాభిషేకము సల్పినాడు. (82) రాజరాజు శాసనములు అతని 29 వ రాజ్య సం. ము వరకు ననేకములు. కన్యాకుమారి యొద్ద రాజకేసరి

---

(79) కోరుమిల్లి శాసనపత్రములు IA XIV N. 54.

(80) 396, 397 of 1896 A S I, 1911-12 PP 171-2;

(81) 215 of 1894.

(82) E I VIII N. 260.

రాజరాజదేవుని 31 వ రాజ్య సం. మున ఒక శాసనము కన్పించు చున్నది. (83)

తంజావూరులో రాజరాజు పరిపాలనకు దివ్యచిహ్నముగ నేటికిని అతఁడు నిర్మించిన రాజరాజేశ్వరాలయము నిలిచి యున్నది. 750×250 అడుగుల ఆలయము - విమానము 200 అడుగుల ఎత్తుననున్నది.

రాజరాజు శివభక్తుఁడు. మతసహనము భారతదేశమున రాజులకు సామాన్యలక్షణము. అతఁడు మైసూరు దేశమున కట్టించిన విష్ణ్వాలయములు, వానికి నిచ్చిన దానములు నిదర్శనములు. వెయి దెనుశాసనములో రాజరాజు, చూడామణీవిహారమును నేగపటమ్ వద్ద శైలేంద్రరాజు మారవిజయోత్తుంగవర్మ, శ్రీ విషయ, కటహసముద్రాంతరదేశాధీశుఁడు నిర్మించుటకు కారణభూతుఁడు. చోళరాజు రాజరాజు 21 వ సం. ము ఈ విహార నిర్మాణమున కనుజ్ఞ నొసగుటయే గాక, బుద్ధ భగవానుని సంఘారామమునకు అనైమంగలగ్రామమును దానము సల్పినాఁడు. రాజేంద్రుఁడు తండ్రి దానశాసనమును పునరుద్ధరించినాఁడు. నేగపట్టణము ప్రాచ్యదేశనౌకలు సందర్శించెడి రేవు పట్టణమని 'ఇట్సింగ్' రచనలవలన తెలియనగును. అందుచేతనే విదేశీయుడైన రాజు అచ్చటు బౌద్ధవిహారమును నిర్మించినాఁడు.

ముమ్ముడిచోళ, జయంగొండు, అరుమోలి అనునవి రాజరాజు నామమునకు రూపాంతరములు. చోళేంద్రసింహ - శివపాదశేఖర - క్షత్రియశిఖామణి - జననాథ - నిగరివిశాల - రాజేంద్రసింహ - చోళమార్తాండ - నిత్యవినోద - పాండ్యకులాశని యిత్యాదులు ఇతని బిరుదులు. రాజరాజు బహుభార్యావినోది. రాజరాజు 29 వ సంవత్సరమున తిరువిళలూరు దేవాలయమున తులాభారమును తూగినాడు.

---

(83) SII [ii] p 312 468 of 1908.

రాణి దంతిశక్తి హిరణ్యగర్భవ్రతము నాచరించినది. (84) ఈ శిలా శాసనమునకు అధోభాగమున పూజాపరులైన రాజు - రాణి యొక్క శిల్పప్రతిమలు గలవు. రాజరాజు ఏకైకపుత్రుఁడు రాజేంద్రునితల్లి వానవన్ మహాదేవి త్రిభువనమహాదేవి.

## రా జే ం ద్రుఁ డు

పరకేసరివర్మ రాజేంద్రచోళదేవుఁడు క్రీ. శ. 1012 వ సం.మున యౌవరాజ్య పట్టాభిషిక్తుఁడైనాడు. అప్పటినుండి రాజేంద్రుని శాసనములు తన రాజ్యసం.లను పేర్కొనుచున్నవి. రాజరాజు తన పుత్రుఁడైన రాజేంద్రుని 3 వ రాజ్య సం. ము దానము సల్పినాఁడు. (85) రాజరాజు వార్ధక్యమున వానప్రస్థమును స్వీకరించి పుత్రునిపై రాజ్య భారమును మోపినట్లూహింపవచ్చును.

రాజేంద్రునకు పైతృకమైన విశాలసామ్రాజ్యము లభించినది. సింహళ ద్వీపము, మాల్దీవులను సంరక్షించి పరిపాలింపగలిగిన నావికా సైన్యముగూడ సేనాంగములలో నొకటి. ప్రాచ్యదేశములతో వాణిజ్య సంబంధములు నాటుకొన్నవి. రాజరాజు అరంభించిన సామ్రాజ్య శిల్పమును రాజేంద్రుడు తీర్చిదిద్దినాఁడు. రాజేంద్రుని శాసనప్రశస్తివలన చారిత్రక సన్నివేశముల కాలనిర్ణయము మిక్కిలి సుకరము.

రాజేంద్రుఁడు తన పుత్రుఁడైన రాజాధిరాజును క్రీ. శ. 1018 (మార్చి 15, డిసెంబరు 3 మధ్య) యువరాజుగా పట్టాభిషిక్తుని జేసినాడు. (86) అప్పటినుండి తంద్రికొడుకుల యౌగపత్యపరిపాలన 25 సం.ములు అవిచ్ఛిన్నముగ సాగినది. తిరుమల వాడిలోని శిలాశాసన

(84) 42 of 1907

(85) 196 of 1917

(86) ARE 190 6 11-13.

ములో రాజాధిరాజు ఛత్రము ఉత్తరమున గంగనదిని, దక్షిణమున సింహళద్వీపమును పశ్చిమమున మహోద్రై, తూర్పున కడారమును జయించిన తండ్రి రాజేంద్రుని సితచ్ఛత్రమునకు నీడవంటిదని వర్ణన కలదు. రాజాధిరాజు రాజేంద్రుని జ్యేష్ఠపుత్రుఁడుగాడు. రాజేంద్రుడు రాజాధిరాజు రాజ్యపదవికి అర్హుఁడని గ్రహించి, భావికాలమున అంతః కలహములు రేకెత్తకుండ అతనిపై రాజ్యభారమును తన జీవితకాల మందే మోపినాడు.

రాజేంద్రుని మూడవ సం.ము వరకు అతని ప్రశస్తినిబట్టి ఇడితురై - నాడు, బనవాసి, కొల్లిప్పాక్కై, మణ్ణైక్కడక్కమ్ మున్నగు వానిని జయించినట్లుగలదు. ఈ వర్ణన క్రీ. శ. 1004 నాటి రాజేంద్రుని రట్టపాణి దండయాత్రకు అన్వయించునో లేక అర్వాచీనకాలమున రాజేంద్రుడు తిరిగి జరిపిన దండయాత్రకు అన్వయించునో చెప్పుట కష్టము. ఎట్లైనను నీ దండయాత్రలు క్రీ. శ. 1008 లోపున జరిగి యుండవలెను. 1008 తరువాత సత్యాశ్రయు ననంతరము చాళుక్యసింహాసనమును విక్రమాదిత్యుఁ డధిష్ఠించినాడు. ఇడియరై - నాడు విడిదోరు 2000కృష్ణా తుంగభద్రానదీ మధ్యదేశము అనగాప్రస్తుత రాయచూరు మండలము.(87)కొళ్ళపాక హైదరాబాదుకు45మైళ్ళుపశ్చిమో త్తరముననున్న కుల్పాక.(88) 12 వ శతాబ్దిలో విక్రమాదిత్యుని VI రాజప్రతినిధిగ సోమేశ్వరుడు III, పరిపాలించినాడు. 13వ శతాబ్దిలో కాకతీయ రాజప్రతినిధి కొళ్ళపాకలో నున్నాఁడు. మణ్ణైక్కడక్కమ్ మాన్య కేతము. రాజేంద్రుఁడుదండయాత్రలోమాన్యకేతమునుకొల్లగొట్టినాఁడు. 45 సం. పూర్వము మాన్యకేతము పరమారులచే అగ్ని దగ్ధమైనది. ఈ సన్నివేశముల పురస్కరించుకొని రాజధానిని చాళుక్యులు మాన్యకేతమునుండి 45 మైళ్ళ దూరములోనున్న కల్యాణపురమునకు

(87) Flut EI XII P 295-6.
[88] Journal of the Hyderabad Archaeological society 1916 p 14

మార్చినారు. శ్రుతిమాన్ నక్కన్ చంద్రన్ అను వీరుడు సత్యాశ్రయునితో సలిపిన యుద్ధమున రాజాజ్ఞాప్రేరితుఁడై మరణించినాఁడు. (89) రాజేంద్రుఁడు, ఈ చాళుక్యయుద్ధమున తుంగభద్రానదిని దాటి మాన్యకేతమును విధ్వంసమొనర్చినాఁడు.

రాజేంద్రుఁడు ఈళమండలమును (సింహళము) 5 వ సం.మున సంపూర్ణముగ జయించినాఁడు. 5 వ సం.మున నున్న అతని శిలాశాసనములు కొన్ని యీ విజయమును పేర్కొన్నవి. మరికొన్ని పేర్కొనుట లేదు. కావున క్రీ. శ. 1017-18 సం. ననే యీ దండయాత్ర సాగియుండును. మహావంశములో చోళవిజయము 5 వ మహిందుని 36 వ రాజ్య సం. మున ప్రస్తావితము. జయగరు కాలనిర్ణయమును బట్టి ఆ సంవత్సరముకూడ క్రీ. శ. 1017 సంవత్సరమే. (90) 12 సం. పూర్వము రాజరాజు సింహళమును జయించినాఁడు. మహిందుఁడపుడు పర్వతప్రాంతములో తలదాచుకొన్నాఁడు. ఇప్పుడు రాజేంద్రుఁడు మహిందుని జయించి సింహళరాజమణిమకుటమును - పాండ్యరాజు ఇంద్రుని ముక్తాహారమును రత్నకిరీటమును పరిగ్రహించి సమస్త సింహళమును సంపూర్ణముగా స్వాధీనము చేసికొన్నాఁడు. 91 మహావంశము చోళవిజయమును ముక్తకంఠముతో చాటుచున్నది.

"మహిందుని 36 వ సం. మున చోళు లాతనిని జయించి మణిమకుటమును రాజాభరణమును రత్నహారములను సమస్త వస్తుసముదాయమును కొల్లగొట్టి తీసికొని పోయినారు. భయార్తుఁడై అరణ్యములకు పలాయనము సాగించిన లంకాధిపతిని సంధివ్యాజమున చెరబట్టినారు. కొల్లగొట్టిన ధనముతోఁబాటు రాజును గూడ చోళ చక్రవర్తి కడకంపినారు. స్తూపములను విధ్వంస మొనర్చి-విహారము

(89) 3rd year 515 of 1912

(90) C. V. ii M. xiii quoted by N. K. S. p 238.

(91) S II (iii)p 28 & C. V. Ch 55 vv 16.

లను నాశనము చేసి - సువర్ణ విగ్రహములను పరిగ్రహించి రక్త పిపాసువులైన యక్షులవలె లంకారాజ్యమును కొల్లగొట్టినారు. పుల్లత్తి నగరమును కేంద్రమున రాజరత్తను చోళులు పరిపాలించినారు. 12 సం. ములు మహిందరాజు చోళరాజ్యమున నుండి స్వర్గమును 48 వ సం. న ఆరోహించినాడు." మహిందుడు చోళచక్రవర్తికి లొంగియున్నట్లు శిలాశాసనములో గలదు. (92) రాజేంద్రుని శాసనములు పోలోన్నరువలోను కొలంబో ప్రదర్శనశాలలోను గలవు. (93)

మహిందుని మరణానంతరము 12 సం. ముల తరువాత అతని కుమారుఁడు కస్సపుడు ద్రమిళులతో పోరాడి రోహణము స్వతంత్ర రాష్ట్రమును స్థాపించినట్లు మహావంశకథనము. ఇతనిని సింహళీయులు రహస్యముగ పెంచి పెద్దవానిని జేసినారు. ఇతడు క్రీ. శ. 1029 - 41 వరకు 'విక్రమబాహు' నామమున పరిపాలించినాడు.

రాజేంద్రుడు 6 వ సం. మున క్రీ. శ. 1018 లో కేరళరాజును జయించి అతని కిరీటమును, అరుణ కిరణ రమణీయ ముక్తాహారమును పరిగ్రహించినాడు. (94) ప్రాచీనద్వీపములను జయించినాఁడు. 10 వ సం.మున ఒక శిలాశాసనము రాజేంద్రుని పాండ్యవిజయమును పేర్కొనుచున్నది. (95) తిరువాలంగాడు శాసనపత్రములలో రాజేంద్రుని దిగ్విజయవర్ణనలో - "అతడు రాజధానిని సంరక్షించుటకు యథోచిత పన్నాహములను నిర్వహించి దిగ్విజయమునకు బయలుదేరి పాండ్య దేశమును జయించినాడు. పాండ్యరాజు భయార్తుడై అగస్త్యున

(92) 642 of 1909 (yr 7)

(93) 595, 618 of 1912 SII IV 1359; 1414

(94) 22 of 1895, 211 of 1911

(95) 363 of 1917

కావాసమైన మలయపర్వతమునకు పారిపోయినాడు. రాజేంద్రుడు, పుత్రుడైన చోళపాండ్యుని పాండ్యదేశమును సంరక్షించుటకు నియోగించి, పశ్చిమదిశాభిముఖమున దండయాత్రకు తరలిపోయినాడు. తరువాత, మధురాంతకుడు సహ్యాద్రిని దాటి కేరళముపై దండెత్తి ఘోరసంగ్రామమున, కేరళరాజును జయించి దిగ్విజయము కావించి రాజధానికే మరలివచ్చినాడు. 10వ సం. శిలాశాసనములో రాజేంద్రుడు పాండ్యరాజ్యమున తనపుత్రుని చోళపాండ్యుని రాజప్రతినిధిగ నియమించినట్లు గలదు. రాజేంద్రుడు మధురలో నిర్మించిన రాజప్రాసాద భారమున భూమి కంపించినదని వర్ణన కలదు. పాండ్యదేశమును పాలించిన రాజప్రతినిధి జాతవర్మ సుందరచోళపాండ్యుడే కేరళమును పాలించినాఁడు. ఇతని శిలాశాసనములు అనేకములు కన్పించుచున్నవి. ఇతడు 1040 సం. వరకు 23 సం.లు రాజప్రతినిధిగ పరిపాలించినాడు.

చోళులకు క్రీ. శ. 1021 - 22 సం. లో తిరిగి పశ్చిమచాళుక్యులతో యుద్ధము ఆరంభమైనది. క్రీ. శ. 1016 లో 5 వ విక్రమాదిత్యుని తరువాత జయసింహుఁడు చాళుక్యసింహాసనము నధిష్ఠించినాడు. క్రీ.శ. 1019 లోని బళగాంవే శాసనములో అతఁడు చేరచోళులను జయించినట్లు కలదు. (96)పశ్చిమమైసూరు రాష్ట్రమున- బళ్ళారిమండలమున అతని శాసనములు కన్పించుచున్నవి. రాజేంద్రుని తమిళప్రశస్తిలో జయసింహునితో అతడు సల్పిన యుద్ధప్రస్తావన కన్పించుచున్నది. అందు రట్టపాడి 7500000 ని జయించి మూశంగివద్ద జయసింహుని పారద్రోలినట్లు కలదు. యుద్ధములో విజయము మాటచెప్పలేముగాని, రట్టపాడి 750000 ని రాజేంద్రుడాక్రమింపలేదని చెప్పవచ్చును. తిరువాలంగాడు శాసనపత్రములలో కావ్యరీతి నీ యుద్ధవర్ణన గలదు. రాజేంద్రుడు దిగ్విజయమునకు బయలుదేరి రట్టపాడిపై దాడి వెడలినాడు. మూశంగివద్ద యుద్ధము జరిగినది. "రాజేంద్రుని కోపాగ్ని

(96) Fleet D K D 436, quoted K N S p 245

త్రైలవంశీయుని తాకినంతనే ప్రజ్వరిల్లినది. కాని, మూశంగి యుద్ధానంతరము జయసింహుఁడు తుంగభద్రానదివరకు పరిపాలించినాడు. క్రీ. శ. 1024 మిారాజ్‌దానశాసనములో - జయసింహుఁడు ఇడెదొరు 2000 ను పంచద్రావిడాధిపతియైన చోళరాజును జయించి తిరిగి ఆక్రమించినట్లు గలదు. (97)

రాజేంద్రుని చరిత్రలో ప్రసిద్ధి వహించినది గంగాయాత్ర! తిరువాలంగాడు శాసనములో, రాజేంద్రుడు తపస్సుచే గంగాసలిలములను సంపాదించిన భగీరథుని పరిహసించుచు, భుజబలముచే గంగాసలిలములచే చోళరాజ్యమును పవిత్రీభూతమొనర్చుటకు సంకల్పించినట్లు గలదు. అతని 10 వ సం. శాసనములలో గంగాయాత్ర ప్రస్తావనలేదు. 11 వ సం. శాసనమున గలదు. (98) 12 వ సం. విశేషవర్ణన గలదు. ఈ దండయాత్రను చోళసేనాధిపతి నిర్వహించినాడు. రాజేంద్రుఁడు అతనిని గోదావరీ తీరమున కలిసికొన్నాడు. (99) చోళసేనాధిపతి గజయూథముల సేతువులుగా అనేకనదులను దాటి మొట్టమొదట నింద్రరథునెదుర్కొని జయించినాడు. తరువాత రణశూరుని రత్నకోశములను కొల్లగొట్టి ధర్మపాలుని జయించి అతని రాజ్యమున ప్రవేశించినాడు. గంగాసలిలములను గైకొని మహీపాలుని జయించి గోదావరీ తీరమున చోళచక్రవర్తి మధురాంతకుని సేనాధిపతిని కలిసికొనినాడు. సేనాధిపతి ఆధ్వర్యమున జయింపబడిన రాజులు గంగాసలిలములను చోళచక్రవర్తికి సమర్పించినారు. చోళచక్రవర్తి ఓట్టరాజునుండి అతని సోదరునినుండి, ఓప్పమును గైకొనినాడు. చోళచక్రవర్తి విజయలక్ష్మితో రాజధానికి తరలివచ్చినాడు.

(97) I A VIII 18
(98) 476 of 1911 (yr 11)
(99) V V 110 - 118. తిరువాలంగాడు శాసనము.

తమిళప్రశస్తికూడ ఈ విషయము బేర్కొనుచున్నది. అందు రాజేంద్రుడు "శక్కరకోట్టమ్"ను జయించినాడు. మధురమండలమును విధ్వంసమొనర్చినాడు. నామనైకోక్కసమ్ను పంచపళ్ళి మాశుని దేశములను జయించినాడు. ఇంద్రరథుని ఆదినగరయుద్ధమున జయించి రత్నకోశములను కొల్లగొట్టినాడు. గహనారణ్యావిలమైన ఓఢ్రవిషయమును బ్రాహ్మణావృతమైన కోశలనాడును తండభుక్తిని గమించి, ఘోరయుద్ధమున ధర్మపాలుని జయించినాడు. రణశూరుని జయించి సుప్రసిద్ధమైన తక్కనలాడమును ఆక్రమించినాడు. సంతత వర్షవారిసిక్తమైన వంగలదేశమును జయించినప్పుడు గోవిందచంద్రుడు పారిపోయినాడు. మహీపాలునియుద్ధములో పలాయితుని జేసినాడు. పుష్పసౌరభమిళితమైన గంగాసలిలమును సంపాదించినాడు.

శక్కరకోట్టము రాజేంద్రుని గంగాయాత్రలో ప్రథమ యుద్ధ రంగము. దీనినిబట్టి వేంగిమండలము రాజరాజు కాలములోవలె రాజేంద్రుని కాలమున కూడ చోళరాజ్యమునకు మిత్రరాజ్యమని సిద్ధించుచున్నది. రాజేంద్రుని సేనాపతి అతనిని గోదావరీతీరమున కలిసికొన్నాడు. శక్కరకోట్టము చక్రకోట్యము. క్రీ. శ. 1065 లో నాగవంశి తామ్రశాసనము చక్రకోట్యమును బేర్కొనుచున్నది. (100) ఇది ప్రస్తుత చిత్రకూటము. ఇది బస్తరు రాజ్య రాజధాని. రాజపుర మునకు 8 మైళ్ళదూరమున నున్నది. మాశూనిదేశము వరకు గల దేశములు వేంగిరాజ్యమునకు పశ్చిమోత్తరమున నున్నవి. మాశూని దేశమనిన యథాక్షరముగ నాగదేశమని చెప్పవలెను. రాజపురశాసన పత్రములలోని చిందకవంశీయులైనరాజులు నాగవంశోద్భవులు.భోగవతీ పురవరేశ్వరులు. శక సం.ము 1140 శాసనము భుజగవరభూషణ మహారాజులను పేర్కొనుచున్నది. (104) కావున మాశూని దేశమును

(100) E I Ix pp 178 - 9.
(101) abid-p 163.

ఈ రాజులు పరిపాలించిన దేశమని నిర్ణయింపవచ్చును. కావున మధురై మండలము, నామక్కై కోట్టైణము. పంచప్పళ్ళి మాశూని దేశ పరిసరప్రాంతములని ఊహింపవచ్చును. రాజపురశాసనప్రదాత మధు రాంతక బిరుదాంకితుఁడగుట పై ఊహకు దోహదము కల్పించు చున్నది.

ఆదినగరయుద్ధములో ఓడిపోయిన ఇంద్రరథుడు ఉదయపుర శాసనము పేర్కొనిన ధారాపురపాలకుడైన భోజుని ప్రతిస్పర్ధి కావచ్చు నని కీల్‌హారన్‌గారి అభిప్రాయము. (102) తమిళశాసనములో కోశలనాడును జయించిన తరువాత చోళసేనాధిపతి దండభుక్తి పాలకుఁడైనధర్మపాలుని లాడదేశాధీశుడైన రణశూరుని వంగలదేశరాజు గోవిందచంద్రుని, ఉత్తరలాడదేశాధీశుఁడైన మహీపాలుని జయించి గంగానదిని చేరినట్లు గలదు. తిరువాళంగాడు శాసనపత్రములలో గంగానదీసలిలములను సేకరించిన తరువాత మహీపాలుని జయించి నట్లు కలదు. ఈ విప్రతిపత్తిని సమన్వయించుట కష్టము - తమిళ ప్రశస్తి తిరువాళంగాడు శాసనమునకు ప్రాచీనముగావున ఆ సాక్ష్య మునే పరిగ్రహించుట మేలు. ఆకాలమున వంగదేశమును పరిపాలించిన మహీపాలుని సామంతుడు ధర్మపాలుఁడని ఊహింపవచ్చును. చోళ సైన్యము, యుద్ధములో మహీపాలుని నంగుని బందీకృతులను జేసినది. లాడ (రాఢ) వంగదేశములో ఏకదేశము. ఈ గంగాయాత్ర ఉత్తరాపథ దండయాత్రకాదనియు, తీర్థయాత్రయని - వెంకయ్యగారి అభి ప్రాయము. రాజేంద్రుడు, గంగాదిగ్విజయ యాత్రను ముగించి జలమయ జయస్తంభమును చోళగంగ తటాకమున రాజధానిలో ప్రతిష్ఠించినాడు.

---

(102) EI VII List p 120 . 43.

## క డా ర ము ద ం డ యా త్ర

రాజేంద్రుని ద్వీపాంతరదండయాత్రను 14 వ సం. శాసనము పేర్కొనుచున్నది. (103) తిరువాలంగాడు శాసనపత్రములలో ఒక్క పద్యము రాజేంద్రుడు అప్రతిహతమైన నావికాసైన్యముతో కటాహము జయించినట్లు కలదు. తమిళశాసనప్రశస్తిలో ఈ దండయాత్రావర్ణన విపులముగ గలదు.

"ఏ మహారాజు ఉత్తుంగతరంగ సంకులితమైన మహార్ణవమును అనేకనౌకావాహినులతో దాటి సంగ్రామ విజయోత్తుంగవర్మను బంధించినాడో, అతడు మహానగరద్వారమున గల విద్యాధర తోరణమును శ్రీవిజయనగరమునగల రత్నఖచితద్వారములను, పంట భూములను,పర్వతప్రాకారరక్షితమైన మలైయూరును, సాగరపరివృతమైన మాయిరుడింగమును, యుద్ధములో చెక్కుచెదరని ఇళంగాశోకమును, సలిలావృతమైన మాలప్పాలమును ఉన్నతకుడ్యప్రాకారములుగల యేలిలింబంగమును, అరణ్యకీలితమైన వలైప్పందూరును, శాస్త్రకోవిదులు ప్రశంసించిన తలైత్తక్కోలమును, మాదమలింగము, ఇళామూరి దేశము మానక్కవారమును, సాగరపరివృతమైన కడారమును జయించినాడు.

రాజేంద్రుని నావికాదండయాత్రను ప్రపంచించిన శాసనమును క్రీ. శ. 1891 లో హుల్ టుజ్ ప్రచురించినాడు. (104) పెద్దవెయిదెను శాసనములో ఆనాటికే మారవిజయోత్తుంగవర్మ, కటాహవేకిన్రము పాలకుడు కన్పించినాడు. కావున ఈ శాసనములోని కడారము పాలకుడు, సంగ్రామవిజయోత్తుంగవర్మ. మారవిజయోత్తుంగవర్మ తరువాత కడారమును పాలించిన రాజుగ గుర్తించినాడు. కాని కిడార

(103) 213 of 1911.

(104) 811 (ii) 20.

మును రామనాడ్‌లోని కిడారము తాలూకా గ్రామముగ నిర్దేశించినాడు. కాని, రాజేంద్రుని దండయాత్ర నౌకాదండయాత్ర. ఇతఃపూర్వము రాజేంద్రుడు సింహళమును నౌకాబలముచే సాధించినాడు. రామ్నాడ్ పాండ్యదేశము రాజేంద్రుని రాజ్యమున చిరకాలము క్రింద చేరినది. కావున ఈ తమిళ శాసనప్రశస్తిలోని వివిధనామములను నిర్ణయించుటకు ద్వీపాంతరములను శోధింపవలెను.

"నక్కవారము నేటి నికోబారు ద్వీపములకు ప్రాచీన తమిళ నామమని వెంకయ్యగారి నిర్దేశము.(105) మహావంశములో 'పప్పాల' ము బర్మాలోని తైలంగ్ దేశములోని రేవుపట్టణముగా గలదు. కావున కడారము కొఱకు ఖండాంతరమునకు పోవలెను" అని కుల్‌టుజు ప్రవచించినాడు. (106) రాజేంద్రుని దండయాత్ర బర్మాలోని పెగుపై నడచిన దని పురాతత్త్వజ్ఞులు ఒకనాడు అభిప్రాయపడినారు. (107) శాసనప్రశస్తినిబట్టి కడారము పరిపాలకుడైన విజయోత్తుంగవర్మను జయించిన పిమ్మట వక్ష్యమాణరాజ్యములన్నియు రాజేంద్రునకు సంక్రమించినవి. ప్రశస్తిలోని రాజ్యములన్నియు సంగ్రామవిజయోత్తుంగుడు పరిపాలించినవి. లేక అతని సామంతులు పరిపాలించినవి. (108)

క్రీ. శ. 1003 - 1008 మధ్య చీనాదేశమునకు సన్ - ఫో - ట్సి దేశమునుండి శ్రీచూలమణి వర్మదేవ- శ్రీమారవిజయోత్తుంగవర్మ రాజుల వద్దనుండి రాయబారులు వచ్చినట్లు సాంగ్ వంశ వృత్తమున గలదు. పెద్దవెయిదెను - శిలాశాసనములో నీ రాజుల ప్రస్తావన గలదు. సన్

(105) This has been noted in Hobson - Jobson B E F E O XVI I 6 p 6 n 5.

(106) SII iii p 195

(107) A R B 1919 para 46 - 47

(108) Coldes: Le Royannme de Sri Vijaya B E F E O XVIII No. 6

ఫొట్సీ చీనాభాషలో సుమిత్రాద్వీపమున పలెంబంగునకు పేరు. రాజేంద్రుడు మొట్టమొదట జయించిన శ్రీ విజయరాజ్యము సుమిత్రా ద్వీపములోనిది. శ్రీ విజయరాజ్యము 15 రాష్ట్రములను పరిపాలించి నట్లు 13 వ శతాబ్దిని చౌజుకున వ్రాసినాడు. (109) రాజేంద్రుని శాసనప్రశస్తిలోని కొన్నినామములీ 15 రాష్ట్రముల నామములలో కన్పించుచున్నది. (110)

శ్రీవిజయరాజ్యానంతరము రాజేంద్రుని ప్రశస్తిలో పణ్ణై కన్పించు చున్నది. సుమిత్రాద్వీపమున ప్రాచ్యభాగముగల పణికాపనియగా దీనిని నిర్దేశింపవచ్చును. (111) మలైయూరు, మలయాద్వీపకల్పమున దక్షిణభాగము. మలయూనదితోఁబాటు అచ్చట యాత్రికునకు ఐతిహ్యములోని ప్రాచీనమలయదేశము శ్రుతిపథమున బడును. (శ్రీవిజయరాజ్యము), పలెంబంగ్‌రాజ్యము క్రీ. శ. 672-705 మధ్య మలయూరాజ్యము నాక్రమించినట్లు ఇట్సింగ్ యాత్రికుఁడు సూచించి నాఁడు. మాయిరుడింగమ్ శ్రీవిజయరాజ్యమున సామంతమండలముగ చౌజుకుళ పేర్కొనిన జిలొటింగ్ (యిరుడింగమ్) ఇళంగాశోకమ్, చౌజుకోరాష్ట్రములలోని లింగయన్నుకియ. ఇదియును మలయా ద్వీపకల్పము లోనిదే! వెంకయ్యగారు, మా పప్పాలమును మహా వంశము ననుసరించి, 'పప్పాలమ' అని నిర్దేశించినారు. క్రీ. శ. 1165 ప్రాంతమున తమిళ 'ఆదిచ్చ'సేనాని రామన్న దేశముపై, సింగళ రాజపరాక్రమబాహు ఆదేశమున దండెత్తినప్పుడు పప్పాలమవద్ద విడిసినాడు. శ్రీ విజయ రాజ్యము, మా పప్పాలము అనఁగా బర్మాలోని తైలంగ్‌రాష్ట్రము వరకు విస్తరించి యుండవచ్చును. మేలిలంబంగమ్, వలైప్పండూరు రాష్ట్రములను గుర్తించుట కష్టము. తలైత్తకోలమ్,

(109) Hirth k Rock Hill-Chan Jukua p 35 Coodes Opcit p 13

(110) Coodes

(111) Gerini Researches p 513

టోలిమీ పేర్కొనిన తక్కోలము. ఇది మలయ ద్వీపకల్పమున పశ్చిమప్రాంతము. మాదమాలింగమ్, చౌజుకువ సన్-పొట్సి సామంత రాజ్యములలో పేర్కొనిన తన్-మాలింగ్- అతడు లింగ్-య-స్సి-కియ (ఇళంగాశోకము)ను తన్-మ-లింగ్-నుండి 6 దినముల రేయింబవళ్లు నావికాప్రయాణముతో చేరవచ్చునని వచించినాడు. ఈ రెండు రాజ్యముల మధ్య నాటుదారి గూడ కలదు." గెరిని, తన్-మ-లింగ్‌ను పహంగ్‌లోని క్వాంతన్ నదీముఖ ద్వారమున మలయద్వీపకల్పమున ప్రాచ్యభాగమున నిర్దేశించు చున్నాడు. ఇళామూరిదేశము సుమిత్ర ద్వీపములోని ఉత్తరభాగము. దీనినే అరబ్బీయులు లమురి అని, మార్కొపోలో లంబ్రి అని, చౌజుకువ లం-వన్-లి అని పేర్కొనినారు. ఈ స్థలనిర్దేశములను బట్టి రాజేంద్రుని నావికాదండయాత్ర సుమిత్ర ద్వీపములోని శ్రీ విజయముపై మలయద్వీపకల్పములోని శ్రీ విజయ సామ్రాజ్యముపై నడచినదని నిర్ణయింపవచ్చును. ఈ సామ్రాజ్యమును పరిపాలించిన రాజును కడారమ్ పాలకునిగా తమిళప్రశస్తిని పేర్కొనుటకు కారణముండవలెను. సంస్కృతమున దీనికి కటాహమని పేరు. కళింగత్తుప్పరాణిలో కడారమ్ లేక కిడారము. అట్లే లయడెను శాసనములో గలదు. కడారము సముద్రతరంగ సంకలితమైనదని కళింగత్తుప్పరాణిలో వర్ణనగలదు. మలయద్వీపకల్పమున పశ్చిమమున నేటి కెడహ్ అలనాటి కడారమ్. దీనిని చీనాదేశీయులు కీ-టుహ్ అనినారు. ఇచ్చట 'ఇట్సింగ్' యాత్రికుఁడు మార్గమధ్యమున రెండు సారులు ఆగినాడు. ఈ రేవుపట్టణము శ్రీ విజయరాజ్యమునకు ఉత్తరావధి. అట్లే భారతదేశమునుండి శ్రీ విజయరాజ్యమునకు కడారము రేవుపట్టణము ప్రవేశద్వారము. కావున శ్రీ విజయ సామ్రాజ్యాధిపతిని కడారము పరిపాలకునిగా చోళులు చీనారాజ్యమునకు చోళచక్రవర్తి (చూ-లియిన్=చోళ) యైన రాజరాజునుండి (లొ-ట్స-లొ-ట్స) క్రీ. శ. 1015 లో రాయబారులు వచ్చినట్లు సాంగ్

వంశవృత్తములు పేర్కొనుచున్నవి. క్రీ. శ. 1013 లో శ్రీ రాజఇంద్ర చోళుని నుండి (పి-లో-లో-చఇం-తొ-లో-చు-లో) రాయబారవర్గము చీనారాజ్యమును చేరెనది. (112) క్రీ. శ. 1077 లో కులోత్తుంగ చోళదేవుడుగూడ చీనారాజ్యమునకు రాయబారుల నంపినాడు. రాజేంద్రుని నావికాదండయాత్రనాటికి క్రీ. శ. 1025 లో చీనాభారత దేశముల మధ్య వర్తకసంబంధములు రాయబారములు విలసిల్లినవి. రాజేంద్రుడు, రాజరాజు ఇచ్చిన దానమును నాగపట్టణములోని చూడామణీ విహారమున పునః ప్రతిష్ఠించినాడు. దీనిని బట్టి సంగ్రామ విజయోత్తుంగవర్మ, రాజేంద్రుని పరిపాలనారంభమున అతనికి మిత్రుడే అని నిర్ణయింపవలెను. కావున శ్రీ విజయ దండయాత్ర రాజేంద్రుని విజిగీషావాంఛతో ఉద్భవించిన దిగ్విజయసన్నాహమే కావచ్చును. కాని, శ్రీవిజయసామ్రాజ్యము, సింహళము వలె చోళసామ్రాజ్యమున కలిసిపోలేదు. వీరరాజేంద్రుడు అర్వాచీనకాలమున కడారము పాలకుని జయించి,అతనిని తిరిగి రాజ్యమున పునఃప్రతిష్ఠించినట్లు చెప్పుకొన్నాడు. క్రీ. శ. 1088 లో సుమిత్రా ద్వీపములోని తమిళ శిలాశాసనఖండము తమిళవర్తకులను పేర్కొనుచున్నది. (113)

రాజేంద్రుని ద్వీపాంతర దండయాత్రానంతరము రాజ్యమున శాంతి వెల్లివిరిసినదని చరిత్రకారులు వచించుచున్నారు. (114) కాని, అనేకయుద్ధములను అతని పుత్రులు నిర్వహించినారు. పాండ్యకేరళ రాజ్యములలో విప్లవములు రేకెత్తినవి. రాజాధిరాజు ఈ విప్లవములను అణచినాడు.

"రాజాధిరాజు దక్షిణమున చేరిన ముగ్గురు రాజులను జయించి నాడు. మానాభరణుని రత్నఖచిత కిరీటస్థగితమైన శిరస్సును ఖండించి

---

(112) Gereni Researches - p 609 n 2.

(113) ARE 1892 p 12.

(114) Dr. Iyyengar Arcient India.

నాడు. అతని మత్తేభము, అత్తివారణ్యముయొక్క పదాఘాతములలో వీరకేరళుడు నలిగిపోయినాడు. వేనాడు రాజును స్వర్గమునకు పంపి నాడు. భయార్తుఁడై విల్లవాన్ (చేరరాజు) అరణ్యములలో తలదాచు కొన్నప్పుడు కాందలూరువద్ద అతని నౌకావాహినిని సముద్రగర్భ మున విధ్వంస మొనర్చినాడు. (115)

పై దండయాత్ర కాలము నిష్కర్షగా నిర్ణయించుటకు వీలు లేదు. సుందరపాండ్యుడు ఈ విప్లవమును రేకెత్తించియుండును. ఈ యుద్ధములో వేనాడు రాజును సంహరించి రాజాధిరాజు అతని సామంతుడైన కూపకరాజును స్వతంత్రుని చేసినాడు. (116)

ఆ కాలమున కేరళదేశము చిన్నచిన్న రాజ్యములుగా చీలి యుండెను. ఇరామకుడమ్- కే రామఘుట అందు ఒక రాజ్యము. ఈ రాజ్యమునకు ఎలిమలై లేక మూషక పర్వతము కేంద్రము. మూషక రాజులు ఈ రాజ్యమును పాలించినారు. వీరి ప్రశంస 'మూషకవంశ' మను కావ్యమునఁ గలదు. మూషక పర్వతాగ్రమున పరశురాముఁడు యజ్ఞదీక్షతో నున్నప్పుడు క్షత్రియుఁడు నిర్వహింప వలసిన 'విధులు' ఆగిపోవలసి వచ్చినది. అప్పుడు పరశురాముఁడు రహస్యముగ పెరిగిన ఒక క్షత్రియ కుమారుని వెదకి తెచ్చి తన ఘటముతో అభిషేకము సల్పినాఁడు. అతఁడే మూషకరాజులకు మూలపురుషుఁడు. అతని వంశము నకు అప్పటినుండి రామఘుట లేక ఇరామకుడమ్ అను సార్థక నామధేయ మేర్పడినది. ఇది యీ కావ్యములోని పురాణగాథ. వట్టెలుట్టు శాసనము 11 వ శతాబ్దినాటిది, ఎలిమలై ప్రాంతమున దొరికినది. ఆ శాసనము ఒక మూషకరాజు కంఠన్‌కారి వర్మ లేక

(115) SII (III) p 56

(116) 75 of 1895

రామకుడమూవర్ తిరువడిని 59 సం.న పేర్కొనుచున్నది. (117) ఆ శాసనము రాజేంద్రశోలసామయ సేనాపతిని పేర్కొనుచున్నది. ఈ మూవర్ తిరువడిని రాజాధిరాజు జయించి యుండును.

రాజేంద్రునికాలమున రాజాధిరాజు సింహళమున దండయాత్రను నడిపినాడు. కొన్ని శిలా శాసనములలో కందలూరు శాలై విజయానంతరము రాజాధిరాజు సింహళమును జయించి లంకాధిపుని వల్లవ రాజు శిరస్సును ఖండించినట్లు గలదు.(118) ఈ విషయమే రాజేంద్రుని చిదంబరము శాసనప్రశస్తిలో గలదు. అందు సింహళదండయాత్రలో వీరసలామేఘుని శిరస్సు ఖండింపబడినట్లు గలదు. ఈ యుద్ధము రాజేంద్రుని కాలమున అరంభించి రాజాధిరాజు అతని సోదరుడు 2 వ రాజేంద్రుని కాలమువరకు ప్రాకినది.

రాజేంద్రుని అవసానకాలమున రాజాధిరాజు పశ్చిమచాళుక్య రాజు ఆహవమల్లునితో యుద్ధము సల్పినాడు. 2 వ జయసింహుని శాసనములు క్రీ. శ. 1042 వరకు కన్పించుచున్నవి. (119) కావున ఈ యుద్ధము 1042 తర్వాత జరిగినది. క్రీ. శ. 1021 మూశంగి యుద్ధానంతరము జయసింహుడు II రాయచూరు మండలమును స్వాధీనము చేసికొని తుంగభద్రానదీ తీరమునకు విస్తరించినాడు. అప్పుడప్పుడు జయసింహుఁడు తుంగభద్రానదిని దాటి చోళరాజ్యము నాక్రమించినాడు. (120) క్రీ. శ. 1033 లో అతని సామంతుఁడు జగదేకమల్ల, ఉదయాదిత్య నోలంబపల్లవ పెరుమానంది, నోలంబవాడి 32000 ను పరిపాలించినాడు (120 a) ఈ ప్రశస్తి అతియోశక్తిగా కన్పించు

(117) 523 of 1930

(118) 172 of 1894, 92 of 1892

(119) Fleet DKD N. 436.

(120) Rangachari-Bellary 185, 229, 285.

(120a) 253 of 1918.

చున్నది. కాని 1021 తరువాత చాళుక్యులు విస్తరించిరని చెప్ప వచ్చును. త్రైలోక్యమల్ల ఆహవమల్ల సోమేశ్వరుడు I సింహాసన మధిష్ఠించిన వెంటనే చోళులు తిరిగి చాళుక్యులపై దండయాత్ర సాగించినారు. చోళశాసనములలో ఈ యుద్ధములో చోళసైన్యములు చాళుక్యసైన్యములను జయించినట్లు గలదు. ఆ యుద్ధములో చాళుక్య సేనానులు గండప్పయ్య గంగాధరులు మరణించినారు. సుప్రసిద్ధ వీరులైన విక్కి విజయాదిత్యులు, సంగమయ్యతో బాటు పలాయనము సాగించినారు. చోళులు కాంచన రత్నరాసులను కొల్లగొట్టి, కొల్లి ప్పాక్కై నగరమును అగ్నిదగ్ధ మొనర్చినారు. విక్కి, విజయాదిత్యులు సోమేశ్వరుని పుత్రులు. అర్వాచీనకాలమున వీరు విక్రమాదిత్య VI విష్ణువర్ధన విజయాదిత్యనామములతో పాలించినారు. కొన్ని శిలాశాస నములలో యుద్ధవర్ణనము విపులతరముగా గలదు. పూండివద్ద ఘోరయుద్ధము జరిగినది. విచయ, తలిదండ్రులను వదలి పారిపోయి నాడు. ఆహవమల్లుడు సంధికి రాయబారులను పంపగా చోళులు వారి నవమానించినారు. పారిపోవుచున్న చాళుక్యసైన్యములను వెంబడించి చోళులు చాళుక్యుల మత్తేభయూథములను శిరుతురై, పెమందురై దైవభీమకాశి తీర్థముల యొద్ద పట్టుకొన్నారు. కొల్లగొట్టిన ధనరాసు లను దీనులకు పంచిపెట్టినారు. శత్రులైన నాలుంబ, కాళిదాస, చాముండ, కొమ్మయ్య, విప్లవరాజులను జయించి, గుర్జరరాజు శిరస్సును ఖండించినారు. శరణార్థులైన రాజులను రక్షించి కిరీటముల ననుగ్రహించినారు. చాళుక్యరాజాధికారి, పర్కడై వెంటవచ్చిన యిద్దరు భటులను బంధించి ఒకనికి స్త్రీ వేషమును మరి యొకనికి పంచశిఖలు చెక్కించి ఆహవమల్ల ఆహవమల్లి అని పేరు పెట్టి పర్కడైతో పంపినారు. కల్యాణపురమును విధ్వంస మొనర్చి రాజప్రాసాదమును నేలమట్టు మొనర్చినారు. రాజాధిరాజు ఆ నగరమున వీరాభిషేకముతో విజయ

రాజేంద్ర బిరుదాంకితుఁడైనాఁడు. (121) రాజాధిరాజు శాసనము ఆహవమల్లునిపై అతడు సాధించిన విజయమును పేర్కొనుచున్నది. అందు అతఁడు విజయానంతరము వీరాభిషేకమున విజయరాజేంద్ర బిరుదాంకితుఁడైనట్లు గలదు. (122) తంజాపూరుమండలమున దారాసురమున ఒక ద్వారపాలక విగ్రహము విశిష్టశిల్పముతో నేటికిని సాక్షాత్కరించుచున్నది. ఆ విగ్రహమున శిలాక్షరములలో "ఉడైయార్ శ్రీ విజయరాజేంద్రదేవుడు కల్యాణపురము నగ్నిదగ్ధమొనర్చి తెచ్చిన ద్వారపాలకుఁ"డని గలదు. (123)

సోమేశ్వరుని శాసనములలో రాజేంద్రుని విజయప్రశస్తి గాని యీ యుద్ధప్రసక్తిగాని కన్పించుట లేదు. అర్వాచీనకాలమున విక్రమాంకదేవచరిత్రములో బిల్హణుఁడు సోమేశ్వరుఁడు విజయలక్ష్మితో కాంచీపురమును ప్రవేశించినట్లు వర్ణించినాడు. బిల్హణుడు 6 వ విక్రమాదిత్యుని ఆస్థానకవి. సోమేశ్వరుడు అతని తండ్రి. ఈ బాంధవ్యమే బిల్హణకవి వర్ణనకు మూలబీజము. యుద్ధములో చిట్టచివరకు విజయము చోళులకు సిద్ధించిన మాట సత్యము. రాజాధిరాజు 26 వ సం. మున అంతకు పూర్వమీ యుద్ధవర్ణన గలదు. కావున నీ యుద్ధము 1044 కు పూర్వము జరిగియుండును. సోమేశ్వరుడు 1042 పూర్వమున సింహాసన మధిష్ఠింపలేదు. కావున క్రీ. శ. 1042-44 మధ్య నీ యుద్ధములు జరిగినవి. పూండీ యుద్ధము, కల్యాణపుర విధ్వంసము శిరుతురై పెరుందురై దైవభీమకాశి తీర్థములు యథార్థ చారిత్రక సన్నివేశములు. క్రీ. శ. 1053 న కల్యాణపురము మొట్టమొదట చరిత్రలో ఉదయించుచున్నది. (124) అప్పటికే అది ప్రాచీన

[121] 172 of 1894 (yr 26 92 of 1892 (n d SII V 465 IV 539

[122] 244 of 1925 [yr 36.]

[123] నీలకంఠశాస్త్రిగారు స్వయముగా సందర్శించి వ్రాసికొన్నది.

[124] Fleet EI XII pp 298 - 4.

పట్టణము. కావున చోళులు అంతకు 10 సం. పూర్వమే పేర్కొనిన కల్యాణపురమును 1 వ సోమేశ్వరుడు రాజధానిగా పెంపొందించినాడు.

రాజేంద్రుని కాలమున చోళసామ్రాజ్యము పరాకాష్ఠ చెందినది. ఇతడు గంగైకొండ చోళ బిరుదాంకితుడు. ఈ బిరుదు ఇతడు నిర్మించిన గంగాపురీనగరమను నూతనరాజధానికి తార్కాణము. ఈ ప్రాచీన రాజధానిలో తిరువాలంగాడు శాసనపత్రములు పేర్కొనిన 'చోళ గంగమ్' అను తటాకము నేడు శిథిలమై పోయినది. పూడిపోయిన ఆ మహాతటాకముం నేడు అరణ్యవృక్షములు సంకులముగా పెరిగి యున్నవి. గంగైకొండచోళపురము 17 వ రాజ్య సం.మున కన్పించుచున్నది. (125) రాజేంద్రుడు బహుభార్యాపరుడు. ఇతని పుత్రికలలో అమ్మంగాదేవి తూర్పుచాళుక్యచక్రవర్తి రాజరాజుభార్య. కులోత్తుంగ చక్రవర్తి రాజమాత !

## రాజాధిరాజు

రాజేంద్రుని అనంతరము రాజాధిరాజు, రాజేంద్రుడు II వీర రాజేంద్రుడు లేక వీరచోళుడు చోళరాజ్యమును పరిపాలించినారు. చోళసామ్రాజ్యమున రాజు, యువరాజుల యౌగపత్యపరిపాలనచే రాజు కాలముననే యువరాజుగూడ పరిపాలించినట్లు సిద్ధించుచున్నది. రాజాధిరాజు 25 సం. తండ్రియైన రాజేంద్రునితో పాటు పరిపాలించినాడు. క్రీ. శ. 1053-4 న రాజేంద్రుని 36 వ సం. శాసనములు కన్పించుచున్నవి. రాజకేసరి రాజమహేంద్రదేవుని 3 వ సం. వరకు శాసనములు కన్పించుచున్నవి. ఇతడు వీరరాజేంద్రునికి పూర్వము పరిపాలించియుండును.

## సింహళదండయాత్ర

రాజాధిరాజు శాసనములో అతఁడు లంకాధిపుడైన వల్లవరాజును

(125) 61 of 1914, 203 of 1925-510 of 1926.

కన్నాకుచ్చియల్ రాజును(కన్యాకుబ్జరాజు)జయించినట్లుగలదు.(126) అర్వాచీనశాసనములు ఈ యుద్ధమును విపులముగా వర్ణించుచున్నవి.

"అప్రతిహతమైన సైన్యముతో రాజేంద్రుడు లంకాద్వీపముపై దండెత్తినాడు. మణిరత్నఖచితమైన విక్రమబాహు కిరీటమును సంపాదించినాడు. భయార్తుడై పాండ్యదేశమును వదలి లంకలో తలదాచుకొన్న విక్రమపాండ్యుని కన్నకుచ్చిని వదలి బంధుమిత్రాదులతో సింహళమున నున్న వీరసలామేఘుని జయించినాడు. పల్లవమదన రాజు ఈళమ్‌రాజు, మనోజ్ఞరత్నకిరీటమును సంపాదించినాడు.(127)

మహావంశములో V వ మహిందుని క్రీ. శ. 1017 లో చోళులు జయించి చెఱపట్టినప్పటినుండి యీళమండలమున విప్లవములు దక్షిణ రోహణప్రాంతమున చెలరేగినట్లు గలదు. మహావంశకథనము చాల కాలము వరకు జరిగిన ఈ విప్లవయుద్ధముల కాలనిర్ణయమున కుపకరించుచున్నది. మహావంశములో చోళరాజ్యమును ప్రతిఘటించిన మొట్టమొదటి విప్లవము మహిందుని చెఱసాలలోనున్న 12 వ సం. జరిగినట్లు గలదు. అప్పుడు అతని కుమారుడు కస్సపుడు విప్లవ నాయకుడు. ఆరు నెలలు కస్సపుడు 95000 చోళసైన్యమును ప్రతిఘటించినాడు. అప్పుడు కస్సపుడు విక్రమబాహునామముతో రోహణమును పరిపాలించినాడు. ఇది క్రీ. శ. 1029 ప్రాంతమున రాజేంద్రుని కాలమున జరిగినది. ఈ యుద్ధమున రాజాధిరాజు పాల్గొని యుండును. కాని నిష్కర్షగా చెప్పుటకు వీలులేదు.

చోళశాసనములు విక్రమబాహు, యుద్ధములో మరణించినట్లు అతని కిరీటమును రాజాధిరాజు సంగ్రహించినట్లు చెప్పుచున్నవి.(128) కాని మహావంశములో విక్రమబాహు 12 సం. మున క్రీ. శ. 1041 లో

(126) 92 of 1892; 172 of 1894.
[127] SII [iii] 28 p 56
[128] 92 of 1892

అనారోగ్యకారణమున చోళులపై దండయాత్రాసన్నాహ నిమగ్నుడై యుండగా యాదృచ్ఛికముగ మరణించినట్లు గలదు. విక్రమబాహు తర్వాత రోహణమును పాలించు సింహళరాజులు స్వాతంత్ర్యజిగీషతో చోళులను తరిమివేయ ప్రయత్నించినారు. క్రీ. శ. 1041 లో కిత్తిరాజు 8 దినములు పరిపాలించినాడు. అతని తరువాత, మహాలానకిత్తి రోహణపరిపాలకుడై నాడు. అతడు చోళులతో 3 వ సం. క్రీ. శ. 1044లో పోరాడి ఓడిపోయి ఖడ్గముతో కుత్తుకను ఖండించుకొన్నాడు. చోళులు రాజ్యమును కొల్లగొట్టి కిరీటమును రత్నరాసులను చోళరాజునకు పంపినారు." విక్కమపండు (క్రీ. శ. 1044-47) మహావంశము ప్రకారము మహాలాన కిత్తి పుత్రుఁడు. అతడు భయార్తుడై దులుదేశమున నివసించి కొంతకాలమునకు రోహణమునకు తండ్రి మరణించిన తరువాత తిరిగి వచ్చినాడు. అతడు జగతీపాలునితో పోరాడి మరణించినాఁడు. చోళశాసనములు విక్రమపాండ్యుడు దక్షిణమును పాలించి సింహళమును చేరినట్లు చెప్పుచున్నవి. సింహళపాండ్యదేశములకు చిరకాలమైత్రి కలదు. దీనినిబట్టి విక్రమపాండ్యుని తండ్రి సింహళీయుఁడు - తల్లి పాండ్యరాజపుత్రి అని నిర్ణయింపవచ్చును. "జగతీపాలుడు" (క్రీ. శ. 1047-51) మహావంశముఁబట్టి "అయోధ్యారాజపుత్రుఁడు. అతఁడు సింహళమునకు వచ్చివిక్కమపండుని సంహరించి రోహణమును 4 సం.లు పరిపాలించినాడు. అతనిగూడ చోళులు సంహరించి కిరీటమును రత్నరాసులను అపహరించినారు." దీనినిబట్టి, చోళశాసనములలోని కన్నకుచ్చి వీరసాలమేఘుఁడే, అయోధ్యా రాజపుత్త్రుడైన జగతీపాలుడు కావచ్చునని ఊహింపవచ్చును. (129) కాని, యీ నిర్ణయము ఊహామాత్రము. క్రీ. శ. 1046 డిసెంబరు 3 వ తేదీ శాసనములో వీరసాలమేఘుని ప్రస్తావనకలదు. మహావంశమును బట్టి జగతీపాలుఁడు క్రీ. శ. 1047 లో పరిపాలన ఆరంభించినట్లు

(129) of Haltzsch SII (iii) p 53.

చెప్పక తప్పదు. వీరు భిన్నపురుషులైన ఎట్లు ఉత్తరహిందూదేశము నుండి సింహళమును జేరి పరిపాలించుట గల్గిన దనియు ఊహించుట కూడ కష్టము. కాలపురుషుడు గర్భగోళములో దాచుకొనిన విచిత్ర చారిత్రక సన్నివేశములలో నిది యొకటి. మదనరాజును ప్రస్తావించిన చోళశాసనము క్రీ. శ. 1040 నాటిది. క్రీ. శ. 1053 లో సింహళ పరక్కముఁడు చోళయుద్ధమున మరణించినాడు. ఈ యిద్దరికినిగూడ అభేదము కల్పించుటకు వీలులేదు.

చోళశాసనములలో, మహావంశములో సామాన్యముగ కన్పించు చున్నవారు విక్రమపాండ్య, విక్రమబాహులు. చోళశాసనములలో మాత్రము వీరసాలమేఘుఁడు శ్రీవల్లభమదనరాజులు కన్పించు చున్నారు. మహావంశములో మాత్రము జగతీపాలుడు పరక్కములు స్వాతంత్ర్యయుద్ధములో మరణించినవారు చోళశాసనములలో కన్పిం చుట లేదు.

2 వ రాజేంద్రుడుగూడ సింహళయుద్ధములలో పాల్గొనినాడు. క్రీ. శ. 1055 లో అతని 4 వ సం. శాసనములో అతడు సింహళము నకు సేనను పంపి వీరసలామేఘుని సంహరించి, అతని సింహళరాజ మానాభరణుని పుత్రులి నిద్దరను చెఱబట్టినట్లు గలదు. సింహళములో 'సంగిలి కనదరావ' దగ్గర రాజేంద్రుని శిలాశాసనము గలదు. (130) వీరసలామేఘుఁడు రాజాధిరాజు అతని సోదరికి, భార్యకు, తల్లికి జరిపిన అవమానమును భరింపలేక చోళులను తిరిగి యెదిరించి రాజేంద్రునిచే ఓడిపోయి యుండును. రాజేంద్రుఁడు అతని తల్లిని - సోదరిని ముక్కు - చెవులుకోసి అవమానించినాడు. సింహళములో రాజాధిరాజు రాజేంద్రుని నాటివి నాణెములు లభించినవి. మహావంశ

(130) SII (iii) p 59, 812 of 1912.

మును బట్టి అచ్చటి శిలాశాసనములను బట్టి చాలకాలము సింహాళమును చోళులు పరిపాలించినట్లు చెప్పవచ్చును. రోహణమున దక్షిణ సింహాళమున స్వాతంత్ర్యయుద్ధమును సింహాళీయులు సాగించినారు. 1058 లో విజయబాహుబిరుదాంకితుఁడైన కీర్తి యీ ఉద్యమప్రవర్తకుఁడు క్రీ. శ. 1070 లో విజయబాహుకులోత్తుంగచోళదేవుని కాలమున స్వాతంత్ర్యసింహాళరాజ్యమును పునః ప్రతిష్ఠించినాఁడు.

## ద్వితీయ చాళుక్య దండయాత్ర

రాజాధిరాజు రెండవసారి క్రీ. శ. 1044-46 సం. మధ్య సోమేశ్వరునిపై దండెత్తినాడు. క్రీ. శ. 1046 డిసెంబరు మూడవతేదీ మణిమంగలశాసనములో చోళరాజు అనేక చాళుక్యసామంతులను యుద్ధములో ఓడించినట్లు కంపిలినగిరమున చాళుక్యరాజప్రాసాదమును విధ్వంస మొనర్చినట్లు గలదు. (131) కంపిలిరాజప్రాసాదవిధ్వంసము తరువాత చాళుక్యయుద్ధమును రాజాధిరాజు 30 వ సం. తరువాత శాసనములు ప్రస్తావించుచున్నవి. కృష్ణానదీవామతీరమున పూండూరు (కడకమానగర్-సైన్యశిబిరస్థానము) వద్ద ఘోరయుద్ధము జరిగినది. సోమేశ్వరుని సామంతులనేకులు బందీకృతులైనారు. పూండూరును చోళులు విధ్వంసమొనర్చి గాడిదనాఁగలితో దున్నినారు. మణ్ణందిప్పై రాజప్రాసాదమును దగ్ధమొనర్చి, అచ్చట వ్యాఘ్రచిహ్నితమైన విజయస్తంభమును నాటినారు. (132) ఈ విజయపరంపరాభివర్ణనలో అతిశయోక్త్యలంకారము అభివ్యక్తమగుచున్నది. తుంగభద్రానదీ తీరమువరకు సోమేశ్వరుని శిలాశాసనములు అనేకములు కన్పించుచున్నవి. బళ్ళారిమండలములోని హడగళ్ళి తాలూకాలో త్రైలోక్యమల్లదేవుని (సోమేశ్వరుని) శాసనము క్రీ. శ. 1047 లో కాలిదాసుని

(131) SII (iii) 28.
(132) 6 of 1890 yr 30; 221 of 1894; 81 of 1895 (yr 32).

దానమును పేర్కొనుచున్నది. చోళులు తరిమివేసిన సోమేశ్వరుని తెలుఁగు సామంతులలో కాలిదాసునామము కన్పించుచున్నది. (133) మరుసంవత్సరము విష్ణ్వాలయమునకు మాహిష్మతీపురాధీశుఁడు సోమేశ్వరుని సామంతుఁడు మహామండలేశ్వర గండరాదిత్యరసుడు సిందవాడి 1000 బెన్నెవారు 12 నురుగుండను పరిపాలించుచు దానము సల్పినాడు. (134) ఇతడే చోళులు పేర్కొనిన కండర్ - దినకరుఁడు కావచ్చును. (135) బిల్హణుడు వర్ణించిన సోమేశ్వరుని కంచిప్రవేశము విక్రమాదిత్యుని దిగ్విజయమును సమీక్షింపవలసియున్నపుడు, చోళుల దండయాత్రలవలన చాళుక్యరాజ్యమును ఆక్రమింపలేకపోయినారని చెప్పవచ్చును. యుద్ధములు చాళుక్యరాజ్యమున జరిగినవి. అనేక చాళుక్యనగరములు విధ్వంసమైనవి. సోమేశ్వరుడు తాత్కాలికముగ వేంగినాక్రమింపగల్గినాడు. అతని ముల్గుండ శాసనము క్రీ. శ. 1053 లో అతని పుత్రుఁడు సోమేశ్వరదేవుఁడు బెల్వోల 300, పులిగిరి 300 పరిపాలించుచున్నారు. అతఁడు వేంగిపురేశ్వరబిరుదాంకితుడు (136) క్రీ. శ. 1055 లో అతని శిలాశాసనము - ద్రాక్షారామములో కన్పించుచున్నది. అది నారాయణభట్టు అను అతని అమాత్యుని పుత్రికకుపమవేసిన దానశాసనము. (137)

రాజాధిరాజు తిరిగి చాళుక్యరాజ్యముపై దండెత్తినాడు. ఈ యుద్ధములో అతనికి సోదరుడైన రాజేంద్రుడు తోడ్పడినాడు. రాజాధిరాజు - రాజేంద్రుని యువరాజుగ అభిషిక్తుని జేసినాడు. ఈ యుద్ధ వర్ణనము రాజేంద్రుని 2 వ సం. క్రీ. శ. 1054 శాసనములో

(133) 8 2 of 1892 SII IV 539.
(134) 41 of 1904, 711 of 1919;
(135) SII [iii] p 57 n-1.
(136) EI XVI p 53.
(137) 185 of 1893.

నున్నది. (138) క్రీ. శ. 1055 మణిమంగల శాసనములో విపులముగా గలదు. (139) చోళరాజు రట్టమండలముపై దండయాత్రసాగించి నాఁడు. చాళుక్య అహవమల్లుడు ఉగ్రుడై ఎదిరించివచ్చినాఁడు. కొప్పమువద్ద భీకరయుద్ధము జరిగినది. (కొప్పము కృష్ణానదీతీరమున కొల్హాపూరు ప్రాంతమున నున్నది.) రాజాధిరాజు స్వయముగ సేనలను నడపినాడు. రాజాధిరాజు యుద్ధములో మత్తేభము నధివసించి పోరాడినాడు. కాని శత్రుసైన్యము లు ఆ యేనుగును చుట్టుముట్టినవి. "స్వర్గలోకములోని అప్సరఃకన్యకల అర్ఘ్యాంజలులందుకొనుచు రాజాధిరాజు వీరస్వర్గమలంకరించినాడు. చోళసైన్యములు చెల్లాచెదరైనవి. కాని రాజేంద్రుడు చెదరిపోయిన సైన్యములను పురిగొల్పి ప్రళయకాల మృత్యువువలె శత్రువులపై పడినాడు. "ఘోరయుద్ధము జరిగినది. రాజేంద్రునికి గాయములు తగిలినవి." క్షతగాత్రుడైనను భీకరముగ పోరాడినాఁడు. రాజేంద్రుని పక్షమున పోరాడిన వీరులు అనేకులు మరణించినారు. రాజేంద్రుడు చాళుక్యపులకేశి సోదరుడు జయసింహుని దశపన్మని నన్నిలుంబుని సంహరించినాడు. చిట్టచివరకు చాళుక్యుడు, వన్నియదేవునితోబాటు ఓడిపోయినాడు. కుండమాయ తుత్తరాజులు పారిపోయినారు. అహవమల్లుని రాణులు శత్తియవ్వై శంగప్పై - పరిచారికాగణముతో యుద్ధమున బంధీకృతులైనారు. రాజేంద్రుడు (140) యుద్ధరంగమున రక్తసిక్తాంగుడై అపూర్వముగ రాజ్యాభిషిక్తుఁడైనాఁడు. చాళుక్యసేనలను (141) కొల్హాపూరు వరకు తరిమి రాజేంద్రుడు అచట జయస్తంభమును నెలకొల్పి గంగాపురిని చేరినాడు. (142)

---

(138) 214 of 1911 SII (iii) 55 ii p 304 A of yr 3.
(139 SII (iii) 29.
[140] 87 of 1895.
(141) SII (iii) 55 11 p 304 o.
[142] 87 of 1895,

చాళుక్యశాసనములు కొప్పము యుద్ధమును పేర్కొనుట లేదు. (143) శక 981 లో సోమేశ్వరుడు చోళులను జయించి సిందవాడి దేశమున విడిసినాడు. ఆ దేశమును మహామండలేశ్వర సిద్ధనచోళమహారాజు పరిపాలించినాడు. శక 987 లో రాజాజ్ఞచే విష్ణువర్ధన విజయాదిత్యుడు దక్షిణదండయాత్రకు పోవుచు, అఱసియకెరె వద్ద విడిసినాడు. (144) క్రీ. శ. 1071 లో రెండుశాసనములు చోళ దండయాత్రను రాజాధిరాజు మరణమును సూచించుచున్నవి. (145) ఇవి సోమేశ్వరుని మరణానంతరమున వెలసిన శాసనములు. ఈ శాసన వాక్యములనుబట్టి సోమేశ్వరుని కాలమున చోళవిజయమును పేర్కొన లేదని చెప్పవచ్చును. ఇందు మహాపాతకుఁడైన పాండ్యచోళుడు చెల్వాలదేశమును కొల్లగొట్టి దేవాలయములను జినాలయములను తగులబెట్టి యుద్ధములో సోమేశ్వరునిచే మరణించినట్లు గలదు. రాజాధి రాజునకు తరువాతి శాసనములలో "ఆనై మేల్తుంజిన" ఏనుగు వీపుపై మరణించిన రాజు అను బిరుదు గలదు. రాజాధిరాజు యువరాజుగ పట్టాభిషిక్తుడైనప్పటినుండి నిరంతరము దండయాత్రలను నడిపి విజయ పరంపరలను సాధించినాడు. రాజాధిరాజు చోళసామ్రాజ్యమును విస్తరింపజేసిన మహావీరుడు. ఇతఁడశ్వమేథయాగమును తండ్రికాలము ననే చేసినాడు.

## రెండవ రాజేంద్రుఁడు

రాజేంద్రుఁడు క్రీ. శ. 1054-5 ప్రాంతముననుండి రాజ్యభార మును వహించి యుండును. క్రీ. శ. 1052, మే 22 వ తేదీని కొప్పము యుద్ధమున స్వీకరించి, రాజేంద్రుఁ డప్పటి నుండి పరి

(143) BG-1 ii p 441- 392 of 1920.
(144) ARE 1919 ii 30.
(145) BG-ii p 441–EI XV 23.

పాలించినట్లు సీవెలువచించుచున్నాడు.(145a)కళింగత్తు పురాణములో రాజేంద్రుడు కొప్పము యుద్ధరంగమున ప్రదర్శించిన పరాక్రమము, యుద్ధభూమిలో అతవి రాజ్యాభిషేకము వర్ణితము.

రాజేంద్రుని కుమారుఁడు రాజేంద్రచోళుడు. ఇతఁడు 1059 ప్రాంతమున యౌవరాజ్యపట్టాభిషిక్తుడై రాజకేసరి రాజమహేంద్ర బిరుదు వహించి యుండును. ఇతని 3 వ సం. శాసనము ఆహవ మల్లునిపై ఇతని విజయమును పేర్కొనుచున్నది. (146) ముడక్కాఱువద్ద యుద్ధము జరిగినది. రాజేంద్రుని తొమ్మిదవసంవత్సరమున ఈ యుద్ధ వర్ణనము గలదు. చాళుక్యులు కొప్పము యుద్ధములో కలిగిన పరాజయమునకు కుపితులై దండనాయక వాలాదేవుని ఆధ్వర్యమున దండెత్తివచ్చినారు. ఆ ముడక్కాఱు యుద్ధమున దండనాయకుఁడు మరణించినాఁడు. ఇరుగైయన్ మున్నగువారు పలాయనము సాగించి నారు. (147) రాజమహేంద్రుఁడు గజయుద్ధమున ఆహవమల్లుని తరిమి వేసినాఁడు. ఈ యుద్ధమున రాజేంద్రుఁడు రాజమహేంద్రుడు వీరరాజేంద్రుడు కలిసి, చాళుక్యులతో పోరాడినారు. కుడల్‌సంగమము వద్ద, ఘోరయుద్ధము జరిగినట్లు, వీరరాజేంద్రుని 2వ సం. శాసనములలో కన్పించుచున్నది. (148) ముడక్కాఱు యుద్ధములో వీరరాజేంద్రుడు పరాక్రమమును నెరపి "ఇరట్టరాజకులకాల" బిరుదు వహించినట్లు తరువాతి శిలాశాసనములలో సూచన గలదు. "వీరరాజేంద్రుడు విక్కలన్ వేంగినాడుకు పంపిన సైన్యము నోడించినాడు. మహాదండ నాయకుఁడైన చాముండ రాయనితో పోరాడి అతనిని సంహరించి నాడు. చాముండరాయని ఏకైకపుత్రిక, ఇరుగైయన్‌రాణి మయూర సౌందర్యవతియైన నాగలై కన్యక ముక్కు కోసివేసినాఁడు.

(145a) H. I. S I. p 72
(146) 119 of 1902.
(147) 87 of 1895 SII V p 271
(148) 113 of 1896; 718 of 1909

కూడల్‌సంగమము వద్ద తిరిగి మూడవసారి యుద్ధము జరిగినది. ఆహవమల్లుని పుత్త్రులు, విక్కలన్ శింగనలను జయింప కేశవదండ నాయకుఁడు, కేత్తరసుఁడు, మారయ పలాయనము సాగించినారు. మదువన, విక్కనలు పారిపోయినారు. ఆహవమల్లుఁడు గూడ మత్తేభమును దిగి, రాణులను వదలి పారిపోయినాఁడు." (149) రాజేంద్రదేవుని శాసనములలో ఇరుగైయన్ ఆహవమల్లునితో విక్రమా దిత్యునితో పాటు ముడక్కాఱు యుద్ధమున పారిపోయినట్లు గలదు. కావున కూడల్ సంగమ - ముడక్కాఱు ఒకే యుద్ధసంఘటనమై యుండును. పశ్చిమచాళుక్యులు వేంగిపై నడపిన దండయాత్రను వీరరాజేంద్రుఁడు పేర్కొనినాఁడు. కూడల్‌సంగమము కృష్ణా తుంగభద్రానదీసంగమము, లేక తుంగ, భద్రనదులు కలిసిన కూడలి కావచ్చును. రాజేంద్రుడు క్రీ. శ. 1063 వరకు 12 సం. పరిపాలించి నాఁడు. గంగాపురి చోళరాజధాని. ఇతని పుత్త్రిక మధురాంతకి తూర్పు చాళుక్య రాజకుమారుఁడు 2 వ రాజేంద్రుని లేక కులోత్తుంగుని భార్య విక్రమశోలన్-ఉలాలో రాజమహేంద్రుడు శ్రీరంగశాయికి సువర్ణరత్న ఖచితశేషశాయిని సమర్పించినట్లు గలదు. రాజమహేంద్రుఁడు శ్రీరంగమున గుడిగోపురములను వెలయించినట్లు ఐతిహ్యము.

## వీరరాజేంద్రుడు

వీరరాజేంద్రుఁడు 1062 - 3 సం.ము సింహాసన మధిష్ఠించినాడు. ఇతని 2 సం.ము తిరువెంకాడు శాసనము కూడల్ - సంగమము యుద్ధమును వర్ణించుచున్నది. ఇతని 4 సం. కరువూరు శాసనములో ఇతఁడు పొత్తపిరాజుకు పాండ్యశ్రీవల్లభుని పుత్త్రుఁడు వీరకేసరిని కేరళరాజును సంహరించినట్లు గలదు. (150) మరుసంవత్సరము మణిమంగలము శాసనము ఇతని కేరళ విజయమును పేర్కొనుచున్నది.

(149) SII (111) p 37 = 113 of 1895
(150) SII (111) 20

కూడల్ సంగమమువద్ద ద్వితీయసంగ్రామమునకు చాళుక్యరాజు చోళుల నాహ్వానించినాడు. ఆ ఆహ్వానమునందుకొని సకలసమరసన్నాహముతో చోళులు యుద్ధరంగమును జేరినారు. కాని చాళుక్యసోమేశ్వరుఁడు కదలిరాలేదు. వీరరాజేంద్రుఁడు శిత్తి, కేశిదేవనాథులను పారద్రోలి తుంగభద్రానదీతీరమున జయస్తంభమును నాటినాఁడు. కూడల్ సంగమ యుద్ధాహ్వానము రాజేంద్రుని 5 వ సం.ము నాటిది. ఈ ఆహ్వానము ఎంతవరకు సత్యమో చెప్పలేము. ఆ దినము మణిమంగల శాసనములో క్రీ. శ. 1067 సెప్టెంబరు 10 వ తేదీగా కన్పించుచున్నది. (151)సోమేశ్వరుడు అనారోగ్యపీడితుఁడై క్రీ.శ.1068మార్చి 29 వ తేదీన తుంగభద్రాజలప్రవేశము సల్పి మరణించినాఁడు. (152) వీరరాజేంద్రుని వేంగిదండయాత్రలో సోమేశ్వరుఁడు అతనిని ఎదుర్కొనలేదు. సోమేశ్వరుని మరణసమయమున, అతని పుత్త్రుఁడు 6 వ విక్రమాదిత్యుఁడు కృష్ణాతీరమున విడిసి యున్నాఁడు. (153)

మణిమంగలశాసనములో కూడల్ సంగమమునుండి వీరరాజేంద్రుఁడు వేంగికి వెడలినట్లు గలదు. వేంగిని పునరుద్ధరించి పశ్చిమ చాళుక్యుల బారినుండి సంరక్షించుట ఆ దండయాత్ర లక్ష్యము. దీనిని బట్టి 7 వ విజయాదిత్యుని నుండి వేంగి రాజ్యము పశ్చిమచాళుక్యుల హస్తగతమైనట్లూహింపవచ్చును. విక్రమాంకవిజయములో వేంగి చక్రకూటములను విక్రమాదిత్యుఁడు జయించినట్లు గలదు. జననాథుఁడు నడిపిన పశ్చిమచాళుక్యసైన్యమును బెజవాడవద్ద వీరరాజేంద్రుఁ డోడించినట్లు మణిమంగలశాసనములో నున్నది. బెజవాడ విజయానంతరము విజయాదిత్యుని వేంగిదేశమున పునః ప్రతిష్ఠితుని జేసి వీరరాజేంద్రుఁడు కళింగదేశమును చక్కరకోట్టము వరకు విజయ

(151) E I VII p 9
(152) E C VII S B 136
(153) K N S p 328 విక్రమాంకవిజయము.

యాత్ర సలిపి గంగాపురికే మరలివచ్చినాడు. ఈ సన్నివేశములు వీరరాజేంద్రుని 5 వ సం. శాసనములో గన్పించుచున్నవి. వేంగి విజయముద్వారా, వీరరాజేంద్రుఁడు అతని జ్యేష్ఠసోదరుని ప్రతిజ్ఞను నిర్వర్తించినాఁడు. కన్యాకుమారి శాసనములో వేంగి కళింగరాష్ట్రములు వీరరాజేంద్రుని సోదరుని కాలమున శత్రుగతమైన వానిని పునరుద్ధరించినట్లు చెప్పుకొన్నాఁడు.

సింహాళమున విజయబాహువు రోహణమున విప్లవమును రేకెత్తించినాఁడు. చోళసేనాపతి పులత్తినగరమునుండి విజయబాహునిపై దండెత్తినాఁడు. అతఁడు 'కజరగామ' మును కొల్లగొట్టినట్లు, విజయబాహుని శిబిరమున అంతఃకలహములు పుట్టినట్లు మహావంశము వర్ణించుచున్నది. క్రీ. శ. 1067 లో వీరరాజేంద్రుని 5 వ సం.మున శాసనములో నౌకాబలముతో చోళులు సింహాసనమును ప్రవేశించి, విజయబాహునోడించి అతని రాణిని చెఱబట్టినట్లు (154) గలదు.

వీరరాజేంద్రుని 7 వ సం. శాసనమున అతడు కడారమును జయించినట్లు గలదు. శరణార్థియైవచ్చిన రాజపుత్త్రునికి సహాయము చేయుటకై శ్రీ విజయునిపై దండెత్తినాఁడు. సంగ్రామవిజయోత్తుంగునిపై నెరపిన నౌకాదండయాత్ర తరువాత ఇది ద్వితీయదండయాత్ర. (155)

## మొదటి కులోత్తుంగ మహారాజు

## 1070 — 1118

చోళసామ్రాజ్యచరిత్రలో కులోత్తుంగునితో నూతనశకము అరంభించుచున్నదని చెప్పవచ్చును. కులోత్తుంగుడు వేంగిమహారాజు

(154) 182 of 1915
(155) 175 of 1894; 266 of 1901 SII [111] 84

రాజరాజనరేంద్రుని పుత్రుడు. అతడు మాతామహరాజ్యమైన చోళ సామ్రాజ్యమునకు చక్రవర్తియగుట ఒక అద్భుతోదంతము.

కులోత్తుంగుని అసలుపేరు రాజేంద్రుడు. క్రీస్తుశకము జూన్ 9 వ తేదీ 1070 సంవత్సరమున అతడు చోళసింహాసనము నధిష్ఠించెను. సుమారు అర్ధశతాబ్ది అతడు చోళసామ్రాజ్యమును ప్రజారంజకముగ, ప్రాచీనసంప్రదాయానుగుణముగ పరిపాలించెను.

వేంగిరాజపుత్రుడైన కులోత్తుంగుడు చోళసార్వభౌముడగుట ఎట్లు తటస్థించినది ? అను ప్రశ్నకు చరిత్రకారులు పలువిధముల సమాధానము చెప్పుచున్నారు.

పశ్చిమచాళుక్యులకు - చోళులకు మధ్య నడచిన వైరుధ్యము చరిత్రలో సుప్రసిద్ధము. చోళులకు వేంగిప్రభువులైన తూర్పుచాళుక్యులకు మధ్య జరిగిన వైవాహికసంబంధములు - రాజనీతిలో అంతర్భాగములే. తరతరాలనుండి వేంగి ప్రభువులు - చోళులు రాజనీతి బంధములచే వైవాహికబంధములచే కలిసి మెలసి యుండి పశ్చిమ చాళుక్యులతో అనేకయుద్ధములు సల్పిరి. వేంగిప్రభువులు విమలాదిత్యుడు - అతని సుతుడు రాజరాజనరేంద్రుడు - అతని సుతుడు రాజేంద్రుడు (కులోత్తుంగుడు) చోళచక్రవర్తుల అల్లుళ్ళే. చోళ వేంగి సామ్రాజ్యముల పొత్తు ప్రజలలో చరిత్రలో సుస్థిరరూపము దాల్చినది.

రాజరాజనరేంద్రునికి సవతితమ్ముడైన విజయాదిత్యుని పశ్చిమ చాళుక్యులు బలపరచుట, వేంగిమండలమునందు జరిగిన పోరాటములు - చరిత్రలో చర్విత చర్వణములు. కొన్ని - సమయుద్ధములు. తరచు విజయలక్ష్మి ఊయెల ఊపుగా వినోదించినది. ఏడవ విజయాదిత్యుడు క్రీ. శ. 1031 సంవత్సరమున బెజవాడలో పట్టాభిషిక్తు

డయ్యెను గాని రాజరాజనరేంద్రుడు చోళుల సాయముననే వేంగిని పరిపాలించగల్గెను.

పశ్చిమచాళుక్యచరిత్రగూడ వేంగియుద్ధముల నభివర్ణించు చున్నది. బిల్హణకవి, విక్రమాంకదేవచరిత్రము, యువరాజు విక్రమాదిత్యుని వేంగివిజయము విపులముగ వర్ణించెను. కార్యఖడ్గనిపుణుడుగ దక్షిణాపథచరిత్రలో కీర్తికెక్కిన సోమేశ్వరుని అవసానకాలమున పుత్రుడైన విక్రమాదిత్యుడు వేంగివిజయయాత్రానంతరము చక్రకూటమును జయించి, కృష్ణాతీరమున విడిసియున్నట్లు చెప్పబడినది. జయగోండారు కవి వ్రాసిన తమిళ గ్రంథము "కళింగత్తుప్పరాణి" లో గూడ యువరాజు కుళోత్తుంగునకు విక్రమాదిత్యునకు మధ్య యుద్ధము జరిగిన సూచన గలదు. కుళోత్తుంగునకుగల "విరుదరాజ భయంకర" బిరుదము అర్థవంతమైనది. ఈ సంఘటనలు క్రీ. శ. 1067 ప్రాంతము నాటివి. అప్పుడు వీరరాజేంద్రుడు వేంగిపక్షముననే యుండి యథాపూర్వము సాయము సల్పెనని యెంచవచ్చును.

కాని - తరువాత పరిస్థితులు తారుమారైనవి. విక్రమాదిత్యుడు విజృంభించి అనేక విజయములు సాధింప గల్గెను. చోళచక్రవర్తి వీరరాజేంద్రుడు విక్రమాదిత్యునితో సంధి చేసికొని - అతనికి తన కుమార్తె నిచ్చి వివాహ మొనరించెను. తరతరాల నుండి చోళ (పశ్చిమ) చాళుక్యుల మధ్య రేగుచున్న యుద్ధాగ్ని జ్వాలలు తాత్కాలికముగ చల్లారినవి. పశ్చిమచాళుక్యులకు చోళప్రభువు తల యొగ్గుట చోళదండనాథులు పలువురు సహింపలేకపోవుట సహజము. వేంగిమండలము, సంకటసన్నివేశమున చిక్కుకొనది. చోళచక్రవర్తి వీరరాజేంద్రునకు క్రొత్త అల్లుడు విక్రమాదిత్యునిపై మోజు ఉండవచ్చునేగాని, ప్రజలకు చిరకాలము కష్టసుఖములలో పాలుపంచుకొనినట్టి చోళుల పాతఅల్లుడు వేంగిరాజు కులోత్తుంగునిపై అభిమానము

పోలేదు. అంతవరకు ఏడవవిజయాదిత్యునితో యుద్ధములు సల్పిన కులోత్తుంగుడు విస్సహాయుఁ డయ్యెను. వీరవిజయాదిత్యుడు విజయాదిత్యుని వేంగిప్రభువుగ అంగీకరించెను. కులోత్తుంగుడు, తన పుత్రునకు చెప్పిన మాటలు స్మర్తవ్యములు. "నా యౌవనమున నేను సమర క్రీడారతుడనై, వేంగిపాలనమును నా పినతండ్రి (ఏడవ) విజయాదిత్యునకు వదలి పెట్టినాను." కులోత్తుంగుడు ఆ నాడు పరిస్థితులకు తప్పనిసరిగ తలయొగ్గవలసి వచ్చినట్లు, పై వాక్యమున కర్థము చెప్పవలయునే గాని ఆతనికి అమాంతముగ పినతండ్రిమీద అనురాగము గాని, సంగరక్రీడాసమధికకౌతూహలముగాని అంకురించినదని అనుకొనక్కరలేదు.

చోళచక్రవర్తి వీరరాజేంద్రుని మరణముతో మరల పరిస్థితులు తారుమారైన. అసంతుష్టుడైన పాతఅల్లుడు కులోత్తుంగుడు చోళ రాజ్యమున అశాంతి రేకెత్తించుటకు విశ్వప్రయత్న మొనరించి యుండునని కొందరు చరిత్రకారులు ఊహించుచున్నారు. కాని ఈ ఊహ నిరాధారమైనదిగనే తోచుచున్నది. మామగారు మరణింపగనే, క్రొత్తఅల్లుడు విక్రమాదిత్యుడు వచ్చి, బావమరదియైన అధిరాజేంద్రుని చోళసింహాసనమెక్కించి పరిస్థితులను చక్కదిద్దెను. కాని - విక్రమాదిత్యుడు గృహోన్ముఖుడై తుంగభద్రను చేరెనో లేదో చోళరాజ్యము అల్లకల్లోలమై అచట విప్లవము చెలరేగినది. అధిరాజేంద్రు డా విప్లవమున అసువుల గోల్పోయెను. ఆ అరాజకపరిస్థితులు కులోత్తుంగునకు అనుకూలించినవి. మాతామహసింహాసనము నతడు సులభముగ అధిరోహింపగల్గెను.

ఈ విప్లవమున కులోత్తుంగుడు ధరించిన భూమిక యెట్టిది? అధిరాజునకును కులోత్తుంగునకు మధ్య చోళసామ్రాజ్యమున అంతర్యుద్ధము జరిగినదా? శాసనాధారమునుబట్టి అట్టి అంత

ర్యుద్ధము జరిగినట్లు చెప్పలేము. కులోత్తుంగుని శాసనము లతడు చోళసామ్రాజ్యమును అరాజకత్వమునుండి ఉద్ధరించినట్లు వర్ణించు చున్నవి. ఏకాంతవాసములో కృశించి కుములుచున్న భూకాంతను - కావేరీ మేఖలావలయిత రాజ్యలక్ష్మి నతడు కిరీటధారియై చేపట్టినట్లు శాసనకథనము. జయకొండారుకవి కులోత్తుంగుడు సింహాసన మధిష్ఠించుటకు పూర్వమేర్పడిన అరాజకత్వమును కన్నులగట్టినట్లు అభివర్ణించెను.

"యజ్ఞయాగాదులు అడుగంటినవి. మనుధర్మము నశించినది. షట్ఛాస్త్రములు విస్మృతిలో లీనమైనవి. వేదపారాయణమునకు స్వస్తి చెప్పబడినది.

"వర్ణసాంకర్య మేర్పడినది. దేవాలయములు పాడయినవి. పాతివ్రత్యధర్మ మడుగంటినది. దుర్గములు శిథిలములైనవి. కలికాల మిట్లు విజృంభించుచుండగా, అభయుడు ఉదయభానునివలె అవతరించి ధర్మసంస్థాపనము గావించెను. చతుర్వేద పారాయణ ధ్వనులు చతురంబోధి నిస్వనములు మిన్నుముట్ట కులోత్తుంగుడు సింహాసన మధిష్ఠించెను."

కవితాసహజమైన అతిశయోక్తులలో అంతర్వాహినియైన చారిత్రక సత్యము, జయగొండారుకవి వర్ణనలో గోచరించుచునే యున్నది. కులోత్తుంగుడు సింహాసనారూఢుడగు నప్పటికి చోళసామ్రాజ్యము విప్లవాగ్నిలో చిక్కుకొని యుండెను. సింహళము స్వతంత్రమైనది దక్షిణమున సామంతులు స్వతంత్రులైరి. కులోత్తుంగుడు ప్రప్రథమమున శాంతిభద్రతలను తిరిగి నెలకొన్పుటకు తన శక్తియుక్తులను కేంద్రీకరించెను.

## విక్రమాదిత్యునితో యుద్ధము

అధిరాజేంద్రుని బావమరది, రెండవ సోమేశ్వరుని పుత్రుడు విక్రమాదిత్యుడు కులోత్తుంగునకు సహజశత్రువు - మొదట అతనితో

యుద్ధముతప్పలేదు - విక్రమాదిత్యుడు రెండవసోమేశ్వరుని మొదటి పుత్రుడు కాడు. వీరరాజేంద్రునితో సంధి చేసికొని చోళరాజకన్యకను వివాహమాడి విక్రమాదిత్యుడు అన్నగారగు మూడవ సోమేశ్వరుని రాజ్యభ్రష్టుని చేయ సంకల్పించుకొనెను. కులోత్తుంగుడు మూడవ సోమేశ్వరునితో చేతులు గలిపి విక్రమాదిత్యునిపై పగ సాధింప నెంచెను.

బిల్హణకవి 1 కథనము అనుశీలింపదగినది. "చోళరాజపుత్రుడు- సింహాసనమధిష్ఠించిన అచిరకాలములోనే ప్రజల తిరుగుబాటులో అసువులను గోల్పోయెను. అదృష్టవశమున వేంగిప్రభువు- రాజిగుడు సింహాసనము నాక్రమింపగల్గెను. ఆ కుటిలుడు విక్రమాదిత్యునివలని ప్రమాదమునకు వెరచి, దాయాదివైరమును రేపుటకు సోమదేవునితో చేతులు గలిపెను. సోమదేవుడు- కుటుంబశత్రువైన చోళరాజిగునితో చేతులు కలుపుటకు ఉదారమానసుడైన విక్రమాదిత్యుడు చేసిన నేరమేమి? చోళరాజిగునిపై విక్రమాదిత్యుడు దండెత్తినపుడు సోమదేవుడు- వెనుపోటు పొడిచి సహోదరసైన్యముల నెదుర్కొనెనే !"

విక్రమాదిత్యుని పక్షమున దేవగిరిప్రభువు, హొయసాల సామంతుడు ఎఱియంగుడు, త్రిభువనమల్ల పాండ్యుడు కదంబప్రభువు జయకేశి పోరాడిరి. బిల్హణుని కథనము ప్రకారము యుద్ధమున విక్రమాదిత్యుడు విజయము నార్జించెను. ద్రవిడ ప్రభువు పరాజితుడై పారిపోయెను. సోమేశ్వరుడు పట్టుబడి కారాగృహమున బందీకృతుడయ్యెను. స్వప్నమున శివుడు ప్రత్యక్షమై సింహాసనము నధిష్ఠింపుమని ఆదేశించుటచే విక్రమాదిత్యుడు చక్రవర్తి యయ్యెను. అతని తమ్ముడు

---

1. బిల్హణుని శ్రీరంగనీతులను బుహ్లరు నిరసించెను. చోళులు కుటుంబ శత్రువులు. నిజమే. అయిన చోళరాజకన్యకను వివాహమాడినదని విక్రమాదిత్యుడే కద, అది రాజనీతి.

జయసింహుడు బనవాసికి రాజప్రతినిధి యయ్యెను. దిగ్విజయ యాత్రానంతరము రాజధాని కల్యాణిలో విక్రమాదిత్యుడు పట్టాభిషిక్తు డయ్యెను.

చోళచారిత్ర కాధారములను బట్టి పశ్చిమచాళుక్యులకు చోళులకు మధ్యజరిగిన ప్రధాన సంగ్రామము క్రీ. శ. 1076 సంవత్సర ప్రాంతము. అందు విక్రమాదిత్యుడు పరాభూతుడయ్యెనని, కళింగత్తు ప్పరాణి వర్ణన. అళత్తి మణలూరు యుద్ధరంగములలో విక్రమాదిత్యు నోడించి, అనేకమత్తేభయూథముల కులోత్తుంగుడు లోగొనెనని అందు గలదు.

కులోత్తుంగుడు పశ్చిమచాళుక్య చక్రవర్తి విక్రమాదిత్యునితో యుద్ధములు సల్పుచున్న తరుణమున, సింహళమున విజయబాహు ప్రభువు, సింహళచక్రవర్తినని ప్రకటించు కొనెను. విక్రమాదిత్యు డతనికి రాయబారులతో పాటు కానుకల నంపెను.

కులోత్తుంగుడు చోళసామ్రాజ్య సింహాసన మధిష్ఠించు నాటికి వేంగిని విజయాదిత్యుడు (VII) పరిపాలించుచుండెను. కులోత్తుంగుడు కుమారుడైన రాజరాజుతో తాను యౌవనమున సమరక్రీడాసక్తుడై వేంగిరాజ్యమును పినతండ్రికి స్వచ్ఛందముగ వదలినట్లు చెప్పుకొనెను. అప్పటి రాజ్యాంగపరిస్థితులలో ఆకస్మికమైన మార్పులను అనుశీలించిన, కారణాంతరముల చే కులోత్తుంగుడు విజయాదిత్యుని వేంగిపరిపాలనము నంగీకరించి యుండునని ఊహింప వచ్చును. విజయాదిత్యుడు గూడ సంధికి సమ్మతింప వలసిన పరిస్థితులు. అతనికి పశ్చిమచాళుక్యుల సాయము విక్రమాదిత్యుడు రాజేంద్రుని పుత్రికను వివాహమాడి నప్పటినుండి సందేహాస్పదమైనది. పిమ్మట చోళరాజ్యమున విప్లవము. కులోత్తుంగుడు వేంగిని తనకు వదలిన, తాను కులోత్తుంగునకు సాయము చేయవచ్చును. అప్పటికి అతని యేకైకసుతుడు మరణించి

యుండెను. తరువాత వేంగిని గూడ, కులోత్తుంగుడే వారసుడుగ ఏల వచ్చును. సంధిషరతులేవైన, వేంగిని పినతండ్రియైన విజయాదిత్యుడు పరిపాలించుటకు కులోత్తుంగుడు సమ్మతించి యుండెననుట నిర్వివాదాంశము.

ఈ పరిస్థితులలో త్రిపురీపాలకుడు యశఃకర్ణదేవుడు ఉత్తరము నుండి వేంగిపై దండెత్తెను. అతని శాసనములు క్రీ. శ. 1072-3 నాటివి దక్షారామమున గలవు. యశఃకర్ణదేవుడు ఆంధ్రదేశాధీశ్వరుని జయించి, భీమేశ్వరునకు మణిభూషణాదుల దానము చేసినట్లున్నది. అప్పటి వేంగిపాలకుడు (సప్తమ) విజయాదిత్యుడనుట నిస్సందేహము. ఈ దండయాత్రలో పశ్చిమచాళుక్యుల పాత్ర యెట్టిదో తెలియదు. కులోత్తుంగుడు (సప్తమ) విజయాదిత్యునికే పరాభవము జరుగుట లోలోపల యిష్టపడి యూరకుండెనా? చెప్పలేము. యశఃకర్ణదేవుని దండయాత్ర తాత్కాలికమైనదేగాని దాని వలన, పేర్కొనదగిన ఫలితము లెవ్వియు కానరావు.

## సింహాళము

వీరరాజేంద్రుడు రాజ్యమునకు రాకపూర్వమే సింహాళరాజపుత్రుడు కిత్తి, విజయబాహు బిరుదాంకితుడై క్రీ. శ. 1058 సంవత్సరమున (అతని 17 రాజ్యసంవత్సరమున) రోహణమును స్వతంత్ర రాజ్యముగ రూపొందించెను. చోళరాజ్యము సింహాళమున ఉత్తరమున రాజరట్టమున మాత్రము మిగిలియుండెను. క్రీ. శ. 1070 సంవత్సరము వరకు పొలొన్నరువలో చోళశాసనములు కన్పించుచున్నవి. క్రీ. శ. 1073 లో విజయబాహు అనూరాధపురమును జయించెను. క్రీ. శ. 1083 సంవత్సర ప్రాంతమున కులోత్తుంగుడు ఇంకొకసారి సింహాళమును చోళరాజ్యమును పునరుద్ధరించుటకు యత్నించెను. కాని

విజయము విజయబాహువునే తిరిగి వరించినట్లు సింహళరాజవంశ చరిత్ర మహావంశమునందు కలదు. కులోత్తుంగుని పుత్రిక సూరియ వల్లియార్, పాండ్యపక్షీయుడైన సింహళరాజపుత్రుని భార్యయై, (ప్రథమ) జయబాహు రాజ్యకాలమున ఈశ్వరాలయమున శాశ్వత దీపారాధన దానమును సల్పినట్లు శాసనసాక్ష్యమున్నది. జయబాహువు విజయబాహుని కుమారుడు.

కులోత్తుంగుడు పాండ్య చేర రాజులతో గూడ అనేక యుద్ధములు సలుప వలసి వచ్చెను. చిదంబరమున గల సంస్కృతశాసనమున ఆతడు పంచపాండ్యులను జయించి ఖాండవదహనము గావించిన అర్జునునివలె కోత్తారు దుర్గమును దహించి కేరళ దుర్గముల ననేకములుస్వాధీనమొనర్చుకొని పశ్చిమసముద్రతీరమున జయ స్తంభమును నెలకొల్పిన వృత్తాంతము గలదు. జయగొండారు కవి గూడ కులోత్తుంగుని పాండ్యవిజయము నభివర్ణించెను. మత్స్యయంత్రమును కొట్టి (పాండ్యరాజలాంఛనము) చేరరాజుల విల్లువిరిచి శాలైతీరమున శత్రునౌకలను ధ్వంసమొనర్చె నను ప్రశంస పలుతావులలో గానవచ్చుచున్నది- అయినను, కులోత్తుంగుడు పాండ్యరాజ్యము నేలినట్లు చెప్పలేము. ఆతడు పాండ్యప్రభువుల యొద్దనుండి కప్పమును గైకొని సంతృప్తి పడియుండును.

వీరరాజేంద్రుడు క్రీ. శ. 1068 సంవత్సరమున కదారము (శ్రీ విజయ)కు సేనను పంపినట్లు చెప్పుకొనెను. క్రీ.శ. 1090 ప్రాంతము శ్రీ విజయము నేలిన రాజు కులోత్తుంగుని కడకు రాయబారుల నంపించెను. శోళకులవల్లి పట్టినము (నాగపట్నము) దగ్గర రెండు బౌద్ధవిహారములను నిర్మించుటకు సంబంధిచిన వృత్తాంతము పేర్కొన దగినది. శ్రీ విజయరాజు అభ్యర్థనపై కులోత్తుంగుడు రెండువిహారములను (రాజరాజప్పెరుంబల్లి, రాజేంద్ర సోళప్పెరుంబల్లి) కట్టించెను.

శ్రీ విజయనుండి వచ్చినది ఇద్దరు రాయబారులు రాజవిద్యాధర శ్రీ సామంతుడు, అభిమనోత్తుంగసామంతుడు, కులోత్తుంగమహారాజు, ఆహవమల్లకుల కాలపురములో, అభ్యంజన మందిరమున తిరుమంజన శాలయందు కాళింగరాయ సింహాసనము నధిష్ఠించి యున్నప్పుడు 'విన్నపము' నందించిరి. సుమిత్రాద్వీపమునందలి లోబోతోవాయందలి శిథిలతమిళశాసనమొకటి క్రీ. శ. 1088 నాటిది తిశై యాయిరత్తు ఐఞ్ఞూత్తువార్ ను పేర్కొనుచున్నది. ఇది చోళసామ్రాజ్యమందలి వర్తకసంఘమున గుర్తింపనగును.

వేంగిమండలమును (సప్తమ) విజయాదిత్యుడు మరణించు వరకు పరిపాలించెను. కులోత్తుంగునకు విజయాదిత్యునకు పైపైన పొత్తుకుదిరినను లోలోపల మనస్తాపములు మాయలేదు. తూర్పు గాంగుల శాసనములను బట్టి రాజరాజు విజయాదిత్యుని పక్షమున కులోత్తుంగుని ఎదిరించి ఉభయులకు పొత్తుకల్పినట్లు తెలియుచున్నది. రాజరాజుభార్య రాజసుందరి కులోత్తుంగుని కూతురే. కులోత్తుంగుడు కూతురును రాజరాజునకును, వేంగిని విజయాదిత్యునకు నిచ్చి సంధి కుదుర్చుకొనెనేమో! విజయాదిత్యుని తదనంతరము వేంగి తనకే వచ్చును- అప్పుడు అల్లుడైన రాజరాజు దానికి అంగీకరింపక తప్పదని కులోత్తుంగుని రాజనీతి కావచ్చును. కళింగరాజ్యము వేంగికి ఉత్తరపు సరిహద్దు. అచ్చట మిత్రరాజ్యముండుట మిక్కిలి వాంఛ నీయము. వేంగిమండలము శాంతిభద్రతలతో వర్ధిల్లుటకు అవకాశ మేర్పడును. పదునైదు వత్సరములు పరిపాలించిన పిమ్మట సప్తమ విజయాదిత్యుడు మరణించిన పిమ్మట, కులోత్తుంగుడు తన పుత్రుడైన ముమ్మడి చోడదేవుని వేంగిపాలకుడుగ నియమించెను. నూతన రాజప్రతినిధిగ ఆ రాజపుత్రుడు క్రీ. శ. జూలై 27 వ తేదీ 1076 వ సంవత్సరమున అభిషిక్తుడయ్యెను. కాని, అతడు సంవత్సరము దాటకుండ

గనే ఆ రాజపుత్రుడు వేంగిని వదలి, చోళరాజధానిని చేరుకొనెను. అతని తరువాత అతని తమ్ముడు వీరచోడదేవుడు రాజప్రతినిధియై వేంగిని ఆరుసంవత్సరములు పాలించెను. క్రీ. శ. 1084 నుండి 1089 వరకు, కులోత్తుంగుని పుత్రుడింకొకడు రాజరాజచోడగంగుడు వేంగికి రాజప్రతినిధిగ పాలించెను. క్రీ శ. 1089 నుండి క్రీ. శ. 1093 వరకు తిరిగి వీరచోడుడే వేంగిమండలమున రాజప్రతినిధిగ నుండెను. వీరచోడుని తరువాత విక్రమచోళుడు వేంగిని క్రీ. శ. 1118 వరకు పరిపాలించెను.

చోడగంగుడు - కులోత్తుంగుని అగ్రసుతుడైనను, వేంగిని సమర్థతతో పరిపాలించినట్లు తోచదు. తొలుతనే అతనికి రాజప్రతినిధిత్వము లభింపలేదుగూడ. కులోత్తుంగుడు తన అనంతరము సింహాసన మధిష్ఠించుటకు రాజపుత్రులలో విక్రమచోళుని ఎన్నుకొనెను. వీరచోడుడు వేంగిపాలకుడుగ నున్నప్పుడు, వెలనాటి రాజపుత్త్రుడు (రెండవ) విదురుడు (మొదటి) గొంకరాజు యొక్క సోదరసుతుడు అతనికి బాసటయై, పాండ్యరాజు నెదిరించుటకు తోడ్పడెను. అందుచే వీరచోడు డతనికి సింధు యుగ్మాంతరదేశమును (కృష్ణా గోదావరీ మధ్యప్రదేశమని హుల్ట్జు అభిప్రాయము) వీరభృతిగ నొసంగెను.

విక్రమచోళుడు యువరాజుగ వేంగిని పరిపాలించు సమయమున అతడు కళింగమును జయించినట్లు శాసనప్రశంస గన్పించుచున్నది.

కులోత్తుంగుడు కళింగముపై రెండుపర్యాయములు దండయాత్ర జరిపెను. రెండవ దండయాత్ర జయన్‌గొండారు కవి కావ్యమునకు ఇతివృత్తమైనది. మొదటి దండయాత్ర కులోత్తుంగుని 26 వ రాజ్య సంవత్సరము నాటిది. విక్రమచోళు డా యుద్ధమునందే విజయము సాధించెను. రెండవ కళింగ సంగ్రామము 42 వ రాజ్యసంవత్సరము తరువాతిది. అందు విక్రమచోళుడు పాల్గొనలేదు.

గోదావరికి ఉత్తర ప్రదేశమునకు దక్షిణకళింగమని పేరు. పరాంతకపాండ్యుడు తెలుంగుభీముని జయించి నట్లు చెప్పుకొనెను. తెలుగు సామంతుల తిరుగుబాటును విక్రమచోళుడు అణచియుండునని ఊహింపవచ్చును. క్రీ. శ. 1098 లో సింహాచలమున కులోత్తుంగుని శాసనమున్నది. ఆ కాలమున అతని శాసనములు దాక్షారామమున గూడ గలవు. అందుచే వేంగిమండలము దక్షిణకళింగముగూడ కులోత్తుంగుని ఏలుబడిలో నుండె ననుట నిస్సందేహము.

రెండవ కళింగ దండయాత్ర క్రీ. శ. 1110 సంవత్సరము నాటిది. కళింగత్తుప్పరణిలో సవిస్తరముగ వర్ణింపబడినది. శాసనాధారములనుబట్టి, చోళసైన్యము వేంగిమండలము నతిక్రమించి ఎదురైన మత్తేభయోధముల నిర్మూలించి, సప్తకళింగములను జయించినట్లు తెలియుచున్నది. కళింగత్తుప్పరణిలో హృద్యమైన కథ గలదు.

చోళసార్వభౌముడు కులోత్తుంగుడు కాంచిలో కొలువు దీర్చియుండ, కప్పములు గొనివచ్చిన సామంతరాజులను ద్వారపాలకుడు ప్రవేశపెట్టుచుండెను. సామంతులు కప్పములు చెల్లించి అభివాదములు సలిపి నిలువగ, సార్వభౌముడు కప్పములు చెల్లించుటకు రానివారెవరని ప్రశ్నించెను. కళింగాధిపతి రెండు సంవత్సరములనుండి కప్పము చెల్లించుటకు రాలేదని తెలిసినది. వెంటనే కళింగదండయాత్రకు సన్నాహములు జరుగవలెనని కళింగాధిపతిని బందీకృతుని చేసి తీసికొనిరావలెనని చోళరాజాజ్ఞ యైనది. సామంతులు పల్లవరాజు కరుణాకర తొండైమానుడు (వండైప్రభువు) సేనాపతిగ కాంచి నుండి చోళసైన్యము కళింగదండయాత్ర కుపక్రమించినది. పాలారు స్వర్ణముఖి పెన్న, కృష్ణ, గోదావరి మున్నగు నదులు దాటి చోళ సైన్యములు కళింగములో ప్రవేశించి అనేకవిజయములు సాధించినవి.

కళింగాధిపతి అనంతవర్మ; అమాత్యుడైన ఎంగరాయని మాటలు పెడచెవిని బెట్టి చోళసైన్యము నెదిరించి ఓడిపోయెను.

చోళసైన్యము, పలాయనము సాగించిన అనంతవర్మను వెంబడించినవి గాని అతడు పట్టుబడలేదు. ఉత్తర కళింగరాజ్యమును కొల్లగొట్టిన ధనరాశులతో చోళసైన్యము రాజధానికి తరలి వచ్చినది. కరుణాకరుడు ఈ యుద్ధమున నిర్వహించిన పాత్రను శాసనములు ప్రశంసించినవి. కాని యీ కళింగదండయాత్రవలన శాశ్వతఫలితములు పేర్కొనదగినవి కానరావు. ఉత్తరకళింగమున కులోత్తుంగుని శాసనములు గన్పింపవు. క్రీ. శ. 1108 వ సంవత్సరమున కోటప్రభువు భీముడు కళింగవిజయమున చోళప్రభువుకు తోడ్పడినట్లు శాసనాధార మున్నది. కళింగాధిపతి అనంతవర్మ చోళరాజపుత్రిక రాజసుందరి పుత్రుడే. కులోత్తుంగున కాతడు దౌహిత్రుడే. బంధుత్వబంధములు రాజనీతిలో సులువుగ తెగిపోవు పట్టుదారములు.

కులోత్తుంగుని శాసనములు, అతని 45 వ రాజ్యసంవత్సరము నాటివి నందలూరు (కడపమండలము (కులోత్తుంగచోళ చతుర్వేది మంగలము అని అప్పటి పేరు) నందును, త్రిపురాంతకము (కర్నూలు మండలము) నందును లభించుటచే అతని రాజ్యము అంతవరకు విస్తరించి యుండెనని చెప్ప వచ్చును.

క్రీ. శ. 1116 సంవత్సరప్రాంతమున చోళులనుండి గంగవాడి మండలమును హొయసాలులు జయించిరి. హొయసాల దండనాయకుడు గంగరాజు తలక్కాడుక్షేత్రమున చోళసామంతులు అదియమ, దామోదర నరసింహవర్మల నోడించినట్లు చెప్పబడినది. హొయసాలులు పశ్చిమచాళుక్యులకు సామంతులై యుండుటచే (ఆరవ) విక్రమాదిత్యుడు వారిని చోళులపై దండెత్తుటకు ప్రోత్సహించి యుండెనని ఊహింపవచ్చును.

క్రీ. శ. 1084 సంవత్సరమున విక్రమాదిత్యుడు చోళులు రణక్షేత్రమునకు వచ్చుటలేదని ప్రకటించినాడు. హొయసాలులకేగాక అతడు వేంగిమండలమునగూడ సామంతులను చోళులపైకి పురికొల్పెను. విక్రమచోళుడు వేంగిని పరిపాలించు నప్పటి తెలుంగు భీముని తిరుగుబాటునకు - కళింగప్రభువు అనంతవర్మ ధిక్కారమునకు విక్రమాదిత్యుని ప్రోత్సాహము లభించి యుండును. క్రీ. శ. 1118 వ సంవత్సరమున వృద్ధుడైన కులోత్తుంగుడు వేంగి నుండి రప్పించి విక్రమచోళుని చోళసింహాసనమునకు యౌవరాజ్యపట్టము గట్టువరకు విక్రమాదిత్యుని యెత్తుగడలు ఫలింపలేదు.

క్రీ. శ. 1202 నాటి మల్లపదేవుని పిఠాపురశాసనము ఉదహరింపదగినది.

"అపూర్వపురుషుడు కులోత్తుంగ చక్రవర్తి 50 సంవత్సరములు ఆంధ్రదేశమును పంచద్రావిడములనేలి పరలోకగతుడైన పిమ్మట విక్రమశోలుడు చోళసింహాసనము నధిష్ఠించుట కేగెను. అప్పటి నుండి వేంగి మండలము "నాయకరహిత" మైనది."

కులోత్తుంగుని శాసనములు దాక్షారామమున క్రీ. శ. 1118 వరకు లభించుచున్నవి. విక్రమచోళుని శాసనములు వేంగిమండలమున క్రీ. శ. 1127 ముందు కన్పింపవు. క్రీ. 1127 తరువాతి శాసనములు గూడ దక్షిణవేంగి గుంటూరు మండలమున మాత్రమే లభించినవి. అంతేగాక విక్రమాదిత్యుని శాసనములు దక్షారామమున అతని 45, 46, 4‌?, 48 రాజ్యసంవత్సరములు పేర్కొనునవి చాల గలవు. క్రీ. శ. 1117 సంవత్సరము కాకతీయ ప్రోలరాజు, అనుమకొండ విషయము తండ్రి బేతరాజునకు వీరభృతిగ విక్రమాదిత్యు డొసగెనని శిలాశాసనమున చెప్పుకొనెను. (1) క్రీ. శ. 1118 సంవత్స

(1) 330 of 1893.

రమున గుంటూరు మండలము నందలి కొమ్మూరు శాసనమున విక్రమాదిత్యుని దండనాయకుడు అనంతపాలయ్య వేంగిమండలము 14000 లను పాలించుచున్నట్లు గలదు. (1) క్రీ. శ. 1120 ప్రాంతమున అనంతపాలుని భార్య దక్షారామభీమేశ్వరునకు దానము నల్పెను. పశ్చిమ చాళుక్యదండనాధుడు అనంతపాలుని సోదరపుత్రుడు క్రీ. శ. 1127 సంవత్సరమున కొండపల్లిని పాలించుచుండెను. (2) క్రీ. శ. 1132 వరకు దక్షారామమున చాళుక్య విక్రమశకమున శాసనములు కన్పించుచున్నవి. కులోత్తుంగుని కాలమున చోళసామ్రాజ్యము, సింహళమును గంగవాడిని, చివరకు వేంగిని గూడ కోల్పోయెను. వేంగిమండలమున అప్పటినుండి కాకతీయసామ్రాజ్యము విస్తరింపసాగెను. చోళరాజ్యము ఇంచుమించు తమిళ రాజ్య మయ్యెను.

## విక్రమ చోళుడు
### క్రీ. శ. 1120 నుండి 1137 వరకు

విక్రమచోళుడు చోళరాజ్యమును కులోత్తుంగుని అవసాన కాలమున కొంతకాలము యువరాజుగ పరిపాలించెను. క్రీ. శ. 1118 (జూన్ 29) అతడు యౌవరాజ్యాభిషిక్తు డయ్యెను. అతని ఆస్థానకవి ఒత్తకూ్కట్టన్ రచనల వలన ఆ నాటి చరిత్ర కొంతవరకు తెలియు చున్నది. 'విక్రమసోళన్- ఉళా' గాక ఆస్థానకవి కళింగదండయాత్రను గూర్చిన 'పరణి'గూడ రచించెను.

క్రీ. శ. 1118 వ సంవత్సరమున వేంగిలో రాజప్రతినిధి పదవి వదలి విక్రమచోళుడు రాజధానిని చేరిన పిమ్మట వేంగిని వెలనాటి గొంకరాజు (మొదటి) పుత్రుడైన వెలనాటి చోడరాజు జయించెను. కాని- పశ్చిమచాళుక్య విక్రమాదిత్యుడు (ఆరవ) వెలనాటి ప్రభువును

(2) 819 of 1922.
(3) 258 of 1905.

జయించి వేంగిని ఆక్రమించెను. కాని క్రీ. శ. 1126 సంవత్సరమున విక్రమాదిత్యుడు మరణించిన పిమ్మట క్రీ. శ. 1127 సంవత్సరమున కొల్లిపాక ప్రభువు మహామండలేశ్వర నంబయ (షట్సహస్ర దేశాధిపతి) విక్రమచోళునికి సామంతుడై యుండెను. నిడుబ్రోలు నందు క్రీ. శ. 1132 వ సంవత్సరమున వెలనాటి ప్రభువులు దక్షిణ చోళుల సామంతులైనట్లు శాసనము గలదు. (1) కాని, అప్పుడు కృష్ణకు ఉత్తరమున చోళుల ఆధిపత్యచిహ్నితములైన శాసనములు గానరావు. అందుచే వెలనాటిచోడులు పశ్చిమచాళుక్యుల ఆధిపత్యము నుజ్జగించి, యథాపూర్వము దక్షిణచోళులకు నామమాత్ర సామంతు లుగ నుండుటకే ఇష్టపడిరని యెంచవచ్చును.

విక్రమచోళుని పరిపాలనలో ఎన్నదగిన అంశము అతని నటరాజ భక్తి. చిదంబరమునందలి నటరాజాలయమునకు ఆ మహా రాజు తన బొక్కసములోని ధనములో చాలభాగము వెచ్చించెను. క్రీ. శ. 1128 వ సంవత్సరమున అతడు అశేష కనక రాసులను వెచ్చించి నటరాజునకు గోపురములు, ప్రాకారములు, వాహనములు, సువర్ణాభరణములు కల్పించెను. నటరాజు చోళరాజుల ఇలువేలుపు. రాజధానియైన గంగైకొండ చోళపురమునకు సమీపమున నుండుట గూడ కలిసివచ్చినది. చోళరాజులు ఆ ఆలయమును అనేకవిధముల అభివృద్ధిగావించిరి. కులోత్తుంగుని సేనాని, నరలోక వీరుడు నటరాజ భక్తుడై ఆలయమున ఎన్నియోకట్టడములను కట్టించియుండెను. విక్రమచోళుని కాలమున ఆకృషి పరాకాష్ఠ నందెను.

## (రెండవ) కులోత్తుంగుడు

క్రీ. శ. 1133 నుండి 1150 వరకు విక్రమచోళుడు (రెండవ) కులోత్తుంగుని యువరాజుగ క్రీ. శ. 1133 జూలై ప్రాంతమున

(1) 163 of 1897

పట్టాభిషక్తుని గావించెను. రెండేండ్లు రెండవకులోత్తుంగుడు తండ్రితో గలిసి చోళరాజ్యము నేలెను. పట్టాభిషేకము చిదంబరమునందే జరిగిన ట్లెంచవచ్చును. కులోత్తుంగ శోళన్ - ఉళాలో కులోత్తుంగుడు చిదంబ రాలయమున సల్పిన పునర్నిర్మాణములు అభివర్ణితములు. ఆలయ ప్రాంగణమునందలి గోవిందరాజ విగ్రహము నక్కడనుండి తొలగించి తన అకలంక శైవభక్తిని చాటుకొనెను. విక్రమచోళుని కాలముననే ప్రారంభింపబడి, పూర్తిగాని కట్టడములను కులోత్తుంగుడు పూర్తి చేయించెను.

రెండవకులోత్తుంగుడు ఏయుద్ధములు సల్పినట్లు నివర్శనములు లేవు. విక్రమచోళుని కాలమునందువలెనే వెలనాటిచోడులు దక్షిణ చోళుల అధిపత్యమునంగీకరించినట్లు అలనాటి శాసనములనుబట్టి ఊహింపవచ్చును. రాజధాని గంగైకొండచోళపురమే అయినను, కులోత్తుంగుని అభిమాననగరము చిదంబరమని చెప్పవచ్చును.

రెండవకులోత్తుంగుని కాలమున, సామంతులలో వర్ధమానులలో ఎన్నదగినవారు సెంగేణివారు. నాలాయరన్ అమ్మయ్యప్పన్ విక్రమ చోళుని కాలముననే సుప్రసిద్ధుడై యుండెను. అమ్మయ్యప్పన్ కణ్ణుడై ప్పెరుమాళ్ అను విక్రమసోళసాంబువరాయన్ అతని పుత్రుడు - వీరి నామాంతరములు తమ ఏలికల పేళ్ళను సూచించు చుండుట గమనార్హము.

రెండవకులోత్తుంగుని సామంతులలో పేర్కొనదగినవాడు మోహన్ ఆళక్కొల్కళ్ళ (కులోత్తుంగ - సోళక - కాదవలాయన్ అతని మారుపేరు) క్రీ. శ. 1136 సంవత్సరమున తిరుమణికుళి పాలకుడు. (1) అచిరకాలముననే ఈ కాదవ సామంతుని శాసనములు తిరునామనల్లూరు తిరునాడి వృద్ధాచలము లందు కన్పించుచున్నవి. క్రీ. 1140 సంవత్సరము

(1) 157 of 1902.

తిరుత్తొండీశ్వరున కతడు కనక భూషణములు రజత పాత్రల నమర్పించెను. (2) ఇంచుమించుగ నదే సమయమున మణిహారమును తిరువాడిలో నమర్పించెను. (3) ఆతని దానశాసనములనేకములు కన్పించుచున్నవి. క్రీ. శ. 1148 సంవత్సరమున అతడు వృద్ధాచలమున మండపమును నిర్మించెను. అప్పుడు అతని బిరుదునామములు ఆళప్పిరాండాన్ ఏళిశై మోహన్, కులోత్తుంగ శోళ కాడవల్ అది త్తన్.(4) ఈ సామంతవంశమునందే కోప్పెరుంజింగుడు ఉద్భవించినది. అతడు చోళసామ్రాజ్యమును కూకటి వేళ్ళతో కుదిపి చోళరాజ్యము అస్తమించుటకు కారకుడై నాడు.

క్రీ. శ. 1136 లో వెలనాటి చోడదేవుని రాణి బాపట్లలో దేవాలయమున దీపారాధనకు దానము నల్పెను. (5) క్రీ. శ. 1143 లో కొలను కాటమనాయకుడు ఒక ఊరును బ్రహ్మాదేయముగ దానము నల్పెను. నందలూరులో మధురాంతక పొత్తపిచోడ సిద్ధరసుని శాసనము గలదు. అందుచే దక్షిణచోళుల ఆధిపత్యమును–వేంగిమండలము నందు యథాపూర్వముగ – నామమాత్రముగ నైనను సామంతులు గుర్తించు చుండినట్లు ఎంచవచ్చును.

రెండవ రాజరాజు – రెండవ రాజాధిరాజు

క్రీ. శ. 1146 సంవత్సరము ఏప్రిలు 6 వ తేదిని రెండవ రాజరాజు యౌవరాజ్యపట్టాభిషిక్తుడై రెండవకులోత్తుంగునితో పాటు సుమారు 4 సంవత్సరములు పరిపాలించెను. తరువాత స్వతంత్రముగ చోళ రాజ్యము నేలెను. ఇతని కాలము గూడ శాంతియుతముగనే

(2) 374 of 1902.
(3) 391 of 1921.
(4) 137 of 1900.
(5) 182 of 1897.

గడచెను. మొదటి కులోత్తుంగుని అవసాన కాలమునందే చోళ రాజ్యవిచ్ఛిత్తి ఆరంభమైనదని చెప్పవచ్చును. పశ్చిమచాళుక్యులే గాక, హోయసాలులు గూడ విజృంభించిరి. కేంద్రప్రభుత్వాధికారము సన్నగిల్లి - క్రమక్రమముగ సామంతుల అధికారము ప్రబలసాగినది. కాదవ ప్రభువుల ప్రభావము అతిశయించినది. కులోత్తుంగ సోళన్ - కాదవరాయన్ - కూడలూర్ ఆళప్పిరాండాన్ మోహన్‌తో పాటు రాజేంద్ర సోలపల్లవర్ అదిత్తన్ కన్పించుచున్నాడు. కాంచీపురాధీశ్వర బిరుదాంకితుడైన రాజేంద్రసోల పల్లవర్ కోలారులో ఒక కొండపై దేవాలయమును నిర్మించెను.

రెండవ రాజరాజు తనకు పుత్రసంతానము లేకపోవుటచే విక్రమచోళుని మనుమడైన (పుత్రిక పుత్రుడైన) (రెండవ) రాజాధిరాజును యువరాజుగ స్వీకరించి అతని క్రీ. శ. 1163 సంవత్సర ప్రాంతమున యౌవరాజ్యాభిషేకము సల్పెను. రెండవరాజరాజు క్రీ. శ. 1173 వరకు రాజ్యము చేసెను. రెండవ రాజాధిరాజు యువరాజుగ నుండగనే పాండ్యదేశమున అంతర్యుద్ధముఆరంభమై దక్షిణభారతమును కుదిపి వేసినది. ఈ యుద్ధములందు ప్రముఖ భూమిక ధరించినది రెండవ రాజాధిరాజే. పాండ్యదేశమునందలి అంతర్యుద్ధము - అటు - సింహళ చోళప్రభువులు ధరించిన భూమికలు - అలనాటి రాజనీతి - ఆ రాజకీయచతురంగము నందలి యెత్తుపై యెత్తులు ఏపక్షమునకును గౌరవము నొనగూర్చునవిగ గన్పట్టవు. ఆ చరిత్రను అనుశీలించిన "ఆహా! ప్రభువులు; పాపము! ప్రజలు" అనిపించును. ఈ ఉదంత పర్యవసానము ఒక విచిత్ర విరోధాభాసముగ పరిణమించినది.

సింహళ చోళరాజ్యములు రెండును యుద్ధాగ్ని జ్వాలలలో చిక్కుకొని మాడి మసియైనవి. చివరకు పాండ్యరాజ్యము విజృంభించి అటు సింహళము ఇటు చోళరాజ్యమును గూడ కబళించి దక్షిణ భారతమును గడ గడ లాడించ గల్గినది.

పాండ్యరాజ్యమున చోళుల ప్రభావము రెండవ రాజాధిరాజు[1] వరకు మృగ్యము. పాండ్యులు స్వతంత్రులై శాసనములను వేసిరి. చోళరాజుల శాసనమొక్కటిగూడ మొదటి కులోత్తుంగుని పిమ్మట పాండ్యరాజ్యమున కన్పింపలేదు.

రాజాధిరాజు యువరాజుగ నున్నప్పుడు పాండ్యదేశమున అంతర్యుద్ధ మారంభమైనది. ఈ వృత్తాంతము 'మహావంశము' నందును గన్పట్టుచున్నది. క్రీ. శ. 1169 సంవత్సరమున కులశేఖరుడు మధురపై దండెత్తెను.

మహావంశమునం దీ యుదంతమునందలి తొలిఘట్టము వర్ణింప బడినది.

మధురాధిపతి పరాక్రమపాండ్యుడు సింహళ దేశాధీశ్వరుడు మొదటి పరాక్రమ బాహువు సాయము నర్థించెను. కులశేఖరుడు చోళుల సాయమును వేడెను. ఫలితముగ సింహళచోళరాజ్యముల ప్రాచీనవైరము పునః ప్రజ్వరిల్లినది.

సింహళప్రభువు వీరపాండ్యునికి సాయ మొనరించుటకై లంకాపురదండనాథుని సైన్యసమేతముగ పంపించెను. కాని ఆ దండ నాథుడు పాండ్యదేశమును చేరక ముందే కులశేఖరుడు మధురను జయించి పరాక్రమ పాండ్యుని- అతని రాణిని, పుత్రులను తిరిమలక్కో అనుచోటనంహరించెను. ఆవార్త వినగానే పరాక్రమబాహువు, లంకాపుర దండనాథుడు యుద్ధమును కొనసాగించి పాండ్యరాజ్యమును పరాక్రమ పాండ్యుని వారసులకు అప్పగింప వలెనని కోరెను. లంకాపుర దండనాథుడు రామేశ్వర సమీపమునందలి కుండుకల వద్ద సైనిక స్థావరము నేర్పరచుకొని యుద్ధము కొనసాగించెను. యుద్ధమున దొరికిన తమిళభటులు సింహళమున, పూర్వకాలమున తమిళులచే పాడుచేయబడిన బౌద్ధవిహారములను తిరిగి బాగుచేయుటకై వినియో

గింప బడిరి. పరాక్రమ పాండ్యుని పుత్రుడు వీరపాండ్యుడు మారణ హోమమునుండి తప్పించుకొని, బయటు పడిన సంగతి కలవరము రేకెత్తించెను. మధురాసమీపమున లంకాపుర దండనాథుని సేనలతో వీరపాండ్యుడు వచ్చి చేరెను. చాల కాలము అనేకయుద్ధములు జరిగినవి. స్థానికసామంతులు పలుసారులు ఇటు నటు పక్షములుమార్చి పోరాటములందు పాల్గొనిరి. కులశేఖరుడు చోళసైన్యములతో వచ్చి పోరాడినట్లును, రామనాడుమండలము నందలి కేరళనిళై వద్ద జరిగిన యుద్ధమున లంకాపురదండనాథు డాయుద్ధమున విజయము సాధించి వీరపాండ్యునకు పట్టముగట్టి నట్లు మహావంశకథనము.

కాని - కథ అంతటితో ఆగిపోలేదు. రాజాధిరాజు అరప్పాక్కం శాసనమునుబట్టి సింహళ సేనలు కులశేఖరుని ఓడించి మధురనుండి తరిమివేసినట్లు తెలియుచున్నది.

సింహళ సేనలు అంతటితో ఆగక చోళమండలము నందలి సింహళసైన్యము లొంగిపోవుటకు శివభక్తుడైన తొండి, పాశి సామంతులపై దండెత్తినవి. శివద్రోహులైన స్వామిదేవుడు 28 రోజులు తపశ్చర్య సల్పెను. ఏమైన, ఆ సమయమున సింహళ సైన్యము ఓడిపోయినది. చోళసామంతుడు సాంబువరాయన్, స్వామి దేవునకు అరప్పాక్కం గ్రామమును దానము సల్పెను. పల్లవ వరాయస్‌పేట్టై శాసనము రాజాధిరాజు 8 వ సంవత్సరము నాటిది మరికొన్ని అంశముల నిచ్చుచున్నది. కులశేఖరుడు ఓడి మధురను వీడి వచ్చి చోళుల శరణు వేడెను. చోళరాజు కులశేఖరునకు సాయము చేయుటకై పల్లవరాయని పెద్దసైన్యము నిచ్చి పంపించెను. లంకాపుర దండనాయకుని సంహరించి మధురాపురీ దుర్గద్వారమున కపాల తోరణము కట్టవలెనని చోళరాజాజ్ఞ.

పల్లవరాయుడు లంకాపురీదండనాథుని - అతని అనుచరులను సంహరించి మధురాపురమున వారి తలలతో కపాలతోరణమును

గట్టించెను. చోళసైన్యమునకు సింహళరాజపుత్రుడు శ్రీవల్లభుడు (పరాక్రమబాహువు దాయాది-సింహళసింహాసనమునకు తానేసరియైన వారసుడనని వాదించుచున్నవాడు) తోడ్పడెను. లంకాపురీదండనాథుని వధానంతరము చోళసైన్యములు శ్రీవల్లభుని నాయకత్వమున సింహళముపై దండెత్తినవి. పలుయుద్ధములు జరిగినవి. అన్నం పల్లవరాయుడు సింహళమునుండి అశేషధనరాసులతో తిరిగి వచ్చెను. పరాక్రమబాహువు, శ్రీవల్లభునితండ్రి మానభరణునితో పోరి సతమతమై అనేకకష్టనష్టములకు గురియై యుండెను. సమయానుకూలముగ, పరాక్రమబాహువు తన రాజనీతితో క్రొత్తయెత్తు వేసెను. అతడు పరాక్రమపాండ్యుని వంశమును బలపరచుట మాని కులశేఖరుతోని సంధి చేసికొనెను. కులశేఖరుడు కృతఘ్నుడై, చోళులను వదలి, పరాక్రబాహువుతో చెలిమి చేసెనని చోళశాసనము లధిక్షేపించు చున్నవి. కులశేఖరుడు మధురనుండి చోళులను తరిమివేయుటేగాక, కపాలతోరణమునుండి లంకాపురి తలను తొలగించెను. దానికి రాజాధి రాజు ఆగ్రహించి, కులశేఖరుని తొలగించి వీరపాండ్యుని మధురాపురీ సింహాసనమున నిలుపునట్లు అన్నం పల్లవరాయని ఆజ్ఞాపించెను. అన్నం పల్లవరాయని సాయముతో వీరపాండ్యుడు కులశేఖరు నోడించి మధుర సింహాసనము నధిష్ఠించెను. కాలచక్రభ్రమణము అద్భుతావహమైన దనిపించును. ఇంతేగాక, కులశేఖరుని వారసులు తిరిగి చోళుల సాయముతో మూడవకులోత్తుంగుని కాలమున తిరిగి మధురనాక్ర మించుట కాలచక్రభ్రమణ మాహాత్మ్యము నుగ్గడించును. పాండ్య రాజ్యమునందలి అంతర్యుద్ధము క్రీ.శ. 1169 నుండి క్రీ.శ. 1177 వరకు సాగినట్లు మహావంశమును బట్టి, స్థానికశాసనములనుబట్టి ఎంచ వచ్చును. రాజాధిరాజు మూడవకులోత్తుంగునకు క్రీ. శ. 1178, జులై 6 వ తేదీ లేదా 8 వ తేదీని యౌవరాజ్య పట్టాభిషేకము గావించి అతనిని తన తరువాత సింహాసనమునకు వారసునిగా ప్రకటించెను.

## మూ డ వ కు లో త్తుం గు డు

## క్రీ. శ. 1178 నుండి క్రీ. శ. 1216

మూడవ కులోత్తుంగుడు రెండవరాజ పుత్రుడుగాడు. చోళరాజ వంశమునకు మూడవ కులోత్తుంగునకు గల సంబంధమెట్టి సన్నిహిత మైనదో తెలియదు. చోళరాజవంశీయుడైన అతని రాజరాజు యువరాజుగ నెన్నుకొనెను. మూడవ కులోత్తుంగుడు పరిపాలించిన సుమారు అర్ధశతాబ్ది చోళసామ్రాజ్యము కూలిపోకుండ నిలబెట్టగలిగెను. మొదటి కులోత్తుంగుని అవసానకాలము నుండి ఆరంభించిన అవరోహణ క్రమమును మూడవ కులోత్తుంగుడు తాత్కాలికముగ నరికట్ట గల్గెను గాని సమయము చిక్కినచో స్వతంత్రులు కాచుకొని యుండిరి.

మూడవ కులోత్తుంగుని పరిపాలన కాలమున గూడ పాండ్య రాజ్యమునందలి అంతర్యుద్ధచ్ఛాయలు అడుగంట లేదు. వీరపాండ్యుడు-పల్లవ రాయని సాయముచే సంపాదించిన పాండ్యసింహాసనము నెంతకాలము అధిష్ఠించెనో తెలియదు. చోళపరాంతకుడు (మొదటి) దక్షిణ దిగ్విజయయాత్ర సల్పి పాండ్యరాజు రాజసింహుని జయించి నప్పుడు ఆతనికి సింహళ కేరళ ప్రభువులు సానుభూతి చూపిన సంగతి స్మర్తవ్యము. చిరకాలమునుండి, సింహళ కేరళ పాండ్యరాజులకు సహజవిరోధి చోళప్రభువు. అందుచే అవసరమునుబట్టి కులశేఖరుడు చోళుల సాయము అభ్యర్థించినను, అదను గడచిన పిమ్మట ఆతడు చోళులను ద్వేషించెను. అట్లే వీరపాండ్యుడు గూడ. వీరపాండ్యుడు సింహాసన మధిష్ఠించిన పిమ్మట కులశేఖరు డేమైనది తెలియవచ్చుట లేదు. సింహాసన మధిష్ఠించిన పిమ్మట వీరపాండ్యుడుకూడ సింహళ ప్రభువుతో సంధిచేసికొనెను. వీరపాండ్యుని కృతఘ్నునిగా చోళులు వర్ణించుటకు వీలులేదు - వారీతనికి సాయము చేయుటకు కృతఘ్ను డైన కులశేఖరునిపై పగ దీర్చుకొనుటకే. ఎవరైనను, ఏరు దాటిన పిమ్మట తెప్ప తగల బెట్టుట ఆనాటి రాజనీతిశాస్త్రమున తప్పుగాదు.

మూడవకులోత్తుంగుని కాలమున (9 వ సంవత్సరమున) విక్రమ పాండ్యుని, అభ్యర్థనము ననుసరించి చోళరాజు పుత్తెంచిన సైన్యములు వీరపాండ్యుని పుత్రుని సంహరించి ఈళగమును వశపరచుకొని, సింహాళభటుల ముక్కుచెవులు కోసి సముద్రములో త్రోసినట్లు చిదంబర శాసనమున గలదు. వీరపాండ్యుని మధురనుండి పారద్రోలి చోళసేనలు (విక్రమ) పాండ్యునికి, పట్టము గట్టినవి. ఈ విక్రమపాండ్యు డెవరు? కులశేఖరుని కుమారుడా? లేక వీరపాండ్యుని దాయాదియా? తెలియ రాదు. ఇది పాండ్యయుద్ధమున మొదటి ఘట్టము. పదచ్యుతుడైన వీరపాండ్యుడు సింహాళ సైన్యసాహాయ్యముతో చోళుల నెదిరించి నెట్టూరు కడ ఓడిపోయెను. ఇది ద్వితీయఘట్టము. ఇది క్రీ. శ. 1189 ప్రాంతము. ఓడిపోయిన వీరపాండ్యుడు కొల్లములో వేనాడు కేరళ ప్రభువు మరుగు చొచ్చెను. కాని, చిచ్చొపిడినిగట్టినట్లు కేరళప్రభువు వీరపాండ్యుని తన దగ్గర ఆశ్రయ మిచ్చుట మంచిది గాదని యెంచి, ఉభయులు కలిసి కులోత్తుంగునికి లొంగి సంధిచేసికొనిరి. అప్పుడు కులోత్తుంగుడు వీరపాండ్యుని కరుణించి, అతనికి తన రాజ్యమున రాజలాంఛనములతో ఆశ్రయ మిచ్చెను. వీరపాండ్యునకు చోళ రాజాస్థానమున మనోవృత్తి కిరీటము లభించినదిగాని, సింహాస నము గాదు.

కులోత్తుంగుని మూడవ పాండ్యదండయాత్ర క్రీ. శ. 1205 నాటిది. క్రీ. శ. 1190 లో జటావర్మ కులశేఖర పాండ్యుడు రాజ్యము నకు వచ్చెను. అతడు విక్రమ పాండ్యుని పుత్రుడు. అతని శాసనములు మధుర, రామ్నాడు, తిరునల్వేలి మండలములలో గన్పించుచున్నవి. పాండ్య మత్స్య ధ్వజమును జూచి చోళ వ్యాఘ్రము తోకముడిచిన దనియు, చేరుల విల్లు విరిగినదనియు అతని శాసనములు వర్ణించినవి. తన సాయమున సింహాసనము సంపాదించిన విక్రమపాండ్యునికొడుకు జటావర్మకులశేఖరపాండ్యుడు తన్ను లెక్కచేయక పోవుట కులోత్తుం

గుడు సహింపలేదు. కులోత్తుంగుడు కరువూరులో విజయాభిషేకము నొంది, మధురలో వీరాభిషేకమునకు ఉత్సహించెను. చోళ శాసన కథనమునుబట్టి, కులోత్తుంగుడు సింహాళమును జయించి కేరళమును వశపరచుకొన్నట్లు ఎంచవలెను. సింహాళభటులను - జయించినాడని దీనికి అర్థము చెప్పుకొనవలెను. పిమ్మట మధురదండయాత్ర, మత్తియూర్ కళిక్కొట్టై కోటల నాక్రమించుటతో ప్రారంభమైనది. పాండ్యభటులు పారిపోయిరి. దొరికినవారి ముక్కుచెవుల కోసి కులోత్తుంగుడు పరాభవించెను. మధురనుండి, పాండ్యుడు అతని తమ్ముడు, బంధువర్గము అడవులకు పారి పోయిరి. కులోత్తుంగుడు మధురలో వీరాభిషేక కిరీటము ధరించెను. త్రిభువన వీరబిరుదాంకితుడై గండపెండేరమును ధరించి పురవీధుల ఊరేగెను. పాండ్యరాజ్య మప్పటినుండియు చోళపాండ్యమండలమని పిలువబడ వలెనని శాసించెను. మధురకు ముడిత్తలైకొండ శోలపురమని నామాంతర మిడెను. ఆ యుద్ధమున చోళులు పాండ్యరాజుల అభిషేకమండపమును నిర్మూలించి, ఆ స్థలమును గాడిదలచే దున్నించి అందు కవడి విత్తుల జల్లించిరి. కులోత్తుంగుడు జయస్తంభములనాటి మధురలో దేవాలయమున క్రొత్తఉత్సవములు ఊరేగింపులు ఏటేటజరుగునట్లు ఏర్పాటులు చేసి రాజధానికి మరలి వచ్చెను. చోళశాసనములోని ఈ కథ ఎంత వరకు సత్యము ? ఈ యుద్ధానంతరమున పాండ్యరాజ్యమును జటావర్మకులశేఖరపాండ్యుడే పరిపాలించెను. తొలుత చోళులు జయించినను, చివరకు పాండ్యులే జయించినట్లు ఎంచక తప్పదు. మారవర్మన్ సుందరపాండ్యుడు జటావర్మని సహోదరుడు కొంత కాలము నకు చోళరాజ్యముపై దండెత్తి, చిచ్చరపిడుగై, ప్రతీకారచర్యగ చోళుల అభిషేకమండపమున - ఆయిరత్తళి (ముదిగొండచోళపురము) లో వీరాభిషేకము నొందిన సంగతి మరువరానిది.

క్రీ. శ. 1216 సంవత్సరమున మారవర్మన్ సుందరపాండ్యుడు

రాజ్యమునకు రాగానే ప్రతీకారచర్యకు పూనుకొనెను. ఆతని ప్రశస్తి పునరావృత్తమైన చరిత్రను ప్రతిఫలించుచున్నది.

"వ్యాఘ్రము తోకముడిచి పొన్నిసీమలోనికి దూరి దాగుకొను నట్లు కన్ని (పాండ్యదేశము) గజతురగ బలములతో దాడివెడలి తంజై ఉఱండై నగరములను అగ్నిదగ్ధము గావించినది. మార్గ మధ్యమునందలి వాపీకూపతటాకములు, మండపములు నగరప్రాకార ములు, ద్వారతోరణములు, గోపురములు, ప్రాసాదములు, విధ్వంసము లైనవి. శరణువేడని రాజుల భార్యలు కన్నీరు గార్చవలసి వచ్చినది.

సెంబియన్ (చోళరాజు) పరాజితుడై పారిపోయెను. అతని కిరీటము నంది కొనసంగబడినది. పాండ్యరాజు శత్రుదేశమును గాడిద లచే దున్నించి కవడి వి త్తనములు నాటించెను. ఆయిరత్తలిలో వీరాభిషేకమహోత్సవము జరిగినది. రాజ్యభ్రష్టుడైన చోళుడు బంధు మిత్ర పరివార సమేతుడై పొన్నమరావతి ప్రవేశించి, పాండ్యరాజు శరణు వేడెను.

పాండ్యరాజు అతనికి దానజలముతో కిరీటమును రాజలాంఛన ములను చోళపతి బిరుదమును నిచ్చి రక్షించెను. చోళుడు పాండ్య రాజు సింహాసనము చేరి సాష్టాంగనమస్కృతి సల్పి అతని ఆధిపత్యము నంగీకరించెను.

మారవర్మన్ సుందరపాండ్యుని విజయము పాండ్యశాసనము లనుబట్టి పాండ్యప్రశస్తినిబట్టి మాత్రమే తెలియుచున్నది. అయినను అందలి యథార్థమును అంతకు పూర్వము కులోత్తుంగుని విజయమును నమ్మినట్లే, అంగీకరింపవచ్చును.

సుందర పాండ్యుడు జయించిన చోళరాజ్యమును తిరిగి కులోత్తుంగుని కేలయిచ్చెను ? ఆ నాటి సంప్రదాయము సుప్రసిద్ధ రాజవంశముల నిర్మూలించుట గాదు. అంతేగాక కులోత్తుంగుడు

పాండ్యరాజ్యమును జయించినప్పుడు గూడ ఆ రాజవంశమునతడు నిర్మూలింప లేదు. సుందరపాండ్యుడు పగతీర్చుకొనుటకు కులోత్తుంగుడు చెప్పిన పాఠమును అక్షరము పొల్లుపోకుండ తిరిగి అప్పచెప్పుట తన విధి యని తలంచెను. ఇంతేగాక - దక్షిణభారతమున ఆ కాలమున ప్రాబల్యము సంపాదించిన మూడవ రాజ్యము హొయసాలులది. వారు చోళుల పక్షము వహించిరి. తొలుదొల్త హొయసాలులు చోళులకు ప్రత్యర్థులై మైసూరు ప్రాంతమున స్వతంత్ర రాజ్యము స్థాపించిన వారే - అయినను వారికి పాండ్యులు చోళుల స్థానము నాక్రమించి అత్యధికప్రాబల్యము సంపాదించుట ఇష్టముండక పోవుట సహజమే. సుందర పాండ్యుడు చోళరాజ్యముపై దండెత్తునాటికి రెండవ బల్లాలుని పరిపాలన, చివరి ఘట్టమున నున్నది. బల్లాలుడు రాజ్యమేలుచున్నప్పుడు అతని పుత్రుడు వీరనరసింహుడు శ్రీరంగముపై దండెత్తి చోళులను రక్షించినట్లు ఒక శాసనమున గలదు. (1) వేరొక శాసనమున బల్లాలునకు చోళ రాజ్య ప్రతిష్ఠాపనాచార్య బిరుదు గలదు. అతని పుత్రుడు చోళకులైకరక్షకుడు పాండ్యగజకేసరి అని వర్ణింపబడినది. బల్లాలుని రాణులలో చోళరాజ పుత్రిక ఒకతె గలదు. సుందరపాండ్యుడు కులోత్తుంగునిపై చూపిన కరుణతో రాజనీతిగూడ అంతర్లీనమై యున్నదని యెంచవచ్చును.

## తెలుగు చోడులు

దక్షిణచోడులకు సామంతులుగా చిరకాలము తెలుగుచోడులు నెల్లూరును రాజధానిగా జేసికొని పరిపాలించిరి. తూర్పు చాళుక్య రాజ్యము అస్తమించిన పిమ్మట, కాకతీయసామ్రాజ్యము విస్తరింపక పూర్వము తెలుగుదేశమున సామంతులు - కోటవారు, బాగివారు, కోనవారు మున్నగువారు స్వతంత్రులైరి. అందు తెలుగు చోడులు నెల్లూరు, కడప, చిత్తూరు, ఉత్తరఆర్కాటు, చెంగల్పట్టు ప్రాంతమును

(1) Colas - Page 148 by K. N. Sastry.

పరిపాలించిరి. తెలుగు చోడులుగూడ దక్షిణచోడులవలె కరికాల చోడునే వంశకర్తగ పేర్కొనిరి. వీరి మూలపురుషులలో మధురాంతక పొత్తపిచోడుడు పేర్కొనబడినవాడు. కడప పల్లంపేట తాలూకాలో పొత్తపి గ్రామమున్నది. తరువాత తెలుగు విద్య లేక బిజ్జలుడు. ఇతడు ఉజ్జపురివద్ద జయస్తంభము నాటించెను. బేటరాజు విక్రమ పోలునకు సామంతుడుగ పరిపాలించెను. ఎఱ్ఱసిద్ధి, నల్లసిద్ధి, మనుమ సిద్ధి, బేటరాజు, తమ్ముసిద్ది మున్నగు రాజులు పరిపాలించిరి.

కులోత్తుంగుడు కాంచిని జయించి నట్లును అతని కోపాగ్ని చల్లారినట్లును శ్రీరంగశాసనమున గలదు. క్రీ. శ. 1193 సంవత్సర ప్రాంతమున భుజబలవీర నల్లసిద్ధనదేవ చోళమహారాజు - వల్లూరు పురము రాజధానిగ (మహారాజపాడి 7000, కడపకు 8 మైళ్ళు) నేలుచు, కాంచినుండి కప్పము గైకొనినట్లు చెప్పుకొనెను. కులోత్తుంగుడు దక్షిణమున పాండ్యయుద్ధములయందు చిక్కుకొని యున్నప్పుడు ఉత్తరమున తెలుగుచొడులు స్వతంత్రులై అంతర్యుద్ధములకు దిగిరి. కులోత్తుంగుడు కాంచి కేతెంచి, పరిస్థితులను యథాపూర్వము చక్కదిద్ది యుండును.

క్రీ. శ. 1208 సంవత్సర ప్రాంతమున కులోత్తుంగుడు అరిభీకరులైన వడుగులను జయించి వేంగిమండలమున తన ఆధిపత్యమును తిరిగి స్థాపించి ఉఱంగై నగరమును ప్రవేశించినట్లు చెప్పుకొనెను. నెల్లూరుకు ఉత్తరమున మూడవ కులోత్తుంగుని శాసన మొక్కటి కన్పించుట లేదు. అతడు వేంగిని జయించుట ఎట్లు పొసగినది? ఉఱంగై నగర ప్రవేశము - ఏకశిలానగరము ప్రవేశము అంత సులభసాధ్యమా ?

అప్పుడు ఓరుగల్లు రాజధానిగా కాకతీయ సామ్రాజ్యమున చేరిన వేంగిమండలమును పాలించునది కార్యఖడ్గనిపుణుడైన గణపతి

దేవ చక్రవర్తి. కులోత్తుంగుడు వడగులను జయించుట అతిశయోక్తి గావచ్చును. అతని ఓరుగల్లు ప్రవేశము అసత్యకల్పనమా ?

నల్లసిద్ధి తెలుగు చోడుల రాజ్యమునకు రూపురేఖలు తీర్చిదిద్దిన ప్రభువులలో అగ్రగణ్యుడు. అప్పుడు నెల్లూరు కాంచి రాజధానులుగ నుండెను. అతని తరువాత రాజ్యము నేలిన మొదటి బేతరాజు ఎఱ్ఱసిద్దిని గూర్చి వివరములు తెలియరావు. రెండవ రాజరాజు కాలమున వారు స్వతంత్రులుగ రాజ్యము సల్పియుండవచ్చును. ఎఱ్ఱసిద్దికి ముగ్గురు పుత్రులు. మనుమసిద్ధి, రెండవ బేతరాజు, తమ్ముసిద్ధి. మనుమసిద్ధి కాలముననే మూడవకులోత్తుండు కాంచిపై దండెత్తి, తెలుగు చోడులను తిరిగి తన ఏలుబడిలోనికి తెచ్చెను. క్రీ. శ. 1180 సంవత్సరమునుండి అతని శాసనములు కాంచి, కాళహస్తి, నంద లూరుల యందు కన్పించుచున్నవి. (1) ఆ సమయముననే అతడు కాంచీనగర ప్రవేశ మొనరించెనని చెప్పవచ్చును.

కులోత్తుంగుడు తన్నెదిరించిన మనుమసిద్ధిని రాజ్యభ్రష్టుని గావించి, అతని తమ్ముడైన నల్లసిద్ధిని సింహాసన మెక్కించెను. నల్ల సిద్ధి శాసనములు క్రీ. శ. 1187 నుండి 1204 వరకు కన్పించుచున్నవి. అతని తరువాత అతని తమ్ముడు తమ్ముసిద్ధి సింహాసన మధిష్ఠించెను. మనుమసిద్ధిపుత్రుడు - తిక్కదేవుడు రాజ్యమునకు తానే సరియైన వారసుడనని గణపతిదేవుని సాయము నర్థించెను. రాజపుత్రుడైన తిక్కదేవునకు గణపతి ఆశ్రయమిచ్చి ఆదరించెను. గణపతిదేవుడు వెలనాటిపై దండెత్తినప్పుడు చోడతిక్కడు ఆ యుద్ధమున పాల్గొని వెలనాటి పృథ్వీశ్వరుని సంహరించెను. నిర్వచనోత్తరరామాయణమున తిక్కన, తిక్కనృపతి శైశవమున పృథ్వీశ్వరుని శిరస్సును ఖండించి కందుకక్రీడ సల్పినట్లు వర్ణించెను. గణపతి దేవచక్రవర్తి వెలనాటి

(1) 403 of 1919, 195 of 1892, 586 of 1907

విజయము తరువాత నెల్లూరుపై దండెత్తి, తమ్ముసిద్ధిని పారద్రోలి తిక్కనృపతిని సింహాసనమున నిలిపి తామ్రపురి (చేబ్రోలు) మీదుగ రాజధానికి తరలి వచ్చెను. (1) తమ్ముసిద్ధి శాసనములు క్రీ. శ. 1207 వరకు కన్పించుచున్నవి. అందుచే తిక్కనృపతి క్రీ. శ. 1207 ప్రాంతమున గణపతిదేవుని సాయమున పైతృకరాజ్యమును సంపాదించినట్లు ఎంచవచ్చును.

గణపతిదేవుడు - మరలి పోయిన పిమ్మట కులోత్తుంగుడు, కాంచిపై దండెత్తివచ్చెనని ఊహింపవచ్చును - అప్పుడాతడు మరలి పోవుచున్న వడుగులను (తెలుగుసైన్యముల) జయించినట్లు అలంకారికముగ అతిశయోక్తులు చెప్పుకొనవచ్చును. తిక్కనృపతి - కులోత్తుంగునితో సంధి చేసికొని యథాపూర్వము చోళుల ఆధిపత్యము నంగీకరించెను. ఈ సంధి కార్యఖడ్గనిపుణుడైన గణపతిదేవుడుగూడ సమ్మతించి యుండవచ్చును. ఆ సందర్భమున కులోత్తుంగుడు ఓరుగల్లు నగర ప్రవేశము సల్పియుండవచ్చును. సంధి ఓరుగల్లునందే గణపతిదేవుని సమ్ముఖమందే జరిగి యుండవచ్చును. తనకు అప్పుడు శిష్యప్రాయుడునైన తిక్కనృపతిని రక్షించుటకు ఇట్టి సంధికే గణపతి సమ్మతించి యుండుననుటలో ఎట్టి ప్రతిపత్తిలేదు. గణపతిదేవుని స్వభావశీలమునకు అట్టిసంధి అనుపమానమైనదే. తిక్కనృపతి చోళుల ఆధిపత్యము నంగీకరించుటచేత కులోత్తుంగుడు గెలుపు తనదే అని భావించి యుండును. దానికే వేంగీశ్వరుడుగూడ అంగీకరించెను. రాజ్యము తమ్ముసిద్ధికి గాకుండ తనకే దక్కినదిగావున తిక్కనృపతి గెలుపు తనదే యని సరిపెట్టుకొని యుండును. తెలుగుచోడులు తరతరములనుండి చోడసామంతులే. అందు క్రొత్త విశేషము లేదు. గణపతిదేవునకు తన సామ్రాజ్యముయొక్క దక్షిణపుసరిహద్దున శిష్య

(1) E I vii PP 123 - 149 చేబ్రోలు శాసనము.

ప్రాయుడైన పరమాప్తుడు లభించినాడు. నిజమైన లాభము గణపతి దేవ చక్రవర్తిదే.

మూడవ రాజరాజు, మూడవరాజేంద్రుడు. మూడవరాజరాజు క్రీ. శ. 1216 జూన్ 27, జూలై 10 వ తేదీల మధ్య యౌవరాజ్య పట్టాభిషిక్తు డయ్యెను. అప్పటికి కులోత్తుంగుడు బ్రతికియే యుండెను - తరువాత సుందరపాండ్యుని దండయాత్ర హొయసాల వీరనృసింహుని సాయము. కులోత్తుంగుడు ఆ పరాజయము నొందిన అచిలకారముననే మృతినొందెను.

రాజరాజు పరిపాలన అపజయముతో ఆరంభించి, కష్టపరంపర లకు గురి యయ్యెను. రాజరాజు సమర్థుడు గూడకాడు. ఆ కాలమున దక్షిణభారతమున రాజ్యముల పొలిమేరలు మారిపోవుచున్న కల్లోల సమయమది. ఉత్తరమున కల్యాణిచాళుక్యులు అధికారము అడుగంటి, హొయసాలులు విజృంభించిరి. కాకతీయసామ్రాజ్యము వేంగిమండ లమున క్రొత్త సరిహద్దులను తీర్చిదిద్దుకొనుచుండెను - నెల్లూరులో కాంచితో తెలుగుచోడులు - కాకతీయులతో క్రొత్త సంబంధము నేర్పరచుకొనుచుండిరి. స్వకీయరాజ్యమున గూడ కాదవసామంతులు విజృంభించుచుండిరి. తరతరాలుగ సామంతులుగనున్న పాండ్యులు - చోళచక్రవర్తిని ఓడించి, రాజధానినుండి పారద్రోల గల్గిరి. చోళచక్ర వర్తికి తిరిగి సింహాసనము లభించుట విజేత కరుణాకటాక్షవీక్షణముల చేతనే. ఇట్టిస్థితిలో మూడవ రాజరాజు సింహాసనము నధిష్ఠించెను.

మూడవ రాజరాజు 5 వ రాజ్యసంవత్సరమున కల్లోలము, (దురితంగళ్) క్షోభము ఏర్పడినట్లు శాసనసాక్ష్యము.

క్రీ. శ. 1223-4 సంవత్సరమున వీరనరసింగదేవ యాదవ రాయలకును కాదవరాయలకును మధ్య యుద్ధము జరిగినది. ఉభ యులు చోళసామంతులే. కాదవసామంతులు పాండ్యదండయాత్ర నాటినుండి చోళులకు ఎదురుతిరిగి నట్లు ఊహింప వచ్చును - క్రీ. శ.

1218 నాటిదని చెప్పదగిన శాసనమున వీరనరసింహుడు(హొయసాల) కాంచీకాంచన కాదవకులాంతక కాదవరాయ దిశాపత్తబిరుదాంకితుడు. క్రీ. శ. 1230 సంవత్సరశాసనము వీరనరసింహుడు కాంచినిజయించి అచ్చట తన భటులను (భేరుండములను) నిల్పినట్లు శాసనమున గలదు. (1) రాజద్రోహ నేరమునకు అనేకులు శిక్షింపబడుట- మూడవ రాజరాజు కాలము నాటి శాసనముల బట్టి తెలియుచున్నది. చోళకేంద్ర ప్రభుత్వముయొక్క అధికారము క్షీణించి పోయినది.

పాండ్యశాసనములనుబట్టి మూడవ రాజరాజు సంధిసూత్రముల పాటింపలేదని తెలియుచున్నది. సుందరపాండ్యుని ప్రశస్తి "రాజ రాజు పాండ్యులకు చెల్లింపవలసిన కప్పము చెల్లింపక సైన్యశక్తిమీద సారవంతమైన చోళమండలముమీద ఆధారపడి - కిరీటము దయతో దానము చేసిన పాండ్యుల మేలుమరచి కృతఘ్నుడై ప్రవర్తించె"నని అధిక్షేపము గలదు. కాలకలభుడు వ్రాసిన చారిత్రకావ్యము - గద్య కర్ణామృతము నందీ వృత్తాంతము సవిస్తరముగ గలదు.

క్రీ. శ. 1230 ప్రాంతమున జరిగిన సంఘటనలివి. దండెత్తి వచ్చిన చోళసైన్యములు పరాజయము నొంది, పారిపోయినవి. శత్రు క్షేత్రములు పీనుగుపెంటలలో వీరుల రక్తములతో నిండినవి. చోళుల చతురంగబలములు నాశనమైనవి. చోళరాజాంతఃపుర కాంతలు- దేనేరి పాండ్యుల కైవసమైరి. ముదికొండ చోళపురము చోళరాజ ధానిని పాండ్యప్రభువు ప్రవేశించు సమయమున చోళరాజ్ఞి పూర్ణ కుంభముతో స్వాగతమునసల్పినది. యుద్ధమున ఓడిపోయిన రాజరాజు, తన మిత్రుడైన కుంతలప్రభువు వీరనరసింహుని ఆస్థానము చేరుటకు పోవుచుండ, కాదవరాయడు చోళ సామంతుడే విదేశమ్లేచ్ఛసైనికు లతో గలిసి రాజరాజునోడించి అతని బందీకృతుని గావించెను. ఈ విషాదవార్త విని, వీరనరసింహుడు కావేరీతీరమును శ్రీరంగమును చేరి,

(1) E C V on 211 b.

కాదవరాయనిఓడించి- రాజరాజునువిడిపించి - పాండ్యుని దగ్గరనుండి కప్పము గైకొనెను.

రాజరాజును చెఱబట్టిన కాదవరాయడు దక్షిణభారతచరిత్రలో ఉల్కాపాతమువలె విజృంభించిన కోప్పెరుంజింగుడే. క్రీ. శ. 1243 సంవత్సరమునుండి అతడు క్రీ. శ. 1279 వరకు విశృంఖల విహారము సల్పెను. అతడు హొయసాలులనెదిరించెను. కాకతీయుల అధిపత్యము నంగీకరించియు నొకచో వారి నెదిరించెను. కాకతీయ సామంతుడు అంబదేవుడు కాదవరాయ విమర్దక బిరుదాంకితుడు. తంజావూరునుండి దక్షారామమువరకు- త్రిపురాంతకము మున్నగు స్థలముల అతని దానశాసనములు కన్పించుచున్నవి. ఒకానొక నాడతడు చోళచక్రవర్తిరాజరాజునే చెఱబట్టి, కారణాంతరములచే విడిచిపుచ్చెను. తిరువేందిపురము శాసనమున ఆ వృత్తాంతము సవిస్తరముగ వర్ణింపబడినది. ఆ కోప్పెరుంజింగుడు విష్ణ్వాలయములను విధ్వంసమొనర్చినట్లు పేర్కొనబడినది. వీరవైష్ణవులైన హొయసాలులకది దుస్సహమయ్యెను. కోప్పెరుంజింగుని పక్షమున సింహళులు పోరాడినట్లున్నది. కాని తుదకతడు చోళసమ్రాట్టును విడిచిపెట్టి సంధికి సమ్మతించెను. హొయసాలులకు అతనికి పోరాటము అంతటితో ఆగలేదు. క్రీ. శ. 1236 సంవత్సరమున వీరసోమేశ్వరుడు మంగలము వద్ద విడిసినట్లు శాసనము గలదు. కోప్పెరుంజింగుడు పాండ్యుల పక్షమున కాంచి-నెల్లూరు దండయాత్రలలో పాల్గొని విజయవిహారము సల్పెను. క్రీ. శ. 1260 ప్రాంతమున కాంచిని జయించి (జటావర్మన్ వీరపాండ్యుడు) నెల్లూరుపై దండెత్తి వీరాభిషేక మొనరించుకొన్న సందర్భమున, కోప్పెరుంజింగుడు మధురాంతకము ద్వారా కాకతీయసామ్రాజ్యము నుండి దక్షారామము వరకు దూసికొని పోయెను. కాకతీయులు నెల్లూరుప్రభువు మనుమసిద్ధికి సాయము రాకుండుటకై పాండ్యులు ఎత్తిన పన్నుగడ. సాహసోపేతమైన ఈ దండయాత్రలో ఝుంఝూ

మారుతమువలె దక్షారామము చేరగలిగిన వీరుడు కోప్పెరుంజింగుడు. కాకతి గణపతిదేవచక్రవర్తి అతనిని ఓడించి, అతని సామంతుని చేసికోగల్గినను అతని పరాక్రమమునకుమెచ్చి అతనిని గండపెండేరము (వీరపాదముద్ర) తో గౌరవించెను. శత్రువులను మిత్రులుగా మార్చగల రాజనీతి గణపతిదేవునకు వెన్నతోడ అలవడిన విద్య. కాయస్థ సేనాని, కాకతీయసామంతుడు జన్నిగదేవుడు, పాండ్యులపక్షమున పోరాడ వచ్చిన విజయగండగోపాలుని- మూడవరాజేంద్ర చోడుని ఓడింప గల్గెను. అందుచే జటావర్మన్ వీరపాండ్యుడు వేంగిదండయాత్రను విరమించుకో వలసివచ్చినది. అతడు చెప్పిన కారణము మాత్రము పరిహాసరసికులు ఆనందింపదగినది- "గణపతిదేవుని ముఖమున రెండు మత్స్యచిహ్నము లున్నవట(పాండ్యరాజలాంఛనములు). పైగా ఆదేశమును పురుషనామధేయముతో పాలించునది ఒక అబలయట." అందుచే విక్రమపాండ్యుడు ఉత్తరదండయాత్రను విరమించుకొనెను !!

మూడవ రాజేంద్రుడు క్రీ. శ. 1246 ప్రాంతముననే యౌవరాజ్య పట్టాభిషిక్తు డయ్యెను. సుమారు పది సంవత్సరములు యువరాజుగ అతడు మూడవ రాజరాజుతో కలిసి చోళరాజ్యమును పరిపాలించెను. మూడవరాజరాజుకంటె మూడవ రాజేంద్రుడు సమర్థుడు. పేరునకు రాజరాజు చక్రవర్తిగాని అధికారనిర్వహణము యువరాజైన రాజేంద్రునిదే యని చెప్పవచ్చును. రాజరాజు బ్రతికియున్నప్పుడుగూడ రాజేంద్రుని శాసనములే అధిక సంఖ్యాకములు. ఉభయులకు మధ్య అంతర్యుద్ధము జరిగినదని కొందరు చరిత్రకారులు తలపోసిరి గాని అట్టి యూహ నిరాధారమైనది. రాజేంద్రుడు తన ప్రతాపస్ఫురణచే ఇద్దరు పాండ్యుల

నోడించినట్లును, మూడు సంవత్సరములు రాజరాజు రెండు కిరీటము లను ధరించునట్లు చేసెననియు ప్రశస్తిగలదు. రాజేంద్రుడు జయించిన పాండ్యరాజు లిద్దరెవరు? ఈ విజయము మూడేండ్లు మాత్రమే యెందుకు పరిమితమైనది? (మొదటి) మారవర్మన్ సుందర పాండ్యుడు గతించిన పిమ్మట (క్రీ. శ. 1238) రెండవ సుందరపాండ్యుడు సమర్థుడు గాడు. అందుచే రాజేంద్రుడప్పుడు పాండ్యపై దండెత్తి యుండవచ్చును. ఈ సారి రాజనీతి సూత్రముల ననుసరించి హొయ సాలులు పాండ్యులకు తోడ్పడిరి. చోళపాండ్యుల మధ్య వర్ధిల్లు స్పర్థకు దోహదము కల్పించు హొయసాలుల రాజనీతి. వీరసోమేశ్వరుడు 'పాండ్యకుల సంరక్షణదక్షదక్షిణ భుజ' బిరుదాంకితుడు. సోమేశ్వరుఁడు రాజేంద్రుని జయించి శరణువేడిన అతని రక్షించినట్లు చెప్పుకొనెను. క్రీ. శ. 1241 సంవత్సర ప్రాంతమున సింగణదండనాయకుడు చోళదేశముపైదండెత్తినట్లు వేదారణ్యం శాసనకథనము(1)చోళపాండ్య కర్ణాట (హొయసాల) రాజ్యముల ఎత్తు పైయెత్తులతో దక్షిణ భారతమున, సరిహద్దులు చెరిగిపోవుచున్న కల్లోల సమయమది. అప్పుడు తెలుగు చోడరాజు తిక్కనృపతి వహించిన పాత్ర పేర్కొన దగినది.

## తిక్కనృపతి

తిక్కన నిర్వచనోత్తర రామాయణమునందు, తిక్కనృపతి పరాక్రమ ప్రాభవముల నుగ్గడించెను. తండ్రి మనుమసిద్ధి పదచ్యుతుడగుట - రాజ్యము పితృవ్యులపాలగుటచే తిక్కనృపతి శైశవమునుండి కష్టపరంపరలకు గురియై, గణపతిదేవునివలె, స్వానుభవమువలన గడి తేరిన వీరుడయ్యెను. అంతేగాక- గణపతిదేవుడు తనవలెనే పైతృక రాజ్యమును గోల్పోయి కష్టదశకు గురియైన రాజపుత్రునకు ఆశ్రయ

(1) 501 of 1904.

మిచ్చి ఆదరించెను. తిక్కనృపతిగూడ - శైశవమున కాకతీయుల పక్షమున యుద్ధములలో పాల్గొని యెనలేని అనుభవమును సంపాదించెను. క్రీ. శ. 1208 సంవత్సరప్రాంతమున కాకతిగణపతిసాయమున తిక్కనృపతి పైతృకరాజ్యమును సంపాదించుకోగల్గెను. కాని అచిరకాలముననే ఆనాటి రాజకీయచతురంగక్రీడలో ఎత్తుపై ఎత్తులలో చిక్కుకొనవలసివచ్చినది. కాని- అచిరకాలముననే చోళరాజ్యము చిక్కుకొనిన కల్లోలపరిస్థితులలో ఆతడు కాంచిని హోయసాలులకు కోల్పోయెను. క్రీ. శ. 1215 నుండి క్రీ. శ. 1228 వరకు తిక్కనృపతి శాసనములు మృగ్యములు. అప్పుడాతడు సింహాసనచ్యుతుడైనట్లు తోచుచున్నది. నిర్వచనోత్తరరామాయణమున కురుములూరు వద్ద హోయసాలుల జయించి, ఆశ్వికులను చెఱబట్టినట్లున్నది. మట్టెవాడు శాసనమున (వరంగల్లు మండలము) క్రీ. శ. 1228 సంవత్సరమున చోళరాజధానిని జయించి, కొల్లగొట్టిన ప్రశంసగలదు. క్రీ. శ. 1231 సంవత్సరమునాటిది. జాయపనాయకుని సుప్రసిద్ధ గణపేశ్వరశాసనమున గణపతిదేవుడు చోళకళింగ స్యూనబృహద్కర్ణాటక రాజులను జయించినట్లున్నది.

తిక్కనృపతి గణపతిదేవుని సాయమును మరొకమారు అర్థించియుండును. గణపతి సైన్యసమేతుడై దండెత్తి వెలనాడును దాటి చోళ, శేణసైన్యముల జయించి, తిక్కనృపతిని కాంచి, నెల్లూరు మండలముల సుప్రతిష్ఠితుని చేసెను. ఈ సమయముననే గణపతిదేవ చక్రవర్తి అంబసేనాని బావమఱది గంగయసాహిణిని ఉత్తర పాకనాటి కధిపతిగ నియమించెను.

నిర్వచనోత్తరరామాయణమున తిక్కనృపతి కర్ణాటసోమేశ్వరు నోడించినట్లు విస్పష్టముగ నున్నది. చోళులకు హోయసాలులకు మధ్య వైరుధ్యమేర్పడి - వారు పాండ్యులకు సాయము చేసిన పరిస్థితి

అలనాటి రాజకీయ చతురంగక్రీడలో ఒక ఎత్తు. అప్పుడు తిక్కనృపతి చోళులకు సాయము చేసి క్రీ. శ. 1239 సంవత్సరమున రెండవ వీర నృసింహుని జంబై యుద్ధమున సంహరించి, చోళస్థాపనాచార్య బిరుదము వహించెను. తిక్కరాజు శంబురాజు మున్నగు మాండలికులను జయించి కాంచి చేదిమండలములను వశపరచుకొనెననియు, కాదవపతి నోడించినట్లును నిర్వచనోత్తర రామాయణపీఠికలో గలదు.

తిక్కనృపతి, గణపతిదేవునకు ఆప్తుడై హొయసాలులను సమయము చిక్కినప్పుడెల్ల ఎదిరించి నిల్చెను. క్రీ. శ. 1245 సంవత్సరమున (జూన్ 8 వ తేదీ) గణపతిదేవుని దండనాయకుడు సామంత భోజుని శాసనము కాంచి యందు గన్పించుచున్నది. తిక్కనృపతి, గణపతిదేవునకు ఆప్తుడై దక్షిణ చోళులకు సమయానుకూలముగ సాయము చేసెను.

### రెండవ మనుమసిద్ధి

క్రీ. శ. 1248 సంవత్సరమున తిక్కనృపతి మరణముతో నెల్లూరు తెలుగు చోడరాజ్యము తిరిగి అల్లకల్లోల మయ్యెను. సింహాసనమునకు వారసులుగ నిలిచినది, తిక్కనృపతి పుత్రుడు (రెండవ) మనుమసిద్ధి. విజయ గండగోపాలుడు. విజయగండ గోపాలునకు తెలుగు చోడ రాజవంశమునకుగల సంబంధము సుస్పష్టముగ తెలియుట లేదు. తిక్కనృపతి మరణానంతరము విజయగండ గోపాలుడు చెంగల్పట్టు ఉత్తర ఆర్కాటు మండలముల నాక్రమించెను. అతనిని ద్రవిడ కర్ణాటరాజులు బలపరచిరి. అప్పటి కర్ణాటరాజు వీర సోమేశ్వరుడు (1234 - 60) చోళరాజు మూడవ రాజేంద్రుడు యౌవరాజ్య పట్టాభిషిక్తుడై అధికారమును వహించి యుండెను. సోమేశ్వరుని పుత్రులు (మూడవ) నరసింహుడు రామనాధుడు తండ్రికి తోడ్పడుచుండిరి. విజయగండగోపాలుడు నెల్లూరును జయింప నుంకించు సమయమున,

అక్కన్న బయ్యన్నలు మనుమసిద్ధి దాయాదులు నెల్లూరు సింహాసనము నాక్రమించిరి. రాక్షసగంగుడు, వైదుంబ వంశీయుడు (కలుకడ శాఖీయుడు) కాకతిసేనాని గంగయసాహిణిని జయించి, అతనిని కడపమండల ప్రాంతమునుండి పారద్రోలెను.

మనుమసిద్ధి- రాజ్యములేని రాజు- తనకు నలువైపుల శత్రు రాజులచే చుట్టబడి నిస్సహాయుడై యుండెను. తిక్కన సోమయాజి- మహాకవిగ నుగ్రహీతనామధేయుడైన మనుమసిద్ధి మంత్రి-ఓరుగల్లున కేగి గణపతిదేవచక్రవర్తి సాయము నర్థించుట, తత్సాహాయమ్మున మనుమసిద్ధికి రాజ్యము తిరిగిలభించుట తెలుగు దేశమున సుప్రసిద్ధమైన గాథ. ఈ వృత్తాంతము గుంటూరు మండలమందలి నాయని పల్లి శాసనమున, వర్ణింపబడినది. (1) నెలూరు తగులబెట్టబడినది. అక్కన్న బయ్యన్నలు సంహరింపబడిరి. కాకతీయసైన్యములు కాంచినిజయించి నవి. నిర్వచనోత్తర రామాయణమున పలైయూరు యుద్ధమున (తంజా వూరు మండలము) మనుమసిద్ధి ద్రావిడ కర్ణాటక విజయ గండ గోపాలుల జయించినట్లు వర్ణింపబడినది. సామంతభోజుడు ఎత్తై యూరు యుద్ధానంతరము, వెనుదిరిగి కాంచిని సులభముగ ప్రవేశింప గలిగెను. కాని విజయగండ గోపాలుని శాసనములు అటుపిమ్మట గూడ కాంచి యందు కన్పించుచుండుటచే కాకతీయసైన్యము మరలిన పిమ్మట అతడు తిరిగి కాంచిని ఆక్రమించినట్లు ఎంచవచ్చును.

రాక్షసగంగుడు, కాకతిసేనాని గంగయ సాహిణిని జయించి నప్పుడు అతనికి తెలుగుచోడరాజు జగతీపతి, గుత్తిపాలకుడు తోడ్పడి యుండెను. జగతీపతి 'గండపెండేర గంగయ సాహిణీ సర్వస్వ బందికార' బిరుదాంకితుడు. పాలైయూరు యుద్ధానంతరము "మనుమసిద్ధి రాక్షసగంగుని జయించి తిరిగి పాకనాటియందు గంగయ

---

(1) A R 769 of 1922.

సాహిణిని నిలిపె నని" నిర్వచనోత్తర రామాయణ కథనము. రాజ్య భ్రష్టుడైన మనుసిద్ధి ఈ విజయపరంపరలు సాధింప గల్గుటకు కాకతిగణపతిదేవుని సాహాయ్యమే కారణము. చోళులకు సామంతులుగ నున్న దక్షిణచోళులకు సాయము చేయుటకు ఓరుగల్లునుండి నెల్లూరు వరకు స్వయముగ కాకతిగణపతిదేవుడే వచ్చుటను బట్టి, మూడవ రాజేంద్రుని కాలమున చోళరాజ్యము ఎట్టి క్షీణదశకు వచ్చినది తెల్లమగు చున్నది.

అప్పటికే చోళరాజ్యములో చాలభాగము పాండ్యులు ఆక్రమించుకొనియుండిరి. క్రీ. శ. 1960 ప్రాంతమున జటావర్మ వీర పాండ్యుడు కాంచిని జయించెను. తరువాత జయింపవలసినది తెలుగుచోడుల రాజధాని నెల్లూరు. మనుమసిద్ధికి గణపతిదేవుని సాయము లభింపకుండుటకై పాండ్యుల పక్షమున మూడవ రాజేంద్ర చోడుడు కొప్పెరుంజింగుడు విజయగండగోపాలుడు కాకతీయ రాజ్యమైన త్రిపురాంతకము వరకు పోగలిగిరి. కొప్పెరుంజింగుడు దక్షారామము వరకు దూసికొని పోవుట - గణపతి అతనిని జయించియు మెచ్చి గండపెండేర ముద్రికతో సమ్మానించుట పూర్వోక్తకథనమే. కాంచినుండి నెల్లూరుకు సాగిన దండయాత్రలలో జటావర్మ సుందర పాండ్యుడు (మొదటి) భువనైకవీర విక్రమపాండ్యుడు జటావర్మ వీర పాండ్యుడు పాల్గొనిరి. చోళులను జయించిన పాండ్యులు, చోళ సామంతులైన తెలుగుచోడులు తమకు సామంతులగుట సహజమని భావించిరి. మనుమసిద్ధి కాకతీయుల సాయము నర్థించెను. ఈ సారి పాండ్యుల కెదిరిపక్షమున హొయసాలులు బాణులుగూడ చేరిరి. క్రీ.శ. 1263 సంవత్సరమున ముత్తుకూరు దగ్గర ఘోరసంగ్రామము జరిగినది. పాండ్యశాసనములనుబట్టి శత్రుకూటమికే ఘోరపరాజయము సంభవించినది. విజయగండగోపాలుడు - నెల్లూరు ప్రభువు - యుద్ధమున నిహతుడయ్యెను. తెలుగుచోడుల రాజ్యము పాండ్యరాజ్యమున కలిసి

పోయెను. జటావర్మ సుందరపాండ్యుడు నెల్లూరులో వీరాభిషేకము నందెను. విజయసూచకముగ క్రొత్త నాణెముల నచ్చొత్తించెను (1)

మూడవ రాజేంద్రుని చివరి రాజ్యసంవత్సరము క్రీ. శ. 1279. కాని చోళ రాజ్యము అంతకు ముందే పాండ్యరాజ్యమున లీనమై పోయినది. అంతటితో చోళసామ్రాజ్యము అస్తమించినట్లే. ఆ వంశీయులు తరువాత చరిత్రలో అక్కడక్కడ కన్పించుచున్నారు. క్రీ. శ. 1301 లో బెంగుళూరు ప్రాంతమున వీరశైవ వీరప్రతాప చోళరాజు చోళ బిరుదావళులతో కన్పించును. అదే సమయమున ఉత్తరఆర్కాటు మండలమున వీరచోడుడు అతని పుత్రుడు వీరచంపడు క్రీ. శ. 1355 లో రెడ్డిరాజుల చరిత్రలో భక్తిరాజు కన్పట్టుదురు. క్రీ. శ. 1481, 1530 శ్రీరంగమున వాలక కామయ్య చెన్నయ బాలయ తెలుగు చోడ బిరుదావళులతో శాసనములు వేసిరి. అచ్యుతదేవరాయల కొళింజివాడి తామ్రశాసనమున చోళరాజ వంశీయుల ప్రశంస గలదు. క్రీ. శ. 1554 లో కుంభకోణమున ఆదికుంభేశ్వరునకు మహామండలేశ్వరగురురాజ రుద్రదేవ సోల - మహారాజు దానశాసనము గలదు.

## చోళసామ్రాజ్యము - సంఘవృత్తములు

విజయాలయుని నాటినుండి మూడవ రాజేంద్రుని పరిపాలనాంతమువరకు చోళసామ్రాజ్యమునందలి స్థితిగతులు తెలిసికొనుటకు ముఖ్యాధారములు శాసనములే. సమకాలీనవాఙ్మయము సాహాయ్యకారి కాగలదుగాని, సారస్వతమునకు నిష్కర్షయైన కాలానుక్రమణిక

(1) బొమ్మ - రెండు మత్స్యముల మధ్యరాజదండము, సుందరపాండ్య (తమిళమున).
బొరుసు - కాకతీయుల వరాహలాంఛనము పై చంద్రవంక-సూర్యుడు.

యేర్పడలేదు. విదేశయాత్రికుల వ్రాతలు నిష్పాక్షికముగ నుండును గాని అవి గూడ మిక్కిలి అరుదుగ నున్నవి. నాణెములు చరిత్రలో సమాధానము సాధించిన ప్రశ్నలకంటె, రేపిన సమస్యలే యెక్కువ. కాని - శాసనములు మాత్రము కోకొల్లలు. అయినను, ఇవి చాల వరకు చారిత్రకదృష్టితో వేయబడినవి కానేకావు. అందుచేత, చోళ సంఘమునందలి స్థితిగతుల నెన్నుటకు విచక్షణ మిక్కిలి అవశ్యకము. శాసనములలో, నిస్సందేహముగ సమకాలీనములని చెప్పదగిన గ్రంథ ములలో ప్రతిఫలించిన సామాజికస్థితిగతులను ప్రాధాన్యవివక్ష చొప్పున వివరింప నగును.

సామాజికజీవితమున చోళసామ్రాజ్యమునందలి ప్రజలువ్యష్టిగ సమష్టిగ సాధించినవి అనేకవిషయములు ఉగ్గడింపదగిన వున్నవి. సాంఘికసామరస్యము- పౌరధర్మనిర్వహణము అలనాటి ఉచ్ఛ్వాస నిశ్వాసములై ప్రజాజీవితమును తీర్చిదిద్దినవని చెప్పవచ్చును. దేవా లయము సంఘజీవితవృత్తములకు గర్భనాభి.

చోళసామ్రాజ్యము నాలుగు శతాబ్దులు దాటి వర్ధిల్లినది- క్రీ. శ. 850 నుండి 1270 వరకు చోళరాజ్యము విస్తరించిన కొలది- రాజు చక్రవర్తి యయ్యెను. మొదట అతడు 'ఉడైయార్'- తరువాత 'చక్రవర్తిగల్' పిమ్మట 'త్రిభువనచక్రవర్తిన్'. విజయాలయుని కాల మున తంజావూరు రాజధాని. కొంతకాలమునకు పల్లవులను జయించి నప్పుడు కాంచి రెండవరాజధాని లేక ఉపరాజధాని యైనదని చెప్ప నొప్పును. తంజావూరులో ప్రాకారము, చుట్టు అగడ్త యుండెడిది. రాజరాజేశ్వరాలయము చోళనిర్మాణము. చోళుల రాజధానిగ సుప్ర సిద్ధమైనది గంగైకొండ చోళపురము. రాజరాజుపుత్రుడు వీరాధివీరుడు నైన రాజేంద్రుని వ్యక్తిత్వమునకు మొదట నిలువుటద్దముగా నిలిచిన ఆ రాజధాని నగరమును చోళరాజులు తరతరాలుగ క్రొత్త క్రొత్త

కట్టడములతో అలంకరించుచు వచ్చిరి. గంగై కొండచోళపురమునందలి పెద్ద విపణివీధి, "శోళకేరళన్" రాజప్రాసాదము, తిరుమంజనట్టార్ వేలమ్ శాసనప్రసిద్ధములు. పాళయార్‌లో (కుంభకోణ సమీపమున) రాజరాజేశ్వరాలయమును రాజప్రాసాదమును ఉండెడివి. ఆ ప్రాసాదము రాజరాజుసహోదరి కుందవాదేవికి ప్రీతిపాత్రమైన ఆవాసము.(మొదటి) రాజరాజు మధురలో సువిశాలప్రాసాదమును నిర్మించెను. ఉత్తర మేరూరునందును చోళరాజప్రాసాద ముండెడిది. మరియుఅనేకనగరము లందు,చక్రవర్తి విడిసిచేయుటకు వసతులు, కొలువు దీర్చుటకు"మండ పములు" ఉండెడివి. తంజావూరులో రాజరాజేశ్వరాలయము క్రీ. శ. 1010ప్రాంతమున ఇంకను పూర్తి కాలేదు. తంజావూరులో జయభీమా లయము తంజైమామణి గుడి ఉండెడివి. రాజరాజు తండ్రి పేర సుందరచోళవిణ్ణగరాతుళశాలై అను వైద్యశాలను ఒక విష్ణ్వాలయ ప్రాంగణమున కుందవాదేవి దానమువలన వెలసెను.

రాజాంతఃపురము - రాజ్యాంగ వ్యవస్థలో అగ్రస్థానము నాక్ర మించునది - అంతఃపుర పరిజనము అందరు ఆడువారే. "చే-జు-క్వ" వర్ణన ఉదాహరింప దగినది." "ఉత్సవసమయములందు, యువరాజుతో పాటు నలుగురు మంత్రులు రాజసింహాసనమునకు వంగి నమస్క రించెదరు. వెనువెంటనే నృత్యగాన సంగీతము మిన్నుముట్టును. యువరాజు ద్రాక్షాసవసమానడు. అతడు, వినోదార్థము మూడువేల నర్తకీగణమును పోషించుచుండును." చోళయుగమున యజ్ఞ యాగాదుల ప్రభావము తగ్గి దానధర్మములపై నిష్ఠ అధిక మయ్యెను. రాజాధిరాజు మాత్రము అశ్వమేధము చేసెను. దేవాలయము దానశాల. రాజులు సామంతులు సంపన్నులు తులాపురుష - హిరణ్యగర్భ దానములు మొదలు దీపారాధన వరకు భక్తితాత్పర్యములతో సాగించిరి.

రాజగురువులు :— చోళులు శైవులు. వీరికి దీక్షాగురువు లుండెడి

వారు. ఈశానశివ సర్వశివ రాజగురువులు రాజరాజరాజేంద్ర శాసనములలో గన్పించుచున్నారు. మూడవ కులోత్తుంగుని గురుదేవుడు స్వామి దేవుడు. తిరుక్కడయార్ దేవాలయమున పూజారి మరణానంతరము కులోత్తుంగుడు చేసిన ఏర్పాటులు స్వామిదేవర్ అంగీకరింపలేదు. రాజు తన అజ్ఞను మార్చుకొనెను. రాజరాజు ప్రతిష్ఠించిన ఆలయము రాజరాజేశ్వరాలయము. ఇట్లే భీమేశ్వరాలయాదులు. క్వాచిత్కముగ రాజు విగ్రహములనే ఆలయములందు ప్రతిష్ఠించి ఆరాధించుటయు కద్దు. (దేవరాజోపాసన) అస్థికలు శిథిలదేవాలయముల అడుగున త్రవ్వకములలో బయల్పడుట గమనింపదగినది. కుందవాదేవి తలి తండ్రులు విగ్రహముల తంజావూరు ఆలయమున ప్రతిష్ఠించి ఆరాధనకు దాన శాసనము నెలకొల్పినది. శేంబియన్ మహాదేవి ఆలయము సుప్రసిద్ధము. రాజరాజు అతని దేవేరి లోకమహాదేవి విగ్రహములు తంజావూరు ఆలయమున గలవు.

## సేన

రాజు రాజ్యమునందు వలెనే సేనపై సర్వాధిపతి. రాజరాజు శాసనములందు సుమారు ముప్పది పటాలములపేర్లు కన్పించుచున్నవి. ఈ పటాలములు కొన్ని తరతరముల వర్ధిల్లి, ప్రజాహితజీవనమున పాల్గొనుట గాంచ నగును. పార్థివశేఖర, దానతుంగ చండపరాక్రమ, రాజకుంజర ఇత్యాది పేరులు, ఆ యా రాజుల బిరుదుల నభివ్యక్తము చేయుచున్నవి. కత్తి డాలు, విల్లు – బాణము ప్రధానాయుధములు. తిరువాలీశ్వరశాసనమునుబట్టి, (తిరునల్వేలి మండపము) 'మూన్రుకై – మహాసేనై'-పటాలను యొక్క చరిత్ర తెలియుచున్నది. ఈ శాసనము రాజరాజు, రాజేంద్రుల నాటిదిగ ఎంచవచ్చును. మహాసేన శివకేశవుల సతతము ఆరాధించినది. కన్నరుని జయించి గాంగేయుని సంహరించినది. కళ్ళడమును వశపరచుకొన్నది. విళిఞం విధ్వంస మొనర్చినది.

సముద్రమును దాటి మాటోత్తం, మళైనాడు జయించినది శాలై యొద్ద శత్రునౌకలను విధ్వంస మొనర్చినది. 'వల్లన్' (చాళుక్య) ప్రభువును తరిమి వనవాసిని వశపరచుకొనెను. కాళహస్తి. కవీశ్వరుల ప్రస్తుతుల నందుకొన్నది. తిరువాలీశ్వర దేవాలయరక్షణము ఆచంద్రతారకముగ సల్పుటకు దీక్ష గైకొన్నది. క్రీ. శ. 1096 వ సంవత్సరము ఈ పటాలమే మరియొక దేవాలయరక్షణకు దీక్ష గైకొనినది. ఈ సేనానివహములో పేర్కొనిన మూడు అంగములు రౌతులు, విలుకాండ్రు, పదాతులు కావచ్చును. సేనాధిపతులలో పెక్కురుబ్రాహ్మణులు కన్పించుట విశేషము.'శాపాదపి శరాదపి'ప్రాచీన బ్రాహ్మ్యము. 'శరాదపి' మిగిలినట్లున్నది. బ్రాహ్మణ దండనాయకులలో గడిదేరినవారు 'బ్రహ్మాధిరాజ' బిరుదాంకితులు.

క్రీ. శ. 1178 నాటి చీనారచయిత చోళసైన్యమునుగూర్చి ఉదహరించిన వర్ణన పేర్కొనదగినది.

"చోళరాజ్యము పశ్చిమరాజ్యముతో యుద్ధమున చిక్కుకొని యున్నది. చోళప్రభుత్వమున 60,000 ఏనుగు లున్నవి. ఈ ఏనుగలు యుద్ధసమయమున తమ తమ వీపులపై రణగృహముల నెత్తుకొని పోవును. అందుండి విలుకాండ్రు నలువైపులకు బాణముల గ్రుప్పుచుందురు. సమీపమున నున్నవారిపై శూలముల గ్రుచ్చుచుందురు. నిత్యము ఏనుగులు రాజసమక్షమునకు గొనిపోవుచుందురు." అలనాటి యుద్ధనీతి రాజనీతి, ఆదర్శప్రేరితమైన ప్రాచీనధర్మశాస్త్రముల నతిక్రమించినదని చెప్పక తప్పదు.

తుంగభద్రకు ఇరువైపుల నిరాయుధుల వధ శోచనీయము. రాజధానులను అగ్నిదగ్ధము సల్పుట- ప్రజలను దోచుకొనుట పరిపాటి యైనది. రాజేంద్రుడు చాళుక్యరాజ్యమునందలి జైనబస్తీలను దోచుకొని ఆ ధనము చోళదేవాలయములకు దానము సల్పెను. (2)

(1) చౌ - జుక్య

(2) Jor VI pr 299 ff

చోళులకు సర్వసమర్థమైన నౌకాబల ముండెడిది. ప్రాచీన కాలమునుండి నౌకాయానమునకు తీరస్థులు అలవాటు పడినవారు సయామునందలి తమిళశాసనమునుబట్టి క్రీ. శ. 9 వ శతాబ్దియందు "మణిగ్రామము" (వర్తకసంఘము) తూర్పుతీరమున కద్దరి వర్ధిల్లినదని తెలుచున్నది. సింహళవిజయము - తరతరములు సాగిన సింహళ దండయాత్రలు, శాలై వద్ద చేరనౌకావిధ్వంసము, చోళుల నౌకా బలమునకు నిదర్శనములు. చోళరాయబారులు చీనాకు పలుసారులు పయనించి పోయిరి.

అలనాటి హైందవసంఘము ప్రభుత్వాధికారమునకు అప్పగించి నది. పరిపాలన - పన్నులు వసూలుచేయుట - శాంతిభద్రతలను కాపాడి దోములను దండించుట మాత్రమే. స్వయంసంపూర్ణములు - స్వయంపోషకములునైన గ్రామముల కూటమియే రాజ్యము. రాజు మారినను, గ్రామస్వరాజ్యము నిరాటంకముగ సాగిపోయెడిది. రాజు శాసనకర్త కాడు. సంప్రదాయసిద్ధమైన ధర్మశాసన సంరక్షకుడు మాత్రమే.

విద్య పన్నులు చెల్లింపనవసరములేని "బ్రహ్మదేయములు" (అగ్రహారములు) పేర్గా నదగినవి. వీనికి చతుర్వేదిమంగళములని పేరు. ఉన్నతవిద్యావ్యాప్తికి - చతుర్వేదిమంగళమున వివిధవిద్వాంసులకు వృత్తులు (భూములు) లభించెడివి. ఏకభోగముగ ఊరునంతటిని ఒకే విద్వాంసున కిచ్చుటగూడ కద్దు. దేవాలయ ప్రాంగణమే విద్యాలయము. ఆనాడు అక్షరాస్యత తక్కువగాని విద్యావంతులు తక్కువగాదు. శ్రుతపాండిత్యము అనుష్ఠానవేదాంతమును ఆనాటిసంఘము ఆదరించి నది. వ్రాయనగానికి పెద్దవిలువ లేదు. విద్య గ్రంథస్థము గాకుండ ముఖస్థమై,గురుశిష్యపరంపరాగతమై వర్ధిల్లిన ఆసమయమున సంతకము చేయలేని కవులు - వేదవేదాంగపారంగతులు - నానాపురాణధర్మశాస్త్ర

పండితులు ఉండెడివారనుట నేటి వారి ఊహకు అతీతము గావచ్చును గాని, భూతార్థమైన ఒక విచిత్ర విరోధాభాసము. అనగా నిబద్ధవిద్యావిధానము ఆనాడు లేదని చెప్పరాదు. చతుర్వేదిమంగళములు నిర్దిష్ట విద్యా విధానమునే అనుసరించినవి. అట్లే అచ్చటచ్చట వెలసిన ఉన్నత విద్యాసంస్థలు. ఎన్నాయిరం - (రాజ రాజ చతుర్వేది మంగళం) (దక్షిణ ఆర్కాటు మండలము) ఉదాహరణ ప్రాయమైనది. రాజేంద్రుని ఉద్యోగి, అచటి గురువులకు జీతమును విద్యార్థులకు భోజనవసతి సౌకర్యములను రాజాజ్ఞ చొప్పున ఏర్పాటు చేసిన శాసనము అలనాటి విద్యా విధానమును ప్రతిఫలించుచున్న నిలువుటద్దము (3) అందు 70 మంది పై తరగతికి 270 మంది క్రిందితరగతులకు చెందిన విద్యార్థులుండెడివారు అధ్యాపకులు పదునల్గురు.

బాల బ్రహ్మచారులలో నలుబదిమంది రూపావతార వ్యాకరణమును పఠించుచుండెడివారు. 75 మంది ఋగ్వేదము75మంది యజుర్వేదము వాజసనేయ ఛాందోగ్యములు20మంది బాల బ్రహ్మచారికి రోజునకు ఆరు నళుల ధాన్యము. 70 మంది. పై తరగతి బ్రహ్మచారులకు- ఛాత్రులకు - రోజునకు 10 నాళుల ధాన్యము లభించెడిది. ఛాత్రులు 25 మంది వ్యాకరణము, 35 మంది ప్రభాకరమీమాంస, 10 మంది వేదాంతము నభ్యసించెడివారు.

అనుబంధముగ ఉన్నత విద్యాలయము - వైద్యశాల ఏర్పడినవి. ఇది చిరు విద్యాసంస్థ. ఒక అధ్యాపకుడు. 10 మంది శిష్యులు. శిష్యులకు - నిత్యాన్నపాన వసతులు - పండుకొనుటకు చాపలు - శనివారము అభ్యంగనస్నానమునకు తైలము, రాత్రిదీపము ఏర్పాటు చేయబడినవి.

ఇట్టి విద్యాలయము క్రీ. శ. 1121 నాటి విక్రమ చోళుని శాసనమున, తిరువాదుతురై యందును కన్పించుచున్నది. అందలి

[3] 333 of 1917,

విద్యార్థులలో వైద్య విద్యాభ్యాసము చేయువారున్నారు. క్రీ. శ. 1213 సంవత్సరమునాటి తిరువొయ్యియూరు శాసనము వ్యాకరణ పాఠశాలా మండపమును పేర్కొనుచున్నది. ఈ విద్యాలయములకు 'ఘటిక' లని పేరు. మఠములుగూడ విద్యాభ్యాసము చేయు బ్రహ్మచారులను పోషించుచుండెడివి.

## స్థానికస్వపరిపాలన – గ్రామస్వరాజ్యము

చోళుల కాలమున గ్రామము రాజ్యమునకు వెన్నెముక, ప్రతి గ్రామము స్వయంపోషకముగ స్వయంసమృద్ధముగ నుండెడిది. దేవాలయము సామాజిక జీవితమునకు కేంద్రనాభి. దేవునకు అంగ రంగవైభవములకు భక్తులు దానములు సలిపెడివారు. "దేశమంటే మట్టికాదోయ్ – దేశమంటే మనుజులోయ్" అని నేటి "దేశభక్తి" కే కవి వ్యాఖ్యానము. అలనాటి దేవుడంటే దేవాలయము కాదు. ఏ దేవళమునందలి దేవుడుగాని పాపము తనకు నైవేద్యమిడిన ఒక అరటిపండుగాని, గుప్పెడు అన్నముగాని ఎన్నడు తిని యెరుగడు. దేవునిపేర మెక్కినది ప్రజలే. దేవాలయము విద్యానిలయము. కళా శాల. శిల్పనికేతనము – సంగీత సంకీర్తన మందిరము. నర్తనశాల. సర్వపౌర సామాన్యసమావేశస్థలము. ఎంతటి కుగ్రామమునందైనను ఏదో ఒక చిరుకోవెలయైన నుండెడిది. గుడిగంటమ్రోగినపుడు అర్చన వేళకు అక్కడకు చేరిన వారికి – బాటసారిగావచ్చు, పంగ్వంధ భిక్షుక బ్రహ్మచారులుకావచ్చు, పౌరులుగావచ్చు – ప్రసాదము లభించెడిది. క్షుధార్తులకు ఆకలిచిచ్చు నార్పుటకు పట్టెడు కూడు గుడి గంటలు నిత్యము వాగ్దానము చేసెడివి. ఆకలిచావులకు ఆనాడు తావు లేదు. ఒకే గ్రామమున రెండు సభలుండుటగూడ కద్దు. క్రీ. శ. 1227 సంవత్సరమున సత్తమంగళమున కిందుదేవదానమునకు సంబంధించిన సభయొకటి; జైన పళ్ళిచ్చందమునకు సంబంధించిన సభ ఇంకొకటి గన్పించుచున్నవి.

క్రీ. శ. 919 సంవత్సరమునాటి ఉత్తరమేరూరు ఉదాహరణ ప్రాయము. గ్రామసభకు ఎన్నికలు ముప్పదికుటుంబములు-పన్నెండు వీధులకు కలిపి జరిగినది. రాజోద్యోగి దేవాలయమున అందరును చేర్చి శ్రీముఖమును పఠించును. కుటుంబములు వీధులు తమతమ అభ్యర్థులను ప్రకటించెదరు. అభ్యర్థులకు ఆస్తి, పాండిత్యము మున్నగునవి అర్హతలు. నేరములు సలిపినవారు అనర్హులు. భ్రాతృభార్యాభిగమనము అనర్హతలలో ఒకటి. అభ్యర్థులపేరులు వ్రాసిపెట్టి కుండనుండి ఒక బాలకుడు దేవుని సన్నిధిలో పత్రములపైకి తీయును. ఆయాపేరుల వారు - ఆయా సంఘములకు - ఎన్నికయైనట్లు ప్రకటింపబడును. ఇందలి నిష్ఠ అభ్యర్థుల అర్హత. ఈ ఎన్నికలో అర్హతగలవారి కందరకు ఎన్నికగుటకు సమానావకాశము ఉన్నది- ఒకసారి ఎన్నిక అయిన వారు తిరిగి 5 సంవత్సరములు ఆగి గాని మరొకతూరి ఎన్నిక కారాదను నియమముకూడ కొండొకచో గలదు. ధ్వజస్తంభములందలి కింకిణీరావములకు శ్రుతిగల్పుకొని దేవదాసి- నర్తకి కింకిణీరావములు వెల్లివిరిసెడివి. అది కళారాధన. అందు ఇంద్రియకాలుష్యమునకు చోటులేదు. భగవత్సన్నిధిలో భక్తులు సౌందర్యలాలసులై అతీంద్రియానందమును అనుభవించుటకు అవకాశమున్నది.

గ్రామపరిపాలనము- అగ్రహారమైనచో గ్రామసభ- లేక సభ నిర్వహించెడిది. చిరుగ్రామమైనచో 'ఊర్' నిర్వహించెడిది. చోళుల కాలమున వెల్లివిరిసిన గ్రామస్వపరిపాలన, అంతకు పూర్వమే చోళ దేశమున వేరుతన్ని పాతుకొనియున్నది. మొదటి పరాంతకుని కాలమున నాటి ఉత్తరమేరూరు శాసనములో కన్పించు గ్రామస్వపరిపాలనకు పునాదులు క్రీ. శ. 800 సంవత్సరమునాటి మానూర్ శాసనమునకే (తిరునల్వేలి మండలము) గన్పించుచున్నవి. సభ లేక ఊర్ గ్రామమునందలి ఉమ్మడిభూములు - దేవాలయము - తటాకములు

తోటలు మున్నగు వానిని నిర్వహించెడివి. వివాదపరిష్కారము తీర్పు చెప్పుటలో విద్వాంసులైన భట్టులు తోడ్పడెడివారు.

శ్రీ కంఠచతుర్వేది మంగళమునందలి సభకు- తిరువేరుంబి యూరు నందలి ఊరునకు మధ్య యేర్పడిన సరిహద్దు కలహము చాల కాలమువరకు తేలలేదు. చివరకు సంపన్నుడైన ఉదారుని దానశీలము ఆ వివాదమును పరిష్కరించినది- అతడు, ఉభయులకు వారువారు కోరిన సొమ్ము నిచ్చి ఆ భూములను కొని, దేవాలయము నకు దానముగా నిచ్చెను. నిత్యనైవేద్యసమయమున వాద్యబృందము వారి పోషణకై ఆ భూముల ఆదాయము వెచ్చించుటకు ఏర్పాటు జరిగినది.

ఉత్తరమేరూరు సభ. విష్ణ్వాలయమున కట్టడములు బాగు చేయించిన వేశ్యకు వంశానుగతమైన మర్యాదల ననుగ్రహించినది.

తిరుమలవాడి గుడి స్థానాపతి, దేవునకు ఒక నివేదనపత్రమును తిరునాళ్ళలో సమర్పించి, గుడికి ఊరికి ఉపకారముచేసిన గ్రామీణు నకు దేవుని "అనుమతి" చొప్పుననే - గృహమును దానము చేసెను. (క్రీ. శ. 1223) చాల గ్రామములలో గ్రామప్రభువు ఊరిదేవుడే. గుడి లోని దేవునకు రాజునకువలెనే సర్వరాజభోగములు జరుగుచుండును. రాజువలెనే ఉద్యోగులకు దేవునకు జరుగు కైకర్యములకు అనువంశిక మైన పంటభూములు ఇవ్వబడును. రాజోద్యోగులకు బహుళముగ జీతములు లేవు. భూములు ఇవ్వబడును. అవసనముగ క్వాచిత్క ముగ బంగారు నాణెములు ఇవ్వబడుచుండెడివి. భూమిపై పన్ను- ఆదాయమున నూటికి 40 శాతము వరకు ఉండెడిదని అంచనా వేయ వచ్చును. కొన్ని అవాంతరసమయములందు రాజు, రాజులు సభ లపై అదనపు పన్నులు 'దండన' లో అపరాధ సుంకములు విధించుట గూడ కద్దు.

## శిక్షలు

దేవాలయమునందలి విగ్రహములను ఆభరణములను దొంగిలించిన ఇరువురి ఆస్తులు వేలము వేయబడినవి. ఆ సొమ్ము రాజుగారి బొక్కసమున చేర్చబడినది. (4) రాజద్రోహి ఆస్తులు రాజు కైవసము గావించుకొనును. రాజరాజు అన్నగారైన రెండవ ఆదిత్యుని వధకు పాల్పడిన వారి ఆస్తులు 'అజ్ఞాశ్రయమున'కు లోనయ్యెను. పశువుల నెత్తుకొని పోవుట ఆనాటి నేరములలో మిక్కిలి పరిపాటియైనది. నేరము సల్పినవారు అపరాధసుంకము చెల్లింపవలసి యుండెను. కొండొకచో వారు తమ ఆస్తిని గూడ కోల్పోవుచుండిరి. మూడవ కులోత్తుంగుని కాలమున, బ్రాహ్మణ వెళ్ళాళ హింసకు పాల్పడిన ఇరువరకు 1000 కాసుల అపరాధ సుంకము విధింపబడినది. ఆసొమ్ము చెల్లింపబడక పోవుటచే వారి ఆస్తి 1060 కాసుల అజ్ఞాశ్రయమునకు పాల్పడినది. 1000 కాసుల అపరాధసుంకము 160 కాసులు ఆలస్య సుంకముగ లెక్కకు సరిపోయినది.

జారచోరత్వములు - కూటసాక్ష్యము పలుకుట - మహాపాపములుగ పరిగణింపబడినవి. గాడిద నెక్కుట గూడ మహాపాపము. గాడిదపై ఎక్కించి ఊరేగించుట కలదు. పెద్ద నేరములు చేసిన వారిని ఆనాడు గాడిదపై ఊరేగించుచుండిరి కాబోలు. పెక్కు నేరములకు నిష్కృతి జరిమానా చెల్లించుటయే. హత్య సల్పిన వారికి గూడ పలు సందర్భముల విధింపబడిన శిక్ష సమీపదేవాలయమునందు దీపారాధన కైంకర్యము నెలకొల్పవలె ననుటయే.

ఒక నాడళ్వాన్ రెండవ రాజేంద్రుని సేనలో విలుకాని నొకని పొడిచి చంపెను. రాజు, గ్రామసభకు శ్రీముఖము నంపుచు,

(4) 308 of 1927.

దేవాలయమున నిత్యదీపారాధనకు అహంత 96 గొఱ్ఱెలను దానము చేయవలెనని శాసించెను. ఒక గ్రామోద్యోగి, అగడము భరింపలేక, ఒక స్త్రీ ఆత్మహత్యకు పాల్పడెను. ఆ ఉద్యోగికి 32 కాసులు అపరాధ సుంకము చెల్లించుకొనవలసి వచ్చినది. ఒక భటుడు, మరి యొక భటుని హత్యచేసిన సందర్భమున చుట్టాలందరు చేరి చేసిన పరిష్కారము హంత నిత్యదీపారాధన దానము చేయుటయే. దీనినిబట్టి హత్యసల్పిన చోళరాజ్యమున మరణశిక్ష యుండెడిది కాదని చెప్పరాదు. ఒక వెళ్ళాలుడు హత్యచేసినప్పుడు భట్టు చెప్పినతీర్పు గమనింపదగినది. హత్యకు మరణశిక్షయే విధి. కాని వెళ్ళాళునికి మరణశిక్ష వేయరాదు గావున దీపారాధన దాన శిక్ష విధింపబడెను. మైసూరు మండలమున హులిమద్ద వద్ద- హత్యచేసిన వానికి నాత్తరాజు మరణశిక్ష విధించెను.

క్రీ. శ. 1057, మల్లయుద్ధమున రాజబంధువును చంపినందుకు ఆ మల్లునకు మరణశిక్ష విధింపబడినది.

క్రీ. శ. పదుమూడవ శతబ్దినాటి చీనారచయిత చౌ-జు-క్వ చోళుల శిక్షావిధానము గూర్చి చెప్పిన మాటలు ఉదాహరింపనగును. "నేరముచేసిన వారిని అమాత్యులు శిక్షించెదరు. చిరునేరములు చేసిన వారిని - స్తంభమునకు కట్టినుమారు 70 కొరడాదెబ్బలు కొట్టెదరు. లేదా చేతిబెత్తపు దెబ్బలు నూరు. గొప్పనేరములు చేసినవారిని ఏను గులతో త్రొక్కించెదరు. లేదా శిరశ్ఛేదము సల్పెదరు."

## వర్తకసంఘములు

వర్తకసంఘములు విరివిగ వర్ధిల్లినవి. తిరుప్పురం బియము నందలి 'వణంజీయర్' - అదిత్తపురమునందలి 'మణిగ్రామము' నిదర్శ నములు. "నానాదేశ దిశైయ్యాయిరత్తు ఐన్నూరువర్" (నానాదేశ ములనుండి యేర్పడిన 1500 మంది వర్తకులసమితి అని అర్థము.)

పేర్కొనదగినది. వీరు మునిసందై వద్ద తటాకము నిర్మించి బాగు చేయించుచుండిరి. విజయాలయుని కాలమునుండి వర్ధిల్లిన ఈ సమితి క్రీ. శ. 1015 ప్రాంతమున వీరు నిగరిలి చోల చతుర్వేది మంగలము నుండి ఒక గృహమును కొనిరి. లోబోటోయివా (సుమత్రాద్వీపము) వద్ద నున్న ఒక తమిళ శాసనశకలము క్రీ. శ. 1088 ఈ వర్తక సమితిని పేర్కొనుచుండుటచే వీరు ద్వీపాంతర వర్తకమును చేయుచుండెడి వారనుట స్పష్టము. ఇందలి వర్తకులు నానాదేశగతులు వాసుదేవ వందళి మాలభద్ర వంశీయులు. చేర చోళ పాండ్య మళయ, మగధ కౌశల సురాష్ట్ర ధానుష్ట్ర కురుంబ కాంభోజలాటు, బారువనేపాళ ఏక పద లంబకర్ణ స్త్రీరాజ్య ఘోళముఖ మున్నగు దేశముల వర్తకము సాగించిరి.

ఏనుగులు, ఉత్తమాశ్వములు, నవరత్నములు, ఔషధములు, సుగంధద్రవ్యములతో వీరు వ్యాపారము సాగించిరి. వీరి 500 వీర శాసన ప్రవర్తకులు. క్రీ. శ. 1050 నాటి వీరశాసనము వీరికి పదాతిసేన ఖడ్గహస్తులు గలరని చెప్పుచున్నది. పదమూడవశతాబ్దిలో బర్మాలోని పాగన్‌వద్ద నానాదేశులు నిర్మించిన విష్ణ్వాలయ ముండెను. 'నగరమ్'- వర్తకులు నివసించు స్థలము. మొదటి కులోత్తుంగుడు సుంకములను (ఎగుమతి దిగుమతి పన్నులను) రద్దుచేసినట్లు సమకాలీన సారస్వతమున గలదు.

ఋణపత్రములు విరివిగ వాడుకలో నుండెడివి. 12% నుండి 15% వరకు వడ్డీ యుండెడిది. సింహళము బర్మా మలయ దేశములతో మాత్రమేగాక చీనాతోగూడ వర్తకవ్యాపారములు విరివిగ సాగినవి. అరబ్బులు చోళులకు గుఱ్ఱములు దిగుమతి చేసెడివారు. చీనాలోని చ్యుయువన్ చౌ Chiuan Chow (ఫార్మోసాకు ఎదురుగ) నౌకాశ్రయనగరమున గజేంద్రమోక్షమును చిత్రించిన చిత్రములు పంద్రెండు

పదమూడవ శతాబ్దినాటివి నిస్సందేహముగ దక్షిణభారతీయులకు సంబంధించినవి గన్పించుచున్నవి.

స్త్రీలకు సంఘమున గౌరవప్రపత్తులు గలవు. కుందవాదేవి వంటి రాజపుత్రికలు సంపన్నకుటుంబములందలి వనితలు దానధర్మ కార్యములను స్వతంత్రముగ నిర్వహించిరి. సహగమనము క్వాచిత్కముగ శాసనములందు కన్పించుచున్నది. కాని అది దురాచారముగ విస్తృతము కాలేదు. గంగమహాదేవి సహగమనమునకు ముందు దేవాలయమున దీపారాధన నిత్యకైంకర్యమేర్పాటుచేసెను. తిరువాళంగాడుతామ్రశాసనమునరాజరాజుతల్లి వానవన్‌మహాదేవి,సుందరచోళుని దేవేరి - సహగమనము విపులముగ వర్ణింపబడినది. అనాడు ఆమెను ప్రశంసించిన వారు ఎక్కువ, అనుకరించినవారు తక్కువ. క్రీ శ. 1057 సంవత్సరమున మల్లయుద్ధమున రాజబంధువును చంపిన నేరమునకు మల్లునకు రాజు మరణదండన విధించెను. ఆ మల్లుని భార్య, దేకబ్బె నుంగనాడు దుర్గాధిపతి కూతురు. తలిదండ్రులు ఎంతవారించినను వినకుండ సహగమనము సల్పినది. (5) ఆ సహగమన వృత్తాంతము కావ్యఫణితిలో హృదయ విదారకముగ అభివర్ణితము. క్రీ. శ. 1067, 1068 సంవత్సరములో రెండు సహగమనములు శాసనములలో కన్పించుచున్నవి. క్రీ. శ. 1088 సంవత్సరమున మైసూరు ప్రాంతమున సహగమనము సల్పిన కోడలు వృత్తాంతమభివర్ణితము. (6) వీరరాజేంద్రుని కాలమున సహగమనము సల్పిన సతీమతల్లి మనస్సులో రేగిన ఝంఝూమారుతము, బ్రద్దలైన అగ్నిపర్వతముల పొగలు శాసనములో ప్రతిఫలించినవి. భర్త గలించిన పిమ్మట, బ్రదికినచో సవతులకు బానిస కావలసినదే. ఎందుకా పాడుబ్రతుకు !! ఆమెను

(5) 141 of 1898 EC, IV Hg 18 EI VI P P 213-9,

(6) 499 of 1911 Ec, IV Hg 100,

వారించు వారిపై శాపములు వర్షించినవి. ఆమెను కట్టుగట్టి చితిపైకి త్రోయని వారిని రౌరవాదినరకకూపములలో పడునట్లు శపించినది.(7)

ప్రజలలో చాలమంది బీదవారు కూలినాలి చేసికొని బ్రదికెడి వారు. వారికి ఏ ఆస్తిపాస్తు లుండెడివి గావు. ఇంటికన్న పదిలమైన దేవళముండెడిది. కొందరు "బానిసలు" గూడ లేక పోలేదు. పశువు లను అమ్మకము కొనుగోలు వలెనే మనుష్యులను గూడ వారి ఇష్టానిష్టములతో ప్రమేయములేకుండ అమ్ముటకొనుటఆనాడుజరిగినట్లు శాసనసాక్ష్యము గలదు. ఈ బానిసలను పెద్దయెత్తున కొన్నది దేవాలయములే. భగవత్కైంకర్యము సల్పి జన్మతరింప జేసికొను చున్నట్లు ఆ బానిసలు సంతృప్తి చెంది యుండెడివారని మనము సంతృప్తి చెందవచ్చును. దేవళము యొక్క బానిసల వీపులపై 'త్రిశూలము' ముద్ర (పచ్చ) వేసెడివారు. క్రీ. శ. 1175 లో తిరువాళంగాడు దేవళము 700 కాసులకు నల్గురు స్త్రీలను బానిసలుగ కొనెను. అరణముగ అల్లునకు వధువుతో పాటు బానిసలను పంపుట కద్దు. ఒక అల్లుడు భార్య అనుమతితో స్థానిక దేవాలయమునకు బానిసలను కొందరి నమ్మెను. వారు కొంతకాలము పిమ్మట సరిగ పనిచేయుటలేదని దేవళమునందలి స్థానాపతి గ్రామసభలో అభియోగము దెచ్చెను. కరువు సమయములలో నిరుపేదలు తమ్ము, పుట్టబోయెడి తమ సంతతినిగూడ పొట్టకక్కుర్తికి బానిసలుగ అమ్మి వేసెడివారు.

## మతములు

చోళులనాటికే బౌద్ధమతప్రభావము అడుగంటినది. ఆదిశంకరు ల దేకాలమైనను, అర్వాచీనశంకరులు శృంగేరీమఠాధిపతులు వైదిక మత పునరుద్ధరణకు కృషిసల్పిరి. శంకరాచార్యులవారి కృషివలన

[7] 156 of 1906 AEE 1907, 11, 48.

బౌద్ధముకూడ హైందవసంఘములో విలీనమైనది. అందుచే శంకర మతమును ప్రత్యర్థులు ప్రచ్ఛన్నబౌద్ధమని నిరసించిరి. శంకరాచార్యు లకు పూర్వమే వైష్ణవ ఆళ్వారులు, శైవ నాయనారులు భక్తిభావ తరంగితమైన పాటలను తమిళమున వ్రాసియున్నారు. దైవభక్తులైన ఈ యోగీశ్వరులు తమిళ నేల నాలుగు చెరగుల దివ్యనామసంకీర్తన సల్పుచు తిరుగాడి ప్రజలను పులకింపజేసిరి. దైవభక్తిమాత్రమే వారి ఆస్తి. వారు విశ్వజనీన చరితులు. రామానుజాచార్యులవారు క్రీ. శ. 1000 సంవత్సరప్రాంతమున జన్మించి 1125 వఱకు జీవించినట్లు ఐతి హ్యము. శైవులైనచోళులు రామానుజాచార్యులను అనుయాయులను హింసింపజూడ, ఆయన పాండ్యుల ఆశ్రయమున బ్రతుకగల్గినట్లు జన శ్రుతిలో ఎంతవరకు సత్యమున్నదో తెలియదు.

శైవ జ్ఞానసంబందర్ – వైష్ణవ తిరుమంగయాళ్వారు సమాగ మమును దివ్యసూరిచరిత హృద్యముగ అభివర్ణించినది. చారిత్రకముగ ఉభయుల సమావేశము అసంగతమైనను, తొలినాళ్ళలో శైవవైష్ణవ మతములు సనాతనవైదికమతపునరుద్ధరణకు సమాంతరముగ కృషి సల్పి, జైనబౌద్ధముల ప్రతిఘటించినవి. శైవమతప్రవర్తకులలో అగ్ర గణ్యుడుగ ఎన్నతగిన నంబి ఆండార్ నంబి రాజరాజునకు అతనిపుత్రుడు రాజేంద్రునకు ఇంచుమించుగ సమకాలీనుడు కావలె. వైష్ణవ సంప్ర దాయమునకు స్థిరరూపమొసగినవాడు నాథముని, తొమ్మిది లేక పదవ శతాబ్దివాడు. నమ్మాళ్వార్ (శఠకోపయతి) వ్రాసిన తిరువాయిమొళి నాథమునికి భవ్యకవితావేశము కల్పించినది. నమ్మాళ్వార్ గురువు మధురకవి. రాజరాజుకాలమున తిరువాయ్‌మొళి అధ్యయనము సల్పు వైష్ణవులకు అన్నపానవస్త్రవసతులు కల్పింపబడినవి. శైవవైష్ణవములు పరస్పరస్పర్థతో దక్షిణభారతమున వర్ధిల్లినవి.

రాజరాజు– ఉదయ్యార్ సర్వశివపండితులకు– ఆయన శిష్యు లకు వార్షికముగ ధాన్యదానము సల్పెను. ఆ ధాన్యము వారు అర్ధ

దేశము నందున్నను, మధ్యదేశమునందున్నను గౌడదేశము నందున్నను వారికి చెందవలెనని శాసించెను. మూడవకులోత్తుంగుని కాలమున క్రీ. శ. 1214 సంవత్సరమున ఓంకారదేవ ఇరావళర్, తిరుప్పాసూర్ దేవాలయమునకు దానమునిచ్చెను. ఆతడు వారణాసియందలి జ్ఞానశివ ఇరావళర్ శిష్యుడు. రాజరాజు గంగాతీరమునుండి శైవులను చోళరాజ్యమునకు రప్పించెనని సిద్ధాంతసారావళిలో నున్నది. కుందవాదేవి శివ, విష్ణు, జిన దేవాలయముల నిర్మించినది. మత సామరస్యమున నంతకంటె మంచియుదాహరణమేమున్నది. కాని - తొలినాళ్ళలో జైన బౌద్ధములపై, దండెత్తిన ఉభయమతస్థులు జైన బౌద్ధములు క్షీణించినపిమ్మట పరస్పరము కలహించుట కారంభించిరి. చోళరాజు వైష్ణవమత విధ్వంసమునకు పూనుకొనెననియు రామానుజాచార్యులవారిని దండింపయత్నించెననియు, అందుచే ప్రజావిప్లవము రేగి అందు ఆరాజు వధింపబడెననియు జనశ్రుతిలోని గాథ. ఇది అధిరాజేంద్రుని గాథయే యైనచో, ఆతడు సహనసంప్రదాయము నతిక్రమించి అసువుల గోల్పోయెననియు, సహనమే ప్రాచీనచోళసంప్రదాయమనియు తేలుచున్నదని మరియొక వాదము. సహనము తొలి నాటి సంప్రదాయ మనుట భూతార్థము. మలినాళ్ళలో అసహనము ప్రబలినది. రెండవ కులోత్తుంగుడు చిదంబర నటరాజదేవాలయమునందలి విష్ణువిగ్రహమును తొలగించుట ఉదాహరణప్రాయము. అప్పటినుండి శైవ వైష్ణవులలో పరస్పరద్వేషములు ప్రబలినవి. క్రీ. శ. 1160 లో తిరుక్కడయ్యూర్ మహాసభ వైష్ణవులతో కలిసిమెలసి తిరిగిన మాహేశ్వరుల ఆస్తి, దేవళము వశపరచుకొనునని ప్రకటించెను.

శైవులలో కాలాముఖులు తీవ్రవాదులు. వీరి నామాంతరము మహావ్రతులు. కపాలభోజనము, విభూతిధారణము, ద్రాక్షాసవ పాత్రిక, దండము చేతబట్టుట వారి వ్రతనియమములు. 'నరబలి' ని గూడ వారి మతము అంగీకరించినట్లున్నది. కోదుంబళూర్ ప్రభువు

విక్రమకేసరి (రెండవ పరాంతకుని సామంతుడు) మల్లిఖార్జునగురువు నకు దానము సల్పెను. క్రీ. శ. 1123 నాటి శాసనమున కాలాముఖ గోమదత్తు కన్పించుచున్నాడు. మేల్పాడివద్ద కాలముఖమఠముండెడిది (ఉత్తర ఆర్కాటు).

చోళుల కాలమున దేవాలములు రాజప్రాసాదములకంటె ఎక్కువ ప్రాముఖ్యము నార్జించినవి. శిథిల దేవాలములు - ఇటుక కట్టడములకు బదులు - శిలాప్రాకారగోపురాదులతో నూతన దేవాలయ పునర్నిర్మాణము జరిగినది. ఆదిత్యుడు కావేరికి ఉభయతటముల శిలాశివాలయముల నిర్మించెనని ప్రశస్తి. చోళుల కాలమున నిర్మింప బడిన దేవాలయములలో ఎన్నదగినవి తంజావూరు గంగైకొండ చోళపురమునందలి శివాలయములు. రాజరాజు కనుల ముందే, ఇంద్రజాలము నందువలె అద్భుతదేవాలయము వెలసినది. 29 వ రాజ్య సంవత్సరమున రాజరాజు దేవాలయమునకు చేసిన దానము పేర్కొన దగినది. బంగారము 41,500 కలంజులు. ఆభరణములు 10,200 కానులు. 50,650 కలంజుల వెండి. ప్రతిసంవత్సరము 116000 కలముల ధాన్యము వచ్చుభూములు. అదిగాక 1100 కాసుల నికరాదాయము వచ్చుభూములు. 400 మంది దేవదాసీలు. 212 కింకరులు, మద్దెల - తబల - జంత్రవాద్యములు - వాయించువారు, గాయకులు - అగసాలులు మున్నగువారిందు చేరిరి. దేవాలయ నిర్మాణము శిల్పులు- కర్మకారులు - కూలీలు కార్మికులు వీరి కెందరికి జీవనోపాధి గల్పించెడిదో ఊహింపవచ్చును. దేవాలయములందు ప్రోగుపడిన ధనరాశులు అర్వాచీన చరిత్రలో గజనీ మహమ్మదువంటి వారికి కన్నెఱ్ఱయగుట చరిత్ర ప్రసిద్ధము.

శైవ వైష్ణవమతములతోపాటు జైనముగూడ చోళరాజ్య మున ప్రముఖస్థానము నాక్రమించి యుండెను. తమిళవాఙ్మయమున జైనగ్రంథములు చాల గలవు. పరాంతకుని (మొదటి) కాలమున

హస్తిమల్లుని ఉదయేందిరం తామ్రశాసనమున జైనపళ్ళిక - చందమ్‌కు చెందిన భూములు మినహాయించి కడైకోట్టూర్ గ్రామదానము చేసినట్లున్నది. అనేకశాననములు జైనులమ పేర్కొనునవి గలవు. బౌద్ధమునకు సంబంధించిన శాననములు అరుదు. వేడిన్ శాసనము కులోత్తుంగుడు (మొదటి) కడారం ప్రభువు ప్రార్థనచొప్పున నేగపట్నమున బౌద్ధవిహారములకు చేసిన దానప్రశంస సుప్రసిద్ధము. కాంచిలో బౌద్ధారామ ముండెడిది.

## సారస్వతము

చోళశాసనప్రశస్తులు ఆస్థానకవులు వ్రాసినవే. కులోత్తుంగుని సేనాని, నరలోకవీరుని వర్ణించు చిదంబరం తిరువాడి శాసనప్రశస్తులు కాడవరాయల వర్ణించు అత్తి వాయలూరు వృద్ధాచలం శాసనములు కావ్యపరిభాషలో కవితాప్రౌఢిమకు ఉదాహరణ ప్రాయములు. శాసనములలో ప్రశస్తములైన కొన్నిగ్రంథములు నేడు ఉపలభ్యమానములు గావు. రాజరాజేశ్వరనాటకము, రాజరాజవిజయము, తంజావూరు దేవాలయోత్సవప్రయుక్తములు, కులోత్తుంగచోళచరిత(తిరునారాయణ భట్టరచితము) కమలాలయభట్టువిరచిత కన్నివనపురాణం, పూంపులి యూర్‌నాడగం క్రీ. శ. 1210 నాటి (సులభ) తమిళ వచన భారతము (అఱువిళై విశాఖన్ త్రైలోక్యమల్లన్ వత్సరాజ విరచితము) మున్నగునవెన్నియో కాలగర్భమున జీర్ణించినవి.

కొంగువేళీర్ ఉదయనకథను, పెరుంగదై బృహత్‌కథను రచించెను. గాంగదుర్వినీతుని (6 వ శతాబ్ది) సంస్కృత గ్రంథముపై కొంగువేళీర్ ఆధారపడెనని స్వామినాథ అయ్యర్ గారి అభిప్రాయము. తమిళకావ్యములలో నాయకమణిగ ప్రసిద్ధిగాంచిన శీవకసిందామణి. ఈ కావ్యకర్త జైనకవి తిరుత్తక్కదేవుడు, వాదిభసింహుని క్షత్ర

చూడామణిని మేలుబంతిగ గైకొనెను. క్షత్రచూడామణికి మేలుబంతి క్రీ. శ. 898 నాటి గుణభద్రుని ఉత్తరపురాణము. కావున సిందామణి క్రీ. శ. పదవ శతాబ్ది ప్రాంతము నాటిదనుట నిస్సందేహము. సిందామణి కావ్యనాయకుడు జీవకుడు. అతడు భోగి - యోగి - ధీరోదాత్తుడు - వీరశృంగారరససమ్మేళనము. అతడు అష్టమహిమలను వివాహమాడిన సన్నివేశసంకలన మీ కావ్యము. తిరుత్తక్కదేవుడు - రీతిసుభగమైన శయ్యను తీర్చిదిద్ది, కంబకవికి పూర్వరంగ ప్రవర్తకు డయ్యెను.

కల్లాడనార్ రచించిన కల్లాడము అలంకారికశయ్యతో కృతక మైన ప్రాచీనకావ్యపరిభాషతో నడచిన శైవపురాణగాథ.

మొదటి కులోత్తుంగుని ఆస్థానకవి జయంగోండారు. కళింగ త్తుపరణి మున్నగు గ్రంథములను వ్రాసెను. సమకాలీన చరిత్ర ప్రతిఫలించు అద్దాలమేడ యీగ్రంథము.వీరరసాత్మకమైన యీకావ్యము సాటిలేనిది.

సమకాలీన చారిత్రక వృత్తములు వ్రాసిన చోళ ఆస్థానకవులలో కూత్తన్ పేర్గొనదగినవాడు. విక్రమచోళుని ఉళా, రెండవకుళోత్తుంగుని గూర్చి పిళ్లైత్తమిళ వచించెను. వృద్ధ కూత్తన్ కవికి యువసమ కాలీనుడైనకవి రామాయణకార్యకర్తగా చిరస్మరణీయుడైన కంబన్‌కవి. తమిళులు తరతరాలనుండి కంబకవిని అపరవాల్మీకిగ ప్రస్తుతించు చున్నారు. అతని తండ్రి ఆదిత్యుడు. తంజావూరు మండలములోని మూకలూరు నివాసస్థలము. వుదువై ప్రభువు శరరామన్ అతనికి తొలుత ఆశ్రయ ప్రదాత. విక్రమసోలన్ - ఉళాయు ుడు ప్రస్తుతుడు. శాసనములలో అతడు గాంగేయ చేదిరాయడుగ ప్రస్తుతుడు.

కంబకవి తిరువొట్టియూరు శైవపురము నందలి దేవదాసి వల్లిని ప్రేమించెనని ఐతిహ్యము. కంబకవిని సమకాలీన రాజులు అందరు

గౌరవించి సమ్మానించిరి. కాకతిరుద్రమ, పాండ్యప్రభువులు అతనిపై చూపిన గౌరవమునకు కన్నుకుట్టి చోళరాజతని చంపించెనని ఒక ప్రవాదము జనశ్రుతిలో నున్నది. కంబకవి విక్రమచోళుని కాలము వాడని చరిత్రజ్ఞుల నిర్ణయము. పూగవెండి కవి 'నలవెంబి'ని వ్రాసెను. శేక్కిళార్ గొప్ప శైవకవి. అతని పెరియపురాణము సుప్రసిద్ధమైన శైవ ప్రబంధము- పెరుంబఱ్ఱప్పులియూర్ నంబి రచించిన తిరువిళై యాడల్ మఱియొక గొప్ప శైవ గ్రంథము. క్రీ. శ. 1313 నాటి ఉమాపతిశివాచార్యుడు శేక్కిళార్ నాయనార్ పురాణము రచించి అందు చారిత్రాంశముల వివరించెను. జైనకవి రచించిన శీవకసిందా మణి చోళాస్థానమున పఠింపబడుట కాలమును దుర్వినియోగము చేయుట యని శేక్కిలార్ నిశ్చయించి మాహేశ్వరుడైన చోళభూపతి ఆజ్ఞానుసారము అతడు పెరియపురాణమును రచించినట్లు చెప్పుదురు. ఇది శైవమున పంచమవేదమని ప్రసిద్ధికెక్కినది. నంబికవి తిరువిడై యాడల్ గ్రంథమున మధురాపురికి నంబంధించిన గాథలు శివుని 64 లీలలు అభివర్ణితములు. వైష్ణవగ్రంథములు చోళుల కాలములో తమి ళమున తక్కువ. యామునాచార్యులు, యాదవప్రకాశకులు, శ్రీ రామానుజులు సుప్రసిద్ధరచయితలు. వైష్ణవులు సంస్కృతమునే ఎక్కువ ఆదరించిరి. తమిళములో వ్రాసిన వారును సంస్కృత భూయిష్ఠమైన భాషనే ప్రయోగించిరి. తిరువాయ్‌మొళిపై రామానుజుల శిష్యుడు కురుగైప్పిరాన్ పిళ్లాన్ వ్రాసిన ఆఱాయిరప్పడి ఇట్టి గ్రంథమే. కాని కమ్మని తమిళ నుడికారములో తిరువరంగత్తు అముదనార్ గురువర్యుడు రామానుజుని ప్రశంసించుచు వ్రాసిన శతకము ఎన్నదగినది. జైనరచయిత అమితసాగరుని లక్షణగ్రంథములు యాప్పరుంగలమ్ యాప్పరులగలక్కారిగై ఎన్నదగినవి. అతడు పదవ శతాబ్దివాడు.

బుద్ధమిత్రుడు వీరడోలీయము రచించిన సామంతుడు. ఇతడు కొప్పంయుద్ధమును పూడల్ సంగమం వృత్తాంతమును ఉదాహరించెను.

వీరరాజేంద్రుని కాలము వాడనుట సుస్పష్టము. ఈ లక్షణగ్రంథము సంస్కృత వ్యాకరణమునకు తమిళవ్యాకరణమునకు సామరస్యము నెలకొల్పుటకు యత్నించినది.

చోళరాజులు సంస్కృత విద్యను పోషించిరి. కావేరీతీరస్థుడైన వేంకటమాధవుడుఋగ్వేదభాష్యమును వ్రాసెను. "నానార్థార్ణవసంక్షేప" మను చిరు సంస్కృతనిఘంటువును కేశవస్వామి చోళరాజాజ్ఞానుసారము రచించినట్లు చెప్పుకొనెను.

# రాష్ట్రకూట చరిత్ర

## క్రీ. శ. 750 - 1000

### ప్రాచీన చరిత్ర

అశోకచక్రవర్తి శిలాశాసనములు రాష్ట్రికులను పేర్కొనుచున్నవి. రాష్ట్రికులు భోజకులు పశ్చిమమున శిలాశాసనములలో కన్పించుచున్నారు. మౌర్యసామ్రాజ్యమునందు రాష్ట్రికులు భోజకులు ప్రాంతీయ పాలకులు. శాతవాహన సామ్రాజ్యమందున ఈ రథికులు మహారథికులుగా సామంతపరిపాలకులుగా కన్పించుచున్నారు 'మహారథిత్రనకయిర' పుత్రిక నాయనిక శాతకర్ణి చక్రవర్తి భార్య. నానాఘాటు కుడ్యశిలాప్రతిమలలో ఈ మహారథిప్రతిమ కన్పించుచున్నది. శాతవాహనసామ్రాజ్యమున రాష్ట్రికులు లేక రథికులు భోజకులు మహాభోజులు ఎందరో కన్పించుచున్నారు. కళింగచక్రవర్తి ఖారవేలుడు పశ్చిమదండయాత్రలో రాష్ట్రికులను భోజులను జయించి వారి ఛత్రములను ధనసంపదలను కొల్లగొట్టినట్లు హాతిగుంఫ శిలాశాసనములో గలదు.

కార్లేలో అర్వాచీనకాలమున మహారథి గోతిపుత, అగిమితనక, మహారథి వాశిష్టిపుత సోమదేవుల దానశాసనములు గలవు. సోమదేవుడు ఒక గ్రామమును దానము చేసినాడు గనుక రాజ్యపరిపాలకుడు. కాన్హేరి శిలాశాసనము మహారథిని నాగమూలనికను ఆమెసోదరుడు 'భోజు'ని పేర్కొనుచున్నది.

చదకనికలాలయమహారథి తగరము నాణెములు చితల్‌దుర్గ సమీపమున దొరికినవి, ఈ నాణెములు క్రీ. శ. 3 వ శతాబ్ది మధ్య

నాటివని రాప్సను అభిప్రాయము. ధర్మమహారాజాధిరాజు శివస్కంధవర్మ హిరడగళ్ళ శాసనములో రథికులు గలరు.

రాష్ట్రకూటుల ప్రాచీనావాసమునుగురించి చరిత్రకారులలో ఏకవాక్యత కుదురలేదు. బండార్కరు పండితులు అశోకుని కాలములోని రాష్ట్రికులే అర్వాచీనకాలమున మహారాష్ట్రికులై మహారాష్ట్రమును ప్రాచీనకాలమునుండి పరిపాలించినారని నిర్వచించినారు. కాని మహారథులు అశోకుని సామ్రాజ్యమున శాతవాహనసామ్రాజ్యముననే గాక చాళుక్యసామ్రాజ్యమునగూడ గన్పించుచున్నారు. వారు మహారాష్ట్రముననే గాక స్థలాంతరముల గూడ గన్పించుచున్నారు. వైద్యగారు రాష్ట్రికులు ప్రాచీనకాలమున సేనాపతులనియు, మహారాష్ట్రులు వివిధ రాష్ట్రములుగా వీరు అన్యోన్యము విభాగించుకొన్నారనియు తలచుచున్నారు. రాష్ట్రికులు మహారథులు గుజరాతు వనవాసి తెలుగు కన్నడదేశములలో గూడ కన్పించుచుండుటచే వైద్యగారి వాదమునకు విప్రతిపత్తి ఏర్పడుచున్నది.

'బర్నెలు' దొర రాష్ట్రకూటులు తెలుగు దేశస్థులని అర్వాచీనకాలమున వీరే రెడ్లుగా మారినారని నిర్వచించినారు. మైసూరు మండలమున పశ్చిమోత్తరమునను తమిళదేశమునందును గూడ రెడ్లు కలరు. కాని మైసూరుదేశములో రెడ్లు తెలుగువారు అరవదేశములోని రెడ్లు నేటికిని అపభ్రంశమైన తెలుగు మాట్లాడుచున్నారు. కాని బర్నెలుగారి అభిప్రాయముతో రాష్ట్రకూటుల చరిత్ర వ్రాసిన సదాశివ ఆల్టేకరుగారు ఏకీభవించలేదు.

ఆల్టేకరుగారు కృష్ణా గోదావరీ ముఖద్వారమధ్యదేశమున రాష్ట్రకూటులు ప్రాచీనచరిత్రలో నున్నట్లు ఆధారములు లభింపక పోవుటచే వారి ప్రాచీనావాసము తెలుగు దేశము కాదు అని పూర్వపక్షము నెలకొల్పుచున్నారు. తెలుగుదేశమనిన కృష్ణా గోదావరీ

ముఖద్వార మధ్యదేశము మాత్రమే గాదు. క్రీ. శ. మొదటి శతాబ్ది నుండి కృష్ణానదీముఖద్వారమునుండి పశ్చిమమున సుదూరము ఆంధ్ర దేశము వ్యాపించియున్నట్లు విదేశీయులు పేర్కొనినారు. నేడు గూడ తెలుగు దేశమనిన కృష్ణా గోదావరీ ముఖద్వార మధ్యదేశము మాత్రమే గాదు. హిరహడగల్లి శాసనము రథికులను పేర్కొనినది. ఆ శాసనదాత శివస్కంధవర్మ తెలుగు దేశము నేలిన రాజు. హిరహడగల్లి బళ్ళారి మండలము. బళ్ళారి మండలము ఆంధ్ర కన్నడ ద్విభాషాప్రాంతము.

ఆల్టేకరుగారు 'రాష్ట్రకూట' శబ్దమునకు ప్రాచీనస్వరూపమైన 'రట్టు' 'రడ్డ' 'రెడ్డి' గా మారుట తెలుగు భాషా స్వభావ విరుద్ధమని ఆక్షేపణ తెల్పుచున్నారు. తమిళములో నట్టిది సాధ్యమని వారి యభిప్రాయము. ఈ ఆక్షేపణ అసలే నిలువదు. తమిళము తెలుగు సోదర భాషలు. ఈ రెండు భాషల ప్రాచీనస్వరూపసామ్యముపై అభిప్రాయభేదము పండితులలో లేదు. 'రాట్టు' 'రడ్డ'గా మారినది ప్రాచీనకాలమునగదా. ఆ నాటికే తెలుగుభాషాస్వరూపము ఇంకను లభించుట లేదు - కాని తమిళమునకు సన్నిహితము. అట్లైన తమిళములో సాధ్యమైనది ప్రాచీనాంధ్రభాషలో సాధ్యమగునని చెప్పవచ్చును. అంతేగాదు. తెలుగుభాషలో 'ట' కారము 'డ' కారముగా మారదను ఆల్టేకరుగారి అభిప్రాయము నిరాధారము. 'అటవి' 'అడవి' మున్నగు శబ్దములలో టకార డకారములకు అభేదము సిద్ధించుటయే గాక ద్రుతముమీది టకారము డకారమగునని వ్యాకరణసూత్రము. కావున 'రట్టి' 'రడ్డి' గా రెడ్డిగా తెలుగులో సులభముగా మారినది. మల్లంపల్లి సోమశేఖరశర్మగారు రాష్ట్రకూట శబ్దము 'రెడ్డి' శబ్దముగా నెట్లువిపరిణామమును చెందినదో సోదాహరణముగ సూచించినారు.(1)

(1) రాజరాజ నరేంద్ర పట్టాభిషేక సంచిక.

అర్వాచీన రాష్ట్రకూటరాజగు దంతిదుర్గరాజు వంశమునకును గల సంబంధము నిష్కర్షగా నిర్ణయించుట కష్టముగాని దంతి దుర్గరాజు నన్నరాజు ఏకవంశీయులని ఊహింప వచ్చును. ఉభయ వంశముల రాజలాంఛనము గరుడపతియే. దంతిదుర్గవంశీయుల నామములు నన్నరాజవంశీయుల నామములలో సాదృశ్యము గలదు.

తివర్కేడు శాసనము అచలపురము నుండి ప్రచురితము. ఇదియే అద్యతన కాలములోని బీరారులోని ఎలిచ్‌పూరు. తివర్కేడు ఎలిచ్‌పూరు నుండి 55 మైళ్ళు. మూల్తానా శాసనములలోని స్థలములను గుర్తించు టకు వీలు లేదు కాని శాసనము దొరికిన స్థలము మూల్తానా తివర్కేడుకు 20 మైళ్ళు దూరములో నున్నది. కావున నన్నరాజు వంశీయులు బేరారు రాష్ట్రమున అచలపుర ప్రాంతమును క్రీ. శ. 7 వ శతాబ్దిమధ్య భాగమున పరిపాలించి నారని యెంచవచ్చును.

దంతిదుర్గరాజు గుజరాత్ ఉత్తర మహారాష్ట్రమును జయించి సింధు, మాళ్వ, కోసల రాజులను ఓడించి నాడు. దంతి దుర్గ రాజు తండ్రి చాళుక్యకన్యకమరాక్షనవివాహమున పరాక్రమము చేసంపాదించి నారు. దీనిని బట్టి దంతిదుర్గ, ఇంద్రరాజుల పూర్వికులు బేరారు ప్రాంతమున నుండి పరిపాలించినట్లుగపడును. పురుషాంతరమునకు 20 సం. లని గణించిన కృష్ణుని నుండి ప్రాచీనరాజుల వంశవృక్షమును కాలనిర్ణయమును దిఙ్మాత్రముగ ఆల్టేకరు గారు సూచించినారు.

| | | | | |
|---|---|---|---|---|
| (1) | దుర్గరాజు | | | క్రీ. శ. 570 – 590 |
| (2) | గోవిందరాజు | (1) | కుమారుడు | క్రీ. శ. 590 – 610 |
| (3) | స్వామికరాజు | (2) | కుమారుడు | క్రీ. శ. 610 – 630 |
| (4) | నన్నరాజయుద్ధాసుర | (3) | కుమారుడు | క్రీ. శ. 630 – 650 |
| | క్రీ. శ. 631 – శాసనము. | | | |
| (5) | దంతివర్మ | | | క్రీ. శ. 650 – 670 |

| | | | | |
|---|---|---|---|---|
| (6) | ఇంద్రపృచ్ఛకరాజు | (5) | కుమారుడు ,, | 670 - 690 |
| (7) | గోవిందరాజు | (6) | ,, ,, | 690 - 710 |
| (8) | కర్కరాజు | (7) | ,, ,, | 710 - 730 |
| (9) | ఇంద్రరాజు (30) | (8) | ,, ,, | 730 - 745 |
| (10) | దంతిదుర్గ (30) | (9) | ,, ,, | 745 - 756 |
| (11) | కృష్ణ I | (9) | పినతండ్రి క్రీ. శ. | 756 - 775 |

శాసనములు క్రీ. శ. 758, 768, 772

పై వంశవృక్షమును బట్టి నన్నరాజు దంతివర్మకు తండ్రి గాని సోదరుడు గాని యై యుండవచ్చును. నన్నరాజు అనంతరము అద్యతనభావిలో దంతివర్మ పరిపాలించినట్లు తోచుచున్నది. (3)

కర్కరాజు ( ii ) అంత్రులి ఛరోలిశాసనములు మరియొక రాష్ట్రకూటవంశమును పేర్కొనుచున్నవి. ఈ శాసనకాలము క్రీ. శ. 757. అంత్రోలి - ఛరోలి సూరతునకు పదిమైళ్ళదూరములోనిది. దానగృహీత బరోచ్ మండలములోనున్న జంబూసారము వాడు. కర్కరాజు( ii ) సూరత్, బరోచ్ మండలముల పాలించియుండును. కర్కరాజు పూర్వికులు ఆ ప్రాంతమును పరిపాలింపలేదు. ఆ మండలములను క్రీ. శ. 8 వ శతాబ్దిలో గుజరాతు చాళుక్యులు పరిపాలించినారు. కర్కరాజు రాజలాంఛనము గరుడపక్షి. ఆ శాసనములోని వంశవృక్షము.

---

(3) ఇంద్ర దంతిదుర్గులకు 15 సం. మాత్రమే గణనము నన్నగుణావలోకుడు, ఇంద్రుని తమ్ముడు 792 లో దౌలతాబాదు శాసనములో గన్పించుచున్నాడు.

EI III pp 195 ff,

(1) కర్కరాజు
|
(2) ధ్రువ — (1) కుమారుడు
(3) గోవిందరాజు (2) ,,
(4) కర్కరాజు ii (3) ,,

కర్కరాజు శాసనకాలము క్రీ. శ. 757. వీరి లాంఛనములనుబట్టి నామధేయములనుబట్టి మూలరాష్ట్రకూటవంశమునకు సంబంధించి నట్లు స్వయంవ్యక్తమగుచున్నది.

దంతిదుర్గరాజు లాటదేశమును జయించినట్లు చెప్పికొన్నాడు. కర్కరాజు లాటదేశములో కొంతభాగమును పరిపాలించుచున్నట్లు పూర్వోక్తమైన అంత్రోలి - ఛరోలి శాసనములు చెప్పుచున్నవి. కావున దంతిదుర్గరాజు జయించిన లాటదేశమును రాజప్రతినిధిగ కర్కరాజు పరిపాలించియుండును. భగవాన్‌లాల్ ఇంద్రాజీ అంత్రోలి ఛరోలి శాసనములోని ధ్రువుడు ఒకటవ ఇంద్రునికి సోదరుడై యుండునని సూచించినారు. దీనినిబట్టి ఒక వంశవృక్షమును నిర్మించిరి.

కర్క I

| ధ్రువ | ఇంద్ర | కృష్ణ 788, 768, 772 A D | నన్నరాజు 793 |
|---|---|---|---|
| గోవింద | దంతిదుర్గ క్రీ. శ. 754 | | |
| కర్క ii క్రీ. శ. 757 | | | |

పై వంశవృక్షములో అనేక ప్రాతిపదికలు ఊహామాత్రములు. చరిత్రకారులలో అంత్రోలి, ఛత్రోలి శాసనములోని రాష్ట్రకూటులకు దంతిదుర్గ వంశమునకు గల సంబంధమునుగురించి ఏకవాక్యత కుదురలేదు.

ఆల్టేకరుగారు అంత్రోలి ఛత్రోలిలోని కర్కరాజు ఇంద్రప్పృచ్ఛ రాజునకు సోదరుడని అతని వంశీయులు ధ్రువ, గోవింద, కర్క రాజులు మూలకుటుంబములోని గోవింద కర్క ఇంద్రరాజులకు సమ కాలిక జ్ఞాతిసోదరులని ఊహించుచున్నారు. ఇది ఊహ. సమంజస ముగా నున్నను చారిత్రకాధారములేదని వారి అభిప్రాయమే.

దంతి దుర్గరాజవంశములో ప్రాచీనులు ప్రాంతీయపరిపాలకులు లేక సామంతులు. నన్నరాజు స్వయం పరాక్రమమున పంచమహా శబ్దములను రాజపదవిని సంపాదించినాడు. నన్నరాజునకు అద్యతన భావిలో దంతివర్మ పరిపాలించినాడు. దశావతార శాసనము ఈ రాజును పేర్కొనుచున్నది. ఇతనిపేరు గుజరాతు రాష్ట్రకూటులలో ధ్రువరాజసోదరుడు వహించినాడు. ఇతని తరువాత ఇంద్రప్పృచ్ఛక రాజు గోవింద రాజు I పరిపాలించినారు. క్రీ. శ. 812 కర్కరాజు సువర్ణవర్షు బరోడా శాసనములు గోవిందుడు శివునికి దక్క అన్యులకు నమస్కరింపలేదని వర్ణించుచున్నవి. చాళుక్యరాజులైన మంగలేశునకు పులకేశి II నకు జరిగిన వారసత్వయుద్ధమును పురస్కరించుకొని భీమానదికి ఉత్తరదిక్కునుండి అప్పాయకరాజుతో గలిసి దండెత్తిన గోవిందు డితడే యని కొందఱు చరిత్రకారుల అభిప్రాయము. ఈ విషయమును ఐహోలు శాసనము పేర్కొనుచున్నది. గోవిందుడు బేరారులో రాజ్యము సల్పుచున్నాడు గనుక అతడే భీమానదికి ఉత్తరము నుండి దండయాత్ర సలిపి యుండును. కాని ఇతని మనుమడు క్రీ. శ. 772 లో పరిపాలించినాడు. కావున నితడు 172 సం. పూర్వము

క్రీ. శ. 610 ఐహోలు శాసనమునాడు ఉండుట సంభవింపదని ఆల్టేకరు గారు పూర్వపక్షము నెలకొల్పుచున్నారు.

గోవిందుని తరువాత కర్కరాజు i పరిపాలించినాడు. ఇతనికి పలువురు కుమారులు గలరు. అందు దంతిదుర్గరాజు తండ్రియైన ఇంద్రుడొకడు. ఇంద్రుని తరువాత దంతిదుర్గరాజు పరిపాలించినాడు. దంతి దుర్గరాజు అపుత్రకుడై మరణించిన తరువాత అతని పినతండ్రి కర్కుని కుమారుడు రాజ్యము చేసినాడు. నన్నగుణావలోకుడు కర్కుని కనిష్ఠకుమారుడు. ఇతడు క్రీ. శ. 793 సం. జీవించియున్నట్లు అతని కుమారుడైన శంకరగణుని దౌలతాబాదు శాసనమువల్ల ఊహింప వచ్చును.

రాష్ట్రకూటరాజ్యచరిత్రను చిత్రించుటకు బూర్వము క్రీ.శ. 8వ శతాబ్దినాటి దక్షిణాపథరాజ్యరంగమును సమీక్షింపవలెను. చాళుక్య సామ్రాజ్యము దక్షిణాపథమును కంచివరకు ఆక్రమించినది. దక్షిణమున పల్లవులతో ఎడతెగని యుద్ధములు జరుగుచున్నవి. వేంగిరాజ్యమును తూర్పుచాళుక్యులు పేరునకు సామంతులైనను సర్వతంత్ర స్వతంత్ర ముగా పరిపాలించుచున్నారు. ఉత్తరమున దక్షిణ గుజరాతువరకు చాళుక్యసామ్రాజ్యము విస్తరించినది. మధ్యపరగణాలలో కొంతభాగము క్రీ. శ. 6 వ శతాబ్దిలో కాలచూరిరాజు శంకరగణుని మంగళేశుడు జయించినప్పుడు చాళుక్య సామ్రాజ్యమున గలసిపోయెను. బేరారు రాష్ట్రమున కొన్నిప్రదేశములను దంతిదుర్గరాజు వంశీయులు పరిపాలించిరి. వీరు చాళుక్యరాజులకు సామంతులై పరిపాలించి యుందురు. క్రీ. శ. 743 లో చాళుక్యచక్రవర్తి విక్రమాదిత్య ii రాష్ట్రకూటరాజు గోవిందుని ప్రార్థనానుసారముగ ఒక బ్రాహ్మణునికి ఒక గ్రామమును దానముచేసినాడు. శైలోద్భవ వంశీయుడైన జయవర్ధనుడు రాఘోలి శాసనములో పరమమాహేశ్వర సకల విద్యాధి

పతి మహారాజాధిరాజ రాజపరమేశ్వర అని చెప్పికొన్నాడు. రావుబహదూరు హీరాలాల్‌గారు ఈ శాసనము క్రీ. శ. 8 శతాబ్దినాటిదని సూచించుచున్నారు. చాళుక్యసామ్రాజ్యము జయవర్ధనుని బట్టి ఉత్తరమున సన్నగిలినదని ఊహింపవచ్చును. ప్రాచ్యకోసల రాజ్యమున ఉదయనరాజు క్రీ. శ. 8 వ శతాబ్దిప్రాంతమున సిరపురప్రాంతమును పరిపాలించినాడు.

సంజము శాసనము రాష్ట్రకూట ఇంద్రరాజు చాళుక్యకన్యకయైన భావనాగను కైరా వివాహమండపమునుండి గొనివచ్చి రాక్షసవివాహమున స్వీకరించినట్లు చెప్పుచున్నది.

అకబిలాదూరి అను మహమ్మదీయచరిత్రకారుడు సింధురాష్ట్రములోని అరబీపాలకుడైన జానియడ్, మార్వారు. బరోచ్, ఉజ్జయిని, మాళ్వభీనమన్ దేశములపై దండయాత్రను సలిపెను అని చెప్పినాడు. ఈ విషయమును పులకేశిరాజు నయోనరి శాసనము గూడ పేర్కొనుచున్నది. సింధు, గూర్జర, కచ్ఛ మొదలగు రాజ్యముల జయించిన మహమ్మదీయ సైన్యమును పులకేశిరాజు మరలించెను. ఈ శాసన కాలము క్రీ. శ. 739 పులకేశి క్రీ. శ. 731 న సింహాసన మధిష్ఠించినాడు. కావున 731-739 మధ్య ఈ దండయాత్ర జరిగియుండును. క్రీ. శ. 745 ప్రాంతమున అవ్యవస్థితమైన రాజ్యాంగరంగము దంతిదుర్గరాజు ఆశలకు దోహదము కల్పించియుండును.

క్రీ. శ. 754 లోని సమలిగడ్ శాసనము ఎల్లోరా గుహాలోని దశావతార శాసన ఖండము అర్వాచీన రాష్ట్రకూట రాజశాసనములు దంతిదుర్గరాజు చరిత్రమును తెలుపుచున్నవి.

వానినిబట్టి దంతిదుర్గరాజు కాంచి, కళింగ, శ్రీశైల, కోసల, మాళవ లాట తంక సింధు దేశరాజులను జయించినట్లు తెలియుచున్నది.

దంతిదుర్గ కాలమున రాష్ట్రకూటుల విజయములలో పేర్కొన తగినది చాళుక్య చక్రవర్తియైన కీర్తివర్మను ii జయించుట. అర్వాచీన శాసనములు కొన్ని ఈ కీర్తిని కృష్ణ i రాజునకు మరికొన్ని దంతిదుర్గ రాజునకు ఇచ్చుచున్నవి.

నందివర్మమహారాజు ii 21 వ సం. నున్న ఉదయేందిరము * శాసనములో శబరరాజు ఉదయనుని బందీకృతుని చేసినట్లు అశ్వమేధ యాగమును జేసిన పృథ్వీవ్యాఘ్రుని జయించినట్లును గలదు. దంతి దుర్గరాజు కోసలను జయించినట్లు అనేకశాసనములు బేర్కొనుచున్నవి. కావున ఈ దండయాత్రలో నందివర్మ ii దంతిదుర్గరాజులు పరస్పర సాహాయ్యమొనర్చుకొనియుందురు. చాళుక్యరాజు కీర్తివర్మ ii రాష్ట్ర కూటరాజ్యమునకు పొరుగువాడు. దంతిదుర్గరాజునకు నైసర్గికవిరోధి. అతని విరోధియైన పల్లవరాజు నందివర్మ దంతిదుర్గరాజునకు అవ్యాజ మైత్రి కుదురుటలో ఆశ్చర్యము లేదు. పరానుపండితుడు, డూబ్రియులు దంతిదుర్గరాజు ఈ మైత్రిని నందివర్మకు తన కూతురగు శంఖాదేవిని ఇచ్చి వివాహబంధముతో దృఢతరము చేసినాడని ఊహించుచున్నారు. 'శంఖ' దంతిదుర్గపుత్రిక కాకపోవచ్చునని, ఒకవేళ అట్లైనను యీ నందివర్మ ii యేశంఖాదేవి భర్తయని చెప్పుటకు వీలులేదని అల్టేకరుగారి అభిప్రాయము. కాని శంఖాదేవి రాష్ట్రకూట రాజకన్యక. నందివర్మ ఎవరైనను పల్లవరాజు. దీనినిబట్టి రాష్ట్రకూటరాజ్యమునకు పల్లవ రాజ్యమునకు గల మైత్రియేగాక ఉభయులకు చాళుక్యరాజ్యముతో గల వైరుధ్యము న్వయంవ్యక్తమగుచున్నది. దశావతారశాసనము మున్నగు నవి దంతిదుర్గరాజు కాంచిరాజనుగూడ జయించినట్లు చెప్పుచున్నవి. కాని దీనినిబట్టి పల్లవ రాష్ట్రకూట మైత్రికి విప్రతిపత్తి ఏర్పడుచున్నట్లు భావింపరాదు. నందివర్మ మహారాజు పల్లవరాజు పరమేశ్వరవర్మ

* ఉదయేందిరము శాసనము కృతకమని కొందఱి యూహ.

కుమారుడుగాదు. పరమేశ్వరవర్మను గాని, అతని అర్వాచీన రాజును గాని నందివర్మ జయించి రాజ్యమునకు వచ్చియుండును. దంతిదుర్గ రాజు నందివర్మకు ఈ యుద్ధములో సహాయముచేసి యుండును. అందుచే నందిదుర్గ కాంచిరాజును జయించినట్లు ప్రస్తుతి కలదు. ఈ మహాయుద్ధసంరంభములో దంతిదుర్గరాజునకు దక్షిణముననున్న శ్రీశైలాధీశునకు సంఘర్షణము సంభవించియుండు.

నందివర్మ ii తోడిమైత్రివలన ప్రాచ్యభాగమున సంపాదించిన విజయములవలన దంతిదుర్గరాజు గుజరాతు చాళుక్యులను బరోచ్ గూర్జరులను జయించినాడు. ఈ రెండురాజ్యములు అరబ్బుదాడివలన అంతకుపూర్వమే దుర్బలముగా నున్నవి. దంతిదుర్గరాజు విజయములు చాళుక్యరాజు కీర్తివర్మ ii తో విరోధమును తెచ్చిపెట్టినవి. క్రీ. శ. 754 లోని సమంగడశాసనములో చాళుక్యరాజును సులభముగా జయింపగల్గినట్లు గలదు. (4) సమంగడశాసనము పేర్కొనిన గ్రామములను బట్టి ఈ విజయమువలన దంతిదుర్గరాజు నాసిక, పూనా, సతారా, కాండెష్, కొల్హాపూర్ ప్రాంతముల నాక్రమించినాడని చెప్పవచ్చును. కాని దీనితరువాత చాళుక్యరాజు కీర్తివర్మ ii కర్ణాటకదేశమును షోలాపూరువరకు పరిపాలించినాడు. క్రీ. శ. 757 సం. లో అతడు సేనతో భద్ర - గవిత్తగ దగ్గరవిడిసినాడు. (5) కాని అర్వాచీన చాళుక్య

---

(4) స్వభ్రూవిభంగ మగృహీత నిశాతశస్త్రమ్
అశ్రాంత మప్రతిహతాజ్ఞ మపేతయంతమ్
యో వల్లభం సపది దండబలేన జిత్వా
భృత్యైః కియదిర్భపి యః సహసా జిగాయ॥

**I. A. XI pp 117**

(5) కీర్తివర్మ వక్కేరి శాసన **E I. V pp 202**

శాసనములు చాళుక్యసామ్రాజ్యకీర్తి కీర్తివర్మతో అస్తమించినట్లు ఒప్పు కొనుచున్నవి. (6)

దంతిదుర్గరాజు తంక, సింధు, మాల్వదేశాధీశులను జయించి నట్లు గలదు. తంకదేశము ఎచ్చటిదో గుర్తింపలేము. సింధుదేశము లోని అరబ్బులు పశ్చిమముననున్న రాజ్యములపై అప్పుడప్పుడు దండయాత్ర సలిపెడి వారు. ఉజ్జయినిపై దంతిదుర్గరాజు దండయాత్ర సలిపినాడు. ఈ దండయాత్ర గూర్జర ప్రతిహార పాలకుడైన దేవరాజు నకు తోడ్పడుటకు సల్పియుండును. దశావతారశాసనములో దంతిదుర్గ రాజు గుర్జర సౌధమును ఆక్రమించినట్లు గలదు. (7) సంజము శాసనములో దంతిదుర్గుడు ఉజ్జయినిలో హిరణ్యగర్భయజ్ఞమును చేసినప్పుడు గుర్జరాది దేశపాలకులును ద్వారపాలకులుగా నిల్పినట్లు గలదు. (8)

గుజరాతును జయించిన తరువాత దంతిదుర్గరాజు అంత్రోలి - ఛరోలి శాసనదాతయగు కర్కని (ii) రాజప్రతినిధిగా నియమించి యుండును. కర్కని శాసనములో అతని పూర్వీకులెవ్వరు గుజరాతును జయించినట్లు లేదు. దంతిదుర్గరాజే గుజరాతును జయించినాడు. గనుక రాజవంశీయుడైన కర్కని (ii) రాజప్రతినిధి పదవి లభించి యుండును. కర్కని బిరుదావళులలో అతడు స్వతంత్రరాజుగ కన్పించుట లేదు.

---

(6) తద్భవో విక్రమాదిత్యః కీర్తివర్మా తదాత్మజః
యేన చాళుక్యరాజ్యశ్రీ రంత రాయన్య భూద్భువి॥
యేవూరు శాసనము.

(7) యస్యా ఖండిత విక్రమస్య కటకేనా క్రమ్య తీరక్షితిమ్
సౌధే ఽస్మిన్ కృత గుర్జరేంద్ర రుచిరే........॥

(8) హిరణ్యా గర్భం రాజన్యై రుజ్జయన్యాం యదాసితమ్
ప్రతిహారీకృతం యేన దుర్జరే శాది రాజకమ్॥

దంతిదుర్గరాజు మహావీరుడు. రాష్ట్రకూటరాజ్యమునకు మూల కందము. క్రీ. శ. 754 సం. రథసప్తమినాడు సువర్ణతులాభారములో తనయెత్తు బంగారమును బ్రాహ్మణులకు దానము సల్పెను. రాజమాత ఆదేశానుసారము దంతిదుర్గరాజు బ్రాహ్మణులకు అనేక భూదానములు సమర్పించినాడు. (9) ఉజ్జయినిలో హిరణగర్భమహాదానమును బట్టి దంతిదుర్గుడు మహావీరుడే గాక దానపరుడనికూడ తెలియనగును. ఇతడు క్రీ. శ. 758 వరకు పరిపాలించెను.

## కృష్ణరాజు – I

కృష్ణరాజు దంతిదుర్గుని తరువాత సింహాసనమధిష్ఠించినాడు. దంతిదుర్గుడు పుత్రసంతతి లేకుండ మరణించినందున అతని పినతండ్రియైన కన్నరరాజు సింహాసనమధిష్ఠించినట్లు కర్కరాజు ii కబ్ధశాసనము పేర్కొనుచున్నది. గుజరాతు శాఖలోని కర్కరాజు బరోడా శాసనములలో ఒక శ్లోకములో కృష్ణరాజు దుర్మార్గుడైన రాజవంశీయునొకని పదభ్రష్టుని సల్పినట్లు గలదు. దీనినిబట్టి కృష్ణరాజు దంతిదుర్గుని పదభ్రష్టుని సల్పినట్లు ఊహింపరాదు. డా. బండార్కరుగారు సూచించినట్లు కృష్ణరాజు తన దానశాసనములో దుర్మార్గుడైన దంతిదుర్గుని ప్రశంసించు శ్లోకములను ప్రచురింపడు. పదభ్రష్టుడైన రాజబంధువు అంత్రోలి – ఛరోలి శాసనప్రదాతయైన కర్క ii కావచ్చును. అందు 'సమధిగత పంచమహాశబ్ద పరమభట్టారకమహారాజాధిరాజ పరమేశ్వర' అను ప్రశస్తి కలదు. దంతిదుర్గరాజు మరణానంతరము కర్క ii రాజు చక్రవర్తిగా ప్రకటించుకొని యుండును. ఇతనిని కృష్ణరాజు పదభ్రష్టుని సల్పియుండును. అతడే ఇతడైనను కాకపోయినను దంతిదుర్గమహారాజును మాత్రము కృష్ణరాజు పదభ్రష్టుని సల్పలేదనుట

(9) నమంగడ శాసన **I. A. XI. pp 1116.**

భారత ఇతిహాస సంశోధకమండలి శాసనమునుండి అభివ్యక్తమగుచున్నది.

గుజరాతుశాఖ రాష్ట్రకూట శాసనములలో కొన్ని కృష్ణరాజు బలదర్పగర్వితుడైన రాహప్పను జయించి రాజాధిరాజ పరమేశ్వర బిరుదాంకితుడైనట్లు చెప్పుచున్నవి. రాహప్ప ఎవరో చెప్పుట కష్టము. ఈతడు మాళవాధీశుడు లేదా కర్ణాటదేశాధీశుడు కావచ్చునని ఆల్టేకరుగారి అభిప్రాయము. (10)

చాళుక్య చక్రవర్తి కీర్తివర్మ శాసనములు క్రీ. శ. 747 వరకు కర్ణాటకములో కన్పించుచున్నవి. కృష్ణరాజు క్రీ. శ. 758 భారత ఇతిహాస పరిశోధక శాసనములు అతని చాళుక్య విజయమును ప్రస్తావించుట లేదు. కావున క్రీ. శ. 758 తరువాత చాళుక్యుల జయించి దక్షిణమున రాష్ట్రకూట రాజ్యమును కృష్ణరాజు విస్తరించినాడు.

క్రీ. శ. 768 లో తలెగవన శాసనములో కృష్ణరాజు ప్రస్తుత మైసూరుమండలములోని మన్నెదగ్గర గంగవాడి దండయాత్ర సంరంభమున విడిసినట్లు గలదు. (11) శ్రీపురుమని కాలములో గంగవాడిపై రట్టుల దండయాత్రను తంకూరుమండలములోని శాసనము పేర్కొనుచున్నది. (12) ఆ శాసనములో దండయాత్రలో రట్టుల నెదుర్కొని మరణించిన వీరపురుమని పరాక్రమ ప్రశంస కలదు. దీనినిబట్టి కృష్ణరాజు చాళుక్యరాజ్యమును జయించిన తరువాత గంగవాడిని జయించినాడు. గంగరాజ్యరాజధానియైన 'మన్నె' నుండి ఇచ్చిన తలెగవన దానశాసనము దీనికి నిదర్శనము.

---

(10) ఆల్టేకరు p 43.

(11) EI, XIII 275 p.

(12) EC, XII Maddagiri No. 99.

క్రీ. శ. 770 సం. లో యువరాజు గోవిందుని అధ్వర్యమున వేంగిపై దండయాత్ర నడచినది. అతడు మూసి కష్ణాసంగమస్థలమున వేంగిపురమునకు 100 మైళ్ళ దూరమున విడిసినాడు. (13) అతడు వేంగిరాజ్యమును పరిపాలించుచున్న విష్ణువర్ధనరాజు IV ను జయించి నాడు. క్రీ. శ. 772 లోని భందుక శాసనములను బట్టి మహారాష్ట్రము మధ్యపరగణాలు కృష్ణుని రాజ్యములో నున్నట్లు తెలియుచున్నది.(14)

కృష్ణరాజు దక్షిణకొంకణమునుగూడ జయించినట్లు ఊహింప వచ్చును. ఖరేపట్టణశాసనములో రట్టరాజు వంశకర్త. సణపుల్లుడు కృష్ణరాజు దయచే సహ్యాద్రి సముద్రమధ్యదేశమును సంపాదించినట్లు గలదు. (15)

శీలాహారులు రాష్ట్రకూటుల సామంతులు. రట్టరాజునుండి పురుషాంతరమునకు 25 సం.లు గడించిన సణపుల్లుని కాలము 8 వ శతాబ్దిమధ్యభాగమగుచున్నది. కావున ఆనాడు దక్షిణకొంకణమును కృష్ణరాజు i జయించినట్లు ఊహించుట సమంజసము.

దంతిదుర్గరాజు ఆరంభించిన విజయయాత్ర కృష్ణమహారాజు ముగించినాడు. 18 సం. పరిపాలనలో రాజ్యమును మూడు రెట్లు విస్తరింపజేసినాడు. అనేకవిజయములను సాధించిన వీరుడు. కొంకణ, కర్ణాటక, మధ్యదేశములను రాజ్యమున గలిపినాడు. గంగ వేంగి రాజులను జయించినాడు.

'కాంచీగుణాలంకృత విశ్వంభరా నిజవనితేవ సా తేన భుక్తా'అను తలెగవన శాసనములోని వాక్యమును బట్టి కాంచీపరిపాలకుడైన పల్లవులనుగూడ జయించెనని చెప్పవచ్చును. కాని దీనిని ఋజువు

(13) అలస్‌శాసనము E I VI, 208

(14) E I XIV t 121 p

(15) E I III, p 292

పరచు చారిత్రకాధారములు లేవు. రాష్ట్రకూట సామ్రాజ్యము దక్షిణాపథమున సుప్రతిష్ఠితము చేసి అర్వాచీనరాజులకు ఉత్తరాపథమున విస్తరిల్లుటకు మార్గదర్శకుడైనాడు.

కృష్ణరాజు శిల్పకళోపాసకుడు. జగదేక సౌందర్య శిల్ప కళా ప్రతిష్ఠిత మైన ఎల్లోరా గుహలోని కైలాసమును ఈ మహారాజు నిర్మించినాడు. ఏకశిలావిష్కృతమైన అత్యద్భుత శిల్పకళానిలయము యథార్థముగ భూలోకకైలాసము. ప్రపంచమందలి అద్భుతములలో నొకటిగ నెన్నదగినది.

కృష్ణరాజు రాజధానిని నిర్ణయించుటను చారిత్రకాధారములు లభించుట లేదు. అర్వాచీనకాలమున అమోఘవర్షుని కాలమున మాల్ఖేడు రాజధానియైనది. అమోఘవర్షుడు అమరావతిని ధిక్కరించునట్టి మాన్యకేతమును నిర్మించినట్లు శబ్దశాసన శ్లోకము గలదు. లాటూరు ప్రాచీనకాలమున రాష్ట్రకూటుల ఆవాసమైనను అది కృష్ణరాజు రాజధాని యని చెప్పుటకు ఆధారములు లేవు. అచలపురము దంతి దుర్గరాజు ప్రాచీనవంశీయుల రాజధాని. ఇది దంతిదుర్గవంశములకు గూడ రాజధాని యని ఊహింప వచ్చును. ఎల్లోరా గుహాప్రాంతమున శిథిలావశేషములతోనున్న సూలూభుంజము ప్రాచీన రాష్ట్రకూట రాజధాని యని కజిన్సు సూచన. కాని నిష్కర్షగా నిరూపించుటకు దగిన చారిత్రకాధారములు లభించుట లేదు.

## రాష్ట్రకూట సామ్రాజ్యము

క్రీ. శ. 772 ప్రాంతమున గోవిందప్రభూతవర్ష విక్రమావలోకుడు కృష్ణరాజు తరువాత సింహాసనమధిష్ఠించినాడు. క్రీ. శ. 770-772 సం. మధ్య గోవిందుడు యువరాజుగా అభిషిక్తుడైనాడు. వేంగిరాజును

ఓడించిన కీర్తి అతనికి యువరాజుగ నున్నప్పుడే దక్కినది.

గోవిందుని దౌలతాబాదు శాసనములో పారిజాతరాజును నాశనముచేసి గోవర్ధనమును సంరక్షించినట్లు గలదు. నాసికమండలము లోనున్న గోవర్ధనమును అతని సోదరుడు ధ్రువరాజు రాజప్రతినిధిగా పరిపాలించినాడు. ఈ పారిజాతరాజును నాశనము చేయుట రాజప్రతి నిధియైన ధ్రువరాజుతోగల విరోధమును సూచించుచున్నట్లు ఊహింప వచ్చును.

గోవిందరాజు (ii) సింహాసనమధిష్ఠించినతర్వాత భోగలంపటత్వ మున మునిగి పోయినాడు.

> క్రీ. శ. 770 తలెగవన్ శాసనములో గోవిందరాజు అలాస్ శాసనము. క్రీ. శ. 772 లో యువరాజుగా గన్పించుచున్నాడు.

విషయలోలుడైన గోవిందుడు రాజ్యభారమును సోదరుడైన ధ్రువునిపై వదలినాడని కృష్ణరాజు iii కర్హాడ్ దానశాసనములో గలదు. ఈ అవకాశమును ధ్రువరాజు తన అధికారమును ప్రతిష్ఠించుటకు వినియోగించుకొన్నాడు. దానశాసనములలో గోవిందుడు పేరునకు మాత్రము చక్రవర్తి. క్రీ. శ. 775 ధ్రువరాజు పింపెలి దానశాసనములో గోవిందుని ప్రస్తావనలేదు. క్రీ.శ. 779 ధూలియాశాసనములో కర్కుడు గోవిందుని చక్రవర్తిగా నుదహరించినను, భూదానమునకు తండ్రియైన ధ్రువరాజు అనుమతిని సంపాదించినాడు. గోవిందమహారాజు ధ్రువ రాజు స్వాతంత్ర్యమును శంకించి అతనిని పదభ్రష్టుని చేసి రాజప్రతి నిధిగ వేరొకని నియమించినాడు. వెంటనే ధ్రువరాజు తిరుగుబాటును నెలకొల్పినారు. భోగలాలసుడైన గోవిందుని మూలమున రాష్ట్రకూట వంశమునకే తీరని నష్టము వాటిల్లుచున్నదని వంశమర్యాదను పునః ప్రతిష్ఠించుటకే తాను సోదరుని ఎదిరించవలసి వచ్చినదని ప్రకటించి

నాడు. (16) గోవిందుని కిరీటమును త్యజింపుమని హెచ్చరించినారు. కాని గోవిందమహారాజు కాంచి, గంగవాడి, వేంగి, మాళవ దేశాధీశుల సహాయముతో ధ్రువరాజు తిరుగుబాటును అణచివేయ సంసిద్ధుడైనాడు. కాని ధ్రువరాజు గోవిందుని ఓడించి సింహాసన మధిష్ఠించినాడు. ఈ యుద్ధము దక్షిణదేశాధీశుల సహాయమునుబట్టి దక్షిణ దిగ్భాగమున జరిగియుండును. అంతకంటె విశేషములు కన్పించుట లేదు. ఈ యుద్ధములో గోవిందుడు మరణించియుండును. తదనంతరము అతని ప్రసక్తి కన్పించుటలేదు.

## ధ్రువ ధ రా వ ర్ష మ హా రా జు

గోవిందుని తరువాత ధ్రువధరావర్షమహారాజు సింహాసన మధిష్ఠించినాడు. క్రీ. శ. 779 డిసెంబరు 22 నాటి ధులియా శాసనములో ధ్రువరాజు గోవిందుని చక్రవర్తిగా పేర్కొనినాడు. ధ్రువరాజు క్రీ.శ. 779 తర్వాత ఎప్పుడు సింహాసనమధిష్ఠించినది చెప్పుటకు చారిత్రకాధారములు లేవు. క్రీ. శ. 779 తరువాత గోవిందుని శాసనములు లేవు.

ధూలియా క్రీ. శ. 779 శాసనము నాటికి ధ్రువరాజు పుత్రుడు పంచమహాశబ్దాది బిరుదాంకితుడు యుక్తవయస్కుడు. కావున ధ్రువరాజు సింహాసనమధిష్ఠించు నాటికి మధ్యవయస్కుడై యుండును. 'కలివల్లభ' అనుబిరుదు అతని రణప్రీతిని అభివ్యక్తము చేయుచున్నది. ధ్రువరాజు సింహాసన మధిష్ఠించిన తర్వాత గోవిందునికి తోడ్పడిన

---

(16) తస్యానుజాని రుపమస్త ముదీర్ణ మీాక్ష్య
త్యక్తం నృపై రపి నయనే విలుప్యమానమ్
రాజ్యం బభార గురుభక్తి వతో౽ న్యసంస్థమ్
మా భూత్ కిలా న్వయ పరిచ్యుతి రత్ర లక్ష్మ్యాః॥
దౌలతాబాదు శాసనము.

రాజులపై సామంతులపై దండయాత్ర ఆరభించినాడు. కాంచి, వేంగి మాళవ దేశములు ఈ దండయాత్రకు గురియైనవి.

ధ్రువమహారాజు మొట్టమొదట గాంగరాజ్యముపై దండెత్తినాడు. కృష్ణరాజు ఓడించిన శ్రీపురుషరాజు అప్పటికే మరణించినాడు. అతని కుమారుడు శివమారుడు గంగరాజ్యాధిపతి యైనాడు. శివమారుని ధ్రువరాజు గజబలముచే ఓడించి కారాగారమున బంధించినాడు. గత్తియడపురశాసనములో శివమారుని తమ్ముడు విజయాదిత్యుడు భరతునివలె అన్నగారి రాజ్యలక్ష్మిని అనుభవింపలేదు. దీనినిబట్టి రాముని అరణ్యవాసము శివమారుని కారాగారవాసమును సూచించుచున్నది. గంగరాజ్యమును శాసించుటకు ధ్రువరాజు కుమారుడైన స్తంభుని రాజప్రతినిధిగా నియమించినాడు.

గాంగరాజ్యమును జయించిన తర్వాత ధ్రువరాజు కాంచిని పాలించు పల్లవరాజుపై దండెత్తి ఓడించినాడు. రథన్పుర శాసన శ్లోకములో పల్లవరాజు గజయూథములను గప్పముగ ధ్రువునికి నమర్పించినట్లు గలదు.

దక్షిణాపథదండయాత్ర ముగిసిన పిమ్మట ధ్రువరాజు ఉత్తరాపథముపై దండయాత్ర ఆరంభించినాడు. మాళవరాజును, గౌడరాజును జయించినాడు. (17)

ఆ కాలమున మాళవదేశమును వత్సరాజు గౌడదేశమును ధర్మపాలుడు పరిపాలించినారని ఆల్టేకరుగారి అభిప్రాయము. నూరత్ శాసనములో (కర్కసువర్ణ వర్షుని) 'గాంగౌఘసంతతి నిరోధవివృద్ధకీర్తి' అను శ్లేషాలంకారముతో శివునికి ధ్రువరాజునకు సమానకీర్తి ఆరో

---

(17) సంజము శాసనము.

గంగా యమునయో ర్మధ్యే రాజ్ఞో గౌడస్య నశ్యతః
లక్ష్మీ లీలారవిందాని శ్వేతచ్ఛత్రాణియోஉహరత్.

పితము. గంగాయమునా మధ్యదేశమును ధ్రువరాజు ఆక్రమించినట్లు బరోడా శాసనశ్లోకమును బట్టికూడ సిద్ధించుచున్నది (18)

ధ్రువరాజు ఉత్తరాపథదండయాత్ర రాష్ట్రకూటసామ్రాజ్యమును విస్తరింపకపోయినను దిగ్విజయకీర్తిని చేకూర్చినది. శాతవాహన సామ్రాజ్యము తరువాత సుమారు 8 శతాబ్దుల తర్వాత దక్షిణాపథ సామ్రాజ్యచక్రవర్తి సేనలతో విడిసి ఉత్తరాపథమున జయభేరి మ్రోగింపగల్గినాడు. గంగరాజును జయించిన తర్వాత రాష్ట్రకూటసామ్రాజ్యము దక్షిణాపథమున కావేరీనదీతీరమువరకు విస్తరించినది. (19) గోవిందుని సింహాసనభ్రష్టుని చేయుట ధ్రువమహారాజు చరిత్రకొక కళంకమా? గోవిందుడు భోగలాలసుడై రాష్ట్రకూటప్రతిష్ఠను రాజ్యమును నిర్మూలించుచున్నమాట సత్యమైన ధ్రువరాజు చరిత్ర రాష్ట్రకూట రాజ్యతంత్రిమున సువర్ణాక్షరములతో లిఖింపదగును. రాజ్యమును రాజకుమారులలో అర్హుడైనవాడే శాసింపవలెనని అతని సిద్ధాంతము. ఈ సూత్రమును తన జ్యేష్ఠకుమారుడుగాక గోవింద iii రాజునకు యువరాజపదవిని ప్రసాదించి ఆదర్శముగనేగాక ఆచరణరూపమున ప్రతిష్ఠించినాడు. ఇతని శాసనములు 793 ఏప్రియలువరకు (దౌలతాబాదు) కన్పించుచున్నవి.

---

(18) యో గంగాయమునే తరంగసుభగే గృహ్ణాన్వరేభ్యః (?)
సాక్షాచ్చింహ నిభేన చోత్తమపదంత త్ప్రాప్తవానీశ్వరం
కర్కసువర్ణవర్షుని బరోడా దానశాసనము.

(19) మైసూరుమండలములో మతకేరె శాసనములో రాజప్రతినిధిగా స్థంభుడు గంగవాడిని పరిపాలించుచున్నాడు. ధరావర్ష శ్రీ వల్లభమహారాజు పృథ్విని శాసించుచుండగ

E C IV p 93

## గోవిందమహారాజు iii

ధ్రువమహారాజునకు స్థంభరణావలోకుడు లేకన్నడములోని కంబరసుడు, కర్కసువర్ణవర్షుడు, గోవిందుడు, ఇంద్రుడు మున్నగు పుత్రులు కలరు. జ్యేష్ఠపుత్రుడైన స్థంభుడు గంగావాడికి రాజప్రతినిధి. కర్కసువర్ణవర్షుడు ధ్రువమహారాజు సింహాసనము నధిష్ఠించుటకు పూర్వమే ఖాండెశు ప్రాంతమునకు రాజప్రతినిధి. గోవిందుని ధ్రువ మహారాజు యువరాజుగా నిర్ణయించి యౌవరాజ్యపట్టాభిషేకమును సల్పినాడు. ఇంద్రుడు తరువాత గుజరాతు రాజప్రతినిధి.

ధ్రువమహారాజు అనంతరము నిర్నిరోధముగ గోవిందుడు రాష్ట్రకూట సామ్రాజ్య చక్రవర్తియైనాడు. ధ్రువమహారాజు మరణానంతరము ఒక సంవత్సరములో 794 మే ప్రతిష్ఠానపురశాసనములో వారసత్వయుద్ధప్రసక్తిలేదు. కాని జ్యేష్ఠపుత్రుడైన స్థంభుడు, జ్యేష్ఠాతిక్రమణకు అవమానపూరితుడై కాలమునకై వేచియున్నాడు. కాని గోవిందుడు సామంతులను తమ్ముడైన ఇంద్రుని కూడగట్టుకొని సంసిద్ధుడై యున్నాడు. స్థంభుడు 12 గురు రాజులతో కినిసి దండయాత్రను ఆరంభించినాడు. కాని అచిరకాలములో స్థంభుని అతని మిత్రరాజ్యకూటమును గోవిందుడు సుకరముగ ఓడించి తన సింహాసనము సుస్థిర మొనర్చుకొన్నాడు.

గోవిందమహారాజు ఈ తిరుగుబాటును అణచివేయుటే గాక శత్రువులను మన్నించి దయచూపినాడు. స్థంభుని గూడ మన్నించి, తిరిగి గంగవాడికి రాజప్రతినిధిగ నియమించినాడు. (20)

(20) క్రీ. శ. 802 లో రణావలోక శౌచకంచదేవుడు, తమ్ముడైన పృథ్వీవల్లభ ప్రభుతవర్ష గోవిందరాజదేవుని అనుమతిచే మన్నెత్తామ్రదాన శాసనము కలదు.

గంగవాడిని పరిపాలించిన శివమారుడు రాష్ట్రకూటకారాగారము నుండి విముక్తుడైన వెంటనే రాజాధిరాజ పరమేశ్వర శ్రీపురుష బిరుదులతో కన్పించుచున్నాడు. ఇతడు వారసత్వయుద్ధములో స్థంభుని పక్షమున నిలిచి యుండును. అందుచే రధనపురసంజము శాసనము లతనిని "కృతఘ్నగంగః" అని పేర్కొనుచున్నవి. అతనిని గోవిందుడు సులభముగా గర్జనమంత్రచే ఓడించినాడు. అందుచే శివమారుడు క్రీ. శ. 798 లో తిరిగి రాష్ట్రకూట కారాగారమును ప్రవేశించినాడు. గంగవాడి రాష్ట్రకూట రాజ్యమున చేర్చి తిరిగి గోవిందుడు స్థంభుని రాజప్రతినిధిగ నియమించినాడు.

అతడు క్రీ. శ. 802 వరకు పరిపాలించినాడు. అతని తరువాత చాకిరాజు 814 లోపు కబ్బశాసనమునకు పూర్వము గంగవాడికి పరిపాలకుడైనాడు. నోలంబవాడిని పరిపాలించిన చారుపొన్నేరరాజు జగత్తుంగ ప్రభూతవర్ష గోవింద మహారాజునకు సామంతుడు.

గోవిందమహారాజు తరువాత సేవలను కాంచిపై తరలించినాడు. కాంచిపై ధ్రువమహారాజు ఇదివరలో దండయాత్ర సాగించినాడు. గోవిందుని ఈ దండయాత్రకు కారణము కాంచీరాజు స్థంభునికి సహాయముచేసియుండుట అని ఊహింపవచ్చును. కాంచిరాజును క్రీ. శ. 804 ప్రాంతమున గోవిందుడు ఓడించినాడు. బ్రిటిష మ్యూజియము తామ్రశాసనము రామేశ్వరతీర్థమువద్ద గోవిందుడు సేనలతో విడిసినట్లు చెప్పుచున్నవి.

కాంచి దండయాత్ర ముగిసిన తరువాత గోవిందుడు వేంగీ రాజ్యమును ముట్టడించెను. వేంగి దేశమును క్రీ. శ. 799 నుండి 843 వరకు విజయాదిత్యమహారాజు పరిపాలించినాడు. క్రీ. శ. 809 నాటి రధనపుర శాసనము గోవిందుని వేంగి విజయమును పేర్కొను చున్నది. కావున గోవిందుడు విజయాదిత్యమహారాజును జయించి

నాడని చెప్పవచ్చును. కాని ఆ నాడు అరంభించిన యుద్ధాగ్ని జ్వాలా కీలలు 12 సంవత్సరములవరకు ఆరిపోలేదు.

ఈ కాలమున 108 యుద్ధములు రెండు రాజ్యములమధ్య జరిగి నట్లు అమోఘవర్షుని శాసనమువలన తెలియుచున్నది. గోవిందుని కాలమున రాష్ట్రకూటులకే విజయము సిద్ధించినను తరువాత జయ లక్ష్మి ఈ రెండు రాజ్యములమధ్య ఊయెల ఊపుతో వినోదించినది.

దక్షిణాపథమున దిగ్విజయమును ముగించుకొని గోవిందుడు సేనలను ఉత్తరాపథమునకు సాగించినాడు. వత్సరాజు తరువాత సింహాసనమధిష్ఠించిన నాగభట్ట ii రాజు వేంగిరాజుతో సింధు అరబ్బు లతో రాయబారములను నడపినాడు. ధర్మపాలుని చక్రాయుధుని జయించినాడు. గోవిందుడు క్రీ. శ. 804, 809 సం.ల మధ్య గుర్జర పాలకుడైన నాగభట్టును జయించినాడు. గోవిందుని సైన్యము గంగా నదిలో స్నానముచేసిన ధ్వని హిమాలయ గుహాంతరములలో ప్రతి ధ్వనించిన వర్ణనము సంజము తామ్రశాసనములో గలదు.

గోవిందుడు గంగాతీరమునుండి పశ్చిమమునకు మరలినాడు. శర్వరాజు గోవిందుని తన రాజధానియైన శ్రీభవనమున గౌరవించి నాడు. వింధ్యపర్వతశ్రేణులలో నున్న ఆ రాజధానిలో అతడు వర్షా కాలమును సేనలతో నడచినాడు. క్రీ. శ. 808 లో గోవిందుడు శ్రీ భవనమున నుండగా అమోఘవర్షుడు జన్మించినాడు.

గోవిందుడు ఉత్తరాపథ దండయాత్రలో నుండగా గంగవాడి, కేరళ, పాండ్య చోళ కాంచి దేశాధీశులు శత్రుకూటముగా చేరి దక్షి ణమున కుతంత్రముల పన్నినారు. గోవిందుడు వారి నందరిని తిరిగి ఓడించినాడు. లంకాధీశుడు గూడ తన శిలాప్రతిమనుబంపి గోవిందా మాత్యుని ప్రతిమను బంపి కప్పము చెల్లించుటకు సంసిద్ధుడైనాడు.

(21) వానిని గోవిందుడు మాన్యేడులోని శివాలయమున జయస్తంభ మున నుంచుటకు పంపినాడు. ఈ దక్షిణదండయాత్ర క్రీ. శ. 808 తర్వాత అరంభించి 810, 811 ప్రాంతమున ముగించి యుండును. గోవిందుని తోర్కేడే శాసనమునుబట్టి అతడు 813 డిసెంబరు 4 వ తేదీ వరకు జీవించి యుండినట్లు తెలియుచున్నది. అమోఘవర్షుడు 814 ప్రాంతమున రాజ్యమునకు వచ్చియుండును.

రాష్ట్రకూట చక్రవర్తులలో గోవిందుడు మేరుపూస. ఉత్తరమున మాళవదేశము దక్షిణమున గాంగవాడిని రాష్ట్రకూట సామ్రాజ్యమున చేర్చినాడు. ఉత్తరాపథమున నాగభట్టుని ధర్మపాలుని జయించినాడు. దక్షిణాపథమున శత్రురాజకూటమును రెండుసారులు నిర్విశేషముగా ఓడించినాడు. అతని ప్రాభవము హిమాలయ పర్వతములనుండి కన్యాకుమారివరకు విస్తరించినది. కనోజీరాష్ట్రమును ఇంద్రరాజు iii జయించినాడు. కాని దక్షిణమున పెన్నారునదిని దాటలేదు. వాని దిండోరిశాసనము గోవిందుని జన్మముతో రాష్ట్రకూటవంశము కృష్ణుడు జన్మించిన యదువంశమువలె అప్రతిహతమైన దను వర్ణన అతిశయోక్తి యైనను సత్యదూరము కాదు.

సోదరుడైన ఇంద్రుని గుజరాతులో రాజప్రతినిధిగా నిర్మించి నాడు. దీనివలన ఉత్తరమునకు ఆతడు అంగరక్షకుడైనాడు.

## అ మో ఘ వ ర్ష మ హా రా జు

అమోఘవర్షుడు 6 సం. బాలుడుగనే చక్రవర్తియైనాడు. అమోఘ వర్షుని బాల్యమున రాజప్రతినిధిగ గుజరాతుపాలకుడైన ఇంద్రుని కుమారుడు కర్కరాజు పరిపాలించి యుండును. కర్కుని నూరతు

---

(21) లంకాతః కిల తత్ప్రభుప్రతికృతీ కాంచీ ముపేతౌ తతః।
కీర్తిస్తంభనిభౌ శివాయతనకే యే నేహ సంస్థాపితౌ॥

శాసనములోఅతడేఅమోఘవర్షుడు పదచ్యుతుడైనప్పుడుతిరిగి సింహాసనమున నెలకొల్పినట్లు గలదు. అమోఘవర్షుని సంజము శాసనము ఆ కీర్తిని పాటులమల్లునకు అందించుచున్నది. భగవాన్‌లాల్‌గారు 'పాటులమల్ల' అనునది కర్కుని బిరుదునామమని వచించినారు. కొంత కాలమువరకు శాంతియుతముగనే పరిపాలన గడచిపోయెను. క్రీ. శ. 816 లోని కర్క సువర్ణవర్షుని నయోసరి శాసనములో అమోఘవర్షుడు చక్రవర్తిగా పరిపాలించుచున్నట్లు గలదు.

సామ్రాజ్యసింహాసనమున ముక్కుపచ్చలారని బాలుని చక్రవర్తిత్వము అనేకుల హృదయములలో ఆశలకు దోహదము కల్పించినది. కుతంత్రజ్ఞుల పన్నాగములు విజృంభించినవి. సామంతుల స్వాతంత్ర్యజిగీష రాజోద్యోగుల వధలలో ప్రతిబింబించినది. అమోఘవర్షుడు సింహాసనమును వదలి పోవలసి వచ్చినది. అరాజకము ప్రబలినది. క్రీ. శ. 816 లోని నయోసరిశాసనములో ఈ విప్లవప్రశంస లేదు. క్రీ. శ. 13 మే 821 సం. కర్కుని సూరత్‌శాసనము అమోఘవర్షుడు పునః ప్రతిష్ఠ డగుటను పేర్కొనుచున్నవి. కాన ఈ విప్లవము క్రీ.శ. 816, 821 సం. మధ్య జరిగియుండును. ఆ నాటికే అమోఘర్షుడు 12 లేక 13 సం.ల బాలుడు.

వేంగిదేశమును పాలించిన అమ్మరాజు ఐదరుశాసనము రాష్ట్రకూటులతో విజయాదిత్యుడు (ii) గాంగులతో సల్పిన 12 సం.ల యుద్ధమును పేర్కొను చున్నది. ఇది క్రీ. శ. 799 క్రీ. శ. 843 మధ్య జరిగియుండును. ఈ యుద్ధము గోవిందుని కాలమున అరంభించినది. అమోఘవర్షుని పరిపాలనారంభకాలమునగూడ యుద్ధము జరిగి యుండును. వేంగిరాజు విజయాదిత్యుడు యుద్ధములో జయించి యుండును. చాళుక్యసముద్రములో మునిగిపోయిన రాష్ట్రకూట కీర్తిని అమోఘవర్షుడు పునరుద్ధరించినట్లు ఇంద్రరాజు iii శాసనములో

గలదు. (విజయాదిత్యుని తాత్కాలిక విజయమును రాష్ట్రకూట శాసనములే పేర్కొనుచున్నవి.) అమోఘవర్షుని బాల్యమున సంభవించినవిప్లవమునకు విజయాదిత్యుడు దోహదము కల్పించియుండును. లేక విజయాదిత్యుని విజయములే విప్లవమును సంఘటించియుండును.

క్రీ. శ. 866 సిరూరు శాసనమున వేంగిరాజు అమోఘవర్షుని ఆరాధించుచున్నట్లు గలదు. క్రీ. శ. 933 సం. గోవిందుని iv సంగ్లి శాసనములో అమోఘవర్షుడు లింగవల్లి రణరంగమున చాళుక్యుల నెదుర్కొని యమధర్మరాజునకు విందు చేసినట్లు గలదు. కర్కుని కబ్ధశాసనములో అమోఘవర్షుడు చాళుక్యులకు అగ్నిహోత్రుడను వర్ణన గలదు. అమోఘవర్షుని వేంగివిజయము క్రీ. శ. 860 కు పూర్వము అమ్మరాజు ఐదరుశాసనములో గంగులను జయించిన తర్వాత విజయాదిత్యుడు కృష్ణుని ఎదుర్కొనినట్లు గలదు. ఈ కృష్ణుడు అమోఘవర్షుని కుమారుడు. రాష్ట్రకూటశాసనములు అమోఘవర్షుడు చాళుక్యుల నోడించిన విషయము చాళుక్యశాసనములలో గూడ కన్పించుచున్నది. గంగవిజయాదిత్యుని తరువాత వేంగిమండలమును రాష్ట్రకూటులు ఆక్రమించినట్లు గలదు. భీమరాజు క్రీ. శ. 888తర్వాత తిరిగి వేంగిని జయించినాడు. కావున అమోఘవర్షుని వేంగివిజయము సత్యమైన క్రీ. శ. 860 ప్రాంతమున సిద్ధించియుండును.

అమోఘవర్షుని పరిపాలన అంతఃకలహములతో, విప్లవములతో గడచినది. కోనూరుశిలాశాసనము ఈ విప్లవమును పేర్కొన్నది. ఒక విప్లవములో యువరాజు కృష్ణుడుగూడ పాల్గొనినాడు. కాని బంకేయుడను వనవాసిపాలకుడు వచ్చి అమోఘవర్షుని సంరక్షించినాడు. విప్లవకారులను (యువరాజును చీలదీసి) ఓడించినాడు. అతని రాజభక్తికే పారితోషికముగ బనవాసి బెల్గోల కుందుర్గ కుందూర పూరిగేరి రాష్ట్రములకు పరిపాలనాధికారమును అమోఘవర్ష చక్రవర్తి బంకేయునకు ప్రసాదించినాడు.

ఉత్తరాపథమున గుర్జరరాజు మిహిరభోజుడు రాజ్యమును విస్తరింపజేసినాడు. కాని అమోఘవర్షుడు ఉత్తరాపథరాజ్యరంగమున గోవిందునివలె ప్రముఖపాత్రను వహింపలేదు.

కొంకణదేశమును శీలాహారులు కృష్ణరాజు i కాలమునుండి రాష్ట్రకూట సామంతులై పరిపాలించినారు. క్రీ. శ. 888 వరకు గుజరాతు కొంకణదేశములు రాష్ట్రకూట సామ్రాజ్యమున సామంత రాజ్యములు.

గంగవాడిరాజును అమోఘవర్షుడు ఓడించినను పూర్వమువలె రాజ్యమును రాష్ట్రకూట సామ్రాజ్యములో కలుపుకొనలేకపోయెను.

అమోఘవర్షుని పరిపాలన విప్లవములతో అంతఃకలహములతో గడచిపోయినది. అతడు ఉత్తరాపథ రాజ్యరంగమునందు ప్రవేశింపలేదు. అతనికాలమున సామ్రాజ్యము మాళవ దేశమును, దక్షిణమున గంగవాడిని కోల్పోయినది. కవిరాజమార్గమను కన్నడ అలంకారిక గ్రంథమును అతడు రచించినాడు. లేదా ఏతత్ గ్రంథరచనకు అతని ఆదరాభిమానములు మూలకందము. క్రీ. శ. 1150 లోని నాగవర్మ క్రీ. శ. 1225 కేశిరాజు, క్రీ. శ. 1600 భట్టాకలంకుడు అమోఘవర్షుడు సాహితీ ప్రియుడని కవులను పండితులను పోషించెనని ఏకకంఠముతో పొగడినారు. ఆదిపురాణకర్తయైన జినసేనుడు అమోఘవర్షునికి ప్రధానాచార్యుడనని చెప్పుకొన్నాడు. మహావీరాచార్యుడు అమోఘవర్షుని కాలమున గణితసారసంగ్రహమును రచించి అతనిని పేర్కొనినాడు. అమోఘవర్షుడు జైనమతప్రియుడు. కాని హిందూధర్మమును వీడలేదు. మహాలక్ష్మీభక్తుడు. ఒకసారి తన వ్రేలును కోసి లక్ష్మీదేవికి బలిగా ప్రజలను విపత్తునుండి సంరక్షించుటకు సమర్పించినాడు. ప్రశ్నోత్తరమాలికను అమోఘవర్షుడు రచించినాడు. దానిలో విరక్తిపరుడయి గ్రంథకర్త రాజ్యమును త్యజించినట్లు

గలదు. సంజము శాసనమును బట్టి అమోఘవర్షుడు అనేకపర్యాయములు రాజ్యమును త్యజించి యోగమార్గము నన్వేషించినట్లు గలదు. అప్పుడు యువరాజు రాజ్యభారమును వహించి యుండును. 875 లో సౌందిత్తి శాసనము బట్టి కృష్ణరాజు 877 లో కాన్హేరీశాసనమును బట్టి అమోఘవర్షుడు రాజ్యము చేయుచున్నట్లు గలదు. ఈ వైరుధ్యమును సమన్వయించుటకు అమోఘవర్షుడు రాజ్యమును త్యజించినప్పుడు కృష్ణుడు పరిపాలించినాడని ఊహింపవచ్చును.

## కృ ష్ణ రా జు ii

క్రీ. శ. 880 వ సం. ప్రాంతమున కృష్ణమహారాజు సింహాసనము నధిష్ఠించి యుండును. అమోఘవర్షుని శాసనములు 888 సం. తరువాత కన్పించుటలేదు.

కృష్ణరాజు పరిపాలనాకాలమంతయు దక్షిణమున గంగులు నోలంబులు, తూర్పున వేంగిచాళుక్యులు సల్పిన యుద్ధములతో గడచినది. గుజరాతు రాష్ట్రకూటులతో గూర్జరరాజులతోగూడ అతడు యుద్ధముల సల్పినాడు.

కృష్ణరాజు చేదిరాజు కొక్కలుని అల్లుడు. యువరాజు జగత్తుంగుడు మేనమామయగు శంకరగణరణవిగ్రహుని పుత్రికను వివాహమాడినాడు. బిల్హరి శాసనము కొక్కరాజు కీర్తికి కృష్ణరాజు భోజరాజు కీర్తిస్తంభములని పేర్కొనుచున్నది. దీనినిబట్టి చేదిరాజు కృష్ణరాజునకు యుద్ధములలో తోడ్పడినట్లు తెలుచున్నది.

వేంగిమండలమును క్రీ. శ. 844 నుండి 888 వరకు విజయాదిత్య iii మహారాజు, 888 నుండి 918 వరకు భీమమహారాజు పరిపాలించినారు. వీరిద్వరు కృష్ణరాజునకు సమకాలికులు. అమోఘ

వర్షుడు వేంగిరాజును జయించినట్లు రాష్ట్రకూట శాసనములు పేర్కొను చున్నవి. విజయాదిత్యుని ( iii ) అవసానకాలమున రట్టుల వేంగి మండలమును ఆక్రమించినట్లు ఐదరుశాసనములో గలదు. కాని కలు చంబూరు దానశాసనము భీముడు కృష్ణవల్లభుని సేనలను జయించి వేంగిని రక్షించుట పేర్కొను చున్నది. (22)

ఐదరు శాసనమునుబట్టి విజయాదిత్యుడు iii రట్టరాజు ప్రోత్సాహమున యుద్ధములో మంగిరాజు తలద్రుంచినట్లు కృష్ణుని అతని మిత్రుని సంకిలుని భీరువులను జేసి వారి రాజధానిని అగ్నిదగ్ధము చేసినట్లు తెలియుచున్నది. (23) మంగిరాజు వధ చారిత్రక ప్రసిద్ధము. మచిలీపట్టణదానశాసనము మంగిరాజు వధోపాయమును యుద్ధరంగ మున సూచించిన బ్రాహ్మణుని పేర్కొనుచున్నది. (24) మలియపూండీ దానశాసనమునుబట్టి మంగినొలంబపాలకుడని, అగ్నిదగ్ధమైన రాజధాని కిరణపురమని అప్పుడు కృష్ణరాజు అక్కడ నివసించుచున్నాడని తెలియనగును. (25)

మల్లపదేవుని పిఠాపుర శాసనములో విజయాదిత్యుడు చక్రకోట ము ను దగ్ధముచేసి కృష్ణరాజు సహాయముచేసిన సంకిలుని భయచిత్తునిచేసి కృష్ణరాజునకు ప్రతాపముచూపించి కళింగరాజునుండి మత్తేభములను గ్రహించినట్లుగలదు. కలచుంబూరు శాసనములో

(22) జిత్వా సంయతి కృష్ణవల్లభ మహాదండమ్
భీమో భూపతి రన్వభుక్త భువనమ్॥

(23) గంగానాం రాజవైరి శక్తిరసమన్ రట్టేశ సంబోదితః
జిత్వామంగిశిరోఽహరద్యుధిమహాబాహ్వోప్తవీర్యార్యమా॥

(24) E 8, V, p 125.

(25) కిరణపురమధాక్షేత్ కృష్ణరాజస్థితమ్ El, IV, p 239.

విజయాదిత్యుని వల్లభరాజు ఆరాధించినట్లు గలదు. ఈ వల్లభరాజు కృష్ణమహారాజే యని గుర్తింపవచ్చును.

వేంగిచాళుక్యరాజు విజయాదిత్యుడు గంగసామంతులైన నోలంబులను ఓడించినాడు. ఇందురట్టరాజు ప్రోత్సాహము 'రట్టరాజు చోదితః' అనువాక్యము సూచించుచున్నది. రట్టరాజు ప్రోత్సాహము సర్వబిషక్ న్యాయము ననుసరించినదని అల్టేకరుగారి అభిప్రాయము. వేంగిరాజు ఓడినను నోలంబులు ఓడిపోయినను రట్టరాజులకు సమాన సంతోషదాయకమే. ఈ దండయాత్రలో నోలంబసేనానిని, ఉపాయముచే విజయాదిత్యుడు సంహరించియుండునని బ్రాహ్మణదానమును బట్టి గ్రహింపవచ్చును.

నోలంబవిజయోత్సాహముతో విజయాదిత్యుడు యువరాజు భీముడు రాష్ట్రకూటులను ధిక్కరించి నిల్చినారు. విజయాదిత్యుని శత్రువులైన కృష్ణసంకలులు రాష్ట్రకూట మహారాజు కృష్ణుడు అతని బావమరది శంకిల లేక శంకరగణుడు కావలెను. (iii) అగ్నిదగ్ధమైన చక్రకూటము ప్రస్తుత బస్తరుమండలములోని చక్రకూటము కిరణపురము అచటికి 150 మైళ్ళ దూరములోనున్న బలేఘాట్ మండలములోని కిరణపురమై యుండును. కిరణపురము సంకిలుని రాజధాని కాదు. దానిని చాళుక్యులు పురవరమని కృష్ణరాజు తాత్కాలికావాసమని పేర్కొనినారు. కృష్ణరాజునకు వల్లభబిరుదును బట్టికూడ కృష్ణసంకిలులు రాష్ట్రకూట కృష్ణమహారాజు అతని బావమరది శంకిల లేక శంకరగణుని గుర్తింపవచ్చును.

విజయాదిత్యుని అనంతరము భీమరాజు నిరవద్యపుర, పేరువంగుర గ్రామయుద్ధములలో కృష్ణుని అతని మిత్రులైన కర్ణాటరాజులను జయించినట్లు కృష్ణామండలములోని శిలాశాసనముల్లమ్మలన

తెలియుచున్నది. భీముని కుమారుడు 16 ఏండ్ల రాజపుత్రుడు ఆ యుద్ధములో మరణించినాడు.

(వేంగిరాజులతో యుద్ధములు చేసినకాలములోగూడ రాష్ట్రకూట సామ్రాజ్యము చితల్‌దుర్గమువరకు వ్యాపించియున్నది). క్రీ.శ.889 లో చితల్‌దుర్గమండలములోని కేరజ్జిలోని శిలాశాసనము కన్నడ దేవ మహారాజు రాజ్యము సర్వదిశల విస్తరించినట్లు గలదు.

క్రీ. శ. 888 ప్రాంతమున ఉత్తరాపథరాజు భోజునికి రాష్ట్ర కూటులకు యుద్ధము జరిగినది. భవనగర మ్యూజియము శాసనము నర్మదా తీరమున భోజుడు కృష్ణ రాజు నెదుర్కొనినట్లు వచించుచున్నది. క్రీ. శ. 888 లో గుజరాతుపాలకుడైన కృష్ణుడు వల్లభమహారాజు సైన్యయాత్రను పరిశీలించుచుండ ఉజ్జయినిలో శత్రువును జయించినట్లు బేగముర శాసనములోగలదు. ఈయుద్ధములో యువరాజు జగత్తుంగుడు, చేదిరాజు గూడ పాల్గొనినారు. 914 లో రాష్ట్రకూట చక్రవర్తి శౌర్యసాహసములు (గూర్జర రాజులతో పోరాడినప్పుడు ప్రదర్శించిన) వృద్ధులింకను మరచిపోలేదని వర్ణితము. ఈ యుద్ధములలో ఏ రాజ్యము‌ను జయించినట్లు తోచుటలేదు. గుర్జరరాజులు దక్షిణసరిహద్దులలో రాష్ట్రకూటుల నరికట్టుటకు సదా సైన్యమును కేంద్రీకరించు కొను చుండిరని ఆల్‌మసూదివలన తెలియుచున్నది.

ఉత్తరపురాణోపోద్ఘాతములో గుణచంద్రుడు కృష్ణరాజు మత్తేభ యూధములు గంగానలిలములు గ్రోలినట్లు కన్యకుమారి చందన తరుచ్ఛాయల విశ్రమించినట్లు వర్ణన గలదు. దక్షిణమున కృష్ణరాజు రాజ్యము వనవాసిని లేదు. ఉత్తరమున గుర్జరుల రాజ్యము విస్తరించి నది. 908 ప్రాంతమున కృష్ణుని తాత్కాలిక విజయమును పురస్కరించుకొని పూర్వరాజుల గంగాతీరదండయాత్రలను తలచుకొని గుణచంద్రుడు అలంకారికముగ వర్ణించి యుండెను. గుర్జరరాజు

భోజుడు దక్షిణమును అక్రమించినట్లుగాని కృష్ణరాజు(ii) స్వయముగా ఉత్తరాపథమున దండయాత్ర పూర్వరాష్ట్రకూట రాజులవలె వెడలి నట్లుగాని చారిత్రకముగ చెప్పలేము.

కృష్ణరాజు ii కాలమున చాళుక్యరాజ్యము అవరోహణ క్రమమును సూచించినది. వేంగి చాళుక్యులు రాష్ట్రకూట సామ్రాజ్యమును ఎదుర్కొని విస్తరించినారు. గంగవాడి ప్రత్యేకరాజ్యముగ నిల్చినది. గుజరాతు రాష్ట్రకూటుల జయించుట అంత రాజ్యాంగ విజయము కాదు.

ఉత్తరమున భోజుని నిలుపగలిగినను అతనిని జయించ లేదు. ఇతడు కూడ జైనమతప్రియుడు. బంకేయుడు చాళుక్య నరసింహుడు శ్రీ విజయుడు మున్నగు జైనప్రియులు సుప్రసిద్ధవీరులు. జైనమతప్రీతి అమోఘవర్షుల కృష్ణరాజుల రాజ్యజిగీషను అంతరాయములు కల్పించిన దని చెప్పుట సాహసము. ఆదిపురాణమును పూరించిన సుప్రసిద్ధకవి గుణభద్రుడు కృష్ణరాజు గురువు.

## ఇంద్ర మహా రాజు

ఇంద్రమహారాజు కృష్ణమహారాజు తర్వాత సింహాసనమధిష్ఠించి నాడు. ఇంద్రుని తండ్రి జగత్తుంగుడు యువరాజుగా మరణించినాడు. అప్సరః కన్యకల అభిమతమును దీర్చుటకు బ్రహ్మదేవుడు జగత్తుంగుని స్వర్గలోకమునకుదీసికొని పోయినట్లురాష్ట్రకూటశాసనములలో గలదు. క్రీ. శ. 912 వరకు కృష్ణమహారాజు శాసనములు గన్పించుచున్నవి. క్రీ. శ. 915 ఫిబ్రవరి 24 తేదీన ఇంద్రమహారాజు పట్టాభిషిక్తుడైనాడు.

ఈతడు, క్రీ. శ. 915 సం. పూర్వమే మేరును నాశము చేసి గోవర్ధనమును ముట్టడించిన ఉపేంద్రరాజును జయించినాడు,

(26) ఈఉపేంద్రుడు పరమారరాజు కృష్ణరాజు.అతడుఉదయపూరు ప్రశస్తిలోఉపేంద్రుడుగా గన్పించుచున్నాడు. వాక్పతి ముంజుడు(తైలపుని సమకాలీనుడు. 980 క్రీ. శ.) ఉపేంద్రుని మునిమనుమడు ఉపేంద్రుని మనుమడు శాయకుని కాలము 949-973 కావున ఉపేంద్రుడు 900-975 ప్రాంతమున పరిపాలించి యుండును. వీరు మొట్టమొదట గుర్జర సామంతులు. హర్సోల శాసనమును బట్టి ఇంద్రుని విజయము తర్వాత పరమారులు రాష్ట్రకూటుల సామంతులైనట్లు తెలియుచున్నది. (27) ఈ విజయము ఇంద్రమహారాజు ఉత్తరాపథదండయాత్రను మార్గావకాశమును కల్పించినది.

క్రీ. శ. 908 లో కన్యాకుబ్జరాజ్యమున మహేంద్రపాలుని మరణము తరువాత అంతఃకలహములు చెలరేగినవి. అతని కుమారుడు భోజుడు 2 సం. పాలింపగల్గినాడు. అతని తమ్ముడు మహీపాలుడు సింహాసనము నపేక్షించినాడు. చేదిరాజు కొక్కలుని సహాయముతో కొంతకాలము తమ్ముని ఎదుర్కొనినాడు. కాని చివరకు మహీపాలుడు రాజ్యమును సంపాదించినాడు. ఈ అవకాశమును పురస్కరించుకొని ఇంద్రరాజు దండెత్తి కన్యాకుబ్జ రాజధానిని ఆక్రమించినాడు. ఇంద్రుడు మొట్టమొదట ఉజ్జయినిపై దాడివెడలి యమునానదిని దాటి కన్యాకుబ్జమును సాధించినాడు. గుర్జరరాజు మహీపాలుడు పారిపోయినాడు. చాళుక్య నరసింహుడు ఇంద్రుని సేనాని అతనిని గంగాసంగమము వరకు వెంబడించినారు.

---

(26) కృత గోవర్ధ నోద్ధరం హేలో న్మూలిత మేరుణా
ఉపేంద్ర మింద్ర రాజేన జిత్వాయేన నతిస్మితమ్॥

**J B B R A S XV III p 253.**

(27) బోజే వల్లభరాజే శ్రీహర్షే చిత్రకూట భూపాలే
శంకరగణే చ రాజని యస్యాసీద భయదః పాణిః॥

**E 311 p 306 – 7.**

### అమోఘవర్ష మహారాజు ii

ఇంద్రుని తరువాత 917 ప్రాంతమున అమోఘవర్షుడు సింహాసన మధిష్ఠించినాడు. అపరాజిత శిలాహారుని శాసనము 80 సం. తరువాత అమోఘవర్షుడు ఒక సంవత్సరము రాజ్యము చేసినట్లు వచించుచున్నది.

గోవిందుని IV సంగ్లి శాసనములో అమోఘవర్షుని పేరు లేదు. గోవిందుడు ఇంద్రనిత్యవర్షుని పాదానుధ్యాత కావున అమోఘవర్షుడు అతని సోదరుడు గోవిందునకు ప్రేమానుబంధములు సడలినట్లు ఊహింపవచ్చును.

గోవిందుని సంగ్లి శాసనములో అతడు జ్యేష్ఠసోదరునికి అపచారము నల్ప లేదని సోదరభార్యలతో దుష్కీర్తిని సంపాదింప లేదని చెప్పుకొన్నాడు. ఈ ప్రకటనకు చరిత్రకారులు గోవిందునకు అమోఘ వర్షుని మరణమునకు అతని భార్యలకు కార్యకారణసంబంధమును ముడిపెట్టుచున్నారు. కృష్ణమహారాజు III సమకాలీనుడైన శాలాహార రాజు భద్దెదేవుని శాసనములో గోవిందుడుకూడ అపరాధియని యున్నది. (28)

### గో విం ద మ హా రా జు IV

అమోఘవర్షుని తరువాత క్రీ. శ. 919 ప్రాంతమున గోవిందుడు సింహాసన మధిష్ఠించినాడు. ఇతడు అపరమన్మధుడని ప్రేమరసైక లోలుడని సదా నృత్తకీ పరివృతుడై ఇంద్రభోగముల తులతూగు చుండెడివాడని రట్టరాజు ఖరేపట్టణ శాసనములో గలదు. గంగాయమునా

(28) తస్మాత్ శ్రీంద్రరాజః ప్రథిత పృథుయశాస్సార్వభౌమః ప్రజాతః శ్రీమా న మోఘవ ర్షోభో తాస్యనుతం సమూల ముత్మాల గోజ్జిగ మన్యాయకృతం సామోఘమయశాత్ పృథ్వీమ్.

నదులు ఇతని రాజప్రాసాదములు. (29) దీనినిబట్టి ప్రయాగ ఇతని రాజ్యమున నున్నట్లు ఊహింపవచ్చును. కాని అచిరకాలమున కన్యాకుబ్జమును మహీపాలుడు పునరాక్రమించినాడు.

వేంగిరాజు చాళుక్యభీముడు గోవిందుని సైన్యమును ఓడించినాడు. భీముడు క్రీ. శ. 934 లో సింహాసనమధిష్ఠించినాడు. కావున గోవిందుని అవసాన కాలమున చాళుక్యవిజయము సిద్ధించి యుండును.

కృష్ణరాజు దివాలి కర్హాడ్ శాసనములలో గోవిందుడు భోగలాలసుడై విషయలోలత్వమున నశించినట్లు గలదు. పంపడు వ్రాసిన విక్రమార్జున విజయములో గోవిందుని పతనము అభివర్ణితము. చాళుక్యవిజయాదిత్యుడు అరికేసరి కలిసి బద్దెగ దేవునికే రాజ్యము సంక్రమించునట్లు చేసినారు. గోవిందుని సామంతులు ప్రజలు విప్లవమును నెలకొల్పి అతని పినతండ్రియైన అమోఘవర్షునకు కిరీటమును సమర్పించినారు. రాష్ట్రకూట రాజ్యమును కాపాడుటకు సింహాసనము నధిష్ఠింప అమోఘవర్షుని వేడినట్లు గలదు. (30) అమోఘవర్షుడు లేక బద్దెగదేవుడు పుణ్యాత్ముడని అపరాజితుని శాసనములో ప్రశంసితుడు. భద్దెవదేవుని దానశాసనము అమోఘవర్షుడు తన అంతరాత్మను రాజ్యమును అభిషేకజలములచే పరిపూత మొనర్చి కొనినట్లు వచించుచున్నది. (31)

---

(29) యదనిందిత రాజమందిరం నను గంగాయమునా చ సేవతే

(30) దివాలి కర్హాడి శాసనములు
సామంతైరథ రట్టరాజ్య మహిమాలం బార్థ మభ్యర్థితః

(31) అభిషేక జలేన సమంత పశ్చియుః (?) సముచ్ఛ్రితాత్మ
యేన ధనానీవ నులాదనీ యతాత్మా పరాంశుద్ధిమ్॥

**Prince of Wales museum, Bombay.**

అమోఘవర్షుడు అతని కుమారుడు కృష్ణరాజు iii కూడ చేదిరాజ కన్యకలను వివాహమాడినారు. చేదిరాజు యువకుడైన కృష్ణుడు గోవిందునిపై నెలకొల్పిన విప్లవమునకు దోహదము కల్పించి కిరీటమును అమోఘవర్షునకు అందునట్లు చేసియుందురు. చేది రాజాస్థానములో వసించిన రాజశేఖరుని విద్ధసాలభంజికలో ఈ చారిత్రక సన్నివేశము యొక్క క్రీనీడలు ప్రతిబింబించి నేటికిని నిల్చియున్నవి. అందు చేదిరాజాస్థానమున ప్రవాసిగా కుంతలదేశాధీశుడగు చండసేనుడు వసించినాడు.

పయోష్ణీ నదీతీరమున జరిగిన మహాయుద్ధమును చేదిసేనలు జయమునుగడించి కుంతలదేశాధీశునికి స్వారాజ్యకిరీటమును సంపాదించి యిచ్చినవి. ఇందు పాత్రల నామములు చారిత్రపురుషుల నామములకు భిన్నములు. గోవిందుని పక్షమున ఎవ్వరు పోరాడిరో తెలియరాదు. శిలాహార శాసనము కర్కరుడు, రాష్ట్రకూట సామంతుడు గోవిందుని పక్షమున పోరాడినట్లు అమోఘవర్షుడు జయించినట్లు సూచించుచున్నది. (32)

గోవిందుని శాసనములు క్రీ. శ. 934 వరకు గలవు. అమోఘవర్షుని శాసనము క్రీ. శ. 937 సెప్టెంబరు 7 వ తేదీన గలదు. కావున గోవిందునిపై విప్లవము ఈ మధ్య మూడు సంవత్సరములలో జరిగియుండును.

### అ మో ఘ వ ర్షు డు III

మూడవ అమోఘవర్ష మహారాజు క్రీ. శ. 937 నుండి 940 వరకు పరిపాలించినాడు. కాని రాజ్యభారము యువరాజు కృష్ణుడు వహించి

(32) శ్రీ మన్కర్కర రాష్ట్రకూట కటకే నద్వంశ సంహర్షతో
రౌద్ర ద్రోహదవ ప్రతాప శమనం నిస్త్రింశ ధారాజలైః॥
యేనా కారి నముద్ భూతేంద్ర ధనుషా భూషాశ్మ భి విద్వితా।
భూతి శ్రీ ష్మరమోఘవర్ష సుఘనో ౽ నద్భుతి విధ్వంసనాత్.

యుండును. గంగరాజు పుత్రుడు భూతుంగునకు (ii) అమోఘవర్షుడు తన పుత్రిక నిచ్చి వివాహమొనరించెను.

యువరాజు కృష్ణుడు దంతిగుని వప్పగుని సంహరించినాడు. వారు గంగవాడిరాజగు రాచమల్లుని సామంతులు.తరువాత రాచమల్లుని ఎదుర్కొని సంహరించినాడు. అప్పుడు బావ మరది యైన భూతుగుని గంగరాజసింహాసనమున ప్రతిష్ఠించినాడు. ఇసమ్ముద్రు శాసనము, క్రీ. శ. 937 సెప్టెంబరు 7 వ తేదీన అమోఘవర్ష చక్రవర్తి రాజ్య కాలమున నున్నది. అందు పలేయార్ దేవుడు శ్రీపురమున పాండ్య రాజును సంహరించినట్లు ఇంద్రుని కుమారుడు పల్లవరాజును ఓడించి నట్లు మహాభుజుడైన కన్నరదేవుడు గంగపెరుమదిని జయించి గంగరాజ్యమును భూవల్లభునకు ఇచ్చినట్లు చెప్పుచున్నది. పాండ్య పల్లవరాజ కథనమునకు సంబంధించిన చారిత్రకాధారములు లేవు. కాని ఈ శాసనములోని గాంగవాడి కథనము రాచమల్లుని గాథయే.

కృష్ణరాజు దక్షిణమునుండి ఉత్తరమునకు సేనలను మరలించి భార్యామాతృవంశమునకు చెందిన చేదిరాజ్యమును జయించినాడు.

కాలంజర, చిత్రకూటదుర్గములను కృష్ణరాజు ఆక్రమించినాడు. గుర్జరరాజు వానిని తిరిగి జయించు ఆశను వదలినాడు. జూరా దగ్గర దొరికిన శిలాశాసనము ఈ విషయమునే దృఢపరచుచున్నది. అది కర్ణాటభాషలో నున్నది. కన్నరదేవుని ప్రస్తుతి గలదు. కావున ఉత్తరమున దొరికిన కన్నడ శిలాశాసనమునుబట్టి కాలంజరి చిత్రకూటదుర్గములను కృష్ణరాజు జయించినాడనుటలో విప్రతిపత్తి లేదు. ఈ సంఘటన లన్నియు దివాలీ శాసనములో కృష్ణమహారాజు పట్టాభిషేకమునకు పూర్వమందే అభివర్ణితములు. కృష్ణుడు యువరాజుగ నున్నప్పుడే దంతిగ వప్పగ రాచమల్లుల సంహారము చేది దండయాత్ర చిత్రకూట

దుర్గాక్రమణము ఇత్యాది సన్నివేశములు క్రీ. శ. 940 పూర్వము జరిగినవి.

శ్రావణబెల్గోలాలో ఒక శాసనములో గంగవజ్రరాజు సేవకు డొకడు చెల్లాచెదరైన సేనలను పురికొల్పికొని వద్దిగ దేవుని కోనేయ గంగుని సేనలు పారిపోవునట్లు ఎదుర్కొనిన కథనము కలదు. వద్దెగ దేవుడు లేక బద్దెగ దేవుడు అమోఘవర్షునికి నామాంతరము. దీనినిబట్టి కూడ గంగవాడియుద్ధము అమోఘవర్షుని కాలముననే కృష్ణరాజు యువరాజుగ నున్నపుడే జరిగినట్లు ఋజువగుచున్నది.

## కృష్ణ మహారాజు iii

అమోఘవర్షుని అనంతరము కృష్ణమహారాజు సింహాసనమును క్రీ. శ. 940 ప్రాంతమున అధిష్ఠించినాడు. అతడు యువరాజుగ నున్న పుడే వీరుడుగ ప్రసిద్ధిగాంచినాడు.

దక్షిణమున గంగవాడిని అతని బావమరది భూతుగుడు పరిపాలించెను. బాణరాజు విక్రమాదిత్యుడు iii అతనికి మిత్రుడు. చోళరాజు పరాంతకుడు బాణవాడిని జయించి గంగబాణరాజు పృథ్వీపతి ii హస్తిమల్లుని నిలిపినాడు. విక్రమాదిత్యునకు సహాయము చేయుటకు దక్షిణమున రాష్ట్రకూటరాజ్యమును విస్తరించుటకు చోళరాజ్యముపై కృష్ణమహారాజు దండెత్తినాడు.

పరాంతకరాజు కన్యాకుమారి శాసనములో అతడు కృష్ణరాజును ఓడించి వీరచోళ బిరుదు వహించినట్లు కలదు. క్రీ.శ. 944 కు పూర్వము యుద్ధములోని పతనోత్థానములను బురస్కరించుకొని ఒకప్పుడు ఆ శాసనము వెలువడి యుండును. కాని తొండై మండలమును కృష్ణరాజు జయించి పరిపాలించినట్లు బలవత్తరమైన చారిత్రకాధారములు లభించుచున్నవి. దక్షిణ ఆర్కాటుమండలములో కృష్ణరాజు 5 వ రాజ్య సంవత్సరమున అతని కాంచి తంజై విజయములను పేర్కొనుచున్నవి.

ఆ మండలములో ఉక్కలవిష్ణుదేవుని ఆలయములో కృష్ణరాజు 16 వ రాజ్యసంవత్సరమున శిలాశాసనము కాంచి, తంజాపురీవిజయములను ప్రస్తావించుచున్నది. చెంగల్పట్టు మండలములో 17, 19, రాజ్య సంవత్సరముల శాసనములు కన్నరదేవునివి కలవు. క్రీ. శ. 959 లో కృష్ణరాజు దక్షిణ ఆర్కాటు మండలములోని మేల్పాతినుండి మండలాధిపతులకు రాజ్యభాగమును బంచుచున్నట్లు అతని కర్హాడ్ శాసనములో గలదు. వేలూరు మండలమున 26 రాజ్యసంవత్సరమున కృష్ణమహారాజు శాసనము కలదు. ఈ ఆధారములను బట్టి కృష్ణమహారాజు తొండై మండలమును ప్రత్యక్షముగ పరిపాలించినాడనుట పూర్వపక్షములేని సిద్ధాంతము.

సిద్ధలింగమదం శాసనములో 5 వ రాజ్యసం. కృష్ణరాజు కాంచిని తంజావూరును జయించినట్లు గలదు. అనగా క్రీ. శ. 945 ప్రాంతము. తక్కోలము యుద్ధము క్రీ. శ. 949 న జరిగినది. అంతవరకు తొండై మండలమును కృష్ణరాజు ఆక్రమింపలేదని కొందరి యూహ. కాని తక్కోల యుద్ధము కృష్ణరాజు పరిపాలనపై నెదుర్కొనుటకు పరాంతకుడు పన్నిన ప్రతివ్యూహము.

క్రీ. శ. 949 లో ఉత్తర ఆర్కాటు మండలమున తక్కోలము వద్ద ఘోరయుద్ధము జరిగినది. యువరాజు రాజాదిత్యుడు చోళసైన్యమును నడపినాడు. రాష్ట్రకూటుల పక్షమున గంగవాడిరాజు భూతుగుడు వచ్చి చేరినాడు. ఆతుక్కూరు శాసనమునుబట్టి తాత్కాలికముగ రాష్ట్రకూటులు వెనుకంజ వేసినట్లు తోచుచున్నది. కాని, తరువాత భూతుగుడు విజృంభించి రాజాదిత్యుడు ఏనుగునుజంపి అంబారీలోని యువరాజును సంహరించినాడు. చోళశాసనములలో రాజాదిత్యుడు కృష్ణరాజుతో యుద్ధము చేసినప్పుడు అంబారీలో మరణించినట్లు గలదు. కర్హాడ్ శాసనములో కృష్ణరాజు పాండ్య కేరళ రాజులను జయించి

సింహళరాజు నుండి కప్పము గైకొనెనని రామేశ్వరమువద్ద కీర్తిలతను పాదుకొల్పెనని వాక్యములు యథార్థములు. యశస్తిలకమును సోమదేవుడు కర్హాడ్ శాసనమునకు రెండునెలల తర్వాత అనగా క్రీ.శ. 959 మేలో కృష్ణరాజు పాండ్య చోళ, చేర, సింహళదేశాధీశులను జయించిన చక్రవర్తి అని వర్ణించినాడు. గంగరాజ్యమును కృష్ణరాజు వలన సంపాదించిన భూతుగుడు అతనికి దక్షిణదండయాత్రలో కుడిభుజముగా తోడ్పడినాడు. ఇతని రాజభక్తికి పారితోషికముగా కృష్ణరాజు వనవాసి 12000, బెల్వోల 300 కింశుతడ్ 70 బాగేనద 70 పురిగిరి 300 ఇచ్చినాడు. భూతుగుని శాసనములు క్రీ. శ. 953 వీప్రియులు వరకు కన్పించుచున్నవి. ఇతని తరువాత ఇతని కుమారుడు నోలంబాంతక మారసింహుడు రాజైనాడు.ఇతడు కొల్లవరసి పుత్రుడు. రాష్ట్రకూట మహారాజు సోదరి పుత్రుడు కాదు. ఇతడు కూడ తండ్రివలె దండయాత్రలలో కృష్ణరాజునకు తోడ్పడినాడు.

ఉత్తరమున కృష్ణరాజు చేదిరాజ్యమును జయించిన తర్వాత యశోవర్మ బలవంతుడైనాడు. శ్రావణబెల్గొలా శాసనములో కృష్ణ రాజునకై మారసింహుడు గుర్జరులను జయించి 'గుర్జరాజు' బిరుదమును వహించినట్లు గలదు.

బాడపరాజు ఆరంబాక శాసనములో చాళుక్య అమ్మరాజు ii ను యుద్ధమల్లుని పుత్రుడై బాడపుడు కర్ణరాజు సహాయముతో తరలించి నట్లు గలదు. (33) కర్ణరాజు కన్నడములోని కన్నరరాజునకు సంస్కృతము వేంగిమండలమున గూడ తన ఆశ్రితుని రాజుగ కృష్ణరాజు ప్రతిష్ఠించినాడు.

---

(33) ఆశ్రిత్య కర్ణరాజాఖ్య వల్లభం బాణపాధిపః
వినిర్గమయ్య తం దేశాదమ్మరాజారవ్యమూర్జితమ్,

కృష్ణరాజు కొల్లంగల్లు శాసనమును బట్టి క్రీ. శ. 967 ఫిబ్రవరి 17 వ తేదీన మరణించినట్లు తెలియుచున్నది.

దక్షిణభారత ద్వీపకల్పమున కృష్ణమహారాజు ఏకచ్ఛత్రాధిపత్యమును వెలయించినాడు. తొండైమండలము వేంగిమండలము గంగవాడి బాణమండలము అన్నియు అతని ఆశ్రితుల అధీనములు.

## నిత్యవర్ష అమోఘవర్ష మహారాజు

కృష్ణమహారాజునకు ఒకపుత్రుడు గలడు. అతని కుమారుడే అర్వాచీనకాలమున ఇంద్రుడు iV కృష్ణమహారాజు పుత్రుడు తండ్రి కంటె ముందు గతించుటచేత మనుమడు ఇంద్రుడు బాలుడగుటచేత కృష్ణుని అనంతరము అతని సోదరుడు క్రీ. శ. 968 లో కొత్తిగుడు సింహాసన మధిష్ఠించినాడు. దివాలిశాసనములో కృష్ణునికి అనుగు తమ్ముడు జగత్తుంగదేవుడు కన్పించుచున్నాడు. అతడే కొత్తిగదేవుడై యుండవచ్చును. లేదా జగత్తుంగుడు వేరొక సోదరుడు కావచ్చును. కొత్తిగుడే అమోఘవర్షమహారాజు కావచ్చును.

కొట్టిగ మహారాజు కాలమున రాష్ట్రకూట రాజ్యము క్షీణించినది. ఉత్తరమునుండి పరమారరాజు కొత్తిగుని ఓడించి రాష్ట్రకూట రాజ్యమును కొల్లగొట్టి మాన్యకేతమును అగ్నిదగ్ధము చేసినాడు. పరమారరాజు చాముండరాయని అర్థున శాసనము క్రీ. శ. 1079 లో కర్ణాటాధిశులతో శ్రీహర్షుడు చేసిన యుద్ధములను ప్రస్తావించుచున్నవి. మాళవరాజుల ఉదయపురప్రశస్తినిబట్టి శ్రీహర్షదేవుడు కొట్టిగదేవుని లక్ష్మిని హరించినట్లు తెలియుచున్నది. (34) శాయక లేక శ్రీహర్షుని తరువాత రాజ్యమేలిన వాక్పతి ప్రథమదానశాసనము 974 - 975 లో గలదు. ఖొట్టిగరాజు తరువాత రాజ్యమేలిన కర్కుని శాసనము క్రీ. శ.

---

(34) శ్రీహర్షదేవయితి ఖొట్టిగ దేవలక్ష్మీ జగ్రాహ యో యుధి.
E I, 1 p 235

972 లో కలదు. కావున శ్రీహర్షుడు కొట్టిగుడు సమకాలీనులు. 'పైయలత్థి, ని రచించిన ధనపాలుడు తన గ్రంథమును ధారానగర ములో విక్రమసంవత్సర 1029 లో అనగా క్రీ. శ. 972 - 73 లో మాన్య కేతమును మాళవదేశాధీశుడు కొల్లగొట్టినపుడు వ్రాసినట్లు చెప్పినాడు. పరమారశాసనములు మాన్యకేతవిధ్వంసమును పేర్కొనుచున్నవి.

కొట్టిగరాజు మాన్యకేత విధ్వంసకాలముల సింహాసనమున నున్నాడు. కాని 972 లో క్రీ. శ. 972 లో కర్కరాజు ii శాసనము గన్పించుటచే పరమారుతో యుద్ధముచేయుచు కొట్టిగరాజు మరణించి నట్లు ఊహింపవచ్చును.

## క ర్క మ హా రా జు - II

కొట్టిగమహారాజు పరోక్షమున క్రీ. శ. 972 లో కర్కమహారాజు సింహాసనమును అధిష్ఠించినాడు. ఇతడు కొట్టిగమహారాజు సోదరుడైన నిరుపముని పుత్రుడు. ఈ నిరుపముడు జగత్తుంగుడు భిన్నవ్యక్తులగునో కారో చెప్పలేము. క్రీ. శ. 972 లోని సోరబుశాసనము కర్కమహా రాజును పేర్కొనుచున్నది.

కర్ధశాసనములో అతని కీర్తి ప్రతాపములు వర్ణితములు. పాండ్యులను భీతచిత్తులను జేసినాడు. గుర్జరులను చోళులను ఓడించి నాడు. హూణులను ఎదిరించినాడు. కాని ఈ విజయములకు వేరు దర్శనములు లభించుట లేదు. విక్రమాదిత్యుని గడగ్ శాసనములో రాష్ట్రకూటరాజ్యపతనము శ్రీముఖనామ సంవత్సరముగా నున్నది. అయిన శక 895 అనగా 973 మార్చి 974 మార్చి లోపున కర్కమహారాజు రాజ్యము అంతరించినది. కర్కమాహారాజు శాసనము 973 జూలై వరకు కన్పించుచున్నవి. చేదిరాజునకు మేనల్లుడైన తైలరాజు రాష్ట్ర కూటరాజ్యముపై దండెత్తి కర్కరాజును ఓడించి సామ్రాజ్యమును ఆక్రమించినాడు.

రాష్ట్రకూట సామ్రాజ్య విచ్ఛిత్తి అత్యద్భుతసన్నివేశము. క్రీ. శ. 967 రాష్ట్రకూట చక్రవర్తి కృష్ణమహారాజు దక్షిణాపథము నంతయు ఏకచ్ఛత్రాధిపతియై పరిపాలించినాడు. క్రీ. శ. 973 డిశంబరు ప్రాంతమున అతని తమ్ముడు పుత్రుడు కర్కమహారాజుతో రాష్ట్రకూట సామ్రాజ్యము అస్తమించినది. కర్కమహారాజు కర్దశాసనములో పాండ్య, చోళ, గుర్జర విజయముల చారిత్రకత అటుంచ, ఆ రాజులందరు రాష్ట్రకూటరాజ్యమునకు శత్రువులనుట సత్యము. కృష్ణుడు చేదిరాజు లనుగూడ ఎదుర్కొనినాడు. ఉత్తరమున పరమారులు ప్రబలశత్రువులు. వారిపై ఔదాసీన్యము వహించినాడు. చేదిరాజు యువరాజు మేనల్లుడు తైలరాజు, రాష్ట్రకూట రాజ్యముపై దండెత్తునపుడు అతనికి చేది, పరమార, కాంచి, పాండ్య గుర్జర రాజుల సహాయముతోపాటు రాష్ట్ర కూటసామంతుల తోడ్పాటుగూడ లభించియుండును. తైలరాజు భార్య జాకవన్ రాష్ట్రకూట వంశకన్యక. రెండు సం. పూర్వము రాష్ట్రకూటరాజధాని మాన్యకేతముతోపాటు సామ్రాజ్యకీర్తి ప్రతిష్ఠలు గూడ అగ్నిదగ్ధము లైనవి.

## రాష్ట్రకూట చరిత్ర
## సంఘవృత్తములు
## క్రీ. శ. 7, 8, 9, 10 శతాబ్దులు.
### రాజ్యతంత్రము

రాష్ట్రకూట సామ్రాజ్యమున మహారాజు లేక చక్రవర్తి సర్వాధికారి. రాజ్యతంత్రమున సర్వతంత్ర స్వతంత్రుడు. రాజ్యాధికారము వంశ పారంపర్యము. రాజు యువరాజును సామాన్యముగ జ్యేష్ఠకుమారుని అభిషేకించును. మౌక్తికహార యౌవరాజ్యపదవికి లాంఛనము. (1) చక్రవర్తి పరోక్షమున యువరాజు సర్వాధికారములు

(1) EI IV p 242 తండ్రితో గోవిందుని III వాక్యముచుబట్టి.

నిర్వహించెడివాడు. చక్రవర్తి సర్వసైన్యాధిపతి దండయాత్రలను ప్రత్యక్షముగా నడపు చుండెడి వాడు. యువరాజు కూడ సేనాపతియై చక్రవర్తి పరోక్షమున ప్రత్యక్షమున దండయాత్రలు నడపినాడు. రాష్ట్రకూట సామ్రాజ్యమున యువరాజులను రాష్ట్రములకు రాజప్రతి నిధులనుగా నియమించు ఆచారము మారినది. రాజపుత్రులు రాష్ట్రము లకు రాజప్రతినిధులు. యువరాజు రాజధానిలో చక్రవర్తితో నుండెడి వాడు. గోవిందుని కాలమున మాత్రము సామంతులు విప్లవము నెలకొల్పి అతనిని పదభ్రష్టుని చేసి అమోఘవర్షునకు కిరీటమును అర్పించినారు.

### రా జా స్థా న ము

రాజాస్థానమున గజ, తురగ, భట యూధ ములతో పరివేష్టితుడై చక్రవర్తి కొలువు దీర్చెడివాడు. ఆస్థాన పరిసరముల దండయాత్రలలో జయించిన అశ్వదళములను గజయూధ ములను ప్రదర్శించెడివారు. సువర్ణరత్న ఖచితమైన కుండములను ముత్యాలహారములను చక్రవర్తి ధరించెడివాడు. (2) దాసీకన్యకలు పరిచర్య చేయుచుండెడివారు. కృష్ణరాజు ఆస్థాన నర్తకీగణము సుకుమార హస్తవిన్యాసముచే సుందరనాట్యచారణముచే హావభావము లను మనోజ్ఞముగ అభినయించి పౌరాంగనలను సంతోషింపచేసెడి వారని కబ్బశాసనములో గలదు.

ఆస్థానమును అమాత్యులు కవులు దండనాథులు జ్యోతిష్కులు పురోహితులు నిగమసభాధ్యక్షులు అలంకరించెడివారు.

### అ మా త్య వ ర్గ ము

భారతీయ రాజ్యతంత్రమున అమాత్యవర్గము ప్రాచీనకాలము నుండి ప్రాముఖ్యమును వహించినది. రాష్ట్రకూట సామ్రా జ్యము ఈ సూత్రమునకు అపవాదము కాదు. 3 వ కృష్ణరాజు

(2) Abu Zaid.

సంధివిగ్రహకారుడు. అతని కుడిభుజము. (3) 'తస్యయః ప్రతి హస్తోఽ భూత్ప్రియో దక్షిణహస్తవత్' అని వర్ణనగలదు. 'ప్రధాని' రాజు యువరాజు తరువాత సర్వాధికారి. అర్వాచీనకాలమున గోవ నుని ప్రధానిని గురించిన ప్రశస్తినిబట్టి ప్రధాని ప్రాముఖ్యము స్వయం వ్యక్త మగుచున్నది. (4)

రాష్ట్రస్య పుష్టిః స్వజనస్య తుష్టిః
ధర్మస్య వృద్ధి స్సకలార్థ సిద్ధిః
నందంతి సంతః ప్రసరంతి లక్ష్మీః
శ్రీ చంగ దేవే సతి సత్ప్రధానే.

అమాత్యులు "పారగో రాజవిద్యానాం కవిముఖ్యః ప్రియంవదః" అని రాజవిద్యాపారగులు కావలెనను సూచన కలదు. (5) సోమ దేవుడు అమాత్యులు ధీరులు సేనానులునై యుండవలెనని వచించి నాడు. దక్షిణాపథమున మంత్రులు దండయాత్రలను సేనానులై నడిపించినారు. నోలంబాంతక మారసింహుని అమాత్యుడు చాముండ రాయడు గోనూరుయుద్ధమున నోలంబుల నోడించినాడు. (6) మంత్రు లను సైన్యమునుండి కూర్చుకొనుట దక్షిణాపథమున ప్రాచీనా చారము. అర్వాచీనకాలమునగూడ మంత్రులు సేనలను నడపించిన దండనాయకులు. మంత్రులు సామంతరాజులవలె పంచమహాశబ్దము లకు అధికారులు. సామంతులు ప్రధానికి నమస్కరించెడివారు. 'శ్రీ సేఉణాఖ్యేన నృపేణ ప్రధానయుక్తేన విచార్య పట్టద్వయం దత్తమ్' అన్న అర్వాచీన రాజ శాసన వాక్యమునుబట్టి రాజులు ప్రధానిని సర్వ

(3) E I IV p 60
(4) I A VIII p 41
(5) See No. 3
(6) E I, V p 173

విషయముల సంప్రదించుచుండిరనుట విదితము. మహాసంధివిగ్రహకుడు రాజశాసనములను దానపట్టములను ప్రచురించు అధికారి. మితాక్షరిలో ఉదాహృతమై ఒక శ్లోకములో సంధివిగ్రహకారి స్వయముగా రాజశాసనములను ప్రచురించునని కలదు.

సంధివిగ్రహకారీ తు భవేద్య స్తస్య లేఖకః
స్వయం రాజ్ఞాసమాదిష్ట స్స లిఖే ద్రాజశాసనమ్.

మహాసంధివిగ్రహకుని క్రింద అనేక సంధివిగ్రహకు లుండెడివారు. దానశాసనములకు మాతృకలు ఈ మహాసంధివిగ్రహకుని అధీనములో నుండెడివి. సామాన్యముగ దానశాసనములు తామ్రశాసనములు. కర్కరాజు సూరత్ తామ్రశాసనము చిట్టచివర ఆ శాసనము యథామాతృకమని ఆస్థానామాత్యుడు పరిశోధించినట్లు కలదు. పోయిన దానశాసనములను విచారణచేసి తిరిగి గ్రహీతకు ఇచ్చెడివారు. (7) క్రీ. శ. 997 లో అపరాజితుని భదనశాసనమునకు మాతృక స్థానక నిక్షిప్తమైనట్లు గలదు. త్రిన్నగ్రామమును ధ్రువమహారాజు i ఒక బ్రాహ్మణునికి దానము చేసినాడు. రెండు పురుషాంతరముల తరువాత ధ్రువరాజు ii అతని మనుమడు ఆ దానశాసనమును తిరిగి నెలకొల్పినాడు. గుజరాతు రాష్ట్రకూటవంశము అంతరించినప్పుడు ఆ రాజవంశీయులు ఇచ్చిన ప్రాచీనశాసనమును పునః ప్రతిష్ఠించుటకు ఇంద్రమహారాజు iii దగ్గరకు గ్రహీతవంశీయులు వచ్చినారు. దీనినిబట్టి లేఖకశాఖ మహాసంధివిగ్రహకుని ఆధ్వర్యమున నేటి రిజిస్ట్రేషను శాఖవలె విలసిల్లినది. మహాక్షపాటలిక, శాసనాధికారి ఈ ఉద్యోగి నామాంతరములు. ఇతనిక్రింద అనేక కరణులు ఉండెడివారు.

---

(7) దౌలతాబాదు శాసనము. భో. జ. E I, v, p 208

## రాజ్యాంగ విభాగములు

దేశము, రాష్ట్రము, విషయము, వాడి, భుక్తి, గ్రామము కుగ్రామము మున్నగునవి సామ్రాజ్యములో అంతర్భాగములు. రాష్ట్రములను రాజపుత్రులు రాజప్రతినిధులై పరిపాలించినారు. కొన్ని గ్రామములు కలిసిన ఒక భుక్తి. ప్రతిష్ఠానభుక్తిలో ద్వాదశగ్రామకూటక సంకలితమైన 500 గ్రామములు గలవు. (8) సారకచ్ఛద్వాదశగ్రామ, వవులల్లద్వాదశగ్రామ, రురిధదశక, సిహిరిద్వాదశ, పురిగేరి, ఉప్పలికా, కర్పటవాణిజ్య వటపత్రక మున్నగునవి ప్రతిష్ఠానభుక్తిలోని గ్రామ కూటములు. ఇట్లే హర్షపుర, అర్ధాష్టశతక, పతతూరు ద్విసహస్ర, అలతగేసప్తశత మున్నగు నామములనుబట్టి గ్రామములను కూటములుగా విభజించెడివారు. నగరములు పౌరపతులు లేక నగరపతులు పరిపాలించుచుండెడివారు. ఇట్లే బనవాసి 12000, అనిన 12000 గ్రామములుగల బనవాసిరాష్ట్రమని నిర్వచనము. కాని గంగవాడి 96000 అనిన 96000 గ్రామములుండుట ఆ చిన్న రాష్ట్రములో అసంభవమని రైసుగారి పూర్వపక్షము. కాని 'వాడి' లేక 'నాడు' అనిన సహస్రగ్రామసంపుటమని ఒకప్పుడు సహస్రగ్రామములేని చోట్ల కూడ 'నాడు' అను నామము వర్తించినదని గంగవాడి 96000 అనిన 96 నాడులు కలసిన రాష్ట్రమును సూచన అని దీనిని సమర్థింప వచ్చును. కాక, బనవాసి 12000 ఆ రాష్ట్ర జనసంఖ్యను దాని పన్నును గాని సూచించుచున్నదని అర్థము చెప్పుటకు వీలులేదు. బనవాసి రాజప్రతినిధి బంకేయుడు తన పుత్రుని నిత్తుంతిగె 12 కు పరిపాలకునిగా నియమించినాడు. (9) బుద్ధహర్షుడు శిఖరిక ద్వాదశ పరిపాలకుడు (10) దీనినిబట్టి బుద్ధవర్షుని పరిపాలనలో 12 గురు జనసంఖ్య కలదని లేక

---

(8) గోవిందుని ప్రతిష్ఠాన శాసనము.

[9] E I VII p 214

[10] E I, III p 54

12 సువర్ణనాణెములు అతని ఆదాయమని చెప్పవలసిన విచిత్రస్థితి ఏర్పడరాదు.

'సారకచ్ఛ ద్వాదశ గ్రామాభ్యంతరే లింబారికా గ్రామః మజ్జంతియ సప్తతిగ్రామ భుక్త్యంతర్గత తావేయురగ్రామః పురాప్రభృతి చతుర్దశ శతగ్రామసమన్వితాం సమస్తకోంకణభువమ్....'

అను శాసనవాక్యములను నిదర్శనముగా గ్రహింపవచ్చును.

రాష్ట్రపతి లేక రాష్ట్రమును పాలించు రాజప్రతినిధికి గ్రామములను భూములను దానముచేయు అధికారములేదు. అది రాజునకు మాత్రమే కలదు. సుప్రసిద్ధసేనాని బంకేయుడు, బనవాసి రాష్ట్ర రాజప్రతినిధి జైనాలయమునకు ఒక గ్రామమును దానము నల్పుటకు రాజాజ్ఞను వడసినాడు. స్తంభుడు గంగవాడి రాజప్రతినిధి క్రీ. శ. 802 లో మన్నెతామ్రశాసనమున తమ్ముడైన గోవిందరాజదేవుని అజ్ఞప్తియందుకొని దానము చేసినట్లు గలదు. (11) విజ్ఞానేశ్వరుడు యాజ్ఞవల్క్యస్మృతిలో భూమిని రాజు దానము చేయవలెను గాని రాజోద్యోగులు చేయరాదను నిషేధము దక్షిణాపథమున అలనాటి ఆచారమును సంగ్రహించినాడు.

విషయపతులను భోగపతులను మహారాజు స్వయముగా నియమించెడివాడు. కొందఱు విషయాధిపతులు సామంతరాజ మర్యాదల ననుభవించినారు. దీనికి కారణము వంశమర్యాద. రాష్ట్రాధిపతి విషయాధిపతి పదవులు కొన్ని వంశపారంపర్యములు. విషయపతికి పన్ను వసూలు ముఖ్యధర్మము. దానశాసనములను సంరక్షింపవలెనని విషయపతికి అనేక దాన శాసనములను నిర్దేశము కలదు. ఇట్లే భోగపతి భుక్తిని పరిపాలించెడివారు. గ్రామకూటములను దేశగ్రామకూటుడను ఉద్యోగి పరిపాలించెడివాడు. వంశపారంపర్యమైన

(11) E, C, IX Neelamangal No, 61

ఈ పదవికి దేశగ్రామకూట క్షేత్రమను పన్నులేని భూములు సంక్ర మించెడివి. ఈ పదవికి కర్ణాటమున 'నాల్గావుండుడు' అని పేరు. బెల్వాల 300 పాలకుడు దేవనయ్య ఒక దేవాలయమునకు నేతిమీద రాబడిని దానము చేసినాడు. కూరగాయలు, నెయ్యి పాలు మున్నగు సర్వపదార్థములమీద 'భోగకరి' అను పన్ను ఉండెడిది. ఇది ధనముగా గాక పదార్థరూపమున రాజోద్యోగులకు చెందుచుండెడివి. ఈ భోగకరిని ఉద్యోగులే జీతముగా అనుభవించెడివారు. అందుచే దేవనయ్య 'నేతి' పన్నును దేవాలయమునకు సమర్పించి నాడు.

పురములను పురపతి లేక నగరపతి పరిపాలించుచుండెడివాడు. ఈ ఉద్యోగులు కొందఱు సేనానులు. రుద్రపయ్య సారవతూరు పురపాలకుడు కృష్ణమహారాజు iii అంగరక్షకుడు. పురపతికి తోడ్పడు టకు పౌరసంఘములు లుండెడివి. ఇట్టి సంఘములు మౌర్య చాళుక్య సామ్రాజ్యములలో గూడ కన్పించుచున్నవి. గుణపురమున (కొంకణ్) పౌరసంఘములో అంబుశ్రేష్ఠి, వప్పయ్య శ్రేష్ఠి, చేలప్ప అనువర్తకుడు, గోవనేయుడను బ్రాహ్మణుడు మున్నగు వారుండిరి. (12) 2వ కృష్ణరాజు కాలమున ఐహోలులో పౌరసంఘమున్నది.

రాజశాసనములను చారులు ఉద్యోగులకు అందించెడివారు. 'వల్లభాజ్ఞా సంచారిణః' అను వాక్యము ఈ విషయమును స్వయం వ్యక్తముచేయుచున్నది. సుప్రసిద్ధ పండితులును వల్లభిరాజ్యములో ఉన్నతపదవుల నధిష్ఠించినట్లు చీనాయాత్రికుడు ఇట్సింగ్ చెప్పు చున్నాడు.

రాజోద్యోగులు రాజభక్తిపరాయణులు. రాజతరంగిణిలో రాజో ద్యోగులు రాజమరణమున చితిపై మరణించుచున్నట్లు గలదు.

---

[12] E I III p 260,

'ఆబుజైద్' అను సమకాలీనుడు ఈ విషయము ప్రస్తావించినాడు. పట్టాభిషేకమహోత్సవమున రాజభక్తి పూరితులైన ఉద్యోగులు మంత్రాక్షతములను గైకొందురు. ఇట్లు అక్షతలను పరిగ్రహించినవారు రాజు మరణించినప్పుడు మరణింపవలెను. కేరళదేశమున మార్కోపోలో ఈ ఆచారమును 13 వ శతాబ్దిలో దర్శించినాడు. తైల రాజు మరణించినప్పుడు అతని అనుగుసేనాని చొప్పనదేవుడు ప్రతిజ్ఞానుసారము అగ్నిని ప్రవేశించి స్వర్గమును చేరినట్లు శిలాశాసనములో గలదు. (13) అర్కల్‌గాడు శాసనములనుబట్టి గంగవాడి పాలకుడు నీతిమార్గుడు మరణించినప్పుడు ఇద్దరు రాజభక్తులు అగ్నిప్రవేశమొనరించినట్లు తెలియుచున్నది. ఈరాజభక్తుల కుటుంబములకు గౌరవభృతులు ఈ శాసనములు గల్పించుచున్నవి. తెలుగులో 'రాచపీనుగ తోడులేకుండ చావదు' అనునది ప్రాచీనసుభాషితము.

## మహమ్మదీయులు

రాష్ట్రకూట సామ్రాజ్యమున మహమ్మదీయులను మహమ్మదీయులే శాసించినారని, అబుల్‌ఇష్టన్‌అల్ ఇస్తఖోలి, ఇబన్‌హకూల్ చెప్పినారు. (14) అనగా మహమ్మదీయ వివాదములను మహమ్మదీయ ఖాజీలే పరిష్కరించి తీర్పుచెప్పెడి వారు. కాని మహమ్మదీయాధికారులు శాసనములలో కన్పించుట లేదు.

## గ్రామ పరిపాలన

గ్రామకూటుడు మహారాష్ట్రమున, గావుండను కర్నాటమున గ్రామాధికారులు. గ్రామములలో వయస్కులందరు యుద్ధకుశలులు. ఒక శాసనమున గాజువర్తకులు శత్రుసైన్యమును తరిమినట్లు కలదు.

---

[13] E. C. VII,

[14] Elliot ip 27 & p 34

(15) గ్రామములమధ్య అన్యోన్యకలహములలో మరణించిన వీరులు శిలాశాసనములలో గన్పించుచున్నారు. (16) ఈ వివాదములు సామాన్యముగ పచ్చికబయళ్ళను గురించి బంజరుభూములను గురించి రేగుచుండెడివి.

గ్రామము కోసమై, గ్రామములోని గోవులకోసమై ఆత్మార్పణము గావించుకొనిన గ్రామవీరుల అద్భుతకథనములు శిలాక్షరములుగా చరిత్రలో తెరచాటున నిల్చియున్నవి. రాజులు అంతఃకలహములను దేశీయులలో పౌరుషచిహ్నము గావించి ఇట్టి యోధులను సైన్యములో చేర్చుకొనుచుండెడివారు. గ్రామములోని ప్రతి రాజశాసనము గ్రామాధికారిని పేర్కొనుచున్నది. గ్రామాధికారి గ్రామమును దొంగలనుండి దోపిడినుండి సంరక్షించుచుండెడివాడు.

గ్రామములో కొన్ని బ్రాహ్మణాగ్రహారములు. బ్రహ్మదాయ గ్రామము లుండెడివి. గ్రామాదాయము రాజునకుబదులు బ్రాహ్మణులకు చెందిన అవి బ్రహ్మదాయగ్రామములు. వీరి గ్రామములోని భూములు వ్యవసాయకులవి. రాబడి బ్రాహ్మణులది. అగ్రహారగ్రామములలోని భూములుగూడ బ్రాహ్మణులు అనుభవించెడివారు. వీనికే భూమిపన్ను లేదు.

గ్రామములలో మహాజనసభ లుండెడివి. ఈ మహాజనసభలు అగ్రహారములలో ఈ మహాజనసభలు ప్రతిపత్తిననుభవించినవి. సౌరతూరు శాసనములో కృష్ణరాజు iii కాలమున పన్నుగా నిచ్చెడి వంటచెఱకును మహాజనులు దేవాలయమునకు ఇచ్చుటకు అభిలషించిరి.

---

[15] E C VIII Sorab no 580

[16] Sorab 102, 216, 328, 351, 454, 455 etc.

గ్రామాధికారి వారి అభిమతమును నెరవేర్చుటేగాక వారి పాదముల కడిగి 12 మత్తరుల భూమినిగూడ దానముచేసినాడు (17)

గోవిందుని iii రధనపుర తామ్రశాసనములో 40 మహాజనుల సభను పేర్కొనుచున్నది. అందు ముఖ్యులు 10 మంది బ్రాహ్మణులు కలరు. (18) క్రీ. శ. 917 లోని హత్తిమత్తూరు శాసనములో 50 వ్యవసాయకుల మహాజనసభ గలదు. జయసింగయసెట్టి, జుమ్మిసెట్టి, మాలిసెట్టి, నామిసెట్టి, కాంతిసెట్టి ముఖ్యులు. మహారాష్ట్రమున ఈ గ్రామసభలకు 'మహారట్టర' ము లనిపేరు. 'మహాట్టురాధికారిణః' అను వాక్యమునుబట్టి ఈ సభకు అధికారవర్గమున్నట్లు ఊహింపవచ్చును.

మహాజనములు ప్రజోపయోగకరములైన విధులను నిర్వహించుచుండెడివి. గ్రామములోని రాబడి మేలావరము, కూడివరము అని ద్వివిధము. మొదటిది కేంద్రపభుత్వమునకు చెందును. రెండవది స్థానికమహాజనమునకు ప్రజోపయోగమునకై వినియోగింపబడును. కూడివరము సామాన్యముగ రాబడిలో 15% ఉండును. వివాదములను మహాజనములే పరిష్కరించెడివి. మహాజనసభ తీర్పుచెప్పిన తరువాత గాని రాజాస్థానమునకు వివాదములు రాకూడదు. దక్షిణాపథమున రాష్ట్రకూట రాజ్యమునకు సమకాలీనుడైన సామదేవుడు రాజస్థానమునకు పూర్వము గ్రామసభలే వివాదపరిష్కారమును సల్పునని చెప్పినాడు. (19) వీనికే పంచాయితీలు అని అర్వాచీనకాలమున నామమేర్పడినది. ఈ సభలు దేవాలయమండపములలో సమావేశ మయ్యెడివి. కొన్ని గ్రామములలో కడియూరులో వలె స్వతంత్రభవనము

(17) **Altalaer p 195**

(18) **E I, VI p 242**

(19) గ్రామే పురేవా వృత్తో వ్యవహార స్తస్య వివాదే తదా రాజాన ముపేయాత్.

లుండెడివి. (20) గ్రామసభాభవన నిర్మాణమునకు దానశాసనములు గలవు. (21) క్రీ. శ. 865 లో మంత్రవాడి శిలాశాసనములో సమావేశమైన సభకు నాగదేవుడు అధ్యక్షుడు.

## ఆదాయ వ్యయములు

దానశాసనములనుబట్టి మహమ్మదీయ వర్తకుల వాక్యములను బట్టి అలనాటి ప్రభుత్వాదాయ వ్యయములను ఊహింపవచ్చును. 'ఉద్రంగ, ఉపరికర,' అను పన్నులు కన్పించుచున్నవి. వీనినే భాగకర, భోగకర, అని మరికొన్ని శాసనములు పేర్కొనుచున్నవి. ఇవి గాక భూతోత్పాతప్రత్యయశుల్కము,సిద్ధాయము,ఛాతభటప్రవేశదండము, రాజసేవకానాం వసతి దండ ప్రయాణదండములు మున్నగు పన్నులు కన్పించుచున్నవి. 'రాజభూమి మీది ఆదాయములో షష్ఠాంశమును గ్రహించును', అని సంస్కృత కావ్యములలో గలదు. కావున 'అంశకర' లేక 'భోగకర'ము భూమిపన్ను. భోగకరము అనగా భోగ్యవస్తువులను పాలు, పెరుగు, కూరగాయలు, తమలపాకులు, పండ్లు మున్నగు వానిపై నుండి రాజునకు రాజాధికారులకు వచ్చు ఆదాయము. మనుధర్మశాస్త్రములో 'ప్రతిభాగము' అను దానికి ప్రీతి భోగమని దానికి భాష్యమును వ్రాసిన సర్వజ్ఞ నారాయణుడు - దానికి, "ఫలకుసుమశాఖాతృణా దుపాయనమ్ ప్రతిదినగ్రాహ్యమ్" అని వివరణ నిచ్చినాడు. అనగా నిత్యము రాజాధికారులకు జేయు ఫలకుసుమ శాఖాతృణా ద్యుపాయనములు 'భోగకర' అని నిర్వచింప వచ్చును. భూమిపన్నుకంటె భిన్నమైన పన్ను గనుక దీనికే ఉపరికర మను పేరు వచ్చియుండును. సువర్ణ నాణెములు గద్యాణములు లేక కళంజులు,

(20) E I XIII p 337.

(21) షికార్‌పుర No 45 E. C VI.

2 కళంజులు ఒక గద్యాణము. ¼ తులము ఒక కళంజు-భూమిపన్ను ధాన్యరూపమున సువర్ణరూపమున గూడ కన్పించు చున్నది. క్రీ. శ. 930 లో 8 వ గోవిందమహారాజు శాసనమున.

> బ్రాహ్మణేభ్యోఽష్టశతాని అగ్రహారాణాం
> సువర్ణ లక్షత్రయ సమేతాని .... దేవకులేభ్యో
> గ్రామానా మష్టశతాని సువర్ణలక్ష చతుష్టయమ్
> ద్రమ్మలక్ష ద్వాత్రింశతం చ దదాత ........

దేవాలయములకు ఇచ్చిన గ్రామములు 800 లకు 4 లక్షల సువర్ణనాణెములు వచ్చుచున్నట్లు తెలియుచున్నది. దీనిని బట్టి గ్రామమునకు 500 సువర్ణములు సగటున ఆదాయము సిద్ధించినది. బాణరాజ్యములోని విప్రపీఠగ్రామాదాయము 10 కలంజులు 500 కాడుల ధాన్యము. మాన్యముకు పన్నులులేవు. దేవాలయభూములకు తక్కువ పన్ను ఉండెడిది.

భూతోత్పాత్త ప్రత్యయశుల్కము అనగా నిష్కర్షగా అర్థము లభించుటలేదు. దిగుమతి వస్తువులపై శుల్కము రాజ్యములో వర్తక పదార్థములపైనగల శుల్కము ఈవర్గమున చేరునని ఊహింపవచ్చును.

రాష్ట్రకూట సామంతులై పశ్చిమోత్తర సముద్రతీరమును పాలించిన శిలాహారరాజులు తమరేవులకు విదేశములనుండి వచ్చిన ప్రతినావకు ఒక సువర్ణ గద్యాణమును స్వదేశమున నున్నరేవులనుండి వచ్చిన నావకు ఒక రజత ధరణమును శుల్కముగా విధించినారు. (22) కృషీవలులు రాజునకు విష్టిలేక వెట్టిపనిచేయుఆచారము అనాడుఉన్నది.

అపుత్రకులుగా మరణించినవారి ఆస్తిపై సుంకము గలదు. పూర్వకాలమున అపుత్రకుల ఆస్తి రాజునకు చెందుచుండెడిది. భర్త

(22) E I III p 286.

ఆస్తిపై పుత్రులులేని భార్యకు నిన్న మొన్నటి వరకు హిందూసంఘములో అనుభవించు అధికారము లేదు. యాజ్ఞవల్క్యుడే ప్రథమమున భార్యకు ఈ అధికారముండవలెనని శాసించినాడు. రాష్ట్రకూట రాజ్యమున మరణించిన అపుత్రకుని ఆస్తిపై పన్నువిధించి అనుభవించు అధికారము భార్యకు వదిలివేసినారు. క్రీ. శ. 1178 లో అర్వాచీన కాలమున మన గోలిలో నున్న ఆచారమే తత్పూర్వమును గలదని ఎంచవచ్చును. అపుత్రకుడు మరణించిన అతని ఆస్తి భార్యకు, స్త్రీ సంతతికి 'విభక్త పితృ భ్రాతృ వర్గమునకు' జ్ఞాతులకు యథాక్రమమున చెందవలెను. ఇట్టి వారసులు లేనియెడల ఆస్తి గ్రామాధికారి ధర్మాదేయము క్రింద పాటింపవలెను.

"చాట భట ప్రవేశదండములు" "రాజసేవకానాం వసతి దండ ప్రయాణదండములు"— ఇత్యాదులు భటులు రాజోద్యోగులు ఊరునకు వచ్చినప్పుడు గ్రామములు భరింపవలసిన సుంకములు.

భూమిపై రాజునకు పన్నుతీసికొను అధికారము మాత్రమే కలదు. బంజరుభూములు, పోరంబోకులు, పచ్చికభూములు రాజునకు చెందును. రాజు భూమిని కొని ఇంకొకరికి దానము చేసిన నిదర్శనములు గలవు.

అమోఘవర్షుడు బంకయసేనాని ప్రార్థనానుసారముగ ఒక జైనాలయమునకు 1 తలేయూరును, 150-500 (క్యూబిట్లు) వైశాల్యము గల పుష్పవనమును, 12 నివర్తనముల భూమిని దానము సల్పినాడు. 12 నివర్తనములు 30 గ్రామములలోని ఖండికలు. దీనిని బట్టి భూమిని అనుభవించు అధికారము మాత్రమే కలదని స్వయంవ్యక్తమగుచున్నది. సవృక్షమాలాకులః, అను వాక్యమునుబట్టి చందనాది వృక్షములు ఎక్కడ ఉన్నను నిధినిక్షేపములవలె రాజునకే చెందుననని సూచించుచున్నది. 'అభ్యంతరసిద్ధి' వలన భూగర్భముననున్న సమస్త ఖనిజములు నిధినిక్షేపములు రాజధనము.

శుక్రనీతిలో రాజ్యవ్యయవిధానము ననుసరించి షడ్భాగము లలో 3 భాగములు సైన్యమునకు, ఒకభాగము మూలనిధికి, 1/12 వంతున ధర్మమునకు, అంతఃపురమునకు రాజ్యనిర్వహణమునకు ప్రకృతి కల్పించుచున్నది. శుక్రనీతి గ్రంథకర్త రాష్ట్రకూట రాజ్యము నకు సమకాలీనుడై యుండును. ఈ విభాగము మేలావరమునకే అన్వయించును. సగటున 15% కూడివరము స్థానికగ్రామాధికారులకే ప్రజోపయోగార్థము వదిలివేసెడివారు. దీనికితోడు 8⅓% మేలావరము నుండి ప్రజోపయోగ కార్యములకు కేంద్రప్రభుత్వమిచ్చెడిది. ఈ విభాగ మునే రాష్ట్రకూట సామ్రాజ్యము అవలంబించినదని ఊహింప వచ్చును.

## సైన్యము

రాష్ట్రకూటచక్రవర్తులు అనేక రాజ్యములను జయించినారు. అనేక దండయాత్రలను నడపినారు. ఉత్తరమున గుర్జరరాజులు తూర్పున వేంగిరాజులు దక్షిణమున పల్లవులు పాండ్యులు రాష్ట్ర కూటులతో అనేకయుద్ధములను జేసినారు. గంగాతీరమునుండి కన్యా కుమారివరకు భారతద్వీపకల్పమును ఆక్రమించుటకు ఆనాడు మహా సైన్యము ఉన్నదనుమాట భూతార్థము. వంగదేశరాజులు కర్ణాటకలాట దేశములనుండి భటులను సేకరించుకొనెడివారు. సమకాలీనుడైన రాజశేఖరుడు విద్ధసాలభంజికలో కర్ణాటకులను 'సమరకర్మణి నిసర్గో ద్భటావీవకర్ణాటాః' అని సమరవీరులుగా పొగడినాడు.

మాన్యకేతము 'స్థిరీభూత కటకము' సైన్యకేంద్రము. గుర్జరులు దక్షిణమున సైన్యములను కేంద్రీకరించి యుంచుచుండిరని అల్మ సూరి చెప్పినాడు. రాష్ట్రకూటులు దక్షిణమున వనవాసిదగ్గర ఉత్తర మున గుజరాతులో సైన్యములను కేంద్రీకరించి యుంచెడివారు. రాష్ట్రకూటసైన్యమున భటశ్రేణి ప్రాముఖ్యము వహించినట్లు అల్మ

నూరి చెప్పినాడు. వీనికి ఏనుగులు అశ్వకదళములు తోడ్పడుచుండెవి. గోవిందుడు గొప్ప అశ్వికుడు. (23) నీతివాక్యామృతములో గుఱ్ఱములు విదేశములనుండి లభించుచున్నట్లు గలదు. అందు తాచీక అను అరేబియా గుఱ్ఱము ముఖ్యము. రాష్ట్రకూటులు మహమ్మదీయులపై ప్రత్యేకాభిమానమును చూపుటకు గారణము వారు అశ్వములను అరేబియానుండి సంపాదించుచున్నట్లు ఊహింపవచ్చును. మార్కోపోలో అశ్వములు అరేబియా నుండి భారతదేశమునకు దిగుమతి యగుట పేర్కొనినారు.

బ్రాహ్మణులు కూడ సైన్యములో చేరుచుండెడివారు. 8 వ గోవిందమహారాజు శాసనము రేవాదాసదీక్షిత లీశోత్తరదీక్షితులను బ్రహ్మణసేనానుల విజయములను వర్ణించుచువారు సోమయాజులని బ్రాహ్మణకులభూషణులని పేర్కొనుచున్నది. (24) యుద్ధములో మరణించిన సైనికులకు ప్రభుత్వము భృతులను ఇచ్చుచుండెడివారు. బాణరాజ్యములోని శిలాశాసనములో శత్రువును వెంబడించి జయించి మరణించిన ఒక సేనానిని పేర్కొనుచున్నది. అతని కుటుంబ పోషణకు సైనికులు సంవత్సరాదాయమును నెలకొల్పినారు.

ఒక శాసనము 'తురగవేండెగుని' అశ్వశిక్షకుని పేర్కొనుచున్నది. సేనానులు సామంతరాజమర్యాదలతో గజతురగ రథముల ననుభవించుచుండిరి. (26) 'బాలాధికృత దండనాయక' మహాప్రచండ దండనాయద' సైన్యపకవులు. వర్తకులు దండయాత్రలలో సైన్యావసరములకు వస్తుసముదాయములను గుత్తగ విక్రయించెడి

(23) నిజతురంగమైక విజయానీత లక్ష్మీనసనాథః.

[24] E I XIII p 189

(25) E I Ip 180

(26) E I XIII p 334

వారు. నరసింగయ్య అను వర్తకుడు మాన్యకేతమునుండి కృష్ణమహారాశు iii దండయాత్రలలో దక్షిణమునకు వచ్చినాడు. (27)

చోరోద్ధారణికులు- దండపాశికులు ఆనాటి రక్షక భటులు. దొంగలు అపహరించిన సొమ్మును గ్రామాధికారి పోయిన వారికి ఇచ్చుకొనవలెను. (**State insurance against theft**) సామంతులు పంచమహాశబ్దములకు అధికారులు. అవి శృంగము, శంఖము, భేరి, జయఘంటము, తమ్మట (28).

## మతము : దేవాలయములు

యువాన్‌చాంగ్ కాలము నాటికే బౌద్ధమతము భారతదేశమున క్షీణదశలో నున్నది. శ్రావస్తి, కపిలవస్తు, కుశినగరము, కౌశాంబి, వైశాలి మున్నగు పవిత్రబౌద్ధక్షేత్రములు శిథిలావశేషములుగనో లేక వైదిక మతనిలయములుగనో మారిపోయినవి. ఇట్సింగ్ భారతదేశయాత్ర యాత్రనాటికే దక్షిణాపథమున బౌద్ధమతము నామమాత్రావశిష్టముగ నున్నది. హైందవదేవాలయములు ఎన్నియో కన్పించుచున్నవి. జైనమతము గూడ వ్యాప్తిలో నున్నది. జైనమతానుయాయులగు రాజులు సేనానులు ఎందరో కన్పించుచున్నారు. మతసహనము ఆ యుగమునకు నిసర్గలక్షణము. జైనరాజులు బ్రాహ్మణాగ్రహారములకు దేవాలయములకు ఇచ్చిన దానశాసనము లెన్నో కలవు. క్రీ. శ. 1022 లో అక్కాదేవి జైనబుద్ధ అనంత రుద్రులను ఆరాధించుచున్నట్లు జయసింహుని బేలూరు శాసనములో కలదు. (29) అక్కాదేవి త్రిమూర్తులకు బ్రహ్మవిష్ణు మహేశ్వరులకు ఒక ఆలయమును నిర్మించినది.

---

(27) **M. E. R. 177 of 1912**

(28) **I. A., XII p 96.**

(29) **I A XV 117**

ఎల్లోరాగుహలో కైలాసనాథుని ఆలయమును నిర్మించి రత్న కాంచనమణిహారములను శివునకు 1వ కృష్ణమహారాజు సమర్పించినాడు. (30) గోవిందమహారాజు 400 గ్రామములను 32 లక్షల ద్రమ్మములను (నాణెములను) రాజ్యములోని దేవాలయములకు ఇచ్చినాడు. (31) 975 లోని హెబ్బలు శాసనముబట్టి దేవాలయములో పన్నీరు చీనాంబరములు నిత్యభోగములు. 'అంగరంగ' భోగములతో జంత్రగానము నిత్యనైవేద్యము ఇట్టివి యున్నట్లు ఎంచవచ్చును. (32) దీనికితోడు దేవదాసీ సేవ దేవాలయములలో కన్పించుచున్నది. 8 వ శతాబ్దిలో బీజపూరు మండలమున లోకమహాదేవి ఆలయమునకు ఒక వేశ్య ఒక అశ్వమును గజవాహనమును సమర్పించినది. వేశ్యలకు దేవాలయముతో గల సంబంధము అనాటి విజ్ఞులకు రుచింపలేదు. 'ఇబన్. బతూత' రాజులు అడ్డము చెప్పనిచో బ్రాహ్మణులు వేశ్యలను దేవాలయములనుండి పంపివేసెడివారని వ్రాసినాడు. 11 వ శతాబ్దిలో రాజరాజు తంజావూరు దేవాలయమునకు రాజ్యములోని వివిధప్రదేశములనుండి 400 మంది వేశ్యలను సమర్పించినాడు. 11 వ శతాబ్దిలో జోజలదేవుడు దేవాలయములోని ఉత్సవములకు పరిసరాలయములలోని వేశ్యలందరు సాలంకృతలై రావలెనని దీనిని ఏ బ్రాహ్మణుడైన అడ్డము చెప్పిన తన వంశీయులు ఆ బ్రాహ్మణుని నిరోధింపవలెనని శాసించినాడు. నాటినుండి నిన్న మొన్నటిదాక వేశ్యలు దేవాలయచ్ఛాయల విలసిల్లినారు.

దానకార్యములు స్వర్గసోపానపరంపరలని ఆనాటి విశ్వాసము. రాజులు, సేనానులు, సంపన్నులు వ్యష్టిగా మహాజనులు గ్రామీణులు సమష్టిగా ప్రజోపయోగమునకై అనేక దానములను సల్పినారు.

(30) I A XII p 159
(31) E I VII p 26
(32) E I III p 300

ధార్వాడుమండలములోని ఒక తటాకము ఒక వ్యక్తి ధర్మము. దానిని గ్రామస్థులు వివాహ ఉపనయన సమయములందలి ధర్మముచే పరిపోషించుచుండిరి. (33) సలోత్గిలోని విద్యాలయమును వ్యష్టి, సమష్టి దానములవలన నిర్వహించినారు. కృష్ణరాజు కాలములో షికార్పూరు (284) శాసనములో ఒక వ్యక్తి దేవాలయమును, తటాకమును నిర్మించి వానిని భూదానమును సల్పినాడు. ఇట్టివి యెన్నియో గలవు. ఇక్లే బంకేయుని ప్రార్థనానుసారముగ అమోఘవర్షుడు జైన దేవాలయమునకు భూదానము చేసినాడు. అమోఘవర్షుని కాలమున కాన్హారిలో బౌద్ధసంఘారామము గలదు. (35) కదంబరాజులు జైన మత పోషకులు. గంగరాజులు జైనులు. మారసింహుడు సల్లేఖన వ్రతమున ఆత్మత్యాగ మొనర్చుకొన్నాడు. క్రీ. శ. 974 లో మారసింహుని అమాత్యుడు చాముండరాయడు, చాముండపురాణకర్త శ్రావణబెల్గొలాలో గోమతేశ్వరుని విగ్రహమును ఇతడే ప్రతిష్ఠించినాడు. అమోఘవర్షుడు జైనమతప్రియుడు. అతని 'పరమగురువు' జినసేనుడు. ఆదిపురాణమును పూరించిన గుణభద్రుడు కృష్ణమహారాజు ii గురువు. ఇంద్రమహారాజు iv సల్లేఖనవ్రతముచే మరణించినాడు. (36) సేనాని బంకేయుడు అతని కుమారుడు లోకాదిత్యుడు సేనాని శ్రీవిజయుడు జైనులు. జైనులు వర్షాకాలమును చాతుర్మాస్యదీక్షతో గడపెడివారు. దీక్షాంతమున పఞ్చాషణవ్రతమును సల్పెడివారు. చైత్రశుక్ల అష్టమి నుండి ఒక వారము మరియొక మహోత్సవము సల్పెడివారని కదంబ శాసనముల వలన తెలియుచున్నది. (37) జైనదేవాలయములలో మహావీరునకు శివకేశవులవలె నిత్యము అంగరంగభోగాలతో అర్చన

---

(33) I A XII p 224
[34) E I IV p 61
[35] I A VII p 25
(36) I A XII p 124
(37) I A XII p 34

జరుగుచుండెడిదని శాసనములను బట్టి తెలియవచ్చుచున్నది. మహా వీరుని అకించనతకు ఇది దుష్ఫల విపరిణామము.

ఆ ఇద్రిసి అను అరబువర్తకుడు "హిందువులు నిసర్గముగ ధర్మ తత్పరులు. వారి సత్ప్రవర్తనలో న్యాయము సత్యశీలము సౌజన్యము స్వయంవ్యక్తమగుచున్నవి. వారి దేశము భోగభాగ్యములతో తుల తూగుచుండుటకు విదేశీయులు తండోపతండములుగ ఈ దేశమునకు ఆకర్షింపబడుటకు ఇదియే కారణము" - అని చెప్పినాడు. వర్తకుని వాక్యములు ఈ యుగమునకు ధర్మసమీక్షగా గైకొనవచ్చును.

మండలేశ్వరవర్మ భార్య సుగుణాదేవి పాతివ్రత్యమహిమచే నాగుపామును అరచేతిలో పట్టుకొన్నది. ఆమె స్మారక చిహ్నముతో ఒక దేవాలయము నిర్మితము. (37) పాము మంత్రములు తురాయి కట్లు చాలసారులు నిరర్థకములైనవి. భర్తకు భార్యలు మందుపెట్టు టచే భర్తలు ఆరోగ్యమును గోల్పోయి మరణించినారు. (38) క్రీ. శ. 911 లో గుండచ్చెదేవికి, శాంతివర్మమహారాజునకు పుత్రసంతానము కలిగిన కత్తేగా అనునతడు తన శిరస్సును మ్రొక్కినాడు. శాంతివర్మకు అచిరకాలములో పుత్రుడు పుట్టినాడు. రాజభటులు కత్తేగా శిరస్సును దేవికి అర్పించినారు. కత్తేగా స్వర్గమును చేరినాడు. ఒకడు పుత్రసంతానమునకు శిరస్సును మ్రొక్కుకొని ఆ మ్రొక్కును చెల్లించి నాడు. (39) ఇబన్‌కుర్‌దభా వృద్ధులు గంగాప్రవేశము అగ్నిప్రవే శము ద్వారా పర్వదినములలో మరణించెడి వారని చెప్పినాడు. (40) చాండెళ్ళరాజు ధంగుడు వృద్ధుడైనప్పుడు ప్రయాగలో గంగాయమునా ప్రవేశము సల్పి మరణింప సంకల్పించినట్లు తెలియుచున్నది (41).

---

(37) I A VII p 34
(38) P. B. B. R. AS X p 279
(39) E. C. IV intao p 9
(40) Elliot I p 10
(41) E. I. I p 164
(45)

క్రీ. శ. 912 లో మరణించిన కుర్దార్బ సప్తకులములను హిందూసంఘములో పేర్కొనినాడు. సాబ్కూఫ్రియబ్రహ్మ, ఇష్ప్రిమ, శూద్ర, బైసూరా, సందాల, లాహోర్ కులములు. వీనినే ఆ ఇద్రిసి పేర్కొనినారు. ఏడవకులము మాత్రము 'జక్య' అనినారు. లాహోర్ జక్యా కులములు నాట్యవిద్య నభ్యసించినారు. సాద్ కూఫ్రియ షప్రియులు రాజవంశీయులు. బ్రహ్మబ్రాహ్మణులు శూద్ర బైసుర వైశ్యులు చండాలులు. బ్రాహ్మణులు రాజునకు రాజవంశీయులను గౌరవించుచుండిరి. బ్రాహ్మణులకు మరణదండన విధింపరాదు. అల్బరూనా, బ్రాహ్మణుడు, దోషి అయినను ఆస్తిని లాగుకొని అతని రాజ్యమునుండి తరిమివేసెడి వారు. విలువగల వస్తువులను అపహరించిన కనుపాపలను తీసివేసి వామ పాదమును నరికి వేసెడివారు. అని చెప్పినాడు. 2 న బ్రాహ్మణుడు ప్రాయోపవేశమును బూనినపుడు బిషౌచారుడను నిరంకుశప్రభును అతని కోర్కెలను మన్నించవలసి వచ్చినది. (42) ఇబన్కుర్దా అబ్దా 'అనులోమ' వివాహములు ప్రచారములో నున్నవని చెప్పినాడు. కాని అల్బరూనా నాటికి ఆచారము నూత్రమాత్రావశిష్టమైనదని అతడే పేర్కొనినాడు.

రాజులతోపాటు రాణులు ఆస్థానము నలంకరించెడివారు. అబు జయిదు రాజులు రాణులను జనులందరు చూడవచ్చునని షాగోషమ్ లేదని చెప్పినాడు. సులేమాను సహగమనమును పేర్కొనినాడు. రాజులు మరణించినపుడు కొందఱు రాణులు సహగమనములు సల్పెదరు. ఇది స్వచ్ఛందము. రాణులే నిర్ణయించుకొనవలెను. సహగమనము బలవంతములేదు. కాని సహగమనము పాతివ్రత్యమునకు నిదర్శనముగా జనులు ప్రశంసించెడివారు.

జైన మతాధికారి చాళుక్యసామంతుడు బుద్ధవర్షునిపైగల శని

[42] All taver p 330

గ్రహమునకు శాంతి చేసినాడు. అందుచే ఆ మతమునకు ఒకబోధనము కన్పించుచున్నది.

ధాసి మతో పోరాడు ముహూర్తమును దహేరురాజు జ్యోతిష్కులచే నిర్ణయించు కొని నాడు. మహామ్మదీయులకు ప్రాగ్భాగమున గల శుక్రుని బలమును ప్రతిఘటించుటకు తన వీపుమీాద ఒక సువర్ణశుక్రుని ప్రతిష్ఠించు కొన్నాడు. కాని యీా సువర్ణశుక్రుడు తన విధ్యుక్త ధర్మమును జక్కగా నిర్వహించి దహీరును యుద్ధములో స్వర్గలోక సామ్రాజ్యపదవిని ప్రసాదించినాడు. (42)

## ఆర్థిక వ్యవస్థ

భరోచ్ రేవు పట్టణమునకు దేశదేశములనుండి నావలు వచ్చుచుండెడివి. ఆల్ఇద్రిసి చీనా, సింధు, పర్షియా దేశముల నుండి నావలు భరోచ్రేవు పట్టణమునకు వచ్చుచున్నట్లు చెప్పినాడు. గుజరాతు రాష్ట్రకూటులు స్వదేశవిదేశ వర్తకనావలపై సుంకములు విధించు చుండిరి. కళ్యాణ్ ఇంకొక రేవు పట్టణము. 6 వ శతాబ్దిలో కాన్మోస్ కాలమున ఈ పట్టణమునుండి నూలువస్త్రములు ఇత్తడి దారువు ఎగుమతి యగుచుండెడివి.

సువర్ణ, రజత నాణెములను అనేక శాసనములు పేర్కొను చున్నవి. ద్రమ్మ, సువర్ణ. గద్యాణక, కలంజు, కాసు ఇవి ముఖ్య నాణెములు. నాణెములు బయట ఈ క్రింది విధముగ నున్నవి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| ౧ ద్రమ్మ | వెండి | 65 గ్రయినులు | లేక | 1/3 | తులము. |
| ౨ ద్రమ్మ | బంగారము | 65 | ,, | ,, 1/3 | తులము. |

(42) Elliot 1 p 169.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| ౩ | కలంజు | బంగారము | 48 | గ్రయినులు | లేక | 1/4 తులము. |
| ౪ | గద్యాణక | ,, | 96 | ,, | ,, | 1/2 తులము. |
| ౫ | కాను | ,, | 15 | ,, | | |
| ౬ | మంజాడి | ,, | 2⅜ | ,, | | |
| ౭ | అక్కము | ,, | 1¼ | ,, | | |

వర్తకసంఘములు కార్మికసమాజములు ఆ నాడు సమష్టి వ్యవహారమును కొనసాగించినవి. క్రీ. శ. 775 లో లక్ష్మేశ్వమున సాలె వాండ్ర సంఘము కన్పించుచున్నది. (43) మాల్గండులోని శాసనము క్రీ. శ. 880 లో 360 నగరములలోని నిగమాధిపతులు నలుగురు దానము చేసినారు. (44) దీనికి వెనువెంటనే స్థానికబ్రాహ్మణులు 2000 వర్తకుల అంగీకారముతో చేసిన దానము కలదు. దీనిని బట్టి 2000 వర్తకులు 360 నగరములలో గ్రామములలో నుండి యుందురు.

౧ వ అమోఘవర్షుని కాన్హేరీ శాసనము నిగమసభలో చక్రవర్తి వేసిన మూలధనమునకు శాశ్వతముగ వార్షికముగ నిచ్చువడ్డీని యథాకాలోచితముగ మార్పుచేయవలెనని కలదు. (45) ఇంకొక కాన్హేరీ శాసనములో శీలాహారప్రధాని 160 ద్రమ్మలను స్థానిక నైగమములో వేసినాడు. అందు వార్షికముగ వచ్చువడ్డీతో 20ద్రమ్మలు బుద్ధపూజకు, 3 ద్రమ్మలు భవన పునర్నిరాణమునకు, 5 భిక్షుకుల వస్త్రములకు, పుస్తకములకు దీనినిబట్టి 160 ద్రమ్మములు 9 వ శతాబ్దిలో 29 ద్రమ్మలను సం.ము వడ్డీ తెచ్చినవి. అనగా 17% సంవత్సరము. కృష్ణరాజు iii కాలమున కవుత్తురు గ్రామసభ 15% వడ్డీ నిచ్చుచున్నది.

---

(43) E I VI p 166
(44) I B BR A S X p 192
(45) I A XIII p 133

| ప్రాచీన సామములు | ప్రాచీననారలు | నవీన రూపాంతరములు |
|---|---|---|
| 5 శేవుడు | 1 అరక్కు | 3¾ తులములు |
| 2 అళక్కులు | 1 ఉరక్కు | 7½ ,, |
| 2 ఉళక్కులు | 1 ఉళి | 15 ,, |
| 8 నారులు (నారి) | 1 కురుణి<br>1 మారక్కాళ్ | 6 పౌనులు |
| 2 ఉరి | 1 నారి, లేక పది | ¾ పౌను |
| 2 కురుణి | 1 పదక్కు | 12 పౌనులు |
| 2 పదక్కులు | 1 తూని | 24 ,, |
| 2 తూని | 1 కలము | 72 ,, (46) |

క్రీ. శ. 915 లోని బాణశాసనము 4 కలంజులు - 190 నారుల నెయ్యి వచ్చినట్లు సూచించుచున్నది. రూపాయికి 3¾ శేర్లు ఒక కానునకు 1200 అరటిపళ్ళు వచ్చెడివి. (47) ఆనాడు కానువిలువ 26 అణాలు. దానినిబట్టి ఒక కానికి 10 అరటిపళ్ళు లభించినవి. లీలావతిలో ఒక రజతద్రమ్మము 300 మామిడి పళ్ళు కొనవచ్చునని యున్నది. దీనినిబట్టి 60 మామిడిపళ్ళు ఒక అణా వెల. తమిళదేశము లోని 9 వ శతాబ్ది ప్రాంతపు ఈ క్రింది పట్టికను ఆల్టేకరుగారు ఇచ్చినారు.

| వస్తువు | ప్రాచీన మూల్యము | నవీన మూల్యము |
|---|---|---|
| ధాన్యము | 1 కలంజు - 10 కలములు | 1 రూపాయకు 32 శే |
| నెయ్యి(మంచి) | ,, - 33 నారులు | ,, 2¾ శే |
| నూనె | 12¾ నారుల ధాన్యమునకు 1 నారి నూనె | 1 రూపాయకు 2⅜ శే |

(46) Hultz S I I, p 448 - 5 X p 77 in Altaker p 37[illegible]
(47) G II, II p 151

| | | | |
|---|---|---|---|
| పప్పులు | 6 నారుల ధాన్యమునకు<br>5 నారుల పప్పులువచ్చును | రు. కు | 25 శే |
| ఉప్పు | 2 నారుల ధాన్యమునకు<br>5 నారుల ఉప్పు | ,, | 75 శే |
| కర్పూరము | 3 కలంజులు 1 కాసు | 2¾ రూపాయలకు 1 తు | |
| ఆవు | 2½ కాసు | రూ 1 - 2 - 0 కు 1 ఆవు | |
| గేదె | ¾ కాసు | రూ 2 - 4 - 0 కు 1 గేదె | |

సంస్కృత విద్యాలయాధ్యక్షునకు 50 నివర్తనములు పోషణము ఇచ్చినట్లు గలదు. (48) అనగా 250 ఎకరములు.

## విద్య : వాఙ్మయము

ఉన్నత విద్యాభివృద్ధికై మహారాజులు సంపన్నులు అగ్రహారములను భూములను బ్రాహ్మణులకు దానము చేసెడివారు. వేదములు వ్యాకరణము జ్యోతిషము సాహిత్యము మీమాంస ధర్మశాస్త్రము పురాణములు న్యాయశాస్త్రము ఉన్నతవిద్యాశాఖలు. సంస్కృతవిద్యయే ఉన్నతవిద్య. క్రీ. శ. 779 ధ్రువమహారాజు ధూలియా శాసనములో గ్రహీతలు వేద వేదాంగ ఇతిహాస పురాణ వ్యాకరణ మీమాంసా తర్క శాస్త్రములలో పండితులు. సంస్కృత వ్యాకరణము సమస్త శాస్త్రములకు ఆమూలకందము. ధార్వాడు మండలములోని భుజభేశ్వరాలయములోని మఠమునకు క్రీ. శ. 975 లో 50 మత్తరుల (200 ఎకరములుగావచ్చును) భూమిని దానముచేసినట్లు గలదు. ఆ మఠములో విద్యార్థులకు విద్య ఆహారము ఉచితము (49) దేవాలయములకు ఇచ్చిన దానములలో ఏతచ్ఛాయలనున్న విద్యాశాలలకు విద్యార్థులకు పుస్తకములకు గూడ దానములు కన్పించుచున్నవి. ఆ నాటి దేవాలయ

[48] E I IV p 60
[49] E. I. IV p 358.

ములు విద్యాలయములు. అగ్రహారములు కళాశాలలు. కాశీపురి నవద్వీపమువంటి సుప్రసిద్ధస్థలముల కేంద్రవిశ్వవిద్యాలయము లుండెడివని ఊహింపవచ్చును.

ధార్వారు మండలములోని కౌలాస్ అగ్రహారములో ఒక సంస్కృత విద్యాపీఠము కలదు. అందుగల 200 బ్రాహ్మణకుటుంబములు వ్యాకరణ నీతిశాస్త్ర సాహిత్య పురాణ విద్యలయందు నిష్ణాతులు. ఏకాక్షర తర్కశాస్త్రములో అభిజ్ఞులు కొందఱు భాష్యములు వ్రాసినారు. గోవింద IV కాలమున శాసనము ఈ విద్యాపీఠమును పేర్కొను చున్నది. దాన శాసనము ఉపాధ్యాయులకు వృత్తులను ప్రసాదించినది.

కృష్ణమహారాజు iii కాలమున బిజాపురీమండలములోని సలోత్గి అగ్రహారములో పెద్ద సంస్కృత విద్యాపీఠము కలదు. త్రయీపురుషాలయమున ఆ విద్యాపీఠము వర్ధిల్లినది. నారాయణుడు కృష్ణరాజు అమాత్యుడు 945 దానిని నిర్మించినాడు. దేశదేశములనుండి వచ్చిన జిజ్ఞాసువుల వసతికై 27 భవనములు గలవు. 12 నివర్తనములు (60 ఎకరములు) భూమి దీపభోగమునకు కావలసివచ్చినది. 50 నివర్తనములు (250 ఎకరములు) కళాశాలాధ్యక్షుని జీతము సంపన్నుఁడొకడు భూరి విరాళమును ఇచ్చినారు. 5, 2½, 1¼ నాణెములు చొప్పున వివాహమునకు ఉపనయనాదికముల ఈ విద్యాలయమునకు సమర్పింప గ్రామస్థులు నిర్ణయించుకొన్నారు. (50) తరువాతి శతాబ్దిలో ఒక సామంతరాజు కూలిపోయిన విద్యాశాలాభవనమును పునర్నిర్మించి నాడు. (51) అగ్రహారములు అనేకములలో ఇట్టి విద్యా సంస్థ లనేకములు విలసిల్లి యుండును.

---

[50] E. I. IV p 60
[51] E. I IV 64

దంబల్‌లో నున్న వర్తకసభ 18 నగరములకు ప్రాతినిధ్యము వహించి ఒక సంస్థను నడపినది. (52) నృపతుంగవర్మ అమాత్యుని ప్రార్థనానుసారము ఒక విద్యాసంస్థకు 3 గ్రామములను దానము చేసినాడు. (53)

సంస్కృతము రాష్ట్రకూటరాజ్యమున రాజభాష. దేశభాషలో సారస్వత వ్యవసాయము అంకురించినది. కర్ణాటములో అప్పుడప్పుడే కావ్యములు బయలుదేరినవి. శాసనములు సామాన్యముగ సంస్కృతములో సంస్కృత శ్లోకములలో గన్పించుచున్నవి. శాసనకర్తలు వాసవదత్త కాదంబరి హర్షచరిత్ర మున్నగు కావ్యములను అనుకరించినారు. కుమారిలుడు, శంకరాచార్యులు, వాచస్పతి, లల్ల, ఆర్యభట్టు, కమండకశుక్ర - ఇత్యాది గ్రంథకర్తలు రాష్ట్రకూట సామ్రాజ్యమునకు సమకాలీనులు. కాని వారిలో ఎవరు రాష్ట్రకూట సామ్రాజ్యమున విలసిల్లినారో చెప్పుటకష్టము. 915 లో ఇంద్రరాజు III బేగముర శాసనలేఖకుడైన త్రివిక్రముడే నలచంపును రచించిన త్రివిక్రముడని Dr. బండార్కరుగారు సూచించినారు. (54) నలచంపు చంపు కావ్యములలో ప్రథమము. కావున చంపురచనకు దక్షిణభారతదేశము రాష్ట్రకూటరాజ్యము మార్గదర్శక మయ్యెనని ఊహింపవచ్చును. హలాయుధుడుకవిరహస్యమును కృష్ణరాజుIIIకాలమున రచించినాడు. ఇందు సంస్కృత ధాతువుల వివరణము కృష్ణమహారాజు ప్రశస్తి గలదు.

జైనవాఙ్మయము రాష్ట్రకూట రాజ్యమున విలసిల్లినది. హరిభద్రుడు క్రీ. శ. 8 వ శతాబ్దిమధ్య విలసిల్లినాడు. కాని యితని నివాసస్థలము అజ్ఞాతము. అకలంకదేవుడు ఆప్తమీమాంస భాష్యము అష్టశతిని సాహసతుంగునకు (దంతిదుర్గ ?) విస్తరించినట్లు శ్రావణ

[52] I A VIII p 185
[53] E. I. IV p 186
[54] E, I. IX p 28

బెల్గోలాలో శాసనము గలదు. (55) విద్యానందుడు అర్వాచీన కాలమున అష్టమీమాంస విపులతరమైన భాష్యమును వ్రాసినాడు. ఇతనిని గూడ శ్రావణబెల్గోలాలో శాసనములు పేర్కొనుచున్నవి. (56)

8 వ శతాబ్దిలో మాణిక్యనంది, పరిక్షాము ఖసూత్రమను తర్కశాస్త్రమును రచించినాడు. (57) ధర్మోత్తరాచార్యుని న్యాయబిందు టీకకు, ధర్మోత్తరటిప్పణకమును కర్కసువర్ణహర్షుని 821 సూరత్ శాసనము పేర్కొనుచున్నది. క్రీ. శ. 783 లో జినసేనుడు హరివంశమును ముగించినాడు. అతడు అమోఘవర్షునకు పరమగురువు. అతడు తన పీఠికలో సమకాలీన రాజులను పేర్కొని దక్షిణభారతచరిత్రకు మహోపకార మొనర్చినాడు. అతని ఆదిపురాణమును అతని శిష్యుడు గుణచంద్రుడు పూరించినాడు. ఆదిపురాణము జైనతీర్థంకరుల జీవిత చరిత్ర. 'పార్శ్వాభ్యుదయము' లో జినసేనుడు మేఘసందేశములోని ప్రతిశ్లోకపాదమును జైనపార్శ్వుని జీవితమునకు అన్వయించి అద్భుతముగా అర్థసమన్వయము సల్పినాడు. జినసేనుని కావ్యమున ప్రతి శ్లోకమునకు నాల్గవపాదము మేఘసందేశములోని శ్లోకములనుండి సంగ్రహించినాడు. 'అమోఘవృత్తి' అను వ్యాకరణము శాకటాయనుడు, గణితసారసంగ్రహమను గణితమును వీరాచార్యుడు అమోఘవర్షుని I కాలమున రచించినారు. 'కవిరాజమార్గమను' ప్రథమ కర్ణాటాలంకారిక గ్రంథమును అమోఘవర్షుడు రచించినట్లు ప్రఖ్యాతి. ప్రశ్నోత్తరములనుండి అమోఘవర్షుడే రచించినట్లు టిబెట్టుభాషలోని అనువాదములో గలదు. (58)

(55) E C [ii] 67
(62) E C II No 254
(63) Vidyabhushan - Hist of Indian logic p 179

క్రీ. శ. 902 లో కర్ణాట సారస్వతమున ఆదికవిగా గు పంపడు జన్మించినాడు. ఇతడు ఆంధ్రుడు. వేంగిమండలమున జన్మించినాడు. ఇతడు ఆది పురాణమును 941 లో ముగించినాడు. అతని విక్రమార్జున విజయము అతని పోషకుడైన అరికేసరి రాజు పరాక్రమము ప్రపంచించిన చారిత్రక కావ్యము. ఇంద్రమహారాజు ఉత్తరాపథ దండయాత్రలు అందు అరికేసరి పాల్గొనుట దీనివలన స్వయంవ్యక్తమగుచున్నది. అసంగుడు జినచంద్రుడు కర్ణాటకవులుగా పొన్నడు ప్రస్తుతించినాడు. కాని వారి గ్రంథములు నేడు ఉపలభ్యమానములు గావు. పొన్నడు 'ఉభయకవిచక్రవర్తి' అను బిరుదును కృష్ణరాజు iii ఆస్థానమున సంపాదించినట్లు ఐతిహాస్యము. అతడు శాంతిపురాణమును వ్రాసినాడు. చాముండపురాణమును 10 వ శతాబ్దిలో మారసింహుని అమాత్యుడు చాముండరాయడు రచించినాడు. అజిత తీర్థంకరపురాణమును క్రీ. శ. 993 లో రన్నడు వ్రాసినాడు.

సమకాలీనుడు సులేమాను రాష్ట్రకూట సామ్రాజ్యము భారత దేశములో అప్రతిహతమైనదని చెప్పినాడు. భారతదేశచరిత్రములో ఉత్తరదేశచక్రవర్తులు అప్పుడప్పుడు దక్షిణదేశమును గూడ జయించి యావత్ భారతమును ఏకచ్ఛత్రముగా పరిపాలింప ప్రయత్నించినారు. కాని దక్షిణదేశచక్రవర్తులు ఉత్తరాపథమును జయించుట అరుదు. రాష్ట్రకూట చక్రవర్తులు వింధ్యపర్వత పంక్తులను దాటి ఉత్తరాపథమున గూర్జరుల జయించినారు. గంగానదీసలిలముల వారి మత్తేభములు క్రీడించినట్లు కన్యకుమారి చందనతరుచ్ఛాయల విశ్రమించినట్లు ఆలంకారికముగ శాసనకవులు ప్రస్తుతించినారు. రాష్ట్రకూట సామ్రాజ్యము 225 సం. లు పరిపాలించినది. ఒకనాడు గంగానదినుండి కన్యాకుమారివరకు వారి రాజ్యము విస్తరించినది. రాష్ట్రకూట చక్రవర్తులు వేంగి చాళుక్య పల్లవ చోళరాజులను జయించినారు.

రాజ్యాంగములో రాజ్యతంత్రమును స్వయంసంపూర్ణముగ నిర్మించినారు. కేంద్రప్రభుత్వము సర్వతంత్రస్వతంత్రాధికారములను సామంతులపై దండనాథులపై గ్రామాధికారులపై నిర్వహించినది. మతవిషయముల సహనము ఆ యుగలక్షణము. దక్షిణ భారత చరిత్రలో పల్లవయుగము స్వర్ణయుగమైన రాష్ట్రకూటయుగము వీర యుగము - పౌరుషము ఆనాటి ప్రధానధర్మము.

ఆంధ్రశాతవాహన రాజ్యము తరువాత దక్షిణాపథ చక్ర వర్తులు ఉత్తరాపథమున అప్రతిహతముగా దిగ్విజయయాత్రను సాగింపగలిగినది రాష్ట్రకూట సామ్రాజ్యమే.

# తూర్పు చాళుక్యుల చరిత్ర

రెండవపులకేశి దిగ్విజయ యాత్రానంతరము వేంగిమండలమున రాజప్రతినిధిగా తన తమ్ముడు కుబ్జ విష్ణువర్ధనుని నియమించెను. కుబ్జవిష్ణువర్ధనుని వంశీయులు ప్రధానశాఖ అంతరించిన పిమ్మటగూడ నుమారు అయిదు శతాబ్దులు వేంగిమండలమును శాసించి, చోళ సామ్రాజ్యాధినేతలైరి. అప్పుడు గూడ వేంగిమండలము వారి ఆధిపత్యము నందుండెను. చరిత్రలో ఒకేరాజవంశము ఇన్ని శతాబ్దులు పరిపాలన నెరపుట మిక్కిలి అరుదు. అందుచే ఆంధ్రసంస్కృతి ఆంధ్ర వాఙ్మయమునకు చాళుక్యులకు అవినాభావసంబంధమేర్పడినది. దక్షిణాపథమున తూర్పుసముద్రతీరమందలి వేంగిమండలము నేలుటచే ఈ చాళుక్యులకు తూర్పుచాళుక్యులని పేరు వచ్చినది. తొలుత ఈ రాజ్యమునకు వేంగి రాజధానియగుటచే వారిరాజ్యమునకు వేంగి మండలమనుపేరు చరిత్రలో స్థిరపడినది. వేంగిమండలము ఆంధ్ర విషయము పర్యాయపదములుగ ప్రయుక్తములు.

"పూర్వాంభోనిధి కాళహస్తిశిఖరీ
శ్రీమన్మహేంద్రాచలమ్
శ్రీశైలీర్వలయీకృతాంధ్రవిషయమ్
శ్రీరాజరాజన్వయం"

ప్రాచీనకాలమునుండి వేంగిమండలమునకు ఉత్తరమున కళింగ మందలి మహేంద్రగిరి, తూర్పున పూర్వాంభోనిధి, పశ్చిమమున శ్రీశైలము, దక్షిణమున కాళహస్తి ఎల్లలుగా ఎన్నదగినవి. ఈ ఎల్లలు దిఙ్మాత్రములేగాని సుస్థిరములుగ నుండలేదు. బలవంతులైన రాజులకాలమున రాజ్యము పెరుగుట బలహీనుల కాలమున తరుగుట కద్దు.

తూర్పుచాళుక్య రాజవంశీయులు వెలయించిన తామ్రశాసనములు కోకొల్లలు. కొన్ని శిలాశాసనములు గలవు. గుణగవిజయాదిత్యుని కాలము నాటినుండి వెలువడిన తామ్రశాసనము లన్నిటిలో వంశవృక్షము - పూర్వచరిత్ర సవిస్తరముగ అభివర్ణితము. ఆ యా రాజులు పరిపాలనాంశములు - కాలము ఎడనెడ వివాదగ్రస్త విషయములున్నను, శ్రీ భావరాజు వేంకటకృష్ణారావుగారు, శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ, డాక్టర్ నేలటూరి వేంకటరమణయ్య ప్రభృతుల పరిశోధనలవలన నిష్కర్షయైన చరిత్ర యేర్పడినది.

## కుబ్జ విష్ణు వర్ధనుడు
## [ క్రీ. శ. 624 - 41 ]

కుబ్జవిష్ణువర్ధనుడు తొలుత రెండవపులకేశికి ప్రతినిధిగా దక్షిణాపథమున పూర్వసముద్రతీర ప్రాంతమైన వేంగిమండలమును పరిపాలించెను. ఈతడు విషమసిద్ధి బిరుదవిరాజితుడు. దుర్ఘటకార్యములను సాధింపగలిగి, విషమదుర్గములను సాధింపగల్గుటచే ఈ బిరుదు ఏర్పడినది. మకరధ్వజ, కామదేవ బిరుదములుగూడ ఈతడు వహించుటచే కొందరు చరిత్రకారులు తలచినట్లీతడు కురూపికాదని తోచుచున్నది. కుబ్జశబ్దమునకు పొట్టివాడని అర్థముగాని వికలాంగుడు - కురూపియని అర్థముగాదు. ఈతనిపేర వెలసినవి రెండుతామ్రశాసనములు. ఒకటి అతని పదునెనిమిదవరాజ్య సంవత్సరము నాటిది. రెండవది- రాజ్యసంవత్సరము తిథివార విశేషములులేనిది పిష్ఠపురము నుండి వెలయించినది. గుంటూరు మండలమునందలి శిథిలశిలాశాసనము విషమసిద్ధిది కలదు. (1)

క్రీ. శ. 1132 సంవత్సరమునాటి శిలాశాసనమున కొండపడమటి వంశీయుడైన బుద్ధరాజు, కుబ్జవిష్ణువర్ధనుని వలన డెబ్బదిమూడు

(1) 154 of 1899 ARE 1900

గ్రామముల సీమను భృతిగ సంపాదించినట్లు గలదు. రెండవపులకేశి చేసిన దానభూమి, కొప్పరం తామ్రశాసనమున - కర్మరాష్ట్రములోనిది (గుంటూరు నెల్లూరు మండలములలోనిది) కావున కుబ్జవిష్ణువర్ధనుడు శ్రీకాకుళమునుండి శ్రీకాళహస్తివరకుగల వేంగిమండలమును పరిపాలించెనని యెంచవచ్చును. పట్టవర్ధన వంశీయుడు కాలకంప దండనాథుడు విష్ణువర్ధనుని ఆదేశానుసారము శత్రువైన దద్దురుని సంహరించెను. (2) కాలకంపవంశీయులు పలువురు అర్వాచీనులు కన్పించుచున్నారు గాని దద్దురుడెవ్వరో తెలియుటలేదు.

అయ్యణ మహాదేవి కుబ్జవిష్ణువర్ధనుని రాణి. మూడవ విష్ణువర్ధనుని శాసనము - ఆమెను పేర్కొనుచున్నది.

బెజవాడలో ఆమె జైనవడుంబిబసతి దేవాలయమున కట్టించి యిచ్చిన దానశాసనమును స్థిరీకరించెను. ఈ శాసనము తెలుగు దేశములో జైనమతమును పేర్కొనుచున్న ప్రథమసాక్ష్యము. (3)

## మొదటి జయసింహుడు

## క్రీ. శ. 641 - 73

మొదటి జయసింహుడు కుబ్జవిష్ణువర్ధనుని కుమారుడు. ఈతడు క్రీ. శ. 641 నుండి 73 వరకు ముప్పదిమూడు సంవత్సరములు పరిపాలించెను. సర్వసిద్ధి బిరుదాంకితుడీతడు. ఈతని కాలమునకు సంబంధించిన దానశాసనములు పెక్కు కన్పించుచున్నవి. ఆదాన శాసనములు వినా, ఇతనికాలపు చరిత్ర ఇతరత్ర ఏమియు తెలియుట లేదు. ఇతనికాలమున అసనపురమున వర్ధిల్లిన "ఘటిక" (విశ్వవిద్యాలయమువంటిది) ఎన్నదగినది. ఈతని కాలమున వెలసిన విప్పర్ల శిలాశాసనము తెలుగులో కన్పించు ప్రప్రథమశాసనము. ఇతని తరు

(2) S I I, I, 40,

(3) 1916 - 17 సం. 9వ తామ్రశాసనము.

వాత సింహాసనము నధిష్ఠించినది ఈతని సోదరుడు ఇంద్రభట్టారకుడు. ఈతడు "త్యాగధేను" బిరుదాంకితుడు. ఈతని శత్రుకూటమికి నాయకత్వము వహించినది అధిరాజ- ఇంద్రుడు. ఇంద్రభట్టారకుడు రాజ్యమేలినది ఏడుదినములు మాత్రమే.

తరువాత ఇతని పుత్రుడు రెండవ విష్ణువర్ధనుడు సింహాసనము నధిష్ఠించి తొమ్మిదేండ్లు రాజ్యమేలెను.

## రెండవ విష్ణు వర్ధనుడు
## క్రీ. శ. 673 - 82

రెండవవిష్ణువర్ధనుడు విషమసిద్ధి,ప్రళయాదిత్య బిరుదాంకితుడు. ఇతని తరువాత పుత్రుడైన మంగియువరాజు, 'విజయాదిత్య' 'విజయసిద్ధి' బిరుదాంకితుడు. ఇరువదియైదు సంవత్సరములు క్రీ. శ. 682 నుండి 706 వరకు రాజ్యమేలెను. రెండవవిష్ణువర్ధనుడు మంగియువరాజు జయసింహుని కాలమున యుక్తవయస్కులై యుండి రాచకార్యముల తోడ్పడిరి.

రెండవ జయసింహుడు - సర్వసిద్ధిబిరుదాంకుడు - మంగియువరాజు పుత్రుడు క్రీ. శ. 706 నుండి 18 వరకు పదమూడు వత్సరములు రాజ్యమేలెను.

రెండవజయసింహుని అనంతరము సింహాసనమునకు సోదరులలో అంతఃకలహమేర్పడినది. కనిష్ఠసోదరుడు కొక్కిలి సింహాసనము నాక్రమించెను. ఆరునెలల పిమ్మట మూడవ విష్ణువర్ధనుడు అగ్రసోదరుడు రాజు కాగలిగెను. సోదరులమధ్య పొత్తు కుదిరినది. కొక్కిలి ఎలమంచిలి ప్రాంతమునకు పాలకుడయ్యెను. కొక్కిలి వంశీయులు ఎలమంచిలి ప్రాంతమును నాలుగుతరాల వరకు పరిపాలించిరి.

మూడవ విష్ణువర్ధనుడు క్రీ. శ. 719 నుండి 55 వరకు ముప్పది యేడు సంవత్సరములు రాజ్యమేలెను. ఇతడు త్రిభువనాంకుశ బిరుదాంకుడు. ఇతని రాణివిజయమహాదేవి.

మూడవ విష్ణువర్ధనుని కాలముననే పల్లవసేనాని ఉదయచంద్రుడు నెల్లూరు ప్రాంతముపై దండెత్తెను. విష్ణువర్ధనుని దండనాథుడు విషాదపతి పృథ్వీవ్యాఘ్రుడు ఉదయచంద్రుని ఎదిరించి నెల్లూరు యుద్ధమున ఓటమిచెందెను. ఉదయచంద్రునకు ఈ యుద్ధమున పెక్కు ఏనుగులు అపారధనరాసులు లభించినవి.

పల్లవరాజు రెండవ నందివర్మకు నెల్లూరు ప్రాంతము లభించినదని పల్లవ కథనము. ఇది గడిసీమ వద్ద జరిగిన కొల్లూటుగాని పేర్కొనదగిన పెద్దయుద్ధముగాదు.

మూడవ విష్ణువర్ధనుని పిమ్మట అతని పుత్రుడు మొదటి విజయాదిత్యుడు క్రీ. శ. 755 నుండి 77 వరకు పదునెనిమిది వత్సరములు రాజ్యమేలెను.

## మూడవ విష్ణువర్ధనుడు

## క్రీ. శ. 755 - 77

మూడవ విష్ణువర్ధనుని పరిపాలనలో పేర్కొనదగిన చారిత్రకాంశము దక్షిణాపథమున పశ్చిమమున సంభవించిన రాజ్యాంగ విపరిణామము. పశ్చిమచాళుక్యుల రాజ్యము అస్తమించి రాష్ట్రకూటులు రాజ్యము ఉదయించి దంతిదుర్గుడు రాజయ్యెను. క్రీ. శ. 769 నాటి రాష్ట్రకూటశిలాశాసనము యువరాజు గోవిందుని వేంగిదండయాత్రను ప్రస్తుతించు చున్నది. (4) మూసీ కృష్ణా సంగమమున విజయస్కంధావారమున గోవిందునకు వేంగిప్రభువు ఏనుగులు, ధనరాసులు,

(4) E I VI 210 - 11

భటులను కప్పముగ సమర్పించెనట. అతిశయోక్తి పూరితమైన ఈ కథనము అయథార్థము కాకపోయినను, రాష్ట్రకూటసేనలు వేంగి మండలములోనికి చొరబడలేదు. యుద్ధము జరుగలేదు. కృష్ణవేణీ మూసీ సంగమము వేంగిమండలములోనిది కాదు. అయినను యువరాజు వేంగి పొలిమేరల వరకు దండయాత్ర నెరపుట, అచ్చుటకు వేంగిరాయబారులేతెంచి, అతనితో సంధికావించుకొనుట - భవితవ్యతా సూచకములు. (5)

విజయాదిత్యుని కుమారుడు నాలుగవ విష్ణువర్ధనుడు క్రీ. శ. 772 నుండి 808 వరకు ముప్పదియారు వత్సరములు రాజ్యమేలెను. ఈతని కాలమున రాష్ట్రకూట సింహాసనమునకై రెండవగోవిందుడు-తమ్ముడైన ధ్రువుడు పోరాడిరి. ఈ అంతఃకలహమున విష్ణువర్ధనుడు అగ్రజుడైన గోవిందుని పక్షము వహించెను. కాని విజయము ధ్రువునకు లభించినది. ధ్రువుడు సింహాసనమధిష్ఠించిన పిమ్మట పగసాధించుటకై వేంగిపై దండెత్తెను. ఆతనికి వేములవాడ చాళుక్యవంశీయుడు మొదటి అరికేసరి తోడయ్యెను. విష్ణువర్ధనుడు ధ్రువునకు తన పుత్రికయైన శీలమహాదేవినిచ్చి వివాహము గావించి సంధి చేసికొనెను. శీలమహాదేవి ధ్రువుని పట్టమహిషి యయ్యెను. (6)

ధ్రువుని పుత్రుడైన మూడవగోవిందుడు వేంగిప్రభువు తన శాసనములనే తలడాల్ప నిత్యసంసిద్ధుడని తన శాసనమున ప్రవచించెను. (7) వేంగిప్రభువు తనప్రాకార నిర్మాణమున తోడ్పడెనను వాక్యమునకు వ్యాఖ్యాతలు మాన్యఖేట నగర నిర్మాణమున వేంగిప్రభువు సాయము చేసెనని అర్థము చెప్పుచున్నారు.

(5) ఈ గ్రంథమునందే "రాష్ట్రకూటులు" అను అధ్యాయమును చదువవచ్చును.

(6) E I XXII, 107

(7) E I VI 244 - 5 V 19

విష్ణువర్ధనునకు ముగ్గురు పుత్రులు. రెండవ విజయాదిత్యుడు, భీమసలుకి సింహాసనమునకై కలహించిరి. మూడవసుతుడు హైహాయ రాజ దౌహిత్రుడు విజయాదిత్యుని పక్షమవలంబించెను.

## రెండవ విజయాదిత్యుడు
## [క్రీ. శ. 808 నుండి 847]

రెండవ విజయాదిత్యుడు క్రీ. శ. 808 నుండి 847 వరకు సుమారు నలుబది వత్సరములు రాజ్యమేలెను. ఈతడు 'నరేంద్రమృగ రాజు' 'చాళుక్యరామ', 'విక్రమధవళ' బిరుదాంకితుడు. ఈతడు రాష్ట్రకూటుల ఆధిపత్యము నంగీకరింపలేదు. రాష్ట్రకూటులీతని తిరుగుబాటువారుగ నెన్ని, ఇతని సవతి సోదరుడైన భీమసలుకిని సింహాసనము నధిష్ఠింప జేయుటకై యుద్యోగించిరి. పశ్చిమగాంగులు, వేములవాడచాళుక్య సామంతులు తోడ్పడుచున్నంతకాలము రాష్ట్ర కూటరాజు మూడవ గోవిందునకు విజయము లభించెను. కాని క్రీ.శ. 814 సంవత్సరమున గోవిందుని మరణము వలన, స్థితిగతులు తారు మారైనవి. బాలుడైన అమోఘవర్షుడు సింహాసనస్థుడయ్యెను. విజయా దిత్యు డప్పుడు విజృంభించి, భీమసలుకిని పారద్రోలి, గాంగుల నోడించి రాష్ట్రకూట రాజ్యభాగములనుగూడ వేంగీరాజ్యమున గలిపెను.

అర్వాచీన చాళుక్య శాసనములలో విజయాదిత్యుడు నూట యెనిమిది యుద్ధములు గావించిన విజేతగ, ద్వాదశవత్సరములు అహోరాత్రములు ఒరలోపెట్టని కత్తిని చేబూనిన జగదేకవీరుడుగ,నూట యెనిమిది శివాయతనములకు నరేంద్రేశ్వరాయతనమునకు నిర్మాతగ అభినుతుడు. ఈ పొగడ్తలు యథాక్షరముగ స్వీకరింప నవసరములేదు. ద్వాదశవత్సరములు కత్తి చేబూనిన వ్రతదీక్షాకాలము భీమసలుకి సింహాసనము నాక్రమించిన సమయము కావచ్చును. నూటయెనిమిది సంఖ్య సంప్రదాయసిద్ధమైనది. విజయాదిత్యునకు యుద్ధములలో

కుడిభుజమై తోడ్పడినది. అతని పుత్రుడు ఐదవ విష్ణువర్ధనుడు. నిరంతర యుద్ధనిమగ్నుడైన అతనికి కవి (=యుద్ధ) విష్ణువర్ధనుడను పౌరుష నామమేర్పడినది. అయిదవ విష్ణువర్ధనుడు సుమారు పదునెనిమిది మాసములు రాజ్యమేలెను. అతని భార్య శీలమహాదేవి రాష్ట్రకూట రాజపుత్రిక.

## (మూడవ) గుణగ విజయాదిత్యుడు
### [క్రీ. శ. 849 నుండి 892 వరకు]

కలివిష్ణువర్ధనుని అనంతరము అతని పుత్రుడు మూడవవిజయా దిత్యుడు సింహాసన మధిష్ఠించెను. ఇతడు గుణకె – నల్లాటు బిరుదాంకి తుడు. ఈతనికిగల గుణపక్షపాతమీ పౌరుషనామధేయమును సంపా దించి పెట్టినది. క్రీ. శ. 849 నుండి 892 వరకు 44 సంవత్సరములు రాజ్యమేలెను. ఈతని సుదీర్ఘ పరిపాలన కాలమును మూడుదశలుగ విభజింపనగును.

ప్రథమమున : అభ్యుదయదశ
ద్వితీయదశ : విపద్దశ
చరమదశ : విజయపరంపరాభివృద్ధి దశ

గుణగ విజయాదిత్యుడు 'త్రిపురమర్త్యమహేశ్వర' – 'పరచక్ర రామ' బిరుదాంకుడు.

విజయాదిత్యుని సేనాపతి దక్షిణాపథచరిత్రలో ఆంధ్రసారస్వత చరిత్రలో సుప్రసిద్ధుడైన పండరంగడు. పండరంగసేనాని – నడపిన తొలిదండయాత్ర నెల్లూరు ప్రాంతమునందలి బోయకొట్టములపై. పల్లవరాజు నందివర్మ ii సేనాని ఉదయచంద్రుడు మూడవవిష్ణువర్ధనుని దండనాథుడైన పృథ్వీవ్యాఘ్రుని జయించి ఆరాజ్యమును పల్లవ సామ్రాజ్యములో చేర్చిన సంగతి విదితపూర్వమే. నాటికి నేటికి వేంగి

ప్రభువు పగసాధించుటకు, కోలుపోయిన రాజ్యమును తిరిగి సంపాదించుటకు పండరంగసేనానిని బోయికొట్టముల దండయాత్ర సాగింప పుత్తెంచెను.

పండరంగసేనాని దక్షిణదండయాత్ర కుపక్రమించి తొలుత 'పట్టెము' దుర్గమును సాధించి నెల్లూరు దుర్గమును అగ్నిదగ్ధ మొనర్చెను. తరువాత విజేతయైన పండరంగడు పల్లవరాజ్యమైన తొండై మండలముపై దండెత్తి, పులికట్ సరోవరప్రాంతమున విడిసెను. అచ్చట 'పండరంగం' అనుపట్టణమును, అందు పండరంగ మహేశ్వరాయతనము నిర్మించెను. (8)

పండరంగని దండయాత్ర బోయకొట్టములపై నల్పిన చిరు సంగ్రామముగాదు. ఆ దిగ్విజయయాత్ర వలన వేంగిరాజ్యము పెరిగినది. బోయకొట్టములు పల్లవరాజ్యము నుండి విడివడి వేంగి రాజ్యములో చేరినవి. గుణగవిజయాదిత్యుడు పండరంగని ఆ ప్రాంతమునకు పరిపాలకుడుగ నియమించెను. పండరంగడు కందుకూరు ముఖ్యపట్టణముగ ఆ సీమను పరిపాలించెను. అతడు కందుకూరును అపరబెజవాడగ తీర్చిదిద్దెను. (9)

పిమ్మట పాండురంగసేనాని రాహణుని నిర్జించి, ఏలికయైన విజయాదిత్యుని మన్నన వడసెను రాహణుడెవ్వరో - ఏ సీమకు అధిపతియో తెలియదు. ఈవిజయపరంపరలతో ప్రథమదశ పూర్తియైనది.

గుణగవిజయాదిత్యుడు విజయగర్వముతో విజృంభించుచుండగ, విపద్దశ ప్రారంభమైనది.

అతనితల్లి శీలమహాదేవి ఇంద్రవల్లభుని పుత్రిక. ఇంద్రవల్లభుడు రాష్ట్రకూటప్రభువు మూడవగోవిందుని అవరజుడు. అయినను,

(8) NDI, I, G 86 - 103 Page 477 Early History of Deccan
(9) E I XIX 275

రాష్ట్రకూటులతో గుణగవిజయాదిత్యునకు వైరమేర్పడినది. ఆతడు స్తంభపురిని ముట్టడించెను. (కర్నూలు మండలమునందలి కంబం) అది రాష్ట్రకూట రాజ్యములోనిది. తమ రాజ్యములోనికి చొచ్చుకొని వచ్చిన ఈ దండయాత్రవలన, కుపితుడైన రాష్ట్రకూటరాజు అమోఘవర్షుడు వేంగిపై దండెత్తెను. ఉభయసేనలు వింగావల్లి దగ్గర తారసిల్లినవి. ఘోరసంగ్రామము జరిగినది. అందు గుణగవిజయాదిత్యుడు పరాజయమునంది, అమోఘవర్షుని సార్వభౌమత్వము నంగీకరించి సంధి చేసికొనెను. (10)

అంతటితో గుణగవిజయాదిత్యుని యుద్ధసంరంభము అంతరింపలేదు. అమోఘవర్షునిపై సామంతుడైన నీతిమార్గపెర్మానడి, తాలక్కాడ్ ప్రభువైన పశ్చిమగంగరాజు విప్లవధ్వజమెత్తి క్రీ. శ. 866 ప్రాంతమున స్వాతంత్ర్యము ప్రకటించెను. అతనికి పల్లవవంశీయులైన నొలంబవాడి ప్రభువులు సాయమైరి. అమోఘవర్షుడు - మూలబలాధినేతయైన బంకెయసెల్లకేతనదండనాధుని ఆ విప్లవము నణచుటకు పుత్తెంచవలసి వచ్చినది. అంతలో ఉత్తరమున విప్లవము చెలరేగినది. లాటదేశమున ఆ విప్లవమున యువరాజైన కృష్ణుడుగూడ చేరియుండెను. అందుచే సెల్లకేతన సేనాని విజయపరంపర సాధించినను, వెనుకకు పిలిపించి ఆతని లాటదేశమునకు పుత్తెంచెను. ఆ తరుణమున అమోఘవర్షుడు గుణగవిజయాదిత్యుని దక్షిణమున గంగవాడికి దండు వెడలి, విప్లవము నణచివేయకోరెను. గుణగవిజయాదిత్యుడు దండయాత్రకుపక్రమించెను. మార్గమధ్యమున నీతిమార్గపెర్మానడి మిత్రుడైన నొలంబవాడి ప్రభువు మంగి (=మొదటి నొలంబాధిరాజు) విజయాదిత్యుని ఎదిరించెను. జరిగిన ఘోరసంగ్రామమున తూర్పుచాళుక్యసేనలు విజయము సాధించినవి. ఆవిజయమునకు ముఖ్యకారకుడు వినయాడిశర్మ, గుణగవిజయాదిత్యుని సంధి

(10) E I VI 103

విగ్రహపాత్రుడు. మంగి యుద్ధమున మరణించెను. గుణగవిజయాదిత్యుడు గంగవాడిపై దండెత్తి గంగాకూటమువద్ద (శివగంగపర్వతము బెంగుళూరు మండలము) ఘనవిజయము నార్జించెను. నీతిమార్గుడు అమోఘవర్షునకు లోబడి సంధిచేసికొనెను. (11)

క్రీ. శ. 880 సంవత్సరమున అమోఘవర్షుడు మరణించెను. ఆ అవకాశమును గుణగవిజయాదిత్యుడు జారవిడువలేదు. రాష్ట్రకూట సింహాసనము నధిష్ఠించిన రెండవ కృష్ణుడు - పితృద్రోహి. అతనిపై సామంతులకు గౌరవప్రపత్తులు లేవు. అతని బావమరది చేదిప్రభువు సంకిలుని (శంకరగణుని) సాయముపై ఆతడాధార పడవలసివచ్చినది. గుణగవిజయాదిత్యుడు అమోఘవర్షుని మరణానంతరము స్వాతంత్ర్యమును ప్రకటించెను. రెండవకృష్ణరాజు సంకిలుని సాయముతో గుణగవిజయాదిత్యునిపై దండెత్తెను. కాని యుద్ధమున పరాజితుడై సంకిలుని రాజధానియైన కిరణపురమునకు ప్రవాసియై పోయి తలదాచుకొనవలసిన వాడయ్యెను.

## పండరంగుని దిగ్విజయయాత్ర

గుణగవిజయాదిత్యుడు, దూరదేశమున ప్రవాసియై డాహలదేశ రాజధానిలో తలదాచుకొనుచున్న రాష్ట్రకూటచక్రవర్తి రెండవ కృష్ణరాజుపై పగ సాధించుటకు పండరంగ సేనానిని దిగ్విజయ యాత్రకు పురికొల్పెను. తూర్పుచాళుక్య చరిత్రలో చిరస్మరణీయమైన ఆ మహోజ్వల దండయాత్రను గూర్చి సవిస్తరమగు వర్ణన శాసనములలో లభింపక పోయినను ఉపలభ్యమైన వివరములను బట్టి - చాలవరకు చరిత్ర నిర్మింపవచ్చును. బహుశః దండయాత్ర వేంగినుండి బయలుదేరియుండును. కళింగదేశమునుదాటి పండరంగుడు తూర్పు కనుమలనుదాటి దక్షిణకోసలను మధ్యభారతమునందలి మైదానము

(1) E I VI 30 - 31

లను చేరుకొనెను. వేంగి సేనలు నిరంతరాయముగ ముందునకు సాగిపోలేదు. చేది ప్రభువుల సామంతులసేనలు రాష్ట్రకూటసేనలు పండరంగని పలుచోట్ల యెదిరించినవి. కాని, అద్వితీయమేధావియైన పండరంగదండనాథుని ప్రజ్ఞ ఆటంకముల నన్నిటి ఛేదించి విజయ పరంపరల సాధింపగల్గెను. ఆతని దండయాత్రను నిరోధించుట కడ్డమై దండు విడిసిన కళింగప్రభువు, కోసలరాజు వేములవాడచాళుక్యరాజు యుద్ధమున పరాజితులై మరలిపోయిరి. చిట్టచివరకు పాండురంగడు డాహాలదేశమును చేరి, కిరణపురమును అచలపురమును ముట్టడించి, కృష్ణరాజును సంకిలుని యుద్ధమున ఓడించి ఘనవిజయము నార్జించెను. కృష్ణరాజు చేయునది లేక విజయాదిత్యునితో ఓటమినంగీకరించి సంధిచేసికొనెను.

కృతార్థుడైన విజయాదిత్యుడు కృష్ణరాజును రాష్ట్రకూట సింహాసనమున పునఃప్రతిష్ఠితుని చేసెను. కృష్ణరాజు గుణగవిజయా దిత్యుని సార్వభౌమత్వము నంగీకరించి, ఆతని నిండుకొలువున కప్పము చెల్లించి సామంతుడయ్యెను. గుణగవిజయాదిత్యునకు కృష్ణరాజు పాళిధ్వజమును, రాష్ట్రకూటసామ్రాజ్యలాంఛనములైన గంగా యమునా చిహ్నములను సమర్పించెను. విజయాదిత్యుడు 'వల్లభ' బిరుదు వహించి, దక్షిణాపథసార్వభౌమపదవి వహించెను. కృష్ణరాజు ఆతనికి కానుకలు కప్పము చెల్లించి, ఆతని ఆయుధములకు పూజ లొనర్చి సామంతుడయ్యెను. ధర్మవరశిలాశాసనమున విజయాదిత్యుని విజయపరంపరాభివర్ణనముగలదు. రాష్ట్రకూటరాజు కృష్ణుని జయిం చుట మాత్రమేగాక పండరంగడు నిస్సహాయుడైన చోళుని సంరక్షించిన ఉదంతము పేర్కొనుచున్నది. సాతలూరు శాసనము విజయాదిత్యుడు పాండ్యులపై పల్లవులపై సాధించిన విజయముల నభివర్ణించుచున్నది.

వేంగిసింహాసనము నధిష్ఠించిన సమ్రాట్టులలో గుణగవిజయా దిత్యుడు నాయకమణి. ఆతని సామ్రాజ్యము ఉత్తరమున మహేంద్ర

గిరినుండి దక్షిణమున పులికట్‌సరోవరమువరకు వ్యాపించియుండెను. అతని సేనలు - సేనాని పండరంగుని ఆధిపత్యమున మధ్యభారతమున గంగాయమునాంతర్వేదివరకు ఘనవిజయముల ఆర్జించినవి. అమోఘ వర్షుని కాలమున, కొంతకాలమాతడు అస్తంగతుడై యుండవలసి వచ్చినను, చివరకు దక్షిణాపథమునంతటిని జయించి ఏకచ్ఛత్రాధి పతియైన సార్వభౌముడయ్యెను. ఆతనిపితామహుడు నరేంద్రమృగరాజు రాష్ట్రకూటులతో యుద్ధమొనర్చియున్నను, రాష్ట్రకూటప్రభువును తనకు సామంతునిచేసికొనిన గౌరవము గుణగవిజయాదిత్యునకు మాత్రమే దక్కినది. విజయాదిత్యుని విజయపరంపరలకు ముఖ్యకార కుడు ఆతనిసేనాధిపతి పండరంగడు. పెక్కురు బ్రాహ్మణసేనానులు గుణగవిజయాదిత్యుని కడ వినయాడిశర్మ మున్నగు కార్యఖడ్గ నిపుణులైన ఉద్యోగులుండెడివారు. ఆతడు సార్థకబిరుదాంకితుడు. గుణపక్షపాతి.

అపజయమెరుగని అద్వితీయప్రజ్ఞాశాలి పండరంగసేనానిపేరు దక్షిణాపథచరిత్రలో స్వయంప్రకాశమానమైన సువర్ణాక్షరములతో వెలుగొందుచుండును.

నలుబదినాలుగు సంవత్సరములు పరిపాలించిన పిమ్మట గుణగవిజయాదిత్యుడు క్రీ. శ. 892 సంవత్సరమున తుదినిశ్వాసము విడిచెను. అతనికి ఔరససంతానము లేకపోవుటచే అవరజుడైన విక్రమాదిత్యుని ఆతడు యువరాజుగ వరించియుండెను గాని అతడంతకు ముందే దివంగతుడయ్యెను. కీర్తిశేషుడైన యువరాజసుతుడు భీముడు గుణగవిజయాదిత్యుని తరువాత వేంగిసింహాసనము నధిష్ఠించెను.

## చాళుక్య భీముడు

గుణగ విజయాదిత్యుని అనంతరము వేంగిసింహాసనము నధిష్ఠించినది చాళుక్యభీముడు. కాని అతనికి దాయాదుల వైరము

సంప్రాప్తించినది. అతని పినతండ్రి (మొదటి) యుద్ధమల్లుడు రాష్ట్ర కూట ప్రభువు రెండవకృష్ణరాజు సాయము నభ్యర్థించెను. పరాభవ ఖిన్నుడై మ్రగ్గుచున్న కృష్ణరాజు ఆ యవకాశమును జారవిడువక, భీముడు పట్టాభిషిక్తుడగుటకు ముందే వేంగిపై దండెత్తెను.

ఆ దండయాత్ర వృత్తాంతము సవిస్తరముగ తెలియరాదు. అయినను ముఖ్యాంశముల నెన్ననగును.

రాష్ట్రకూట దండయాత్ర తొలుత విజయపరంపరలను సాధించగల్గెను. వేంగిమండల మధ్యభాగమున జరిగిన సంగ్రామములో చాళుక్య భీముడే బందీకృతుడై శత్రువులకు చేజిక్కెను. వేములవాడ చాళుక్యుల శాసనములలో, పంపని విక్రమార్జున విజయములో కృష్ణ రాజు సమకాలీనసామంతుడు బద్దెగనృపాలుడు భీముని బందీకృతునిగ పట్టినట్లు విస్పష్టముగ గలదు.

కాని చాళుక్యభీముడు అచిరకాలమున బంధవిముక్తిగాంచెను. అతడేవిధముగా తప్పించుకొనెనో !

రాష్ట్రకూటుల విజయము అస్థిరమైనది. ముదుగొండచాళుక్య సామంతుడు మొదటికుసుమాయుధుడు స్వామిగ క్షిపరాయఃఖులైన దండనాథులతో కలసి చాళుక్యభీముని పక్షమున యుద్ధమొనర్చి శత్రుసైన్యముల పారద్రోలి అతని సింహాసనాసీనుని గావించిరి. చాళుక్య భీముడు క్రీ. శ. 14-4-892 సంవత్సరమున పట్టాభిషిక్తుడయ్యెను.

కాని కృష్ణరాజు తన పట్టుదలవదలలేదు. సుప్రసిద్ధ రాష్ట్రకూట సేనాని దండెనగుండయ ఆధిపత్యమున వేంగిపై దండయాత్ర నెర పెను. రాష్ట్రకూటసేనలు వేంగిమండల మధ్యస్థమైన నిరవద్యపుర మును (నిడుదవోలు) చేరినవి. పెదవంగూరు గ్రామముకడ ఘోర సంగ్రామము జరిగినది. గుండయసేనాని యుద్ధమున మరణించెను.

కర్ణాటలాటసేనలు చెల్లాచెదరైనవి. పరాజితులై పలాయనము సాగించు చున్న శత్రుసేనలను తరుముటకు వెడలిన రాజపుత్రుడు ఇరిమరితి గండుడు- యువరాజు కూడ మరణించెను. (12)

చాళుక్యభీముడు శివభక్తుడు. అతడనేక శివాయతనములను కట్టించెను. అందు సుప్రసిద్ధమైనది దక్షారామమునందలి భీమేశ్వ రాలయము. ఈతడును విష్ణువర్ధన బిరుదాంకితుడు. అతడు క్రీ. శ. 921 సంవత్సరమున దివంగతుడయ్యెను.

చాళుక్యభీముని అనంతరము అతని పుత్రుడు (నాలుగవ) విజయాదిత్యుడు వేంగిసింహాసన మధిష్ఠించెను. అతడు పరిపాలించినది ఆరునెలలు మాత్రమే. ఈ ఆరుమాసాలలో అతడు కళింగదండయాత్ర నెరపెను. బహుశః తూర్పుగాంగులప్రభువు ఉత్సాహపూరితుడైన మూడవ వజ్రహస్తుడు తూర్పుచాళుక్యుల సార్వభౌమత్వము నంగీకరింపక స్వాతంత్ర్యము ప్రకటించి యుండవచ్చును.

'కొల్లభిగండ' బిరుదాంకుడైన విజయాదిత్యుడు విరజాపురికడ కళింగులనోడించెను. (13) కాని విజయాదిత్యుని ఆకస్మికమరణము చే, విజయము విపత్తుగ మారినది.

సామంతులు సేనానులు వారసత్వమునకై చెలరేగు అంతర్యుద్ధ ముల తలపోయుచు గృహోన్ముఖులైరి. నాలుగవ విజయాదిత్యుని మరణము వేంగిమండలములో అరాజకత్వమునకు దారితీసినది. రాష్ట్రకూటులు కలతచెందిన నీళ్ళలో చేపలుపట్టుట కుద్యమించిరి.

అమ్మరాజు I, నాలుగవవిజయాదిత్యుని పుత్రుడు తొలుత (క్రీ.శ.921సంవత్సరము)సింహాసనమధిష్ఠించెను. అతని పినతండ్రిరెండవ విక్రమాదిత్యుడు ప్రత్యర్థియై నిలిచెను. పలువురు సామంతులుగూడ

---

(12) ARE 1914 Ph ii Para 6

(13) A R E 1917 ph ii para 26 1918 ph ii para 5

ఆతని పక్షమునవలంబించిరి. కాని, అమ్మరాజమహేంద్రుడు – స్వామిభక్తిపరాయణులైన దండనాథుల సాయముతో పోరాడి సింహాసనమధిష్ఠించి క్రీ. శ. 927 వరకు ఏడు వత్సరములు వేంగిని పాలించెను. ఈతడు రాజధానిని వేంగి నుండి గోదావరికుత్తరతీరమునందలి రాజమహేంద్రవరమునకు – తనసీమమీాద నిర్మించిన క్రొత్తపట్టణమునకు తరలించెనని కొందరు తలంచుచున్నారు. అమ్మరాజ మహేంద్రుని పిమ్మట అతనిపుత్రుడు 5 వ విజయాదిత్యుడు (=బేటరాజు=కాంతికా విజయాదిత్యుడు) సింహాసనము నధిష్ఠించెను. బాలుడైన అతడా విపత్కాలమున వేగలేక, పదునైదుదినములలో పిఠాపురమునకు పోయి, తలదాచుకొనెను. [ఆతడచ్చట చాళుక్యవంశమునందొక ఉపశాఖకు మూలపురుషుడయ్యెను.] మొదటి యుద్ధమల్లుని సుతుడు మొదటి తైలరాజు వేంగీరాజయ్యెను. బహుశః ఆతనికి రాష్ట్రకూటుల సాహాయ్యము లభించి యుండవచ్చును. ఆతడొకనెలరోజులు మాత్రమే రాజ్యము సల్పెను. అంతలో ఎనిమిది సంవత్సరములనుండి పొంచి వేచియున్న రెండవ విక్రమాదిత్యుడాతని యుద్ధమున సంహరించి వేంగిసింహాసనము నాక్రమించెను. రెండవ విక్రమాదిత్యుడు పరిపాలించినది పదునొకండు నెలలే అయినను, ఆతడు త్రికళింగముపై దండెత్తి జయించెను. అతడు దిగుమర్రుశాసనమునుబట్టి, అమ్మరాజు సుతుడైన భీమునిచే హత్యగావింపబడెను. భీముడు ఎనిమిదినెలలు మాత్రమే రాజ్యమొనర్చెను. తైలరాజు I పుత్రుడైన రెండవయుద్ధమల్లు డాతని పదచ్యుతిని గావించి రాష్ట్రకూటుల సాయముతో రాజయ్యెను. ఆతడు నామమాత్రప్రభువు. ఏడుసంవత్సరము లాతడు రాజ్యమొనరించినను– ఆతనికిగాని ప్రజలకుగాని చిత్తశాంతి లభింపలేదు. సింహాసనమునకై కలహించుచున్న దాయాదులు – రాష్ట్రకూట దండనాథులు ప్రజలను పీడించి పిప్పిచేసి రాక్షసులవలె ప్రవర్తించిరి.

క్రీ. శ. 934 సంవత్సరమున రెండవ చాళుక్యభీముడు

(=రాజమార్తాండుడు నాలుగవ విజయాదిత్యునకు మేలాంబికకు సుతుడు=మొదటి అమ్మరాజకు సవతితమ్ముడు) పీడు సంవత్సరముల నుండి వేంగీమండలము నావహించిన అరాజకత్వమునకు స్వస్తిచెప్పి రెండవ యుద్ధమల్లుని పారద్రోలి వేంగిసింహాసనము నాక్రమించెను. ఇతనికి రాష్ట్రకూటరాజ్యమునందలి స్థితిగతులు తోడ్పడినవి. క్రీ. శ. 930 సంవత్సరమున నాలుగవగోవిందుడు మాన్యఖేటు సింహాసనము నధిష్ఠించెను. సామంతులలో కొందర కతడు అసంతృప్తి కల్గించెను. అతని పినతండ్రి బద్దెగుడు - సుతుడైన కన్నరదేవునితో కలిసి కుట్రపన్నెను. వారిరువురకు గోవిందుడు ప్రవాసశిక్ష విధించెను. వారు హైహయరాజు త్రిపురీ ప్రభువు యువరాజదేవుని I కడకు చేరి వేములవాడ ముదుగొండ చాళుక్య సామంతులను రెచ్చగొట్టిరి. గోవిందుడు వారి నణచుటకై దండెత్తి విఫలమనోరథుడయ్యెను. ఈ అదనులో రెండవచాళుక్య భీముడు వేంగిసింహాసనము నాక్రమించెను. యుద్ధమల్లునకు సాయముగ నేతెంచిన రాష్ట్రకూటసేనలు పరాజయ మును చెంది, వేంగిమండలమును వీడిపోయినవి. రెండవయుద్ధ మల్లుడును పలాయనమంత్రమును పఠించెను. అప్పుడు చాళుక్య భీముడు - దాయాదులను అణచి దేశమున శాంతిభద్రతలనునెలకొల్పి క్రీ. శ. 934 సంవత్సరమున పట్టాభిషిక్తుడయ్యెను. అతనికి ఇరువురు రాణులు. ఊర్జప, అంకిదేవి. పూర్వగాంగ రాజపుత్రిక, లోకాంబ. దానార్ణవుడు అంకిదేవి సుతుడు. అమ్మరాజు లోకాంబ పుత్రుడు.

రెండవచాళుక్యుని తరువాత అతని రెండవసుతుడు రెండవ అమ్మరాజు - పండ్రెండేండ్ల బాలుడు సింహాసనమధిష్ఠించెను. అతని అగ్రజుడు - దానార్ణవుడేల రాజుకాలేదో తెలియుటలేదు. అయినను, రెండవ అమ్మరాజునకు ప్రత్యర్థులు లేకపోలేదు. క్రీ. శ. 945 లో అతడు పట్టాభిషిక్తుడు కాగానే రెండవయుద్ధమల్లుని పుత్రులు బాడపుడు రెండవతైలుడు రాష్ట్రకూట రాజ్యమున ప్రవాసమునన్నున్న

రాజపుత్రులు వేంగిపై దండెత్తిరి. వారికి రాష్ట్రకూట ప్రభువు మూడవ కృష్ణరాజు సాయము చేసెను. అమ్మరాజు నిస్సహాయుడై వేంగి విడిచి పారిపోయెను. బాడపుడు, విజయాదిత్యనామము ధరించి, రత్నసింహాసనము నధిష్ఠించెను. బాడపుని అనంతరము అతని అవరజుడు రెండవ తైలుడు సింహాసనమధిష్ఠించెను. అంతలో ప్రవాసమునుండి రెండవ అమ్మరాజు తిరిగివచ్చెను. అతనికి కొలను ప్రభువు నృపకాముడు తన పుత్రికనిచ్చి వివాహముచేసి సాయమొనరించెను. అమ్మరాజు రెండవ తైలుని యుద్ధమున సంహరించి రెండవసారి వేంగిసింహాసన మధిష్ఠించెను.

కాని క్రీ. శ. 956 సంవత్సరమున రాష్ట్రకూటప్రభువు మూడవ కృష్ణరాజు వేంగిపై దండెత్తి వచ్చుటచే రెండవ అమ్మరాజు తిరిగి సింహాసనము నుజ్జగించి ప్రవాసి కావలసివచ్చినది. మూడవ కష్ణరాజు క్రీ. శ. 950 సంవత్సర ప్రాంతమున తక్కోలం యుద్ధమున చోళరాజు పరాంతకుని గెలిచి, కాంచీ తంజావూరులను నిర్మూలించి తొండై మండలమును రాష్ట్రకూట సామ్రాజ్యమున కలుపుకొన గలిగిన సమర్థుడు. అతడు వేంగిమండలముపై దండెత్తి, యీసారి అమ్మరాజు అగ్రజుడైన దానార్ణవుని పక్షమవలంబించెను. అమ్మరాజు కళింగమున ప్రవాసియయ్యెను. దానార్ణవుడు రాష్ట్రకూటుల సాయముతో రాజయ్యెను.

రాష్ట్రకూటసేనలు వేంగినుండివెడలగనే, రెండవ అమ్మరాజు ప్రవాసమునుండి వచ్చి సవతిసోదరుని జయించి మూడవతూరి వేంగిసింహాసనమధిష్ఠించి క్రీ. శ. 970 వరకు రాజ్యమేలెను. కాని దానార్ణవుడు ఎట్టకేలకు ఎదురుతిరిగి ముదుగొండ చాళుక్యసామంతులు మల్లన - గొండియుల సాయముతో అమ్మరాజును యుద్ధమున సంహరించి వేంగికి రాజయ్యెను.

దానార్ణవుడు రాజ్యమునల్పినది మూడేండ్లుమాత్రమే. తెలుగు చోడప్రభువు జటాచోడ భీముడు [కర్నూలు మండల మందలి పెదకల్లు పాలకుడు] వేంగిపై దండెత్తెను. అతడు రెండవ చాళుక్యభీముని దౌహిత్రుడు. రెండవ అమ్మరాజు బావమఱది (భార్య సోదరుడు) అమ్మరాజు వధకు ప్రతీకారముగ దానార్ణవునిపై పగసాధించుట అతని దండయాత్రకు ముఖ్యకారణమై యుండనోపును. క్రీ. శ. 973 సంవత్సరమున యుద్ధములో జటాచోడభీముడు దానార్ణవుని సంహారించి వేంగిసింహాసనము నాక్రమించి క్రీ. శ. 1000 రాజ్యము నల్పెను.

## జటాచోడభీముడు : అరాజకత్వము

## క్రీ. శ. 973 నుండి 1001

దానార్ణవుని మరణముతో వేంగిదేశ చరిత్రలో నూతనాధ్యాయమారంభించినట్లు చెప్పవచ్చును. అంతవరకు ఎన్ని అంతఃకలహములున్నను, సింహాసనముపై నున్నది తూర్పుచాళుక్యవంశీయులే. మొదటిసారిగ మూడుశతాబ్దులపైబడి అవిచ్ఛిన్నముగ సాగుచున్న రాజవంశములో విచ్ఛిత్తి యేర్పడినది. తెలుగుచోడవంశీయుడైన జటాచోడభీముడు వేంగిసింహాసనస్థుడైనాడు. తూర్పు చాళుక్య శాసనములు జటాచోడభీముని యేలుబడిని విస్మరించి, ఆకాలమును అరాజకత్వముగ అభివర్ణించుచున్నవి.

జటాచోడభీముడు క్రీ. శ. 973 నుండి 1001 వరకు రాజ్యమేలెను. అతని యేకైకశాసనమునుబట్టి, (14) అతడు అంగ కళింగ వైడుంబ ద్రవిడ ప్రభువులను జయించి మహేంద్రగిరినుండి కంచి వరకుగల సువిశాలరాజ్యమును గుణగవిజయాదిత్యునివలె పరిపాలించినట్లు తెలియుచున్నది. అతడు సగర్వముగ గుణగవిజయాదిత్యుని దౌహిత్రవర్గమునకు చెందినట్లు చెప్పుకొనెను.

(14) E I XXI, 32

దానార్ణవుని పుత్రులైన - విమలాదిత్యునకు, శక్తివర్మకు చోళచక్రవర్తియైన రాజరాజు I ఆశ్రయమిచ్చియుండెను. ఈ ఆశ్రయ ప్రదానములో రాజనీతి అంతర్గర్భితము. రాజరాజు విమలాదిత్యునకు తన పుత్రికయైన 'కుందవై' నిచ్చి వివాహము సల్పి, వేంగిమండలముపై దండెత్తుటకు తరుణమునకై వేచియుండెను.

రాజరాజు పదునాల్గవ రాజ్యసంవత్సరము (క్రీ. శ. 999-1000) నాటి శాసనములాతని వేంగివిజయమును ప్రస్తావించుచున్నవి.

జటాచోడభీముడు క్రీ. శ. 1001 సంవత్సరమున తొండై మండలముపై దండెత్తెను. దీనినిబట్టి క్రీ. శ. 1001 వరకు జటాచోడ భీమునిపై చోళులకు సంపూర్ణవిజయము లభించియుండలేదనుట స్పష్టము.

రాజరాజు తూర్పుచాళుక్యరాజ్యపుత్రుడైన శక్తివర్మ [అల్లుని అన్నగారు] పక్షమున వేంగిపై క్రీ. శ. 999 ప్రాంతమున దండెత్తెను. శక్తివర్మశాసనములలో చోళసాహాయ్యమును గూర్చిన ప్రస్తావనయే లేకపోవుట వింత. ఆతనిశాసనములనుబట్టి తెలియనగు అంశములు : శక్తివర్మ వేంగిపై దండెత్తెను. జటాచోడభీమునిసేనాని ఏకవీరుడు ఆతని యెదిరించి యుద్ధనిహతుడయ్యెను.

పిమ్మట మహారాజు - బద్దెన ప్రభువులు శక్తివర్మ నెదిరించి ఓడిపోయిరి. జటాచోడభీముడు వేంగిమండలమునువదలి కళింగారణ్యములలో తలదాచుకొనవలసి వచ్చినది. శక్తివర్మ వేంగిమండలమును ప్రవేశించి సింహాసనము నధిష్ఠించెను.

ఇదిప్రథమఘట్టము కావచ్చును. శక్తివర్మ సింహాసనస్థుడు కాగానే చోళసేనలు మరలియుండును. జటాచోడభీముడు వేంగిమండలము నాక్రమించి, తొండైమండలముపై దండెత్తెను. ఆతడు కంచిని ముట్టడించి (క్రీ. శ. 1000 - 2) ఆక్రమించెను. రాజరాజు, స్వయముగా

సేనలకు నాయకత్వము వహించి తొండైమండలమునుండి జటాచోడ భీముని పారద్రోలి, వేంగిమండలముపైదండెత్తి ఉత్తరకళింగమువరకు విజృంభించెను. జటాచోడభీముడు యుద్ధనిహతుడయ్యెను. తిరిగి శక్తివర్మ I వేంగిసింహాసనస్థుడయ్యెను.

## మొదటి శక్తివర్మ

### క్రీ. శ. 1000 నుండి 1011 వరకు

మొదటి శక్తివర్మ వేంగికి రాజైనది స్వశక్తివలనగాదు. చోళ రాజ సాహాయ్యమువలననే. అందుచే వేంగిమండలము చోళసామ్రాజ్యమునకు అనుబంధరాజ్యమైనది. రాజనీతితో మాత్రమేగాక ఈ చోళ చాళుక్యానుబంధము - వైవాహికబంధముతో ముడివడినది. శక్తివర్మ సంతానరహితుడు. యువరాజైన విమలాదిత్యుడు చోళచక్రవర్తి అల్లుడు. దక్షిణాపథమున అధిపత్యమునకై ఉఱ్ఱూతలూగుచున్న చోళులతో వేంగిమండలము చేరుట రాష్ట్రకూటుల అనంతరము ఆప్రదేశము నాక్రమించిన కల్యాణిచాళుక్యులకు అభిమతముగాదు. అందుచే వేంగి మండలము అప్పటినుండి సుమారు 135 సంవత్సరములవరకు దక్షిణాపథరాజకీయముల సంకులసమరమునకు రంగభూమియైనది.

క్రీ. శ. 1006 సంవత్సరమున రెండవతైలపదేవుని పుత్రుడైన సత్తిగుడు (సత్యాశ్రయుడు) వేంగిపై దండయాత్రనెరపెను. చాయల నంబి సేనాని ఆదండయాత్రకు అధిపత్యమువహించి ధరణికోట, యనమదలదుర్గముల అగ్నిదగ్ధమొనర్చి గుంటూరు మండలమునందలి చేబ్రోలువద్ద విడిసెను. క్రీ. శ. 1007 సంవత్సరమున రాజేంద్రచోళ దేవుడు I, కర్ణాటకదండయాత్ర కుపక్రమించెను. స్వదేశరక్షణకై కర్ణాటకసేనలు వేంగిని వీడునట్లుచేయుట యీ దండయాత్రయొక్క అంతర్యము కావచ్చును. ఎట్లైన శక్తివర్మ వేంగిని క్రీ. శ. 1011వరకు పరిపాలించి దివంగతుడయ్యెను.

## విమలాదిత్యుడు

శక్తివర్మ తరువాత క్రీ. శ. 1011 నుండి 1018 వరకు అతని తమ్ముడు విమలాదిత్యుడు వేంగిరాజ్యమును పరిపాలించెను. విమలాదిత్యునకు ఇరువురుభార్యలు. ప్రథమభార్య చోళరాజు రాజరాజు పుత్రిక కుందవైదేవి. రెండవభార్య మేలమ. ఈమె బహుశః జటాచోడభీముని పుత్రిక. రణస్థపూండి శాసనమున విమలాదిత్యుడు, పరమబ్రహ్మణ్యుడు పరమ మాహేశ్వరుడుగ అభివర్ణితుడు. రామతీర్థ శిలాశాసనమున (తిథివార వత్సరరహితమైనది) అతడు తనగురువగు త్రికాలయోగిసిద్ధాంతదేవుడను జైనయోగీశ్వరునకు దానము చేసినట్లున్నది. దీనివలన విమలాదిత్యుడు అవసానకాలమున సింహాసనము నుజ్జగించి జైనమతమును స్వీకరించెనని కొందరు తలపోయు చున్నారు.

విమలాదిత్యునకు ఇరువురుపుత్రులు. కుందవై సుతుడు రాజరాజు. మేలాంబ సుతుడు విజయాదిత్యుడు.

క్రీ. శ. 1018 సంవత్సరమున, విమలాదిత్యుని అనంతరము వేంగిసింహాసనమున నధిష్ఠించుటకు రాజపుత్రులలో అంతఃకలహమేర్పడినది. మేలాంబసుతుడైన విజయాదిత్యుడు, కల్యాణిప్రభువైన రెండవ జయసింహుని సాయమున రాజరాజును పారద్రోలి వేంగీసింహాసనము నాక్రమించెను. రాజరాజు మేనమామయైన రాజేంద్ర చోళుని సాయమర్థించెను. రాజరాజు, రాజేంద్రచోళుని పుత్రిక అమ్మంగదేవిని వివాహమాడియుండెను. రాజేంద్రచోళుడు అల్లునకు సాయమొనర్చుటకై సోళియవరసు సేనానిని చోళసైన్యముతో వేంగికి పంపించెను. అంతేగాక రెండవజయసింహుడు విజయాదిత్యునకు సాయమొనర్పకుండుటకై రట్టపాడిపై మరియొకచోళసేనానిని సైన్యముతో దండయాత్రనెరపుటకు పంపెను. సోళియవరసు వేంగీదండ

యాత్రలో విజయపరంపరలను సాధించి, విజయాదిత్యునోడించి, గంగాతీరమువరకుచొచ్చుకొనిపోయెను. సోళియవరను గంగాతీరమున కేగునరికి, ఓడిపోయిన కళింగులు తిరిగి విజృంభింపసాగిరి. రెండవ జయసింహుడు వారిని తిరుగుబాటుకు ప్రోత్సహించియుండును. అప్పుడు రాజేంద్రుడే స్వయముగా చోళసేనలకు నాయకత్వము వహించి సోళియవరసుకు తోడ్పడుటకు గోదావరీతీరమును చేరుకొని అక్కడదండు విడిసెను. కళింగులు ఓడిపోయిరి. సోళియవరసుదిగ్విజయ యాత్ర ముగించుకొని గంగాతీరమునుండి గోదావరీ తీరమును చేరెను. క్రీ. శ. 1022 ఆగష్టు 16 వ తేదీన రాజరాజనరేంద్రుడు పట్టాభిషిక్తుడయ్యెను. (15)

## రాజరాజనరేంద్రుడు

### క్రీ. శ. 1018 - 22 నుండి 1062

రాజరాజనరేంద్రుని రాజ్యపరిపాలన అంతర్యుద్ధముతో ఆరంభించినది. చోళుల సాయమున తండ్రి అనంతరము నాలుగేండ్లకు పట్టాభిషిక్తుడు కాగలిగినను, పట్టాభిషిక్తుడైన పిమ్మటగూడ అతనికి శాంతి భద్రతలు చేకూరలేదు. అతడు రాజ్యపరిపాలనచేసిన నాలుగుదశాబ్దులు అంతర్యుద్ధములతో ఎత్తుపైయెత్తుల రాజనీతిప్రయోగములతో, నాటకీయసన్నివేశములతో గడచినవి. నన్నయమహాకవి, "ఘోరాజిముఖోపలబ్ధ విజయ ప్రమదాశ్రిత బాహుదండ" అని ప్రస్తుతించెను. అతడనేకయుద్ధముల ఆరితేరిన వృద్ధమూర్తియై బ్రదికెననుట సత్యము. ఘోరాజిముఖగ్రస్తమైన దాతని జీవితము. ఆయన విజయప్రమద - ఎల్లప్పుడు ఆతని బాహుదండమునే వరించినదని చెప్పుట సాహిత్యము గాని చరిత్రమాత్రముగాదు.

---

(15) ఈ గ్రంథమునందీ విషయము "చోళులు" అను అధ్యాయమునందు సవిస్తరముగా గలదు.

రాజరాజనరేంద్రుడు పట్టాభిషిక్తుడై రాజ్యపరిపాలన చేయుచున్న సమయమున దాయాదియైన విజయాదిత్యుడు పగసాధించుటకు యత్నించునే యుండెను.

క్రీ. శ. 1031, జూన్ 27 వ తేదీన విజయవాడలో విజయాదిత్యుడు పట్టాభిషిక్తుడయ్యెను. అతడెట్లు రాజరాజనరేంద్రుని జయింప గల్గెనో తెలియరాకున్నది. అతనికి పశ్చిమచాళుక్యుల సాయము లభించియుండునని ఊహింపనగును. అతడెన్నినాళ్ళీవిధముగ రాజ్యమొనర్చినది నిష్కర్షగ చెప్పలేము. రాజరాజనరేంద్రుని భీమవర శాసనమునుబట్టి క్రీ. శ. 1035 నాటికి ఆతడు తిరిగి విజయాదిత్యుని పారద్రోలి వేంగినాక్రమించెనని తేలుచున్నది. (16) విజయాదిత్యుడు ప్రవాసియై కల్యాణిచాళుక్యులనాశ్రయించెను. వారాతనిని మిక్కిలి గౌరవప్రపత్తులతో ఆదరించిరి.

క్రీ. శ. 1042 లో పశ్చిమచాళుక్యులు వేంగిపైదండెత్తిరి. కల్యాణిప్రభువు, మొదటి సోమేశ్వరుడు ఆహవమల్లబిరుదాంకుడు ఆరంభించిన దిగ్విజయయాత్రలో వేంగిమండలము చిక్కుకొన్నది. ఆ వార్త చోళరాజధాని గంగాపురిని సత్వరము చేరినది. రాజరాజ నరేంద్రుడు చోళుల సాయమర్థించుటకు చోళరాజధానికి స్వయముగా నేతెంచెను. చోళరాజేంద్రుడు వయోవృద్ధుడు. రాజపుత్రులు దక్షిణ దండయాత్రలో నిమగ్నులై యుండిరి. అయినను రాజేంద్రుడు, రాజరాజనరేంద్రునికి తోడ్పడుటకై చోళసైన్యమును వేంగికి పుత్తెంచెను. బ్రాహ్మణసేనాని రాజరాజ బ్రహ్మమహారాజు, ఉత్తమచోడమిలాడుడైయాన్ ఉత్తమచోడ చోడకోన్. చోళసేనాపతులు చోళసైన్యమున కాధిపత్యము వహించిరి. వేంగికి సమీపముననున్న "కలిదిండి" వద్ద ఉభయపక్షములకు ఘోరసంగ్రామము జరిగినది. ఉభయపక్షముల

(16) 482 k of 1873
C. P No 5 of 1937 - A R E 1937 - 8

సేనానులు మడిసిరి. విజయమేపక్షమునకు లభింపలేదని చెప్పవచ్చును. అది సమయుద్ధముగా పరిణమించినది. రాజరాజనరేంద్రుడు కలిదిండి దగ్గర జరిగిన అపారమైన ప్రాణనష్టమునకు పరిహారముగ అచ్చట నూటయెనిమిది శివాయతనములను కట్టించినట్లు అతని కలిదిండి శాసనమువలన తెలియనగును. (17)

ఆసమయమున రాజేంద్రుడు మరణించుట, రాజాధిరాజు చోళసింహాసనమధిష్ఠించుట జరిగినది. క్రీ. శ. 1045 నాటి రాజాధిరాజు శాసనములలో ఆహవమల్ల సోమేశ్వరునితో ఆతడు సల్పిన యుద్ధముల ప్రస్తావన గలదు. పశ్చిమచాళుక్యులకు చోళులకు మధ్య జరిగిన యుద్ధములకు రంగభూమి వేంగియైనది. రాజాధిరాజు స్వయముగా చోళసైన్యములను నడిపి, ధాన్యకటకమువద్ద జరిగిన ఘోరసంగ్రామములో పశ్చిమచాళుక్యదండనాథులు గండప్పయ్య గంగాధరులను సంహరించినట్లును, విక్కి (విక్రమాదిత్యుడు) విజయాదిత్యుడు పలాయనముసాగించినట్లును శాసనము కథనము. రాజాధిరాజు వేంగినుండి పశ్చిమచాళుక్యరాజ్యముపై దండెత్తి, కొల్లిపాకదుర్గమును విధ్వంసమొనర్చెను. (18)

కాని - ఇంతటితో రాజరాజనరేంద్రునకు శాంతి లభింపలేదు. రాజాధిరాజు నిష్క్రమించిన పిమ్మట, పశ్చిమ చాళుక్యులు వేంగిపై

---

(17) కల్యాణిచాళుక్యులు - (సోమేశ్వరుడు) అధ్యాయమును అనుశీలింపనగును.
"రాజరాజనరేంద్రుడు"-శ్రీభావరాజు వేంకటకృష్ణరావుగారు. ఆ గ్రంథమునకు అనుబంధముగ కలిదిండి శాసనము కానవగును.

(18) కొల్లిపాకపశ్చిమచాళుక్యచోళపూర్వచాళుక్యరాజ్యములకు మయ్యేలిగుట్ట.

దండెత్తిరి. క్రీ. శ. 1047 నాటి శాసనము అహవమల్లుని వేంగి విజయమును చాటుచున్నది. అతడు వేంగిని కళింగమును జయించెనని శాసనకథనము. అతని అగ్రసుతుడు భువనైకమల్ల సోమేశ్వరుడు క్రీ. శ. 1049 నుండి 1054 సంవత్సరములనాటి పలుశాసనములలో వేంగి పురవరేశ్వర బిరుదాంకితుడు. క్రీ. శ. 1055 లో చక్రవర్తి త్రైలోక్యమల్లదేవరకుం బ్రధాని నారాయణభట్టు కూతురు కుపమ వేయించిన శాసనము ద్రాక్షారామమున గలదు. పశ్చిమచాళుక్యుల వేంగి ఆధిపత్యము చోళశాసనము గూడ బలపరచుచున్నది. వీరరాజేంద్రుని కన్యాకుమారి చార్ల శాసనములలో, కళింగ వేంగిరాజ్యములో అతని అగ్రజుడు వీడుటచే శత్రువుల అధీనములో నున్నట్లు చెప్పబడినది. (19) అయినను, వేంగి సింహాసనమును రాజరాజనరేంద్రుడే ఆకాలమున అధిష్ఠించి యుండుటచే అతడు పశ్చిమచాళుక్యుల సార్వభౌమత్వము నంగీకరించి సంధిచేసికొని యుండునని తోచుచున్నది.

నారాయణభట్టు-పశ్చిమచాళుక్యుల రాయబారి, రాజమహేంద్రవరమున రాజరాజనరేంద్రుని ఆస్థానమున వసించెను. క్రీ. శ. 1049, 50 సంవత్సరములలో తంజావూరు మండలమునందలి తిరువైయారు నందలి శివాలయమునకు రాజరాజు దానశాసనము గలదు. ఆ సమయమున, రాజరాజు పశ్చిమచాళుక్యులాక్రమించిన వేంగినుండి ప్రవాసియై చోళుల సాయము నర్థించుటకు వచ్చియుండును. కాని, అప్పటి చోళరాజు రాజాధిరాజు అతనికి సాయమొనర్చుటకు సంసిద్ధుడు గాలేదు. రాజాధిరాజేల వేంగిమండలముపై అనాదృతి వహించి, రాజరాజునకేల సాయమొనర్పలేదో తెలియరాదు. రాజరాజు చేయునది లేక వేంగికి మరచివచ్చి పశ్చిమచాళుక్యులతో సంధి చేసికొని వారి ఆధిపత్యము నంగీకరించెను. అప్పటికి రాజరాజనరేంద్రుడు వయో

(19) E I XXV, 262

వృద్ధుడు. జీవితములోని మిట్టపల్లములను ఆకళించుకొని మానవ హృదయమును క్షీరసాగరమువలె మథించిన అనుభవసంపన్నుడు. అతనిని మహాభారతేతిహాసము ఆకర్షించుటలో వింతలేదు. రాజరాజ విజయాదిత్యుల దాయాది వైరము వేంగిమండలమును ముప్పది సంవత్సరములు కురుక్షేత్రముగా మార్చినది. ఎన్నెన్ని వింతమార్పులు! జగన్నాటకము భారతములో ప్రతిఫలించివిశ్వజనీనముగ సాక్షాత్కరించు చుండును. అందుచే రాజరాజనరేంద్రుడు తన ఆస్థానకవియైన నన్నయభట్టును తెలుగులో - మహాభారతమును రచింపుమనికోరెను. నారాయణభట్టు, నన్నయభట్టు సహాధ్యాయి, ఆమహాసారస్వత యజ్ఞమున, నరునకు నారాయణుని వలె తోడ్పడెను. (20) క్రీ. శ. 4-11-1051 తేదీన సర్వకరపరిహారముగ నందంపూడి అగ్రహారమును రాజరాజనరేంద్రుడు సూర్యగ్రహణ సమయమున దానము చేసెను. ఆదానశాసనమున నారాయణభట్టు "జగదుపకరణుగ" అభినుతుడు.

పశ్చిమచాళుక్యులకు రాజరాజనరేంద్రునకు మధ్యవర్తులైన సంధిసంధాతలలో సహాధ్యాయులైన నారాయణభట్టు నన్నయభట్టు వహించిన పాత్ర భావి చారిత్రక పరిశోధనలవలన తేలవలసిన విషయము.

వంశక్రమానుగతమైన రాజనీతి నుజ్జగించి, చోళరాజు రాజాధిరాజు రాజరాజనరేంద్రునకు తోడ్పడకుండుట వింత. అంతేగాక చిరకాలము నుండి పశ్చిమచాళుక్యులు విజయాదిత్యునికి ఆశ్రయప్రదాతలై అతని పక్షము వహించి పోరాడినవారు. వారెట్లు విజయాదిత్యుని ఉజ్జగించి రాజరాజు వేంగి సింహాసనస్థుడై యుండుట కంగీకరించిరో! అది వింతలలో వింత. అయినను హేతు హేతుమద్భావము యోజించినచో

(20) ఆంధ్రమహాభారత పీఠిక.

కన్పించును. పశ్చిమచాళుక్యులు - చోళులు నిరంతరయుద్ధనిమగ్నులై యుండిరి. చోళులకు వేంగి నష్టదాయకమైన పెనుబరువయ్యెను. వేంగిని తాత్కాలికముగనైన తమపక్షమునకు త్రిప్పుకొన్నచో పశ్చిమ చాళుక్యులకు లాభమే. క్రీ. శ. 1061 లో రాజరాజనరేంద్రుడు మరణించెను. ఆ అవకాశమును జారవిడువక, దాయాదియైన విజయాదిత్యుడు వేంగిసింహాసనము నాక్రమించెను. రాజరాజనరేంద్రునకు చోళరాజ పుత్రిక అమ్మంగదేవికి పుట్టిన పుత్రుడు రాజేంద్రుడున్నాడు. అతడు గూడ చోళరాజపుత్రికను వివాహమాడియుండెను. చోళులప్పుడాతనికి సాయమొనరింపలేదు. విజయాదిత్యుడు వేంగి సింహాసనమును తానధిష్ఠింపక తన యేకైకసుతుడైన రెండవ శక్తివర్మకు పట్టాభిషేకమునల్పెను. ఈ చర్యకు కేవలము పుత్రప్రేమయే కారణము కాజాలదు. విజయాదిత్యుడు ఇంతకాలము పశ్చిమ చాళుక్యుల ఆశ్రయము నందే గడపెను. చోళులు నొలంబవాడిపై పలుసారులు దండెత్తుచుండిరి. చోళులనెదిరించి, నొలంబవాడిని రక్షించుటకు అనుభవజ్ఞుడు సమర్థుడు విశ్వసనీయుడునైన వీరుడు కావలెను. సోమేశ్వరుడు విజయాదిత్యుని 'నొలంబవాడి'కి పరిపాలకుడుగ నియమించియుండెను. అందుచే విజయాదిత్యుడు రెండవశక్తి వర్మను వేంగిసింహాసనమందుంచి తాను నొలంబివాడి సంరక్షణార్థమేగెను.

శక్తివర్మ పరిపాలన సుమారు సంవత్సరము మాత్రమే సాగినది. అతడు అభిమన్యునివలె వీరస్వర్గమలంకరించెను. (21)

వీరరాజేంద్రుడు క్రీ. శ. 1063 సంవత్సరమున తన రెండవ రాజ్యసంవత్సరమున వేసిన శాసనములలో విక్రమాదిత్యుడు వేంగిపై బంపినసేనల నోడించిన ఉదంతము గలదు. (22) క్రీ. శ. 1063 కు

---

(21) ర్యాలి తామ్రశాసనము C. P. 8 of 1924 - 5

(22) E. C. VII ట 18

పూర్వమీా సంగ్రామము జరిగియుండవలె. ఆ సంగ్రామమున వీరరాజేంద్రుడు చాళుక్యసేనాని చాముండరాయని సంహరించినట్లు చెప్పుకొనినాడు. ఆసేనాని ముద్దుకూతురు నాగల ముక్కుకోసి వినోదించినాడు. కాని ఈ విజయము సుస్థిరమైనదికాదు. విజయాదిత్యుడు చోళరాజ్యము దండెత్తినాడు. (23) అతడు కూడల్ సంగమము చేరునప్పటికి వీరరాజేంద్రుని సేనలు వేంగిని వీడి స్వరాజ్య సంరక్షణ కేతెంచినవి.

## సప్తమ విజయాదిత్యుడు

## [క్రీ. శ. 1018, 31, 61 - 75]

విష్ణువర్ధన [సప్తమ] విజయాదిత్యుడు విమలాదిత్యుని పుత్రుడు. అభిమన్యునివలె వీరస్వర్గమలంకరించిన శక్తివర్మ II మరణసమయమున అర్జునునివలె విజయాదిత్యుడు పుత్రుని సమీాపమందులేక, స్థలాంతరమున శత్రువులతో పోరాడుచుండెను. పుత్రశోకార్తుడైనను, బంధుమిత్రుల ప్రోత్సాహమువలన అతడు క్రీ. శ. 1061 లో వేంగిరాజ్య పాలనా భారమును వహింపక తప్పినదిగాదు.

క్రీ. శ. 1018 సంవత్సరమున పితృమరణానంతరము విజయాదిత్యుడు రాజరాజనరేంద్రుని [సవతిసోదరుని] పారద్రోలి వేంగీ సింహాసనము నధిష్ఠించెను. కాని అచిరకాలముననే పదచ్యుతుడయ్యెను. క్రీ. శ. 1031 లో తిరిగి పట్టాభిషిక్తుడయ్యెను గాని తిరిగి పదచ్యుతి తప్పలేదు. చాలకాలమాతడు కళ్యాణీచాళుక్యుల నాశ్రయించి ప్రవాస జీవితమును గడపెను. కార్యఖడ్గ నిపుణుడైన సోమేశ్వరుడాతని ఆదరించి, రాజకుమారపదవి ప్రసాదించి, తన అంకకారశ్రేష్ఠునిగా

(23) **Colas i** 318 - 19 నీలకంఠశాస్త్రి.

మన్నించి పుత్రనిర్విశేషునిగ చూచెను. (24) క్రీ. శ. 1063 ప్రాంతమున అతడు నొలంబవాడికి పరిపాలకుడుగ నియుక్తుడై పశ్చిమచాళుక్య సామ్రాజ్య సంరక్షణభారమును వహించెను. మైసూరురాష్ట్రమున మూదుకకెరె శాసనము అతడు చోళులపై సాధించిన విజయముల పేర్కొనుచున్నది. (25) చోళులు కులక్రమానుగతమైన వైరము వీడక వేంగిపై తమ ఆధిపత్యమునెలకొల్పుటకు మరియొకప్రయత్నము చేయకపోలేదు. రెండవరాజేంద్రుని తరువాత చోళసింహాసన మధిష్ఠించిన అతని అవరజుడు వీరరాజేంద్రుడు వేంగిపై దండయాత్ర కుపక్రమించవచ్చును. అందుచే సోమేశ్వరుడు ధారాపురజననాధుని ఆధిపత్యమున బెజవాడలో సేనల నిలిపి క్రీ. శ. 1064 లో విజయాదిత్యుని దక్షిణదండయాత్రకు పంపెను. విజయాదిత్యుడు దక్షిణ దండయాత్రలలో నుండగ సోమేశ్వరుడు దివంగతుడయ్యెను. సోమేశ్వరుని మరణము దక్షిణాపథమునందలి రాజనీతిలో విప్లవాత్మక మైన విపరిణామములకు దారితీసినది. (26) సోమేశ్వరుని రెండవ కుమారుడు విక్రమాదిత్యుడు అన్నగారిని త్రోసిరాజని తానే సింహాసన మాక్రమించుట కుద్యుక్తుడయ్యెను. చోళచక్రవర్తి వీరరాజేంద్రుడాతనికి తన పుత్రిక నిచ్చి వివాహమునల్పి సంధిచేసికొనెను.

విజయాదిత్యుడు విషమపరిస్థితిలో చిక్కుకొనెను. విక్రమాదిత్యుని మూలమున విజయాదిత్యుడు చోళసామంతుడుగ వేంగిని పరిపాలించ

---

(24) పశ్చిమ చాళుక్య శాసనములు విజయాదిత్యుని సోమేశ్వరుని (మగ) పుత్రునిగ వ్రాకుచ్చుచున్నవి. సామంతులు చక్రవర్తికి పుత్రనిర్విశేషములనుట ఆనాటి సంప్రదాయము.

(25) E C VII Cl 18

(26) ఈ విషయము "చోళులు" అను అధ్యాయమున సవిస్తరముగ వివరింపబడినది.

వలసి వచ్చినది. పాపము! రాజేంద్రుడు తరువాత కులోత్తుంగుడు (= రాజరాజనరేంద్రుని పుత్రుడు) ఎదురుచూచుచున్న ఛాళ సాహాయ్యము లభింపక హతాశుడయ్యెను.

క్రీ. శ. 1070 సంవత్సరమున వీరరాజేంద్రుడు దివంగతుడగుట అతని సుతుడు అధిరాజేంద్రుడు కొన్నినెలలలో దుర్మరణము పాలగుట సుప్రసిద్ధ చారిత్రాంశములు. విక్రమాదిత్యుడు బావమరదియైన అధిరాజేంద్రుని రక్షింపలేక పోయెను. ఆ విప్లవపరిస్థితిలో రాజేంద్రుడు [రాజరాజనరేంద్రుని పుత్రుడు చోళరాజదౌహిత్రుడు- చోళులఅల్లుడు] మాతామహరాజ్యమునకై చోళసింహాసనస్థుడై కుళోత్తుంగనామముతో చోళచరిత్రలో నూతనశకమునారంభించెను. వేంగిమండలమున విజయాదిత్యుని చరిత్ర సుస్పష్టముగ తెలియవచ్చుటలేదు. అతని శాసనములు క్రీ. శ. 1063 నుండి 1068 వరకును కన్పించుచున్నవి. పైన క్రీ. శ. 1072 వరకు అతనిశాసనములు మృగ్యములు.

రాజేంద్రుని [=కులోత్తుంగుని] తామ్రశాసనములబట్టి రాజేంద్ర విజయాదిత్యుల చరిత్ర ననుసంధింపవచ్చును. కులోత్తుంగుడు తన శాసనములలో తండ్రిమరణానంతరము తాను వేంగిసింహాసనస్థుడై యున్నట్లు తాను మాతామహరాజ్యాధినేతయైనపిమ్మట పైతృకరాజ్యమైన వేంగిని పితృవ్యుడైన విజయాదిత్యునకు సమర్పించినట్లును చెప్పుకొన్నాడు. సమకాలీన చారిత్రకాధారములను బట్టి ఏర్పరచదగిన అంశములు ;-

వీరరాజేంద్రుడు- విక్రమాదిత్యునకు ఏర్పడిన నూత్నబాంధవ్యమువలన విజయాదిత్యుడు వేంగిపాలకుడైనాడు. కాని రాజేంద్రుడు వేంగినాక్రమించుటచే విజయాదిత్యుడీసారి తూర్పుగాంగరాజధానికి పోయి రాజరాజదేవేంద్రవర్మ నాశ్రయించి తలదాచుకొనెను. [యథాపూర్వము కల్యాణిచాళుక్యుల నాశ్రయించుటకు వీలులేదుగద]

కళింగాధిపతియైన రాజరాజు, రాజేంద్రుడు చోళదేశమునకేగినప్పుడు, విజయాదిత్యుని పక్షము వహించి వేంగిపై దండెత్తెను. చోళసామంతుడైన ఆతనికి స్వాతంత్ర్యము వహించుటకిది మంచితరుణము. విప్లవ పరిస్థితులలో చోళసామ్రాజ్యసింహాసనమధిష్ఠించిన రాజేంద్రుడు సంధి చేసికొనుట సమంజసమని తలపోసెను.

సంధికుదిరినది. విజయాదిత్యుడు వేంగిని పరిపాలించుటకు రాజేంద్రుడు సమ్మతించెను. విజయాదిత్యుడు ఆరాజ్యమునకు వారసుడు. అపుత్రకుడు. పండినముదివగ్గు. పినతండ్రియైన ఆతడు మరణించగనే తనకే తిరిగి వేంగిరాజ్యము సంక్రమించునని అది తనకు లాభదాయకమని రాజేంద్రుడు తలపోసెనని యెంచవచ్చును.

కళింగప్రభువు, రాజరాజదేవేంద్రవర్మ స్వతంత్రప్రతిపత్తిని రాజేంద్రుడంగీకరించి, శత్రువును మిత్రునిగా మార్చుకొని ఆతనికి తన పుత్రికయైన రాజసుందరినిచ్చి వివాహమొనరించెను. ఈ రాజనీతి వలన ఆతనికి వేంగికళింగములు మిత్రరాజ్యములైనవి. విప్లవపరిస్థితిలో చోళసింహాసనమధిష్ఠించిన రాజేంద్రుడు ప్రబలశత్రువైన విక్రమాదిత్యునిపై తనబలము కేంద్రీకరించుటకు వీలుగల్గినది - రాజరాజదేవేంద్రవర్మకు పుత్రికనిచ్చి, రాజేంద్రుడాతని విజయాదిత్యుని నుండి వేరు చేయగలిగినాడు. కాలానుకూల్యమునుబట్టి భవిష్యత్కాలమున రాజేంద్రుడు తన పగ సాధించుకొననగును. (27)

విజయాదిత్యుని పరిపాలన వేంగిలో సుస్థిరముగ కొనసాగలేదు. క్రి. శ. 1072, 1073 నాటి శాసనములాతని వేంగిప్రభువుగ పేర్కొనుచున్నవి. ఆపైన అతనిశాసనములు వేంగిమండలమున కాన

(27) ఏతత్ పరిణామములచరిత్ర కులోత్తుంగుని చరిత్రలో ఈ గ్రంథముననే చూడనగును.

రావు. అందుచే విజయాదిత్యుడు తిరిగి పదచ్యుతుడైనట్లు ఎంచనగును. ఈ అభిప్రాయమునకు అనుగుణమైన అంశములుగలవు.

క్రీ. శ. 1073 సంవత్సరమున చేదిప్రభువు యశఃకర్ణదేవుడు వేంగిపై దండెత్తెను. ఆంధ్రదేశాధీశ్వరుని జయించి, ఆతడు ద్రాక్షారామ భీమేశ్వరు సువర్ణదానములతో అర్చించెను (28) అదేవిధముగ బాణ పతి- రాజరాజదేవేంద్రవర్మ సేనాని వేంగీశ్వరుని పలుసారులు జయించి నట్లు క్రీ. శ. 1075 నాటి దీర్ఘాసి శాసనమున గలదు.

తానై సింహాసనమున నిలిపిన విజయాదిత్యునిపై రాజరాజు దేవేంద్రవర్మ యేల దండెత్తెనో తెలియదు. ఏమైన తత్ఫలితముగ విజయాదిత్యుడు వేంగీరాజ్యమును కోల్పోవుట సంభవించినది.

క్రీ. శ. 1075 నాటి పశ్చిమచాళుక్య శాసనములలో విజయా దిత్యుడు, భువనైకమల్ల బిరుదాంకితుడైన రెండవ సోమేశ్వరుని సామంతుడుగ గన్పించుచున్నాడు.

ఆతడు ధరించిన బిరుదములబట్టి అప్పుడాతడు తిరిగి నొలంబ వాడికి పాలకుడయ్యెనని యెంచనగును. పిఠాపురం, నెల్లూరు మున్నగు శాసనములలో ఆతడు వేంగిని 15 సంవత్సరములు పరిపాలించినట్లు చెప్పుటచే విజయాదిత్యుడు క్రీ. శ. 1075 ప్రాంతమున దివంగతు డయ్యెనని యెంచవచ్చును. అతనితో తూర్పుచాళుక్య రాజ్యము అస్తమించినట్లే. యథార్థముగ తూర్పుచాళుక్య రాజన్యుల వంగడమే చాలకాలము చోళసామ్రాజ్యము నేలినది. కులోత్తుంగచోళుడు రాజరాజనరేంద్రుని పుత్రుడే. అయినను, కులోత్తుంగుని వంశీయులు తాము చాళుక్యులమనుమాట మరచిపోవుటయేగాక చోళులమని చాటుకొని, ఆ వైభవప్రాభవములతో మురిసిపోయిరి.

---

(28) E I XII 216

విజయాదిత్యునకు ఇద్దరు భార్యలు. హైహయ రాజపుత్రిక మాదవదేవి రెండవశక్తివర్మ తల్లి. రాణిరేవల ద్రాక్షారామశాసనమున కన్పించుచున్నది. (క్రీ. శ. 1065), ఆమెకూతురు సోమల. విజయాదిత్యుడు, సూర్యవంశోద్భవుడైన ముమ్మడి భీముని పుత్రనిర్విశేమునిగ పెంచి పెద్దచేసెను. కులోత్తుంగుని పుత్రుడు (రెండవ) రాజరాజు వేంగికి రాజప్రతినిధిగ నున్నప్పుడు, విజయాదిత్యుని అభిమాన పుత్రుడైన ముమ్మడి భీముడు పేరు ప్రఖ్యాతుల నార్జించి, గాంగ, కళింగ కుంతల ప్రభువులపై జరిగిన యుద్ధములలో విజయపరంపరల నొనగూర్చెను.

## తూర్పు చాళుక్యుల కాలము

### ప్రభుత్వము : సంఘవృత్తములు

శాసనములు రాజ్యాంగమున సప్తాంగములను అష్టాదశతీర్థము* లను పేర్కొనుచున్నవి. రాజు రాజ్యమున సర్వాధికారి. మంత్రి పురోహిత, సేనాపతి యువరాజ దౌవారిక ప్రధానదండపాల ప్రభృతి పదవులు అష్టాదశతీర్థములలో చేరును. మేడమార్యుని వీరచోడుడు సేనాపతిగ నియమించినపుడు,రాజాతని శిరమున ఉష్ణీషమును కైసేసెను. అమ్మరాజుపట్టువర్ధనివంశీయులు తరతరములుగ"నియోగాధికృతులుగ" నున్నట్లు ఒకశాసనమున పేర్కొనెను. సమకాలీనదేవాలయములలో డెబ్బదిరెండు నియోగములుండెడివి. రాజప్రసాదము - దేవాలయము పరిపాలనా నిర్వహణమున సమాంతరములు.

విషయము కోట్టము సీమలకు పేరులు. కర్మరాష్ట్రము - కమ్మనాడువిషయము బోయకోట్టము ఉదాహరణ ప్రాయములు. వేగివిషయము సుప్రసిద్ధము - "శ్రీవేగివిషయాధీశ" నన్నయ భారత

---

* తీర్థములు = పదవులు

ప్రయోగము. గ్రామేయకులు మన్నెయులు రాష్ట్రకూట ప్రముఖులు రాజోద్యోగులు.

రాజు కొలువుకూటము రాజ్యమునకు కేంద్రము. సాంస్కృతిక గరిమనాభి. రాజరాజనరేంద్రుని కొలువుకూటము నన్నయపరిభాషలో "సకలభువనలక్ష్మీవిలాస నివాసంబైన రమ్య హర్మ్యతలంబున, మంత్రిపురోహితసేనాపతి దండనాయక దౌవారిక మహాప్రధానానంత సామంత విలాసినీ పరివృత"మైనది. అందు "అపారశబ్దశాస్త్రపారగులైన వైయాకరణులును, భారత రామాయణాద్యనేక పురాణ ప్రవీణులైన పౌరాణికులును, మృదుమధుర రసభావభాసుర నవార్థవచన రచనా విశారదులైన మహాకవులును, వివిధ తర్క విగాహిత సమస్త శాస్త్ర సాగర గరీయః ప్రతిభులైన తార్కికులును నాదిగా గలుగు విద్వజ్జనంబులు" రాజరాజనరేంద్రుని పరివేష్టించి యుండిరి. సామంతులలో రాజవంశీయులు ప్రాముఖ్యము వహించుటకద్దు. ఎలమంచిలి, పిఠాపురము, ముదుగొండ శాఖీయులైన చాళుక్య వంశీయులు కేంద్ర ప్రభుత్వము బలముగానున్నప్పుడు సహకరించుట అంతర్యుద్ధములలో పాల్గొనుట, కొండొకచో స్వతంత్ర ప్రతిపత్తితో మెలగుట-సమయాను కూలముగ ప్రవర్తించుచుండిరి. సరోనాథులు (కొలనువారు) కోనసీమ హైహయులు వీరభృతులను సంపాదించి ప్రాముఖ్యము వహించిరి. వెలనాటివారు, కొండపడమటులు చాగివారు పరిచ్ఛేదులు మున్నగు వారు వీరసామంతులై వేంగిప్రభువునకు కప్పము కట్టి తమ తమ ప్రదేశముల పరిపాలించుచుండిరి. గ్రామములు రాజకీయములందు పాల్గొనక సంప్రదాయసిద్ధమైన ప్రశాంత జీవితమును నెరపెడివి. శక్తివర్మ, స్వామిద్రోహియైన గ్రామణిని తొలగించి వేరొకని ఆ పదవి యందు నిల్పినవైనము శాసనస్థము.

బ్రాహ్మణపారమ్యము పేర్కొనదగినది. వారు ఆ కాలమున 'శాపాదపి' 'శరాదపి'గ కొందరు వైదికధర్మము ననుసరింప మరి

కొందరు శస్త్రోపజీవులై దండనాథులై మంత్రులై రాజ్యతంత్రమును నడపుటకు నడుము కట్టిరి. వర్తకులు - కోమటులు ధనవంతులై అనేక దానధర్మములొనర్చుచుండిరి. పశ్చిగోదావరిమండలమునందలి పెనుగొండ వైశ్యసంఘమునకు కేంద్రముగ నేర్పడెను. ఆదిలో వేయి మంది కలిసి ఏర్పడిన 'తెలికి' వారి సంఘముండెడిది.

యువాన్‌వాంగ్ ఆంధ్రదేశమును పూర్వచాళుక్య రాజ్యారంభ దశలో సందర్శించెను. ప్రజలు ఉద్రేకపూరితులు కళాప్రియులు నీల వర్ణులు అని ఆతడు వర్ణించెను. దేశము సుభిక్షమైనది. నేల సారవంతమైనది. వారిభాష మధ్యదేశములోని భాషకు భిన్నము. బౌద్ధము ఎల్లెడ క్షీణించినది, దేవపూజ అధికమైనదని ఆతని అభివర్ణన. ఆదిలో బౌద్ధక్షేత్రములైన ఆరామములన్నియు శైవక్షేత్రములుగ మారినవి. పంచారామములు వెలసి వర్ధిల్లినవి.

చేబ్రోలులోని మహాసేనుని ఆలయము, బెజవాడలోని మల్లేశ్వరాలయము, బిదపురమునందలి హుంకారశంకరి జనరంజకములైన తీర్థయాత్రాస్థలములు. చేబ్రోలునుండి బెజవాడవరకు సుమారు 25 మైళ్లు ఏటేట మహాసేన విగ్రహము ఊరేగినది. రానుపోను 50 మైళ్ళ ఊరేగింపు జరిగెడి జాతర ప్రతివర్షము ప్రజానమూహము నాకర్షించెడిది. శైవమతము వర్ధిల్లినది.

అమ్మరాజు జైనుల నభిమానించెను. ఆతడు సర్వలోకాశ్రయ కటకాభరణములను రెండు జినాలయములను నిర్మించెను. ఆలయములకు అనుబంధముగ అన్నసత్రముండెడిది. యుద్ధమల్లుడు I బెజవాడలో కుమారస్వామి ఆలయమును నిర్మించెను.

కన్నడసాహిత్యమున రత్నత్రయముగ ప్రాతఃస్మరణీయులైన ముగ్గురుకవులు - పొన్న - పంప - నాగవర్మ కవీంద్రులు వేంగివాస్త

వ్యులే. [కమ్మనాడు - వేంగిపాలు] ముప్వురును జైనులే. చాళుక్య యుగమునకుచెందిన జైనవాఙ్మయము- పాఙ్నన్నయయుగమునందలి తెలుగువాఙ్మయము నేడు ఉపలభ్యమానముగాకపోవుట శోచనీయము. నన్నయ తెలుగులో ఆదికవి కాడనుట అపవాదభీతిలేని సిద్ధాంతమే. పండ్రంగని అద్దంకిశాసనము యుద్ధమల్లుని బెజవాడ శాసనమున నన్నయకు ముందే తెలుగుపద్యములు తరువోజలు మధ్యాక్కరలు ప్రయుక్తములు.

నన్నెచోడ మహాకవి,

> మునుమార్గ కవితలోకం
> బున వెలయగ దేశికవిత పుట్టించి తెనుం
> గును నిలిపి రంధ్రవిషయం (29)
> బున జన సత్యాశ్రయుని దొట్టి చాళుక్య నృపుల్.

అని కుమారసంభవమున కంఠోక్తిగ చాటెను.

తెలుగునకు సభాగౌరవము రాజపూజ్యత లభించినది చాళుక్యుల కాలమందే.

నన్నయ రాజరాజును, "రాజమహేంద్ర కవీంద్ర సమాజ సురక్ష్మాజ" అని సంబోధించును. నన్నయ పీఠికలో సభావందన మొనరించి భారత రచన కుపక్రమించెను. నన్నయభారతము తెలుగు వారికి విశ్వజనీనమైన సాహిత్యవేదమైనది.

---

(29) జనచాళుక్యరాజు మొదలుగ పలువుర్ - పాఠాంతరము.

# కల్యాణీ చాళుక్యులు

కల్యాణిచాళుక్యులు బాదామిచాళుక్యుల వంశీయులమని చెప్పుకొనిరి. కల్యాణిచాళుక్యులు తమ వంశవృక్షమున రెండవ విక్రమాదిత్యుని సహోదరునిభీమపరాక్రముని మూలపురుషునిగా చెప్పుచున్నారు.

విజయాదిత్యుడు (క్రీ. శ. 696 - 734)

- విక్రమాదిత్య II 734-747
  - కీర్తివర్మ II 747-757 ?
- భీమపరాక్రముడు [పేరు అజ్ఞాతము]
  - కీర్తివర్మ III
    - తైల I
      - విక్రమాదిత్య III
        - భీమరాజ
          - అయ్యన (ఇతనిభార్య రాష్ట్రకూట కృష్ణునిపుత్రిక)
            - విక్రమాదిత్యుడు IV (భార్య బొంతిదేవి చేదిలక్ష్మణరాజపుత్రిక)
              - తైల II (క్రీ. శ. 957)

రెండవవిక్రమాదిత్యుని సహోదరుని ప్రాచీనశాసనములు పేర్కొనలేదు. రన్నకవి కల్యాణిచాళుక్యులు ప్రాచీన బాదామిచాళుక్యుల

వంశీయులని పేర్కొనెను. అతడు వర్ణించిన వంశవృక్షమున ఈషద్భేదములు గన్పించుచున్నవి. రెండవ తైలరాజు సమయమున పైకి వచ్చుచున్న అతనికి అభిజాత్యగౌరవము కల్పించుటకీ సంబంధము నెలకొల్పబడినదని భావించువారు లేకపోలేదు. కాని- కల్యాణి చాళుక్యుల అభిజాత్యమును శంకించుటకు బలమైన ఆధారములు లేవు. రెండవతైలరాజు - అతని పూర్వీకులు బాదామిప్రాంతమును పరిపాలించిరి. రాష్ట్రకూటులు - చేదిహైహయులు ఈ చాళుక్యరాజ వంశములో వైవాహిక బాంధవ్యములను నెరపుట గమనింపదగినది. వంశవృక్షములో మధ్య కొన్నిగొలుసులు తెగిపోవుటలో ఆశ్చర్యమేమియు లేదు.

కల్యాణి చాళుక్యుల తొలిరాజధాని కల్యాణిగాదు. తొలుత రాష్ట్రకూటులకువలెనే మాన్యఖేటమే రాజధాని. సోమేశ్వరుని కాలమున రాజధాని కళ్యాణికి మారినను, ఈ రాజవంశము కల్యాణి చాళుక్య వంశమనియు, బాదామిచాళుక్యశాఖ-తూర్పుననున్న వేంగిమండలమేలు చాళుక్యులతో భిన్నవివక్షకొరకు, పశ్చిమచాళుక్యవంశమనియు చరిత్రలో సుప్రసిద్ధవ్యవహారము.

చాళుక్యవంశపునరుద్ధరణమునకు ప్రథమ చారిత్రక చిహ్నము రాష్ట్రకూట చక్రవర్తి మూడవ కృష్ణరాజు పుత్రికతో చాళుక్యరాజ కుమారుడైన అయణ వివాహము. నాలుగవ విక్రమాదిత్యుడు ఆ దంపతుల పుత్రుడు. దేవిహోసూరుశాసనమున పూర్వచాళుక్య బిరుదాంకితుడై నాలువగ విక్రమాదిత్యుడు కన్పించుచున్నాడు. (1) ఆతడు చేదిరాజకన్యక, త్రిపురీరాజు లక్ష్మణరాజు పుత్రిక. కృష్ణరాజును చేదిప్రభువును మిత్రులే. చాళుక్యవంశకీర్తి పునరుత్థానమునకీ వైవాహిక బంధము విశేషముగ తోడ్పడి యుండును.

(1) అకాలవర్షుని (మూడవ కృష్ణరాజు) శాసనము-ధార్వారుజిల్లా **B. K. 38 of 1932 - 1933.**

## కల్యాణిచాళుక్యరాజ వంశవృక్షము

1. తైల II భార్య బొంతదేవి క్రీ. శ. 973-97

2. సత్యాశ్రయ ఇట్టివబెడంగ 997-1008

దానవర్మ భార్య భాగ్యవతి

మహాదేవి. భార్య ఇట్టివనొలంబాధిరాజ

3. విక్రమాదిత్య V 1008-15

4. అయ్యణ 1015 ?

అక్కాదేవి

5. జయసింహ II (1015-42)

6. సోమేశ్వర I (1042-1068)

అవల్ల దేవి. భార్య సునభిల్లామ III

7. సోమేశ్వర II (1068-1076)

8. విక్రమాదిత్య V 1076-1126

జయసింహ III

జయకర్ణ

1. సోమేశ్వర III 1126-38

10. పెర్మజగదేకమల్ల II 1038-55

11. తైలప 1149-63

12. జగదేకమల్ల III 1163-83

13. సోమేశ్వర IV 1184-1200

## రెండవ తైలరాజు

విక్రమాదిత్య IV బొంతిదేవదంపతుల పుత్రుడు రెండవ తైలరాజు. క్రీ. శ. 957 నాటి శాసనమున బిజాపురీమండలమున రాష్ట్రకూట కృష్ణరాజసామంతుడైన తైలపుని పేర్కొనుచున్నది. క్రీ. శ. 965 నాటిశాసనమున, తొలినాటి తైపయ్య, "మహాసామంతాధిపతి ఆవహమల్ల తైలపరస" గ మారి చాళుక్యరాజ బిరుదాంకితుడయ్యెను. ఆ శాసన మతని సామంతుడగు ఖచరకులుని పేర్కొనినది. రాష్ట్రకూటచక్రవర్తి మూడవ కృష్ణరాజు తైలునకు తర్దవాడి సహస్రసీమను "అనుగ జీవిత"ముగ ప్రసాదించెను. కృష్ణరాజు తరువాతి రాష్ట్రకూటరాజులు బలహీనులగుటచే క్రీ. శ. 957 నుండి 965వ సంవత్సరములోపున తైలుడు ప్రబలుడయ్యెననుట సంభావ్యము. ఆరవ విక్రమాదిత్యుని నాటి గడన్‌శాసనము, తైలరాజు చాళుక్యవంశ గౌరవమును పునరుద్ధరించిన పిమ్మట శక 896 (క్రీ. శ. 974) సంవత్సరమునుండి 24 సంవత్సరములు పృథివికి శాంతి ననుగ్రహించెనని ప్రస్తుతించుచున్నది. అంతకు పూర్వమే ప్రబలుడై, తరుణమునకు వేచియున్న తైలపుడా సంవత్సరమున రాష్ట్రకూటుల ఆధిపత్యము నుజ్జగించి స్వతంత్రరాజ్యము స్థాపించెనని భావింపనగును.

రాష్ట్రకూటసామ్రాజ్యము అంతకుముందే క్షీణదశలో నుండెను. పరమారప్రభువు శీయకహర్షుడు - రాష్ట్రకూటరాజ్యముపై దండెత్తి రాజధాని మాన్యఖేటమును దోచుకోగలిగెను. రాజైన కొట్టిగుడు పరరాజులదాడి నోర్వలేకపోయెను. హర్షుని పిమ్మట పరమారప్రభువు ముంజరాజుగూడ మాన్యఖేటముపై విజయదండయాత్ర సాగించెను. కొట్టిగుని పిమ్మట క్రీ. 972 లో రాష్ట్రకూటసింహాసన మధివసించినది రెండవకక్కరాజు. క్రీ.శ97.3 సంవత్సరముననే తైలరాజు, దుర్బలుడైన కక్కరాజుపై దండెత్తి అతనిని యుద్ధమున సంహరించి, స్వతంత్రరాజ్య

మును స్థాపించెను. కక్కరాజుతోపాటు రాష్ట్రకూట రాజపుత్రుడు రణకంభుడుగూడ యుద్ధమున నిహతుడయ్యెను. తైలునిపక్షము వహించి రాష్ట్రకూటులుగూడ ఉండిరనుటకు, రాష్ట్రకూట కన్యక భమ్మహరట్టునిపుత్రిక నాతడు వివాహమాడుట ఒక నిదర్శనము.

గాంగప్రభువు మారసింహుడు కక్కరాజు దాయాది నాలుగవ ఇంద్రాఖ్యుని పక్షను వహించెనుగాని క్రీ. శ. 974 లో అతడు మరణించెను. అంతకుముందే చాళుక్యరాజాదిత్యునితో ఉచ్ఛంగియుద్ధమున పరాభూతుడై యుండెను. అంతటితో రాష్ట్రకూటసామ్రాజ్యము అస్తమించెను.

క్రమక్రమముగా రాష్ట్రకూటసామంతులు చాళుక్యసామంతులు కాజొచ్చిరి. బ్రహ్మక్షత్రియమాటూరువంశీయుడైన శాంతివర్మ షిమోగా మండలమున తొలుత కక్కలదేవమహారాజసామంతుడు పిమ్మట అవహమల్లసామంతుడు. క్రీ.శ 975సంవత్సరమునాటివిచిత్రశాసనము పేర్కొనదగినది. పాంచాలదేవుడు చాళుక్యసింహము కృష్ణాసముద్ర ద్వితయ వేలావలయితసామ్రాజ్యము నేలుచున్నట్లు అభివర్ణితము. పారదర్శకమైన ఈ అతిశయోక్తి పురాతనచాళుక్య సామ్రాజ్యవైభవ స్మారక చిహ్నము. భావిచాళుక్య భవితవ్యతాసూచకము. ఆ సమయముననే తైలరాజు ఆ ప్రాంతమున దండువిడిసిన శాసనములున్నవి. తరువాతి శాసనములలో తైలరాజు పాంచాలదేవుని శిరస్సు కందుకక్రీడనల్పిన కథనమును పలుశాసనములు ప్రస్తుతించుచున్నవి. క్రీ. శ. 976 లో బళ్ళారిమండలమునందలి శాసనములు తైలరాజును చక్రవర్తిగ అభివర్ణించుచున్నవి. అప్పటికే నొలంబపల్లవు లాతని సామంతులైరి. (1) బనవాసిప్రాంతమున కన్నపుడు తైలుని సామంతుడయ్యెను. అతని తమ్ముడు తైలరాజునకు కుడిభుజమై అనేకయుద్ధములలో

(1) నొలంబ పల్లవరాణి రేవలదేవి దానశాసనము.

పాల్గొని "గిరిదుర్గమల్ల" "సామంతచూడామణి" బిరుదాంకుడయ్యెను. సౌందత్తిరట్టులు - కృష్ణరాజు దయాపాత్రులై అభ్యుదయముగాంచిన రాష్ట్రకూటసామంతులు క్రీ. శ. 980 లో చాళుక్య తైలరాజసామంతులుగ శాసనములు వేసిరి. కార్యవీర్య 1, మహాసామంతుడు శాంతివర్మ సోగల్ సౌందత్తిశాసనములు ఉదాహరణప్రాయములు. ఉత్తరమున కొంకణశిలాహారులు శ్యేనదేశయాదవులు తైలసామంతులుగ శాసనములు వేసిర. క్రీ. శ. 997 నాటి శాసనమున మహామండలేశ్వర అపరాజితుడు- శిలాహారప్రభువు కక్కలమహాదేవుని దురదృష్టమునకు వగచినను, చాళుక్యతైలాధిపత్యమును సుస్పష్టముగ అంగీకరించెను. తైలుని సేనాధిపతి బారపరాజు - చాళుక్యవంశీయుడు లాటదేశమును జయించెను. రన్నమహాకవి, గదాయుధ కావ్యపీఠికలో యువరాజు సత్యాశ్రయుడు, కొంకణశిలాహారులపై ఘూర్జరులపై నడచిన దండయాత్రలలో, నిర్వహించిన భూమికను ప్రస్తుతించెను. తైలరాజు ఆజ్ఞ చొప్పున సత్యాశ్రయుడు కొంకణేశుని సముద్రమువరకును తరిమి ఘూర్జరవిభుని నిర్జించి పృథివికి సంతోషము చేకూర్చెను.

చాళుక్య రాజ్యము సమకాలీనశాసనవాఙ్మయమున రట్టపాడిగ ఏడున్నరలక్షలసీమగ అభివర్ణితము. తైలుని రాజధాని మాన్యఖేటము. రాష్ట్రకూటరాజ్యమునకేకాక రాష్ట్రకూటరాజనీతికికూడ రెండవ తైలుడు వారసుడయ్యెను. రాష్ట్రకూటులకు మాళ్వాధీశులైన పరమారులకు మరియు చోళులతో కులక్రమానుగతమైన బద్ధవైరమేర్పడినది. తైలరాజు రాష్ట్రకూట సామంతుడై యున్నప్పుడే పరమారులతో, చోళులతో రాష్ట్రకూటుల పక్షము వహించి అనేకయుద్ధములొనర్చి యుండును. క్రీ. శ. 980 నాటి శాసనమునందే తైలరాజు చోళపర్వతమునకు వజ్రపాతముగను 'లాట' మత్తేభమునకు సింహముగను అభినుతుడు, మాళ్వాధీశులైన పరమారులతో తైలుడు సల్పిన

యుద్ధములు శాసనములందును సాహిత్యమునందును సుప్రసిద్ధములు. క్రీ. శ. 1003 నాటి కౌతెం తామ్రశాసనము హూణ మారవ చేది ప్రభువులపై విజయము సాధించిన ఉత్పలుని (మంజరాజును) కారాగార నిబద్ధునిచేసిన కథ ప్రస్తావింపబడినది. విక్రమాదిత్యుని గడక్ శాసనము వీరాధివీరుడైన వలంజుని తైలుడు సంహరించినట్లు గలదు. క్రీ. శ. 1000 నాటి రెండవ యాదవభిల్లముని శాసనము, ముంజరాజును వరించిన రాజ్యశ్రీ, చేసినతప్పునకు రణరాగభీముని అంతఃపురమున దాసియై శిక్షననుభవించెనని వర్ణించెను. రెండవతైలుడు "రణరాగభీమ" "ఆహవమల్ల" బిరుదాంకితుడు. తొలుత రాష్ట్రకూట సామంతులైనయాదవులు, పిమ్మట చాళుక్య సామంతులైన పరమార దండయాత్రలనుండి ఉత్తరపుసరిహద్దులను సంరక్షించుటకు తోడ్పడిరి. మేరుతుంగుని ప్రబంధచింతామణియందు (1) ఈ వృత్తాంతము సవిస్తరముగ అభివర్ణితము. తైలపుడు మాళవదేశముపై పలుమారులు దండెత్తి పీడించెను. ముంజవిభుడు ప్రతీకారము సలుపుటకై ఉద్యమింప మంత్రియైన రుద్రాదిత్యుడు అతనిని గోదావరిదాటవలదని హెచ్చరించెను. ముంజవిభుడు మంత్రిమాట వినలేదు. యుద్ధమునందు ముంజవిభుడోడిపోయి బందీకృతుడయ్యెను. చాళుక్యకారాగారమున బందీకృతుడై క్రుగ్గుచున్న ముంజరాజునకు తైలరాజు సహోదరి, విగతభర్తృకయైన మృణాలవతి పరిచర్యలొనర్చుచుండెడిది. ముంజవిభునకును, ఆప్రౌఢాంగనకు మధ్య ఏర్పడిన శృంగారసంబంధ వశమున ముంజవిభుడు బంధవిముక్తికి తాను చేయుచున్న రహస్య ప్రయత్నములను ఆమెకెరిగించెను. ఆదంతము నెరిగిన తైలరాజు అతని నవమానించి యింటింట భిక్షమెత్తించి ఉరితీయించెను. మేరుతుంగుని ప్రబంధవర్ణన మంతయు చరిత్రకాకపోవచ్చును. ఐనను మేరుతుంగుని వధ చారిత్రక సత్యము. అమితగతి ముంజునకు క్రీ. శ.

(1) పదునాల్గవ శతాబ్దినాటి కన్నడ కావ్యము.

934 ప్రాంతమున తనగ్రంథమును కృతి యిచ్చెను. తైలుని మరణము 997. ముంజుడు ఈ మధ్యకాలమున మరణించియుండును.

దక్షిణ తైలరాజన్యులు చోళులకును కర్నాటక రాజులకును గల వైరము సుప్రసిద్ధము. ఉభయపక్షములందలి సామంతులును ఆ యుద్ధములలో పాల్గొనుచుండిరి. వేంగిమండలమునందలి రాజకీయ విప్లవములు ఈ వైరాగ్నికి ఆజ్యహోమములైనవి. సమకాలీన చోళ సమ్రాట్టు రాజరాజు ప్రబలుడై చోళసామ్రాజ్యమును నలుదిక్కుల విస్తరింపజేయుచుండెను. క్రీ.శ.991 సం.న మైసూరులో చోళరాజరాజు శాసనము గలదు. క్రీ. శ. 993 నాటి చోళశాసనములు రాజరాజు గంగవాడి నొలంబవాడి విజయములను ప్రస్తుతించుచున్నవి. క్రీ. శ. 992 నాటి కొగళిశాసనమున ఆహవమల్లుడు అనంతపురమండలమందలి రొద్దమునందు విజయానంతరము విడిసియున్నట్లు చెప్పబడినది. అందు ఆతడు చోళరాజును జయించి 150 మత్తేభములను సంగ్రహించినట్లు అభివర్ణితము. ఉభయులకు మధ్య అనేక యుద్ధములు జరిగినట్లును అవి సమయుద్ధములుగ పరిణమించి ఉభయపక్షములును తమవిజయము మాత్రమే పేర్కొనిరనియు భావింపవచ్చును. తైలపునకు ఇద్దరుపుత్రులు. క్రీ.శ. 997 ప్రాంతమున జ్యేష్ఠపుత్రుడు సత్యాశ్రయుడు సింహాసన మధిష్ఠించెను. అతని అవరజుడు దానవర్మ=యశోవర్మ. అతనిభార్య పేరు భాగ్యవతి. సత్యాశ్రయుని తరువాత సింహాసన మధిష్ఠించిన ఐదవ విక్రమాదిత్యుడు ఆదంపతులతనయుడే.

## సత్యాశ్రయుడు [క్రీ. శ. 997 - 1008]

'ఇఱ్ఱివబెడంగ' [అచ్చెరువుగ యుద్ధమున చొచ్చుకొని పోవువాడు] బిరుదాంకితుడైన సత్యాశ్రయుడు తండ్రివలెనే అనేకయుద్ధములొనర్చెను. చాళుక్యులకు బద్ధవిరోధులు చోళులు. సుప్రసిద్ధుడైన చోళసమ్రాట్టు, యువరాజు రాజేంద్రుడు దక్షిణాపథమునంతయు తమ

ప్రాభవములోనికి తెచ్చుటకు యత్నించుచుండిరి. సింహళము మాల్దివులు చోళులధాటికి లోనయ్యెను. సత్యాశ్రయుడు సింహాసన మధిష్ఠించుటకు పూర్వమే రాజరాజు గంగవాడి నొలంబవాడి విషయములపై దండెత్తియుండెను. చోళులు ఆంధ్రదేశమున తమప్రాభవము విస్తరింపజేయుటకు, శరణార్థులైన దానార్ణవుని పుత్రులు శక్తివర్మ విమలాదిత్యులకు ఆశ్రయమిచ్చి, పైతృక రాజ్యమున వారిని నెలకొల్ప యత్నించుచుండిరి. క్రీ. శ. 1000 సంవత్సర ప్రాంతమున రాజరాజు సాహాయ్యమువలన శక్తివర్మ వేంగిసింహాసనమధిష్ఠింపగల్గెను. వేంగీ యువరాజు విమలాదిత్యుడు చోళరాజరాజు అల్లుడే. వేంగిమండలము చోళుల ఆధిపత్యములోనికివచ్చుట సత్యాశ్రయుడు సహింపరానిది. అందుచే సత్యాశ్రయుడు వేంగిపై దండయాత్రకు ఉపక్రమించెను. క్రీ. శ. 1005 నాటి శాసనమున సత్యాశ్రయుడు శ్రీ పర్వతసమీపమున దండువిడిసినట్లు గలదు. మరియొకశాసనము క్రీ. శ. 1006 నాటిది. సత్యాశ్రయుని బ్రాహ్మణసేనాని బయలనంబి 'ధన్నడ' [ధాన్యకటక] 'ఎనమద' దుర్గముల అగ్నిదగ్ధమొనర్చిన పిమ్మట చేబ్రోలులో (గుంటూరు మండలస్థము) దండు విడిసినట్లు చెప్పుచున్నది.

ప్రతీకారచర్యగ చోళులు యువరాజు రాజేంద్రుని ఆధిపత్యమున పశ్చిమ చాళుక్యరాజ్యముపై దండయాత్ర సాగించిరి. ఈ దండయాత్రావృత్తాంతమును అభివర్ణించు "హొట్టూరు" శాసన పరిభాష ఉదాహరణీయము. "రాజేంద్రవిద్యాధరుడు - రాజరాజనంతతానవర్తి చోళవంశాభరణుడు. శతచోళుడు గడిదేశమును నవలక్షధనుర్ధర సేనతో దొనవూరుకడ దండు విడిసి కుంతలరాజ్యమును కొల్లగొట్టెను. అబాలవృద్ధము చిత్రహింసకు గురియైరి. బ్రాహ్మణులు - స్త్రీలు చిత్రవధకు లోనైరి. మానభంగమునకు పాల్పడిన స్త్రీలవలన వర్ణసాంకర్యమేర్పడినది." అలంకారశాస్త్రమును తలదన్నిన దీ శాసన

వాఙ్మయము. "అతిశయోక్తిపూరితమైన అసత్యగర్భితమైన ప్రచారము నవీనులు ఊహింపజాలనంతటి ప్రాచీనకళయె." యని ఈ శాసనమును సమీక్షించిన శ్రీ నీలకంఠశాస్త్రిగారి ప్రవచనము. నవలక్షధనుర్ధవిలసిత మనుచోట "900000 భటులతో" అని అర్థము స్వీకరించినారు. అట్లయిన అది అతిశయోక్తి కావచ్చును. మిగిలిన హింసాకాండ సత్య దూరము కాజాలదు. పశ్చిమచాళుక్య శాసనములుగూడ చోళులు సలిపిన అత్యాచారములను ప్రస్తావించినవి. నవలక్షయను శాసనకవి ప్రయోగము 'శ్లేష' గర్భితము [నవ=క్రొత్త] నవక్రొత్తలక్షసైనికులు అని అర్థము చెప్పిన అందతిశయోక్తి మృగ్యము.

ఆ హొట్టూరు శాసనమే సత్యాశ్రయుడుగూడ చోళసైన్యమునకు అపారనష్టమును గల్గించినట్లు చెప్పుచున్నది. రాజరాజు తంజావూరు శాసనములు చాళుక్యరాజ్యమును కొల్లగొట్టిన ధనమును పెరియ దేవాలయమునకు దానము చేసినట్లు చెప్పుచున్నది. కుందమరను చాళుక్యసామంతుడు బనవాసి ద్వాదశ సహస్ర పాలకుడు 'తిగుళిరమారి' [తమిళులకు యముడు] బిరుదాంకుడు. రాజేంద్రుని తొలిశాసనమును అతడు మహాసేనానివహమున కధిపతియై చాళుక్య రాజ్యముపై దండెత్తి 'ఇడైతురైనాడు', (కృష్ణా తుంగభద్రా సంగమమున నేర్పడిన అంతర్వేది) అరణ్యపరివృతమైన బనవాసిని సాల వృక్షప్రాకార విలసితమైన కొల్లిపాకను 'మణ్ణైకడక్కము' [రాజధాని మాన్యఖేటము] భుజబల పరాక్రమము చే జయించినట్లు చెప్పుచున్నవి.

... Crossed the frontier with an army 900000 strong - encamped at Donavur, plundered the entire country slaughtered women childern and Brahmans .. much of this is of Course more propagandist exaggeretion or invention, not ofter all so new an art as we are apt to imagine -

prof. Nelakantasastri p 325. Early History of Deccan.

వేంగినుండి తిరిగివచ్చుచున్న చాళుక్యసైన్యములకు చోళులకు కొల్లిపాకవద్ద యుద్ధము జరిగినది.(1)ఈ యుద్ధములవలన చోళులకు రాజ్యలాభము కల్గినను కల్గకపోయినను, పశ్చిమచాళుక్య దండయాత్రనుండి వేంగిమండలమును కాపాడగల్గిరి. (2)

## 5 వ వి క్ర మా ది త్యు డు

సత్యాశ్రయుని తరువాత తమ్ముని పుత్రుడైన విక్రమాదిత్యుడు V సింహాసనమధిష్ఠించెను. ఈతడు రాజ్యమేలినది అయిదారు వత్సరములు మాత్రమే అయినను 'కేతెమ్' తామ్రశాసనమాతని దానధర్మములను సౌశీల్యమును ఉగ్గడువుగ నుగ్గడించుచున్నది. క్రీ. శ. 1010 నాటి శాసనమున ఈతని సహోదరి అక్కాదేవి ప్రశంసగలదు. ఆమె లక్ష్మీదేవి అవతారముగ ప్రశంసింపబడినది. చాళుక్య చరిత్రలో నుగృహీత నామధేయురాలై చిరకాలము మన్ననలనందిన ఆమె ఉదంతమునకీ శాసనము నాందీ శ్లోకము. క్రీ. శ. 1015 ప్రాంతమున విక్రమాదిత్యుని పిమ్మట అతని సోదరుడు అయ్యణ II. అతడు కొన్ని వారాలు రాజ్యమేలి చరిత్రలో నామమాత్రావశిష్టుడై యున్నాడు. అతనితరువాత సింహాసనమధిష్ఠించినది అతని తమ్ముడు జయసింహుడు II.

## రెండవ జయసింహుడు

[ క్రీ. శ. 1015 - 1042 ]

జయసింహుని రాజ్యకాలమున పేర్కొనదగిన సన్నివేశములు.

1. పరమారప్రభువు ముంజునికి జరిగిన పరాభవమునకు "కులపగ" సాధించుటకు భోజుడు సల్పిన ప్రతీకార చర్యలు.

---

(1) వేంగిమండలము కుంతలరాజ్యము చోళరాజ్యములకు 'ముయ్యేలగుట్టు' - కొల్లిపాకదుర్గము.

(2) ఈ సంఘటనల "చాళుక్యులు" అను అధ్యాయమున గూడ అనుశీలింపనగును.

2. వేంగిదండయాత్ర. తూర్పుచాళుక్యుల అంతర్యుద్ధమున - విమలాదిత్యుని తరువాత ఏర్పడిన వారసత్వకలహమున విజయాదిత్యుని పక్షము వహించి పోరాడుట.

3. చోళులతో సల్పిన యుద్ధములు.

పరమారప్రభువు భోజమహారాజు - దక్షిణాపథ వాఙ్మయ చరిత్రలో సుగృహీతనామధేయుఁడు- పరమారముంజ ప్రభువునకు చాళుక్యరాజధానిలో జరిగిన పరాభవమునకు ప్రతీకారముగ దండయాత్ర నారంభించెను. క్రీ. శ. 1020 సంవత్సరప్రాంతమున భోజుడు రెండుసారులు విజయోత్సవముల నొనర్చెను. యశోవర్మ నాశిక మండలమును పరిపాలించిన భోజసామంతుడు. ఆతడు భోజుడు కర్ణాట లాట కొంకణ దేశముల జయించెననిచెప్పును. క్రీ. శ. 1020 నాటి భోజునిశాసనములు అతడు వాతాపిమాన్యఖేటములనుండి వలస వచ్చిన బ్రాహ్మణులకు సల్పిన దానములను పేర్కొనుచున్నవి. క్రీ. శ. 1019 నాటి జయసింహునిశాసనమున అతడు సప్తమాళవదేశముల జయించినట్లు గలదు. క్రీ. శ. 1024 శాసనమున కొంకనాధీశుని జయించి, కొల్లాపుర ప్రాంతమున జయసింహుడు దండువిడిసి ఉత్తర దిగ్విజయయాత్రకై సన్నాహము లొనర్చుచుండినట్లు గలదు. ఈ దండయాత్రలో సుప్రసిద్ధచాళుక్యసేనాని చావనరసదండనాథుడు వహించిన పాత్ర ఎన్నదగినది. ఆతడు సింగనశిమ్యుడుగ [సింగన= జయసింహ] కొంకణ ధూమకేతువుగ పన్నలదుర్గవిధ్వంసకుడుగ (1) అభినుతుడు. కదంబసామంతప్రభువు ఛట్టుగుడు మాళవాధీశుని తరిమి గౌతమగంగాపానమొనర్చిన ధీరుడుగ అభివర్ణితుడు. కుందమరసేనాని

(1) పన్నలదుర్గము కొల్హాపురమునకు సుమారు రెండుమైళలో నున్న ప్రాచీనదుర్గము.

భోజుని గజయూధగమనము నాపిన ధీరుడుగ ప్రశంసితుడు. క్రీ. శ. 1020 ప్రాంతమున కొల్హాయిన కొంకటాది ప్రాంతములను జయసింహుడు తిరిగి జయించినట్లు భావింపనగును. క్రీ. శ. 1024 లో అతడు సంకల్పించిన ఉత్తరదిగ్విజయయాత్ర సాగినట్లు కన్పించదు.

క్రీ. శ. 1018 ప్రాంతమున వేంగిమండలమున విమలాదిత్యుని పుత్రులు రాజరాజనరేంద్రుడు, విజయాదిత్యుడు-వీరిమధ్య వారసత్వ యుద్ధమేర్పడినది. (1) రాజరాజనరేంద్రుడు చోళరాజు రాజరాజ దౌహిత్రుడు. జయసింహుడు విజయాదిత్యుని పక్షము వహించెను. చాళుక్యసేనాని చావణరసదండనాథుని సాహాయ్యముతో విజయాదిత్యుడు బెజవాడనాక్రమించెను. రాజరాజనరేంద్రుడు క్రీ. శ. 1022 వరకు పట్టాభిషిక్తుడు కాలేదు. జయసింహుడు తుంగభద్రనుదాటి రాయచూరు అంతర్వేదినాక్రమించి గాంగచోళ సేనలను తరిమివేసెను. కుందమరససేనాని చోళగాంగ గజయూధముల చెల్లాచెదరొనరించినట్లు అభినుతుడు. కాని- ఈ తొలివిజయములు మలిఅపజయములుగా పరిణమించినవి.

చోళరాజేంద్రుడు స్వయముగా సేనాధిపత్యమును వహించి రాజరాజనరేంద్రునకు సాయముచేయుటకై వేంగిమండలమునకేగెను. మరియొకచోళసేన గంగవాడి నొలంబవాడిపై దండెత్తి రాయచూరు అంతర్వేదిని ఆక్రమించినది. వేంగిమండలమున విజయాదిత్యుడు పరాజితుడై, ప్రవాసియై పశ్చిమచాళుక్యుల ఆస్థానముచేరెను. జయసింహుడు పశ్చిమమున చోళులజయించినట్లు చెప్పుకొనినాడు. యుద్ధము రాయచూరు అంతర్వేది 'మస్కి' కడ జరుగుటచే, పశ్చిమ యుద్ధములు సమయుద్ధములుగా పరిణమించినవని భావింపనగును.

(1) "తూర్పుచాళుక్యులు" "చోళులు" - అను అధ్యాయములు అనుశీలింపవచ్చును.

వేంగిలో జయసింహునకు సంపూర్ణపరాజయము సిద్ధించినది. చోళ సేనలు గంగాతీరమువరకు దిగ్విజయయాత్ర సాగించి, రాజరాజ నరేంద్రుని క్రీ. శ. 1022 లో [ఆగష్టు 16 వ తేదీన] రాజమహేంద్ర వరమున పట్టాభిషిక్తుని గావించినవి. అప్పటినుండి జయసింహుడు పేర్కొనదగిన పెద్దయుద్ధములలో పాల్గొనినట్లు కన్పింపదు.

జయసింహుడు జగదేకమల్ల బిరుదాంకుడు. సుగ్గలదేవి, దేవల దేవి అతనిరాణులు. క్రీ. శ. 1029 లో సుగ్గలదేవి పాశుపతాచార్యుడైన బ్రహ్మరాశిపండితునకు దానముసల్పెను. బసవపురాణగాథలలో బ్రహ్మ రాశి పండితుడు శిష్యురాలైన రాణిసాయమున రాజైన దేసింగును జైనమతమునుండి శైవమునకు మార్చిన కథ గలదు. దేవలదేవి నొలంబరాజపుత్రిక. ఆమె తల్లి అస్థికలను గంగానదిలో కలిపివచ్చిన బ్రాహ్మణునకు దానముచేసిన శాసనము గలదు. అవల్లదేవి జయ సింహుని పుత్రిక. ఆమె స్యేనరాజు మూడవ బిల్లముని రాణి. తొలుత బిల్లముడు జయసింహునకు శత్రువైనను, చివరకు జయసింహుని సామంతుడై అతనితనయను వివాహమాడెను. క్రీ. శ. 1025 లో సిందినగరరాజధానిలో [సిన్నర్ - నాసిక్ మండలము] అతడు చాళుక్య సామంతుడై రాజ్యముసల్పెను.

జయసింహునికాలమున చాళుక్యరాజధాని మాన్యఖేటమే. యాతగిరి, కొల్లిపాక, పొట్టలకెఱె (బళ్ళారి మండలము) ఘట్టడ కఱె, కళ్యాణి ఉపరాజధానులు (నెలివీడులు.)

## మొదటి సోమేశ్వరుడు

## [క్రీ. శ. 1042 - 1068]

సోమేశ్వరుడు జయసింహుని పుత్రుడు. 'ఆహవమల్ల' 'త్రైలోక్యమల్ల' బిరుదాంకుడు. బిల్హణకవి, సోమేశ్వరుడు కళ్యాణిని

పృథివికి మకుటాయమానమైన రాజధానిగ నిర్మించినట్లు వర్ణించెను. కల్యాణి ప్రాచీన నగరముగ చోళశాసనములు పేర్కొనినవి. సోమేశ్వరుని కాలమున చాళుక్యరాజధాని మాన్యఖేటమునుండి కల్యాణికి మారినది. కల్యాణీనగరమునకు శిల్పసౌష్ఠవ సౌందర్యములు కల్పించిన సోమేశ్వరుడు చాళుక్య సామ్రాజ్యమునకుగూడ పునర్వికాసము కల్పించెను. మేధావి, బహుముఖ ప్రజ్ఞాశాలి - తనకుగల ఆత్మవిశ్వాసమును అనుయాయులకును అందించగల నాయకుడు - కార్యఖడ్గ నిపుణుడునైన సోమేశ్వరుని ముద్ర రాజనీతి దక్షిణాపథచరిత్రలో చిరకాలము స్వయంవ్యక్తమై యుగయుగాంతరములు మిక్కిలి ప్రభావము వహించినది.

క్రీస్తుశకము 1-4-1047 నాటి నందేరు శాసనమునగల ఆతని ప్రశంస అనుశీలింపదగినది. సోమేశ్వరుడు అంగ, కళింగ మగధాధిపుల సంహరించిన వీరుడుగ అభినుతుడు. అది సంప్రదాయసిద్ధమైన ఆ అతిశయోక్తిని వదలినచో కొన్ని చరిత్రాంశములు గలవు. సోమేశ్వరుడు కొంకణాధీశ్వరునిజయించి పాదాక్రాంతుల నొనర్చెను. నిజరాజధాని ధారానగరముననే, ధీరోద్ధతుడైన మాళవేశ్వరుని తనకు పాదాభివాదము సల్పునట్లుచేసెను. చోళులను జయించి, వేంగి కళింగాధిపతులను తన పక్షమునకు త్రిప్పుకొనెను. ఆశాసనమందే ఈ యుద్ధములలో సోమేశ్వరునకు కుడిభుజమై ప్రవర్తిల్లిన బ్రాహ్మణసేనాని నాగవర్మ ప్రశంస గలదు. నాగవర్మ, 'వింధ్యాధిపమల్ల శిరచ్ఛేదన' 'సేవణదిశాపట్టు' 'చక్రకూటకాలకూటు', 'ధారావర్ష దర్పోత్పాటన' 'మారసింహమదమర్దన' బిరుదాంకుడు. ఈ బిరుదావళి అంతరార్థము వ్యాఖ్యాన నిరపేక్షము.

కొంకణమునుండి ధారానగరమువరకు సాగిన దిగ్విజయ యాత్ర వలన సువిశాల చాళుక్యసామ్రాజ్యమున సోమేశ్వరుని అధికార

ప్రాభవములు సుప్రతిష్ఠితములైనవి. ఈ దిగ్విజయయాత్రావివరములు బిల్హణునివర్ణనలవలన, మరికొన్ని శాసనములవలన తెలియనగును. బిల్హణుడు తనకావ్యపీఠికలో ఈ దండయాత్రను చాలపద్యములలో అభివర్ణించెను. సోమేశ్వరుడు ధారానగరముపై దండెత్తెను. భోజుడు రాజధానిని వీడి పలాయనము సాగించవలసివచ్చినది. క్రీ. శ. 1058 నాటి నాగై శాసనమున వాణసమధుసూదనసేనాని కొంకణమాళవ విజయములను ప్రశంసగలదు. కొంకణ, యాదవప్రభువులు వింధ్య ప్రభువు మల్లుడు భోజుడు గలిసి చాళుక్యసేనలనెదిరించిరి. నాగై శాసనమున ఉజ్జయినీదుర్గమును అగ్నిదగ్ధమొనర్చినట్లు చెప్పుచున్నది. క్రీ. శ. 1066 నాటి శాసనమున మహామండలేశ్వర జమరసుడు భోజ మృత్యుపావకుడుగ అభినుతుడు. విక్రమాదిత్యుని ఏయూరుశాసనము మాళవాధిపతిపలుమారులు ప్రవాసియై మండవదుర్గమున తలదాచుకొని నట్లు చెప్పబడినది. నాగైశాసనము ధారా మండవదుర్గములపై దండ యాత్రను పేర్కొనినది. అందుచేత సోమేశ్వరుని రాజ్యారంభమున విజితుడైన భోజుడు, తరువాత స్వతంత్రుడగుటకు యత్నించి జమ రసునిచే యుద్ధనిహతుడయ్యెనని భావింపనగును.

నాగవర్మ - సోమేశ్వరుని సేనాని - 'చక్రకూట కాలకూట' బిరుదాంకుడు ధారావర్ష దర్పోత్పాటనుడుగ అభినుతుడు. మధ్యప్రదేశ మందలి చక్రకూటరాజ్యమునేలిన నాగవంశిప్రభువు ధారావర్షుడు. యుద్ధమున ఓడిపోయి చాళుక్యసామంతుడై సోమేశ్వరుడు చోళులతో సల్పిన యుద్ధములలో పాల్గొని అతని మన్ననలనందెను. నాగవర్మ జయించినవారిలో మారసింహుడు గలడు. రట్టవంశీయుడైన సామం తుడు అంకుడుగూడ మారసింహుని జయించినట్లు చెప్పుకొనెను. క్రీ. శ. 1040, 1063 శాసనములు సోమేశ్వరురాణి లీలాదేవి తండ్రి మారసింహుని పేర్కొనుచున్నవి. తొలుత అతడు సోమేశ్వరునెదిరించి నను, నకాలమున యథోచితస్థానము గుర్తించి వర్తించెననియు

భావింపనగును. సోమేశ్వరుడు అతని పుత్రికను వివాహమాడి శత్రువును మిత్రునిగా మార్చుకోగలిగిన రాజనీతిచతురుడు.

కాకతీయవంశకర్త మొదటిప్రోలరాజు, అతనిపుత్రుడు బేతరాజు సోమేశ్వరుని సేనానులై పలుయుద్ధముల ఉగ్గడింపదగిన పాత్రను నిర్వహించినారు. క్రీ. శ. 1090 నాటి ఖాజీపేటశాసనము త్రైలోక్యమల్లుడు ప్రోలరాజునకు అనుమకొండ విషయమును శాశ్వతభృతిగా ప్రసాదించినట్లు చెప్పుచున్నది. మొదటిప్రోలరాజు కొంకణ చక్రకూట దండయాత్రలలో సోమేశ్వరుని పక్షము వహించి పోరాడెను. అతనిపుత్రుడు బేతరాజు మాళ్వ చోళ మత్తేభసింహుడు. బేతరాజు సోమేశ్వరుని కాంచీదండయాత్రలో పాల్గొని ఉగ్గడింపదగిన భూమిక నిర్వహించిన సంగతి బమ్మసేనాని శాసనము ప్రస్తుతించుచున్నది. కాకతీయసేనాని బమ్మని పిల్లలమఱ్ఱిశాసనమున కాంచీకవాటు భేదన మొనరించి యేలికయైన కాకతివల్లభునకు విజయలక్ష్మీవధూసందర్శన మొనరించిన వర్ణనగలదు. (1) 'వల్లభ' శబ్ద ప్రయోగసారస్యము గమనింపదగినది. కాకతీయులకు సోమేశ్వరుడు ప్రసాదించినది అనుమకొండ విషయముమాత్రమేగాదు. కాకతీయులు సోమేశ్వరుని రాజనీతికి కార్యఖడ్గనిపుణతకుగూడ వారసులు కాగల్గిరి.

సోమేశ్వరుని శాసనములు అతడు చోళులపై సాధించిన విజయములు వేంగికళింగాధిపతులను తనపక్షమునకు త్రిప్పుకొనిన రాజనీతిని ప్రస్తావించుచున్నవి. ఉభయపక్షములశాసనములు అన్యోన్య విరుద్ధమైన సాక్ష్యము చెప్పుచున్నవి.

జయసింహుని కాలములో చాళుక్యచోళులకు ద్విముఖ యుద్ధములేర్పడినవి. వేంగిమండలము ఒకయుద్ధక్షేత్రము. రాయచూరు

(1) "కాకతీయులు" అనుఅధ్యాయము అనుశీలింప దగును.

అంతర్వేది రెండవయుద్ధక్షేత్రము. తూర్పుపశ్చిమరంగములలో చాళుక్య చోళసేనలు పలుయుద్ధములొనర్చినవి. జయసింహునికాలమున తుంగభద్ర- చాలకాలము సరిహద్దురేఖగా నేర్పడియుండెను.

జయసింహుని పరిపాలనాకాలమున ఉత్తరార్థమున చాళుక్య రాజ్యము తుంగభద్రనుదాటి విస్తరించినది. క్రీ. శ. 1032-1084 నాటి శాసనములు నొలంబవాడిని చాళుక్యసామంతులు పరిపాలించుచున్నట్లు వచించుచున్నవి. చోళశాసనములు కంపిలిలోగల సుప్రసిద్ధ చాళుక్యరాజప్రాసాదమును పేర్కొనినవి.

సోమేశ్వరుడు వేంగిపై చోళుల అధిపత్యము తొలగించుటకు విశ్వప్రయత్నము చేసెను. రెండవజయసింహుడు తూర్పుచాళుక్య రాజపుత్రుడు విజయాదిత్యునిపక్షము వహించి క్రీ. శ. 1018 సంవత్సర ప్రాంతమున దండయాత్ర నెరపుట సుప్రసిద్ధము. అప్పుడు పరాభూతుడైన విజయాదిత్యుడు క్రీ. శ. 27 - 6 - 1031 తేదీన విజయవాడలో పట్టాభిషిక్తుడయ్యెను. తూర్పుచాళుక్యశాసనములీ పట్టాభిషేకమును గుర్తింపక క్రీ. శ. 1022 నుండి రాజరాజనరేంద్రుడు 41 సంవత్సరములు రాజ్యమేలినట్లు చెప్పుచున్నవి. కాని విజయాదిత్యుడు క్రీ. శ. 1031 లో వేంగిమండలమున వేరుదన్ని నిలువలేకపోయెను. ప్రవాసియైన అతని సోమేశ్వరు డాదరించెను.

సోమేశ్వరుని రాజనీతికి హేతాశుడైన విజయాదిత్యుని ఉపయోగించుకొనిన ఉపజ్ఞ ఉజ్జ్వలోదాహరణము. విజయాదిత్యుడు తూర్పు రంగమున అనేకయుద్ధములొనరించెను. విజయాదిత్యుడు సోమేశ్వరుని చతురంగక్రీడలో అద్భుతమైన "పావు". విజయాదిత్యుడు తూర్పు రంగమునుండి నిష్క్రమించవలసివచ్చినపుడాతనికి చాళుక్యరాజాస్థానమున రాజమర్యాదలతో ఆతిథ్యగౌరవము లభించినది. విజయాదిత్యుడు సోమేశ్వరునకు అజన్మమిత్రుడై చాళుక్యసామ్రాజ్యమునకు

ఎనలేని సేవ యొనరించెను. అందుచేత ఆతని సోమేశ్వరుడు తన శాసనములలో పుత్రనిర్విశేషమనిగా పేర్కొని గౌరవించినాడు.

నందేర్ శాసనము వేంగికళింగాధిపతులను సోమేశ్వరుడు రాజనీతిచే కైవసమొనరించినట్లు చెప్పినది. రాజరాజనరేంద్రుడు వేంగిపతి నందేర్ శాసనసమయమున క్రీ. శ. 1047 కు పూర్వము సోమేశ్వరునితో సంధిచేసికొనిన నిదర్శనము లెవ్వియు కానరావు. రాజరాజనరేంద్రుడు కళింగాధిపతియైన మధుకామార్ణవునితో పోరాడినట్లు శాసన సాక్ష్యము. అందుచే రాజరాజునకు శత్రులైన కళింగాధిపతి సోమేశ్వరునకు సహజమిత్రము. ఆతడు సోమేశ్వరుని రాజనీతికి కైవసమగుట వింతగాదు. ఇక సోమేశ్వరుని రాజనీతికి కైవసమయిన వేంగీశ్వరుడు విజయాదిత్యుడే.

రాజరాజ నరేంద్రుని కలిదిండి శాసనము, (1) మరియు రాజేంద్రచోళుని తొలి శాసనములు వేంగిమండలమున వారు కర్ణాట చాళుక్యులతో సల్పిన యుద్ధముల నభివర్ణించుచున్నవి. సోమేశ్వరుడు సింహాసన మధిష్ఠించిన తొలి దినములలోనే వేంగిదండయాత్రకు ఉపక్రమించెను. క్రీ. శ. 1044 లో వేంగిపురాధీశ్వర బిరుదము యువరాజపదవితో సమమైనది క్రీ. శ. 1044 నాటి శాసనము. మహా మండలేశ్వర శోభనరసు "వేంగిపురవరాధీశ్వర" బిరుదాంకుడు. (2) సింగనదేవరసు ప్రభువు"కొల్లిపాకెయకాకమ్"(కొల్లిపాకసంరక్షకుడు) కర్ణాటచాళుక్య సేనలు సాధించిన తొలివిజయముల నరికట్టుటకై రాజరాజనరేంద్రునకు సాయముచేయుటకై రాజాధిరాజు చోళసైన్యమును వేంగిమండలమునకు పంపించెను. కలిదిండివద్ద ఘోరసంగ్రా

(1) కలిదిండి శాసనమున శకవర్షములు లేకపోవుట శోచనీయము.

(2) యువరాజ పదవీ యోళం.

మము జరిగినది. (1) ఉభయపక్షమున సేనానులు పలువురు మరణించిరి. రాజరాజనరేంద్రుని కలిదిండితామ్రశాసనమున ఈ యుద్ధమును గూర్చినవి స్తరముగగలదు(2)ఉభయసేనలు పూర్ణాహుతియైన సమయుద్ధమది. ఆయుద్ధమున వీరస్వర్గమలంకరించిన చోళసేనాని స్మారకముగ రాజరాజు రాజరాజేశ్వరాలయము నూటయెనిమిది లింగముల ప్రతిష్ఠించి కట్టించెను. అందు బలినై వేద్యనృత్యసంగీత మంగళఖండస్ఫుటితనవకర్మలకొరకును, వేదాధ్యయనశ్రోతలకు అధ్యాపకులకు పంచసత్రములు, ఏబదిఇద్దరు వేశ్యలకు చతుర్వర్ణములకు వసతులు గల్పించి, వానిపోషణకై కలిదిండి కడుపట్టు అరవకూరు గ్రామములను దానము చేసెను.

కలిదిండిసమయుద్ధముగా పరిణమించుటచే ఉభయపక్షములును తిరిగి పోరునకు సంసిద్ధమైనవి. ఉభయపక్షములు తిరిగి క్రొత్తబలముల చేకూర్చుకొని ధాన్యకటకమువద్ద తలపడినవి. క్రీస్తుశకము 1045 నాటి రాజాధిరాజ శాసనమున 'ధన్నాడ' యుద్ధవర్ణనగలదు. ఆహవమల్లుని సేనానులు గండప్పయ్య గంగాధరుడు యుద్ధమున వీరస్వర్గమలంకరించిరి. వీరాధివీరులుగ కీర్తివడసిన "విక్కి" "విజయాదిత్యుడు" "సంగమయ్య" పలాయనమైరి.

రాజాధిరాజు ఓడిపోయిన కర్ణాటసేనలను కొల్లిపాకవరకు తరిమికొట్టెను. కొల్లిపాకను అగ్నిదగ్ధము చేసినట్లు చోళశాసన కథనము. కొల్లిపాక సంరక్షకుడుగ చాళుక్యశాసనములు సింగనదేవరస

(1) కలిదిండియుద్ధవృత్తాంతము- "తూర్పుచాళుక్యులు" అను అధ్యాయమునగలదు- శ్రీ భావరాజు వేంకటకృష్ణరావుగారి "రాజరాజనరేంద్రుడు"- అనుగ్రంథము అనుశీలింపదగును.

(2) రాజరాజనరేంద్రుని కలిదిండి తామ్రశాసనము.

ప్రభువును ప్రశంసించుచున్నవి. కొల్లిపాక దగ్గర యుద్ధము విరమింప బడినదని తెలుచున్నది.

సోమేశ్వరుని చరిత్ర నిరంతర చాళుక్యచోళ యుద్ధములతో నిండియున్నది. క్రీ. శ. 1047 నాటి చోళశాసనములు, రాజాధిరాజు నాయకత్వమున గండరాదిత్య, నారణ గణపతి మధుసూదన ప్రభృతులను జయించెనని కంపిలి వద్దగల చాళుక్యరాజ ప్రాసాదమును దగ్ధమొనర్చెనని చెప్పుచున్నవి. కృష్ణాతీరమందలి పుందూరు వద్ద జరిగిన యుద్ధములో చాళుక్యపక్షమున పోరాడిన విచ్చయ్య తలిదండ్రులు బందీకృతులైరి. అహవమల్లుడు సంధికి రాయబారులను పంపెను. కాని రాజాధిరాజు సంధికి సమ్మతింపలేదు. పుందూరు నేలమట్టము చేయబడినది. గాడిదలచే దున్ని 'వరాతిక' విత్తులు జల్లబడినవి. విజయవంతమైన ఆదండయాత్రస్మారకముగ యాతగిరివద్ద 'జయ స్తంభ' నిర్మాణము జరిగినది. విజయోత్సవానంతరము దండయాత్ర తిరిగి కొనసాగినది. చోళులు నులంబి, కాళిదాస, చాముండరాయ, కొమ్మయ వల్లవరజ సేనానుల జయించిరి. చాళుక్యులపక్షమున పోరాడిన ఘూర్జరప్రభువు శిరస్సును రాజాధిరాజు ఖండించినట్లు అభివర్ణితము. సంధికోరుచు వచ్చిన చాళుక్య రాయబారులకు చోళులు పరాభవమొనర్చి, తలగొరిగి పంచశిఖలుపెట్టి చీరలుగట్టి ఆడవేషములు వేయించి అవమానించిరి. ఈ దండయాత్రకు మకుటాయమానముగ పేర్కొనదగినది రాజధాని కల్యాణీనగరమున రాజాధిరాజు సలుపుకొనిన వీరాభిషేకము. తంజాపురీమండలమందలి దారాసురముకడ సమకాలీనచాళుక్యద్వారపాలకుని విగ్రహము ప్రతిష్ఠితము. ఆ విగ్రహముక్రింద గల తమిళశాసనము శ్రీ విజయరాజేంద్రదేవుడు కల్యాణీనగరవిధ్వంసమొనర్చి తెచ్చి ప్రతిష్ఠించిన ద్వారపాలకుడు. ఈ చోళదండయాత్రోదంతముపై చాళుక్యశాసనములు మౌనముద్ర వహించుచున్నవి. పరాభవఖిన్నుడైన సోమేశ్వరుడు ప్రతీకార

చర్యలకు పూనుకొనెను. రాజాధిరాజు కల్యాణినాక్రమించినప్పుడు సోమేశ్వరుడు కాంచిపై దండెత్తెను. క్రీ. శ. 1049 నాటి శాసనమున సోమేశ్వరుడు పల్లవదిగ్విజయానంతరము 'నెలివీడు' వగ్గాపురిలో విడిసినట్లు గలదు. క్రీ. శ. 1052 నాటి నాగై శాసనము సోమేశ్వరుని కాంచీ విజయమును పేర్కొనుచున్నది. బిల్హణుడు, ప్రబంధధోరణిలో అతని కాంచీవిజయమునభివర్ణించుచు, సోమేశ్వరుడు చోళరాజ్య శ్రీ కాంచీ పరిగ్రహణమున కైవసమొనర్చుకొనెనని కవిత్వము చెప్పెను. క్రీ. శ. 1050 లో 'నూడి' శాసనము చోళదండయాత్రచే తాత్కాలికముగ ఏర్పడిన అరాజకత్వమును పేర్కొనినది. ఈ యుద్ధపరంపరలలో పేర్కొనదగినది సుప్రసిద్ధమైన కొప్పం యుద్ధము. ఈ యుద్ధప్రస్తావన రాజేంద్రుని ద్వితీయ రాజ్యసంవత్సరమందలి క్రీ. శ. 1054 నాటి శాసనమునగలదు. రాజాధిరాజు శాసనములాతని 36 వ సంవత్సరము వరకుగలవు క్రీ. శ. 1053. కావున, దక్షిణాపథచరిత్రలో సుప్రసిద్ధమైన కొప్పంయుద్ధము క్రీ. శ. 1053 లో జరిగినదని తెలుచున్నది.

యుద్ధస్థలనిర్దేశమునుగూర్చి బహుళవాదోపవాదములు చెలరేగినవి. అధికసంఖ్యాకుల ఆమోదముద్రపడిన అభిప్రాయానుసారము "హిరె-హళ్ల" (గొప్పనది) తీరమున కొప్‌బల్ (=కొప్పం) వద్ద అఘోరయుద్ధము జరిగినట్లు భావింపనగును. హిరె- హళ్లనది తుంగభద్రానదికి ఉపనది. ఈయుద్ధముగూడ దక్షిణాపథచరిత్రలో అపరకురుక్షేత్రముగ ప్రసిద్ధివడసిన రాయచూరు అంతర్వేదిలోనే జరిగినది.

చోళరాజు రట్టమండలముపై దండెత్తి, గ్రామములను నగరములను విధ్వంసమొనర్పసాగెనని చోళశాసనములు వచించుచున్నవి. చాళుక్యశాసనములు చోళులపై దుమ్మెత్తిపోసినవి. క్రూరుడైన చోళరాజు సనాతనధర్మమును స్వకులాచారమును ఉజ్జగించి దేవాలయములకూడ విధ్వంసమొనర్చెను. జినాలయములు నేలమట్టము

లైనవి. (1) మహాపాతకుడైన రాజధిరాజు ఆత్మపతనము చెందెను. చివరకు ఆసంఘర్షణలు కొప్పం యుద్ధముగ పరిణమించినవి. యుద్ధమధ్యమున, ఏనుగుపై అధివసించిన రాజాధిరాజు శిరస్సును చాళుక్యసామంతుడు బాచిరాజుఖండింపగల్గెను.

రాజాధిరాజు దుర్మరణమువలన భీతి చెందిన సేనలు చెల్లా చెదరు కాజొచ్చినవి. అప్పుడు యువరాజు రాజేంద్రుడు, పారిపోవు చున్న సేనలను కూడగట్టుకొని అపజయమును విజయముగా మార్చెను. రాజేంద్రుడు విజృంభించి, అనేక చాళుక్యనాయకులను-జయసింహుడు-పులకేశి - నన్నినులుంబ దాసపన్మన ప్రభృతుల సంహరించి చాళుక్యుల నోడించెను. చాళుక్యుల వృషభధ్వజము, అశ్వగజయూధములు, ఛత్రచామరములతోపాటు రాణులు = సతియవ్వె, సాంగప్పె మున్నగు వారు అసంఖ్యాక దానదాసీజనము చోళులకై వనమయ్యెను. క్షతగాత్రు డైన రాజేంద్రుడు యుద్ధరంగమునందే పట్టాభిషిక్తుడై కొల్లాపురి కడ జయస్తంభము నాటి నిజరాజధాని గంగాపురి చేరుకొనెను.

కొప్పం యుద్ధ హేతువుల గూర్చి చరిత్రకారులలో ఏకవాక్యత కుదురలేదు. రాజరాజనరేంద్రుడు క్రీ. శ. 1049, 1050 సంవత్సర ములలో తిరువైయ్యారు దేవాలయమునకు సువర్ణదానము సల్పెను. కొప్పం యుద్ధసన్నాహఫలితముగ రాజరాజనరేంద్రుడు చోళరాజ్యము నకు వచ్చియుండవచ్చును. వేంగిమండలమును రక్షించుట ఈ దండ యాత్రకు చోళులు ఉపక్రమించుటకు ఒక హేతువగుచో అది నెరవేరలేదు. చోళచక్రవర్తి రాజాధిరాజు దుర్మరణము, యువరాజు అస్థిర భవితవ్యము, వృద్ధుడైన రాజరాజనరేంద్రుడు చాళుక్యులతో సంధి

(1) రాజాధిరాజు యుద్ధమున శిరస్సు కోల్పోవుట, తరువాత వంశమంతరించి కులోత్తుంగుడు రాజగుట- ఈ పాపఫలిత మని శాసనములు చాటినవి.

చేసికొనుటకు ప్రోత్సహించినకారణములు. సోమేశ్వరుడు కొప్పం యుద్ధముపిమ్మట చోళులపై పగతీర్చుకొనుటకై ఉద్యమింపకతప్పదు. అందుచే సోమేశ్వరుడును వేంగిని చోళులనుండి విడదీయుట మంచిదని భావించి రాజరాజనరేంద్రునితో సంధి చేసికొనెను. ఆసంధి ఫలితముగ వాణసనారాయణభట్టు రాయబారియై రాజమహేంద్రవరాస్థానము నలంకరించి రాజరాజనరేంద్రునివలన నందంపూడి అగ్రహారమును దానముగా క్రీ. శ. 4-11-1053 తేదీనాడు సూర్యగ్రహణసమయమున పరిగ్రహించెను. (1)

నారాయణభట్టు రాజరాజనరేంద్రుని ఆస్థానకవియైన నన్నయ భట్టునకు సహాధ్యాయి. వాణసవంశీయుడు. వాణసకాళిదాసు :-

(1) శ్రీ నీలకంఠశాస్త్రిగారు.

"**Nandampudi grant is issued in the thirty second regns year of Raja Raja C. A D 1031 Vide page 341 Early Histary of Deccan** నందంపూడి శాసనకాలము క్రీ. శ. 1051 అన్నారు. నందంపూడి శాసనము రాజరాజు 32 వ రాజ్యవత్సరమని అందే కలదు. రాజరాజు 1022-8-16 తేదీన పట్టాభిషిక్తుడు.

32 వ రాజ్యవత్సరము 1053 ఆగష్టు 16లో ఆరంభము. అందుచే నందంపూడి శాసనసమయము క్రీ. శ. 1053 అని చెప్పనొప్పును. 1053-11-4 తేదీకే అంతరంగికసాక్ష్యము-సూర్యగ్రహణము మున్నగునవి నప్పును.

రాజరాజు క్రీ. శ. 1019 నుండి రాజ్యమేలినమాట నిజమే. విజయాదిత్యుని 1031 శాసనము రాజరాజు పండ్రెండువత్సరము లేలినట్లు వచించుచున్నది. కాని- రాజరాజు 1022 నుండి 41 సంవత్సరములు రాజ్యమేలినట్లు తూర్పుచాళుక్యశాసనముల సాక్ష్యము. దీనిని బట్టి, రాజరాజు పట్టాభిషేకసమయమునుండియే రాజ్యవత్సరములు గణించెనని తెలుచున్నది.

ఆతనిపుత్రులు మధుసూదనయ్యప్రభృతులు చాళుక్యసామ్రాజ్యమున పేరుకెక్కిన మంత్రులు, దండనాథులు నందంపూడిశాసనమున నారాయణభట్టు అష్టాదశభాషావిశారదుడైన కవి పండితుడుగనే ప్రశంసితుడు అందు చాళుక్యప్రధానిగ ఆతని ప్రశంసలేదు. 1055 లో ఆతని కూతురు కుపమ దక్షారామశాసనములో "త్రైలోక్యమల్లదేవరకుం బ్రధాని నారాయణభట్టుకూతురు కుపమ" అని చెప్పుకొనెను. నారాయణభట్టును గూర్చి నన్నయభట్టు ఆంధ్రమహాభారతపీఠికలో "వాణసధరామర

శ్రీ నీలకంఠశాస్త్రిగారు కొప్పంయుద్ధము 1054లో జరిగినట్లు Page 338 **The Early History of the Deccan** లో వ్రాసినారు. **A History of South India** లో 1053 - 54 సంవత్సరమని వారే వ్రాసినారు. కొప్పంయుద్ధం 1053 నవంబరుకు పూర్వము జరిగినది. రాజరాజనరేంద్రుడు కొప్పంయుద్ధానంతరము సోమేశ్వరునితో సంధి చేసికొనుటచే ఆతని ప్రధాని నారాయణభట్టు, (ఆతని కూతురు కుపమ) రాయబారియై వేంగిమండలము చేరెను.

**A History of South India - By Sri Nilakanta Sastri "Rajadhiraja although, for reasons now not clear, did not make any attempt to recover vengi or Kalinga where Someswara had established himself, RajadhiRaja assisted by his younger brother Rajendra ii, led an expedition against Someswara, (1053-4) and a battle was fought at Koppam."** అని వ్రాసినారు. వేంగి 1053 కొప్పం యుద్ధమువరకు రాజరాజనరేంద్రుని అధీనమందే కలదు. సోమేశ్వరుని అధీనములో లేదు. అందుచే రాజరాజు ఏ ప్రయత్నమును చేయనవసరమే లేదు.

వంశ విభూషణుండు నారాయణభట్టు" అని పేర్కొనెను. (1) వీరరాజేంద్రుడు ప్రస్ఫుటముగ తనశాసనమున తన అగ్రజులు రాజాధిరాజు, రాజేంద్రుని ఉపేక్షవలన, వారు రాజరాజేంద్రునకు సకాలమున సాయము చేయక చేయలేకపోవుటచే వేంగిమండలము చోళుల ప్రాభవమునుండి జారి, సోమేశ్వరునకు చిక్కినదని వాపోయెను. అట్టిసమయమున రాజరాజనరేంద్రుడు సోమేశ్వరునితో సంధి చేసికొన వలసి వచ్చినది.

కొప్పంయుద్ధ పరాజయమునకు ప్రతీకారముగ సోమేశ్వరుడు మహాసేనా నివహముతో చోళరాజ్యముపై దండెత్తెను. వాలాదేవ దండనాయకుడు సేనాధిపతి. 'ముడక్కాఱు' కడ ఘోరసంగ్రామము జరిగినది. ఉభయపక్షముల రాజులు రాజపుత్రులు యుద్ధమున పాల్గొనిరి. క్రీ. శ. 1062 నాటి రాజమహేంద్రుని శాసనము 'ముడక్కాఱు' రణరంగమున ఆతడు ఆహవమల్లుని మత్తేభయూధముల వెనుకకు మరలునట్లు చేసి జయసింహుని జయించినట్లు చెప్పుచున్నది. క్రీ. శ. 1061 లో సోమేశ్వరుని శాసనమున, ఆతడు పులియప్పయణ వీడుకడ దక్షిణదిగ్విజయానంతరము చోళులపై విజయము సాధించిన పిమ్మట విడిసినట్లు చెప్పబడినది.

వేంగిమండలమున రాజరాజనరేంద్రుని మరణానంతరము విజయాదిత్యుని పుత్రుడు శక్తివర్మ సింహాసనమధిష్ఠించెను. ఆతని సాయమునకై కర్ణాటసైన్యము చాముండరాయుని అధిపత్యమున వేంగికేగెను. చోళవీరరాజేంద్రుడు వేంగికేగి కర్ణాటసేనలతో తలపడెను.

---

(1) ముద్రితప్రతులలో తానును ధరామరవంశ విభూషణుండు. అని ఉన్నది. తాటాకు ప్రతులలో వాణస ధరామరవంశ భూషణుడు అని ఉన్నది. కొన్ని ముద్రితప్రతులలో 'వాణస' పాఠాంతరముగ చూపబడినది.

తత్ఫలితము చాముండరాయని వధ, శక్తివర్మ II మరణము. అతని కూతురు మయూరీసన్నిభగాత్రి నాగలానాసికా ఖండనము. ఈ సంఘటనలో ముడక్కారు యుద్ధమున కిషత్‌పూర్వమునందో లేక అవ్యవహితభావిలోనే జరిగి యుండును. ముడక్కారు [=కూడలి సంగమ క్షేత్రము] యుద్ధమున ఉభయపక్షములు విజయము తమకే చేకూరి నట్లు చెప్పుకొనుటచే అది సమయుద్ధముగ పరిణమించినదని తోచు చున్నది. ఈ యుద్ధములలో పాల్గొనుటకు అనుభవజ్ఞుడైన విజయా దిత్యుని సోమేశ్వరు డాహ్వానించెను. క్రీ. శ. 1063, 1065 సంవత్స రములలో విష్ణువర్ధన విజయాదిత్యుడు అరసికెఱె కడ, ముదలికకఱెకడ విడిసి యున్నట్లు శాసనములు గలవు.

సమయుద్ధముగా పరిణమించిన కూడలిసంగమ యుద్ధానంత రము, ఇంకొకసారి విజయమును నిష్కర్షగ తేల్చుకొనుటకు ఉభయ పక్షములు నిర్ణీతదినమును ఏర్పరచుకొనినట్లు తోచుచున్నది. మణి మంగళశాసనము సోమేశ్వరు డాదినమునకు యుద్ధభూమికి రాలేదని నిందించుచున్నది. సోమేశ్వరుడు అవశ్యభవితవ్యమైన యుద్ధమునకు సన్నద్ధుడై, సామంతుల సాయమపేక్షించెను. బెజవాడవద్ద ధారాధీశుడు జననాథుని కాపుంచెను. తూర్పుగాంగవంశీయుడు చాళుక్యసామంతు డాతనికి తోడ్పడెను. క్రీ. శ. 1066 లో తుంగభద్రాతీరమున జరిగిన యుద్ధములో చాళుక్యులు ఓడిరి. తుట్టతుదకు సోమేశ్వరుడు తన బలములనన్నిటిని కేంద్రీకరించి నిర్ణీతదినమును సూచించి కూడలి సంగమక్షేత్రముకడ తుదిపోరాటమునకు వీరరాజేంద్రుని ఆహ్వానించెను. చోళులు సంతోషముతో ఆ ఆహ్వానము నంగీకరించిరి. ఉభయసైన్య ములు నిర్ణీతకాలమునకు కూడలి చేరినవి. జ్వరార్తుడై సోమేశ్వరుడు ఆనాటికి రాలేక పోయెను. వీరరాజేంద్రుడు చాళుక్యసైన్యము నోడించి తుంగభద్రాతీరమున జయస్తంభ మెత్తించి వేంగిమండలముపై దిగ్విజయయాత్రసలిపి రాజధాని చేరెను.

సోమేశ్వరుడు - వ్రతభంగమునకు ఖిన్నుడై క్రీ. శ. (28-3-1068 తేదీన) కూడలి సంగమములో నదీప్రవేశముసలిపి పరమర యోగమున అసువుల బాసెను. ఈ విధముగ దక్షిణాపథ చరిత్రపై యుగయుగాంతరములు ఆత్మీయతా ముద్ర భాసింపచేసిన కార్యఖడ్గ నిపుణుడు - చాళుక్య సోముడు అస్తమించినాడు.

## రెండవ సోమేశ్వరుడు

భువనైకమల్ల సోమేశ్వరుడు ii మొదటిసోమేశ్వరుని జ్యేష్ఠ పుత్రుడు క్రీ. శ. 11-4-1068 తేదీన చాళుక్యసింహాసనమధిష్ఠించెను. వీరరాజేంద్రుడు యథాప్రకారము దండయాత్ర నారంభించెను. చోళదండయాత్ర గుత్తి (అనంతపురమండలము) ముట్టడితో ఆరంభమైనది. చాళుక్యతురగదళము శత్రుభీకరముగ విజృంభించి చోళులను తరిమివేసినది. చక్రవర్తితమ్ములు జయసింహుడు నొలంబవాడి సంరక్షణ బాధ్యతను, విక్రమాదిత్యుడు గంగవాడి రక్షణ భారమును వహించిరి. లక్ష్మణదండనాయకుడు బనవాసి రక్షణకు నియుక్తుడయ్యెను.

కాని- అచిరకాలముననే విక్రమాదిత్యుడు తమ్ముడైన జయసింహునితో కలిసి అన్నగారగు సోమేశ్వరుని పదచ్యుతుని చేయ దలపోసెను. విక్రమాదిత్యునకు అన్నగారగు సోమేశ్వరునిక్రింద యువరాజ పదవి తన సమర్థతకు తగిన పదవి కాదని అనిపించినది. బిల్హణకవి రచన, చోళశాసనములు విక్రమాదిత్యుని శాసనములు అనుశీలించినచో విక్రమాదిత్యుడు చిరంతనసంకల్పము చిరప్రయత్నముచే, అన్నగారిని త్రోసిరాజని చాళుక్యసింహాసనము నాక్రమించినట్లు విశదమగును. బిల్హణునికథనమునననుసరించి, "తండ్రి సోమేశ్వరుని మరణానంతరము దిగ్విజయయాత్ర ముగించుకొని విక్రమాదిత్యుడు కల్యాణి చేరుకొని అన్నగారగు సోమేశ్వరునితో కలిసిమెలసి యుండ తలపోసెను.

"కాని సోమేశ్వరుడు, దుష్టుడై ప్రజాకంటకుడై, తమ్ములైన విక్రమాదిత్యునిపై జయసింహునిపై విరోధము వహించెను. రాజధానిలో నుండుట శ్రేయస్కరముగాదని విక్రమాదిత్యుడు జయసింహునితో గలిసి బయలుదేరెను. సోమేశ్వరుడు వారిరువుర వధించుటకు సల్పిన ప్రయత్నములు విఫలమైనవి. విక్రమాదిత్యుడు తుంగభద్రాతీరమును చేరి, కొంతకాలము విశ్రమించి చోళసామ్రాజ్యముపై దండెత్తుటకు సంకల్పించెను. కొంకణజయకేశి, ఆలూపాధిపుడు విక్రమాదిత్యునకు సామంతులైరి. చోళరాజుగూడ విక్రముని జయించుట అసాధ్యమని సంధికి రాయబారుల పుత్తెంచి, తన తనయనిచ్చి వివాహము సల్పుటకు ఉద్యుక్తుడయ్యెను. విక్రమాదిత్యుడు సంధికి అంగీకరించి, చోళరాజునకు ఆభాసవిజయము కల్పించుటకు తుంగభద్రాతీరమునకు మరలి పోయెను. వైభవోపేతమైన వివాహమహోత్సవానంతరము ఉభయులు నిజరాజధానులకు మరలిపోయిరి."

వీరరాజేంద్రుని శాసనములు తనకు పాదాక్రాంతుడై సాయ మర్థించిన చాళుక్యవిక్రమాదిత్యునకు ఆతడు తోడ్పడి, పుత్రికనిచ్చి వివాహమొనర్చి రట్టవాడినిజయించి సోమేశ్వరుని కర్ణాటకమునుండి తరిమి, అల్లునకు రాజ్యలాభము కల్గించినట్లు నుడువుచున్నవి.

బిల్హణుడు, విక్రమాదిత్యునకు తండ్రియే కిరీటమర్పించుటకు యత్నింప విక్రమాదిత్యుడే వలదని వారించి అన్నగారికి సింహాసనము లభించునట్లు చూచెనని అభివర్ణించియున్నాడు.

కృతిభర్త శీలపోషణ సల్పుట కృతికర్త కర్తవ్యముగద. జయకేశి శాసనములో చెప్పుచున్న సాక్ష్యము బిల్హణుని రచనల బలపరచుటలేదు. జయకేశి, చాళుక్య చోళప్రభువుల సన్నిహితులచేసి, చాళుక్యప్రభువును నిజరాజ్యమున నిల్పినట్లు చెప్పుకొనినాడు. ఈ సంధి విక్రమాదిత్యునకు విజయాదిత్యునకు లాభదాయకము. వీరరాజేంద్రుడు

విజయాదిత్యుడు వేంగినేలుటకు సమ్మతించినాడు. దీనివలన రాజిగునకు (రాజేంద్రుడు=కులోత్తుంగుడు=రాజరాజనరేంద్రునిపుత్రుడు) నష్టము. రాజేంద్రుడు విక్రమాదిత్యునకు అజన్మవిరోధియయ్యెను.

క్రీ.శ. 1070 సంవత్సరారంభమున వీరరాజేంద్రుని మరణముతో, పరిస్థితులు తారుమారైనవి. రాజేంద్రుని పుత్రుడు అధిరాజేంద్రుని సింహాసనముపై ప్రతిష్ఠించి విక్రమాదిత్యుడు రాజధాని చేరగనే చోళరాజ్యమున విప్లవము చెలరేగినది. అధిరాజేంద్రుడు దుర్మరణము పాలయ్యెను. రాజేంద్రుడు, కులోత్తుంగ పౌరుషనామముతో చోళ సింహాసన మధిష్ఠించెను. (1)

విక్రమాదిత్యునకిరుప్రక్కల శత్రువులే. స్వరాజ్యమున అన్నగారగు సోమేశ్వరుడు. చోళరాజ్యమున కులోత్తుంగుడు. ఈ ప్రమాదపరిస్థితి నుండి తప్పించుకొనుటకు విక్రమాదిత్యుడు విశ్వప్రయత్నము చేసెను.

విక్రమాదిత్యుడు క్రమక్రమముగా చాళుక్యసామంతులలో అధికసంఖ్యాకుల తనపక్షమునకు త్రిప్పుకొనెను. సోమేశ్వరుని పక్షము వహించినది స్వామిభక్తి పరాయణుడగు లక్ష్మణదండనాయకుడు మాత్రమే. శత్రువునకు శత్రువు పరమమిత్రుడు గనుక చోళరాజు సోమేశ్వరుడు పరమమిత్రులైరి. ఆ వంశ శత్రువైన చోళునితో సోమేశ్వరుడు కలిసి, చాళుక్యకులగౌరవము మంటగలిపినట్లు బిల్హణకవి ఆరోపణము. అంతకుముందే వీరరాజేంద్రునితో విక్రమాదిత్యుడు కలుపుకొనిన పొత్తు బిల్హణకవికి గర్హ్యమనిపించలేదు.

కులోత్తుంగుడు (కోలారుమండలమందలి) నంగిళిపై దండెత్తుటతో యుద్ధమారంభమైనది. చోళశాసనములు పశ్చిమసముద్రము వరకు కులోత్తుంగుడు విజృంభించి విజయము సాధించినట్లు చెప్పు

(1) ఈ గ్రంథమున ఈ విషయము కులోత్తుంగుని చరిత్రలో సవిస్తరముగ కాననగును.

చున్నవి. గంగవాడి నొలంబమండలములలో కులోత్తుంగుని శాసనములు కన్పించుచున్నవి గాన తాత్కాలికముగ చోళులు ఆ ప్రాంతముల నాక్రమించిరని తెలుచున్నది. బిల్హణుని కథనము ప్రకారము విక్రమాదిత్యుని ధాటికి ఓర్వలేక చోళులు పరాజితులై పలాయనము సాగించిరి. సోమేశ్వరుడు బందీకృతుడయ్యెను. అన్నగారిని బంధమోక్షితునిచేసి సింహాసనమున పునఃప్రతిష్ఠితుని సల్పవలెనని విక్రమాదిత్యుడు సంకల్పించి తుంగభద్రాతీరము చేరెను. కాని కలలో రోషావేశపూరితుడైన శివుడు సాక్షాత్కరించి, విక్రమాదిత్యుని సింహాసనమధిష్ఠించి వంశగౌరవము నుద్ధరింపవలెనని శాసించెను. కారాగారమున క్రమగ్గిన సోమేశ్వరుని భవితవ్యము చరిత్రకందని విషయము. లక్ష్మణదండనాయకుడు తప్ప, పాపమాతని పక్షము వహించిన చాళుక్యసామంతులు మృగ్యులు. సోమేశ్వరుడు అసమర్థుడు కావచ్చునుగాని ప్రజాకంటకుడైన క్రూరుడని నమ్ముటకు ఆధారములు లేవు.

## ఆరవ విక్రమాదిత్యుడు
## [ క్రీ.శ. 1076 - 1126 ]

క్రీ. శ. 11-2-1076 న ఆరవ విక్రమాదిత్యుడు పట్టబంధ మహోత్సవమున అభిషిక్తుడై నూతనశకము చాళుక్య విక్రమ శకము నారంభించెను. విక్రమాదిత్యుడు పరిపాలించిన అర్ధశతాబ్ది ఆశకము వాడుకలో నున్నది. అటుపిమ్మట మరియొక అర్ధశతాబ్ది క్వాచిత్కముగ వాడబడినది. విక్రమాదిత్యుని పుత్రుడే భూలోకమల్ల శకము నారంభించెను.

విక్రమాదిత్యుడు సింహళ విజయబాహువు కడకు అభినందనలు కానుకలతో రాయబారులనంపించెను. చోళసైన్యముల సింహళము నుండి తరిమి, సింహళమున ఏకచ్ఛత్రాధిపతియైన విజయబాహువు

విక్రమాదిత్యునకు సహజమిత్రుడు. చాణక్యుడు అర్థశాస్త్రమున ప్రశంసించిన రాజనీతికి మరియొక ఉదాహరణము.

విక్రమాదిత్యుడు సింహాసనమధిష్ఠించునాటికే ఆతడు అనేక యుద్ధములలో ఆరితేరిన యోధుడు. కులోత్తుంగుని సాధించుటకు విక్రమాదిత్యుడు తన శక్తియుక్తులన్నియు ధారవోసెను. విక్రమాదిత్యుని అణచుటకు కులోత్తుంగుడు చేసిన విశ్వప్రయత్నమునకు ఫలితము రెండవసోమేశ్వరుని సద్యఃపతనము. అందుచే ఉభయచక్రవర్తులు "సహజీవన" సిద్ధాంతము శ్రేయస్కరమనియెంచి, నాలుగు దశాబ్దులపాటు ప్రశాంతముగ గడిపిరి. తరతరాలుగ చాళుక్యచోళులకు రణక్షేత్రమైన వేంగిని విక్రమాదిత్యుని మిత్రుడు పరిపాలించుచుండెను. అనపత్యుడైన వృద్ధ పితృవ్యునకు - కులోత్తుంగుడే వారసుడు. అందుచే వేచియుండుటయే శ్రేయస్కరమైన రాజనీతిగ కులోత్తుంగుడు భావించెను. విజయాదిత్యుని మరణానంతరము వేంగిమండలము చోళసామ్రాజ్యమునచేరిపోయి కులోత్తుంగుని పుత్రుడైన రాజప్రతినిధులచే పరిపాలింపబడినది. అయినను అవకాశము చిక్కినపుడు కులోత్తుంగుని మరణానంతరము విక్రమాదిత్యుడు వేంగిపై తన ఆధిపత్యమును తిరిగి స్థాపించుటకు యత్నించి కొంతమేరకు సఫలీకృతుడయ్యెను.

విక్రమాదిత్యుని అర్ధశతాబ్ది పరిపాలనలో చాళుక్య సామ్రాజ్యము శాంతిభద్రలతో వర్ధిల్లినది. తమ్ముడైన జయసింహుని తిరుగుబాటు సత్వరము అణచివేయబడినది. హొయసాలుల విజృంభణము చివరి దశాబ్దిలో జరిగినది. ఈ రెండు సమయములలో తప్ప చాళుక్యభటులు ఆయుధ ప్రయోగము చేయనవసరము లేకపోయినదనియే చెప్పనగును. శాంతిభద్రతలు, సామ్రాజ్యమును సుభిక్షముచేసి, లలితకళాభివిశేషమును పరిపోషించినవి. దూరదేశమునుండి విద్వాంసులు

రాజధానిని చేరవచ్చిరి. విజ్ఞానేశ్వరుడు చక్రవర్తి విక్రమాదిత్యునిగూర్చి, ఆస్థాన విద్వాంసులగూర్చి సామ్రాజ్య వికాసముగూర్చి చేసిన ప్రస్తుతి-ఏకాంతభూషణముగాక బహుముఖముల వినిపించినదే.

కాశ్మీరమునుండి కల్యాణికి బిల్హణకవిని ఆకర్షించిన చాళుక్య సామ్రాజ్యవైభవము శతాబ్దులు తరబడి విక్రమాంకవిజయమున విజ్ఞానేశ్వరీయమున ప్రతిఫలించి సాక్షాత్కరించు చున్నది.

జయసింహుని తిరుగుబాటునుగూర్చి బిల్హణుడు తనకావ్యములో రెండు ప్రకరణములు వినియోగించెను. మొదటి సోమేశ్వరునికాలము ననే జయసింహుడు క్రీ. శ. 1064 ప్రాంతమున తర్దవాడి పాలకుడుగ నున్నాడు. పిమ్మట రెండవ సోమేశ్వరుని కాలమున నొలంబ - సింద వాడులకు పాలకుడై, త్రైలోక్యమల్ల నొలంబపల్లవ పెర్మాడి జయసింగదేవుడుగ ప్రస్తుతుడు. క్రీ. శ. 1077 (జూన్ 2) నాటి శాసనమున 'చెల్వోల 300, పులిగెఱె 300' పాలకుడు. అది యువరాజ పదవి. సత్వరము బనవాసి 12000, అతని ఏలుబడిలో చేరినది. 1083 వరకు జయసింహుడు యువరాజపదవియందుండెను. ఆపిమ్మట శాస నములలో ఆతని ప్రసక్తి మృగ్యము.

జయసింహుని విప్లవోదంతము బిల్హణుడు సవిస్తరముగ వర్ణించెను. సమకాలీనమైన రచన యంతయు పరమసత్యముగ స్వీకరింపకపోయినను, అలనాటి రాజ్యతంత్రమెట్లు నడచినది - చారచక్షువులైన చక్రవర్తుల రాజనీతి - అందభివ్యక్తమగుచున్నది. "ప్రప్రథమున ఆప్తపురుషు డొకడు అంతరంగికముగ విక్రమాదిత్యునకు జయసింహుని దురాలోచన యెఱిగించెను. ఆతడు ప్రజాకంటకుడై ధనార్జన సలిపి సైన్యము నభివృద్ధిచేసెను. అంతేగాక ఆతడు ద్రవిడాధి పతి కడకు రహస్యచారులను పుత్తెంచి కుటిలరాజనీతి తంత్రము నడపు

చుండెను. సత్వరమాతడు కృష్ణవేణీతీరముచేరి యుద్ధము నారంభించ వచ్చును. విక్రమాదిత్యునకు మనస్తాపము కలిగినది. జ్యేష్ఠసోదరుని ఉదంతసంస్మరణము ఆ మనస్తాపమును ద్విగుణీకృతము చేసినది. సోదరుని ప్రవర్తన కేకారణమును ఊహింప లేక, తనకు అందిన వార్తలు నిజమని నమ్మలేక, యాథార్థ్యమును తెలిసికొనుటకు విక్రమాదిత్యుడు చారులను పుత్తెంచెను.

చారులు ఆప్తసందేశమును ధ్రువపరచిరి. విక్రమాదిత్యుడు సోదరునకు సందేశమంపినను జయసింహునకు తాను కోరిన అంతయు చేకూర్చెను. యుద్ధమువలన ఆతనికి కలుగు మేలేదియు లేదు. జయసింహుడు కృష్ణవేణీతీరమును యుద్ధసన్నద్ధుడై చేరుకొనెను. తుది ముహూర్తమున జరిగిన సంధిప్రయత్నములు విఫలములైనవి. ఘోర యుద్ధమున జయసింహుడు పరాభూతుడయ్యెను. సమీపారణ్యమున బందీకృతుడై చేజిక్కిన సోదరుని క్షమించి విక్రమాదిత్యుడు అభయ మిచ్చి రక్షించెను. ఇది బిల్హణ కథనము. బిల్హణుడు జయసింహుని అన్నగారిని పదచ్యుతుని చేయనుంకించిన కులద్రోహిగ చిత్రించెను. ఈ విషయమున జయసింహునకు గురువు విక్రమాదిత్యుడే యని బిల్హణుడు విస్మరించెను. చోళకులోత్తుంగుడు ఆతనికి సాయము చేయకపోవుట చేత, బిల్హణుడు పెద్దచేసి వర్ణించిన ఈ తిరుగుబాటు, పెద్ద యుద్ధము గాకపోవచ్చును. రాజనీతిధురంధరుడైన కులోత్తుంగుని దృష్టిలో జయసింహుని పరాజయము నిశ్చితపూర్వమే.

విక్రమాదిత్యుని పరిపాలనకాలమున, పేర్కొనదగినది హొయసాలుల విస్తరణము.

## హొ య సా లు లు

హొయసాలులు చంద్రవంశజులమని చెప్పుకొనిరి. యాదవాన్వయ సంభూతులుగ అభివర్ణితులు. వీరు తొలుదొల్త చాళుక్య చోళరాజ్యముల

గడిదేశమున గంగవాడికి పశ్చిమమున మైసూరు ప్రాంతమున అభ్యుదయము గాంచిరి. ఈ ప్రదేశమున గంగ, ఆళువ, కదంబ సెనావర సంతార కొంగల్వ ప్రభృతి వంశజులు - చిరు సామంతులు వర్ధిల్లి యుండిరి.

హొయసాలుల తొలిరాజధాని సొసెవూరు. (ముదుగెరె తాలూకా కడూరు మండలము) సోమేశ్వరుని రాణులలో "హొయసలదేవి" హొయసల రాజపుత్రిక. విక్రమాదిత్యుని కాలపు శాసనములు మూడు తరాల హొయసలరాజుల పేర్కొనుచున్నవి. వినయాదిత్యుడు - అతని పుత్రుడు ఎఱ్ఱియంగుడు - అతని పుత్రులు మొదటి బల్లాలుడు - విష్ణువర్ధనులు. హొయసాల వంశవృక్షము.

నృపకాముడు క్రీ. శ. 1021 - 1047
|
వినయాదిత్యుడు 1047 - 1098
|
ఎఱియంగుడు 1063 - 1100
|
బల్లాలుడు I 1100 - 1110 | విష్ణువర్ధనుడు 1110 - 1152 | ఉదయాదిత్యుడు

వినయాదిత్యుడు 'త్రిభువనమల్ల పొయసలదేవ' బిరుదాంకుడు. క్రీ. శ. 1070 నాటి శాసనమాతడు గంగవాడి 96000, దేశాధీశుడని పేర్కొనుచున్నది. "ఈ వర్ణన యాథార్థ్య సూచనగ కంటె, కుహనా సాక్ష్యము సృష్టించు ప్రయత్నముగ తోచుచున్న"దని శ్రీనీలకంఠ శాస్త్రిగారి అభిభాషణము. (1) ఎఱియంగుడు విక్రమాదిత్యుని పక్షము వహించి, కులోత్తుంగునితో యుద్ధమొనర్చినట్లు, హొయసల నరసింహుని

(1) Early History of The Deccan page 359

శాసనమున గలదు. అందాతడు చాళుక్య ప్రభువునకు కుడిభుజమనియు, మలెప, చక్రకూట, కళింగ, ధారా, చోళప్రభువుల జయించినట్లు అభినుతుడు. ఎటియంగులు యువరాజుగ నున్నప్పుడే తండ్రితోకలిసి, చాళుక్య విక్రమాదిత్యుని పక్షమువహించి యీ విజయపరంపరల నార్జించెను. తండ్రి మరణించిన పిమ్మట ఆతడు స్వయముగ రాజ్యమేలినది రెండు సంవత్సరములు మాత్రమే. వినయాదిత్యునికాలముననే హొయసల రాజ్యములో అల్వఖేద, కొంకణ బతులనాడ, తలక్కాడ, సావిమలె సీమలు చేరినవి. మొదటి బల్లాలుడు విక్రమాదిత్యుని సామంతుడై త్రిభువనమల్ల బిరుదాంకుడై పైతృక రాజ్యమేలెను. అతనితో బిట్టిగుడు [విష్ణువర్ధనుడు] అతని సహోదరుడు సహకరించెను. ఆతడు క్రీ. శ. 1101 లో త్రిభువనమల్ల బిరుదాంకుడై గంగవాడికి పాలకుడు. బిట్టిగుడు సర్వసమర్థుడైన సేనాని. మేధావియైన యోధుడు. ఆతని చాకచక్యమువలన హొయసాలరాజ్యమున చోళ చాళుక్య సామ్రాజ్యముల క్రిందనున్న సీమలు చేరినవి.

విష్ణువర్ధనుడు వహించిన బిరుదావళి చరిత్రలో ఆతడు నిర్వహించిన భూమికకు వ్యాఖ్యానప్రాయము. తలక్కాడు బనవాసె హానుంగల్లుగొండ, వీరగంగ, విజయనొనంబ, సాహస కదంబ బిరుదాంకుడాతడు. క్రీ. శ. 1117 నాటి శాసనము ఆతని తలక్కాడు గాంగవిజయములను, ఉచ్ఛంగి పాండ్యులపై విజయము, తులు విజయము, జగద్దేవ, ఇదుంగోల ప్రభువుల నుక్కడంచుట, కాంచిని గజగజలాడించిన పూర్వదిగ్విజయయాత్రను అభినుతించుచున్నది. మరియొక శాసనము విష్ణువర్ధనుని కదంబవన దవానలునిగ, జయకేశి మేఘానిలునిగ ప్రస్తుతించుచున్నది. విక్రమాదిత్యుని మంత్రులు హొయసలుల విజృంభణకు దద్దరిల్లి విక్రమాదిత్యుని జాగరూకత వహింపుమని హెచ్చరించినట్లు ఆశాసనమునందేగలదు. ఇవి హొయసల భవితవ్యతా సూచకము.

హొయసలశాసనములు జగద్దేవుని మాల్వాధీశునిగ పేర్కొను చున్నవి. జగద్దేవుడు విక్రమాదిత్యుని సాయమున సోమేశ్వరునికాలమున సింహాసనమధిష్ఠించిన జయసింహుని మనుమడు. ఉదయాదిత్యుని పుత్రుడు.

జగద్దేవుని జయనాడు శాసనమున ఆతడు ఆంధ్రవిభుని, చక్రదుర్గాధిపతిని, జయించి ద్వారసముద్రనగర ప్రవేశము సల్పి నట్లు కలదు. హొయసాలశాసనములలో చాళుక్యసమ్రాట్ హొయ సలుపైకి పంపిన యోధులలో మాళవేశ్వరజగద్దేవుని పేర్కొను చున్నవి. క్రీ. శ. 1118 నాటిశాసనము విష్ణువర్ధనుని సేనాని గంగరాజు ఒకనాటి రాత్రి విక్రమాదిత్యునిపక్షమునవచ్చి, దండువిడిసిన ద్వాదశసామంతుల సైన్యముపైబడి విజయము సాధించెనని చెప్పు చున్నది. అప్పుడు చాళుక్యులకు సంభవించిన అపారనష్టమునుగూర్చి, వేరుసాక్ష్యము లభించుటలేదు. ఉచ్ఛంగి పాండ్యులు, హాంగల్ కదంబులు ఆ యా రాజ్యములను పరిపాలించుచునే కన్పించుచున్నారు. జయకేశుడు ఇటు నటు ఊగులాడి, చివరకు విజయాదిత్యుని పుత్రిక మైలాలదేవిని పెండ్లాడి చాళుక్యపక్షముచేరెను. క్రీ. శ. 1124 న ఆదంపతులు గోవారాజ్య మేలుచున్న శాసనము గలదు.

క్రీ. శ. 1122 ప్రాంతమున జరిగిన "మహాయుద్ధము" పేర్కొనదగినది. ఆ యుద్ధము హొయసాల చిట్టిదేవుని దండనాధుడు బొప్పనకు త్రిభువనమల్ల భుజబల గంగపెర్మాడిదేవుడు మండలి విభునకు మధ్య జరిగినది. నన్నిగంగపెర్మాడిదేవుడు భుజబలునిపుత్రుడు ఆ యుద్ధమున మరణించెను. సిందశాసనములు హొయసల శాసనస్థములైన విజయము లన్నియు సత్యములు కావని నిరూపించుచున్నవి. "సార్వభౌముడైన విక్రముని ఆజ్ఞచే 'ఆచుగి' II, రణసింహుడు మధ్యందిన మార్తాండుని వలె విజృంభించి హొయసలుల జయించి, గోవాను ఆక్రమించి

లక్ష్మణుని సంహరించినట్లును పాండ్య మాలెపలును కొంకణము నుండి పారద్రోలినట్లును చెప్పుచున్నవి. అటుగి పుత్రుడు పెర్మాడిదేవుడు కుల శేఖ రాంకుని శిరస్సు ఖండించి, చట్టభూ:భుని జీవద్గ్రాహము గాఁబందీ కృతునిచేసి, విభూతుడైన జయకేశిని తరిమికొట్టినట్లు చెప్పబడినది. అజేయుడని ప్రసిద్ధికెక్కిన బిట్టిగుడు దాగిన గిరిదుర్గమును పెర్మాడి దేవుడు ముట్టడించి ద్వారసముద్రమును బేలూరుపురమును ప్రవేశించి నట్లు చెప్పబడినది. (1)

పరస్పరవిరుద్ధమైన శాసనసాక్ష్యములననుశీలించినచో - హొయ సలలో అప్రతిహతులై విజృంభింపలేదనితోచును. క్రీ. శ. 1118 లో చాళుక్యుల ద్వాదశసామంతులు విడిచిసిన 'కణ్ణెగల' హొయసల రాజ ధాని, ద్వారసముద్రమునకు సమీపముననున్నది. ద్వారసముద్రము ముట్టడింపబడుట విష్ణువర్ధనుడు గురిదుర్గములో తలదాచుకొనుట - సత్యదూరములు కాజాలవు. అచుగి సాధించిన విజయానంతరము జయకేశి చాళుక్యసమ్రాట్టుతో చేరి అతని పుత్రికను వివాహమాడుట హాలసూరుయుద్ధమున చాళుక్యసామంతుడు చాళుక్యసామ్రాజ్య రక్షణకై గాంగరాజపుత్రుడు అసువులబాయుట - మున్నగు సన్నివేశ ములబట్టి ఈ యుద్ధము చాలకాలము సాగినట్లు తోచుచున్నది. క్రీ. శ. 1122 లో విక్రమాదిత్యుడే స్వయముగ సేనలకు అధిపత్యము వహించి బనవాసిలోని జయంతీపురమున విడిసియుండెను. విక్రమాదిత్యుడు వహించిన విష్ణువర్ధనబిరుదమాతడు విష్ణువర్ధనునిపై సాధించిన విజయ మునకు నిదర్శనము. సమస్కంధుల జయించినప్పుడు మాత్రమే యోధులు ప్రత్యర్థుల బిరుదములు స్వీకరించుటకద్దు. దీనివలన, పరోక్షముగ విష్ణువర్ధనుని ప్రాభవము స్వయంవ్యక్తమగును. విష్ణు వర్ధనుడు విక్రమాదిత్యుని అధిపత్యమంగీకరించి సంధిచేసికొనెను.

---

(1) మూడవసోమేశ్వరుని అధిపత్యమునుగూడ కొంతకాలము అంగీకరించెను.

విజయాదిత్యుని మరణానంతరము వేంగిరాజ్యము చోళరాజ పుత్రుల అధిపత్యముననున్నది. క్రీ. శ. 1092 ప్రాంతమున వేంగిలో కల్లోలమేర్పడెను. విక్రమచోళుడు ద్విముఖయుద్ధము చేయవలసివచ్చెను. అటుకళింగభీమునితో- ఇటు కొలనువిభునితో. ఇందు విక్రమాదిత్యుని పరోక్షప్రభావమెంతవరకుకలదో? చెప్పుట కష్టము. అచిరకాలమున చాళుక్య విక్రమశకశాసనములు ద్రాక్షారామమున వెలసినవి. క్రీ. శ. 1118, సుప్రసిద్ధచాళుక్యసేనాని అనంతపాలుడు వేంగి (14000) పాలకుడుగ అభినుతుడు. అనంతపాలుని పట్టమహాదేవి దానశాసనము ద్రాక్షారామమున గలదు. క్రీ. శ. 1127లో అనంతపాలుడు 'కొండపల్లి'ని పరిపాలించెను. అంతకుముందే గోవింద దండనాధుడు- అనంతపాలుని మేనల్లుడు రాజధాని జాననాధపురిపై (బెజవాడ) దండెత్తినట్లు చెప్పబడినది. ఆతడు వెలనాటిచోడులను చోళులను జయించి వేంగిని దగ్గమొనర్చినట్లు చెప్పుకొనెను. క్రీ. శ. 1132 వరకు చాళుక్యశకముతోనున్న శాసనములు దక్షారామమున కన్పించుచున్నవి. క్రీ. శ. 1202 నాటి శాసనసాక్ష్యము ఉదాహరణీయము. అందు పిఠాపురమల్లపదేవుడు అపూర్వపురుషుడైన కులోత్తుంగుడు పంచద్రావిడములను ఆంధ్రమును ఏబదివత్సరములేలిన పిమ్మట, వేంగినాడు అరాజకత్వమునకు లోనైనది ("వేంగిభూమి ర్నాయకరహితాజాతా") చిరకాలము కులోత్తుంగుని వశమైయున్న వేంగిభూమిని, ఎట్టకేలకు విక్రమాదిత్యుడు కైవసమొనర్చుకొని కృతార్థుడు కాగలిగెను.

సోమేశ్వరుడు అనుమకొండ విషయమును కాకతీయుల కొసగెను. విక్రమాదిత్యుడు సచ్చి (సహస్ర) మండలమును కాకతీయుల కొసగుటలో దూరదృష్టిగల రాజనీతి ఇమిడియున్నదని తెలుచున్నది.

విక్రమాదిత్యుడు యశఃకాముడు. క్రీ. శ. 1123 లో ద్రవిడ

దేశమునుండి క్రీ. శ. 1087 లో వచ్చి స్థిరనివాసమేర్పరచుకొనిన 500 మంది బ్రాహ్మణవిద్వాంసులకు అగ్రహారదానముసల్పెను. క్రీ. శ. 1099 లో నర్మదానదీతీరమున "తులాపురుష దానము సల్పెను. వామరాశిదేవుడు క్రీ. శ. 1082 లో అనంతశివదేవుడు 1111 లో రాజగురువులు. బ్రాహ్మణులు అనేకులు 'ఇదం బ్రాహ్మ మిదం క్షాత్ర' మనురీతిని, 'సాహితీరణ' ప్రౌఢులై వర్ధిల్లిరి. అనంతపాల - నంబి దండాధిప, నారాయణ, వామన, లక్కన సోవరులు ఉదాహరణీయులు. వాణస కాళిదాస కుటుంబము మధుసూదనయ్య కేశవ ప్రభృతులు సురేశ్వరపండితుడు ప్రభృతులు పలువురు సుప్రసిద్ధులు. రెండువందల మంది కురువత్తి బ్రాహ్మణులు బ్రాహ్మ్యమునందేగాక క్షాత్రమునందు గూడ అభినివేశులు.గడగ్ శాసనమందభినుతుడైన సోమేశ్వరుని గూర్చి వేరుగ చెప్ప నవసరములేదు. పరాక్రమోపేతులైన మేధావులకు అలనాటి రాజ్యతంత్రములోగల విశిష్టస్థానము ఎన్నదగినది.

### కల్యాణిచాళుక్య సామ్రాజ్యము :
### విక్రమాదిత్యుని తరువాతి రాజులు

విక్రమాదిత్యుని తరువాత సోమేశ్వరుడు III సింహాసన మధిష్ఠించి క్రీ. శ. 1126 నుండి 1138 వరకు రాజ్యమేలెను. ఈతడు భూలోకవిక్రమ బిరుదాంకుడై భూలోకమల్ల శకము నారంభించెను. రాజధాని కల్యాణీనగరమే. గోదావరీమండల మందలి భీమవరమున భువనైకమల్లుని తొమ్మిదవరాజ్యసంవత్సరమున లక్ష్మణరసదండనాయకుని శాసనమునుబట్టి వేంగిమండలముపై చాళుక్యుల ఆధిపత్యము స్థిరపడుచున్నది. కాని గుంటూరుమండలమందలి చేబ్రోలులో [అనంతపాలుడేలిన సీమలో] మహామండలేశ్వరనంబయ్య కొల్లిపాక షట్సహస్రాధిపతి విక్రమచోళుని సామంతుడు. క్రీ. శ. 1127 లో పరిపాలించుచున్న శాసనము గలదు. వేంగిభూమిలో

పశ్చిమచాళుక్యుల ఆధిపత్యమును తిరిగి నెలకొల్పుటకు సోమేశ్వరుడు స్వయముగా దండయాత్రను నడపెను. వెలనాటి చోడగొంక i దక్షారామశాసనము కుంతలవిభుని సమక్షమున గోదావరీతీరమున జరిగిన యుద్ధములో గోవింద లక్ష్మణ సేనానులిరువురను జయించి నట్లున్నది.

పశ్చిమరంగమున, హొయసల విష్ణువర్ధనుడు చాళుక్యసోమేశ్వరుని ఆధిపత్యము క్రీ. శ. 1137 వరకు గుర్తించినట్లు శాసననిదర్శనము లున్నవి. అందాతడు "చాళుక్యమణిమాండలిక చూడామణిగా" చెప్పుకొనెను. (1)

అయినను, క్రీ. శ. 1137 కు ముందే స్వతంత్రరాజచిహ్నితమైన బిరుదులతో విష్ణువర్ధనుడు వేసిన శాసనములును గలవు. క్రీ. శ. 1139 నాటిశాసనమున హొయసలదేవుడు స్వతంత్రప్రతిపత్తితో గంగవాడి నొలంబవాడిని పరిపాలించుచు హంగల్ ముట్టడించినట్లు చెప్పికొనినాడు. సోమేశ్వరుడు శాంతిప్రియుడు. ద్వారసముద్ర రాజ్యస్వతంత్ర ప్రతిపత్తి నంగీకరించి యూరకొనెను.

సోమేశ్వరుడు షోడశదానములొనర్చెను. విజ్ఞానసర్వస్వకల్పమైన "అభిలషితచింతామణి" [=మానసోల్లాసము] అను నూరాశ్వాసముల గ్రంథమును రచించెను. అనంతపాలాది దండనాథులు- విక్రమాదిత్యుని సమయమున పనిచేసి అనువజ్ఞులైన దండనాథులనేకులు సోమేశ్వరుని కాలమునగూడ పనిచేసి రాజ్యచక్రమును త్రిప్పిరి.

సోమేశ్వరుని పిమ్మట అతనిపుత్రుడు రెండవ జగదేకమల్లుడు రాజయ్యెను. అతడు క్రీ. శ. 1138 నుండి 1151 వరకు రాజ్యమేలెను. అతనికాలమున హొయసల విష్ణువర్ధనుడు బంకాపురమును ద్వితీయ రాజధానిగ చేసికొని కుమారుడైన నవసింహుని ద్వారసముద్రముకడ

---

(1) **Dynasties of the Kanarese Districts.**

నుంచెను. క్రీ. శ. 1149 లో విష్ణువర్ధనుడు బంకాపురమునుండి వేసిన శాసనములలో అతనిరాజ్యము గంగవాడి నాలంబవాడి బనవాసి హాంగర్ హుల్లిగెరెతోపాటు ద్వారసముద్రమునుండి కృష్ణానదివరకు విస్తరించినదని ప్రకటించినాడు. ఈ ప్రకటన అతిశయోక్తిభూయిష్ఠము కావచ్చును గాని ఇది చాళుక్యసామ్రాజ్య విచ్ఛేదసూచకము.

జగదేకమల్లునితరువాత అతని తమ్ముడు మూడవ తైలపదేవుడు సింహాసనమధిష్ఠించి క్రీ. శ. 1150 నుండి 1156 వరకు రాజ్యమేలెను. మూడవ సోమేశ్వరుని కాలమునుండి 'తర్దవాడి'లో సామంతులై యుండిన కలచురి ప్రభువులు ప్రబలులైరి. అనుమకొండ, సబ్బి మండలాధిపతులైన కాకతీయులు మొదటి సోమేశ్వరునికాలమునుండి తమరాజ్యమును విస్తరించుచుండిరి. రెండవతైలపునికాలమునుండి స్వామిభక్తులైయున్న యాదవరాజులుగూడ తమరాజ్యమును విస్తరించు చుండిరి. ద్వారసముద్రమున హొయసాలనరసింహుడు స్వతంత్ర ప్రతిపత్తితో రాజ్యమేలుచుండెను. కేంద్రప్రభుత్వము క్షీణించుచుండ సామంతులు స్పర్ధతో రాజ్యవిస్తరణమునకై యత్నించుచుండిరి. కలచురిబిజ్జన తొలుత మూడవ తైలపునకు విశ్వాసపాత్రుడుగానుండి క్రీ. శ. 1157 నాటికి సర్వతంత్ర స్వతంత్రుడై రాజ్యమేలసాగెను. తైలపుడు చాళుక్యసామ్రాజ్యప్రతిష్ఠ తిరిగి నిలబెట్టుటకు చేసిన విఫల ప్రయత్నము అతడు అరంభించిన అనుమకొండ దండయాత్ర. కాకతి ప్రోలరాజాతని ఓడించి బందీకృతుడైన తైలుని, స్వామిభక్తిచే జాలిదలచి విడిచి పుచ్చెనని చెప్పుకొనెను. (1) అంతటితో శత్రుత్వము నమసిపోలేదు. తైలపుడు కాకతిరుద్రుని భయముచే ఏర్పడిన రక్తవిరేచనములవలన మరణించినట్లు కాకతీయశాసన కథనము.

---

(1) ఈ గ్రంథమునందలి కాకతీయుల చరిత్ర చూడనగును.

ఈ కల్లోలపరిస్థితులలో, సాహసమువహించి బిజ్జలుడు కల్యాణి నాక్రమించి సార్వభౌముడుగ ప్రకటించుకొనెను. (1) క్రీ. శ. 1183 లో తైలపుని పుత్రుడు నాలుగవసోమేశ్వరుడు కల్యాణిసింహాసనము నాక్రమింపగల్గెను. అతనికి తోడ్పడినది బ్రహ్మసేనాని, కలచురికొలువు వీడి చాళుక్యసోమేశ్వరునికి సాయమొనర్చెను. కాని, నాలుగవ సోమేశ్వరుడు వంశప్రతిష్ఠను తిరిగి నెలకొల్పలేకపోయెను. క్రీ. శ. 1189 లో యాదవభిల్లముడు[క్రీ. శ. 1187 - 91]చాళుక్యరాజ్యముపై దండెత్తి ఉత్తరప్రాంతమును జయించి వశపరచుకొనెను. అయినను యాదవులుగూడ కలచురి వంశీయులవలె చాళుక్యులకు వారసులు కాలేకపోయిరి. ఒకానొకప్పుడు చాళుక్యులకు సామంతులై, నాడు ప్రబలులైన హొయసలులుగాని యాదవులుగాని కాకతీయులుగాని ఒకరి ఆధిపత్యమును వేరొకరు అంగీకరింపరు. కలచురి వంశీయుల భగ్నప్రయత్నముకుగూడ అదేకారణము. పెద్దరాజ్యములు స్థాపించిన వారిమాటయేగాక రట్టులు, శిలాహారులు,కదంబులుగూడ సామంతులు సార్వభౌములగుటకు అంగీకరింపలేదు. భిల్లముని ధాటికోర్వలేక సోమేశ్వరుడు - అతని దండనాథుడు బమ్మయ బనవాసికి రాజధాని మార్చిరి. కల్యాణి యాదవులవశమయ్యెను. బనవాసికి విచ్చేసిన చాళుక్యులపై హొయసలబల్లాలుడు ii నిరంతరయుద్ధములొనర్చి క్రీ. శ. 1190 లో పూర్తిగ ఓడింపగల్గెను. సోమేశ్వరుడొక దశాబ్ది అజ్ఞాతజీవితము గడపి అంతరించెను.

క్రీ. శ. 1190 లో బల్లాలుడు చాళుక్యచక్రవర్తిపై సాధించిన విజయము యాదవభిల్లముని స్పర్థకు కారణమైనది. యాదవ హొయసలసేనలు ఘోరసంగ్రామములకు తారసిల్లినవి. సొరతూరు లక్కుండి మున్నగుచోట్ల యుద్ధములు జరిగినవి. క్రీ. శ. 1191 భిల్లముడు యుద్ధనిహతుడయ్యెను. హొయసలులు తమరాజ్యమును

(1) ప్రకరణాంతరమున కలచురి రాజవంశచరిత్ర కానవగును.

కృష్ణానదివరకు విస్తరించిరి. కృష్ణకు ఉత్తరభాగము యాదవరాజుల అధీనమందుండెను. దేవగిరి నిర్మించి యాదవరాజధానిగ తీర్చిదిద్దినది భిల్లముడే.

భిల్లముని తదనంతరము యాదవసింహాసనమధిష్ఠించినది జైతుగి. అతడు భిల్లముని పుత్రుడు. ఆతడు యాదవరాజ్యమునందలి ఉత్తర ప్రదేశమును బల్లాలుని వశమందుండుటకు సమ్మతింపక యుద్ధము లొనర్చెను. సార్వభౌమత్వమునకు యాదవులు చేసిన ప్రయత్న ఫలితముగ కాకతీయులతో గూడ వారికి వైరమేర్పడినది. కాకతి రుద్రుడు యుద్ధనిహతుడయ్యెను. ఆతని సహోదరుడు మహాదేవుడు గూడ యుద్ధనిహతుడయ్యెను. గణపతిదేవుడు - మహాదేవుని పుత్రుడు బందీకృతుడై పదివత్సరములు యాదవకారాగారమున క్రమగ్గెను. కాని జైతుగి గణపతిని బంధవిముక్తుని చేసెను. (క్రీ. శ. 1210 ప్రాంతము) జైతుగి పుత్రుడు సింఘన క్రీ.శ.1210 ప్రాంతమున సింహాసన మధిష్ఠింపగనే హొయసలదండయాత్ర కుపక్రమించెను. యాదవులకు కొంకణకదంబులు మున్నుగుసామంతులు తోడ్పడిరి. ఆ యుద్ధముల ఫలితముగ బల్లాలుడు, భిల్లమునితో పోరిసంపాదించిన ఉత్తరప్రదేశము లను యాదవులకు కోల్పోయెను. బంధవిముక్తిగాంచిన గణపతిదేవుడు కాకతీయసామ్రాజ్యనిర్మాత కాజొచ్చెను. యథాప్రకారము చోళులు నిర్వహించిన సార్వభౌమాధికారమునకై యాదవులు - కాకతీయులు- హొయసలులు కలుగనసాగిరి.

## కల్యాణి చాళుక్య రాజ్యము

### రాజ్యతంత్రము - సంఘవృత్తములు

కల్యాణిచాళుక్యులు బాదామిచాళుక్యుల వంశీయులమని అవకాశము లభించినపుడెల్ల అనేకశాసనములలో ప్రకటించుకొనిరి. బాదామిచాళుక్యులవలెనే కల్యాణిచాళుక్యులు మయూరధ్వజులు.

వరాహ లాంఛనులు. వారిప్రశస్తి: సమస్తభువనాశ్రయ శ్రీ పృథ్వీవల్లభ మహారాజాధిరాజ పరమేశ్వర పరమభట్టారక సత్యాశ్రయకులతిలక శ్రీమత్........[అట్లే సామంతులకుగూడ ప్రశస్తులుండెడివి]తరువాత ఆ యా రాజుల బిరుదావళులు.

రాజులు వేదవేదాంగపారంగతులై ఇతిహాసపురాణశాస్త్రముల నభ్యసించుచుండిరి. విక్రమాదిత్యుడు శైశవమున సింహకిశోరములతో ఆడుకొనినట్లు బిల్హణకథనము. వ్యక్తిప్రాధాన్యనిష్ఠమైన ప్రాచీన సంఘమున కాబోవు రాజులకు తగినశిక్షణ శైశవమాదిగ లభించు చుండెడిది. చక్రవర్తి సర్వసేనాపతి, ధర్మాధ్యక్షుడు. క్రీ. శ. 991 లో రెండవ తైలపునినాటి సన్నివేశము ఉదాహరణీయము. రాష్ట్రకూట చక్రవర్తి మూడవకృష్ణరాజు కాలమున తలబరువు తమలపాకులకట్టపై సుంకము 2¼ పణములు. ఆదిత్యవర్మరను కొగళి 500 పాలకుడు ఆ సుంకమును హెచ్చించెను. చాళ్గుళి 50, (వర్తకసమితి) 1000 తాంబూలికుల ప్రతినిధులు ముప్వురు 'పంశతి' వారు చక్రవర్తిని నిండు కొలువుకూటమున దర్శించి, "శ్రీవారి పాదపద్మములకు నమస్కరించి" వినతిపత్రము సమర్పించిరి. తైలపుడు ఆ విన్నపమునాలకించి కృష్ణరాజు కాలమునాటి సుంకమే పరిగ్రహింపవలెనని తీర్పుచెప్పెను. క్రీ. శ. 1104 లో అగ్రహారమహాజనులు బొయప్ప 'మన్నెయ' పై అభియోగముతెచ్చిరి. అతడు అగ్రహారమును దోచుకొని బ్రాహ్మణుల సైతము వధించెను. బొప్పయ మన్నెయ పదవినుండి తొలగింపబడెను. బొప్పయ త్రిపురాంతకదేవుని యెదుట తీర్థముత్రాగి, పశ్చాత్తప్తుడై భవిష్యత్తులో తానుగాని తన సంతతివారుగాని తిరిగి ఆ పదవిని కాంక్షించరాదని శపథము గైకొనవలెనని తీర్పు. రాజాజ్ఞ చెల్లునట్లు సోమేశ్వరదండనాథుడు చూడవలెను.

రాజగురువులు శైవులు. ఎడనెడ ఆ పదవిలో జైనులుగూడ కన్పించుచున్నారు. చాళుక్యులమత సహనము ఎన్నదగినది. శైవ

వైష్ణవదేవాలయములు జైనబసతులు, ఒక బౌద్ధవిహారము చాళుక్య రాజ్యమున వర్ధిల్లినవి. రాజోద్యోగులలో సంధివిగ్రహికపదవి మిక్కిలి ప్రాముఖ్యము వహించినది. నేటిపరిభాషలో ఆ పదమునకు రాయబారి అని అర్థము. అలనాడు సామంతులు పలువురు పరరాజన్యులతో మాత్రమేగాక రాజు పలువురు సామంతులతో వ్యవహారములు సలిపి సంప్రదాయసూక్ష్మములపై నిర్ణయము గైకొనవలసియుండెను. ఇందుకు రాజనీతిచతురులైన వివేకులు విద్యావంతులు అవసరము. హెరిసంధివిగ్రహికుడు అనిన మహాసంధివిగ్రహికుడు. సేనాపతి, మహా(ప్రచండ)సేనాపతి అనెయసాహిణి పదములు కన్పించుచున్నవి. నాగయదేవయ్య "చాళుక్యచక్రేశ్వర కటకబాహట్టరనియోగి నివహారాధ్యక్షుడు సహవాసిగళ్-అధిష్ఠాయక" పదవి మరియొకటి సహవాసులు రాజుకు సహచరులై, అంగరక్షకులై యుండెడివారు. ఈ వ్యవస్థయే హొయసాలులలో గరుడులుగ, కన్పించుచున్నది.

చంద్రగ్రహణసమయమున రాజు తనకు సంధివిగ్రహికుడు రవియణభట్టు సమర్పించిన వినతిపత్రము పురస్కరించుకొని అతడు కట్టించిన దేవాలయమునకు గ్రామదానము సల్పెను ఛత్రచామరములు, వెల్లగొడుగు, శాసనము, రాజలాంఛనములు, అవి వ్యక్తులకేగాక వ్యవస్థలకుగూడ లభించుచుండెడివి.

చాళుక్యరాజ్యనిర్వహణలో మేధావులు, పండితులు ఉన్నతోద్యోగులై నిర్వహించిన పాత్ర పేర్కొనదగినది. ఉద్యోగిమండలికి అధిపతి యువరాజు. యువరాజపదవికి లాంఛనము కాంతికము. ఈ పదవి రాజకుమారులకేగాక పుత్రనిర్విశేషములుగ చూచినవారికి క్వాచిత్కముగ అనుగ్రహించుచుండెడివాడు. ఇదం బ్రాహ్మ మిదం క్షాత్రమనుచొప్పున సేనాపతులైన బ్రాహ్మణ విద్వాంసులనేకులుగలరు. ధల్లుడు – అతని పుత్రుడు నాగదేవుడు, రెండవ తైలపుని దండనాథులు. మొదటి సోమేశ్వరుని కాలమునాటి వాణసవంశీయుల ప్రశస్తి నాగై శాసనము

ఉగ్గడించుచున్నది. కాళిదాసు - అయిదుగురుపుత్రులు-దండనాథులే. అందు జ్యేష్ఠుడు బాచిరాజు, చాళుక్యచక్రవర్తిత్వము నిలబెట్టినవాడు. మూడవవాడు మధుసూదనయ్య విష్ణ్వంశ సంభూతుడు. ఆతని దిగ్విజయయాత్రావైభవము సార్వభౌమత తలపించును. ప్రజల దృష్టిలో ఆతనికి సార్వభౌమునకు భేదమేలేదని శాసనమే ప్రవచించు చున్నది. అనంతపాలసోదరులు - సోమేశ్వరుడు పూర్వోదాహృతులే.

రవిదేవుడు సంగీతవిద్వాంసుడు. ఆతడు పాడునప్పుడు శ్రోతలు "ఇది అమృతవర్షమా, మధుపాతమా"అని విస్మితులగుచుండెడివారు. ఆతడు సంధివిగ్రహికుడు, అనేకభాషాలిపికోవిదుడు. ఏలికతనకిచ్చిన మూడుగ్రామముల నాతడు బ్రాహ్మణులకు అగ్రహారములుగ దాన మిచ్చెను.

క్రీ. శ. 1045లో జైనబసతిఅవరణములో నాటకశాల నిర్మితము. గీతనృత్యోపహారములకు- జంత్రవాద్యములకు దేవాలయములలో మాన్యములుండెడివి. క్రీ. శ. 1049 లో షిరూరు దేవాలయమున ఇద్దరు సంగీతవిద్వాంసులకు ఇద్దరు దేవదాసులకు, ఇద్దరునర్తకులకు మాన్యములేర్పరుపబడినవి. స్త్రీలు చాళుక్యసామ్రాజ్యమున సముచిత స్థానము నలంకరించిరి. అక్కదేవి రణరంగమున నాయకత్వము వహించి సేనలనడపిన వీరనారీమణి. విక్రమాదిత్యునిరాణి లక్ష్మీదేవి కల్యాణీ నగరమును చక్రవర్తితో సమభాగినిగా పరిపాలించుచున్నట్లు చెప్పబడినది. అంతఃపురమునందలి అతివలనందరి నతిక్రమించి, సౌందర్యసౌశీల్యములతో చక్రవర్తినలరింపగలనేర్పు అందరకుండునని చెప్పుట పొసగదు. భారతీయరాజపుత్రుడు అవశ్యము నేర్వవలసిన విద్యలలో విలాసినులవలలో పడకుండ తప్పించుకొనుట. హొయసాలరాణులు పద్మల, చావతీ చొప్పదేవులు గాననృత్యకళాకోవిదలు. కలచూర్యసోవిదేవుని భార్య సావలదేవి నృత్యగానకళాభినివేశము

ఉగ్గడించు శాసనము ఆమె అభిరూపభూయిష్ఠమైన సభను రంజింప జేసెడిదని చెప్పుచున్నది. ఆమెసోదరుడు బ్రహ్మవీణా విద్వాంసుడు. త్రిభువనమల్ల మల్లిదేవ చోడమహారాజ పట్టమహిషి లక్ష్మీదేవి కావ్య వాఙ్మయవిదుషీమణి. సిందరాచమల్లుని మంత్రి బాచిరాజు క్రీ.శ.1180 ప్రాంతమున మరణించినప్పుడు అతనిభార్యలు బైవియక్క మాల్వని యక్క సహగమనము సల్పిరి. బేలటూరునందలి కన్నడశాసనము, అంతకు ఒకశతాబ్దికి పూర్వమే దేకబె సల్పిన సహగమనమును గుండె కరగిపోవునట్లు అభివర్ణించుచున్నది. అయినను సహగమనము క్వాచిత్కమేగాని సార్వజనీనము కాదు.

అశ్వములనధిరోహించి రాజపుత్రులు ఆడిన కందుకక్రీడను ప్రస్తావించు శాసనములున్నవి.

వర్తకసంఘములు 'శ్రేణులు' ఉండెడివి. దానములు ధనరూపమున ఆ ధనముపైవచ్చు "వడ్డీ"ని ప్రతివార్షికదానముగ నెలకొల్పుట గలదు. క్రీ. శ. 1054 నాటి శాసనము దానముగా నివ్వబడిన వడ్డీని పేర్కొనుచున్నది. 15 గద్యాణములు నిత్యదీపారాధనకు, 25 గద్యాణములు 8 మంది ప్రవాసులభోజనార్థము, 2 గద్యాణములు వంటవాని జీతము. క్రీ. శ. 1062 నాటిషిరూరు శాసనము 1000 గద్యాణములకు సంవత్సరమునకు వడ్డీ 150 గద్యాణములు [15%] అనిచెప్పుచున్నది. ఆయువడక మహాజనములు 200 గద్యాణములకు వార్షికము వడ్డీ 40 గద్యాణములు చెల్లించుచుండిరి.(20%) మరి 1000 గద్యాణములకు వార్షికము 100 గద్యాణములు [10%] వడ్డీవచ్చినది. 10 పణములు ఒక గద్యాణము. హగ=¼పణపెస=½పణ. కాని=¼పిస.

సంస్కృత విద్యాభ్యాసమునకు ఆదరణమెండు. అనేక ఘటికాలయములు వర్ధిల్లినవి. క్రీ.శ. 1058 లో వాణసమధుసూదనయ్య మధుసూదనాలయ ప్రాంగణమున నిర్మించిన ఘటికాశాల ఉదాహరణప్రాయ

మైనది. అందు 250మంది బ్రహ్మచారులకు ఉచితవిద్యాభ్యాససౌకర్యము ఏర్పరుపబడినది. వేదవిభాగమున 200 మంది, శాస్త్రవిద్యలో 50 మంది. భాట్ట, న్యాయ, ప్రభాకర మీమాంసాశాస్త్రబోధకు ముగ్గురు అధ్యాపకులు, వేదపండితులు ముగ్గురు. గ్రంథాలయ నిర్వహణకై ఒక పండితుడు. మొత్తము 257 మంది. అధ్యాపకులజీతములు. భాట్ట దర్శనాచార్యునకు 30 మత్తరుల భూమి. న్యాయాధ్యాపకునకు 30 మత్తరులు. ప్రభాకరమీమాంసాధ్యాపకునకు 45, గ్రంథాలయాధ్యాపకునకు 30, ఘడియారశాలా నిర్వాహకునకు 30 మత్తరులు. వేదాధ్యాపకులకు జీతముగ భూదానముపేర్కొనబడలేదు. ఏలనన 400 మంది బ్రాహ్మణులకు ఆ అగ్రహారమున వృత్తులు కల్పింపబడినవి. ఆ అగ్రహారము భూలోకమున మధుసూదనయ్య నిర్మించిన బ్రహ్మలోకముగా ప్రస్తుతింపబడినది. రాణి మలయమతి చేసినదానము :

| | | |
|---|---|---|
| 8 | గద్యాణములు | - వ్యాఖ్యానదుపాధ్యాయునకు. |
| 11 | ,, | - పౌరాణికునకు |
| 12 | ,, | - ఋగ్వేదఖండికలబోధించు ఇరువురు ఉపాధ్యాయులకు |
| 2 | ,, | - అగ్నిహోత్రిబ్రాహ్మణునకు |

సోమేశ్వరుని విద్యాదానము ఉగ్గడింపదగినది.

తర్కవ్యాకరణ విద్యలకు చేసిన దానములును గలవు. క్రీ. శ. 1024నాటి మరొకశాసనము జైనాచార్యుడు అనంతవర్మముని వైదుష్యమును ప్రశంసించుచున్నది. ఆతడు వ్యాకరణ, నిఘంటు, గణిత, వాత్స్యాయన, జ్యోతిష శకునచ్ఛందోవిద్యలలో మనుగాంధర్వాలంకార మహాకావ్యనాటక ఆధ్యాత్మిక అర్థశాస్త్ర సిద్ధాంత ప్రమాణములలో ఆరితేరినవాడని అభినుతుడు.

క్రీ. శ. పదునొకటవశతాబ్దినాటి ముల్‌గుండశాసనము వ్యాకరణ విద్వాంసుడు నరేంద్రసేనని - అతని శిష్యుని నయసేనుని పేర్కొని వారిరువురు, చంద్ర, కాతంత్ర జైనేంద్ర శబ్దానుశాసనదర్శననిష్ణాతులని వచించుచున్నది. ఉన్నతవిద్యాధికులు గ్రామములకు తరలివెళ్లుట చాళుక్యరాజ్యమందలి విశేషము.

## కన్నడ సాహిత్యము

పశ్చిమ చాళుక్యులకాలమున రాజభాష సంస్కృతమైనను, దేశభాషయైన కన్నడమునకుకూడ రాజపూజ్యత సభాగౌరవమేర్పడినది. వాతాపిచాళుక్యులకాలమునుండియు దేశభాషతోపాటు దేవభాషకు కూడ సముచితస్థానము కల్పించుట చాళుక్య (పూర్వపశ్చిమ)రాజనీతి. అందుచే ఉభయభాషాకవులు వర్ధిల్లిరి. చాళుక్యరాజాస్థానమున ఎందరో ఉభయకవిమిత్రులు! శాసనములలోగూడ సంస్కృత కన్నడములు జోడింపబడినది. కన్నడ సాహిత్యమున శాసన కృతి కర్తలైన కవులు విశేషాభినివేశమును ప్రదర్శించిరి. (1) క్రీ. శ. 1057 నాటి బెలటూరుశాసనము ఉదాహరణీయము. కవి, కవిమిత్రుడు మల్లుని రచన ఇతి వృత్తము - మరణశిక్షనొందిన భర్త చేమనిలో సహగమనము సలుపుట. ఛందోవైశిష్ట్యముతోపాటు (అక్కరలు= లలితవృత్తములు అందుగలవు) రసభావ నిరంతరమై సహృదయుల నుయ్యాలలూగించు ఈ రచన కన్నడసాహిత్యచరిత్రము అనుశీలించు వారికి అవశ్యపఠనీయము.

శాంతినాథుడు- జైనతార్కికుడు, రచయిత. క్రీ. శ. 1068 నాటి శాసనమున అభినుతుడు. అతడు వర్ధమానవ్రతి శిష్యుడు. సహజకవి. అతడు చంపూకావ్యమైన సుకుమారచరిత్ర వ్రాసెను. ఇది ఖండఖండ ములుగా ఉపలభ్యమానము.

---

(1) కన్నడ కవిచరితె. R. నరసింహాచార్.

క్రీ. శ. 1070 నాటి నాగవర్మాచార్యుడు మత్తేభవృత్తములలో రచించిన చంద్రచూడామణిశతకము ఎన్నదగినది. అతడు ఉదయాదిత్యుని సంధివిగ్రహికుడు.

## కన్నడకావ్యవాఙ్మయము.

కన్నడ సాహిత్యచరిత్రలో రత్నత్రయముగా సుగృహీత నామధేయులైన కన్నడకవిత్రయము పంప, పొన్న - రన్నలలో రన్నుడు పశ్చిమచాళుక్యులకు సమకాలీనుడు. కవిరాజమార్గకర్త (అమోఘవర్షుడు క్రీ. శ. 815-77) దక్షిణాపథములో పశ్చిమమున గోదావరీ కావేరీ మధ్య దేశము కన్నడసీమగ ప్రవచించెను. అందు - అచ్చ కన్నడమునకు కిసువొలల్, కొపన, పులిగెరె, ఒక్కుంద మండలము గర్భనాభిగ నెన్నెను, పంప రన్న లా ప్రవచనము నంగీకరించి, ఆ నుడికారముననే తమ కావ్యములల్లినట్లు చెప్పుకొనిరి. రన్నకవి తైలపుని ఆస్థానమున కవిచక్రవర్తియయ్యెను. అతడు. క్రీ. శ. 949 లో ముదువాళల్ అతని జన్మస్థలము. హస్తికంకణ నిర్మాతల వంశములో ఉద్భవించి 'కవిచక్రవర్తి' బిరుదాంకితుడై ఛత్రచామరాది రాజలాంఛనములతో తైలపచక్రవర్తి ఆస్థానము నలంకరించెను

రన్నకవి అజితపురాణము సుప్రసిద్ధమైనది. 12 ఆశ్వాసముల పద్యకావ్యమది. రెండవ జైనతీర్థంకరునిచరిత్ర. ఆదికావ్యములలో కావ్యరత్నము. పురాణములలో పురాణతిలకమని రన్నకవి అభిప్రాయము. రన్నకవి కావ్యపీఠికలో తనకావ్యమును దీనచింతామణి (అత్తిమబ్బె) నాగవర్మసేనాని భార్య, సంప్రార్థనచే వ్రాసినట్లు చెప్పెను. ఇతని చంపూకృతి సాహసభీమవిజయము = గదాయుధ యుద్ధము. భీమదుర్యోధనుల గదాయుద్ధము ఇందలి ఇతివృత్తము. ఇటీవచెడంగ సత్యాశ్రయునకు భీమునకు ఇందు

అభేదము కల్పింపబడినది. అందుచే ఈ కృతికిచారిత్రకమైన విలువ గూడ అధికముగా కల్గినది. 'రన్నకాండ' నిఘంటువు నందలి పద్యములు కవిరత్నమకుటవిరాజితములు. ఇతవికృతులు-పరశు రామచరిత్రె, చక్రేశ్వరచరిత్రె నేడు అనుపలభ్యములు. చక్రేశ్వర చరిత్ర, చావుండరాయసేనాని జీవితచరిత్రయని కొందరివాదము. చావుండరాయడు గాంగసేనాని. 'సాహితీరణచక్రేశ్వరుడు' గ చెప్ప వచ్చును. ఈతడు బ్రహ్మక్షత్రియ వంశజుడు. (1) బ్రహ్మక్షత్రియుడను పదమునకు అర్థమేమి ? ఈ ప్రశ్నమునకు సమాధానము భావిపరిశోధ కులు తేల్చవలసిన అంశములలో నొకటి. చావుండరాయసేనాని చావుండరాయపురాణ కృతికర్త. క్రీ. శ. 978 ఆ గ్రంథమువిరచితము. అది కన్నడవాఙ్మయమునందలి తొలిగద్యకృతి. 24 జైనతీర్థంకరులు, 12 చక్రవర్తులు, 9 బలభద్రులు,9 నారాయణులు,9 ప్రతినారాయణులు- అందు అరువదిముగ్గుర జీవితచరిత్రలు కలవు. గాంగప్రభువైన రాచ మల్లు, శ్రావణబెల్గోలాలో గోమతేశ్వరవిగ్రహ ప్రతిష్ఠాపనానంతరము చావుండసేనానికి 'రాయ'పద మనుగ్రహించెను.

నాగవర్మ చావుండరాయని సమకాలికుడు. సతీర్థ్యుడు - అజిత సేనుని శిష్యుడు. నాగవర్మకూడ పంపనివలె, తనపూర్వికులు వేంగి పలుకు చెందినట్లు చెప్పుకొనెను. ఇతని కృతి 'ఛందోంబుధి' కన్నడములో తొలిఛందో గ్రంథము. ఈ గ్రంథము పఠనపాఠనములు కన్నడదేశమున చిరప్రవృత్తములు. కర్ణాటకకాదంబరి ఇతని చంపూ కావ్యము. నాగవర్మ కన్నడసాహిత్యమున అపరబాణుడు. దుర్గసింహుడు- రెండవ జయసింహుని మహాసంధివిగ్రహి. అతని పంచతంత్రము పంచాశ్వాసముల చంపూకృతి. అవిభేద, పరీక్షావిశ్వాస

(1) నన్నయభట్టు తన్ను- రాజరాజనరేంద్రుడు "తనకులబ్రాహ్మ ణుని"గ పేర్కొనినట్లు వచించును. రాజరాజు నరేంద్రుడు క్షత్రియుడు కాన నన్నయభట్టుకూడ క్షత్రబ్రాహ్మణుడా ?

వచన మిత్రకార్య పరిచ్ఛేదములు. దుర్గసింహుడు విద్వత్ కవి. పంచతంత్రము ప్రౌఢకావ్యము. జయసింహుని సామంతుడు మాచప్రభువు అతని మదనతిలక కృతిపతి. ఆ కావ్యము మాచదంపతుల చర్చగ అభివర్ణితము. అష్టాదశ అధికరణములతో 500 పద్యములతో విలసిల్లిన అమహాకావ్యము నాతడు పొన కన్నడమున వ్రాసినట్లు చెప్పుకొనెను. అహవమల్ల సోమేశ్వరునకు సమకాలీనుడు శ్రీధరాచార్యుడు జైనబ్రాహ్మణకవి. క్రీ. శ. 1049 లో అతడు 'జ్యోతిషతిలక' మును వ్రాసెను. అతడు 'గద్యపద్యవిద్యాధర' బిరుదాంకుడు. నాగచంద్రుడు 'అభినవపంప' బిరుదాంకుడు, మల్లినాథ పురాణ కృతికర్త. 19 వ తీర్థంకరుని జీవిత చరిత్ర అతని కృతిలోని ఇతివృత్తము. అది 14 ఆశ్వాసాల చంపూ కావ్యము.

నాగచంద్రుని రామచంద్రపురాణము పంపరామాయణము సుప్రసిద్ధము. కథ మూడవ ఆశ్వాసముతో ఆరంభమగుచున్నది. అందు రాముడు జినదీక్ష స్వీకరించి, జైనమునియై నిర్వాణము చెందును. నాగచంద్రుడు మల్లినాథ జినాలయమును విజయపురమందు (బీజపూర్) నిర్మించెను. అందుచే అతడు సరస్వతీకటాక్షముననేగాక లక్ష్మీప్రసన్నతకుగూడ నోచుకొనెను. నయసేనుడు తన ధర్మామృత గ్రంథరచన శక 1034 సంవత్సరమున క్రీ. శ. 1112 న ముగించినట్లు చెప్పినాడు. ఇందు 14 ఆశ్వాసములు గలవు. జైనమతసారమీ గ్రంథమని రచయిత చెప్పెను. సంస్కృతసమానభూయిష్ఠరచనపై ధ్వజమెత్తిన తొలిరచయిత ఇతడే.

క్రీ. శ. 1145 ప్రాంతమున కర్ణపార్యుడు నేమినాథపురాణమును వ్రాసెను. అందతడు మహాభారతకథను కృష్ణగాథలనుకూడ ప్రసక్తానుప్రస్తకముగ ఇమిడించెను. నేమినాథపురాణము 22 వ తీర్థంకరుని చరిత్ర. కావ్యాలోకకృతికర్త నాగవర్మ పండ్రెండవ శతాబ్దివాడే. ఆ అలంకారశాస్త్రమున సూత్రప్రాయమైన పద్యములు గలవు. ఇతడే

కర్ణాటకభాషాభూణ కృతికర్త. ఇందు సూత్రరచన సంస్కృతభాషలో; వ్యాఖ్యానము, ఉదాహరణములు కన్నడమున నున్నవి. 'వస్తుకోశము' అతని సంగ్రహనిఘంటువు. అందు సంస్కృతపదములకు కన్నడ పర్యాయపదములు గలవు. నాగవర్మ రెండవ జగదేకమల్లుని గురువు. ఇతనిశిష్యుడే జన్నకవి క్రీ.శ. 1209.

'ఉదయాదిత్యాలంకార' గ్రంథము క్రీ. శ. 1150 ప్రాంతము నాటిది. చోళప్రభువు ఉదయాదిత్యగ్రథితము. అందు దండి కావ్యాదర్శము నుండి అనువాదములున్నవి, గాని కన్నడకృతులనుండి ఉదాహరణములు లేవు. 'కర్ణాటకకల్యాణకారక'ము వైద్యగ్రంథము. జైనరచయిత పూజ్యపాదుని సంస్కృతగ్రంథమునకు జగద్దలసోమనాథుని కన్నడానువాదము. ఇందలి చికిత్సావిధానము కేవల మౌలికము. ఆసవాద్యరిష్టారహితమని చెప్పబడినది.

## కన్నడ వీరశైవ వాఙ్మయము

జైనులపిమ్మట కన్నడసాహిత్యకృషిసల్పినది వీరశైవులు. వీరశైవవాఙ్మయమున వచనమునకు విశిష్టస్థానము లభించినది. బసవేశ్వరుడు- సమకాలీనులైన వీరశైవులు 'వచన'శాఖను కల్పించిన దోహదము పేర్కొనదగినది. వీరశైవరచయితలు అసంఖ్యాకులు. పేర్కొనదగినవారు రెండువందలకు పైగలరు. వచనములు,వస్తైక్యము లేని విడివిడి అభిప్రాయముల కూర్పులు. స్థానికశివనామ మకుటాంతములు బసవనవచనములు కూడలిసంగమదేవ మకుటాంతములై విశ్వజనీనములైనవి. వచనరచన సూత్రప్రాయమై జిగిబిగి కలిగి, అల్పాక్షరముల అనల్పార్థరచన యననొప్పును. ధనధాన్యసంపదలపై ఆశతో ఎండమావులను వెంబడించి గడపు నిరర్థక జీవితముపై నిరసనము, శివభక్తిపూరితమైన వైరాగ్యజీవితముపై పూజ్యభావమును రేకెత్తించుట వచనరచనల పరమార్థము.లింగాయత గురువులు ఆ వచనములను నేటికి నిత్యప్రచారము సలుపుచున్నారు.

అందుకొన్ని 'కాలజ్ఞాన' వచనములును గలవు. వచనములు రచయిత నామధేయాంకితముద్రా విలక్షితములు. అక్కమహాదేవి వచనములు బసవేశ్వరుని, వచనలు అతనిమేనల్లుడు చెన్నమల్లుని వచనములు సుప్రసిద్ధములు. వీరితోపాటు తరతరాల వీరశైవులపైననేగాక సహృదయులపై అపూర్వప్రభావము వహించిన రచనలు సల్పిన పండితత్రయము పండితారాధ్యుడు, శివలెంక మంచెన, శ్రీపతిపండితుడును. పంచాచార్యులు రేవనసిద్ధయ్య కొల్లిపాక రేణుకాచార్యుడు కొల్లాపురమరుళసిద్ధయ్య పండితారాధ్యుడు ఏకోరామితండె విశ్వేశ్వరాచార్యులు. వీరిలో అధిక సంఖ్యాకులు బసవేశ్వరునకు సమకాలీనులు లేదా ఈషత్పూర్వులు. శైవము ప్రాగ్భవము. వీరశైవము బసవేశ్వరప్రోక్తము. శైవులు సంఘమునందువలెనే సాహిత్యమునందును నూత్నయుగప్రవర్తకులై మహోద్యమప్రవర్తలైరి.

ఈయుగముననే చంపూకావ్యపద్ధతి ప్రాతగిలి, కన్నడనుడికారమునకు వైలక్షణ్యము చేకూర్చిన షట్పది త్రిపది రగడలు ఆవిర్భవించినవి. ఈ నూతనోద్యమప్రవర్తకులలో మొదటివాడు హాలేబీడువాస్తవ్యుడైన కరణికుడు. నరసింహబల్లాలుని (1141 - 73) సమకాలీనుడు. ఈతడు పంపాశతకకర్త. గిరిజాకల్యాణము చంపూకావ్యము 'శివగణద రగళెగళు' క్రొత్తవనములకు ఉదాహరణము. అతని మేనల్లుడు పంపావాస్తవ్యుడు 'షట్పది'ని వ్రాయుటలో ప్రథముడు. అతని హరిశ్చంద్రకావ్యమా ఛందములో వ్రాసినది. అందు ఎడనెడ అసాధ్యప్రయోగములును గలవు. అతడే వీరేశ్వరచరిత్ర శరభాచార చరిత్ర సోమనాథచరిత్ర (పుళిగెరెసోమన చరిత్ర) సిద్ధరామపురాణము అతడు రచించినవే. పద్మరసు హొయసల రాజోద్యోగి. ఆతడు నరసింహబల్లాలుని ఆస్థానమున కేతెంచిన తెలుగు వైష్ణవ బ్రాహ్మణునితో వాదించి ఆతనికి శివదీక్షనిచ్చెను. గురుశిష్యసంవాద రూపములో ఆతడు శైవమతసారమును దీక్షాబోధలో అందించెను.

క్రీ. శ. 1385 నాటి పద్మరాజపురాణమున కథానాయకుడాతడే. హరీశ్వర రాఘవాంకపద్మరసులు వర్ధిల్లిన కాలమునుగూర్చి వాదోపవాదములు చెలరేగినవి. కర్ణాటకసాహిత్య చరిత్రకారుడు శ్రీ నరసింహాచార్యులు వారిని క్రీ. శ. 1165 ప్రాంతమువారనియే వ్రాసెను. నాకు బసవేశ్వరుని పేరెత్తకపోవుటచే వారి కాలనిర్ణయము వివాదగ్రస్తమైనది. పాల్కురికి సోమన క్రీ. శ. 1195 (1) తెలుగులో కన్నడములో వీర శైవగ్రంథము లనేకములు రచించెను. అతని చరిత్రను పురాణముగ క్రీ. శ. 156 తొంటాచార్యుడు రచించెను.

పాల్కురికి సోమన బసవపురాణమును క్రీ. శ. 1362 లో భీమకవి కన్నడమునకు అనువదించెను. సోమన కన్నడకృతులలో ఎన్నదగినవి శీలసంపదన్నె, సహస్రగణనామ పాంచరత్న అనేక రగణలు గలవు. రాజాదిత్యుడు క్రీ. శ. 1190 ప్రాంతమున వ్యవహార గణిత క్షేత్రగణితకృతులను వ్రాసెను. క్లిష్టగణితమును సులభకావ్యముగా తీర్చిన ఘనత అతనికి దక్కినది.

## సంస్కృతము

వాదిరాజ విరచిత పార్శ్వనాథచరిత్ర చాళుక్యయుగారంభమున రెండవజయసింహునికాలమున వెలసిన తొలికావ్యము. ఏతద్రచన క్రీ. శ. 27-10-1025 న ముగిసినది. వాదిరాజు రాష్ట్రకూటకృష్ణరాజునకు సమకాలీనుడైన సోమదేవసూరి శిష్యుడు. హేమసేన విద్యాధనంజయుడు - ద్విసంధానకావ్యము - ద్వ్యర్థి కృతి రాఘవపాండవీయమును సంస్కృతమున రచించెను. అట్టి రాఘవపాండవీయమును శ్రుతకీర్తిగూడ వెనువెంటనే రచించెను. క్రీ. శ. 1000

(1) పాల్కురికి సోమన కాలనిర్ణయముగూడ వివాదగ్రస్త సమస్యయే.

ప్రాంతమున సోడ్ఢలుడు లాటకాయస్థుడు ఉదయసుందరీకథను, కాదంబరీకావ్యధోరణిలో సంతరించెను.

'విక్రమాంకదేవ చరిత్ర' వ్రాసి చరిత్రలో వాఙ్మయచరిత్రలో సుప్రసిద్ధుడైన బిల్హణుడు కాశ్మీరమునుండి కల్యాణీనగరమును చేరి విద్యాపతియై వర్ధిల్లిన కవి. ఆనాటికి బిల్హణుడు వయోవృద్ధుడు. స్వీయచరిత్రను కావ్యాంతమున జోడించెను. ఆతడు మధురా కన్యకుబ్జ ప్రయాగ కాశీ డాహల, అయోధ్య ధారాప్రభృతి నగరములను సేవించి కల్యాణిలో స్థిరనివాస మేర్పరచుకొనెను. వైదర్భీరీతిలో కాళిదాసు తరువాత ఆతనినే పేర్కొనవలెనని చెప్పుకొనినాడు. కాళిదాసెక్కడ ! బిల్హణుడెక్కడ !!

విక్రమాదిత్యుని ఆస్థానమున పేరెన్నికగన్నవారిలో విజ్ఞానేశ్వరుడు రచించిన గ్రంథము 'మితాక్షరి'; యాజ్ఞవల్క్య స్మృతికి వ్యాఖ్యానము. ఇది కేవలవ్యాఖ్యానగ్రంథముగాక రచయితబహుముఖశాస్త్రవైదుష్యము చాటు స్వతంత్రగ్రంథము అని చెప్పనొప్పును. ఆ స్మృతిపై శిలాహార ప్రభువు కొంకణాధిపతి అపరార్కుడు (క్రీ. 1115-30) ఆకాలముననే రచించినది గలదుగాని అది 'మితాక్షరి' వలె ప్రామాణికముకాలేదు. అపరార్కుడు తార్కికుడుగూడ. సర్వజ్ఞుని న్యాయసారముపై ఆతడు న్యాయముక్తావళియను వ్యాఖ్యానము వ్రాసెను.

మానసోల్లాసము=అభిలషిత చింతామణి భూలోకమల్ల 3 వ సోమేశ్వరుని రచన. అది క్రీ. శ. 1051 నాటి రచన. అందు 100 అధ్యాయములుగలవు. ఇది పశుచికిత్స, వైద్యము రత్నపరీక్ష - మున్నగు అనేక విషయములపై విజ్ఞానసర్వస్వకల్పమైనది. సమకాలీనుల అభిరుచి - తత్పూర్వరచనలు- అనేక విషయములపై చాళుక్యయుగమందలి అభిప్రాయములకు ఇది అమూల్యమైన ఖని.

## అనుషంగిక విషయములు

చాళుక్యరాజులపట్టాభిషేక మహోత్సవము కిశువొళల్ వద్ద జరిగెడిది. బాదామిరాజులు అక్కడనే పట్టాభిషిక్తులగుచుండిరి. అందుచే ఆ నగరమునకు పట్టడకల్ అను సార్థకనామమేర్పడినది. క్రీ శ. 1123 నాటి తెర్దల్ శాసనము (సంగ్లి మండలము) ఒక అపూర్వవిషయమును అనుషంగికముగ వెల్లడించుచున్నది. అచ్చట 12 గౌండులుకలరు. అందుచే దానితెరిదాల-12 సీమగశాసనమున పేర్కొనబడినది. దక్షిణ భారతచరిత్రలో సంఖ్యాంతవిశిష్టములై ప్రవర్తిల్లుట సుప్రసిద్ధము. గుంటూరుమండలమున షట్సహస్రవిషయము- ఆరువేలనాడు ఉదాహరణము- అయితే- ఈసంఖ్యలు గ్రామసంఖ్యలని పలువురుచరిత్రకారుల అభిప్రాయము. గౌండులు గ్రామాధికారులు. ఆరువేల నియోగులని చెప్పుట పురాతనసంప్రదాయము. నియోగులు కరణములు. రాజాంతఃపురమున 72 నియోగములు ఉండుట సంప్రధాయసిద్ధము. అట్లే సీమలోనున్న నియోగముల వెరసిసంఖ్య- ఆసీమాంతసంఖ్యయై యుండవచ్చును. ఒకవేళ ఉద్యోగులసంఖ్య తరువాత పెరిగినను తరిగినను పేరుమాత్రమట్లేయుండి యుండవచ్చును. ఎట్లైనఈవిషయము భావిపరిశోధనలవలన తేలవలసినది. పైచర్చ ఒక ఊహమాత్రమే.

# కల్యాణి కాలచురి వంశము

కలచురి, కటచురి, కలస్తురి, కలచుతి, కాలచ్చురి, కలచుర్య, కలిచురి మున్నగు శబ్దములు పర్యాయపదములు. ఈ ప్రయోగము లన్నియు శాసనస్థము లేయైనను 'కలచురి' మిక్కిలి ప్రచురము; సుప్రసిద్ధము. ఈ వంశీయులు తమకు మూలపురుషుడు కార్తవీర్యార్జును డనియు తాము హైహయులమనియు తమ ప్రాక్తనరాజధాని మాహిష్మతీపురమనియు అర్వాచీనశాసనములలో పేర్కొనిరి. కలచురి శబ్దము 'కులుచురు' అను తురుష్కశబ్దభవమని కొందరు తలపోయు చున్నారు. ఆ శబ్దమునకు ఆ భాషలో 'ఉన్నతరాజోద్యోగి'అని అర్థము. (1) ఈ వాదమే యథార్థమైన కలచురివంశకర్తలు విదేశీయులై హూణులవలె, గూర్జరులవలె వచ్చినవారయియుందురు. చరిత్రలో ప్రప్రథమమున వారు గుజరాతులో కన్పించుచున్నారు. కృష్ణరాజు, అతనిపుత్రుడు శంకరగణుడు, అతనిపుత్రుడు బుద్ధరాజు, తామ్రశాసన ములలో పేర్కొనబడినారు. బుద్ధరాజు బాదామిప్రభువైన మంగ ళేశునితో కయ్యమొనరించినాడు. బాదామి ప్రభువైన విజయాదిత్యుడు క్రీ. శ. 681-96 హైహయులను జయించినట్లు చెప్పుకొనినాడు. అతని మనుమడు రెండవ విక్రమాదిత్యుడు ఇరువురు హైహయరాజ కన్యకల వివాహమాడినాడు.

సుప్రసిద్ధమైన హైహయరాజ్యము మధ్యభారతమునందలి 'డాహలదేశము జబ్బలపూరు మండలము, ఉత్తర నర్మదాతీరప్రాంతము మైహరరేవా పన్నాప్రాంతము' లారాజ్యముతో చేరినవి. రాజధాని త్రిపురి. హైహయు లా సీమను తరతరములుగ శతాబ్దుల తరబడి ఏలిరి. రాష్ట్రకూటులతో తూర్పుచాళుక్యులతో వారు నెరపిన

---

(1) Proceedings, Indian History Congress 1943 p 44

వియ్యములు కయ్యములు ఈ గ్రంథమునందే ప్రకరణాంతరముల కానవగును.

కల్యాణి కలచురి వంశమునకు త్రిపురీవంశమునకు గల సంబంధ బాంధవ్య మెట్టిదో నిష్కర్షగ చెప్పుటకు వీలులేదు. ఉభయులు ఏకవంశీయులే. హరిహర్‌లోని కన్నడశాసనమున వంశోత్పత్తి కథనము గలదు. బ్రాహ్మణ కన్యకకు కలలో పరమేశ్వరసంగమ ప్రాప్తి యైనది. కానీనుడైన కృష్ణరాజు వంశకర్త ఉద్భవించెను. ఆతడు మంగలివేషమున (చురి=కన్నడమున మంగలి) నరభక్షకుడైన రాజును సంహరించి డాహలదేశమునకు ప్రభువై కలచురి వంశకర్త యయ్యెను. ఇట్టి కట్టుకథ లనేకములు శాసనస్థములు. చారిత్రకముగ శాసనాధారములనుబట్టి నిర్మింపనగు కల్యాణికలచురి వంశవృక్షము నెన్నవచ్చును.

జోగముడు
|
పెర్మాడి క్రీ. శ. 1128
|
1 త్రిభువనమల్ల బిజ్జలుడు [క్రీ. శ. 1145, 1152-67]
|
2 సోవిదేవ భుజబల మల్ల, భార్య-సావళదేవి క్రీ. శ. 1167-77
3 శంకముడు 'నిశ్శంకమల్ల' క్రీ. శ. 1177-81
4 ఆహవమల్ల వీరనారాయణుడు క్రీ. శ. 1161-83
5 సింఘణుడు క్రీ. శ. 1183

కలచురిప్రభువులు స్వర్ణవృషభధ్వజులు. కాలంజరపురవరాధీశ్వరులు. వారి ఆగమనసూచకము. "డమరుక" నినాదము. కాలంజరదుర్గము ఉత్తరప్రదేశమందలి బందలోని బుందేలుఖండమున నున్నది. ప్రాచీనకలచురిరాజ్యమున కది గర్భకేంద్రము. డాహాల కలచురి వంశీయులు త్రైకూటకశకమును ప్రయోగించిరి. ఆ శకము క్రీ. శ. 248-9 సంవత్సరమున ఆరంభించును. ఈ శకమునకు కలచురి శకమనియు చేదిశకమనియు నామాంతరములు.

జోగమునిగూర్చిన చారిత్రకాంశములు మృగ్యములు. పెర్మాడి (=హెమ్మాడియరసు) చాళుక్యసోమేశ్వరుని (iii) సామంతుడుగ క్రీ. శ. 1128 సంవత్సరమున బిజాపురమండలమున తర్దవాడినాడును పరిపాలించుచుండెను. అతనిపుత్రుడు సుప్రసిద్ధుడైన బిజ్జలుడు. ఇతని ఔరసనామధేయము విజయాదిత్యుడు. బిజ్జ, బిజ్జన, విజ్జల, విజ్జన నామాంతరములును ప్రయుక్తములు. 'త్రిభువనమల్ల', 'భుజబల చక్రవర్తి', 'కలచుర్యచక్రవర్తి', 'శనివారసిద్ధి', 'గిరిదుర్గమల్ల', 'నిశ్శంకమల్ల' బిరుదాంకుడు.

తొలుత బిజ్జలుడు చాళుక్యసామంతుడైయుండెను. జగదేకమల్లుని కాలములో బిజ్జలుని భృత్యుడైన విజయపాండ్యుడు నొలంబవాడి (ముప్పది రెండువేల) సీమను పాలించుచున్నట్లు శాసనము గలదు. రెండవ జగదేకమల్లుని శాసనములు క్రీ. శ. 1147 నాటివి. బర్మదండాధిప కేశిరాజదండాధిపులను ఇరువురు సేనానులను పేర్కొనుచున్నవి. వారే తరువాత బిజ్జలుని సేనానులుగను కన్పించుచున్నారు. తైలరాజు iii కాలమున వెలసిన శాసనములలోగూడ "తైలరాజు కాలమున" అని నిరుపపదముగ ప్రయోగించిన బిజ్జలుని శాసనములున్నవి. అందుచే బిజ్జలుడు చాలకాలమునుండి స్వతంత్ర ప్రతిపత్తిని కాంక్షించుచు, కల్యాణిసింహాసనముపై కన్నువేసియుంచెనని భావింపనగును. కొన్ని శాసనములు - బిజ్జలుని మహామండలేశ్వరునిగ,

చాళుక్యసామంతునిగ అభివర్ణించునవిగూడ గలవు. క్రీ. శ. 1151 బిజాపూరుశాసనమున కల్యాణీప్రభువైన మూడవ తైలదేవుని పేర్కొని, బిజ్జలుడా చక్రవర్తి సామంతుడైన మహామండలేశ్వరు డను వర్ణన గలదు. అప్పటికే 'బిజ్జలక్షోణిపాలుడు' మాలవలాలనేపాల ఘూర్జర నృపులను జయించిన మహావీరుడుగ అభినుతుడు. ఇది అతని ఆశా పాశమునకు చిహ్నముగాని చారిత్రకసత్యముగాజాలదు. మైలార దండనాథుడు తర్దవాడీపరిపాలకు డాతనిఅనుయాయుడుగ వర్ణింప బడినది. చాళుక్యరాజ్యమునకు మధ్యభాగముననున్న సీమకు పాల కుడై సుప్రసిద్ధుడైన మైలారదండనాథుడు బిజ్జలుని సేనానిగ అభివర్ణింప బడుట గమనింపదగినది. బనవాసిపాలకుడైన మహాదేవరను బిజ్జలుని "అంతఃకరణరూపుడు". క్రీ. శ. 1156 నుండి బిజ్జలుడు త్రిభువనమల్ల భుజబలచక్రవర్తి కలచుర్యచక్రవర్తి బిరుదములు వహించి, స్వతంత్ర ప్రతిపత్తితో శాసనములు వేయించెను. క్రీ. శ. 1157 లో రెండవ రాజ్యసంవత్సరముగ, మహారాజాధిరాజ భుజబలచక్రవర్తి కలచుర్య బిజ్జలదేవుని శాసనము కన్పించుచున్నది. (2) అంతేగాక చాళుక్యరాజ బిరుదములతో ఆతడు కల్యాణిని పాలించుచున్నట్లు కంఠోక్తిగ చెప్పు శాసనములు ఎన్నోగలవు. సమస్తభువనాశ్రయ, శ్రీ పృథ్వీవల్లభ మహారాజాధిరాజ, పరమేశ్వర, పరమభట్టారక బిరుదములతో క్రీ. శ. 16-5-1162 నాడు వెలువడిన అతని శాసనము పేర్కొనదగినది.

బిజ్జలుడేవిధముగ తొలుత సామంతుడైయుండి పిమ్మట చాళుక్యప్రభువుల పారద్రోలి కల్యాణిసింహాసన మాక్రమింపగలిగినది సుస్పష్టముగ తెలియరాదు. బిజ్జలుడు మేధావి. సమర్థుడైన వీరుడుగ ప్రఖ్యాతికెక్కి, సామంతులలో పలువురిని తనపక్షమునకు త్రిప్పుకొనె నని యెంచవచ్చును. క్రీ. శ. 1191 నాటి - తామ్రశాసనమున శిలాహార ప్రభువైన విజయాదిత్యుడు తనసాయమువలననే బిజ్జలుడు చక్రవర్తి

(2) 2 B. K. 103 of 1932-3

సింహాసన మధిష్ఠింపగల్గెనని చెప్పుకొనెను. అక్లే రేచదండాధిపుడు, జైనసేనాని వేరొకశాసనమున అభిచుతుడు. అందు బిజ్జలుని అభివర్ణన అలంకారశాస్త్రమునందలి అతిశయోక్తి పరిధినిగూడ అతిక్రమించినది. "బిజ్జలునకు సింహళప్రభువు పాదాక్రాంతుడట. నేపాళరాజు సుగంధద్రవ్యకరండవాహకుడట. కేరళాధిపుడు తాంబూల కరండ వాహకుడు. పాండ్యవిభుడు, చామరగ్రాహి. తురుష్కప్రభువు అనుచరుడు. మావటీరు కళింగాధిపతియట! ఉ! హంగల్‌సీమకు చెందిన కదంబవంశీయుడు సోమదేవుడు, కరాడసీమకు చెందిన శిలాహారవంశీయుడు విజయాదిత్యుడు సౌందత్తిసీమకు చెందిన రట్టవంశీయుడు కార్తవీర్యుడు సింధవంశీయుడైన ఈశ్వరుడు మున్నగు వారతని సామంతులుగ" కన్పించుచున్నారు. దీనినిబట్టి చాళుక్య సామ్రాజ్యములో అధికభాగమాతని ఆధిపత్యములో నుండెనని భావింప వచ్చును.

బిజ్జలుని ఆధిపత్యము నంగీకరింపని సామంతులును పలువురు గలరు. క్రీ. శ. 1162 నాటిశాసనమున బిజ్జలుడు దక్షిణదండయాత్రలో 'బల్లిగవె' కడ నున్నట్లున్నది. క్రీ. శ. 1163 నాటి శాసనమున బిజ్జలుడు తన ఆధిపత్యమును (అంబుధి-సీమె-వరకు) సముద్రతీరము వరకు నెలకొల్పినట్లు గలదు. ఇంకొకశాసనమున అతడు కళ్యాణినుండి దక్షిణసముద్రమువరకు (తెనికాబ్ధియె బడగె సీమె చాళుక్య కటక వినె) తన ఆధిపత్యము వెలయించినట్లు చెప్పుకొన్నాడు.

బిజ్జలుని శాసనములనుబట్టి ఆతని రాజధానిగ కల్యాణిమాత్రమే గాక మంగలివేఢను (పండరిపురమునకు పండ్రెండుమైళ్ళు) పేర్కొను చున్నవి. అతని వంశీయులు మంగలికథతోపాటు మొదిగనూరు, సెతియహల్లి మున్నగువానిని వెలికీడుగ, రెండవరాజధానిగ స్వీకరించి నట్లున్నది. కలచురిరాజులు తరచు రాజధానినిమార్చిరా? ఆనాటి కల్లోలస్థితిగతుల కది ఒకతార్కాణము. చాళుక్యవంశము అంతరించ

లేదు. బిజ్జలుని కాలమునగూడ సువిశాలమైన చాళుక్యసామ్రాజ్యములో సామంతులు కొందరు చాళుక్యుల సార్వభౌమత్వము నే అంగీకరించిన వారున్నారు. అనంతపురమండలమునందలి మడకసిరప్రాంతమందలి మల్లిదేవచోడమహారాజు (క్రీ. శ. 1160 - 70) తైలప iii దేవుని సామంతుడుగనే యుండెను. ఆతడు ఒకానొకసమయమున మూడవ కులోత్తుంగదేవుని, చక్రవర్తిగపేర్కొనెనేగాని కలచురి వంశాధికారము నంగీకరింపలేదు. (3) ఆ కల్లోలపరిస్థితిలో జరిగిన అనేకయుద్ధములలో పేర్కొనదగినవి, గుత్తి (చంద్రగుత్తి బనవాసిలోనిది.)ముట్టడి [1158 నుండి - 64 వరకు జరిగినది.] మరియు హొయసాల మాండలికుని జిన్నలగుండి ముట్టడి (క్రీ. శ. 1166 - సంవత్సరములో విఫలమైనది.) బిజ్జలుని పుత్రులు అసమర్థులై అందిన అవకాశములనుగూడ చేజార విడిచిన మూర్ఖులు.

బిజ్జలుడు క్రీ. శ. 1168 సంవత్సరమునాటి శాసనమున తాను స్వచ్ఛందముగ రాజ్యభారమును తనయుడైన సోవిదేవుని భుజస్కంధములపై మోపినట్లు చెప్పుకొనెను. సోవిదేవుడు క్రీ. శ. 1167 నుండి 77 వరకు రాజ్యమేలెను. అతని రాణి సావలదేవి. ఆమె సంగీత నాట్యకళాకోవిదురాలు.. ఆమె సోదరుడు జంత్రగానకోవిదుడు భైరవుడు బ్రహ్మవీణావాదనమున సిద్ధహస్తుడుగ అభినుతుడు. ఆమె సహోదరి వాచలదేవి గీతనృత్యవిద్యయందు నిపుణ.

సోవిదేవుని సోదరుడు శంకముడు క్రీ. శ. 1177 నుండి 1180 వరకు రాజ్యమేలెను. ఇతని సామంతులుగా ప్రస్తుతింపబడినవారు, కేవనదండనాయకుడు, హొయసల మహామండలేశ్వర (రెండవ) వీర బల్లాలుడు.

రెండవ వీరబల్లాలుడు కౌలూరు హరిహరేశ్వరునకు పెరియభార్య రేమాదేవితోపాటు క్రీ. శ. 1179 లో కానుకలర్పించెను. శంకముడు

---

[3] E. C. VIII Sb 255

కడలిసీమపై దండెత్తినప్పుడు రెండవ వీరబల్లాలుడు స్వతంత్రుడై, వ్యవహరింపసాగెను. క్రీ. శ. 1180 నాటి శాసనమున కావనదండ నాథుడు "హొయసనదిసాపట్టు" - (హొయసల విధ్వంసక) బిరుదాంకితుడు. ఆ సంఘర్షణలో వీరబల్లాలుడు విజయుడు కాలేదనుటకు నిదర్శనము ఆతడు తరువాత శంకముని అధిపత్యము నంగీకరించుచు శాసనములు వేయుటయే. క్రీ. శ. 1180 నుండి ఆహవమల్ల బిరుదాంకుడైన సోదరుడు శంకముని తరువాత రాజయ్యెను. ఆతనిపిమ్మట క్రీ. శ. 1183 న, ఆతని అవరజుడు సింఘణుడు సింహాసనమధిష్ఠించెను. సింఘముని కాలమున కలచురి రాజ్యమంతరించినది. నాలుగవ సోమేశ్వరుడు, పైతృకరాజ్యమును తిరిగి సంపాదించి చాళుక్యచక్రవర్తి యయ్యెను.

## బసవేశ్వరుడు - వీరశైవము

దక్షిణాపథచరిత్రలో కలచురివంశపరిపాలనసమయమున బిజ్జలుని కాలమున మిక్కిలి ప్రాముఖ్యము వహించిన సంఘటన వీరశైవమత సంస్థాపనము. వీరశైవమతసంస్థాపకుడైన బసవేశ్వరుడు బిజ్జలుని మంత్రి. శైవము ప్రాగ్బసవేశ్వరమనుట నిర్వివాదాంశము. కాని వీరశైవము బసవేశ్వరుడు స్థాపించిన వినూతనమతమే. వీరశైవులు తమమతము ఉపనిషత్ ప్రోక్తమనియు ఋగ్వేదకాలమునుండియు వర్ధిల్లుచున్న సనాతన మతమనియు వాదించెదరు. లింగధారణము వలన వీరశైవము లింగాయత మతమైనది. బసవేశ్వరుడు నందీశ్వరుని అవతారము. "లింగము" పరతత్త్వలాంఛనమేగాని, లౌకిక శారీరక చిహ్నము గాదనియు, వీరశైవదీక్షతో జన్మరాహిత్యము సిద్ధించుననియు వీరశైవుల విశ్వాసము. బసవేశ్వరుడు స్థాపించిన వీరశైవములోని విశిష్టత, ఏతన్మతానుయాయుల "వీర"త్వము. శైవము ప్రాచీనమైనను "వీర"త్వము నూతనమే.

వీరశైవులు, స్వమతస్థాపనకు పరమతఖండనకు వీరత్వముతో ఆత్మబలిదానము సల్పుటకు సంసిద్ధులుకావలెను. అనన్యసామాన్యమైన విశ్వాసము, పౌరుషోద్రేకములు, ఆత్మత్యాగము వీరశైవులలో పాదు కొల్పిన బసవేశ్వరుని అసాధారణప్రజ్ఞ దక్షిణాపథచరిత్రను ఉఱ్ఱూత లూగించినది. లింగధారణము, శివపారమ్యముపై గల అకుంఠితభక్తి విశ్వాసములు, బాల్యవివాహనిరసనము, కులభేదనిరసనము, విధవా పునర్వివాహము, బ్రాహ్మణవిద్వేషము వీరశైవమతమునకు విశిష్ట ధర్మములు. ఆత్మకు పునర్జన్మ లేదని వీరశైవుల విశ్వాసమందురు. వీరశైవదీక్షనందిన ఆత్మకు పునర్జన్మలేదు. తక్కుంగల ఆత్మలసంగతి తడవనేల? వీరశైవమున ముక్తికి, భక్తి రాచబాట. జంగములై సర్వార్పణకావించి శైవమతప్రచారము చేయుట వీరశైవుల పవిత్ర కర్తవ్యము. జంగమార్చన శివార్చనయే.

ఏకేశ్వరోపాసన, ముక్తికి, భక్తి యేకైకపథమను సౌలభ్యము సర్వమానవసౌభ్రాత్రము, కులభేదరాహిత్యము, నమ్మిన ఆదర్శములకై ఆత్మబలిదానము, ఇస్లాము మతమునందువలె బసవేశ్వరుని వీరశైవమునందును విశిష్టధర్మములైనవి.

బసవేశ్వరుని చరిత్ర వివాదగ్రస్తమైనది. శైవపురాణములకు, జైనకథనములకు విభేదములు గోచరించుచున్నవి. జనశ్రుతిలోనున్న కథలు వేరు. అతని చరిత్ర: లభించిన ఆధారములనుబట్టి, చూచినచో బసవేశ్వరుడు శైవబ్రాహ్మణదంపతులు - మాదిరాజమాదలాంబికలకు ఉద్భవించెను. బిజాపురీమండలమునందలి బగెవాడి అతని జన్మస్థలము. బసవేశ్వరుడు నందీశ్వరుని అవతారము పృథివిలో క్షీణించుచున్న శైవము నుద్ధరించుటకై పరమేశ్వరుడు భూలోకమునకు నందీశ్వరుని పంపెను. అష్టవర్షబాలుడుగా నున్నప్పుడే బసవేశ్వరుడు శైవాగమము లలో కూలంకషమైన పాండిత్యము నార్జింపగలైను.

తలిదండ్రులు ఆతనికి ఉపనయనము సల్పుటకు ఉద్యమించ, ఆతడు యజ్ఞోపవీతధారణము నిరసించి, తాను కులభేదముల నిర్మూలించుటకు కారణజన్ముడై ఉద్భవించిన పరమ మాహేశ్వరుడనని ప్రకటించెను. ఆతని ధైర్యసాహసములు, సత్ప్రవర్తన బిజ్జలుని ప్రధాని మేనమామయైన బలదేవుని ఆకర్షించినవి. బలదేవుడు బసవేశ్వరునకు తనపుత్రికయైన గంగాదేవినిచ్చి వివాహమొనరించి ఆదరించెను. బసవన అభిప్రాయములను బ్రాహ్మణులు అంగీకరింప లేదు. ఆతడు బ్రాహ్మణపీడ తప్పించుకొనుటకు ప్రవాసియై 'కప్పడి' కేగి సంగమేశ్వరప్రసాదమున వినూతన మతమును ప్రచారముసలుప దొరకొనెను. బలదేవుని మరణానంతరము ప్రధానిపదవికి బిజ్జలుడు బసవేశ్వరు నాహ్వానించెను. బసవేశ్వరుడు తొలుత, మంత్రిపదవికి విముఖుడు. కాని, చివరకు, మతప్రచారమునకు అధికారపదవి తోడ్పడగలదని అంగీకరించెను.

ఆ విధముగ బసవన బిజ్జలుని ప్రధానిగ, సర్వసేనాధిపతిగ, కోశాధ్యక్షుడుగ నియమితుడయ్యెను. బిజ్జలుడు బసవేశ్వరునితో గల సంబంధమును దృఢతరము సల్పుటకు తన సహోదరి నీలలోచన నిచ్చి వివాహమొనరించెను. బసవేశ్వరుని సహోదరి నాగలాంబిక కప్పడి నుండి కల్యాణికి సోదరునితో ఏతెంచినది.

ఆ సమయమున కన్యకయైన నాగలాంబికకు శివప్రసాదము వలన కార్తికేయాంశతో పుత్రుడు ఉద్భవించెను. అతనిపేరుగూడ బసవనయే. అతిలోకతేజస్వియైన ఈబాలకునకు చెన్న (అందమైన) బసవన యను పౌరుషనామధేయము ఏర్పడినది.

నూతన మతప్రచారమున చెన్నబసవన, బసవేశ్వరుని మించిన దీక్షతో పాటుపడెను. బిజ్జలుని ప్రధాని, మకుటములేని మహీపతి, మేనమామ బసవేశ్వరుడు. అతిలోక తేజస్వి మేనమామను మించిన

మేధావి మేనల్లుడు చెన్నబసవన, నాయకత్వమున వీరశైవము విజృంభించినది. సంఘమున విప్లవాత్మకమైన మార్పులు రాసాగినవి.

స్వమతస్థాపన పరమతఖండన ఉచ్ఛ్వాసనిశ్వాసములుగ పని చేయు వీరశైవులకు, ఇతరమతముల ప్రాతికూల్యమధికమయ్యెను. వీరశైవమువలన దెబ్బతిన్నమతములలో ముఖ్యమైనది జైనము.

ఏకాంతరామయ్య పరమమాహేశ్వరుడు. ఆతనికి బసవేశ్వరునిపై భక్తి కుదిరినది. క్రీ. శ. 1200 నాటి శాసనమున ఏకాంతరామయ్య కథ సవిస్తరముగ అభివర్ణితము. ఏకాంతరామయ్య కుంతలబ్రాహ్మణ దంపతుల పుత్రుడు. అతని శివదీక్షాతత్పరత్వమువలన రామయ్యకు ఏకాంతరామయ్య యను పేరేర్పడినది. అబ్లూరులో ఆతనికి జైనులకు వివాదమేర్పడినది. జైననాయకుడు గ్రామాధికారియైన శంకగౌండుడు. ఏకాంతరామయ్య శైవమతమహత్త్వమును నిరూపించుటకు, తన శిరస్సును ఖండించి శివవిగ్రహపాదపీఠముపై సమర్పింపగ, వారము గడచినపిమ్మట యథాపూర్వముగ శిరస్సు మచ్చయైన కన్పింపకుండ ఆతని కంఠమును అతికిపోయినది. "సమయము" ప్రకారము జైనులు తమ జినవిగ్రహమును పగులగొట్టి - శివాయతనము నిర్మించవలసి యున్నది. కాని, జైనులందుకు సమ్మతింపలేదు. ఏకాంతరామయ్య బలవత్తరమైన ప్రాతికూల్యమును సరకుగొనక, జినాలయమును విధ్వంసమొనర్చి, ఆ ప్రదేశమున పర్వతోపమమైన శివాలయమును నిర్మించెను. జైనులు రాజైన బిజ్జలున కా ఉదంతము విన్నవించిరి. ఏకాంతరామయ్య బిజ్జలుని నిండుకొలువులో నిర్భయముగ తన శిర శిరస్సును పణముగానొడ్డి, తాను జయించినచో జైనుల ఆలయములు ఎనిమిదివందలు - ఆనెసెజ్జియ బసతిపణముగా కోరుకొనెను. బిజ్జలు డాతని వాదమువిని జైనుల అంగీకారము నడిగెను. కాని, జైను లందుకు సమ్మతించలేదు. బిజ్జలుడు జైనులతో ఇరుగుపొరుగువారితో పొరపొచ్చెములు లేకుండ మెలగుట మంచిదని హితోపదేశము సల్పి,

ఏకాంతరామయ్యకు "విజయపత్రము" నిచ్చి, ఏకాంతరామయ్య కట్టించిన శివాలయము "వీరసోమనాథు"ని గుడికి ఒకగ్రామమును దానముచేసెను. అతనితోపాటు సామంతులును ఆ ఆలయమునకు అనేకదానము లొసంగిరి.

జైనకథనము వేరుగనున్నది.'బిజ్జలార్య చరిత్రము'నబసవేశ్వరుని ప్రాభవమునకు కారణాంతరము నిరూపితము. బసవేశ్వరుని సహోదరి అతిలోకసౌందర్యవతి. ఆమె రాజైన బిజ్జలుని వలలో వేసికొన్నది. ఆవ్యామోహమున బడిన బిజ్జలుడు యుక్తాయుక్తవిచక్షణలేక ప్రవర్తించెనని ఆరోపితము. అందుచే ఏకాంతరామయ్య అతిలోకమహాత్మ్యము, కృతకమనియు, వీరశైవుడైన ప్రధాని బసవేశ్వరుడుండగ, వ్యామోహవివశుడై కామాంధకారమున కన్నుగానని బిజ్జలునిముందు, ఎట్టి కృతకమహాత్మ్యములైన చూపింపవచ్చునని జైనుల వాదము. బసవేశ్వరుని పంపున జంగము డొకడు దండించిన ఫలమును భక్షించి బిజ్జలుడు ప్రాణముల గోల్పోయెననియు మరణమునకు ముందాతడు తనయుడైన ఇమ్మడి బిజ్జలుని, బసవేశ్వరుని సంహరింపనాజ్ఞాపించెననియు జైనకథనము. మరియు, బసవన బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడెను. నీలాంబయు విషముత్రాగి ఆత్మహత్యకు పాల్పడెను. జంగము లెందరో రాజక్రోధమునకు గురియై అసువులు గోల్పోయిరి. కాని, ఇమ్మడి బిజ్జలుని కోపము ఉపశమించిన పిమ్మట, చెన్నబసవడు, మేనమామ ధనాగారమును సమర్పించి రాజానుగ్రహపాత్రుడై ప్రధాని యయ్యెను. ఇది జైనకథనము.

బిజ్జలుడు జైనుడని జైనరచనలలో గలదు. ప్రముఖులను తమ మతానుయాయులని చెప్పుకొనుట జైన సంప్రదాయము. వీరశైవులు గూడ అతని జైనుడనియే అధిక్షేపించిరి. తెలుగు బసవపురాణమును బట్టి బిజ్జలుడు పాండురంగభక్తుడు. కులక్రమానుగతమైన శైవమును బిజ్జలుడు ఉజ్జగించెననుటకు తగిన ఆధారములు లేవు.

కాలక్రమమున బిజ్జలునకును - ప్రధానియైన బసవేశ్వరునకు పొత్తు కుదురలేదనుట నిర్వివాదము. బసవేశ్వరుని ప్రాభవము, విప్లవాత్మకమైన తత్వము రాజాస్థానమునందలి ఇతరమంత్రులకు ముఖ్యముఁగ మంచెన మున్నగువారికి నచ్చలేదు. అధికారపదవిలో నున్న బసవేశ్వరుని బాసట చూచుకొని వీరశైవులు విజృంభించి సమకాలీనసంఘములో విప్లవము చెలరేగ దీయుచుండిరి. వీరశైవులకు బసవేశ్వరుని రక్ష గలదు. "హల్లెయగ" మధువయ్య- ఇరువురు వీరశైవులకు బిజ్జలుడు గుడ్లుతీయించ నాజ్ఞాపించెను. అంతటితో రాజునకు మంత్రికి మధ్య వైరమేర్పడినది. ఇరుపక్షములమధ్య "అంతర్యుద్ధము" దాపురించినది. జగద్దేవుడు, బసవేశ్వరుని అనుయాయుడు, నిండు కొలువులో బిజ్జలుని సంహరించెను. బిజ్జలుని సుతులు బసవేశ్వరుని వెంటాడిరి. బసవేశ్వరుడు కూడలిసంగమమును చేరి, అచ్చట లింగైక్యమొందెను. చెన్నబసవడు ఉత్తరకనరదేశమునకు పారిపోయి ఉళవి గుహాభ్యంతరమున తలదాచుకొనెను. ఇది బసవపురాణ కథనము.

చెన్నబసవపురాణమున ఈ వృత్తాంతమే యీషద్భేదములతో గలదు. అంతర్యుద్ధములో చెన్నబసవడు బిజ్జలుని జయించెను. తల్లి ఆజ్ఞ చొప్పున మృతసేనలను తిరిగి బ్రతికించి, బిజ్జలునకు హితోపదేశము సల్పెను. పశ్చాత్తప్తుడైన బిజ్జలు డాతని ప్రధానిపదవియందు నెలకొల్పెను. అన్యోన్యవ్యాఘాతములతో నిండిన ఈ కథలనుబట్టి యథార్థచరిత్ర యేర్పరచుట కష్టము. చెన్నబసవపురాణము బసవేశ్వరుని లింగైక్యకాలము శక 707 (క్రీ. శ. 785) గ వచించుచున్నది. ఈ తేదీని చరిత్ర అంగీకరింపజాలదు.

# కాకతీయులు

కాకతీయులు వరాహలాంఛనులు. కాకతీయులకు పూర్వ మాంధ్ర దేశమును పాలించిన తూర్పుచాళుక్యులు కూడ వరాహలాంఛనులే! కావున కాకతీయులు మొదట తూర్పుచాళుక్యుల కాలమున సామంతులై యుండి కాలక్రమమున ప్రభుత్వమును సంపాదించిరని యూహించుట కవకాశమేర్పడినది. క్రీ. శ. 956 సంవత్సరమునాటి శాసనమొకటి కాకర్త్యగుండనను పేర్కొనుచున్నది. (1) అది అమ్మరాజు కాలము నాటిది. గుండియ రాష్ట్రకూటుని మనుమడు, ఎఱియ రాష్ట్రకూటుని కుమారుడునగు కాకర్త్యగుండన ప్రేరణచే నతవాటి విషయావాసుల నుద్దేశించిన దానశాసనమది. కాకతిశబ్దమునకు ప్రకృతి కాకర్త్య శబ్దము కావచ్చును. అంతేగాక "నతవాటి విషయము" ఆరంభకాలమునుండి కాకతీయులపాలనలో నున్నదే! కావున కాకర్త్యగుండన వంశీయులె కాకతీయులని కొందఱు చరిత్రకారుల అభిప్రాయము.

"శ్రీమాన్ కాకతిపురాధినాథో బేతః" అని ఖాజీపేట శాసనము. (2) కాకతిశబ్దమునకు పురపరముగ ప్రయోగము కన్పించుచున్నది. ఈ శాసనము మొదటిప్రోలరాజు కొడుకగు రెండవబేతరాజు వరుణ ప్రతిష్ఠ చేయునపుడు వేయించినదనుటచే కాకతీయశాసనములలో మిక్కిలిప్రాచీనమైన శాసనములలో నొకటియని చెప్పవచ్చును. అయిన ఈ కాకతిపురమెచ్చటిది? అనుప్రశ్న ఉదయించును. మైసూరురాష్ట్రము న "కాకతి" యను నొకగ్రామమున్నది. కాకతిగ్రామమునుండి వచ్చినవారు కాకతీయులని చెప్పుట కాకర్త్యగుండ్యనవంశీయులే కాక

---

(1) C. P. No. 1 & 1916-17 of E. R. 1917 P. 117
మారేమండ రామారావుగారి కాకతీయసంచికలో ఉపోద్ఘాతము.

(2) J. A. H. R. S. VII - i p 115 - vide కాకతీయసంచిక.
అనుబంధము - ఖాజీపేట శాసనము.

తీయులని చెప్పుట - రెండును ఊహాలుమాత్రమే! పైరెండుఊహాలును కేవలము నిరాధారములు కాకపోయినను కాకతిపురమునకు, అనుమకొండకు మధ్యగలదూరమునుగాని కాకర్త్యగుండనకు కాకతీయులకు మధ్య ఉద్భవించినవారిపేరులుగాని ఇంతవరకు చరిత్రచెప్పలేదు.

కాకతీయప్రభువులలో చివరివాడగు ప్రతాపరుద్రుని ఆస్థానకవి విద్యానాథుడు కాకతీయశబ్దమునుగూర్చి చెప్పిన వ్యుత్పత్తి పేర్కొనదగినది. కాకతి యనుదుర్గ ఏకశిలానగరేశ్వరులకు కులదేవత. ఆమెను ఆరాధించుటచే ఆవంశీయులు కాకతీయులైరి. (3) ఆ కాలమున ఓరుగల్లు నందున్న కాకతమ్మగుడి క్రీడాభిరామమునందు సుప్రతిష్ఠితము. "కాకతమ్మకు సైదోడు ఏకవీర"- క్రీడాభిరామము. విద్యానాథుని వ్యాఖ్యానము కాకతీయుల రాజ్యావసానకాలమునాటిది. తరువాత కొంత కాలమునకు అవితల్లి కలువరుచేశాసనమున ఇంకొకగాథ కన్పించుచున్నది. కాకతియన గుమ్మడితీగె. ఒక రాజాంతఃపురమును నాశనమొనర్చు సమయమున రాజకుమారుడొకడు దైవవశమున నొకగుమ్మడితీగెలో చిక్కుకొని శత్రువులబారినుండి రక్షింపబడెననియు నాతని వంశీయులు కృతజ్ఞతాపూర్వకముగ గుమ్మడితీగను స్మరించుకొనుటకై కాకతీయులమని చెప్పుకొనిరనియు అందలి గాథ. (4)

కాకతీయులకును జైనయక్షిణి కూష్మాండినీదేవికిని ముడివెట్టు మఱియొకవాదముకలదు. కాకతియన గుమ్మడితీగె. కూష్మాండమనగ గుమ్మడికాయ. కాకతీయుల పూర్వీకులు జైనులనియు, నేమియను ఇరువదిరెండవ తీర్థంకరుని శాసనదేవి కూష్మాండినియను యక్షిణి యనియు, ఆమెనుండి కాకతీయులను పేరు స్థిరపడినదనియు ఈవాద సారాంశము. కాకతీయులు తరువాతి కాలమున శైవులైనట్లే యీ కాకతమ్మగూడ దుర్గాదేవిగ మారినదనియు, అనుమకొండలో మొదట

(3) ప్రతాపరుద్ర యశోభూషణము - విద్యానాథకృతి.
(4) ఆంధ్రసాహిత్య పరిషత్ పత్రిక - IV పే 96 - 112.

అనేక జైనాలయములు విలసిల్లినవనియు ఈవాదప్రోక్తల యభిప్రాయము. రాష్ట్రకూట రాజులు జైనులు- కాకతిపురము కర్ణాటాంధ్రముల గడదేశముననున్నదా ? రాష్ట్రకూటగుండ్యన - పూర్వీకులు కాకతిపురమునుండియే అనుమకొండ ప్రాంతమునకు వలసివచ్చియుందురనియు కొందఱు యూహించుచున్నారు.

కాకతీయుల వంశవృక్షము.

కాకర్త్యగుండన - ?
|
మొదటి బేతరాజు.
|
మొదటి ప్రోలరాజు.
|
రెండవ బేతరాజు.
|
రెండవ ప్రోలరాజు.

రుద్రదేవమహారాజు. | మహాదేవరాజు !

(మహాదేవరాజు)
|
గణపతిదేవ చక్రవర్తి.
|
రుద్రమదేవి.

ముమ్మడమ్మ. | రుయ్యాంబిక.

(ముమ్మడమ్మ)
|
ప్రతాపరుద్రదేవచక్రవర్తి.

కాకర్త్యగుండన కాలమున వేంగివిషయము పరిపాలించిన అమ్మరాజు కాలమంతయు అంతఃకలహములతో కల్లోలపరిస్థితులతో గడచినది. అమ్మరాజు క్రీ. శ. 947 నుండి 970 వరకును అతనిసోదరుడు దానార్ణవుడు 970 నుండి 973 వరకు పరిపాలించిరి. దానార్ణవుడు రాజ్యమును గోలుపోవుటచే అతనిపుత్రులు శక్తివర్మ-విమలాదిత్యుడు చోళరాజు రాజరాజు ఆస్థానమున తలదాచుకొనిరి క్రీ. శ. 973 నుండి క్రీ. శ. 1000 మధ్యకాలమును తూర్పుచాళుక్యుల శాసనములు అరాజకపరిస్థితిగనే అభివర్ణించినవి. నిజమునకు క్రీ.శ. 950 ప్రాంతము నుండి వేంగిమండలమున కల్లోలమే రాజ్యమునల్పినట్లు చెప్పవచ్చును. అమ్మరాజు కాలమున అంతఃకలహములు- తరువాత 27 సంవత్సరముల అరాజకత్వము- తరువాత శక్తివర్మ విమలాదిత్యులపక్షమున చోళులప్రవేశము రాజరాజనరేంద్రుని కాలమునగూడ యుద్ధములు సాగుచునేయున్నవి. క్రీ. శ. 1022 లో రాజరాజనరేంద్రుడు పట్టాభిషిక్తుడైనను- క్రీ. శ. 1031 లో అతని సవతిసోదరుడు విజయాదిత్యుడు- తాత్కాలికముగ రాజ్యమునాక్రమింపగల్గెను. ఈపరిస్థితులలో సామంత రాజులు ఏవిధముగ ప్రవర్తించినదియు చరిత్రకందని విషయమే! పశ్చిమ చాళుక్యులు విజయాదిత్యునిపక్షము వహించిరి. పశ్చిమ చాళుక్యులకు సామంతులైన కాకతీయులు మధ్యనుండుటచే పాల్గొని యుందురనవచ్చును. బేతరాజును పేర్కొనుగూడూరుశాసనము ఇప్పట్టున పేర్కొనదగినది. ఇందు దుర్జయాన్వయ సంభూతుడైన ఎఱ్ఱన-పిమ్మట ఎఱ్ఱనభార్య కామసాని బేతరాజునకు తోడ్పడిరి-ఎఱ్ఱన శత్రువులను చంపి బేతరాజును కొఱవిదేశమున ప్రతిష్ఠించెననియు, కామసాని అతనిని కాకతివల్లభుజేసెననియు- గూడూరుశాసనకథనము. ఈ శాసన కథనము తెలియరాదు. ఇందలిబేతరాజు మొదటిప్రోలరాజు తండ్రియగు మొదటిబేతరాజు కావచ్చునని యూహింపవచ్చును. ఆనాటి కల్లోలపరిస్థితులలో బేతరాజు ఎఱ్ఱన అతనిభార్య కామసాని సాయ

మున కొలనవిదేశమున సుప్రతిష్ఠితుడయ్యెనని యూహింపవచ్చును. రెండవ బేతరాజుకాలమున - అతనిని శత్రువులనుండి రక్షింపవలసిన పరిస్థితులున్నట్లు లేవు. అతడు త్రిభువనమల్ల బిరుదాంకితుడు. ఖాజీపేట శాసనము మొదటిప్రోలరాజు తండ్రియగు బేతరాజును సుస్పష్టముగ పేర్కొనుచున్నది. "శ్రీమాన్‌కాకతిపురాధి నాథో బేతః"

కాకతీయులకాలనిర్ణయముగూడ సమస్యాపూరణముగనే పరిణ మించినది. తూర్పుచాళుక్యరాజు అమ్మరాజు క్రీ. శ. 947 నుండి మధ్య మధ్య అరాజకపరిస్థితులతో క్రీ. శ. 970 వరకు రాజ్య మేలెను. అతనితరువాత దానార్ణవుని మూడేండ్లయేలుబడి ముగిసిన పిమ్మట 27 సంవత్సరములు వేగిదేశమున అరాజకత్వము ప్రబలెను. అమ్మరాజు కాకర్త్యగుండన సమకాలీనులు - దానార్ణవునిపుత్రులపక్ష మున చోళులు వేంగిరాజ్యముపై అధికారము నెరపయత్నించిరి. కాకతీయులలో మొదటిరాజగు మొదటిబేతరాజునకు చోళులకు శత్రుత్వమేర్పడినది. (5) ఇతడు, "చోళక్ష్మాపాలచమూవార్ధి ప్రమథన మార్జితోర్జిత లక్ష్మీయుతుడు" రాజరాజు క్రీ. శ. 985 నుండి 1016 వరకు రాజ్యము సల్పెను. అతనితరువాతి చోళరాజు రాజాధిరాజు (1018—1054) రెండవరాజేంద్రదేవుడు (1052—1064) తూర్పు చాళుక్యుల పక్షమువహించుట చరిత్రప్రసిద్ధము- మొదటిబేతరాజు చోళులకు శత్రువు- అతనిపుత్రుడు మొదటిప్రోలరాజు. చోళులకు బద్ధవిరోధియైన కల్యాణిసోమేశ్వరునకు సాయముచేసి అనుమకొండ విషయమును వీరభృత్యముగపొందెను. అందుచే మొదటిబేతరాజు చోళరాజరాజు అవసానకాలమున అనగా అతడు శక్తివర్మను వేంగిసింహాసనమున నింపినప్పుడు ఉన్నట్లు ఊహింపవచ్చును. కల్యాణిసోమేశ్వరునకు (1042-68) మొదటి ప్రోలరాజుసమకాలీనుడు. గణపతిదేవచక్రవర్తినుండి కాకతీయుల కాలనిర్ణయములో చిక్కులు

(5) ఖాజీపేట శాసనము - రెండవబేతరాజు వేయించినది.

లేవు- చారిత్రకులు ఈ క్రిందివిధముగ కాకతీయుల కాలనిర్ణయము నల్పిరి.

| | | |
|---|---|---|
| మొదటిబేతరాజు | క్రీ. శ. | 1000 కు పూర్వము |
| మొదటి ప్రోలరాజు | క్రీ. శ. | 1050 — 1085 |
| రెండవబేతరాజు | క్రీ. శ. | 1085 — 1115 |
| రెండవప్రోలరాజు | క్రీ. శ. | 1115 — 1158 |
| రుద్రదేవుడు (మొదటిప్రతాపరుద్రుడు) | | 1158 నుండి 1195 |
| మహాదేవరాజు | ,, | 1195 నుండి 1199 |
| గణపతిదేవచక్రవర్తి | ,, | 1199 నుండి 1261 |
| రుద్రాంబ | క్రీ. శ. | 1000—50కు పూర్వము |
| (రెండవ) ప్రతాపరుద్రదేవచక్రవర్తి | | 1296 — 1323 లేక 1326 ? |

## మొదటి బేతరాజు

ఇతడే ఖాజీపేట శాసనము పేర్కొనిన "శ్రీమాన్ కాకతిపురాధినాథో బేతః" ఇతనికి చోళులతో వైరము ఏర్పడినది. వివరములు తెలియవు. గూడూరు శాసనమునందలి దుర్జయవంశీయుడైన ఎఱ్ఱన- అతనిభార్య కామసాని తోడ్పాటుచే ఈతడు కొఱవిదేశమున సుప్రతిష్ఠితుడయ్యెననియు, క్రీ.శ. 11 వ శతాబ్ది ప్రారంభమున స్వతంత్రుడై, కాకతివల్లభుడై రాజ్యమేలెననియు ఊహింపవచ్చును.

## మొదటి ప్రోలరాజు

మొదటి ప్రోలరాజు మొదటి బేతరాజుపుత్రుడు. ఇతడు చక్రకూటమును జయించి భద్రంగపురాధీశ్వరుని పారద్రోలెను. కొంకణమునుజయించెను. కొడవర్తి దుగ్గరాజు కొడుకును చంపెను. పురకూటదేశమును గొన్నాహ్వాయుని జయించెను. ఆయాదేశములుగల

అనుమకొండ విషయమును త్రైలోక్యమల్లుని యొద్దనుండి శాసన పూర్వకముగ బడసెను. (6)

రేచెర్ల బమ్మసేనాని ఇతని కాలమువాడే. బమ్మసేనాని కాంచీనగర కవాటమును భేదించి తనయేలికయగు కాకతివల్లభునకు వీరలక్ష్మి వివాహము గావించెను. (7) సోమేశ్వరుడు ఒకతూరి కంచిపై దండయాత్ర సాగించినట్లు చరిత్రవలన తెలియుచున్నది. ఆదండ యాత్రలో ప్రోలరాజు - అతనిసేనాని బమ్మడు పాల్గొనియుందురు.

సోమేశ్వరునకు కాకతీయులు సామంతులని తేలుచున్నది. కాకతీయులలో మొదటిరాజుగ నెన్నబడుచున్న మొదటిబేతరాజు చోళులకు శత్రువు. చోళులకు శత్రువులు పశ్చిమచాళుక్యులు. అందుచే శత్రువులకు శత్రువులు మనమిత్రులను సూత్రముచొప్పున కాకతీయులకు పశ్చిమచాళుక్యులకు సఖ్యమేర్పడినది.

పశ్చిమచాళుక్యులలో కార్యఖడ్గనిపుణుడుగ పేర్కొనదగినవాడు ఆహవమల్ల, త్రిభువనమల్ల బిరుదాంకితుడగు మొదటిసోమేశ్వరుడు. సోమేశ్వరుడు రాజధానిని మాన్యఖేటమునుండి కల్యాణినగరమునకు మార్చి (క్రీ. శ. 1042 నుండి 1068) రాజ్యమేలెను. ఇతడు తొలుదొల్త ధారానగరాధిపతియైన భోజుని జయించి నర్మదానదినుండి కృష్ణానది వరకు తన రాజ్యమును విస్తరింపజేసెను. ఇతడే కల్యాణీనగరనిర్మాత. అనేకయుద్ధముల ఆరితేరినయోధుడు. యుద్ధకౌశలము, రాజనీతిజ్ఞత, ఉచ్ఛ్వాసనిశ్వాసములుగ ఆత్మవిశ్వాసముతో చోళసామ్రాజ్యమును ప్రతి ఘటించి నిల్చిననాయకుడు సోమేశ్వరుడు. ఆతడనేకయుద్ధములలో విజయము సంపాదింపకలిగెను. కొన్ని సమయుద్ధములుగా పరిణ మించినవి. మరికొన్నిట పరాజయమే ఎదురైనది. అయినను

(6) ఖాజీపేట శాసనము.
(7) పాలంపేట శాసనము - కాకతీయ సంచిక.

అకుంఠితస్థైర్యముతో ఆత్మవిశ్వాసముతో ఒకనాడాతడు కాంచీనగరమునే భేదించియు, మఱియొకనాడు చోళులకు ఆత్మబంధువులేలు వేంగిని కూడ తన ప్రాభవములోనికి దెచ్చుకొనగల్గెను. దక్షిణాపథచరిత్రపై చెరగిపోని వ్యక్తిత్వముద్రవేసిన రాజన్యులలో సోమేశ్వరుడొకడు. సోమేశ్వరుని అనుయాయులైన సామంతులతోగూడ ఉదాహరణ ప్రాయమైన యాతని ఆత్మవిశ్వాసము పరాక్రమసాహసములు ప్రతి ఫలించినవి. అతని సామంతుడైన దడిగదేవుడు కొప్పము యుద్ధము నందు చోళరాజు రాజేంద్రుడధివసించిన యేనుగుపైనెక్కి అతని తల నరికి త్రిశూలముపై గ్రుచ్చి యెత్తిపట్టెను. కాంచీనగర కవాటభేదన మున కాకతీయదండనాథుడు బమ్మసేనాని సాహసకార్యముగ్గడింప దగినది. ప్రోలరాజు, తన యేలికయైన ఆహవమల్లుని అడుగుజాడలలో నడచి, ఆత్మవిశ్వాసముతో నూతనసామ్రాజ్యప్రతిష్ఠాపకుడు కాగల్గెను.

"అనుమకొండ" కేంద్రముగ బలవంతమైన మిత్రరాజ్యముండుట పశ్చిమచాళుక్యరాజ్యమునకు మిక్కిలి అవసరము. వేంగిరాజ్యమునకు పశ్చిమచాళుక్యరాజ్యమునకు మధ్య "అనుమకొండ" గడిదేశము కాగలదు. తరతరములనుండి వేంగిప్రభువులకు చోళులకు బంధుత్వ బంధములు కలవు. అందుచే శత్రువులైన చోళులకు ఆత్మబంధువులైన వేంగిరాజులకు ప్రక్కలో బల్లెముగ నుండునని రాజనీతితో సోమేశ్వరుడు కాకతిప్రోలరాజునకు అనుమకొండ వీరభృత్యముగ ప్రసాదించి ప్రోత్సహించెను. కాని – చివరకు అనుమకొండ కాకతీయులు, అటు వేంగిరాజ్యమును, ఇటు పశ్చిమచాళుక్యులరాజ్యమును కూడ కబళించి ఒకనాడు కళింగమునుండి కంచివరకు తమ సామ్రాజ్యమును విస్తరింప కల్గిరి. రాజరాజనరేంద్రుని అనంతరము వేంగిరాజ్యము చోళరాజ్యము పశ్చిమచాళుక్యరాజ్యముకూడ కల్లోల పరిస్థితులకు ఆలవాల మయ్యెను. వేంగి సింహాసనమును శక్తివర్మ అతని తండ్రి విజయా

దిత్యుడు ఆక్రమించిరి. చోళరాజ్యమున విప్లవాత్మక పరిస్థితులకు ఆకరమైనది. పశ్చిమచాళుక్యరాజ్యమున రెండవసోమేశ్వరుడు ఆరవ విక్రమాదిత్యుడు సోదరులు అధికారమునకై పెనగులాడిరి. ఈ పరిస్థితులలో కాకతీయులు తమ బలమును పెంపొందించుకొని స్వాతంత్ర్య సామ్రాజ్యనిర్మాణమునకు సుస్థిరమైన పునాదులను పాదుకొల్పగల్గిరి.

## రెండవ బేతరాజు

త్రిభువనమల్ల బిరుదాంకితుడగు రెండవబేతరాజు మొదటి ప్రోలరాజుపుత్త్రుడు. "త్రిభువనమల్ల" బిరుదు పశ్చిమచాళుక్యసంబంధమును సూచించుచున్నది. ఇతని సేనాపతి వైజదండనాథుడు. రెండవ బేతరాజు పశ్చిమచాళుక్యచక్రవర్తులకు సామంతుడుగ రాజ్యమేలెను. ఇతడు మహామండలేశ్వరుడు. ఇతడు చాళుక్యచక్రవర్తిచే సబ్బిమండలమును వీరభృత్యముగా బడసెను. (8)

ఇతడు పరమమాహేశ్వరుడని,తండ్రిప్రోలరాజునకై వరుణప్రతిష్ఠ సల్పినట్లు ఖాజీపేటశాసనమున కలదు. అందుచే ఇతడు శైవుడనియే చెప్పవలసియున్నది.

## రెండవ ప్రోలరాజు (1115 - 1158)

రెండవప్రోలరాజు త్రిభువనమల్ల బిరుదాంకితుడైన రెండవ బేతరాజు పుత్త్రుడు. ఇతని చరిత్ర హృద్యముగా నభివర్ణించు అనుమ

(8) కాకతిబేతనరేంద్రనం జగం పొగలె చళుక్య చక్రిభరణం సతికానిసితత్ర్పసాదితం బగెగోళ సబ్బిసాయి రమనైలిసి- అనుమకొండశాసనము -

**Ep - Ind - IX p 256**

కాకతీయ సంచికలో శ్రీ మారేమండ రామారావుగారిచే ఉదాహృతము.

కొండశాసనము రుద్రేశ్వరాలయమునందు చెక్కబడియున్నది. ఇతడు సింహాసనమధిష్ఠించునాటికే అంతవరకు చక్రవర్తులగు పశ్చిమ చాళుక్యరాజ్యము క్షీణదశకువచ్చినది. కార్యఖడ్గనిపుణుడుగా దక్షిణాపథ చరిత్రపై అనుయాయులగు సామంతులపై తన వ్యక్తిత్వముద్ర వేయకలిగిన సోమేశ్వరుని అనంతరము సింహాసనమునకై అతని పుత్రులలో కలహము సంభవించినది. అతని అగ్రసుతుడు రెండవ సోమేశ్వరునోడించి ఆరవ విక్రమాదిత్యుడు రాజ్యమునకు వచ్చెను. ఆరవ విక్రమాదిత్యుడు చోళరాజు కన్యకను వివాహమాడుటచే తాత్కాలికముగ దక్షిణాపథ రాజకీయరంగమున అంతవరకుగల పరిస్థితులు వ్యత్యస్తమైనవి. అయినను విక్రమాదిత్యుడు తండ్రివలెనే "కార్యఖడ్గనిపుణ"తతో రాజ్యమేలెను. కాని అతని తరువాత అతని పుత్రుడు, అతని పౌత్రుడు తైలపుడు. సమర్థులుకారు. మహబూబ్ నగర్ జిల్లాలో కోడూరు రాజధానిగ కుమారతైలపుడు రాజప్రతినిధిగా నుండెను. నెక్కొండలో క్రీ. శ. 1122 లో అతని శాసనము గలదు.

రెండవప్రోలరాజు కాలమున క్షీణదశకువచ్చిన పశ్చిమచాళుక్య రాజ్యమును సరకుగొనక సామంతులు స్వతంత్రులు కాజొచ్చిరి. కుమారతైలపుని యుద్ధములో జయించియు, "భక్త్యనురాగములచే" రెండవప్రోలరాజు విడిచిపుచ్చినట్లు అనుమకొండశాసనమున కలదు. ఇట్లు చేతచిక్కిన తైలపుని విడిచిపుచ్చుటకు కేవలము భక్త్యనురాగములే కారణములు కాకపోవచ్చును. ఇందు రాజనీతికూడ అణగియున్నది. ఒక దుర్బలచక్రవర్తి కేంద్రమున నుండుటయే ప్రోలరాజు స్వాతంత్ర్య రాజ్యస్థాపనకు మేలు. కానిచో- బలవంతులైన ఇతర సామంతులనెదుర్కొనవలసివచ్చును. చివరకు సామంతుడైన కాలచురి ప్రభువు బిజ్జలుడాతని పదభ్రష్టునిచేసి క్రీ. శ. 1158 లో సింహాసనమునాక్రమించెను. రెండవప్రోలరాజు బిజ్జలునకు సాయముచేసి -

బిజ్జలుని మంత్రి వీరశైవమత ప్రవక్తయైన బసవేశ్వరుని ప్రభావము నకులోనై అనుమకొండలో స్వయంభూదేవాలయమును నిర్మించెను.

కాకతీయసామ్రాజ్యమునకు పునాదులు వేసినవాడు రెండవ ప్రోలరాజే. ఇతనికి పూర్వపురాజులు సామంతులు - మహామండ లేశ్వరులు- ఇతడుకూడ తొలుదొల్త చాళుక్యులకుసామంతుడై యుండి మూడవ తైలపుని కాలమున స్వాతంత్ర్యమును ప్రకటించెను.

రెండవప్రోలరాజు సింహాసనమధిష్ఠించినప్పటి నుండి అనుమ కొండపరిసర ప్రభువులను జయించి తనరాజ్యమును విస్తరింపసాగెను. తైలపుడు యువరాజుగనున్నపుడు అతనినిర్జించెను. తరువాత ఇతడు గోవిందుని జయించెను. ఈగోవిందుడు చాళుక్యవిక్రమాదిత్యుని కాలమున దక్షారామమున శాసనములువేయించెను. ఈతడు కొండ పల్లిదుర్గపాలకుడని ప్రోలరాజు ఘనవిజయములలో నొకటి- మంత్ర కూటాధిపతి గుండరాజును జయించుట. గుండరాజునకు శిరోముండన మొనరించి, అతని వక్షస్థలమున వరాహలాంఛన ముద్రవేసిప్రోలరాజా తని విడిచిపుచ్చెను. కాకతిప్రోలుని దండనాధుడు కామచమూప తిమంథన్యగుండరాజును జంపినట్లు శాసనముకలదు. (9) ఇది ప్రోల రాజు విడిచిపెట్టిన తరువాతిగాథ కావచ్చును.

ప్రోలరాజు జయించినవారిలో జగద్దేవుడు మరియొకడు. జగద్దేవునకు తోడిపడినవారలు దొమ్మరాజు, మేడరాజు అనువారలు. జగద్దేవుని శాస నము వేములవాడలో క్రీ. శ. 1109 నాటిది గలదు. ప్రోలరాజు జగద్దేవుని నిర్జింపగ మిగిలిన దొమ్మరాజు మేడరాజులను ప్రోలరాజు పుత్రుడగు రుద్రదేవుడు జయించెను.

---

(9) యుద్ధేయేన మహాబలేన నిహతో మంథన్యగుండాధిపః
Hyd Arch - Series No. 3
కాకతీయ సంచిక,

చివరకు ప్రోలరాజు కాలచురిబిజ్జలునికి తోడ్పడుట తైలపుడు రాజ్యభ్రష్టుడగుట సంభవించినది. ప్రోలుడే మొదటి స్వతంత్ర కాకతీయరాజు. ఇతడు క్రీ. శ. 1158 సంవత్సరమున స్వాతంత్ర్యము ప్రకటించిన వెనువెంటనే వెలనాటిపై దండెత్తెను. ఆ యుద్ధమున వెలనాటిచోడుడు (అప్పుడు యువరాజు; తరువాత రెండవచోడరాజు.) కాకతిప్రోలుని సంహరించినట్లు ఊహింపనగును. రెండవచోడరాజును "కాకతిప్రోలనిర్దహన"-బిరుదాంకితునిగ దక్షారామమునందలి శాసనము పేర్కొనుచున్నది. (10)

రెండవప్రోలరాజుసేనానియైనబేతన (వైజదండనాథుని పుత్రుడు) "మహావిద్వాంసుడు, ధర్మశీలుడునగు నీ మంత్రిభార్య మైలమ కడలాలయవసతిని నిర్మించి"నట్లు పద్మాక్షిఆలయమున శాసనముకలదు. ఆ ఆలయమునందే బండపై 13 వ తీర్థంకరుడగు పార్శ్వనాథుని దిగంబర విగ్రహముగలదు. ప్రక్కనే ధ్యానముద్రలోనున్న జినదేవుని విగ్రహముప్రక్క బేతనదంపతుల విగ్రహములు గలవు. పద్మాక్షి ఆలయము తొలుదొల్త జైనాలయమే. తరువాత అదియెట్లు పద్మాక్షి దేవాలయముగమారినదో తెలియరాకున్నది. రెండవప్రోలరాజు "జగత్కేసరి" యను తటాకమును నిర్మించినట్లు శాసనాంతరములనుండి తెలియనగును.

అనుమకొండలోని స్వయంభూదేవాలయము రెండవప్రోలరాజు నాటి కట్టడములలో పేర్కొనదగినది. ఒకనాడు ఒకబండి అనుమకొండ ప్రవేశించునపుడు ఒక శిలకు తగిలెననియు ఆ శిల భిన్నముకాగా అందుండి దివ్యతేజోమయమగు శివలింగ ముద్భవించెననియు ఆ బండి ఇరుసు బంగారముగ మారెననియు నొక కథ కలదు. ఆశివలింగము స్వయంభూదేవుడని నుతికెక్కెను. కథలకు కాళ్ళుండవుగాని - అందు సత్యమేలేదని త్రోసివేయనక్కరలేదు - బసవేశ్వరుని ప్రభావమునకు

(10) S. I. I. IV No. 1242.

లోనయిన పిమ్మట - ప్రోలరాజు క్రొత్తగా నిర్మించిన అలయమే స్వయంభూదేవాలయమని ఊహింపవచ్చును.

రెండవ ప్రోలరాజు మొదట జైనుడనియు తరువాత శైవుడయ్యెననియు కొందరు చరిత్రకారులు ఊహించుచున్నారు. "రెండవ ప్రోలరాజు మొదట జైనుడుగనుండినను బిమ్మట శైవమతము నవలంబించెను." అని శ్రీమారేమండ రామారావుగారు వ్రాసిరి. (11)

కాని రెండవ ప్రోలరాజు తండ్రియైన రెండవ బేతరాజు పరమ మాహేశ్వరుడు - అతడు వరుణ ప్రతిష్ఠసల్పెను - బేతేశ్వరాలయమునకు దానముసల్పెను. కాకతీయప్రభువులు ప్రోలరాజునకు పూర్వమునుండియు శైవులు - రెండవప్రోలరాజు కాలమున "కడలాలయవసతి" జైనాలయము నిర్మించినది సేనాపతియైన బేతన భార్య మైలమ - రెండవప్రోలరాజు స్వయముగ జైనమతస్థుడనుటకు ఆధారములు కానరావు. రెండవప్రోలరాజునకు పూర్వమునుండియు కాకతీయులు శైవులే. రెండవప్రోలరాజు బసవేశ్వరునకు సమకాలీనుడు - బిజ్జలునకు మిత్రుడగుటచే అతని కాలమున కాకతీయ రాజ్యమున వీరశైవము ప్రవేశించినదని యెంచవచ్చును. కాలచురి ప్రభులకు దీక్షాగురువులైనవారే కాకతీయులకును రాజగురువులగుట గమనింపవలసిన విషయము. (12)

---

(11) కాకతీయ సంచిక.

(12) మల్కాపురశాసనమున గణపతిదేవచక్రవర్తి దీక్షాగురువు విశ్వేశ్వరదేశికుడు, ధర్మశివుడు - ధర్మశంభువు మున్నగువారి వంశమున-కళచురి రాజగురువుల వంగడము జన్మించినట్లు కలదు.

## రుద్రదేవ మహారాజు

మొదటి ప్రతాపరుద్రుడుగ చరిత్రలో ప్రసిద్ధికెక్కిన రుద్రదేవ మహారాజు రెండవప్రోలరాజు పుత్రుడు. ఇతని తమ్ముడు మహాదేవ రాజు.

రుద్రదేవుడు సింహాసనమధిష్ఠించునాటికే దక్షిణాపథ మంతయు కల్లోలపరిస్థితులకు లోనైనది. పశ్చిమచాళుక్యసామ్రాజ్య మంతరించినది. సామంతులైన యాదవులు, కలచురులు - హొయసలులు స్వతంత్రులై అన్యోన్యము పెనగులాడుచుండిరి. ఆ అదనులో రుద్రదేవుడుగూడ కాకతీయసామ్రాజ్యమును విస్తరింపజేసెను.

రుద్రదేవుడు దొమ్మెరాజు, మేడరాజు, మైలగిరిదేవుడు - భీముడు - చోడోదయుడు మున్నగు రాజుల జయించినట్లు అనుమకొండ శాసనమున తెలియుచున్నది. అది క్రీ. శ. 1162 నాటిది. అప్పటికే తైలపుడు రుద్రదేవునివలని భయముచే రక్తగ్రహణి పట్టుకొని మరణించెనట. దొమ్మెరాజు రెండవప్రోలరాజు జయించిన జగద్దేవునకు మిత్రుడు. ఈతడు ధర్మపురినుండి భద్రాచలమువరకుగల ప్రాంతమున కధిపతి. మైలగిదేవుడు అనుమకొండ ప్రాంతమునగల "పొలాసా" (పొలవాస)దేశమునకధిపతి. వర్ధమానపురము రాజధానిగ పరిపాలించిన చోళవంశీయుడు భీముడు (క్రీ. శ. 1118 లో) పరిపాలించినట్లుగలదు. అతనినే రుద్రుడు జయించియుండును.

క్రీ. శ. 1162 నాటి జటిచర్ల శాసనమున కరికాలవంశజుడగు మహామండలేశ్వరకందూరి ఉదయనచోడమహారాజు ప్రశంసగలదు. కాకతిరుద్రుడతని, జయించి- అతని పుత్రిక పద్మావతిని వివాహము చేసికొనెను.

రుద్రదేవమహారాజుసాధించిన పై విజయములన్నియు అనుమకొండ పరిసరప్రాంతములకు సంబంధించినవే. తండ్రియైన ప్రోలరాజు

వెలనాటిచోడులతో సల్పిన యుద్ధమునందు నిహతుడై యుండెను. అందుచే రుద్రదేవమహారాజు అవశ్యముసాధింపవలసినది వెలనాటి చోడులపై విజయము. వెలనాటిచోడులు గుంటూరుమండలమునుండి దక్షారామమువరకు గల సముద్రతీరమునకుపాలకులైరి. రుద్రదేవుడు పలుమారులు వెలనాటిపై దండెత్తెనని యూహింపవచ్చును. క్రీ. శ. 1158, 1168, 1186 సంవత్సరములలో దక్షారామమున రుద్రదేవుని శాసనములు కన్పించుచున్నవి. త్రిపురాంతకమునకూడ రుద్రదేవుని శాసనమొకటి కలదు. అనుమకొండ శాసనమున (క్రీ. శ. 1162) స్పష్టముగ రుద్రదేవరాజురాజ్యమునకు ఎల్లలుపేర్కొనబడినవి. తూర్పున సముద్రము, పశ్చిమమున కటకము (కళ్యాణి), దక్షిణమున శ్రీశైలము, ఉత్తరమున మాల్యవంతము. రెండవచోడరాజుపిమ్మట వెలనాటి ప్రభువగు మూడవగొంకరాజు శాసనములు క్రీ. శ. 1186 తరువాత కన్పింపకుండుటచేతను అతనిపుత్రుడైన పృథ్వీశ్వరుడు గోదావరికి ఉత్తరమున పిఠాపురమురాజధానిగ రాజ్యమేలుటచేతను, కాకతిరుద్రుడు మూడవగొంకరాజును క్రీ. శ. 1186 ప్రాంతమున జయించి పితౄణముదీర్చి యుండెననియూహింపవచ్చును. ఈవెల నాటి విజయమును సాధించుటకు ఆనాటి పరిస్థితులుగూడ రుద్రదేవ రాజునకుపకరించినవి. క్రీ. శ. 1176-82 సంవత్సరముల మధ్య రెండవ చోడరాజు- అవసానకాలమున లేదా మూడవగొంకరాజు రాజ్యారంభకాలమున పలనాటి యుద్ధము జరిగియుండును. ఆయుద్ధము నకు పిమ్మట వెలనాటి ప్రభువుల అధికారము సైనికబలము మిక్కిలి క్షీణించినది. రుద్రదేవుడు పితృవధకు ప్రతీకారము సల్పుట మాత్రమే కాక కాకతీయసామ్రాజ్యమును కృష్ణానది నుండి గోదావరి వరకు శ్రీశైలమునుండి దక్షారామమువరకు విస్తరింపగలిగెను.

రుద్రదేవుడే ఓరుగల్లుపట్టణమును నిర్మించినట్లు శివయోగ

సారమునుబట్టి తెలియుచున్నది. ఇందులూరి రెడ్లు పెదమల్లన పినమల్లన అచ్చటు మంత్రులుగనుండిరి. (13)

రుద్రదేవునికాలమునుండియు రేచెర్ల వంశీయులగు రెడ్లు కాకతి సామ్రాజ్య విస్తరణకు మిక్కిలి తోడ్పడి ప్రఖ్యాతివహించిరి. మొదటి ప్రోలరాజు కాలమున కాంచీపురకవాట భేదనమొనర్చిన బమ్మసేనాని ఈ వంశకర్త, తరువాత కాటరెడ్డి - అతని పుత్రుడైన కామసేనాని రెండవ ప్రోలరాజునకు కుడిభుజమై యొప్పెను. అతని పుత్రులు - బేతిరెడ్డి, కాటరెడ్డి, నామిరెడ్డి సుప్రసిద్ధులైరి. బేతిరెడ్డి రుద్రదేవునకు సమకాలీనుడై అతనితోపాటు అనేకయుద్ధములలో పాల్గొని యుండును. యాదవులదండయాత్రలో (క్రీ. శ. 1195 లో) ప్రభువునకై ప్రాణము లర్పించెనని యూహింపవచ్చును - ఇతని తమ్ముడు కాటమరెడ్డి కొడుకగు రుద్రసేనాని కాకతీయసామ్రాజ్యమునకు చేసినసేవ అపార మైనది. కాకతి గణపతిదేవచక్రవర్తి బందీకృతుడై యున్నపుడు - రాజ్యమును రక్షించి అతనికి పైతృకరాజ్యమును భద్రముగా అప్పగించిన యోధాగ్రేసరుడు రుద్రారెడ్డి.

దక్షారామశాసనములలో నొకచో రుద్రదేవునకు విద్యాభూషణు నుడ బిరుదము గన్పించుచున్నది. ఇతడు సంస్కృతమున రచించిన నీతిసారమను గ్రంథము నాధారముగగొని "నీతిశాస్త్రముక్తావళి" ని తెలుగున బద్దెన రచించెను.

రుద్రదేవుని కాలమున చారిత్రకముగ పేర్కొనదగినవి.

1. వీరశైవమత విజృంభణము
2. పలనాటి వీరయుద్ధము.

రెండవప్రోలరాజు కాలముననే పశ్చిమచాళుక్య సామ్రాజ్యము విచ్ఛిన్నము కాజొచ్చెను. అప్పటికే ఉత్తరాపథమంతయు తురుష్కా

---

(13) శివయోగసాగరము.

క్రాంతమైనది. దక్షిణాపథమందలి చాళుక్యసామ్రాజ్యము ఛిన్న భిన్నమై, సామంతులైన యాదవులు, హొయసాలులు - కాలచురులు కాకతీయులు అధికారమునకై ప్రాకులాడసాగిరి. ఉత్తరాపథమునందలి తురుష్కసేనాసమూహములను తాత్కాలికముగ వింధ్యపర్వతము లడ్డగింపగలిగినను ప్రతికూల మతభావఝంఝూమారుతములు పర్వత నదీనదములను దాటి ప్రసరింపసాగినవి.

రామానుజాచార్యులు గజనీమహమ్మదు సోమనాథదేవాలయ దండయాత్ర నాటికి ఇంచుమించు ఇరువదియైదేండ్ల యువకుడే. అప్పటికే ఇరువదియొక్క మారులు ముస్లిము దండయాత్రలుసాగినవి. రామానుజాచార్యులు స్థాపించిన వైష్ణవమతము సనాతన వైదికమతమే అయినను అందలిముఖ్యసిద్ధాంతములపై కాలప్రభావముద్ర ప్రస్ఫుటము. (14) ఇస్లాముమతమునందు ఏకేశ్వరోపాసనముఖ్యము. ముక్తికి భక్తిచాలును. కులమతవిచక్షణలేదు! సనాతన వైదికము నందును ఏకేశ్వరభావమేకలదు. అయినను ఆచరణమున బహుదేవతో పాసన ప్రబలినది. ముక్తిదుర్లభము. శ్లేష్మములో పడిన ఈగవలె జీవుడు బహుజన్మపరంపరలో చిక్కుకొని మ్రగ్గవలసినదే. అప్పట్టున రామానుజాచార్యులు విష్ణువేపరదైవమని ఏకేశ్వరోపాసన ప్రబోధించెను. ముక్తికి భక్తిచాలును. యజ్ఞయాగాదులు అనవసరము. కులమత విచక్షణగూడ పాటింపక - చండాలుడైనను భక్తితో ముక్తి సాధింప కలడని చాటినవాడు రామానుజాచార్యులు. వైష్ణవగురుపరంపరలోని ఆచార్యులు బహుళముగా అధమవర్ణులే. వైష్ణవమతము దక్షిణాపథ మున వేరుద్రొక్కుకొని ఉత్తరాపథమువైపుసాగినది - ఆంధ్రభూమి

---

(14) గాంధీమహాత్ముని అహింసావాదమును సనాతనమైన ఉపనిషదుక్తియే - 1857 (సాయుధ విప్లవము) సిపాయీల తిరుగుబాటు విఫలమైనపుడు - ఇక అహింసావాదమే అవశ్యశరణ్యము.

దక్షిణమునుండి ఉత్తరమునకు - ఉత్తరమునుండి దక్షిణమునకు పోవు ఉద్యమములకు - విశ్రాంతిస్థలము. కూడలిసంగమక్షేత్రము. వైష్ణవమును చేపట్టినవారిలో పలనాటి బ్రహ్మనాయడు పేర్కొనదగినవాడు - బ్రహ్మనాయడు అజాతశత్రువు, ధీరోదాత్తుడు అనిప్రసిద్ధి కెక్కినవాడు. అతడు కన్నమదాసను చండాల యువకుని తన ధర్మపుత్రునిగా స్వీకరించెను - ముస్లిములందు కల కంచము పొత్తు సుప్రసిద్ధము. యుద్ధసమయములందుగూడ పంక్తిభోజనమునకు వెనుదీయు అనేకత్వము భారతీయుల హృదయములలో గూడుకట్టుకొన్నది. బ్రహ్మనాయడు అందరకును "చాపకూడు" అనుపేరిట ఏకపంక్తి భోజనము అమర్చి నేటి సంఘసంస్కరణలకుగూడ ఆదర్శపురుషుడైనాడు. మాచెర్ల చెన్నకేశవాలయమున అనాడు కూడ చండాలురకు ప్రవేశముగలదు - అయిన వైష్ణవముపూర్తిగ వర్ణవ్యవస్థను నిరసింపలేదు. సాత్వికమూర్తి స్థితికారకుడగు విష్ణువును పరదైవముగ పేర్కొనినది. ఉప్పెనవలె - కత్తిఝళిపించుకొనుచు ప్రళయమువలె వచ్చి పడు - ప్రతికూల మతభావముల నెదుర్కొనుటకు - తగిన శక్తి, వీరత్వముగల వేరొకమతము ఆనాడు అత్యవసరమైనది. అట్టిమతమును స్థాపించినవాడు బసవేశ్వరుడు.

బసవేశ్వరుని వీరశైవము సాంఘిక రాజకీయ సారస్వత విప్లవముల ఘటించి - దక్షిణాపథమును భూకంపమువలె ఉఱ్ఱూతలూగించినది.

బసవేశ్వరుడు కాళచురిప్రభువు బిజ్జలుని మఱది, మంత్రి. బిజ్జలుడు పశ్చిమచాళుక్యచక్రవర్తి మూడవతైలపుని పారద్రోలి సింహాసనమాక్రమించెను. కాని చివరకు బసవేశ్వరుడు ఆదర్శప్రేరితుడు. ముక్తికి భక్తియే ఏకైకమార్గమని ప్రబోధించెను. రామానుజాచార్యులవారు బోధించిన సాత్వికభక్తి మార్గమునకు బసవేశ్వరుడు ప్రతిపాదించిన వీరభక్తికిని కొంతభేదమున్నది. శివుడే పరమదైవము. శివుడు

సంహారప్రియుడు. శివునకు ఆత్మార్పణసల్పుటయే జీవుని వీకైక పవిత్రకర్తవ్యము. అవయవములను తుదకు కంఠమునుగూడ భేదించి శివునకు సమర్పించిన వీరుడే నిజమగుభక్తుడు. శివభక్తికి దేహచ్ఛేదన నయనోత్పాటనాది సాహసకార్యములు వీరశైవమున ప్రాముఖ్యము వహించినవి. వీరశైవమునకు చిహ్నము లింగధారణము. మత ప్రచారకులు జంగములు సాక్షాత్తుశివస్వరూపులు. వారిలో దోషము లెన్నరాదు. మిండజంగములు - బసివిరాండ్రు - సలుపు స్వైరవృత్తి గార్హ్యముగాదు. భక్తి సకలపాపములను హరింపకలదు. వీరశైవులలో కులమతవిచక్షణలేదు - పరదేవతాస్మరణము - అన్యమతసంపర్కము గర్హ్యములు. అందుచే స్వమతస్థాపనతోపాటు పరమతఖండనము - పరమతాసహిష్ణుత, వీరికి అపరిహార్యధర్మములైనవి. ఇంతటి వీరత్వ మును ప్రబోధించిన యీ మతము అనుయాయులందరకు మాంసా హారము నిషేధించినది. లింగాయతులు శాకాహారులు. అచిరకాలముననే బసవేశ్వరుడు నందీశ్వరుని అపరావతారముగ పూజింపబడ సాగెను. వీరశైవము ప్రజలను ఆవేశపూరితులుగను, స్వార్థత్యాగ పరాయణులుగను, అతిలోకత్యాగసాహస సంసిద్ధులుగను తీర్చిదిద్దినది. కాని ప్రవక్తలందరివలెనే బసవేశ్వరునకును స్వస్థలమున పూజ్యత లోపించినది. బసవేశ్వరుడు తానునమ్మిన ఆదర్శములకోసము- ఆత్మ బలిదానము సల్పెను. అతడు ప్రవాసియై చివరకు కూడలిసంగమము వద్ద లింగైక్యమునుపొందెను.

బసవేశ్వరుని ఆత్మార్పణము వీరశైవమత విజృంభణకు దోహదము కల్పించినది. బ్రదికియున్న బసవేశ్వరునికంటె మృతజీవియైన బసవేశ్వరుడే సహస్రగుణాధిక బలవంతుడై అనుయాయులకు భవ్య మతావేశము రేకెత్తింపగల్గెను. మతప్రచారమునకు కత్తిని చేతపట్టుట ధర్మమే. అచిరకాలమున శంభోశంకర హరహరమహాదేవ్ నినాద

ములు అశ్శరభాశరభాఘోషలు దశదిశల ప్రతిధ్వనించినవి. నందీశ్వర విగ్రహములు వాడవాడల వెలసినవి. వీరశైవమునకుగూడ ఆంధ్ర దేశమే విశ్రాంతిస్థలమైనది. ప్రోలరాజు స్వయంభూదేవాలయము, రుద్రదేవరాజు సహస్రస్తంభదేవాలయము కట్టించి వీరశైవమును ఆంధ్ర దేశమునకు ఆహ్వానించిరి. కాలచురి రాజదీక్షాగురువులు కాకతీయ రాజులకు దీక్షాగురువులైరి.

బసవేశ్వరునకు సమకాలికుడైన మల్లికార్జునపండితారాధ్యుడు శివతత్త్వసారమును రచించెను. ఇతడు బ్రాహ్మణుడైనను "భక్తి" మార్గమును శిరసావహించి శివపారమ్యమును బోధించెను. శివలెంక మంకెన, శ్రీపతిపండితుడు - శైవమతపండితత్రయము. బసవేశ్వరునకు ముందే శివపారమ్యమును బోధించినవారు వీరశైవులు. బ్రాహ్మణ మతమును ఖండించి, యజ్ఞయాగాదులను నిరసించి, బ్రాహ్మణగార్థభములు బ్రాహ్మణగాడిదలు అనిదూషించినను - శివపారమ్యమును అంగీకరించిన భక్తిపరులగు బ్రాహ్మణులను పండితారాధ్యులుగ ప్రశంశించిరి.

"భక్తిమీదివలపు - బ్రాహ్మణ్యముతో
పొత్తు, వదలలేను - బసవలింగ"—

అను పండితారాధ్యుని వాక్యముచొప్పున బ్రాహ్మణకులమును మాత్రము వదలకుండ, బసవేశ్వరుని మతమును వరించినవారు ఆరాధ్య బ్రాహ్మణులు.

రుద్రదేవుని కాలమున హనుమకొండయే వీరశైవమతమునకు ప్రధానకేంద్రమైనది. వీరశైవమతప్రచారమునకు తనజీవితము నంకితముచేసి బసవపురాణము, పండితారాధ్యచరిత్ర మున్నగు గ్రంథములనురచించిన - పాల్కురికి సోమన రుద్రదేవుని కాలము నాటివాడే !

శివకవులు కర్ణాటాంధ్రముల ననేక గ్రంథముల రచించిరి. శివకవులు తెలుగు వాఙ్మయమునకు చేసినసేవ, జానుతెనుగు ద్విపద కవితకు వారు కల్పించిన ప్రాధాన్యము. "ఆరూఢ గద్య పద్యసంస్కృతా భూయిష్ఠరచన"ను తిరస్కరించి దేశకవితలో కవిత చెప్పవలెనని "అల్పాక్షరముల ననల్పార్థరచన" ఘటింపవలెనని శివకవుల యాదర్శము - వీరి రచనలలో మహోదారమగు భావనలు, హృదయమును ద్రవింపజేసి ఉఱ్ఱూతలూగించు ఘట్టములు. పోతనాది మహాకవులకు ఒరవడి పెట్టిన మధురభావములు అనేకములు. కాని వీరి రచనలన్నియూ మతావేశపూరితమై, పరమతసహనరహితములై యుండుటచే విశ్వజనీనములు కాలేకపోయినవి. చారిత్రకముగ వీరు ఇద్దరు మహాకవులమధ్య పడివారు. అటునన్నయ - ఇటు తిక్కన. చంద్రాస్తమయమునకు, సూర్యోదయమునకు ముందు శుక్రుని యలంతి యలంతికాంతులు ఎంత నిసర్గ రమణీయములైనను లోకము దర్శించి ఆదరింపలేరు. వీరశైవము జన్మస్థలమైన కర్ణాటమునుండి ఆంధ్రదేశమునకు వలసవచ్చి రుద్రదేవుని నీడ, అలుపు దీర్చుకొన్నది. బసవేశ్వరుడు శిలారూపమున అనుమకొండ సహస్రస్తంభాదేవాలయ ప్రాంగణమున వెలసి సేదదీర్చుకొన సాగెను.

వీరశైవుల అసహనమునకు ఆహుతియైనవారు ఆ కాలమున ముఖ్యముగా జైనులు, జైనాలయములు, బౌద్ధులు ఒకనాడు యావదాంధ్రమున తామరతంపరగ వెల్లివిరిసిన జైనము ఆంధ్రదేశమున నామరూపములులేకుండ నశించుటకు కారణము వీరశైవుల మతావేశమేనని చెప్పవచ్చును.

ఇక వీరశైవమునకు ఎదురొడ్డి నిల్చినది వైష్ణవము. యథార్థమునకు తాత్త్వికదృష్టితోచూచిన భేదములకంటె సామ్యములే ఎక్కువ. కాని ప్రజాసామాన్యమునకు సూక్ష్మదృష్టికిగాని గోచరింపని వేదాంతమునకంటె స్థూలదృష్టికి గోచరించుచు, నిలువుబొట్టు, అడ్డబొట్టు-తిరు

మణి, శ్రీచూర్ణ రేఖలు విభూతి, రుద్రాక్షమాల, తులసిపేరు - శివుడు విష్ణువు - అంతయుభేదమే!

అర్థపాత్ర సూన్యమైనదని నొకడు
ఒకడు సగమునీరు ఉన్నదనెను!
వాదభేదమునను బ్రద్దలయ్యె తలలు -
విశ్వదాభిరామ వినురవేమ!

వ్యక్తులకేకాక సమాజములకును ఉన్మాదావస్థయేర్పడుట చరిత్ర వేత్తల కనారూఢవిషయముకాదు. శైవవైష్ణవుల పోరాటమే పలనాటి వీరయుద్ధమున ప్రతిఫలించినది.

బ్రహ్మనాయడు వైష్ణవమతావలంబి. దొడ్డానాయని పుత్రుడు, దొడ్డానాయుడు అనుగురాజుమంత్రి, బేతాళనాయనిపుత్రుడు.

అనుగురాజు పలనాటికధిపతి. గురజాల అతని రాజధాని. బ్రహ్మనాయుడు అతనిమంత్రి.అనుగురాజు అజ్ఞానోద్భవసాహసికురాలు అయిన "నాయకురాలి" ప్రభావమునకు లోనయి సవతిసోదరులగు మలిదేవాదులను సరిగ చూడలేదు. నాయకురాలి ప్రభావమునకు లోనయిన నలగామరాజును సన్మార్గమున బెట్టుటకు సవతి సోదరులకు న్యాయము చేకూర్చుటకు బ్రహ్మనాయుడు ప్రయత్నించి విఫలుడయ్యెను.

నాయకురాలికి బ్రహ్మనాయనికి ప్రత్యక్షవైరమేర్పడినది. నాయకురాలు వీరశైవమునభిమానించినది. పలనాటి వీరకథ తెలుగు దేశమునజరిగిన అపరమహాభారతగాథ. మహాభారతమునందు జూదము వలెనే పలనాటి వీరకథలలో దాయాదులవైరమునకు "కోడి పందెములు" - అంకురార్పణ నల్పినది. నాయకురాలి కుతంత్రమువలన బ్రహ్మనాయని కోళ్ళు పందెమున ఓడిపోయినట్లు ప్రతీతి. ఆమె కోళ్ళకాళ్ళకు కట్టినకత్తులు విషపూరితములనియు మరికొన్ని చేర్పులు కూర్పులతో అనేక కథలు ప్రచారముననున్నవి. ఎట్లైన కోడిపందె

ములలో ఓటమి బ్రహ్మనాయని పక్షమువారిదే. వారును పాండవులవలె ప్రవాసమునకు పోయిరి. వీరి ప్రవాసము ఆరేండ్లు మేడపిలో గడపిరి. శ్రీకృష్ణుని రాయబారమునకు ప్రతిగ ఇందు అలరాజు రాయబారము కలదు. అలరాజు నలగామరాజు పుత్రిక పేరమ్మభర్త. అయినను ఇతడు బంధుపక్షము వీడి ధర్మపక్షమును చేపట్టిన ఆదర్శప్రేరితుడు. రాయబారిగ వెళ్ళిన అలరాజు విషప్రయోగముచే మరణించెను. పేరమ్మ భర్త కళేబరము చేర్చిన చితిపైకెక్కి సహగమనము సల్పుట హృదయ విదారక ఘట్టము. నాయకురాలి హృదయము ద్రవింప లేదు. నలగామరాజు నాయకురాలిమాట దాటలేదు. కోటకేతరాజు నాయకురాలి పక్షముగ రాయబారమునడపెను. ఇది సంజయుని రాయబారమునకు ప్రతికృతి. చివరకు కారెమపూడివద్ద ఇరుపక్షములు ఘోరయుద్ధము సల్పినవి. అందు నలగామునకు సాయముగా కాకతి రుద్రసేనాని 500 మంది అశ్వికులనుపంపెను. అనేకరాజులు ఇరు పక్షములకు సాయము చేసిరి. ఆ అపరభారతయుద్ధమున అభిమన్యుని వలె పోరి వీరమరణము వరించిన బాలచంద్రుడు బ్రహ్మనాయని పుత్రుడు. కారెమపూడి ఆంధ్రకురుక్షేత్రమైనది. ఇరుపక్షముల వీరులు నిశ్శేషముగా మరణించిరి. చివరకు విజయము బ్రహ్మనాయని వరించి నను - తనపక్షమునందలి రాజపుత్రులందరు మరణించుటచే ఆతడు ఆ పక్షమున బ్రదికియున్న నలగామరాజునే రాజుగవరించి తాను మంత్రిగ నిలిచెను. ఈ యుద్ధము ప్రజలలో రేకెత్తించిన యుత్సాహము వర్ణనాతీతము. ఏకశిలానగరమున పలనాటి వీరులకొక ఆలయ ముండెడిది. కవిసార్వభౌముడైన శ్రీనాథుడు కూడ పలనాటి వీర కథను చేపట్టి ద్విపదకుప్రాణముపోసెను. క్రీడాభిరామమున పలనాటి వీర ఏకశిలానగరప్రజలకు పాడి వినిపించు సన్నివేశము హృదయంగ మముగ అభివర్ణితము.

పలనాటియుద్ధము తెలుగుదేశమున పరాక్రమమునకు - వీర ధర్మమునకు కల్పించిన ప్రతిష్ఠ నిరుపమానమైనది. తెలుగుయోధులు

జగదేకవీరులుగ తీర్చిదిద్దుటకు పలనాటివీరకథ కల్పించిన భవ్యకవితా వేశము అనిర్వచనీయము. అటు వీరశైవముకూడ భక్తిలోకూడ వీరత్వమునకు అవయవప్రదానము, చివరకు శివునకుపహారముగా శిరచ్ఛేదమునుగూడ ప్రబోధించినది. పలనాటివీరులు వీరశైవము-రుద్రదేవమహారాజుగూడ ప్రతాపరుద్రదేవ మహారాజగుటు ఆనాటి వీరయుగధర్మమే! ప్రతాపము - వీరత్వము - ఆయుగలక్షణములైనవి.

పలనాటియుద్ధమున వీరులు పలువురు మరణించుటచే రుద్రదేవ రాజు ఆ అదనుగ్రహించి క్రీ. శ. 1186 ప్రాంతమున వెలనాటిపైదండెత్తి విజయము సాధింపగలిగెను. అంతవరకు కన్పించుచున్న మూడవ గోకరాజు శాసనములటుపిమ్మట గన్పింపకపోవుటయు, అతనిపుత్రుడు గోదావరికుత్తరమున పిఠాపురమును రాజధానిగ చేసికొనుటయు గమనార్హములు. రుద్రదేవుని రాజ్యము శ్రీశైల త్రిపురాంతకములవరకు వ్యాపించినది.

పలనాటియుద్ధఫలితములలో పేర్కొనదగినది పద్మనాయకుల వీరత్వమునకు లభించినప్రఖ్యాతి. ఆంధ్రదేశమంతయు పద్మనాయకుల వీరపూజతో గుబాళించినది. పద్మనాయకుల ఉత్పత్తినిగూర్చి భిన్న వాదములు గలవు. పుక్కిటిపురాణగాథలనేకములు గలవు. వీరిని విష్ణుపాదపద్మములతో మహాపద్మనందునితో ముడివెట్టు ఉత్ప్రేక్షలనేకములు. పద్మనాయకచరిత్ర అనుగ్రంథమున్నందె వీరులజన్మంబు, ఏరుల జన్మంబు అరయరాదనియు ఊరిలోని వర్షపునీరెల్ల చేరి నదియైనట్లు - వివిధకులములందలి వీరులుచేరి పద్మనాయకులైనట్లు స్పష్టముగ చెప్పబడినది. బ్రహ్మనాయనికి పద్మన్న అను అన్నగారుండెడివారని పద్మన్ననాయకులు పద్మనాయకులైనారని ఊహింపననువడుచున్నది. ఎట్టైన శౌర్యోపజీవులై, అభయంకరులై ప్రాణములకు తెగించిపోరాడు పద్మనాయకులు- వెలమవీరులనుపేర - ఆనాటినుండి తెలుగుచరిత్రలో సంఘములో ప్రత్యేకస్థానము నార్జించుకోగల్గిరి. కాకతీయరుద్రుడు-

వెలనాటిని జయించి పద్మనాయకవీరుల నభిమానించి, వారికి తన సామ్రాజ్యమున ఉన్నతసైనికపదవులనిచ్చి సత్కరించెను. ఆనాటినుండి కాకతీయసామ్రాజ్యమున తరువాత క్రమక్రమముగ తెలుగు చరిత్రలో పద్మనాయకులు ప్రత్యేకస్థానము నార్జించిరి.

వెలనాటి దండయాత్రలో విజయము సాధించిన పిమ్మట రుద్రదేవుకు ఉత్తరమునుండి యాదవుల దండయాత్ర నెదుర్కొన వలసి వచ్చెను. యాదవులు సనాతన వైదికమతానుయాయులు. కాకతీయులు వీరశైవ మతాభిమానులు యజ్ఞయాగాదుల నిరసించి, వైదికమతముపై ధ్వజమెత్తిన వీరశైవమతమునకు కాకతిరుద్రుని రాజ్యము కాణాచి యైనది.

యాదవజైత్రపాదుడు ఆంధ్రరాజును జయించి, నరమేధ మొనర్చెనని, హేమాద్రి చతుర్వర్గ చింతామణిలో వ్రతఖండమున - పేర్కొనినాడు. యజ్ఞయాగాదుల నిరసించి బసవేశ్వరుని భక్తిమార్గ మును, సర్వమానవ సమానత్వమును శిరసావహించి, వీరశైవమునకు పట్టుకొమ్మయై నిలచిన రుద్రదేవుడు విప్రతిపన్న విధిచే తానే యజ్ఞ పశువు కావలసి వచ్చినది. నాలుగు సంవత్సరములనుండి యువరాజుగ నున్న అతని సోదరుడు మహాదేవుడు ఆయుద్ధమునందే వీరమరణము పొందినట్లు తోచుచున్నది. మహాదేవునిపుత్రుడు "గణపతి" - శత్రువుల చేజిక్కి బందీకృతుడయ్యెను.

## గణపతిదేవ చక్రవర్తి

గణపతిదేవ చక్రవర్తి మొదటి ప్రతాపరుద్రదేవచక్రవర్తి సోదరుడు మహాదేవరాజు పుత్త్రుడు. మహాదేవరాజు యాదవుల దండయాత్రలో వీరస్వర్గమలంకరించెను. గణపతిదేవులచే బందీకృతు డయ్యెను.

క్రీ. శ. 1260 వరకు గణపతిదేవుడు రాజ్యము సల్పెను. త్రిపురాంతకశాసనము క్రీ. శ. 1260 నాటికి గణపతిదేవుని 62 వ రాజ్య సంవత్సరమును పేర్కొనుచున్నవి. దీనిని బట్టి అతడు క్రీ. శ. 1198 సంవత్సరమునుండి రాజ్యమేలెనని చెప్పవలసివచ్చును. కాని క్రీ. శ. 1209 సం॥నకు ముందు అతని శాసనములు మృగ్యములు. క్రీ. శ. 1209 వ సం॥వరకు అనగా సుమారు ఒకదశాబ్ది అతడేమి చేయుచుండెనను సమస్య ఉద్భవించును.

యాదవరాజు రామచంద్రుని పైఠాన్ శాసనమున పై ప్రశ్నకు సమాధానము లభించుచున్నది. "యాదవరాజును జైతుగి గణపతిపై దయకలిగి యాతనిని బంధ విముక్తుని చేసి స్వరాజ్యమునకు పంపెనని ఆశాసనమునుండి తెలియుచున్నది. పైఠాన్ శాసనమునందు ఉదాహృత యైన "దయ" రాజనీతి చతురత ధరించిన మేలిముసుగు కావచ్చును. జైతుగి యుద్ధమున విజయము గాంచియు కాకతీయ సామ్రాజ్యమును కైవసమొనరించుకొనలేక పోయెను. పలనాటి వీరయుద్ధమునకు కాణాచియైన తెలుగు నేలలో కాకతీయుల వీరసామంతులు విజృంభించి యాదవులకు లొంగలేదు. తెలుగుదేశమంతయు అరాజకత్వములో మునిగినది. దేవగిరిలోనుండి ఓరుగల్లును శాసించుట అసాధ్యమని గుర్తించి జైతుగి రాజనీతి చాతుర్యముతో గణపతిదేవుని బంధ విముక్తి చేసెనని యూహింపవచ్చును.

ఏ కారణములచే యాదవభూపాలుడు జైత్రపాలుడు కాకతి రాకుమారుడు గణపతిని కారాగారమునుండి విడిచిపుచ్చెనో సుస్పష్ట ముగ తెలియరాదు. కేవలమాతని 'దయార్ద్రహృదయము' మాత్రమే యేకైకకారణము కాజాలదు. పశ్చిమచాళుక్యసామ్రాజ్యమస్తమించి నప్పటినుండి దక్షిణాపథమున సార్వభౌమపదవికై యాదవ, కాక తీయ, హొయసాలులు పెనగులాడుచుండిరి. రెండవ (వీర)బల్లాలుడు విజృంభించి అప్పటికే యాదవులనుండి ఉత్తరకర్ణాటకమును కైవస

మొనరించుకొని యుండెను. గణపతి తన కారాగారముననున్నను కాకతిరాజ్యము మాత్రము జైత్రపాలుని వశముకాలేదు. అందుచేత బల్లాలుని విజృంభణము నరికట్టుటకు మధ్యకాకతిరాజ్యము అడ్డుగ నుండుటమేలని యెంచి యాదవభూపాలుడు కాకతిరాకుమారుని రాజనీతి చతురతతో బంధవిముక్తునిగావించెనని యెంచవచ్చును.

గణపతిదేవుడు బంధవిముక్తుడై ఓరుగల్లుచేరగనే రాజ్యమంతయు అల్లకల్లోలములతో నిండియుండుట సహజమే. 10 సం.ల పాటు అరాజకత్వము ప్రబలియున్నది. సామంతులు పలువురు స్వతంత్రులై అన్యోన్యకలహములకు పాల్పడుచుండిరి. గణపతిదేవుని వ్యక్తిత్వము ఎన్నతగినది. అతడు తన్ను బందీకృతుని చేసిన శత్రురాజు జైతుగి మనస్సు నలరింపజేసి బంధవిముక్తిని సాధించుటయే మొట్టమొదట ఉపాయశాలియైన ఆతని వ్యక్తిత్వమునకు విశిష్టత నాపాదించు తొలి సన్నివేశము. స్వరాష్ట్రమునకు తిరిగివచ్చి ఆతడు వీరసామంతులందరను రాజనీతిచాతుర్యముతో తనగొడుగు నీడక్రిందికి తేగలిగెను.

గణపతిదేవునకు ఈ ఘనకార్యనిర్వహణమునతోడుపడినవారలలో పేర్కొనదగినవాడు రేచర్లరుద్రసేనాని. ఈతడు నాగతిభూపాలుడు మున్నగు విరోధులనోడించి కాకతీయసామ్రాజ్యమును "అకాలప్రళయజలధిమగ్నము" కాకుండా సంరక్షించి గణపతిదేవునకు కుడిభుజమై యొప్పెను. (1)

కాకతీయసామ్రాజ్యము - ఒక మహోద్యమము. మహాదేవుడు శివదీక్షాపరుడై రాజ్యమును తర్పణప్రాయముగ నెంచినట్లు ఆతని శాసనకథనము. ఆతడు రణనిహతుడైనప్పటికి రేచర్ల రుద్రసేనాని కాకతిరాజ్యమస్తమింపకుండ కాపాడిన స్వామిభక్తినిరతుడు. స్వామిద్రోహియైన ఒకసామంతుని శిరస్సుఖండించి రుద్రసేనాని పతాక

(1) పాలంపేట శాసనము

స్తంభమునకు కట్టి శాత్రవరాజతతికి ఉదాహరణ ప్రాయముగ ప్రదర్శించెను. నాగతి భూపాలుడు, రుద్రసేనాని త్రిశూల విస్ఫులింగములను గాంచి పలాయనము సాగించెను. మూడవ కుళోత్తుంగుండు వేగిమండలమును తిరిగి చోళుల ఏలుబడిలోనికి తెచ్చుకోవలెనని దండెత్తివచ్చి చతుర్విధోపాయములతో ఓరుగల్లును ప్రవేశింపగల్గెను. రేచర్ల రుద్రసేనాని విజృంభణతో కులోత్తుంగుడు గూడ వచ్చిన దారి పట్టెను. రుద్రసేనాని 'కాకతీయరాజ్య భారధౌరేయ' బిరుదాంకితుడై, తన పేరున గాక తన యేలికపేరునే రాజ్యమును శాసించి, బంధ విముక్తుడై యేతెంచిన గణపతిదేవునకు అప్పగించెను.

ఇట్లే బొప్పదేవసేనాని గుంటూరి నాగదేవుని తరిమి రాజ్యమును నిష్కంటక మొనర్చెను. పై నాగలిదేవుడే గుంటూరు నాగదేవుడు కావచ్చును.

గణపతిదేవుడు రాజ్యపాలనమారంభించునాటికి అనగా క్రీ. శ. 1209 ప్రాంతమునాటికి కాకతీయరాజ్యమున పలువురు సామంతులు ప్రబలి ఇంచుమించు సర్వతంత్ర స్వతంత్రులై పాలించుచుండిరి. అప్పటికి 10 సం॥ల నుండి కేంద్రమున ఓరుగల్లులో ప్రభువులేడు.

గుంటూరుప్రాంతమున నాగదేవుడు పరిపాలించెను. వెలనాటి ప్రభువులకును కాకతీయులకును గల వంశక్రమానుగతమైన వైరము ఇంకను సమసిపోలేదు. క్రీ. శ. 1196 సం॥ర ప్రాంతమున వెలనాటి పృధ్వీశ్వరుడు గోదావరికుత్తరభాగమున పిఠాపురమున నెలకొనియుండెను. సింహాసనద్వాత్రింసికయందు పృధ్వీశ్వరుడు కృష్ణామండలి చందకోలు రాజధానిగా పరిపాలించుచున్న జినశ్రుతి నుటంకించెను.

కృష్ణానదీతీరమున అమరావతి ప్రాంతమున కోటవంశీయులు ప్రబలిరి. మడపల్లెలో నతవాడి ప్రభువులును కృష్ణా గోదావరి ముఖద్వారమధ్యప్రదేశమున కేశవనాయకులు గుడిమెట్టలో చాగి

వంశీయులు కృష్ణాముఖద్వారమున దయ్యావంశీయులు విజృంభించిరి. నెల్లూరిలో తెలుగుచోడులు కాంచి వరకు విస్తరించియుండిరి. ఇది తెలుగురాజ్యములోని పరిస్థితులు. అంతేగాక దక్షిణాపథమునందు ఆధిపత్యమునకై ఉత్తరమున యాదవులు దక్షిణమున చోళులు హోయ సాలులు నిరంతర కృషి సల్పుచుండిరి. కృష్ణాగోదావరీ మధ్యప్రదేశ మున కొలను ప్రభువులు కొల్లేటి సీమ - (సారసపురి) నేలుచుండిరి. ఏఱువదొరలు నెల్లూరు గుంటూరు కర్నూలు మండలముల మయ్యెల గుట్టయని చెప్పదగిన ప్రాంత విలుమ నెల్లూరు చోళుల సామంతులై పరిపాలించు చుండిరి.

గోదావరి కుత్తరమున, దక్షిణ కళింగమును గాంగులు పరిపాలించుచుండిరి. గణపతిదేవుడు సింహాసనమును నధిష్టించునాటికి, ఎల్లెడల ప్రతికూలపరిస్థితులే అయినను గణపతిదేవుడు సుమారు 63 సం॥లు దక్షతతో రాజనీతి దురంధరుడై కాకతీయ సామ్రాజ్యమును కళింగమునుండి కంచివరకు విస్తరింపచేసి - పరిపాలించిన కార్యఖడ్గ నిపుణుడు.

## వెలనాటి దండయాత్ర

రెండవ ప్రోలరాజు మొదటి రుద్రదేవుడు కాకతీయ సామ్రాజ్య మును సముద్రతీరమునకు విస్తరింప ప్రయత్నించి విఫలులైరి. వెలనాటిచోడులు కృష్ణాముఖద్వారమునుండి గోదావరి ముఖద్వారము వరకు తమ రాజ్యమును విస్తరింపగల్గిరి. రుద్రదేవుడు చోళరాజ్యముపై దండెత్తి, యుద్ధమున మరణించుట స్మరణీయము. క్రీ. శ. 1181 సంవత్సరమున రెండవ చోడదేవుడు మరణించువరకు - వెలనాటి రాజ్యము ఉచ్ఛదశయందున్నను, తరువాత సామంతులు స్వతంత్రులైరి. అతని మనుమడు పృథ్వీశ్వరుడు - సామంతులనందరను తన గొడుగు నీడలో నిలుప జాలకపోయెను. ఈ అవకాశమును గణపతి వినియోగించుకొని, వెలనాటిపై దండెత్తెను.

క్రీ. శ 1201 సంవత్సరమున గణపతి, సామంతులైన కోట, నాతవాడి మల్యాల ప్రభువుల సేనలతోపాటు బెజవాడను ముట్టడించెను. ఇంద్రకీలాద్రిపాదమున కనకదుర్గమండపమున బెజవాడలో నాతవాడి ప్రభువు వక్కడిమల్లరుద్రుని శాసనము క్రీ. శ. 1201 నాటిది గలదు. బెజవాడను వశపరచుకొని కాకతిసేనలు దివి వైపునకు తరలినవి. దివిపాలకులు అయ్యవంశజులు కాకతీయులకు సులువుగా లొంగిపోలేదు. ఘోరయుద్ధము జరిగినది. క్రీ. శ. 1203 నాటి కొండిపర్తి శాసనము మల్యాలప్రభువు చౌండదేవుని "ద్వీపలుంటాక" "దివిచూఱకార" బిరుదులతో ప్రస్తుతించినది. దీనినిబట్టి కాకతిసేనలకు విజయము సిద్ధించినదని తెలుచున్నది. కార్యఖడ్గనిపుణుడైన గణపతి రాజనీతి చతురతకు 'దివి' దండయాత్ర నిర్వికల్పనిదర్శనము. పరాజితులైన దివి ప్రభువులు అయ్యవంశజులను ఆతడు గౌరవించి, వారికి వారి రాజ్యమును సమర్పించి వారితో స్నేహము సల్పెను. అయ్యప్రభువు పినచోడి పుత్రికల నిరువురను - నారాంబ పేరాంబలను గణపతి వివాహమాడి వారి సోదరుడు, జాయపుని తన ముఖ్యసేనానిగ నియమించెను.

దివి విజయముతో వెలనాడంతయు కాకతిరాజ్యమున చేరిపోయినది. వెలనాటి పృధ్వీశ్వరుని శాసనములు దక్షారామమునుండి శ్రీకూర్మమువరకు కన్పించుచుండుటచే దివి దండయాత్రానంతరమాతడు ఉత్తరసీమకుపోయి తలదాచుకొనెనని ఊహింపవచ్చును. కాని, అచిరకాలముననే ఆతడు యుద్ధమునమరణించెను. కాకతిసామ్రాజ్యము శ్రీకూర్మమువరకు విస్తరించినది.

నిర్వచనోత్తర రామాయణపీఠికలో చోడతిక్కభూపతి (మనుమసిద్ధి తండ్రి) పృధ్వీశ్వరుని తలతో కందుకక్రీడసల్పిన వర్ణనగలదు. ఈ మహామండలేశ్వర బల్లయచోడదేవుడు - గణపతిదేవచక్రవర్తిగూడ పృధ్వీశ్వరుని సంహరించినట్లు ప్రస్తుతింపబడిరి. దీనినిబట్టి గణపతి

దేవుడు, తిక్కభూపతి, బల్లయచోడదేవుడు - ముగ్గురు కలసి సల్పిన యుద్ధములో పృథ్వీశ్వరుడు మరణించెనని యెంచవచ్చును. తెలుగు చోడప్రభువునకు గణపతిదేవుడు ఆశ్రయప్రదాతయై యేవిధముగ సాయమొనర్చినది చోళులచరిత్రలో విపులముగ వివరింపబడినది (1)

తెలుగుచోడులు వెలనాటిరాజ్యమునకు దక్షిణమున నెల్లూరు - కంచిసీమలను దక్షిణచోళులకు సామంతులై పరిపాలించిరి. తరచు-దాయాదులు సింహాసనమునకై పోరాడుట ఆ అంతర్యుద్ధములలో దక్షిణచోళసమ్రాట్టులు జోక్యము కల్గించుకొనుట పరిపాటియైనది. తిక్కనృపతి పైతృకరాజ్యమును కోల్పోయి కాకతిగణపతి నాశ్రయించి ఆతనిపక్షమున పోరాడి వెలనాటిప్రభువు పృథ్వీశ్వరుని సంహరించి యుండెను. కాకతిగణపతిదేవునకు వెలనాటిసీమకు దక్షిణమున చోళ సామ్రాజ్యపు గడిసీమలో అప్తుడు ప్రభువుగనుండుట అవశ్యవాంఛ నీయము. తిక్కరాకుమారునకు గణపతిదేవుడు చేసినసాయములో రాజనీతిచతురత ఇమిడియున్నది. గణపతిసైన్యముతో దండెత్తి తరలి, నెల్లూరు-కంచి జయించి తిక్కనృపతిని సింహాసనమందు ప్రతిష్ఠించెను. క్రీ. శ. 1231 సంవత్సరమునాటి గణపేశ్వరశాసనమున జాయసేనాపతి గణపతిదేవుడు చోళ, కళింగ, బృహత్, కర్ణాటక, లాట దేశముల జయించిన ప్రశస్తిగలదు. నిర్వచనోత్తరరామాయణమున తిక్కనృపతి కర్ణాటసేనలను కురుమలూరువద్ద ఓడించినట్లు గలదు. మత్తేవాడ శాసనను క్రీ. శ. 1228 సంవత్సరమున గణపతి చోళరాజధానిని దోచుకొనినట్లు గలదు. ప్రబలవిరోధిరాజులపై తిక్కభూపతి సాధించిన విజయపరంపరలకు గణపతిదేవుని సాయమే హేతుభూతమగుట సుస్పష్టము.

క్రీ. శ. పదునైదవ శతాబ్దినాటి తెలుగు పద్యకావ్యము కాకతి

---

(1) ఈ గ్రంథములో - తెలుగుచోడుల చరిత్రలో.

గణపతిదేవుని కళింగదండయాత్రను అభివర్ణించుచున్నది. ఇందులూరి సోమప్రెగ్గడ ఆధిపత్యమున కాకతిసేనలో కళింగమును సారసపురి—కమలాకరపురి—కొలనుసీమను జయించిన వృత్తాంతమును అభివర్ణితము. శాసనాధారములనుబట్టి ఈ దండయాత్ర ఒకేసారి జరుగలేదనియు కళింగదండయాత్రానంతరము కొలనుసీమ కాకతిరాజ్యమున క్రీ. శ. 1231 ప్రాంతమున చేరినదనియు తెలుచున్నది.

రేచెర్ల రాజనాయకుడుగూడ కళింగదండయాత్రలో పాల్గొని అనేకదుర్గముల జయించెను. కాకతీయ సైన్యము గోదావరీతీరము నుండి బయలుదేరి, మాడియలను, పంద్రెండు మన్యములను జయించినది. టెక్కలి దుర్గము లోబడినది. బొక్కెర దగ్గర జరిగిన ఘోరసమరములో గోధుమరాటి అనుచరులతోపాటు వీరస్వర్గమలంకరించెను.

యుద్ధమున పడియరాయనిజంపి, ఉదయగిరి దుర్గమును కైవసమొనరించుకొనెను. అచ్చటనుండి కాకతిసేనలు బస్తరుచేరి చక్రకూటమును జయించి గోదావరిదాటి మంథెనదుర్గమును సాధించెను. కళింగ దిగ్విజయానంతరము రేచెర్లరాజనాయకుడు దక్షారామభీమేశ్వరునకు విజయసూచకముగ క్రీ. శ. 29-4-1212 సంవత్సరమున శాశ్వతదీపారాధన కైంకర్యదానమునల్పెను. (1) ఈ కళింగదండయాత్రవలన కాకతీయ సామ్రాజ్యపు సరిహద్దులు పెరుగలేదు. దక్షారామమునకు ఉత్తరమున కాకతి గణపతి శాసనములు మృగ్యములు. తూర్పుగాంగరాజులు - కాకతిసేనలు నిష్క్రమింపగనే యథాపూర్వము కళింగమున తమ పరిపాలనను సుప్రతిష్ఠితమొనరించు కొనిరి.

కాకతి గణపతి కళింగదండయాత్రాకాలమున కళింగమును పరిపాలించుచున్న తూర్పుగాంగప్రభువు మూడవ రాజరాజు క్రీ. శ. 1211 సంవత్సరప్రాంతమున మరణించెను. అతని పుత్రుడు

(1) 261 of 1893

అనంగ (3 వ) భీముడు కళింగమునుండి కాకతీయసేనలను పారద్రోలుటయే గాక క్రీ. శ. 1217 ప్రాంతమునాటికి త్రయీవసుంధర (త్రిలింగదేశము) నుద్ధరించినట్లు దక్షారామమున శాసనము వేసెను. (1)

వేంగిమండలము - కృష్ణాగోదావరీ మధ్య ప్రదేశమును = కొలనుసీమను - మహామండలేశ్వరకొలని కేశవదేవుడు క్రీ. శ. 1192 నుండి క్రీ. శ. 1228 వరకు స్వతంత్రుడై పరిపాలించెను. మూడవ (అనంగ) అనియాంకభీముడు, కేశవదేవుని మరణానంతరము, అదను చూచుకొని వేంగిపై దండెత్తెను. ఆసమయమున కాకతిసేనలు, చోడతిక్కనికి సాయముచేయుటకై దక్షిణమున నెల్లూరు - కంచి సీమలకేగి యుండెను.

అనియాంకభీముడు, వెలనాటి పృథ్వీశ్వరుని వారసులు కులోత్తుంగరాజేంద్రచోడుడు, గొంకరాజు పక్షము వహించి వేంగిపై సేనల పుత్తెంచెను. ఖడ్గసింహునిపుత్రుడు జైత్రసాజకుడు క్రీ.శ. 1230 సంవత్సరమున దక్షారామమున విడిసి భీమేశ్వరాలయమును బాగు చేయించెను.

క్రీ. శ. 1228 సంవత్సరమున తిక్కనృపతిని కాంచీసింహాసనమున నిలిపి - గణపతిదేవుడు తనసేనలతో రాజధానికి మరలి వచ్చి, కళింగసేనలనెదిరించుటకు పూనుకొనెను.

ఇందులూరి సోమప్రధాని, కాలపనాయకుడు హేమాద్రిరెడ్డి కాకతిసైన్యములో పేర్కొనదగిన దండనాథులు - పశ్చిమగోదావరి ఇరగవరమునందలి పాలీశ్వరాలయస్థంభము నందలి శాసనమునుబట్టి, క్రీ. శ. 1231 సంవత్సరమున కాకతిగణపతిదేవుని సేనలు కొలను సీమను జయించినట్లెంచవచ్చును. మాల్యాలహేమాద్రిరెడ్డి యుద్ధమున వెలనాటి గొంకరాజు నోడించి తరిమి గొట్టెను.

(1) 407 of 1893.

కులోత్తుంగ రాజేంద్రచోళుడు కాకతీయులకు లొంగిపోయెను. క్రీ. శ. 1254 నాటిశాసనమున వేంగిపాలకుడు కాలపనాయకుడు కులోత్తుంగుని కాపాడినట్లు చెప్పుకొనెను. అనంగభీముని మరణానంతరము యుద్ధవిరమణ జరిగియుండును. అనంగభీముని అనంతరం అతనిపుత్రుడు క్రీ. శ. 1238 లో సింహాసనమధిష్ఠించిన మొదటి నరసింహుడు అనంతపాలుని కంచిపై దండయాత్రకు పంపినట్లు అతడు శ్రీకాకుళమున విడిసినట్లు వల్లభాభ్యుదయమున గలదు. క్రీ. శ. 1257 నాటి నందలూరుశాసనమున మనుమసిద్ధి, గణపతిదేవుని స్నేహమును కాంక్షించి గోదావరీతీరమున కాకతిసేనలతోగలిసి కళింగులనోడించి పారద్రోలినకథనము గలదు. పడికము బొప్పదేవుడు - కాకతీయ పట్టుసాహిణి సకలసేనాధిపతి, కళింగులతో చేతులుకలిపిన గొండూరి నాగదేవుని నారాయణదేవుని సంహరించినది ఈ సమయముననే కావచ్చును. గోదావరిసీమ అప్పటినుండి గణపతిదేవుని మరణమువరకు కాకతీయసామ్రాజ్యమునందే యుండిపోయెను.

## రెండవ దక్షిణ దండయాత్ర

క్రీ. శ. 1248 సంవత్సరమున తిక్కనృపతి మరణించుటతో నెల్లూరు - కంచి రాజ్యము అల్లకల్లోలమయ్యెను. తిక్కనృపతి పుత్రుడు రెండవమనుమసిద్ధికి ప్రత్యర్థియై విజయగండగోపాలుడు చెంగల్పట్టు-ఉత్తరఆర్కాటు మండలముల నాక్రమించుకొనెను. అప్పటికి కర్ణాట వీరసోమేశ్వరుడు (క్రీ. శ. 1235 నుండి 1260) చోళుల నరిగాపులనొనరించి విజృంభించియుండెను. నెల్లూరు-కంచి సీమపాలకులైన తెలుగు చోళులు - దక్షిణచోళులను నామమాత్రముగనైన సామంతులేగాబట్టి, వీరసోమేశ్వరుడు వారిపైగూడ తన అధిపత్యము నెలకొల్పుటకుయత్నించెను. విజయగండగోపాలుడు చోళరాజు మూడవరాజరాజు, యువరాజు

మూడవరాజేంద్రుడు వీరసోమేశ్వరుడు ఒకకూటమిగ చేరిరి. తక్కరసక గంగుడు-రాక్షసగంగనామముతో సుప్రసిద్ధుడు-[కలుకడశాఖకుచెందిన] వైదుంబవంశీయుడు కడపమండలము నాక్రమించి గంగయసాహిణిని అక్కడనుండి పారద్రోలెను.

[గంగయ సాహిణీ కాకతీయసేనాని - గణపతిదేవు డాతని ఉత్తరపాకనాటిని సంరక్షించుటకు తిక్కనృపతికి అండవండగ నుండుటకు అచ్చట నిలిపి యుండెను. గుత్తి - దుర్గపాలకుడు - తెలుగు చోడ ప్రభువు జగతీపతి - రక్కసగంగనికితోడై, గంగయసాహిణివి జయించి, "గండపెండేర గంగయసాహిని సర్వస్వబందికార" బిరుదు దాల్చెను. అంతేగాక స్థానిక పధిహారులు అక్కన్న బయ్యాన్నలు (బయ్యన్న తిక్కన్నలు ?) నెల్లూరు తిరుగుబాటు లేవదీసి, మనుమసిద్ధిని పారద్రోలిరి. ఈ విధముగ మనుమసిద్ధి మకుటము మాత్రమే గల మహారాజుగ ప్రవాసియై అల్లాడవలసివచ్చినది. గంగయసాహిణీ, ఓరుగల్లుచేరి గణపతిదేవుని కొలువుకూటము 'బాహత్తరనియోగాధిపతి' యయ్యెను.

రాజ్యభ్రష్టుడైన మనుమసిద్ధి పక్షమున రాయబారియై తిక్కన మహాకవి గణపతిదేవుని కొలువుకూటమునకేగిన సన్నివేశమునుగూర్చి తెలుగుదేశమున ఐతిహ్యము కమ్మని కథల నల్లినది. ఒక శతాబ్ది పిమ్మట కాసెసర్వస రచించిన ద్విపదకావ్యము సిద్దేశ్వరచరిత్రలో ఈ వృత్తాంతమంతయు హృదయంగమముగ అభివర్ణితము. గుంటూరు మండలమునందలి నాయనిపల్లివద్దనున్న శిలాశాసనమున ఈ దండయాత్రయందలి ముఖ్య విషయములన్నియు వర్ణింపబడినవి. రాయబారిగ వచ్చిన తిక్కన మహాకవికి గణపతిదేవచక్రవర్తి ఎదురేగి అతిథిపూజనలిపి, నిండుకొలువులో సన్మానించి, మనుమసిద్ధిని సింహాసనమున పునః ప్రతిష్ఠితుని చేయుటకు వరమొసంగెను. కాకతీయసేనలకు

సామంతభోజుడు ఆధిపత్యము వహించి దక్షిణ సండయాత్రకు తరలి వెళ్లెను. నెల్లూరు అగ్నిదగ్ధము కావించి, శత్రుశిరస్సుల కందుక క్రీడకావించి సామంతభోజుడు ద్రవిడమండలమును ప్రవేశించి నెల్లూరు ప్రభువునుండి మత్తేభములను కానుకగా వడసెను. కులోత్తుంగ రాజేంద్రచోడుని బందీకృతుని గావించెను.

నిర్వచనోత్తర రామాయణమున మనుమసిద్ధి ప్రాయేరు (తంజావూరుమండలము) యుద్ధమున ద్రవిడకర్ణాటసేనలతోపాటు విజయగండగోపాలుని జయించినట్లు అభివర్ణితము. నిర్వచనోత్తర రామాయణమున తిక్కన ఈవిజయపరంపరలన్నియు, ఏలికమనుమసిద్ధి అసహాయశూరుడై సాధించినట్లు అభివర్ణించినను, కాకతీయసేనాని సామంతభోజుడు నిర్వహించిన భూమిక సుస్పష్టము. ప్రాయేరు విజయానంతరము సామంతభోజుడు కాంచీపురప్రవేశముగావించి నెల్లూరులో మనుమసిద్ధికి పట్టముగట్టి ఓరుగల్లుకు తిరిగిపోవుచు నాయని పల్లిలో శాసనము వేయించెను. సామంతభోజుడురాక్షసగంగునిజయించి ఉత్తరపాకనాటిని తిరిగి గంగయసాహిణి కైవసముగావించెను. మనుమసిద్ధియే రాక్షసగంగుని జయించి, గంగయసాహిణిని అపదవి యందు నిల్పినట్లు తిక్కన అభివర్ణించి యున్నాడు.

తిక్కనమహాకవి రాయబారము సంపాదించియిచ్చిన సింహాసనము ఎంతోకాలము నిలువలేదు. జటావర్మ సుందరపాండ్యుడు దక్షిణాపథమునంతయు ఝంఝామారుతమువలె ఉత్పాతలూగించి, చోళుల నరిగాపులగావించి క్రీ. శ. 1260 ప్రాంతమున కంచిపైకి దండెత్తెను. మూడవరాజేంద్రుడు కోప్పెరుంజింగుడు - విజయగండ గోపాలుడుఅతనికరిగాపులై కాకతీయరాజ్యపుసరిహద్దులపైకి దండెత్తిరి. మనుమసిద్ధి కాకతీయ, బాణయాదవరాజుల సాయము నర్థించెను - క్కొప్పెరుంజింగుడు దాక్షారామమునుగూడ మెరపుమెరసినట్లు చేరుకో గల్గెను గాని, గణపతిదేవుడాతని విజృంభణమునరికట్టి, అతనినోడింప

గల్గెను. కోప్పెరుంజింగుడు గణపతిదేవునకు కప్పము చెల్లించుట కంగీకరించి తప్పించుకొని బైటపడెను. గణపతిదేవుడాతని సాహసమునకు మెచ్చి వీరపదముద్రతో గౌరవించి పంపెను. నెల్లూరుకు సమీపమున ముత్తుకూరు యుద్ధమున మనుమసిద్ధి వీరస్వర్గమలంకరించెను. కాకతీయ - యాదవబాణసేనలు చెల్లాచెదరైనవి. జటావర్మ సుందరపాండ్యుడు నెల్లూరులో వీరాభిషేక పట్టాభిషిక్తుడయ్యెను. నెల్లూరుసీమ పాండ్యసామ్రాజ్యములో లీనమైనది. కోప్పెరుంజింగుని పరాజయకారణముచే కాబోలు పాండ్యసేనలు నెల్లూరువిజయముతో సంతృప్తిచెంది కాకతీయరాజ్యము నాక్రమించుటకు పోలేదు. విక్రమ పాండ్యుడు గణపతిపాలనము మత్స్యద్వయచిహ్నితము. (పాండ్య రాజలాంఛనము) అంతేగాక - రాజ్యము చేయునది ఆడది. కావున కాకతీయరాజ్యముపై దండయాత్రకుపక్రమింపలేదని నుడువుట అలనాటి శాసనవాఙ్మయమునకు సుపరిచితమైన అలంకారికప్రగల్భమే.

గణపతిదేవచక్రవర్తి సర్వతోముఖ ప్రతిభాశాలి. ప్రతికూల పరిస్థితులను అనుకూలపరిస్థితులుగ, దురదృష్టమును అదృష్టముగ మార్చుకోగల ఉపాయశాలి. కాకతీయ రాజ్యాంగ విధానమునకు ప్రత్యగ్రరూపరేఖలు దిద్దిన ధీశాలి. తొలుత అతడు నెలకొల్పిన నాయక విధానము శతాబ్దుల తరబడి దక్షిణాపథచరిత్రపై అత్యంతప్రభావము నెరపినది. వ్యవసాయాభివృద్ధికి అతని కృషి తరతరాలకు మేలు బంతియై వర్థిల్లినది. వాణిజ్యవికాసమునకు అతని మోటుపల్లి శాసనము ఉదాహరణ ప్రాయము. మోటుపల్లి పాలకులు విదేశవర్తకుల హింసించి - అధికసుంకముల విధించి ఓడలకొల్లకొట్టుచుండెడివారు. ఆ అవివేకచర్యలకు స్వస్తిచెప్పి, గణపతిదేవుడు విదేశవర్తకులకు ధర్మశాసన మనుగ్రహించెను. గణపతిదేవుని మోటుపల్లి శాసనముతో విదేశవర్తక వ్యాపారమున నూతన శకారంభమైనది.

రాజధాని అనుమకొండనుండి ఓరుగల్లునకు మారినది. రుద్రదేవుడే

నూతన రాజధానికి పునాదులు నిర్మించినను, గణపతిదేవుడే ఏకశిలా నగరమునందలి రెండుప్రాకారములను కట్టించినట్లు జనశ్రుతి. మొదట మట్టిప్రాకారము. గణపతిదేవుడు నిర్మించిన క్రొత్తదుర్గప్రాకారమునకు 72 బురుజులు కాపాడుటకు 72 నాయకులను నియమించినట్లు జనశ్రుతి.

గణపతిదేవునకు మగసంతతిలేదు- ఇరువురు పుత్రికలు. ప్రథమ పుత్రిక రుద్రమదేవిని చాళుక్యరాజకుమారుడు వీరభద్రునకును,ద్వితీయ పుత్రిక గణపాంబను కోటవంశజుడు బేతరాజునకు ఇచ్చి వివాహ మొనరించెను. క్రీ. శ. 1260 ప్రాంతమున రుద్రమదేవికి రుద్రదేవ మహారాజునామమున గణపతిదేవుడు యేకరాజ్య పట్టాభిషేకమునల్పెను.

సామంతులు, దండనాయకులు, అమాత్యులు, రేచర్ల ప్రభువులు మల్యాలప్రభువులుకాకతీయసామ్రాజ్యారంభమునుండిప్రసిద్ధికెక్కినవారు రేచర్లరుద్రసేనాని గణపతిదేవుడు యాదవకారాగారమున బందీకృతుడై యున్నప్పుడు కాకతీయసామ్రాజ్యమును అకాలప్రళయము నుండి కాపాడెననుట అతిశయోక్తికాదు. కళింగదండయాత్రా భార ధౌరేయుడు రాజనాయకుడు. కోటవిజేత మల్యాల చౌండరాయడు ద్వీపిలుంటాకబిరుదవిభ్రాజితుడు. గణపతిదేవుని కాలమున సామంతులైనవారిలో పేర్కొనదగినవారు అయ్యవంశీయులు- దివిపాలకులు. గణపతి దివివారిఅల్లుడు. గజసాహిణి జాయసేనాని గణపతి బావ మరది. అతడు గజశిక్షణలో ఆరితేరిన మహావీరుడుమాత్రమేగాక నృత్య విద్యలోగూడ పేర్కొనదగిన కళావేత్త. అతని "నృత్యరత్నావళి" నాట్యవాఙ్మయమున మకుటాయమానమైనది. తెలుగుచోడవంశీయుడు తిక్కనృపతి - అతనిపుత్రుడు మనుమసిద్ధి సామంతులుగాకపోయినను ఆప్తకోటిలోనివారై, గణపతిదేవుని దక్షిణదండయాత్రలలో ప్రముఖ భూమికలు ధరించినారు.

పొత్తపి తెలుగుచోడులు గణపతిదేవునకు సామంతులై గణన

కెక్కిరి. ఓపిలిసిద్ధి, గణపతిదేవుని అజ్ఞానుసారము కొణిదెన శాఖకు చెందిన తెలుగుచోడప్రభువు మల్లిదేవుని జయించి కమ్మనాడును ఆక్రమించెను. అతనికి వీరభృతిగ గణపతి ఆరువేలమండలమునొసంగెను. అద్దంకి ప్రభువులు శావంగదేవుడు - అతనితండ్రి మాధవమహారాజు గణపతికి లోబడియుండిరి. చాళుక్యప్రభువులుగూడ గణపతికి సామంతులై యుండిరి - వీరభద్రుడు రుద్రాంబను వివాహమాడెను. భీమరాజు త్రిపురాంతకమహాదేవునకు సల్పినదానశాసనములలో, "ద్రవిళభయజ్వర, కర్ణాటమాండలికవైరి గోధుమఘట్టనఘరట్ట, బల్లాళ రాయదిశాపట్ట" బిరుద విభ్రాజితుడు, దోచివంశస్థుడు సామంత భోజునితోపాటు దక్షిణదిగ్విజయయాత్రలో పాల్గొనెను. భాస్కరదేవుడు గజసాహిని. ప్రోలురౌతు తంత్రపాలుడు (యుద్ధమంత్రి). ఇందులూరి సోమయ ప్రెగ్గడ - బ్రాహ్మణుడయ్యు - యుగధర్మము ననుసరించి శస్త్రోపజీవి క్షాత్రమును స్వీకరించిన వీరాధివీరులలో ఎన్నికగన్నవాడు కళింగదండయాత్రలో ప్రముఖభూమికదాల్చెను. కొలనుసీమను జయించి, 'కొలని సోముడ' డనిపేరు కెక్కెను. ప్రోలభీమనాయకుడు 'ఆరువేల దూషక' కాంచి చూరకార బిరుదాంకితుడు. పోతన-కుచెన-కొండయ్యలు ప్రెగ్గడలు. గంగయసాహిణి అశ్వికదళాధిపతి. పానుగల్లు నుండి (నల్గొండమండలము) కోలూరు మండలమునందలి కైవర దుర్గమువరకుగలసీమ నాతడు వుల్లూరు పట్టణము కేంద్రముగ పరిపాలించెను. కొంతకాలమది అతని కాయస్థవంశీయుల రాజధానియై వెలసినది. అతని తరువాత అతని మేనల్లుడు జన్నిగదేవుడు ఆ సీమకు పాలకుడయ్యెను. గంగయసాహిణి మంత్రి నామదేవ పండితుడు - గణపతి దేవునిచే 'మూరురాయజగదాళ' 'చలమర్తిగంగ' బిరుదముల సంపాదించెను.

గణపతిదేవచక్రవర్తి కార్యఖడ్గనిపుణుడు. కత్తితోపాటు యుక్తిని గూడ ఉపయోగించిన రాజనీతిచతురుడు. ద్రివి విజయానంతరము

అయ్యవంశీయులకు వారిరాజ్యము తిరిగి యిచ్చుట - వారి కన్యకలను నారాంబపేరాంబలను ఉద్వాహమగుట జాయపసేనానిని గజసాహిణిగ నెలకొల్పుట- తిక్కనృపతికి ఆశ్రయప్రదాతయై సాయమునల్పుట - రాయబారిగవచ్చిన తిక్కనమహాకవిని సత్కరించుట - సాహసము చూపిన శత్రువీరుడు కోప్పెరుంజింగుని వీరపదముద్రతో సత్కరించి పంపుట మొట్టమొదట నూనూగుమీసాల నూత్నయౌవనమున యాదవభూపాలుని కారాగారమునుండి బంధవిముక్తుడై బయట పడగల్గుట, చిట్టచివరకు రుద్రమదేవిని రుద్రదేవమహారాజుగ రూపొందించిన చాతుర్యము మున్నగునన్ని వేశాలలో ప్రతిఫలించిన గణపతి దేవుని వ్యక్తిత్వము, మహాభారతపాత్రల వెలుగురేకుల అంశల పంచుకొని విస్తరించినట్లనిపించును. ఆదర్శప్రేరితులైన పంచపాండవుల పరాక్రమము - శ్రీకృష్ణుని చాకచక్యము - భీష్మవిదురాదుల రాజనీతి రాశీభూతమై పూర్ణపురుషాయుషమనుభవించిన పూర్ణపురుషుడు గణపతిదేవుడు. తిక్కనమహాకవికి మహాభారతరచన సల్పుటకు భవ్య కవితావేశము కల్పించినది ఆతని సమాగమమని ఐతిహ్యము అల్లిన కమ్మనికథ - మనుమసిద్ధిని సింహాసనముపై పునఃప్రతిష్ఠించిన తిక్కన రాయబారము నేటికి జనశ్రుతిని పులకింప చేయుచున్నది.

## రుద్రమదేవి
## (1259 - 95)

గణపతిదేవచక్రవర్తి, రుద్రమదేవిని రుద్రదేవమహారాజను పేరుతో క్రీ. శ. 1259 సంవత్సరమున యౌవరాజ్యపట్టాభిషేకము సల్పెను. మొదటి మూడు సంవత్సరములు ఉభయులు కలిసి రాజ్యమేలిరి. క్రీ. శ. 1269 వరకు గణపతిదేవుడు జీవించి యున్నట్లు శాసన నిదర్శనములుగలవు గాని రాజకార్యములనుండి విరమించుకొనెనని, రుద్రమదేవియే పరిపాలన కొనసాగించినదనియెంచవచ్చును.

క్రీ. శ. 1266 సం. త్రిపురాంతకమున గణపతిదేవుని ప్రశంసగలదు (1) పల్నాటిసీమదుగ్గిలో క్రీ. శ. 1269 సంవత్సరమునాటి శాసనమున రుద్రమదేవి "పట్టోద్ధృతి" గ జన్నిగదేవు డభివర్ణించెను.

రుద్రమదేవి సింహాసనమధిష్ఠించుట వ్యతిరేకించిన వారానాడు లేకపోలేదు. హైందవసంప్రదాయమునకది నప్పుడు. భారతదేశ చరిత్రలో అపూర్వసంఘటనము. ప్రతాపచరిత్రలో ఒక వింతగాథ గూడ కన్పించుచున్నది. హరిహరదేవుడు మురారిదేవుడు గణపతి దేవునకు ఒకానొక రాణి వలన గల్గిన పుత్రులట. రాణి రుద్రమదేవి రాజధానిలోలేని సమయమున వారు ఓరుగల్లు నాక్రమించుకొనిరట. రుద్రమదేవి సత్వరమరుగుదెంచి - విప్లవమునణచి, హరిహరమురారి దేవుల సంహరించి - శత్రువుల పారద్రోలి రాజధాని నాక్రమించు కొనెనని కథ. కాని-హరిహరమురారిదేవుల పేరు లే శాసనము నందును కన్పింపవు. విప్లవకథనము అసత్యమని త్రోసిపుచ్చుటకు వీలులేదు. వెలుగోటివారివంశావళిలో రేచెర్ల ప్రసాదాదిత్యుడు శత్రువులసంహరించి రాణిరుద్రాంబికకు పట్టాభిషేకమొనరించి 'కాకతీయ రాజ్యస్థాపనాచార్య' 'రాయపితామహాంక' బిరుద విభ్రాజితుడైనట్లు వెలుగోటివారి వాంశావళిలో అభివర్ణితము. వెలుగోటి ప్రసాదిత్యుడు మాత్రమేగాక ఇట్టిబిరుదములు ధరించిన సమకాలీనసామంతులు చాలమంది గన్పించు చున్నారు. మహాప్రధానులు కన్నరనాయకుడు, గణపద్దేవమహారాజులు, నిశ్శంకమల్ల మల్లిఖార్జుననాయకుడు, అంబిదేవుడు మున్నగువారు క్రి. శ. 1270 నుండి 1290 వరకు గన్పించు వారి వారి శాసనములలో రాయస్థాపనాచార్య బిరుదాంకితులుగ ప్రశంసితులు. గుండయ నాయకుడు, మాదయనాయకుడు 'స్వామిద్రోహరగండ' బిరుదాంకితులు. మాచయనాయకుడు స్వామివంచకరగండడు. పై శాసనాంశములు

(1) 207 of 1905

రుద్రమదేవి పట్టాభిషేకమునకించుకపూర్వము (గణపతిదేవుని మరణానంతరము) జరిగిన అంతర్విప్లవమునకు వ్యాఖ్యాన ప్రాయములు.

రాణిరుద్రమదేవి యెదుర్కొనిన విషమఘట్టములలో ప్రమాద భూయిష్టముగ నెన్నదగినది క్రీ. శ. 1260 ప్రాంతమున యాదవ మహాదేవుని దండయాత్ర. అతని శాసనములు అతని దిగ్విజయమును వేనోళ్ళ ప్రశంసించుచున్నవి. అతడు 'తెలుంగురాయ శిరఃకమల మూలోత్పాతన' బిరుదాంకితుడు. అతడుయుద్ధమున మత్తేభములను వాద్యపంచకమును పరిగ్రహించి, స్త్రీ హత్యాపాతకమునకు వెరచి రాణిరుద్రమాంబను విడిచిపుచ్చెనట! అతడు ఏ తెలుగురాయని సంహరింపలేదు. అది వంశక్రమాగతమైన ప్రాచీనబిరుదుమాత్రమే. రాణి రుద్రమదేవికిముందే అతడు మరణించెను. అతని దండయాత్ర తొలుత సాధించిన విజయములనుమాత్రమే అతని శాసనములు అభివర్ణించిన పిమ్మట సంక్రమించిన పరాజయములను ప్రస్తావించలేదు. ప్రతాప చరిత్రలో కథ వేరుగనున్నది. మహాదేవుడు ఓరుగల్లుకోటను పదునైదు దినములు ముట్టడించెను. అందుశత్రువుల కాల్బలము మూడులక్షలు, రైతులు లక్షమంది మరణించిరి. ఓడిపోయిన మహాదేవుని రాణి రుద్రమదేవి దేవగిరివరకు తరిమికొట్టెను. అతడు మూడుకోట్ల సువర్ణ నాణెములను పరిహారముగనిచ్చి, రుద్రమదేవితో సంధి చేసుకొనెను. ఆమె ఆ ధనమును కాకతీయసైనికులకు - సాహిణులకు పంచిపెట్టెను. ప్రతాపచరిత్రకథనములోగూడ కొంత అతిశయోక్తి ఉండవచ్చును గాని అది సత్యదూరముకాదనుటకు రెండు చారిత్రకాధారములు లభించినవి. మహాదేవునితండ్రి - సారంగపాణిదేవుడు క్రీ. శ. 1263 సంవత్సరమున - రుద్రమదేవికి సామంతుడై ఛాయాసోమనాథాలయమునకు దానమునల్పినశాసనము గలదు. క్రీ. శ. 1922 లో కైకలూరు తాలూకా రాచపట్టణమున దొరికిన సువర్ణనాణెముల సాక్ష్యము గమనింపదగినది. అందు 43 పద్మటంకములు - బంగారునాణెములు సింగన - కన్నప,

మహాదేవ - శ్రీరామ నామాంకితములున్నవి. ఇవి మహాదేవుడు రాణి రుద్రమాంబకు సంధిచేసుకొని సమర్పించిన పరిహారములోనివే అని చెప్పవచ్చును.

రాజధానియందలి విప్లవాకపరిస్థితులేగాక గడిసీమలోగూడ రాణి రుద్రమదేవికి ప్రతికూల పరిస్థితులెదురయ్యెను. క్రీ. శ. 1257 సంవత్సరప్రాంతమున గోదావరీతీరమున కళింగరాజు నరసింహాగజపతిని గణపతిదేవు డోడించియుండెను. (అయుద్ధమున నెల్లూరు మనుమసిద్ధి గూడ పాల్గొనెను) క్రీ. శ. 1262 ప్రాంతమున గణపతిదేవు నాధిపత్యము నంగీకరించుచు కోప్పెరుంజింగుడు వేసిన శాసనమునుబట్టి-అంతవరకు ఆ ప్రాంతము కాకతీయుల ఏలుబడిలో నుండుట స్పష్టము. కాని క్రీ. శ. 1278-9 కారప ర్తిసూరయరెడ్డి (కాకతీయ రుద్రదేవమహారాజు సేవకుడు) వేసినశాసనము వరకు - అచ్చట కాకతీయ పరిపాలన చిహ్నములు కన్పింపవు. దీనినిబట్టి గోదావరిసీమ, ఆకాలమున అన్యాక్రాంతమైనదని ఊహించుట కవకాశమున్నది. క్రీ. శ. 1262 లో దక్షారామమున నరసింగ నరాధిపు (నరసింహాగజపతి ?) శాసనము గన్పించుచున్నది. రుద్రమదేవి పరిపాలనలో మొదటి పదునారు సంవత్సరములు గోదావరిసీమలోగాని, వేంగిమండలమునగాని ఆమె అధిపత్యము ప్రస్తుతించు శాసనములు కన్పింపవు. ఆ ప్రాంతముల పరిపాలించు తూర్పుచాళుక్యులు - హైహయవంశీయులు స్వతంత్రముగనే శాసనములు వేసినారు. రాణిరుద్రమ చాళుక్యుల కోడలు గాబట్టి వారి కా చనవు ఏర్పడినదో - లేక వారి స్వతంత్రప్రతిపత్తిని రాణిరుద్రమ అంగీకరింపవలసి వచ్చెనో తెలియదు. కాని - కొంత కాలమునకు గోదావరి - వేంగి సీమలు ఆమె పలుబడిలోనికి వచ్చిన వనుట తథ్యము. నరసింహాగజపతిపుత్రుడు వీరభానుదేవ గజపతి ఒడ్డాది మాత్స్యప్రభువు అర్జునదేవుడు క్రీ. శ. 1274 సంవత్సరమున

వేంగిపై దండెత్తి దక్షారామము వరకు వచ్చిరి. రుద్రమదేవి వారి దండయాత్రను ప్రతిఘటించుటకు పోతినాయకుడు ప్రోలినాయకుడు - సోదరద్వయమును పంపెను. వారు శత్రువులనోడించి, "గజపతి మత్తమాతంగసింహ" "బడ్డిరాయమానమర్దన" బిరుదాంకితులైరి. అప్పటినుండి గోదావరీవేంగిమండలముల కాకతీయ సామ్రాజ్యాధికారము పునః ప్రతిష్ఠితమయ్యెను.

## నెల్లూరు

నెల్లూరుసీమను తరతరములనుండి పరిపాలించుచుండిన వారు తెలుగుచోడవంశీయులు. వారు తొలుత దక్షిణచోళులకు సామంతులు. తిక్కనృపతికాలమునుండియు నెల్లూరిసీమ కాకతీయసామ్రాజ్య ప్రభావమునకు లోనయ్యెను. క్రీ. శ. 1263 సంవత్సరమున జటావర్మసుందర పాండ్యుడు నెల్లూరులో వీరాభిషేకమొనరించుకొన్నప్పటినుండియు కాకతీయుల ప్రాభవమచట అడుగంటినది. ముత్తుకూరు యుద్ధానంతరము నెల్లూరుసీమను పాండ్యసామంతులుగా మనుమసిద్ధి సోదరులు పరిపాలించినట్లు పాండ్యకథనము. పాకనాటిని కాయస్థవంశస్థులు కాకతిసామంతులే పరిపాలించిరి. మనుమసిద్ధిసోదరుల శాసనములు నెల్లూరులో మృగ్యములు. పాండ్యులు ముత్తుకూరు విజయానంతరము వీరాభిషేకమహోత్సవానంతరము కాకతీయరాజ్యముపై దండెత్తుటకు పయత్నించి విఫలులైనట్లెంచవచ్చును. చిదంబరశాసనమున విక్రమపాండ్యుని ప్రగల్భవాక్యములు అబలను ఓడించుట అసంగతమని ఆహవమును విరమించెననుట విఫలదండయాత్రనే సూచించుచున్నవి. మనుమసిద్ధి మరణానంతరము నెల్లూరుసీమను మూడవరాజేంద్రుడు పాండ్యసామంతుడై పరిపాలించెను.

క్రీ. శ. 1263 లో వీరాభిషేకానంతరము నెల్లూరునుండి పాండ్యులు నిష్క్రమించినప్పటినుండి-పాకనాడు-కడప ప్రాంతమును

కాకతిసామంతులు కాయస్థవంశీయులు పరిపాలించిరి. గండపెండేర జన్నిగదేవుని ప్రధాని నాగరాజు క్రీ. శ. 1264 సంవత్సరమున నందలూరులో సౌమ్యనాథస్వామికి దానము సల్పినశాసనమున్నది. సిద్ధవటు - తాలూకా అట్లూరులో క్రీ. శ. 1268 లో మరియొక శాసన మున్నది.

నెల్లూరును పరిపాలించిన వీరరాజేంద్రచోళుని (1263-8) రుద్రదేవమహారాజు సామంతుడు మహామండలేశ్వరనాగదేవమహారాజు జయించి, నెల్లూరు నాక్రమించెను. అతడు క్రీ. శ. 1271 నుండి 1275 వరకు నెల్లూరును పరిపాలించెను. తరువాత 1280 వరకు అతడు ఒంగోలు తాలూకా మాణిక్యేశ్వర ప్రాంతము నేలెను. అతని నెల్లూరు నుండి పారద్రోలినది త్రిభువనచక్రవర్తి ఇమ్మడి తిరుకాళత్తిదేవుడు. ఇతని శాసనము గూడూరు సమీపమందలి మడమనూరులో క్రీ. శ. 1279 నాటిది గలదు. ఈతడు రెండవమనుమసిద్ధి పుత్రుడు. ఈతడెట్లు నెల్లూరు నాక్రమింపగల్గినది తెలియవచ్చుటలేదు. అదేసమయమున కాయస్థరాజ్యముపై విజయగండగోపాలుడు దండెత్తుట గమనింప దగినది. ఈతడెంతకాలము నెల్లూరునేలినది తెలియదు. క్రీ. శ. 1282 సంవత్సరమున, మనుమ గండగోపాలుడు (?)నెల్లూరు నాక్రమించెను. ఈతనికి కాయస్థ వంశీయుడు, అంబదేవుడు సాయమొనరించెను. అంబదేవుడు స్వతంత్రుడై కాకతిరుద్రమాంబ ఆధిపత్యమునకు లోబడక, స్వతంత్రుడై పరిపాలించుచుండెను. రాణిరుద్రమాంబ దక్షిణ దండ యాత్ర కుపక్రమించి, కాకతీయ రాజ్యాధికారమును నెల్లూరు సీమలో కాయస్థరాజ్యములో పునఃప్రతిష్ఠింపదలపోసెను - అడిదంమల్లు - కాకతీయసకలసేనాధిపతి నెల్లూరుపై దండెత్తెను. మనుమగండ గోపాలుడు కాకతిసేనలనెదిరించెను. ఆ యుద్ధమున అడిదంమల్లు అతని సంహరించి - "మనుమగండగోపాల శిరఃఖండన" బిరుదు దాల్చెను. మనుమగండగోపాలుడెప్పుడు రణనిహతుడయ్యెనో తెలియదుగాని

క్రీ. శ. 1290 నుండి నెల్లూరును రాజగండగోపాలుడు పరిపాలింప సాగెను.

రాజగండగోపాలుడు - కాకతీయుల సాయముచేతనే మనుమ గండగోపాలుని పిమ్మట నెల్లూరు ప్రభువై యుండెనని యూహింప వచ్చును. కాని - అతడుగూడ అచిరకాలముననే పాండ్యులతో కలిసి కాకతీయుల నెదిర్చెను. కాకతీయుల సేనలకు అధిపత్యమువహించి మనుమ గండగోపాలుడు (అడిదం మల్లుచేత చంపబడినవాడుకాడు) నరసరావుపేట ప్రాంతమును పాలించుచుండిన తెలుగుచోడ వంశీయుడు రాజగండగోపాలుని ద్రవిడసేనలను ఓడించినట్లు క్రీ. శ. 1297 సం.నాటి నరసరావుపేటశాసనమున చెప్పుకొనెను. కాని చివరకు రాజగండ గోపాలుడే (మనుమసిద్ధి మనుమడు=రంగనాధుడు) నెల్లూరు సింహాస నము నధిష్ఠింపగల్గెను.

## కాయస్థరాజ్యము

కాయస్థరాజ్యమూలపురుషుడు గంగయసాహిణి. ఈతడు కాక తీయసేనలో అశ్వసాహిణి. త్రిపురాంతకశాసనమీతని తురగసాధనికు డని ప్రశంసించినది. (1) ఓగూరుకైఫీయతులో తిక్కనృపతి ఈతని తొలుత తూర్పుకనుమలకు పశ్చిమసీమకు పరిపాలకునిగ నియమించి నట్లున్నది. క్రీ. శ. 1248 లో తిక్కనృపతి మరణానంతరమీతని రాక్షసగంగుడు జయించెను. తిరిగి ఆతడు రాక్షసగంగును జయింప గల్గెను. ఈలోపుగ అతడు గణపతిదేవుని కొలువులో బాహాట్టర నియోగాధిపతి పదవినధిష్ఠింపగల్గెను. పానుగల్లు (నల్గొండమండలము) దుర్గమునుండి కడపమండలమందలి కైవారం పట్టణంవరకుగల రాజ్య మును వల్లూరు ముఖ్యపట్టణముగ ఈతడు - ఈతనివంశీయులు పరిపా లించిరి. ఈతనికి పురుషసంతానములేకపోవుటచే ఈతని మేనల్లుడు

(1) 268 of 1905.

జన్నిగదేవుడీసీమకు పాలకుడయ్యెను. అతనితరువాత అతని సహోదరుడు త్రిపురారిదేవుడు పరిపాలించెను. క్రీ. శ. 1272 సంవత్సరమున అతని సహోదరుడు అంబదేవుడు పరిపాలకుడగువరకు - వారు కాకతీయులకు సామంతులై స్వామిభక్తిపరాయణులై యుండిరి.

అంబదేవుడు :- అంబదేవుడు పరిపాలన అరంభించిననాటినుండి స్వతంత్రరాజ్యము నిర్మించుటకు పూనుకొనెను.

క్రీస్తుశకము 1290 సం. త్రిపురాంతకశాసనమువలన ఆతనిచరిత్ర విశదమగుచున్నది. తొలుత ఆతడు శ్రీపతి గణపతిని జయించి ఆతని రాయసహస్రమల్ల బిరుదమును తాను పరిగ్రహించెను. ఆతడు ఏరువ మల్లిదేవుని శిరస్సు ఖండించెను. అతనికి పంద్రెండుగురు క్షోణీమాండలికులు సామంతులుగనుండిరి. ఆతడాంధ్రరాజుల నందరనుజయించి కీర్తి గడించెను. ఆతనిపుత్రికను బొల్లయ్యప్రభువు పుత్రుడైన రాజన్నకిచ్చి వివాహమొనర్చెను. విక్రమసింహపురమున మనుమగొండగోపాలుని సింహాసనమందు ప్రతిష్ఠించెను. ఆతడు ధరించిన బిరుదములు అలనాటి చారిత్రక సంఘటనలకు ప్రతిబింబములు. రాయసహస్రమల్ల ఏరువమల్లిదేవుని తలగొండుగండ ప్రత్యనీకప్రాసాదాయమాన కులశేఖరగొండ దేవగిరిరాజ్యప్రస్థాపిత ప్రాభృతమణికణకభూషణ, మల్లిఖార్జునసప్తాంగనహరణ కాదవరాయవిధ్వంసన అతిపాండవపరాక్రమపాండ్యరాజన్య ప్రియప్రేషిత చెండవేదండ వైనతేయజంఘాలతురంగసార్థవిరాజమాన సంపోషితసౌహార్ద మున్నగు బిరుదములను ఆతడు ధరించెను. స్వతంత్రుడైన అంబదేవుడు కాకతీయసామంతులతో తలపడుట సహజము. శ్రీపతిగణపతి గురజాల పాలకుడు. ఇతనికి రాయదండాధిపతి అను బిరుదుకూడ గలదు. అంబదేవుడాతని క్రీ. శ. 1273 వ సం॥రమున ఓడించి, ఆతని సహస్రమల్ల బిరుదమును పరిగ్రహించెను. గణపతిఓటమి ఆంధ్రరాజులందరి ఓటమి

కన్నను 75 నాయకుల ఓటమిగను, భావించి ఆశాసనకర్త అతిశయోక్తులతో అతని విజయము నుగ్గడించెను.

క్రీ. శ. 1263 సం.న నెల్లూరులో జటావర్మ సుందర పాండ్యుని వీరాభిషేకానంతరము కాయస్థుల పూర్వశత్రువంశీయులు విజృంభించి కాయస్థరాజ్యములో కొన్నిప్రదేశముల నాక్రమించుకొనియుండిరి. జన్నిగదేవుని కాలమునందే కలుకడప్రభువులు, కేశవదేవులు, అతని సహోదరుడు సోమిదేవుడు కాయస్థరాజ్యమునందలి కొన్ని ప్రదేశములను ఆక్రమించిరి.(వారి తండ్రి రాయదేవమహారాజును గణపతిసాహిణి ఓడించిన సంగతి ఇక్కడ స్మర్తవ్యము.) క్రీ. శ. 1267-'8 సం. నాటి ఎల్లారెడ్డి పల్లె శాసనమున (కడపమండలము) భుజబల వీరనారాయణ సోమేశ్వర దేవమహారాజు కాయస్థరాజధాని వల్లూరు పట్టణమునుండి ములికి 300 పొన్నవాడి 90. పెండేకల్లు 800 - ప్రాంతములను పరిపాలించునట్లు చెప్పుకొనెను. క్రీ. శ. 1268-9 సం.న కలుకడ పురాధీశ్వరులు మహామండలేశ్వరులు కేశవసోమిదేవ మహారాజుల శాసనము కడపమండలము చింతలపుత్తూరులో కలదు. ఈ ప్రాంతము 1284 వరకు వారి అధీనమందేవున్నట్లు ఊహించుటకువీలగు గుండ్లూరు (కడపమండలము) శాసనము కలదు. వారికి తోడుగ గుత్తిపాలకుడు అల్లుగంగదేవుడు వుండెను. వారు అంబదేవుని ఎదిరించుటకు వీలుగ పాండ్యులసాయమును వేడిరి. పాండ్యులు వారికి తోడ్పడుటకై విజయగండ గోపాలుని కోప్పెరుజింగుని పుత్తెంచిరి. క్రీ. శ. 1279 ప్రాంతమున నందలూరుదగ్గిర జరిగిన యుద్ధమున అంబదేవుడు విజయము సాధించెను. ఆ సంవత్సరముననే విజయగండగోపాలుడు మరణింపగా అంబదేవుడు ఒక తెలుగుచోళరాకుమారుడు, మనుమగొండ గోపాలుని నెల్లూరు సింహాసనమున ప్రతిష్ఠించెను.

విజయగండగోపాలుని పరాజయము కోప్పెరుంజింగుని మరణము నెల్లూరు సింహాసనము అంబదేవుని ప్రాభవమునకు లోబడుట

పాండ్యులకు దుస్సహమయ్యెను. క్రీ. శ. 1282 సం. ప్రాంతమున పాండ్యసేనలను రెండవ జటావర్మ సుందరపాండ్యుడు మారవర్మ సుందరపాండ్యుడు కులశేఖరపాండ్యుడు నాయకత్వము వహించి దండయాత్ర నడిపిరి. కలుకడప్రభువులు వారితోకలసిరి. ఐదారు సంవత్సరములు పాండ్యులపరిపాలన నందలూరుప్రాంతమున సాగిన దని ఎంచవచ్చును. పిళ్లై పల్లవరాయన్ పాండ్యప్రతినిధి. అదే సమయమున ఏరువమండలము అంబదేవునిచేయి జారిపోయినది. క్రీ. శ. 1286 సం. నాటికి అంబదేవుడు తిరిగి తలయెత్తి కులశేఖరపాండ్యుని ఓడించి పాండ్యసేనలను కాయస్థరాజ్యమునుండి తరిమివేసెను. తరువాత కలుకడ ప్రభువులు కేశవదేవ సోమిదేవులను వారి అప్తుడు గుత్తి దుర్గాధిపతి అల్లుగంగని జయించి వారులోగడ ఆక్రమించిన కాయస్థ రాజ్యమును తిరిగి వశపరచుకొనెను. క్రీ. శ. 1263 నుండి వల్లూరు పట్టణము కలుకడప్రభువుల అధీనమందుండెను. అంబదేవుడు వల్లూరు పట్టణమును తిరిగి తన రాజధానిగ చేసుకొనెను. గండికోటదుర్గమును కూడ ఆతడు పునర్నిర్మించెను. తరువాత ఆతడు ఏరువప్రభువు మనుమల్లిదేవుని జయించెను. తరువాత ఆతడు పెండేకల్లుపై దండెత్తెను. ఇచ్చట ఆతడు రుద్రమదేవి సేనాపతులను జయించి తనరాజ్యమును కృష్ణాతీరమువరకు వ్యాపింపచేసెను. క్రీ. శ. 1287 సం. నాటి అత్తిరాల (కడపమండలము) శాసనము ఆతని వైభవమును వర్ణించుచున్నది. ఆతని రాజధాని వల్లూరు. దండికోట ములికినాడు రేనాడు పెండేకల్లు సకిలి, ఏరువ సత్తపినాడు సీమల నాతడు ఏలుచుండెను. ఆతని రాజ్యము గుత్తివరకు విస్తరించినది.

అంబదేవుని ప్రాభవము నరికట్టుటకు కాకతీయయువరాజు కుమార రుద్రదేవుడు స్వయముగా పూనుకొనెను. కుమారరుద్రదేవుడు, రాణిరుద్రమదేవిదౌహిత్రుడు. జనని ముమ్మడమ్మ, జనకుడు మహాదేవుడు. గణపతిదేవుని ఆదేశానుసారము రాణి రుద్రమదేవి ఆతని దత్తపుత్రునిగ

స్వీకరించినది. అంబదేవుడు కాయస్థరాజ్యమునకు ప్రభువు అగునప్పటికి = క్రీ. శ. 1272 సం. నాటికి కుమార రుద్రదేవుడు యుక్తవయస్కుడు. కుమార రుద్రదేవు నెదిరించుటకు అంబదేవుడు కాకతీయవంశవిరోధులైన పాండ్యయాదవరాజుల సాయమర్థించెను. యాదవులు కానుకలు పంపివూరకొనిరి. రెండవ జటావర్మ సుందర పాండ్యుడు క్రీ. శ. 1279 నుండి 1292 సం. ప్రాంతముల కాయస్థ రాజ్యమునకు తరలివచ్చెను. కుమార రుద్రదేవుడు త్రిశూల దండయాత్ర నారంభించెను. క్రీ. శ. 1291 సం.న రాణిరుద్రమాంబ సేనాధిపత్యము వహించి త్రిపురాంతకముపై దండెత్తెను. కాకతీయసేనాముఖమున రాణిరుద్రమ దేవికి తోడుగ కులని సోమన మంత్రిపుత్రుడు మనుమ గన్నయమంత్రి యిందులూరి అన్నయదేవుడువుండిరి. అంబదేవుడు పరాభూతుడయ్యెను. సినయోగిసారము ఆదండయాత్ర నుఅద్భుతముగ వర్ణించినది. ఏకదివసమాత్రమున కాకతీయసేనలు 72 దుర్గములను సాధించినవి. ఈ సమయముననందే అంబదేవుని సామంతుడైన చెరకు రాజనరేంద్రుని చాళుక్యరాజవంశీయుడు తాతపిన్నమరాజు (ఆరవీడు వంశ మూలపురుమడు) ఓడించెను. దోనేరు కోనేరు నాథుని ద్విపదబాల భాగవతమునందు రాజనరేంద్రుని దుశ్చేష్టితములు వర్ణితములు. అప్పటినుండి చెరకు దొరలు ప్రతాపరుద్రునికి సామంతులైరి.

రుద్రమదేవి తాత పిన్నమరాజు యిందులూరిమంత్రులు అంబ దేవునిపై దండెత్తిన సమయముననందే కాకతీయ సకలసేనాధిపతి అంబ దేవునకు మిత్రుడైన మనుమగొండ గోపాలుని సంహరించెను.

మూడవసేన గోనవితలసేనాని ఆధిపత్యమున వర్ధమానపురము నుండి (గోనవంశీయుల రాజధాని మహబూబునగర మండలము) బయలుదేరి యాదవరాజ్యముపైకి దండెత్తినది. ఆ సేనలో నర్సరావు పేట ప్రాంతపరిపాలకుడు మనుమగండ గోపాలుడు నల్లపనాయకుని పుత్రుడు ప్రోలినాయకుడు పాలుగొనిరి. వారిరువురు శ్యూనకటక

వేఙుకబళన దావపావక బిరుదాంకితులు. గోనవితలసేనాని అదకాని తుంబులం, మానువహాజువదుర్గములను, రాయచూరు అంతర్వేదిని జయించెను. రాయచూరుదుర్గము ఆవిధముగ కాకతీయులకై వన మయ్యెను.

రాయచూరు విజయానంతరము రాణిరుద్రమదేవి క్రీ.శ. 1296 సం. స్వర్గస్తురాలై నది. ఆమె మహిళామండలి మకుటాయమానయైన మహారాజ్ఞి మాత్రమే కాక రాజసింహులకు తీసిపోని పరాక్రమ ధీశాలిని. యాదవరాజు మహాసేనునిపై ఆమెసాధించిన విజయము, రాయచూరు విజయము ఆమెసిగలోధరించిన మల్లెపూలై తెలుగుచరిత్రలో వాడక నేటికినీ పరిమళమును వెదజల్లు చున్నది.

రుద్రమదేవిభర్త చాళుక్యవంశీయుడు వీరభద్రుడు. నిరవద్య పురాధీశ్వరుడు. ఆమె ప్రథమ పుత్రిక ముమ్మడమ్మ ప్రతాపరుద్రుని జనయిత్రి మహాదేవుని వివాహమాడెను. ద్వితీయపుత్రికను రాణి రుద్రమాంబ, ఇందులూరి గన్నయమంత్రి పుత్రుడు అన్నదేవునకొసగి వివాహము గావించెను.

## ప్ర తా ప రు ద్ర దే వ చ క్ర వ ర్తి

## 1 2 9 5 - 1 3 2 3

రాణిరుద్రమదేవి మరణానంతరము క్రీ.శ. 1295 వ సంవత్సర మున ప్రతాపరుద్రుడు పట్టాభిషిక్తుడయ్యెను. ఇప్పటికతనివయస్సు సుమారు 35 సంవత్సరములు. యువరాజుగానున్నపుడే రాచకార్యము లందుమాత్రమేకాక అనేకయుద్ధములందు పాల్గొనియుండి మంచిఅనుభ వమును సంపాదించుకొనియుండెను. సింహాసనమధిష్ఠించినపిమ్మట ప్రతాపరుద్రుడు నిర్వర్తించిన తొలికర్తవ్యము సైనికవ్యవస్థాపునర్నిర్మా ణము. ప్రతాపరుద్రుడు నవలక్షధనుర్ధరాధీశ్వరుడని ఐతిహ్యము ఉగ్గ

డించుచున్నది. అతనికి ఇరువదివేల ఆశ్వికదళము నూరుఏనుగులు కూడ యుండెడివి. డెబ్బైయయిదు నాయకులు లేక సాహిణులు వివిధ దళములకు ఆధిపత్యము వహించిరి. ప్రతాపరుద్రుడు నాయకుల నెన్నుకొనుటలో వెలమలపై ఎక్కువ పక్షపాతము వహించెనని జనశృతి. కాని నాయకులు అందరు ఒకేకులమునకు చెందిన వారు కారు. అందు వెలమలు, రెడ్లు, బ్రాహ్మణులు కూడ వుండిరి.

ప్రతాపరుద్రుడు చక్రవర్తి అయిన తరువాత నడపిన తొలి దండయాత్ర కాయస్థరాజ్యముపై. ప్రతాపరుద్రుడు యువరాజుగా నున్నప్పుడు క్రీ. శ. 1295 ప్రాంతమున కాయస్థప్రభువు అంబదేవుని జయించి త్రిపురాంతక ప్రాంతమునుండి అతని పారదోలెను. కాని క్రీ. శ. 1304 సం. వరకు అంబదేవుడు ములికినాడును పరిపాలించు చున్నట్లు శాసనాధారముకలదు. అతడుగాని, క్రీ.శ. 1305 వ సం.నుండి కాయస్థరాజ్యమును పరిపాలించిన అతనిపుత్రుడు రెండవ త్రిపురారిగాని ప్రతాపరుద్రుని సార్వభౌమాధికారమును అంగీకరించినట్లు శాసనాధారము లభించుటలేదు. ప్రతాపరుద్రుడు క్రీ. శ. 1309 సం.న కాకతీయ సైన్యమును కాయస్థరాజ్యముపై దండయాత్రకు పంపించెను. పట్టుసాహిణి సోమయ కాకతీయసేనలకు ఆధిపత్యము వహించెను. ఇందులూరి అన్నయ మున్నగువారు ఆదండయాత్రలో పాల్గొనిరి. కాకతీయసైన్యము కాయస్థప్రభువు నోడించినది. ఆరాజ్యమును కాకతీయసామ్రాజ్యములో కలిసిపోయినది. కాయస్థరాజవంశీయుడు మల్లిదేవుడు గండికోటలో తలదాచుకొని కొంతకాలముగడచిన పిమ్మట ప్రతాపరుద్రునిపై ముస్లిములు దండెత్తినపుడు (ఒకానొక దండయాత్రపిమ్మట) తిరుగుబాటు లేవదీసెను. ప్రతాపరుద్రుడు అతనిపై జుత్తయవెంక గొంకయరెడ్డిసేనానిని కాకతీయ సేనలతో పంపించెను. ఆతడు మల్లిదేవుని సంహరించి గండికోటను స్వాధీనము

చేసికొనెను. గొంకయరెడ్డి ములికినాడు పాలకుడుగ నియమితు డయ్యెను. అంతటితో కాయస్థ రాజవంశము అంతరించినది.

## ము స్లి ము ద ం డ యా త్ర లు

ప్రతాపరుద్రునికాలమున దక్షిణాపథచరిత్రలో ప్రాముఖ్యము వహించినవి ముస్లిముదండయాత్రలు. సింహాసనమునధిష్ఠింపగనే ప్రతాపరుద్రుడు కాకతీయసేనానివాహమును ప్రవేశపెట్టిన సంస్కరణ లకు కనుచూపుమేరలో కనుపించుచున్న మహమ్మదీయవిజృంభణ ప్రమాదమే. ఆ ప్రమాదము ఆకస్మికముగ దాపురించినదికాదు. దక్షిణా పథమునందలి భారతీయరాజన్యులందరకు సుస్పష్టముగ చిరకాలము కన్నులయెదుట విస్పష్టముగ కనిపించినదే. అయినను ఐకమత్యము లేక అందరును వరుసగా ఆ ప్రమాదమునకు అహుతియైపోయిరి.

క్రీ. శ. 1267 వ సం.న రాణిరుద్రమదేవి సామంతుడు యాదవ ప్రభువుసారంగపాణిదేవుడు నల్గొండ మండలమునందలి పానుగల్లు శాసనమున తురుష్కాక్రాంతమైన ధరణిని అకాలప్రళయమునుండి తానుద్ధరించినట్లు చెప్పుకొనెను. క్రీ. శ. 1282 వ సం.న బళ్ళారి మండలమునందలి హలువాగలు శాసనమున రామదేవుడు తురుష్కుల బారినుండి భూపతిని సంరక్షించినట్లు చెప్పుకొనెను. క్రీ. శ. 1295 వ సంవత్సరమున అనగా ప్రతాపరుద్రుని పట్టాభిషేకసంవత్సరముననే గర్షాస్ప్‌మాలిక్ చరిత్ర ప్రసిద్ధికెక్కిన దేవగిరిముట్టడి జరిగినది. దేవగిరి పతనము దక్షిణాపథరాజన్యులకు రాబోవు చారిత్రకనాటకమునకు నాందీశ్లోకమై వినిపించినది. గర్షాస్ప్‌మాలిక్ దేవగిరి విజయానంతరము ఢిల్లీకివెళ్ళి పెదతండ్రి సుల్తాన్ జలాలుద్దీన్ ఖిల్జీని సంహరించి తాను అల్లావుద్దీన్ బిరుదువహించి ఢిల్లీసింహాసనమునధిష్ఠించెను.

అల్లావుద్దీను తెలంగాణముపై నడపిన తొలిదండయాత్ర క్రీ. శ. 1303 నాటిది. మలిక్‌ఫక్రుద్దీనుజూనా నజరత్‌ఖానా సోదరపుత్రుడు

ఘాజా సేనానుల ఆధిపత్యమున తురుష్క సేనలు ఓరుగల్లుపై దండెత్తెను. ముస్లిమ్ చరిత్రకారులు ఈ దండయాత్రను అలతిమాటలతో సూచించి విడిచివేయుటచేత వివరములు తెలియవచ్చుటలేదు. ముస్లిమ్‌సేనలు వంగదేశముగుండా తరలివచ్చినవి. మార్గమధ్యమున వరదదెబ్బ తగిలినది. తెలంగాణము చేరిన సైన్యమును కాకతీయసేనలు ఉప్పరపల్లి వద్ద (కరీంనగర్ మండలము) ఓడించి త్రిప్పికొట్టినట్లు వెలుగోటివారి వంశావళినిబట్టి తెలియుచున్నది. పోతుగంటిమైలి ఉప్పరపల్లి వద్ద తురుష్కసేనలను ఓడించినట్లు చెప్పబడినది. రేచర్ల ప్రసాదిత్యుని పుత్రుడు వెన్నభూపాలుడు యుద్ధమున తురుష్కులనోడించినట్లు అభివర్ణితము. ఓరుగల్లుదుర్గమున ఒకానొక సిలాస్తంభమునగల శాసనము క్రీ. శ. 1304 - 5 సం. నాటిది మానరంగోదరిరాజులయింగయ దేవుడు తురుష్కులను జయించినట్లు అభివర్ణించుచున్నది. దీనినిబట్టి మలిక్‌ఫక్‌రుద్దీన్ ఘాజా సేనానులు కాకతీయసామ్రాజ్యమునకు నడిబొడ్డని చెప్పదగిన ఉప్పరపల్లి వరకు దండెత్తిరాగల్గిరనియు కాని కాకతీయ సేనలు వారిని ఓడించి తురుష్కసేనలను ఢిల్లీకితరిమి కొట్టగల్గిన వనియు చెప్పవచ్చును. తురుష్కులు ప్రతాపరుద్రుని కాలమున మొత్తము ఎనిమిదిపర్యాయములు ఓరుగల్లుపై దండెత్తిరనియు, అందు ఏడు పర్యాయములు ప్రతాపరుద్రుడు విజయను గాంచెననియు సమకాలీన భారతీయరచయితల అభివర్ణనము సత్యమని అంగీకరించుటకు వీలులేదు. మొదటిసారి క్రీ. శ. 1303 - 4 ప్రాంతమున తురుష్కదండయాత్ర విఫలమైనదని ఎంచవచ్చును.

అల్లావుద్దీను పట్టుదలగలవాడు. అపజయమునకు జంకనివాడు. క్రీ. శ. 1309 నాటికి ఆతడు ఉత్తరాపథమునంతయు ఆక్రమించుకొనగల్గెను. గుజరాత్ ప్రభువు రాయకరన్ ఓడిపోయి ప్రవాసియయ్యెను. దేవగిరి సంగముడు (రామదేవునిపుత్రుడు) లేవదీసిన తిరుగుబాటును అల్లావుద్దీను అణచివేసి మహారాష్ట్రమునంతను తన ఏలుబడిలోనికి

తెచ్చుకొనెను. ఇకమిగిలినది ఓరుగల్లురాజ్యము. ఓరుగల్లురాజ్యముపై అల్లావుద్దీను దండయాత్రకు ఉపక్రమించుటకు ప్రత్యక్షకారణములు రెండు. ప్రతాపరుద్రుడు గుజరాత్ప్రభువు రాయకరన్‌కు ఆశ్రయ మిచ్చుట ఒకటి. రెండవది క్రీ. శ. 1303-4 నాటి పరాజయమువలన ఏర్పడిన అపకీర్తిని తుడిచివేయుట రెండవది. తురుష్కసేనలకు మలిక్‌నాయక్ కాఫూర్ నాయకత్వము వహించెను.

తురుష్కసేన క్రీ. శ. 30-10-1309 తేదీన ఢిల్లీలో బయలుదేరి దేవగిరిమార్గమున తెలంగాణముపై సాగినది. మార్గమధ్యమున శర్బర్ ముట్టడి హృదయవిదారకమైనది. శర్బర్ దుర్గాధిపతి తురుష్కులకు లొంగిపోవుటకు ఇష్టపడక పేర్చిన చితికి ససైన్యముగ ఆహుతి యయ్యెను. ఆవీరులతోపాటు భార్యలు బాలబాలికలుకూడ సహగమ నము నల్పిరి. శర్బర్ కాందిశీకులు ప్రతాపరుద్రునకు ముస్లిముదండ యాత్ర నుహృదయవిదారకముగవర్ణించిచెప్పిరి. తొమ్మిదిలక్షలకాల్బల ముతో ఇరవైవేల అశ్వికదళముతో నూరు ఏనుగులతో ప్రతాపరుద్రుడు తురుష్కసైన్యము నెదిరింప కృతనిశ్చయుడయ్యెను. సామంతులు సమీపరాజ్యములు కొందరు చేరవచ్చు లోపలనే మాలిక్‌కాఫొ ఓరుగల్లును ముట్టడించెను. క్రీ. శ. 20-1-1310 తేదీన అనుమకొండ తురుష్కాక్రాంతమయ్యెను. ఇరువది ఐదురోజులు ఘోరయుద్ధము జరిగినది. కోటవెలుపలనున్న భారతీయసైనికులు మాలిక్‌కాఫర్ వెనుకచేరి ఢిల్లీనుండి తురుష్క సేనలకువచ్చు వుత్తరప్రత్యుత్తరములు రవాణాసౌకర్యములకు అంతరాయము కల్పించసాగిరి. కాని మాలిక్‌కాఫర్ ఇరువైపులవత్తిడికి తట్టుకొని క్రీ. శ. 12-2-1310 తేదీన ఓరుగల్లు మట్టిప్రాకారమును భేదింపగల్గెను. హతశేషమలైన కాకతీయ సైనికులు సిలాప్రాకారములోనికిపోయిరి. ముట్టడి పట్టువిడుచుజాడలు కానరాలేదు. లోపలిదుర్గమున ప్రతాపరుద్రునిసేనలకు అన్నపానీయ ములు కొరవైనవి. ప్రతాపరుద్రుడు మాలిక్‌కాఫర్‌తో సంధిచేసుకొని

అశేషధనరాసులు, తురగగజానీకములు వస్తువాహనములు సమర్పించి ప్రతిసంవత్సరము సుల్తానునకు కప్పముకట్టుటకు అంగీకరించెను. ఓరుగల్లు విజేత మాలిక్ కాఫర్ 10-6-1310 తేదిన విజయగర్వముతో ఢిల్లీ చేరుకొనెను.

ప్రతాపరుద్రుడు సంధిషరతులను పాటించి, ప్రతిసంవత్సరము ఢిల్లీకి కప్పము పంపుచుండెడివాడు. ప్రతాపరుద్రుని ఓటమి కాకతీయ సామ్రాజ్యములో విచ్ఛిన్నశక్తులకు దోహదముకల్పించినది. సామంతులు స్వతంత్రులు కాజొచ్చిరి. పరువుపోయిన రాజునకు కిరీటము మోయలేనిబరువు కాకతప్పదు. బొక్కసమంతయు తురుష్కులకు సంధిషరతుల ప్రకారము సమర్పింపవలసివచ్చినది. ప్రతాపరుద్రుడు శూన్యమైనబొక్కసమును నింపుకొనుటకు సామంతులపై, ప్రజలపై పడుటతప్ప మార్గము లేదు. గండికోటలో తలదాచుకొనిన కాయస్థ వంశీయుడు మల్లినాథుడు తిరుగబడినాడు. గొంకయరెడ్డిమల్లిదేవుని సంహరించి గండికోటను ఆక్రమించుకొనగల్గెను. ఇంతలో నెల్లూరు తెలుగుచోళప్రభువు రంగనాథుడు (మనుమసిద్ధిమనుమడు) స్వాతంత్ర్యము ప్రకటించెను. కాకతీయసైన్యము నెల్లూరిపై తరలి వెళ్ళుసమయమున ఢిల్లీసుల్తాను ప్రతాపరుద్రునకు పాండ్యదండ యాత్రకు సన్నద్ధముకావలెనని శ్రీముఖమునందించెను.

### ప్రతాపరుద్రుని పాండ్య దండయాత్ర

క్రీ. శ. 1310 వ సంవత్సరమున పాండ్యప్రభువు కులశేఖరుడు మరణించెను. అతని పుత్రులిరువురు సుందరపాండ్య వీరపాండ్యుల మధ్య సింహాసనమునకై అంతర్యుద్ధము ఆరంభమైనది. ఈ సమయముననే క్రీ. శ. 1311 వ సం.న మలిక్‌నాయిక్ కాఫర్, అల్లాయుద్దీన్ ఖిల్జీ సేనాని మధురపై దండెత్తి పాండ్యరాజ్యము నాక్రమించెను. మాలిక్ కాఫర్ కొల్లగొట్టిన ధనరాసులతో ఢిల్లీకి తరలిపోగానే సోదరు

లిద్దరు అంతర్యుద్ధమును తిరిగి ఆరంభించిరి. ఇంతలో క్విలన్‌ప్రభువు రవివర్మకులశేఖరుడు తనవీలికలయిన సుందరపాండ్యునోడించి అటు పిమ్మట వీరపాండ్యుని పారద్రోలి క్రీ. శ. 1313 సం.న కంచిలో పట్టాభిషిక్తుడయ్యెను. సుందరపాండ్యుడు ఢిల్లీకిపోయి అల్లాయుద్దీను శరణు జొచ్చెను. ఆ సమయమున రామదేవుని మరణానంతరమున దేవగిరిలో ముస్లిముపరిపాలనపైతిరుగుబాటుచెలరేగినది.మాలిక్ కాఫర్ ససైన్యముగ దేవగిరికి తరలిపోవలసివచ్చినది. అందుచే సుల్తాను సుందరపాండ్యుని సింహాసనమును పునఃప్రతిష్ఠించుటకై ప్రతాపరుద్రునకు శ్రీముఖము నంపెను.

ప్రతాపరుద్రునకు అవకాశము కలసివచ్చినది. తన దక్షిణ దండయాత్రకు ఢిల్లీసుల్తాను సేనలుకూడ తోడ్పడగలవు. తాను నెల్లూరు కంచి రాజ్యములను తిరిగి జయించుటకు అవకాశమేర్పడినది. కాకతీయసేనలు ముప్పిడినాయకుని ఆధిపత్యమున దక్షిణదండయాత్ర కుపక్రమించినవి.

అల్లావుద్దీనుఖిల్జీ ఆధిపత్యమును త్రోసివేసి తిరిగి స్వాతంత్ర్యమును పొందుటకు దేవగిరి తుదిప్రయత్నమును చేయు అక్లిష్ట సమయమున ప్రతాపరుద్రునిసేనలు దక్షిణమునకు తరలుటకు బదులు ఉత్తరమున దేవగిరి సంరక్షణార్థము వుద్యమించివున్నచో కాకతీయ సామ్రాజ్య చరిత్ర మాత్రమేకాక దక్షిణాపథచరిత్రయే వేరుగ నుండెడిది.

ప్రతాపరుద్రుని దక్షిణదండయాత్రలో తొలుత తురుష్కసేనలు పాల్గొనినవి కాని క్రీ. శ. 1316 వ సం. న సుల్తాను మరణముతో మాలిక్ కాఫర్ తురుష్కసేనలను వెనుకకు పిలిపించుకొనెను. అందుచే ఆదండయాత్రాభారమంతయు కాకతీయసేనలమీదనే పడినది. ఈ దండయాత్రను మూడుదశలుగ విభజించవచ్చును. (i) నెల్లూరు విజయము (ii) మూడవ బల్లాలునిపై దండయాత్ర – శంబురాయని

పునః ప్రతిష్ఠ ( iii ) పాండ్యదండయాత్ర - సుందరపాండుని పునః ప్రతిష్ఠ. కాకతీయసేన ముప్పిడి నాయకుని కుమారుడు రుద్రసేనాని ఆధిపత్యమున తరలి నెల్లూరుని జయించి రంగనాధుని అచ్చటినుండి తరిమి వేయగలిగినది. తరువాత కోటతిక్కప్రభువును ససైన్యముగ వధించినది. తరువాత ముప్పిడిరుద్రనాయకుడు నారాయణవనమును అనేకమన్యదుర్గములను సాధించి నెల్లూరురాజ్యమునకు ప్రతాపరుద్రుని ప్రతినిధిగ పరిపాలకుడయ్యెను. తరువాత మూడవబల్లాలునితోయుద్ధము ఏర్పడినది. మూడవబల్లాలుడు పాండ్యుల అంతర్యుద్ధము కల్పించిన అవకాశమును పురస్కరించుకొని దక్షిణమున తనపూర్వికులు కోల్పోయిన ప్రదేశములను తిరిగి జయించుటకు పూనుకొనెను. అతనికి అప్పుడు మంచి అవకాశము లభించినది. కులశేఖరుని మరణముతోపాటు మాలిక్ కాఫర్ సేనలతో ఢిల్లీ సింహాసనము నాక్రమింపబోయెను. ఆ అదనుచూచుకొని మూడవబల్లాలుడు తొండయ మండలమును కాంచిరాజ్యమును తన ఏలుబడిలోనికి తెచ్చుకొనగల్గెను. ముప్పిడి రుద్రసేనాని మూడవబల్లాలుని జయించి శంబున రాయని తొండయమండలమున పునఃప్రతిష్ఠింపగల్గెను. పిమ్మట రుద్రసేనాని కంచిని ఆక్రమించుకొనగల్గెను.

కంచి కాకతీయుల వశమగుటతోడనే పాండ్యులు యుద్ధసన్నద్ధులైరి. ప్రతాపరుద్రుడు ఈ తరుణమున కంచిచేరి కాకతీయసేనలకు నాయకత్వము వహించెను. కాంచీసమీపమున ఘోరయుద్ధము జరిగినది. ఉభయసేనలు ధైర్యసాహసములతో పోరాడినవి. అప్రతిహతమైన పాండ్యగజబలములధాటికి వెలమదొరలును రెడ్డిదండనాధులును కలసి ఎదురొడ్డినిలచిరి. రేచర్ల ఎఱ్ఱదాచసేనాని పాండ్యగజసాహిణిపై కురికి గజవిజృంభణము నరికట్టి అసమానసాహసమును ప్రదర్శించెను. విజయలక్ష్మి కాకతీయసేనలను వరించినది. ప్రతాపరుద్రుడు కాంచీపాలకునిగ మానవీరుని నియమించి సుందరపాండ్యుని సింహాసనముపై

ప్రతిష్ఠింప దేవరినాయకుని నియమించి రాజధానికి తరలివచ్చెను. వీర పాండ్యుడు రవివర్మకులశేఖరుడు సంధిచేసికొని తక్కిన పాండ్య ప్రభువులు ఏకమై దేవరినాయకుని ఎదిరించిరి. తిరువడికుంద్రంయొద్ద ఘోరయుద్ధము జరిగినది. తెలుగుసేనలు విజయము నార్జించినవి. దేవరినాయకుడు వీరధావళ సింహాసనమున సుందరపాండ్యుని ప్రతిష్ఠించెను.

ప్రతాపరుద్రుడు దక్షిణమున పాండ్యదండయాత్రలో నిమగ్నుడై యున్న సమయమున ఉత్తరమున చరిత్ర ప్రసిద్ధములైన మార్పులు జరిగినవి. ఢిల్లీ సింహాసనము నాక్రమించిన మాలిక్ హత్య గావింపబడెను. అల్లావుద్దీనుకుమారుడైన కుతుబుద్దీన్‌ముబారక్‌షా సింహాసనము నధిష్ఠించెను. (క్రీ. శ. 1317) క్రీ. శ. 1318 వ సం.న అరపాలదేవుని ఆధిపత్యమున దేవగిరిలో తిరుగుబాటు చెలరేగినది. ప్రతాపరుద్రుడు పాండ్యదండయాత్రానంతరము కప్పమునుకూడ చెల్లించలేదు. అందుచే ముబారక్‌షా స్వయముగ, దండయాత్రకు పూనుకొనెను. షా దేవగిరి కేతెంచి మహారాష్ట్రుల తిరుగుబాటును నిర్దాక్షిణ్యముగ అణచివైచెను. తరువాత ఆతడు నమ్మిన బానిస ఖుస్రూఖానును ఓరుగల్లుపై దండెత్తుటకు పంపించెను. ఖుస్రూఖాన్ ప్రతాపరుద్రుని దగ్గరనుండి ఇవ్వని సం.ల కప్పము వసూలుచేయవలెను. లేదా ఓరుగల్లు రాజ్యమునువశపరచుకొనవలెను. ఖుస్రూదండయాత్రఎట్లు సాగినది తెలియుటలేదు. ముస్లిముచరిత్రకారులు పరస్పరవిరుద్ధములైన కథనములనల్లిరి. అమీర్ ఖుస్రూనమకాలీనరచయిత, యుద్ధము జరిగినదనియు, అందు ప్రతాపరుద్రుని ప్రధానసేనాధిపతి మరణించె ననియు, ఖుస్రూ ప్రథమప్రాకారమును జయించిన పిమ్మట ప్రతాప రుద్రుడు సంధిచేసికొని వెనుకటి కప్పమునే కాక అశేషధనమును నష్టపరిహారముగ నొసంగెననియువ్రాసెను. ముప్పది సం.ల పిమ్మట

వ్రాసిన దక్కని రచయిత ఈసామి ఖుస్రూఖాన్ ఓరుగల్లు దండయాత్రను వర్ణించెను. కాని అందు యుద్ధము జరిగినట్లే వ్రాయలేదు. ఖుస్రూఖాన్ రాయబారిని ప్రతాపరుద్రుడు రాజమర్యాదలతో గౌరవించి తనస్వామిభక్తి పరాయణతను వెల్లడించి కప్పముచెల్లించకపోవుటకు కారణము మార్గావరోధమే లేనని చెప్పెనట. తరువాత ప్రతాపరుద్రుడు కప్పము చెల్లించుట ఖుస్రూఖాన్ ప్రతాపరుద్రునకు ఛత్రచామరాదులు సుల్తానుపక్షమున బహూకరించుట వర్ణితములు. ఉభయులును ప్రతాపరుద్రునినుండి రావలసినకప్పమును ఖుస్రూఖాన్ వసూలు చేసెనని చెప్పుచున్నారు. ఖుస్రూఖాన్ నిష్క్రమణానంతరము ప్రతాపరుద్రుడు కంపిలిపై దండెత్తెను. ఉభయపక్షములలో విజయలక్ష్మి ఊయలలయూపుగ పలుమారు వినోదించినదని తోచుచున్నది. ప్రతాపరుద్రుని సేనాని ప్రోలయ అన్నయ కంపిలిరాయని పురోపవనములను విధ్వంస మొనర్చినట్లు శ్రీనాథుని భీమఖండమున గలదు. ప్రతాపరుద్రునిఓడించి తరిమివేసినట్లు కంపిలి వారి కథనము.

ఖుస్రూఖాన్ నిష్క్రమణానంతరముకూడ ప్రతాపరుద్రునకు శాంతిభద్రతలు చేకూరలేదు. మలిక్ ఏక్ లఖీ దేవగిరి పరిపాలకుడు సుల్తానుపై తిరుగుబడి స్వాతంత్ర్యము ప్రకటించెను. ఖుస్రూఖాన్ అతని జయించి బందీకృతుని చేసి ఢిల్లీకి పంపించెను. సరిహద్దులలో తురుష్కసేనలు ప్రతాపరుద్రునకు విశ్రాంతి కల్పింపలేదు. ఖుస్రూఖాన్ మాబార్ పై దండెత్తి రాజధాని పట్టన్ స్వాధీనమొనర్చుకొనెను. కాని అతని అనుచరులు అతని స్వామిభక్తిని శంకించి బందీకృతుని చేసి ఢిల్లీకి పంపించిరి. కాని సుల్తాను అతనిపైగల అకుంఠిత విశ్వాసముతో అతనిని బంధవిముక్తుని చేసి యథాపూర్వము గౌరవించెను. తరువాత ఢిల్లీ చరిత్ర పలుసార్లు అడ్డముతిరిగినది. ఖుస్రూఖాన్ విశ్వాసఘాతకుడై సుల్తానును హత్యగావించి తానే సింహాసనమధిష్ఠించెను. కాని తోడి తురుష్కసర్దారులు తిరుగబడి కుట్రపన్ని అతనిని హత్యగావించిరి.

ఆ తురుష్కసర్దారుల నాయకుడు గయాజుద్దీన్‌తుగ్లక్ క్రీ. శ. 1320 సం.న ఢిల్లీసుల్తానయ్యెను. ఉత్తరాపథమున ఆతడు తన అధికార మును సుస్థిరమొనర్చుకొని క్రీ. శ. 1320 సం.న తన తనయుని ఉలూగ్ ఖానును ఏకశిలానగరముపై దండయాత్రకు పంపించెను.

ఉలూఘ్‌ఖాన్ దేవగిరిమీదుగ ఓరుగల్లునకు దండయాత్ర సాగించెను. ప్రతాపరుద్రుడు ఏటేటచెల్లింప వలసిన కప్పము చెల్లింపక పోవుటయే గయాజుద్దీనుతుఘ్లకు దండయాత్రకు కారణ మని 'ఫెరిస్తా' పేర్కొనినాడు. ప్రతాపరుద్రుని బొక్కసము పలుమారులు ముస్లిముదండయాత్రలనెదుర్కొనుటకు - కప్పము చెల్లించుటకు ఖాళీయైపోయినది. ఢిల్లీలోవచ్చిన మార్పులు గూడ గమనింపదగినవి. ప్రతాపరుద్రుడు ఈదండయాత్రను నిరీక్షించుచు, యుద్ధసన్నద్ధుడై యుండెను. తురుష్కులముప్పు, ఎప్పటికైనను తప్పదనియు, యుద్ధము అనివార్యమనియు అందరకు తెల్లమైనవిషయమే. ప్రతాప రుద్రుడు- కప్పము చెల్లించి "శాంతి"ని కొనుటకు చేసిన తాత్కాలిక ప్రయత్నములన్నియు విఫలములుకాకతప్పవు. యుద్ధము "అవశ్య భవితవ్యము" కప్పము చెల్లించుటమాని ప్రతాపరుద్రుడు ఆ యుద్ధము నకు సన్నద్ధుడై యుండెను.

ఉలూఘ్‌ఖాన్ ఓరుగల్లును ముట్టడించెను. ముట్టడిచాలరోజులు పట్టినది. పలుయుద్ధములు జరిగినవి. 'అబురిజ' సేనాని నాయకత్వ మున తురుష్కులు 'కోటగిరి'ని ముట్టడించిరి. పలుతావుల ఘోర యుద్ధములు జరిగినవి. వరంగల్లుకోట తురుష్కులవశముకాలేదు. ఉలూఘ్‌ఖాన్ ముట్టడి విరమించి, చెల్లాచెదరైన సేనలనువిడిచిపెట్టి 'దేవగిరి' చేరుకోవలసివచ్చినది.

ముస్లిముచరిత్రకారులు ఉలూఘ్‌ఖానుని పరాజయమునకు కారణముగ వర్ణించినకథ గమనింపదగినది. రాకుమారునకు మిత్రుడు

'ఉబయిద్' కవి. అతడు జ్యోతిష్కుడు గూడ. ఎంతకాలమునకు ఓరుగల్లుకోట వశముకాకపోవుటచే ఉలూఘ్‌ఖానుడు, ఆప్తమిత్రుడైన కవీశ్వరుని "ముహూర్తము" పెట్టుమని శాసించెను. పెట్టిన ముహూర్తమునకు కోట వశముకాకపోయినచో చండశాసనుడైన రాకుమారుడు తనతలనరికించునని కవీశ్వరునకు తెలియును. తాను పెట్టిన ముహూర్తము సమీపించుచున్నను, కోటవశమగుసూచనలు కానరాలేదు. ముట్టడి తీవ్రముగసాగిన తొలిదినములలో ప్రతాపరుద్రుడు కప్పముచెల్లించుట కంగీకరించుచు రాయబారులను పంపించెనట. కాని, ఉలూఘ్‌ఖాన్ ప్రతాపరుద్రుని జయించితీరవలెనను పట్టుదలతో సంధికి సమ్మతించలేదట. ఢిల్లీనుండి ఓరుగల్లుకు రాకపోకలు రవాణామార్గములను, కాకతీయసేనలు అవరోధములు కల్పించియుండెను. ఉలూఘ్‌ఖాన్‌నుని ఆప్తకోటిలోని షేక్‌జాదా - యిది మాష్కిసేనాని, కవీశ్వరుడుకలిసి ఆక్లిష్టపరిస్థితులలో ముస్లిము గుడారములలో ఢిల్లీలోసుల్తాను మరణించినట్లు- సింహాసనము అన్యాక్రాంతమైనట్లు వదంతులు రేకెత్తించిరి. తురుష్కసేనానివహమంతయు రాకుమారునకు ఆప్తకోటినుండి వచ్చిన ఆ అసత్యకల్పనములను నమ్మి భయభ్రాంతులైరి.

కాకతీయసేనలు దైవికముగ కలిసివచ్చిన అదృష్టసమయమును వినియోగించుకొని, తురుష్కసేనలనోడించి స్కంధావారముల కొల్లగొట్టినవి. పదిసంవత్సరములతరువాత భారతదేశమునకు వచ్చిన సుప్రసిద్ధయాత్రికుడు "ఇబన్ బతూత" ఉలూఘ్‌ఖాన్ తండ్రిపై విప్లవము లేవదీయనెంచి, ఆ 'వదంతి' రేకెత్తించెననియు, దానివలన సర్దారులు తానేసుల్తానుకాబట్టి వినయవిధేయతలతో పోరాటములోపాల్గొనగలరని ఆశించి ఆశాభంగము నొందెననియు వ్రాసియున్నాడు. ముస్లిముసేనలోని అమీరులు తిరుగబడినారు. ఉలూఘ్‌ఖాను మృత్యుముఖము నుండి తప్పించుకొని, ఢిల్లీకి పలాయనము సాగించెను. అమీరుల

బారినుండి ఉలూఘ్‌ఖానుని రక్షించినది మలిక్‌తైమూర్ అను సర్దారు. ఢిల్లీకి పారిపోయి, ఉలూఘ్‌ఖాన్ తండ్రితో అమీరులపై నిందారోపణ సల్పి తన పరాభవమును కప్పిపుచ్చుకొనెను. గయాజుద్దీను తుఘ్లక్ తనయుని దుశ్చేష్టితము నెఱింగియు, ఎఱుగనియట్లే నటించి అమీరులను కఠినముగా శిక్షించి తిరిగి సైన్యమును ధనమునిచ్చి ఓరుగల్లుపైకి రెండవ దండయాత్రకు పంపించెనని ఇబన్‌బతూత కథనము. క్రీ. శ. 1323 లో ఉలూఘ్‌ఖాన్ సల్పిన మొదటిదండయాత్ర విఫలమైనదనుట, విజయము కాకతీయసైన్యమునే వరించుట అందరు అంగీకరించిన విషయమే.

గయాజుద్దీన్ తుఘ్లకు పట్టుదల ఆత్మవిశ్వాసముగల సుల్తాను. ఆతడు తిరుగబడిన అమీరులను కఠినముగా శిక్షించి, దేవగిరిలో తలదాచుకొనిన ఉలూఘ్‌ఖానునకు అంగబలము అర్థబలము నందించి ఓరుగల్లుపై రెండయాత్రకుపక్రమింపుమని ఆజ్ఞాపించెను. ఉలూఘ్‌ఖాన్ ఓరుగల్లుపై రెండవ దండయాత్రకు కృతనిశ్చయుడై బయలుదేరెను. మొదటసంగడిసీమలోని బీదరుదుర్గమును కైవశమొనరించుకొని విశ్వాసపాత్రులైన అమీరులను కొనఊపిరి యున్నంతవరకు దుర్గమును వీడవలదని ఆజ్ఞాపించి అచ్చటనిలిపి, మార్గమధ్యమున దుర్గముల జయించుచు 'బోధన్' చేరుకొనెను. అచ్చటునుండి ఓరుగల్లునకు పదిరోజుల పయనము. నాలుగైదు రోజుల ముట్టడి తరువాతబోధన్ తురుష్కాక్రాంతమైనది. బోధన్ దళవాయి ఇస్లాముమతమునందు చేరి, ప్రాణాలు దక్కించుకొగల్గెను. పిమ్మట ఉలూఘ్‌ఖాన్ ఓరుగల్లు చేరి రెండవసారి ముట్టడి నారంభించెను. మొదట మట్టికోట తురుష్కుల వశమైనది. తరువాత శిలాప్రాకారముదాటి ఉలూఘ్‌ఖాను ప్రతాపరుద్రుని ఓడించి ఓరుగల్లును కైవశమొనర్చుకొనెను. ఇది ముస్లిము చరిత్రకారుల కథనము.

రెండవ దండయాత్రలో ఉలూఘ్‌ఖాను సులువుగ ఓరుగల్లును వశపరచుకొన లేదు. రెండవ ముట్టడిగూడ నాలుగైదుమాసములు జరిగినది. దీర్ఘదృష్టిలేని ప్రతాపరుద్రుని అవివేకచర్యలే ఓరుగల్లు పతనమునకు దారితీసినవి. ఉలూఘ్‌ఖాముని నిష్క్రమణానంతరము ప్రతాపరుద్రుడు పండుగలు, వేడుకలు, జాతరలు చాటించి తాత్కాలిక విజయోన్మత్తుడై ఒడలు మరచెను. ప్రతాపరుద్రుడు జీవితమున తురుష్కదండయాత్రల పలుమారులు ఎదుర్కొనవలసివచ్చినది. అది తొలిసారికాదు. తుదిసారి కాజాలదు. అమాత్రము ఊహింపజాలక పోవుట శోచనీయము. ఉలూగ్‌ఖాను పరాజితుడై పలాయనము సాగించుటతోడనే కోటలో నిలువచేసిన ధాన్యమునుగూడ ప్రతాప రుద్రుడు అమ్మివేసెను. నాలుగునెలలు దాటకుండ ఉపద్రవము తిరిగి ప్రత్యక్షమైనది. ముట్టడికి మూడునాలుగునెలలు తట్టుకొనిగూడ చివ రకు ప్రతాపరుద్రుడు తురుష్కులచేతికి చిక్కెను. కాకతీయసేనలు ఆ మూడునాలుగునెలలలో వెలమ రెడ్డి విభేదములతో తురుష్కులపై ఏకోన్ముఖముగ విజృంభింపలేకపోయినవి. ప్రభువు తురుష్కులకు చిక్కినవార్తవిని, వెలమవీరులు, రెడ్డిసేనానులు కలిసి అత్యంతధైర్య సాహసములతో తురుష్కులతో పోరాడిరి. ప్రభువు తురుష్కులచేతికి చిక్కకముందే అట్టి ఐకమత్యముతో కాకతీయసేనలు పోరాడియున్నచో తురుష్కులు రెండవసారిగూడ చెల్లాచెదరైయుండెడివారు. దక్షిణా పథచరిత్ర వేరుగనుండెడిది. ఉలూగ్‌ఖాను దూరదృష్టితో చేచిక్కిన ప్రతాపరుద్రుని విశ్వాసపాత్రులగు అమీరుల అధీనమున అంతకుముందే ఢిల్లీకి పంపించివేసెను. ప్రభువు తురుష్క సంధావారములలో లేడను వార్త కాకతీయసేనలకు నిరుత్సాహము కల్గించినది. ఉలూగ్‌ఖాన్ మొండిపట్టుదలతో ఓరుగల్లు కోటను ప్రవేశింపగల్గెను. కాకతీయ సామ్రాజ్యము స్తమించెను.

ప్రతాపరుద్రుని- సకుటుంబ పరివారముగ ఖాదిర్‌ఖాన్,

ఖ్వాజాహాజీ అను అమీరులిద్దరు డిల్లీకి గోలపోవుచుండగ ఆతడు మార్గమధ్యమున మరణించెను. క్రీ. శ. 1330 నాటి విలసతామ్ర శాసనమున ముసునూరి ప్రోలయనాయకుడు ప్రతాపరుద్రుడు సోమోద్భవా తీరమున మరణించినట్లు చెప్పినాడు. అనితల్లి కలువచేఱు శాసనమున (క్రీ. శ. 1423 ప్రాంతమునాటిది) ప్రతాపరుద్రుడు స్వచ్ఛందముగ అమరలోకమున కేగినట్లు వర్ణితము. దీనినిబట్టి, ప్రతాపరుద్రుడు నర్మదానదిలోబడి ఆత్మహత్య సల్పుకొనినట్లు కొందరు ఊహించుచున్నారు. చక్రవర్తికోరికపై పరివారములోని భటుడాతని నర్మదాతీరమున సంహరించి శత్రువులబారినుండి తప్పించియుండవచ్చును. మానహానికంటె మరణమే మేలని ప్రతాపరుద్రుడు భావించెననుట స్వచ్ఛందమరణవర్ణన కర్థము.

కాకతీయసామ్రాజ్యము గణపతిదేవుని కాలమున సర్వతోముఖాభ్యున్నతి చెంది పరాకాష్ఠ చెందినది. ఆనాడు తెలుగు వీరులు అరిభీకరులై ఆదర్శప్రేరితులై, భారతయోధులవలె పూర్ణపురుములై వెల్లివిరిసిరి. యాదవరాజు కాకతిప్రభుని సంహరించి, యువరాజు గణపతిని బందీకృతుని గావించియు ఓరుగల్లును కైవసమొనర్చుకొనలేకపోయెను. గణపతిదేవుడు సుమారు ఒకదశాబ్ది, శత్రువులకారాగారమున క్రమ్మగ్గి జీవితము నేర్పిన కఠోరపాఠములను సాంగోపాంగముగ నర్థముచేసికొని, అరువదియేండ్లపైబడి యావదాంధ్రము నేకచ్ఛత్రాధిపతియై పరిపాలింప గల్గిన "కార్యఖడ్గ నిపుణుడు". రాజనీతి, యుద్ధతంత్రము ఉచ్ఛ్వాస నిశ్వాసములుగ అతడు కాకతీయసామ్రాజ్యమును కళింగమునుండి కంచివరకు విస్తరింపగల్గెను. దివిని జయించి - అయ్యప్రభువులకు అనుగు అల్లుడై శత్రువుల మిత్రుల గావించుకోగల్గిన రాజనీతిధురంధరుడు గణపతిదేవుడు. గజసాహిణిజాయప సేనానికి ఆతడు చూపినగౌరవము, తెలుగుచోడరాకుమారుడు తిక్కనృపతికి చేసిన సాయము, సాహసుడై దక్షారామమువరకు వచ్చిన కోప్పె

రుంజిoగుని నిర్జించి అతనికితొడిగిన వీరపదముద్ర- గణపతి బహుముఖ ప్రజ్ఞాధురీణత ప్రతిఫలించిన వెలుగురేకలు. పుత్రికరుద్రమను రుద్రదేవ మహారాజుగ రూపొందించినది గణపతిదేవుని ప్రజ్ఞయే. రాణిరుద్రమదేవి విజయములకు గణపతిదేవుడు తీర్చిదిద్దిన సేనాధిపతులు కారణము. గణపతిదేవుడు పెంచిపెద్దచేసినది రాణిరుద్రమదేవిని. ప్రతాపరుద్రుడు అదృష్టదేవత అల్లారుముద్దుగ లాలించి పెంచిన లక్కబొమ్మ. కాకతీయ సామ్రాజ్యము గణపతిదేవుని కష్టార్జితము. కాకతీయ సామ్రాజ్యము వారసత్వముగ సంక్రమించినది ప్రతాపరుద్రునకు. ఈ ప్రతాపరుద్రుడు - సుస్పష్టముగ కనుచూపుమేరలో వికటాట్ట హాసవిలయతాండవము సల్పుచున్న తురుష్కప్రమాదమును చూచి ఔదాసీన్యము వహించి యారకుండుట వింతలలో వింత. ఆడుపిల్లనుగూడ జగదేకవీరుల మించునట్లు కత్తిసాము గుఱ్ఱపుస్వారీ మున్నగు విద్యలనేర్పించిన ఘనత గణపతిదేవునకు దక్కినది. రుద్రమదేవి యుక్తవయస్కుడైన మనుమడు ప్రతాపరుద్రునకు, పదునారుగురుకన్యకల వివాహమొనరించినట్లుప్రతాపచరిత్రలో నున్నది. క్రీడాభిరామము ఓరుగంటిసీమకు అలంకారప్రాయమైన మాచల్దేవి - ప్రతాపరుద్రుని హృదయేశ్వరియైన వారాంగన- నభివర్ణించుచున్నది. భోగలాలసత్వము ప్రభువులను కైవసమొనరించుకొన్నంత శీఘ్రముగ ప్రజలను లోబరచుకోలేదు. తెలుగువీరుల కత్తిసాము జగత్ప్రసిద్ధి కెక్కినది. సుల్తాను అల్లావుద్దీను ఢిల్లీలో డాకోలునందు పోతుగంటి మైలి - తెలుగుబిజ్జలుల ఖడ్గవిద్యాప్రదర్శనము వీక్షించినట్లు ఒక చాటుపద్య మభివర్ణించుచున్నది.

ఢిల్లిలో సురధానుఁడల్లావదీధరాధ్యక్షుండు ప్రత్యక్షసాక్షిగాఁగ
మహనీయజయసాలి మలికినేమారుండు జగదేకశూరుండు సాక్షిగాఁగ
జగతిపై డెబ్బదేడుగురు సాయంకులు నక్షీణబలయుతుల్ సాక్షిగాఁగ
సహజసాహసయుద్ధ సన్నద్ధవరభటా శ్రయమైనదాకోలు సాక్షిగాఁగ

సూర్యవంశోదయా ఖ్యాతుఁడార్య తెలుఁగు
బిజ్జలనృపాలు గెల్చెఁదద్భీమబలుఁడు
వైరి గజభీముఁ డమిత సత్యప్రియుండు
ఘనభుజాశాలియగు పోతుగంటిమైలి.

వరభటాశ్రయమైనదాకోలునందు ప్రదర్శనయోగ్యమైనది అల నాటి తెలుగువీరుల ఖడ్గచాలన నైపుణ్యము.

"ఉలవఖానుని సప్తాంగ చూఱకార
మలుకనేమాలుని మానమర్దన"

అని తెలుగువీరుల ప్రశంసలు విన్పించినవి. కాని రాజులు భోగ లాలసులై ప్రజలుచెల్లించిన పన్నులతో నిండిన బొక్కసమును వెచ్చించి శాంతిభద్రతలను కొనగోరు ప్రభువులకు పరాక్రమోపజీవులైన వీరభటులు నవలక్షధనుర్ధరులున్ననేమి ప్రయోజనము. క్రీ. శ. 1303 సంవత్సరమున మలిక్‌కాఫరుతో సంధిచేసికొనుటయే ప్రతాపరుద్రుని మొదటిపొరపాటు. నవలక్షధనుర్ధరులు కాకతీయసేనలో గలరు. తురుష్కసైన్యము సంఖ్యాబలమున ఏనాడును ఎన్నదగినదికాదు. శత్రువులను జయింపవలెనను కృతనిశ్చయత్వమే వారి ప్రబలాయుధము. క్రీ. శ. 1323 సంవత్సరమున ఉలూగ్‌ఖాను రెండవ దండయాత్రలో ఓరుగల్లుకోట పడిపోయినదని చరిత్రచెప్పెడి పాఠము. నిజమునకు ఓరుగల్లుపతనము క్రీ. శ. 1303 సంవత్సరమున మలిక్‌కాఫరుతో ప్రతాపరుద్రుడు మానమును, ధనమును వెచ్చించి చేసికొనిన సంధితోడనే ఆరంభమైనది.

రెండుదశాబ్దుల పిమ్మట, ఉలూగ్‌ఖాన్ మొదటిముట్టడి తరువాత ప్రతాపరుద్రుడు సమరసన్నద్ధుడై ఓరుగల్లుకోటకు తగిన కట్టుదిట్టములు కల్పించుటకు బదులు విందులు కుడిచి వేడుకలు

సాగించెను. రెండవముట్టడిలో గూడ - ప్రతాపరుద్రుడు - కాకతీయ వీరుల నందర నేకోన్ముఖులజేసి శత్రువులతో సాహసముతో పోరాడ లేకపోయెను. తెలుగువీరులకు సంఖ్యాబలమా కొదువ లేదు. సాహస శౌర్యములా కొదువలేవు. ఖడ్గచాలనమున వ్యక్తిగతముగ అతిలోక చాతుర్యమును ప్రదర్శించి శత్రువులనైతము ముగ్ధులగావించినవారు కాకతీయవీరులు. కాలకర్మ విపరిపాకమున క్రీ. శ. 1323 సంవత్సరమున ఓరుగల్లుకోట ముష్కరతురుష్కాక్రాంతమైనది. ఆదండయాత్రకు ఆధిపత్యమువహించినఉలూఘ్‌ఖాను, తరువాత చరిత్రలో చిరస్మర ణీయుడై ఢిల్లీసింహాసనమధిష్ఠించిన మహమ్మద్‌బిన్‌తుఘ్లుకు చక్రవర్తియే.

# కాకతీయ సామ్రాజ్యమునందలి సంఘ వృత్తములు

## సా హి త్య ము

సంస్కృతసాహిత్యము :— కాకతీయ యుగమున యథా పూర్వము ఉన్నత విద్య అనిన సంస్కృతభాషాధ్యయనమే. కాకతీయుల రాజభాష సంస్కృతము. కాకతీయ రాజశాసనములు బహుళముగా సంస్కృతములోనేయున్నవి. దానశాసనమునందలి గ్రహీతలు పలువురు వేదవేదాంగ పారంగతులు, ఉపనిషత్తులు షట్శాస్త్రములు పురాణేతిహాసములు చదివినవారు, షడ్దర్శనపారంగతులు. ప్రభువులు సామంతులు కూడ సంస్కృత విద్యను పోషించిరి. కాకతీయయుగమునందలి సంస్కృత కవులలో మొదట పేర్కొనదగినవారు శాసనరచయితలు. కాకతి రుద్రదేవుని అనుమకొండ శాసన ప్రశస్తిని రచించిన కవి అచింతేంద్రుడు. ఇతడు రామేశ్వరదీక్షితుల పుత్రుడు, అద్వైతామృతయోగి శిష్యుడు. క్రీ. శ. 1214 నాటి గణపవర శాసన రచయిత నంది. గణపతి దేవుని పాఖల్ శాసనరచయిత కవిచక్రవర్తి. కోటగిరి తామ్రశాసనమునందలి దానగ్రహీతలు (క్రీ. శ. 1273) ముప్పురు కవులు ద్రవిడ ఇంజిపిరకవి అమ్మికవి సూరికవి కన్పించుచున్నారు. ప్రశస్తిరచయితలలో పేర్కొనదగినవాడు ఈశ్వరభట్టోపాధ్యాయుడు = ఈశ్వరసూరి. మల్యాల వంశీయుల బోత్‌పూర్ శాసనరచయిత ఇతడే. ఇతడు చిత్రకవితా విశారదుడు. నిరోష్ఠ్య నిష్కంఠ్య నిస్తాలవ్య నిర్మూర్ధన్య నిర్దంత్య శ్లోకముల నాతడు రచించెను. శాసన రచయితలేకాక పేరుకెక్కిన సంస్కృతరచయితలుకూడ కాకతీయయుగమున వర్ధిల్లిరి. అగస్త్యుడు డెబ్బదినాలుగు గ్రంథములను రచియించెను. అందు మూడే నేడు ఉపలభ్యమానములు. ఈతని బాలభారతము సుప్రసిద్ధమైనది. సాహితీ

సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయల శిరఃప్రధాని సాళువ తిమ్మమంత్రి బాలభారతముపై "మనోహర" వ్యాఖ్యానము రచించెను. విద్యానాధుడే అగస్త్యుడనికొందరనుచున్నారు. కంపరాయ చరిత్ర = మధురా విజయం రచించిన రాకుమారి గంగాదేవి అగస్త్యుని శిష్యురాలే. కాకతీయయుగమున పేరెన్నిక గన్న విద్వత్కవి శాకల్య మల్లుభట్టు ప్రతాపరుద్రుని ఆస్థానము నలంకరించెను. ఈతడు ఉదాత్త రాఘవ కావ్యమును నిరోష్ఠ్యరామాయణమును రచించెను. ప్రతాప రుద్రుని ఆస్థానమందలి జైనకవి అప్పయార్యుడు జినేంద్ర కల్యాణా భ్యుదయమును 20 - 1 - 1320 తేదీన ఓరుగల్లులో పూర్తిచేసెను. అగస్త్యుని బావమరది గంగాధరుడు మహాభారత నాటకమును రచించెను. అతని పుత్రుడు విశ్వనాధుడు సౌగంధికాహరణమును రచించెను. అతని రెండవ పుత్రుడు నరసింహుడు కాదంబరీ కల్యాణాది దశ రూపకములనే కాక కాకతీయ చరిత్రకూడ రచించెను. కాని ఇప్పుడది ఉపలభ్యమానముగలేదు. రావిపాటి త్రిపురాంతకుని ప్రేమాభిరామము కూడ నేడుపలభ్యమానమగుటలేదు కాని అనువాదమైన క్రీడాభిరామము ఆంధ్రవాఙ్మయమున సుప్రసిద్ధమైనది. విద్యానాధుడు రచించిన ప్రతాపరుద్రయశోభూషణము ఆలంకారికగ్రంథములలో మకుటాయ మానమైనది. విద్యానాధుడు ప్రతాపరుద్రుని ఆస్థానకవియై తన ఆలంకారిక గ్రంథమున ఎన్నోసమకాలీన చారిత్రకాంశములను వర్ణించెను. ఆతని అలంకార గ్రంథము ప్రతాపరుద్రుని కీర్తిచంద్రికలు యుగయుగాంతరములు ప్రతిఫలించుచున్న మణిదర్పణము. జాయప సేనాని గణపతిదేవుని గజసాహిణి గీతరత్నావళి వాద్యరత్నావళి నేడుపలభ్యమానములుకావు. కాని ఆతని నృత్తరత్నావళి యుగ యుగాంతరములు దాటి నిలచియున్నది. పాలంపేటయందలి రామప్ప దేవాలయమునందలి విగ్రహ శిల్పములు నృత్తరత్నావళిలో వర్ణితము లైన నాట్యభంగిమల కుదాహరణప్రాయములని విద్వాంసుల

అభిప్రాయము. అగస్త్యుడు కృష్ణచరితను గద్యములో రచించెను. అతని మేనల్లుడు నరసింహుడు మలయవతి అను గద్యకావ్యమును రచించెను. కొలని రుద్రదేవుడు రాజరుద్రీయమను వ్యాకరణకావ్యమునురచించెను.

## కాకతీయ యుగము - ఆంధ్ర వాఙ్మయము

నన్నయభట్టు - ఆంధ్రమహాభారతమున ఆదిసభాపర్వములు ఆరణ్యపర్వము కొంతభాగము రచించినపిమ్మట సుమారు రెండుశతాబ్దులవరకు భారతము అసంపూర్ణముగనే నిలిచెను. ఈ మధ్యకాలములో తెలుగులో వాఙ్మయకృషి జరుగలేదనిచెప్పుట సాహసము. నన్నయకుపూర్వమునుండి శాసనకవులు చరిత్రలో కన్పించుచున్నారు. కాకతీయయుగమునగూడ శాసనకర్తలైన తెలుగుకవులు పలువురు గలరు. ఛందోబద్ధమైన పద్యములలో చెక్కిన శాసనములున్నవి. ఆ పద్యకర్తల నామధేయములు బహుళముగా అజ్ఞాతములే. కాని, క్రీ. శ. 1145 చేబ్రోలుశాసనకర్త భీమయపండుడు 'మార్గ', 'దేశి' కవితావిశారదుడు. మయూరార్యునిపుత్రుడు - ఈశ్వరభట్టోపాధ్యాయుడు, మల్యాలవంశ ప్రశస్తిరచయిత సుప్రసిద్ధకవి. అతడు విచిత్రకవితాప్రవీణుడు. శబ్దవిద్యాపారంగతుడు. సంస్కృతశ్లోకములేగాక, అతడు సవిస్తరమైన తెలుగుగద్యలుగూడ రచించెను. రెండవబేతరాజు గూడూరుశాసనము, గంగాధరుని కరీంనగరంశాసనము, కాటరాజు ఉప్పరపల్లిశాసనము, ఓపిలిసిద్ధి కొణిదెనశాసనము జగతీపతి గంగయ దేవుని తాళ్ళ- ప్రొద్దుటూరు శాసనములు రచించిన అజ్ఞాతకవులు వెలయించిన పద్యగద్యశిల్ప ప్రావీణ్యము ఉగ్గడింపదగినది.

కాకతీయసామ్రాజ్యము ఆంధ్రసంస్కృతికి కల్పించిన ముత్యాలగొడుగునీడలో ఆంధ్రసాహిత్యమునకు పునర్వికాసమేర్పడినది. వీరశైవము దేశికవితారచనలకు దోహదము కల్పించినది. మార్గదేశి కవితామార్గముల ఉభయత్ర రామాయణకృతులు తెలుగులో ఆవిర్భ

వించినవి. అంతేగాక - కవిబ్రహ్మగా ఆంధ్రసాహితీజగత్తులో ప్రశస్తి గాంచిన తిక్కన ఆంధ్రమహాభారతము పదునైదుపర్వములు వ్రాసినది కాకతీయయుగమునందే. తిక్కనపితామహుడు మంత్రిభాస్కరుడు - పండ్రెండవశతాబ్దిలో పేరుకెక్కిన కవి.

సారకవితాభిరాము గుంటూరువిభుని
మంత్రి భాస్కరు మత్పితామహునిఁ దలచి
యైన మన్ననమెయి లోకమాదరించు
వేళ నా కృతి గుణములు వేయునేల ?

అని ప్రస్తుతించెను. అయిన సారకవితాభిరాముడైన యీ మంత్రిభాస్కరుడెవ్వరు ? అతని కృతులెవ్వి ? తిక్కనమాటలనుబట్టి యతడు మిక్కిలి సుప్రసిద్ధుడైయుండవలెను. భాస్కరరామాయణ కృతికర్తయైన భాస్కరుడే తిక్కనపితామహుడని కొందఱు ఊహించుచున్నారు. అట్లయిన, ఉత్తరరామాయణ ప్రసక్తివచ్చినపుడుగూడ తిక్కన ఎత్తటిదైనను ధీరోదాత్తనృపోత్తముడు రాముని చరితము సంభావ్యమగునని పల్కెనుగాని పితామహుని పూర్వరామాయణ రచననుగూర్చి యేమియు చెప్పక మౌనముద్ర వహించెను. దీనినిబట్టి తిక్కనపితామహుడు సారకవితాభిరాముడు కావచ్చును గాని రామాయణ కృతికర్తకాదని మరికొందరు వాదించుచున్నారు. తిక్కన పితామహుని కృతులు - నేడు ఉపలభ్యమానములుగావు. ఒకవేళ ఆతడు రామాయణమును వ్రాసియున్నను అది నేడు ఉపలభ్యమానము గాదు. నేడు భాస్కరరామాయణముగ లోకములో ప్రచారముననున్న గ్రంథము వేరు.

మల్లికార్జున పండితారాధ్యకృతమైన శివతత్త్వసారము శైవవాఙ్మయమునకు తొలియుషస్సులు కల్పించినది. శివతత్త్వసారమును శతకముగ కొందరు వర్గీకరించెదరుగాని అది 479 కంద పద్యముల సమాహారము. మల్లికార్జునుడు నిస్సంశయముగ గొప్పప్రజ్ఞా

శాలియేగాని ప్రజ్ఞయంతయు స్వమతస్థాపన - పరమతఖండనలతో నిండిపోయినది. శివతత్త్వసారమును రచయితయే కన్నడమునకు అనువదించెను. ఇతని ఇతరకృతులు రుద్రమహిమ, గణసహస్రమాల, పర్వతవర్ణన నేడు అనుపలభ్యములు.

శైవవాఙ్మయము :— కాకతీయయుగమున పేర్కొనవలసినది శైవవాఙ్మయము. "దేశికవిత"కు "జానుతెనుగు"నకు వారు కల్పించిన ప్రాముఖ్యము ఉగ్గడింపదగినది. ఆంధ్రవాఙ్మయమున ద్విపదకవితా శాఖను పాదుకొల్పిన ప్రతిష్ఠ శివకవులకు దక్కవలసినదే. ద్విపద రెండుపాదాల చిరురచన. సులభఛందస్సు. పాడుటకు అనువైనది. జనసామాన్యములో ప్రచారమునకు మిక్కిలి అనువైనసాధనము. ఈ ఛందస్సు నన్నయకు ముందే తెలుగులో కన్పించుచున్నది. గుణగ విజయాదిత్యుని శాసనములలో (క్రీ. శ. 848-92) తరువోజ కన్పించుచున్నది. ద్విపద రెండుపాదములుకలిసి తరువోజ ఒకపాదమేగనుక ద్విపద తెలుగులో అనాదిసిద్ధమైన ఛందోవిశేషముగ నెన్నదగును.

పాల్కురికి సోమన - బహుముఖ ప్రతిభాశాలి. అతని కాలమును గూర్చి పండితులలో ఏకవాక్యత కుదురలేదు - కొందరాతడు ఓరుగల్లు పతనానంతరము కన్నడదేశమునకు వలసపోయినట్లు భావించుచున్నారు. అతని కావ్యములందలి అంతరంగిక సాక్ష్యమునుబట్టి అతడు తిక్కనకు పూర్వీకుడని నిర్ణయించవచ్చును. ఇతడు బహుభాషాకోవిదుడు. సర్వతోముఖ ప్రజ్ఞాశాలి.

సంఘమున నొక ప్రత్యేకమతమును వెలయించినట్లే శైవులు వాఙ్మయమునఁ గూడ నొక స్వతంత్ర సారస్వతోద్యమమును నెలకొల్పినారు. "గద్యపద్య సంస్కృతభూయిష్ఠప్రబంధరచన, మానుగా సర్వసామాన్యంబుగాద"ని పాల్కురికి సోమనాథుని ప్రవచనము. ఈమాట నన్నయనెత్తిపొడుపు. తిక్కన తన తొలికావ్యమగు నుత్తరరామాయణమును నిర్వచనముగనే రచించెను.

"ప్రాసమైనను యతిపై వడియైన
దేసిగా నిలిపి యాదిప్రాస నియతిఁ
దప్పకుండగ ద్విపదలు రచియింతు"

ఇది పండితారాధ్యచరిత్ర యవతారికలో సోమనాథుని ప్రతిజ్ఞ. తెలుఁగుకవితకు ముఖ్యలక్షణములు యతిప్రాసలు. తెలుఁగు ఛందస్సునకుఁ బ్రత్యేకత నిర్ణీతగురులఘు పరంపరానుపూర్వి సంకలితమగు గణములు గాక మాత్రాబద్ధములగు గణములు. తెలుఁగుయతి సంస్కృత యతి' కంటె విశిష్టము. సోమనాధుడు, 'ప్రాసము యతి 'దేసి'గా నిలిపి, యని యర్థవంతమైన వాక్యము ప్రయోగించెను. విరామపూర్వకమైన సంస్కృతయతిగాక వర్ణసాజాత్యపూర్వకమైన తెలుఁగుయతినే పాటింపవలెను. తెలుఁగు నుడికారపు నిసర్గతను గుర్తించి తదనుగుణముగ వ్రాయుట 'దేశి' కవిత. 'దేశి' కవితాశాఖ సంస్కృతవాఙ్మయమర్యాదకులోఁబడదు. ప్రాసనియతి సంస్కృత వృత్తములలోలేదు. అది తెలుఁగు కవితకుఁ బ్రత్యేక భూషణము. నన్నయ సంస్కృతములోని ఛందస్సులను గ్రహించి వానికిఁ దెనుఁగు యతిప్రాసలు చేర్చి భారతములో వాడెను. కాని శుద్ధదేశి కవితా వాదులగు సోమనాథాదుల కిదినచ్చలేదు. వారు శుద్ధదేశీయమైన ఛందస్సులో ద్విపదలో వ్రాసినారు. మాత్రాగణబద్ధములైన పద్యములు జాతులు "జాతులు మాత్రానుసంధానగణ వినీతులు గాన" మాత్రాగణ బద్ధమైన ద్విపదలో శుద్ధదేశిగా కావ్యము లల్లెదనని సోమనాథుని ప్రతిజ్ఞ.

"ఉరుతర గద్య పద్యోక్తుల కంటె
సరసమై పరగిన జాను తెనుంగు
చర్చింపగా సర్వసామాన్యమగుటఁ
గూర్చెద ద్విపదలు గోర్కిదైవార"

"ఉరుతరగద్యపద్యోక్తులు" - నన్నయవని గుర్తింపవచ్చును! శివకవులకాలమునకు అవి సర్వసామాన్యము గాకపోయినవి. భాషా ప్రయోగమున శివకవులు ప్రతిపాదించిన క్రొత్తసూత్రము "జాను తెనుఁగు" "సరళముగాఁగ భావములు జానుతెనుంగున నింపుపెంపుతో బిరిగొన"- వ్రాయవలెనని కుమారసంభవ పీఠికలోని మాట. సోమనాథుఁడు పండితారాధ్యచరిత్రమున "జానుతెనుఁగు విశేషము ప్రసన్నతకు" అని ప్రతిపాదించినాఁడు. సోమనాథుఁడే వృషాధిపశతకమున జానుతెనుఁగునకుదాహరణప్రాయముగ వ్రాసినపద్యము :

"బలుపోడతోలుసీరయును బాపసరుల్ గిలుపారుకన్ను వె
న్నెలతల సేసుగుత్తుకయునిండినవేలుపుటేరు వల్లుపూ
సలుగల తేసలెంకనని జానుతెనుంగున విన్నవించెదన్
వలపు మదిన్ దలిర్ప బసవా బసవా బసవా వృషాధిపా!"

ఈ పద్యమునుబట్టి జానుతెనుఁగన నచ్చతెనుఁగనికొందఱర్థము తీయుచున్నారు. కాని, యీ నిర్వచనమునకుఁ గుమారసంభవమేగాక యీ సోమనాథుని బసవపురాణము పండితారాధ్యచరిత్రముగూడ నపవాదములే. నన్నెచోడుఁడు సోమనాథుఁడుకూడ వారి జాను తెనుఁగు కావ్యములలో సంస్కృతసమాసములు కుప్పతిప్పలుగ బ్రయోగించినారు. మరికొందఱు జానుతెనుఁగనఁ దేటతెనుఁగని యర్థము నిచ్చుచున్నారు. 'జానుతెనుఁగు' 'తేటతెనుఁగు' - మాటలరెంటిని విడి విడిగా సోమనాథుఁడే ప్రయోగించినాఁడు. జానుతెనుఁగు, తేటతెనుఁగు అనగా సులభముగా నర్థమగుతెనుఁగు-అని సూర్యరాయనిఘంటువులో వివరణము గలదు. కాని, శివకవుల జానుతెనుఁగు కావ్యములలో సులభగ్రాహ్యములుగాని సంస్కృతసమాసములేకాక, కన్నడ భాషా పదములు శ్రుతిస్మృతివాక్యములు పెక్కులు గలవు.

శివకవులువాడిన భాషకుఁ గొన్ని ప్రత్యేకధర్మములు గలవు. వారిదృష్టిలోఁ దెనుఁగుభాషను శాసించుటకు సంస్కృతవ్యాకరణమునకు హక్కులేదు. తెలుగుభాషలో సహజసిద్ధముగ వాడుకలోనున్న పదములు, సంస్కృతవ్యాకరణసమ్మతములు గాకపోయినను, శివకవులు కుప్పతిప్పలుగ వాడినారు.

"నల్లవో బసవన్న నందీశమూర్తి
నల్లవో బసవయ్య ముల్లోకవంద్య
కట్టితి సర్వాంగ కచ్చడంబనుచు"
"శ్రీమహాదేవుఁడన్నామంబులున్న
వేమహినెటువంటి యితరవేల్పులకు"

— బసవపురాణము.

ఇట్లే "నిత్యపడి, పుడమీశ, భక్తకూటువలు, సద్భక్తసమూహి" ఆకాలపు తెలుఁగుశాసనములలో, నంతకముందుశాసనములలోఁగూడ నిట్టి సమాసములు గానవచ్చుచున్నవి. శివకవుల ప్రయోగసరణి సమకాలీనశాసనములలో గన్పించుటచే నట్టిపదములాకాలమునఁ దెనుఁగునాలుకలపై నలుగుచుండెడివని యూహింపవచ్చును. సహజసిద్ధముగ దెనుఁగువారు వాడుపదములు కావ్యములలో వాడుకొనవచ్చునని వారి యాశయము. జానుతెనుఁగన నిసర్గమైన తెనుఁగు. అందు సంస్కృతపదములుండవచ్చును. ఆ సంస్కృతము సంస్కృతపు ఠీవితోఁగాక తెలుఁగునుడి ననుసరించి చేరును. శివకవులు నన్నయ 'విపులశబ్దశాసనుత్వము నంగీకరింపలేదు. శివకవులు, నన్నయ "గద్య పద్యప్రబంధభూయిష్ఠరచన, యురుతరగద్య పద్యోక్తులు, శబ్దశాసనత్వముపై బూర్వపక్షమును నెలకొల్పి, సర్వతంత్రస్వతంత్రమగు నూత్నసారస్వతోద్యమమును నెలకొల్పిరి. నన్నయ యారంభించిన యాంధ్రమహాభారత మసంపూర్ణముగ నిలిచిపోవలసివచ్చినది.

శివకవులు ప్రతిపాదించిన సారస్వతోద్యమము సార్వజనీనము గాలేదు. సాహిత్యప్రపంచమున భిన్నవాదములు చెలరేగినవి. శైవ యుగములోఁజిట్టచివరనుద్భవించిన కావ్యమురంగనాథరామాయణము. రంగనాథరామాయణకర్త శివకవులను బూర్తిగ ననుసరింపలేదు. ఛందస్సు శుద్ధదేశియగు ద్విపదయేగాని ఇతివృత్తము సంస్కృత రామాయణమే. భాషాప్రయోగస్వాతంత్ర్యమునుబట్టి చూచినను శివకవులవలె విశృంఖల విహారము సలుపలేదు. ఈ కావ్యము వీరశైవమతక్షీణదశను సంస్కృత సాహిత్యగౌరవ పునరుద్ధరణాభి మానమును వ్యక్తము చేయుచున్నది. రంగనాథరామాయణము తిక్కన మహాయుగమునకు వేగుఁజుక్క. ఇట్టి స్థితిగతులలో నన్నయ యారం భించిన మహాభారతమును బూరింప సాహసించు మహాకవి లేకపోయెను. ఈ యుగమందే వేములవాడ భీమకవి సాహసించి భారతమును బూరింపనమకట్టియు విఫలుఁడై యుండవచ్చును. వేములవాడభీమకవి విరాటపర్వమునుండి కొన్నిపద్యములు లక్షణ గ్రంథములందుదాహరింపబడినవి. భారతమువంటి మహేతిహాసరచ నకుఁ గవులందఱు నధికారులుకారు. అది యొక సామాన్యకవి కసాధ్య మైనపని. ఒక సారస్వత పరిషత్తు లేదా పరిషత్తువంటి యొక మహాకవి సాధింపవలసిన కర్తవ్యమది. రాజరాజనరేంద్రునితరువాత వేంగిదేశ మునకు వీరవిజయాదిత్యుఁడు పరిపాలకుఁడయ్యెను. రాజరాజనరేంద్రుని ఆశ్రయమునఁ బెంపొందిన 'రాజమహేంద్ర కవీంద్ర సమాజమున'కు రాజాశ్రయము తప్పినది. ఇకవ్యక్తులెవ్వరు భారతరచనకుఁ దలపెట్ట లేదు. అంతలో శివకవులు చెలరేగి, దేశికవిత, జానుతెనుఁగు వాదములతో నన్నయభారత వాఙ్మయముపై దండెత్తిరి.

రెండు శతాబ్దుల తరువాత నెల్లూరు మండలప్రభువైన మనుమసిద్ధి మహారాజునకు మంత్రిత్వము నెరపిన తిక్కన మహాకవి తిరిగి మహాభారతరచనకుఁ బూనుకొనెను.

"అల్పాక్షరంబుల ననల్పార్థరచన", జానుతెనుగు, "దేశికవిత" "ద్విపదరచన" యను సిద్ధాంతరాద్ధాంతములేగాని వాని యంతస్తత్వ మెట్టిదో, యవియెంతవర కనుసరణీయములో చూపినమహాకవిమాత్ర మంతవరకెవరు లేకపోయెను. అసలంతరార్థము గుర్తింపక, వృథా వాగ్వివాదములలోఁబడిన సారస్వతోపాసకులందఱ నేకోన్ముఖము చేసి యన్ని వాదములలోఁ గల సత్యమును సమన్వయించిచూపిన సారస్వతాచార్యుఁడు తిక్కన. నిజమున కుత్తమ సాహిత్య గౌర మౌచిత్యపరిపాలన, భావనాపాటవము రసప్రతీతిపైనను, గావ్యమున కంగభూతములైన జాతీయము పలుకుబడి నుడికారము పైన నాధార పడియుండును. వీనిలో నే యేకదేశమునో గ్రహించి, ఛందస్సుపైననో, భాషపైననో, యధికనిష్ఠచూపిన కవికి సాహితీసృష్టిలో నేకదేశసిద్ధి మాత్రమే లభించును. అట్లుగాక, పరిపూర్ణసిద్ధి పొందిన మహాకవితిక్కన. ఈ సత్యమునే తిక్కన తన తొలికావ్యమైన నిర్వచనోత్తరరామాయణ పీఠికలో నాచార్యుడై కవితాలోకమునకుపదేశించినాడు. ఈ ప్రబోధము సమకాలీన సాహిత్యమీమాంసలపై విమర్శ. శివకవులు ప్రతిపాదించిన 'జానుతెనుఁగు' దేశికవిత, యల్పాక్షరంబుల ననల్పార్థరచన, మున్నగు సిద్ధాంతములపై నిర్వచనోత్తరరామాయణపీఠిక సాహిత్యసమీక్ష. అంత మాత్రమేగాదు. చిరానుభవముచేఁ దాను గళాధర్మములని గ్రహించిన సూత్రములఁ దిక్కన యాంధ్రసారస్వత జగత్తున కుపపాదించినాఁడు. నిర్వచనోత్తరరామాయణపీఠికయొక్కటే తిక్కనకుఁ దెనుఁగులో నాలం కారికసంఘమున నగ్రగౌరవమునందింపగలదు. ఆనాడు తిక్కనకుఁ గవి గానేగాక కవితాశిల్పవేత్తగా గూడఁ బ్రఖ్యాతి గలదు. సమకాలీన సాహిత్యవాదములపై సుకుమారనిశితవిమర్శ, నిర్వచనోత్తరరామాయణ పీఠికయనువిషయము, శివకవుల కావ్యపీఠికలు, తిక్కన కావ్యపీఠికతో బోల్చిచూచినచో స్వయం వ్యక్తము కాగలదు.

"సరళముగాఁగ భావములు జానుతెనుంగున నింపుపెంపుతో
బిరిఁగొన వర్ణనల్ ఫణితి పేర్కొన నర్థము లొత్తగిల్ల బం
ధురముగఁ బ్రాణముల్ మధుమృదుత్వరసంబునఁ గదళింప న
క్షరములు సూక్తులార్యులకుఁ గర్ణరసాయన లీలఁగ్రాలఁగన్."

కుమార సంభవములోని పై పద్యములోని, 'ఇంపుపెంపు' నకుఁ దిక్కన నిర్వచనోత్తరరామాయణ పీఠికలోఁ బూర్వపక్షమును నెలకొల్పుచు —

"ఎట్టికవికైనఁ దనకృతి యింపుఁబెంపఁ
జాలుఁ గావునఁ గావ్యంబు సరసులైన
కవుల చెవులకు నెక్కినగాని నమ్మఁ
డెందు పరిణతి గల్గు కవీశ్వరుండు." —అనివ్రాసినాడు.

"జాత్యముఁగామి నొప్పయిన సంస్కృత మెయ్యెడఁ జొన్పవాక్యసాం
గత్యము చేయుచో నయిన గద్యముతోడుగఁ జెప్పి వెట్టి దౌ
ర్గత్యము దోపఁ బ్రాసము ప్రకారమువేఱగు నక్షరంబులన్
శ్రుత్యనురూపమంచు నిడ సూరుల కివ్విధమింపుఁ బెంపదే"
— నిర్వచనోత్తర రామాయణము.

"జాత్యముఁగామి నొప్పయిన సంస్కృతమెయ్యెడఁజొన్ప"-అను ప్రతిజ్ఞ శివకవులధిక్షేపించిన "సంస్కృతభూయిష్ఠ రచనకు సమాధానము". "వాక్యసాంగత్యము చేయుచో నయిన గద్యముతోడుగఁజెప్పి వెట్టి-" అను వాక్యము శివకవుల ఆరూఢగద్యపద్యరచనకు, 'ఉరుతర గద్య పద్యోక్తులకు' ప్రత్యుత్తరము. 'ప్రాసముప్రకారము వేరగు నక్షరంబు శ్రుత్యనురూపమంచునిడ', అనునది శివకవులనెత్తిపొడుపు.

సర్వజ్ఞ భక్తివిరహితు
డెవ్వఁడు నుత్కృష్టజాతుఁ డేటికిఁగొఱయే.
— శివతత్త్వసారము.

ప్రాసమున శివకవులు కతిపయ హాల్సామ్య మున్నసరిపడిరి.

అలవడ సంస్కృతశబ్దము
తెలుఁగుబడి విశేషణంబు తేటపడంగాఁ
బలుకునెడ లింగవచనం
బులుభేదింపమికి మెచ్చుబుధజనము కృతిన్

అని నిర్వచనోత్తర రామాయణపీఠికలోఁ దిక్కన పేర్కొనిన కావ్యదోషములు కూడ శివకవులపైఁ బరోక్షవిమర్శయే. తిక్కన నిర్వచనోత్తరరామాయణపీఠికలో "పలుకులపొందు లేక రసభంగము సేయుచుఁ బ్రాతవడ్డమాటలఁ దమ నేర్పుచూపి" అని కుకవి నింద సల్పినాఁడు. తిక్కన పదప్రయోగకౌశలమొక లలితకళ. ఈ కళావైదగ్ధ్యమున కతని రెండుకావ్యములు ఉదాహరణములే. తిక్కన 'రసభంగము' గర్హించి పదములకూర్పుపైఁ దన యభిప్రాయము వెల్లడించెను.

"లలిత పదహృద్యపద్యం
బులన కథార్థంబు ఘటిత పూర్వాపరమై
యలఁతి యలఁతి తునియలు గా
హాళసంధించిన విధమున నమరఁగవలయున్."

అలఁతి యలఁతి తునియలు పూర్వాపరముగఁ గాహాళ నిర్మించినట్లు పదములను ప్రయోగింపవలెనని తిక్కన యాదేశము. అటు ప్రాతవడ్డమాటలుగాని, యిటు వ్యవహారమున నలిగినమాటలన్నియు యథాతథముగఁ బ్రయోగార్హములని తిక్కన చెప్పలేదు. కవితార్థమును గంధవహుఁడు పుష్పదళంబుల సౌరభ మిచ్చుచందమున వికసింపఁ జేయవలెనని తిక్కన యాశయము.

తిక్కనమహాకవి వ్రాసిన మొదటి కృతి నిర్వచనోత్తర రామాయణము. ఆ కావ్యమును తిక్కన నిర్వచనముగా వ్రాయుటకు ఉరుతర

గద్యపద్యోక్తులపై శివకవులు సల్పినదాడియే కారణము. తిక్కనమార్గ దేశి వాదములను అనుసంధించి ఉభయతారకముగ కవితచెప్పనుద్యుక్తు డయ్యెను. అట్లే సంస్కృతకవులకు తెలుగు కవులకు గూడ మిత్రుడై తిక్కన "ఉభయకవిమిత్రు" డయ్యెనని దశకుమారచరిత్రలో కేతన కృతిపతిని ప్రశంసించెను. ప్రాచీనభారతీయ విజ్ఞాన సర్వస్వమనదగిన భారతమున పదునైదుపర్వములు రచించి తిక్కన చరితార్థుడయ్యెను. తిక్కన నాటకీయశైలికి మూలపురుషుడనియు, సంభాషణచాతురి, సజీవ పాత్ర చిత్రణ చతుర్విధాభినయ వర్ణనాత్మకమైన కథనము తిక్కన కవితా శిల్పమున ప్రాముఖ్యము వహించు ననియు అభిజ్ఞుల అభిప్రాయము.

కేతన, దశకుమారచరితమను పద్యకావ్యమురచించి తిక్కనకు అంకితమిచ్చెను. సంస్కృతమున దండి రచించిన గద్యకృతికి ఇది స్వేచ్ఛానువాదము. మూలముగద్యమైనను, ఆంధ్రీకృతి పద్యకృతిగనే వెలయుట గమనింపదగిన అంశము.

తిక్కన భారతముతోపాటు కాకతీయయుగమునకు వన్నెపెట్టి నది భాస్కరరామాయణము. భాస్కరరామాయణ రచనాకాలము - కర్తృత్వనిర్ణయము వివాదగ్రస్తవిషయములు. భాస్కరరామాయణము పంచకర్తృకము. మల్లికార్జునభట్టు (భాస్కరునిపుత్రుడు) కుమార రుద్రదేవుడు (మారయపుత్రుడు) భాస్కరుడు, హుళక్కిభాస్కరుడు, అయ్యలార్యుడు (శాకల్యమల్లుభట్టు వంశీయుడు) ఈ పంచకవులు సమకాలీనులుకారు. కావున భాస్కరరామాయణము ఈ కవిపంచక సమష్టిసహకారకృషియుకాదు. అయ్యలార్యుడు, దేవరకొండలో పెదవేదగిరినాయనింగారి ఆస్థానకవి. పదునైదవశతాబ్ది ప్రథమపాదము నకు చెందినవాడు. ఈతడు, పెదవేదగిరినాయనింగారి ప్రోత్సాహము చొప్పున హుళక్కిభాస్కరుడు రచింపగలిగిన యుద్ధకాండమును రచించినట్లు పలుతాటాకు ప్రతులనుండి గ్రహింపనగును. కుమార

రుద్రదేవుడు, సాహిణిమారుని కుమారుడు. సాహిణిమారుడు ప్రతాప రుద్రునిసేనాని. క్రీ.శ. 1311 సం.లో నెవలికళ్ళు (సత్తెనపల్లి తాలూకా) శాసనమున ఆతనిపేరు కలదు. మల్లిఖార్జునభట్టు - బాల, కిష్కింధ సుందరకాండలు రచించినకవి- కుమారరుద్రదేవునకు పూర్వికుడని చెప్పవచ్చును. భాస్కరరామాయణము సాహిణిమారునకు అంకితమైనట్లు ఐతిహ్యకథనము. కాని అంతరంగిక సాక్ష్యమీ జనశ్రుతికి భిన్నముగ గన్పించుచున్నది. మల్లిఖార్జునుడు తనకృతిని శివునకంకితమిచ్చినట్లు తోచుచున్నవి. అర్వాచినకాలమున వ్రాయసగాండ్రు సాహిణిమారున కంకితమైన పద్యముల ప్రక్షేపించినట్లు ఊహింపనగును. అరణ్యకాండ వ్రాసినది భాస్కరుడు. అయోధ్యకాండ కుమారరుద్రదేవుని కృతముగ ముద్రితప్రతియందు- పలుతాటాకుప్రతులయందును గలదు. కాని పలువ్రాతప్రతులయందును తాటాకుప్రతులయందును అయోధ్య కాండ భాస్కరకృతమనియేగలదు. కారణాంతరములచే చిరుమార్పులు చేసి, కుమారరుద్రదేవుడు అయోధ్యకాండను తనతండ్రియైన సాహిణి మారునకంకితముగ స్వకీయరచనగ భాసించునట్లు చేసెనని అభిజ్ఞుల అభిప్రాయము. అయ్యలార్యుడు వినా, భాస్కరరామాయణకవులంద రును కాకతీయయుగమునకు చెందినవారే.

భాస్కరరామాయణము, కవిత్రయభారతమువలెనే కేవలయథా మూలముగాదు. యథేచ్ఛానుసరణము. శైలి ఐతిహాసిక సౌలభ్యముతో గంభీరముగ నడచును. ఏకకర్తృకము కాకపోవుటచే శైలీభేదము గన్పింపకతప్పదు. భాస్కరకృతమైన అరణ్యకాండ భాస్కర రామాయ ణమునకు మకుటాయమానమైనది. మల్లిఖార్జునుని శైలి సంస్కృతసమాస భూయిష్ఠము. హుళక్కి భాస్కరుని కథా కథన దక్షత పేర్కొనదగినది. వీరరసప్రధానమైన ఆతని యుద్ధవర్ణనలు సుప్రసిద్ధములు. అయ్యలార్యుని శైలి హుళక్కి భాస్కరుని అనుసరించినది. అర్వాచీనయుగములలో

ఆంధ్రవాఙ్మయమున పలురామాయణములు ఉద్భవించినను, భాస్కర రామాయణము తెలుగువారి హృదయకుహరములను వీడలేదు.

ద్విపదవాఙ్మయమున సుప్రసిద్ధమైనది రంగనాథరామాయణము. రంగనాథరామాయణ రచనాకాలము కర్తృత్వము వివాదగ్రస్త సమస్యలేయైనను తెలుగుహృదయాల తరతరాలుగ ఉఱ్ఱూతలూగించిన ఆకావ్యము కాకతీయయుగమునకు చెందినదనుట నిర్వివాదము. రంగనాథుడనుకవి ఈ రామాయణమును రచించినట్లు జనశ్రుతి. శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి ప్రభృతు లీ జనశ్రుతిని బలపరచుచున్నారు. గ్రంథమునందలి అంతరంగిక సాక్ష్యము వేరుగనున్నది. కో (గో) న బుద్ధరాజు తండ్రియైన విఠలరాజుపేర వెలయించినట్లు గ్రంథములో కంఠోక్తిగ గలదు. బుద్ధరాజు గోనకాటరాజ వంశీయుడు. గణపతిదేవుని సేనాపతులలో ఒకడు. క్రీ. శ. 1277 సం.లో మహబూబ్‌నగర్ మండలమునందలి బోతపూర్ శాసనమున - పల్యాలగుండుని భార్య కుప్పాంబిక తండ్రియైన గోనబుద్ధరాజును పేర్కొనుచున్నది. అందుచే రంగనాథరామాయణము క్రీ. శ. పదుమూడవ శతాబ్దియందు వెలసినదని యెంచవచ్చును.

తిక్కన నిర్వచనోత్తర రామాయణము కీ. శ. 1260 ప్రాంతము నాటి దనుట నిర్వివాదము. తిక్కన ఉత్తరరామాయణము వ్రాయు టకు భవ్యకవితావేశమును కల్పించినది రంగనాథరామాయణమని కొందరు పండితుల అభిప్రాయము. బుద్ధరాజు-అద్వితీయప్రతిభాశాలి. రంగనాథరామాయణము వాల్మీకిరామాయణము ననుసరించినను, ఎడనెడ సులోచనావృత్తాంతమువంటి అమూలకథలును గలవు. పూర్వ రామాయణములు బుద్ధరాజువ్రాయుగ, ఉత్తరరామాయణమును కాచ, విఠల దేవులు- బుద్ధరాజుపుత్రులు రచించినట్లు గ్రాంథికకథనము. ఉత్తరకాండ కవితాపాకమున రంగనాథరామాయణముతో సరితూగ

జాలదు. శివకవులు ఆరంభించిన దేశికవిత జానుతెనుగు వాదములు రంగనాథరామాయణమున పరాకాష్ఠ చెంది సఫలీకృతిమైనవి.

భారతరామాయణములతో పాటు పురాణములు గూడ కాకతీయ యుగమున వర్ధిల్లినవి. తిక్కనకు - ప్రత్యక్షశిష్యుడైన మారన మార్కండేయపురాణమును ఆంధ్రీకరించెను. ఇదియు - కేవలమూలానువాదముగాక యథేచ్ఛానుసరణమే మార్కండేయ పురాణోక్తమైన ప్రవరాఖ్యానిగాథ, అర్వాచీనకాలమున మనుచరిత్రకు ఆద్యప్రకృతి యైనది. అట్లే హరిశ్చంద్రునికథ

తిక్కన విజయసేన కావ్యము నిర్మించినట్లు జనశ్రుతి. చిమ్మపూడి అమరేశ్వరకవి విక్రమసేనకావ్యము రచించెను. ఇది నేడు అనుపలభ్యము. అయినను పలువురుకవులు అమరేశ్వరుని పూర్వకవిగ ప్రస్తుతించి యుండుటచే, పలువురు ఆలంకారికులు పేర్కొని యుండుటచే అమరేశ్వరుడు ఆకాలమున మిక్కిలి సుప్రసిద్ధుడైన కవియని చెప్పవచ్చును. క్రీ. శ. పదునాల్గవ శతాబ్దికి చెందిన వినుకొండవల్లభామాత్యుడీతని కవిత్రయముతోపాటు ప్రస్తుతించెను.

మంచెనకవి కేయూరబాహు చరిత్రమును రచించెను. ఇది రాజశేఖరుని విద్ధసాలభంజిక రూపకమును అనుసరించిన పద్యకృతి. మంచెనకేయూరబాహు చరిత్రలో పంచతంత్రమునందలి కథలను అల్లిబిల్లిగ అల్లెను.

"బాలరసాలసాలనవపల్లవకోమల కావ్యకన్యకన్
గూళలకిచ్చి అప్పడుపుకూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైననేమి గహనాంతరసీమలఁ గందమూల గౌ
ద్దాలికులైననేమి నిజదారసుతోదర పోషణార్థమై"

అన్న సుప్రసిద్ధపద్యము- పోతనకవికృతముగా జనశ్రుతిలో ప్రచారములోనున్నది- మంచెనకవి విరచితమే. కేయూరబాహు చరిత్రము మంచెన వెలనాటిచోడుల మంత్రిగనున్న నండూరి గుండనకు అంకితమిచ్చెను.

### లక్షణ గ్రంథములు

కాకతీయయుగమున ఛందోవ్యాకరణాలంకారిక గ్రంథములు గూడ వర్ధిల్లినవి. కేతన రచించిన ఆంధ్రభాషాభూషణము ఉదాహరణ ప్రాయము. ఇది ఆంధ్రవాఙ్మయమున తొలి లక్షణగ్రంథము. నన్నయ విరచితమని చెప్పబడుచున్న ఆంధ్రశబ్దచింతామణి సంస్కృతగ్రంథమే గద. మల్లియరేచన కవిజనాశ్రయము ఛందోగ్రంథము కవి వాగ్బంధము- తిక్కన విరచితమైన ఛందోగ్రంథము ఉపలభ్యమానము గాదు. కేతన విజ్ఞానేశ్వరీయమునందలి వ్యవహారకాండను ఆంధ్రీకరించెను. విజ్ఞానేశ్వరీయము యాజ్ఞవల్క్యస్మృతికే వ్యాఖ్యానము. (1)

యథావాక్కుల అన్నమయ్య సర్వేశ్వరశతకము క్రీ. శ. 1242 సంవత్సరమున రచింపబడినట్లు గ్రంథస్థముగనున్నది. శివభక్తి ప్రధానమైన ఈశతకము (143 పద్యములున్నను) ఆంధ్రవాఙ్మయమున ఉపలభ్యమానమైన శతకములలో మొకటిదని చెప్పుదురు.

పాల్కురికి సోమన వృషాధిపశతకము - ఆంధ్రవాఙ్మయమున విశిష్టమైనది. ఇందు సోమన బహుముఖ ప్రజ్ఞాధురీణత వెల్లివిరిసినది.

కాకతీయయుగమునందలి ఆంధ్రవాఙ్మయమునకు విశిష్టత చేకూర్చినవి ఉదాహరణకృతులు. విభక్త్యంతములతో వృత్తములు కళికలు ఉత్కళికలు గల దేశిరచన ఉదాహరణకృతి. రావిపాటి త్రిపురాంతకుని త్రిపురాంతకోదాహరణము, పాల్కురికి సోమన బసవోదాహరణము - ఉపలభ్యమానములు - ఉదాహరణప్రాయములు. సోమనకృతమైన చెన్నమల్లు సీసములు 32 పద్యము పేర్కొనదగినవి.

ప్రతాపరుద్రవిరచితమైన సంస్కృత గ్రంథము నీతిసారము పేర్కొనదగినది. బద్దెన - నీతిసారముక్తావళిని రచించెను. సుప్రసిద్ధ

(1) యాజ్ఞ్యవల్క్యుడు కల్యాణి నేలిన ఆరవవిక్రమాదిత్యుని ఆస్థానము నలంకరించిన ధర్మశాస్త్రజ్ఞుడు.

మైన సుమతీశతక కర్త బద్దెనయే యని జనశ్రుతి. గణపతిదేవచక్రవర్తి ప్రధాని శివదేవయ్య పురుషార్థసారము రచించెను. ఈ గ్రంథములు నేడు ఉపలభ్యమానములు గాకపోయినను (సుమతీశతకమువినా) మడికి సింగన వీనినుండి తన సంకలనగ్రంథము "సకలనీతినమ్మతము" నందు పలుపద్యముల నుదాహరించెను. ఈ గ్రంథములు కాకతీయ యుగమునందేగాక, యుగయుగాంతరములు ఆంధ్రజనతాజీవితముపై, అత్యధిక ప్రభావమును నెరపినవనుటలో విప్రతిపత్తి లేదు.

## కాకతీయ యుగము

### రాజ్యతంత్రము – రాజనీతి – సైనికవ్యవస్థలు

కాకతీయయుగమునందలి పరిపాలన రాజనీతి సైనికవ్యవస్థల గూర్చిన పలువిషయములు తెలిసికొనుటకు ముఖ్యాధారములు. అల నాటి రాజశాసనములు మాత్రమేగాక రాజనీతి గ్రంథములను గూడ ఎన్నవచ్చును. రాజనీతి గ్రంథములన్నిటికి సంస్కృతమాతృకలే ఆద్య ప్రకృతులైనను, కాకతీయయుగమునందలి రాజ్యాంగవ్యవస్థ – రాజ నీతి అందు ప్రతిఫలించుచున్నవి. ముఖ్యముగా పేర్కొనదగినవి బద్దెన రచించిన "నీతిశాస్త్రముక్తావళి" మడికిసింగనచే సంకలితమైన సకల నీతినమ్మతము.

బద్దెన గణపతిదేవునకు రుద్రమాంబికకు సామంతనృపుడు. మడికిసింగన కాకతీయయుగమునకు చెందినవాడు కాకపోయినను పదునైదవశతాబ్ది ప్రథమపాదమున సంకలనము చేయబడిన అతని గ్రంథము కాకతీయ రాజ్యాంగమును అనుశీలించుటకు మిక్కిలి తోడ్పడ గలదు. అది సంకలనగ్రంథము. అందు బద్దెన నీతిశాస్త్రముక్తావళి నుండియు శివదేవయ్య పురుషార్థసారమునుండియు ప్రతాపరుద్రుని నీతిసారమునుండియు ఏరికూర్చిన అంశములు గలవు. కాకతీయ యుగమునకు చెందిన పైముగ్గురు రచయితలు – గ్రంథైకవిజ్ఞాన

ధురంధరులుగాక, రాజ్యతంత్రము నడపిఅనుభవజ్ఞులైన రాజ్యాంగ వేత్తలు. కావున వారి అభిప్రాయములు సమకాలీన రాజ్యతంత్రముపై రాజనీతిపై రాజ్యాంగవ్యవస్థలపై అపారప్రాభవమును వహించి యుండు ననుటలో విప్రతిపత్తిలేదు.

## సైనిక వ్యవస్థ

కాకతీయరాజ్యాంగవ్యవస్థలో సైనికబలము మిక్కిలి ప్రాధాన్యము వహించినది. కాకతీయులు నెలకొల్పిన సైనికవ్యవస్థ-నాయకవ్యవస్థ-కాకతీయ సామ్రాజ్యపతనానంతరమున శతాబ్దులతరబడి బ్రిటిష రాజ్యనిర్మాణమువరకు అవిచ్ఛిన్నముగ వర్థిల్లినది. అర్వాచీన చరిత్రలో విజయనగరసామ్రాజ్యచరిత్రలో మిక్కిలి ప్రాముఖ్యము వహించిన "నాయంకరవ్యవస్థకు" పునాదులు వేసినది కాకతీయసామ్రాజ్యమే.

## దుర్గములు

రాజ్యసంరక్షణమున "దుర్గములు" మిక్కిలి ప్రాముఖ్యము వహించినవి. రాజనీతి గ్రంథములు చతుర్విధదుర్గములను- గిరిదుర్గ- జలదుర్గ- వనదుర్గ స్థలదుర్గములను పేర్కొనుచున్నవి. దుర్గద్వారములు- గోపురములు - రాజప్రాసాదములు- అంతఃపురములు బురుజులు సురక్షితములైయుండెడివి. దుర్గములన్నియు ప్రాకారసంవృతములై తృణకాష్ఠధాన్యసమృద్ధములై సుశిక్షితవీరభటసందోహసమన్వితములై యుండెడివి. తలారులు నిరంతరము రాజమార్గములనేగాక సందుగొందులగూడ తిరుగాడుచు సంరక్షించుచుండెడివారు. రాత్రులందు తలారులు కాగడాలతో ప్రాకారములను నిరంతరము సంరక్షించుచుండెడివారు. సమీప పర్వతశ్రేణులపై ప్రత్యేకమైన బురుజులు, యాతాయాతజనసమూహ సంచలనముల పరిశీలనకనువుగ నుండెడివి.

సామ్రాజ్య వైభవమీదుర్గపరంపరపై ఆధారపడియుండెడిది. క్రీ. శ. 1290 సంవత్సరమునాటి త్రిపురాంతకశాసనమున కాయస్థ

ప్రభువు అంబదేవుడు "గిరిదుర్గవజ్రనిపాత", "వనదుర్గ దావానల", "జలదుర్గ బడబానల", "స్థలదుర్గ సంచూర్ణ" బిరుదవిరాజితుడు. కాకతీయ సామ్రాజ్యమున అనుమకొండ రాయచూరు గండికోట మున్నగునవి గిరిదుర్గములు కందూరు, నారాయణవనము మున్నగునవి వనదుర్గములు. దివి, కొలను మున్నగునవి జలదుర్గములు. ఓరుగల్లు ధరణికోట మున్నగునవి స్థలదుర్గములు. ఆ కాలమున యుద్ధతంత్రమున దుర్గ సంరక్షణము దుర్గవిభేదనము మిక్కిలి ప్రాముఖ్యమును వహించి, జయాపజయములను నిర్ణయించెడివి.

## చతురంగ బలము

కాకతీయ సామ్రాజ్యమునందలి సైన్యమును సమకాలీన రాజనీతి గ్రంథములు చతురంగబలముగ విభాగించినను, రథములకు చాల కాలము ముందునుండియు కాలదోషముపట్టినట్లు ఎంచకతప్పదు. అందుచే సేనలో గజ తురగ పదాతులే త్ర్యంగములు నిలిచినవి. ప్రతాపరుద్రుని కాలమున కాకతీయసేనలో నూరుఏనుగులు, ఇరువది వేలగుఱ్ఱములు – తొమ్మిదిలక్షల కాల్బలము ఉండెడిది. కాకతీయులు "నవలక్షధనుర్ధరాధీశ్వరు"లనుట సుప్రసిద్ధము. జాయపసేనాని గణపతిదేవుని కాలమున గజసాహిణి. ప్రతాపరుద్రుని అశ్వసాహిణి మారయ. "పట్టసాహిణిరాయ" "మహారాయపట్టసాహిణి" పదవులు శాసనప్రోక్తములు. కత్తి; డాలు; ధనుస్సు; శూలము వీరభటుని ఆహార్యములు.

## నాయంకర విధానము

కాకతీయప్రభువు "నవలక్షధనుర్ధరాధీశ్వరుడై" ప్రబలసేనా నివహము యుద్ధసన్నద్ధముచేసి యుంచుటకు తోడ్పడినది నాయంకర విధానము. తొమ్మిదిలక్షల కాల్బలమంతయు కేవలరాజసేనగాదు. రాజ్యమంతయు, నాయకస్థలములుగ విభజింపబడెడిది. నాయక

వృత్తులుగనున్న భూములు సీమలు - ఈ విధానమునకు ఆర్థికమైన స్తోమత కల్పించినవి. ఈనాయకులు-తమతమ సీమలలో దుర్గములలో చతురంగబలములను పోషించి, యుద్ధసమయమున రాజునకు తోడ్పడు చుండెడివారు. ప్రతాపరుద్రుడు - తన "నీతిసారము"నందు చక్రవర్తి తనసామంతులకు చిన్నగ్రామములిచ్చి, పెద్దనగరములను - తన యధీనమునందుంచుకొని బొక్కసము నభివృద్ధి చేసికొని చతురంగ బలముల పోషింపవలెనని వ్రాసెను. నాయకభృతులు రెండురకములు. నాయకుల స్వకీయపోషణకై చిరుగ్రామములు, చతురంగబలపోషణకై ఏర్పడినవి గ్రామసముదాయములు. బద్దెన, నీతిశాస్త్రముక్తావళియందు సామంతుల సేనలకంటె చక్రవర్తిసేనలు సంఖ్యాబలమున మిన్నయై యుండవలెనని నిర్దేశించెను. సామంతులు ఏఁటేట నిర్ణీతద్రవ్యమును చక్రవర్తి "బొక్కసము"నకు సమర్పింపవలెను. నిర్ణీతసైన్యనివహము యుద్ధసన్నద్ధముచేసి యుంచవలెను. ప్రతాపరుద్రుడు ఓరుగల్లుకోటలోని డెబ్బదియేడు (అయిదు ?) బురుజులను, వెలమనాయకులకు అప్పగించెనను జనశ్రుతి సుప్రసిద్ధము. ఆనాయకులకు భృతులక్రింద రాజ్యమునందు నాలుగవవంతు దత్తమైనది. సమకాలీన సాహిత్యము నుండియు, శాసనాధారములనుబట్టియు కాకతీయసామ్రాజ్యమునందు డెబ్బదిమూడు, లేక డెబ్బదేను, లేక డెబ్బదేడు నాయకులుండెడివారని తెలుచున్నది. అందు అందరును వెలమలుగారు. నాయకులేగాక దండనాథులు - సేనాపతులు శాసనములలో గన్పించుచున్నారు. "గజసాహిణి" "అశ్వసాహిణి" పదములచే కొందరు నాయకులు గజయోధశిక్షణమునందును, అశ్వికయోధశిక్షణమునందును ఆరితేరి ఆయాబలమునకు అధిపత్యము వహించెడివారని యెంచవచ్చును. రాజే సర్వసైన్యాధిపతి. యుద్ధసమయములందు రాజు స్వయముగ సర్వసేనాధిపత్యము వహించెడివాడు. రాణిరుద్రమదేవిగూడ, పురుషవేషమును ధరించి కత్తి, డాలు, విల్లు, శూలము మున్నగు

ఆయుధములు పూని సముచితాహార్యముతో యుద్ధరంగము నలంక రించెడిది. ఓరుగల్లును యాదవరాజు మహాదేవుడు ముట్టడించినపుడు రాణిరుద్రమదేవియే సర్వసేనాధిపత్యము వహించి పోరాడుట సుప్రసిద్ధము.

## లెంకలు

రాజునకు "లెంకలు"- అంగరక్షకులుండెడివారు. వారు రాజు నకు నిత్యసహవ్రతులు. రాజ సంరక్షణము వీరి వ్రతదీక్ష. వారు రాజునకు "పుత్రనిర్విశేషములు". రాజభుక్తశేషము వారి ఆహారము. రాజే వారికి తండ్రి, గురుడు, దైవము. రాజసంరక్షణమే వారి నిరంతర పవిత్రకర్తవ్యము. రాజుతోపాటు వారు రణక్షేత్రమున అరిభీకరముగ పోరాడి రాజరక్షణకై అసువులర్పించెడివారు ఒకవేళ రాజు మర ణించినచో, లెంకలు ఆత్మహత్యయే తమ అవశ్యకర్తవ్యముగ భావించెడివారు. "రాచపినుగు తోడులేనిదే చావదు" అన్న సామెత ఉద్భవించుటకు లెంకలే కారణము. క్రీ. శ. 1045 నాటిశాసనము లెంకలనభివర్ణించుచు, "వారు సత్యసంధులు. స్వామిభక్తిపరాయ ణులు. స్వామిసంరక్షణకై యుద్ధమున ఆత్మబలిదానమునల్పుటయే వారి అవశ్యకర్తవ్యము" అని ఉగ్గడించినది (1) రాజులేగాక, సామంతులు నాయకులు గూడ లెంకలను పోషించుచుండెడివారు. "లెంకవాళి" యను ప్రయోగము లెంకలవిధ్యుక్తధర్మప్రోక్తము. అర్వాచీనచరిత్రలో హాయసాలులుపోషించిన "గరుడుల" కు తెలుగు లెంకలు కులస్వాములు.

వీరులైన విజేతలకు రాజు వీరభృతులను బిరుదులను ఇచ్చి సమ్మానించుచుండెడివాడు. 'కోటగెల్వాటు', ద్వీపిలుంటాక, వెలనాటి దూషక, కాంచీకవాటచూరకార, సూర్యవంశస్థాపనాచార్య-మున్నగు

(1) B 443 of 19 4.

చారిత్రకబిరుదములు సుప్రసిద్ధములు. 'చలమర్తిగండ' 'మూరురాయర గండ' మున్నగు బిరుదములకు ప్రత్యేకలాంఛనములుండెడివి. "గండపెండేరము"- సుప్రసిద్ధవీరలాంఛనము. శత్రుబిరుదములు- వీరలాంఛనములు విజేతకు సంక్రమించుచుండుట అలనాటి సంప్రదాయము గమనింపదగినది. యుద్ధవీరుని ఆహార్యము "పెండ్లి కొడుకు" ఆహార్యముతో సరితూగెడిది.

కాకతీయసైన్యము, అతిభీకరమై సంతతయుద్ధసన్నద్ధమై నవలక్షధనుర్ధరావృతమై వర్ధిల్లినది. వీరసామంతులు, గజతురగ సాహిణులు, "ఏకశంఖంబులు, ఎఱ్ఱగొడుగులు, హనుమంతుపడులు రెడ్డరికములు, గండభేరుండతలాటములు, అరిరాయ గజాంకుశంబులు పసుపుపావడలు, డాలు డమారంబులు, ముత్యాలజగజంపుపంచె వన్నెవాద్యములు గలిగి ఏకాంగి వీరులై సాహిత్యవినోదులై స్వామి ద్రోహరగండలై శత్రుమహీపాలక శిరః కందుక క్రీడావినోదులై" వీర విహారమునల్పిరి. పై ప్రయోగములన్నింటికి నిష్కర్షగ అర్థము చెప్పుట కష్టమైనను, అవి అలనాటి వీరలాంఛన ద్యోతకములనుట తథ్యము.

రావెళ్ళ బిరుదావళిలో

వులువఖానుని (1) సప్తాంగ చూఱకార
మలుకనేమానుని (2) మాన మర్దన

ఉలువఖానుని మాలిక్ కాఫర్‌ను తెలుగువీరులు జయించకపోలేదు. పోతుగంటిమైలి

"ఉప్పర ఫల్లొద్ద నుద్ధతిపైబడి.
ఢిల్లీ తురుమ్కల త్రుళ్ళడంచె"

(1)వులువఖాన్=ఉలూఘ్‌ఖాన్=ఈతడే తుఘ్లుఖ్ పేరి ఢిల్లీసుల్తానయ్యెను.
(2)మలుకనేమాను = మాలిక్ కాఫర్.

అని క్రీ. శ. 1305 నాటి శిలాశాసనమున గలదు. రేచర్ల ప్రసాదాదిత్యుని కొడుకు, "సన్నద్ధ ప్రసరత్తురుష్కపృతనాసందోహ నిర్మూలనోత్పన్నానూన యశుడు"గ అభివర్ణితుడు.

తెలుగు వీరుల కత్తిసాము జగద్విఖ్యాతి నార్జించినది. పట్టుబడిన పోతుగంటిమైలి, తెలుగు బిజ్జలులలో ఎవరు గొప్పవీరులో ముస్లిములే పోల్చుకొనలేకపోయిరి. ఢిల్లీలో ఆ జగదేక మల్లుల ఎక్కటికయ్యము. కత్తిసాము సుల్తాను నిండుకొలువుముందు దాకోలు నందేర్పాటు చేసెను. సుల్తాను అల్లావుద్దీను మాలిక్ కాఫరు తీర్పరులు.

ఢిల్లిలో సురధానుఁడల్లావదీధరా
    ధ్యక్షుండు ప్రత్యక్ష సాక్షిగాగ
మహనీయజయశాలి మలికినేమారుండు
    జగదేకశూరుండు సాక్షిగాగ
జగతిపై డెబ్బదేడుగురు నాయంకులు
    అక్షీణబలయుతుల్ సాక్షిగాగ
సహజ సాహస యుద్ధసన్నద్ధ వరభటా
    శ్రయమైన దాకోలు సాక్షిగాగ
సూర్యవంశోదయ ఖ్యాతుఁడార్య తెలుఁగు
బిజ్జల నృపాలు గెల్చెఁ దద్భీమబలుఁడు
వైరిగజభీముఁడమిత సత్యప్రియుండు
ఘనభుజాశాలియగు పోతుగంటిమైలి.

పై చాటుపద్యము వ్యక్తిగతముగ కాకతీయ సామ్రాజ్యము నందలి వీరులు కత్తిసాములో పౌరుషములో ఎట్టి పరాకాష్ఠస్థితి నార్జించిరో తెల్పుచున్నది. నవలక్షధనుర్ధరులున్న సైన్యము క్రీ. శ. 1323 లో ఓడిపోవుటకు, ఓరుగల్లుపతనమునకు అనేక కారణము లున్నవి. అందులో యుద్ధనీతికి, సైన్యవిన్యాసమునకు కారణములును

గలవు. కాకతీయులు ప్రాచీనసైన్యసంప్రదాయమునననుసరించి సంఖ్యా బలమును, ధనుర్ధరులను నమ్ముకొనియుండిరి. యుద్ధతంత్రము కాల క్రమమున మారుట సహజము. నవలక్షధనుర్ధరాధీశ్వరుడైన కాకతి ప్రభువు నరపతి. తురుష్కులు అశ్వపతులనుట జగత్ప్రసిద్ధము. గుఱ్ఱముపై నెక్కిన రేవంతుడగు ఒక భటునితో పాదచారులైన ధనుర్ధ రులు వందమందిగూడ యుద్ధము సల్పుట కష్టము. పాదచారులు సులభముగా ముందునకుగాని వెనుకకుగాని పోజాలరు. యుద్ధమున ప్రాచీన వీరమర్యాదననుసరించి తెలుగువీరులు ఏకాంగివీరులు. ఆత్మ బలిదానము సల్పిరిగాని వెనుకంజవేయలేదు. ఆశ్వికులకట్టి కష్టము లేదు. అంతేగాక ప్రాచీనవీరమర్యాదలు వారిని బంధింపలేదు. ఆశ్విక బలమును పెంపొందించుకొనకపోవుట ఓరుగల్లు పతనమునకు దారి తీసిన అనేక కారణములలో ఒక కారణము. విద్యానగరసామ్రాజ్య చక్రవర్తులుగూడ నరపతులుగనే విఖ్యాతులు. అయినను శ్రీకృష్ణ దేవరాయలు మాత్రము, ఆశ్వికబలమును పెంపొందించుకొనుటయే గాక అశ్వవర్తకులతో చెలిమిచేసి ద్వీపాంతరములనుండి అశ్వములను దిగుమతి చేసికొనెను. మార్గమధ్యమున మరణించిన అశ్వములకు గూడ ఆ దూరదర్శియైన చక్రవర్తి వెలయిచ్చెడివాడని, చచ్చిన గుఱ్ఱ ముల తోకలు చూపిన వర్తకులకు పూర్తి వెలయిచ్చెడివాడని జనశ్రుతి.

భారతదేశచరిత్ర నేర్పినపాఠము మరువరానిది. చరిత్రలో భారతీయుల ఓటమికి దారితీసిన కారణములలో ఆయుధముల లోటు వాహనములలోటు గాని భటుల పౌరుషపరాక్రమముల లోటుమాత్రము గాదు.

రాజనీతిగ్రంథములనుబట్టి రాజునకుండవలసిన శక్తియుక్తులు సద్గుణసౌశీల్యములు ఎన్నికగాంచవలసినవి. రాజు సమస్త కల్యాణ గుణభద్రుడై ఈశ్వరాంశసంభూతుడై యుండవలెనని ధర్మశాస్త్ర

ప్రవచనము. కార్యఖడ్గనిపుణుడైన గణపతిదేవచక్రవర్తి పూర్ణపురుషా యుషమనుభవించి, జనరంజకుడై పరిపాలననెరపి ఈశ్వరాంశ సంభూతుడను ప్రశస్తి నార్జించెను. రుద్రమదేవిగూడ వీరనారీమతల్లియై వాసికెక్కెను. రాజునకు మంత్రులు చేదోడువాదోడుగనుండి రాజ్య తంత్రమున తోడ్పడిరి. ప్రధాని, మహాప్రధాని, ప్రెగ్గడ అమాత్యుడు, మంత్రి ప్రయోగములు శాసనస్థములు - లభించుచుండెడివి.

తిక్కన కులక్రమానుగతంబయిన మంత్రి పదవితో

"అందలంబు గొడుగు మేల్కట్టు
చామరములు జమిలి శంఖములును
కంబకట్లు భూమి కానికగాగఁ బెం
పెనగు రాచ పదవు లెల్లఁబడసె !"

నని కేతన దశకుమారచరిత్ర యందభి వర్ణించెను. రాజోద్యోగులకు నియోగులని పేరుండెడిది. కాకతీయసామ్రాజ్యమున - డెబ్బది రెండు నియోగములుండెడివి. ఈ నియోగములపై సర్వాధికారికి బాహాత్తరనియోగాధిపతియనిపేరు. తూర్పుచాళుక్యుల కాలమున 'నియోగాధికృతపదవి యుండెడిది. చాళుక్య నియోగాధికృతపదవి కాకతీయులకాలమున బాహాత్తరనియోగాధిపతి పదవిగ మారినది. రాజ్యాంగతంత్రమున మంత్రి సప్తాంగములో ఏకదేశము. "రాజునకు మంత్రి ఏనుగునకు తొండముతో నరిపోల్పదగినవాడు" అని రాజనీతి శాస్త్రప్రోక్తము. మంత్రులు వేదవేదాంగవేత్తలైన బ్రాహ్మణపండితులై యుండుట కద్దు. మల్యాల హేమాద్రిరెడ్డి గణపతిదేవుని మహాప్రధాని. ముప్పిడి నాయకుడు ప్రతాపరుద్రుని మహాప్రధాని. కావున, ప్రధాని పదవికి కులమేగాక సామర్థ్యమే ప్రాధాన్యము వహించెనని చెప్ప వచ్చును. వెల్లంకిగంగాధరుడు రెండవప్రోలరాజు కడ కరణమైయుండి రుద్రదేవుని సమయమున అమాత్య పదవి నధిరోహించుటచే, సమర్థతకు

గల గౌరవ ప్రపత్తులు సుస్పష్టము. మంత్రిగ నియమితుడైన వానికి రాజలాంఛనములు క్రీ. శ. 1251 సంవత్సరమున గణపతిదేవచక్రవర్తి, గంగయసాహిణి బాహాట్టరనియోగాధిపతిగనియమించి, పానుగల్లు కైవారదుర్గములమధ్య ప్రాంతమునాతనికి రాజభృతిగ నిచ్చెను. పిమ్మట ఇందులూరిగన్నయ. కాయస్థసామంతుడు త్రిపురాంతకుడు పొంకలమల్లయప్రెగ్గడ ఈ పదవి నధిష్ఠించిరి. ఈ ఉన్నతపదవికి సంబంధించిన అధికారములు బాధ్యతలు ఎట్టివో నిష్కర్షగ చెప్పుటకు వీలులేదు.

సామ్రాజ్యము నాడులుగ, నాడులు స్థలములుగ విభాగింప బడినవి. స్థలమునందు పండ్రెండునుండి అరువదివరకు గ్రామము లుండెడివి. మానూరుస్థలమునందు పండ్రెండు గ్రామములు, కొండూరు స్థలమునందు పదునెన్మిది, గ్రామములుండెడివి

ఎఱ్ఱమనాయకునకు నాయంకరముగనిచ్చిన స్థలమునందు ఇరువదిరెండు గ్రామములును పల్లినాడు గురిందలస్థలమునందు అరువది గ్రామములుండెడివి.

చదలవాడ, చంద్రూరు, గురిందల, కవిలాసంకోటు, కోట కోవూరు, మహాదేవిచెర్ల, నంద్యాల, పింగళి, రావినూతల, తంగెడ, తేకుబండ్ల, ఇందులాదయ, ఆదర మున్నగునవి శాసనస్థమైన స్థలములు. అనుమకొండనాడు, అయిజనాడు, గొండలనాడు, కమ్మనాడు, కందూరునాడు, కర్నాడు, కుశలనాడు, మారటునాడు, మింగళనాడు, ములికినాడు, పాకనాడు, పల్లినాడు, పొత్తపినాడు, పుంగినాడు, రేనాడు,వెలనాడు, వేంగినాడు, వీనరినాడు, సబ్బినాడు శాసనస్థములు. మహారాజవాడి, మొత్తవాడి, నరవాడి, నతవాడి – ఆరెభూమి మగతల భూమి మున్నగు విభాగములును ఎడనెడ కన్పడుచున్నవి.

## గ్రా మ ప రి పా ల న

ప్రాచీనకాలమున గ్రామసభలు గ్రామపరిపాలన నిర్వహించు

చుండెడివి. కాకతీయుల కాలమునకుముందే గ్రామపరిపాలన 'ఆయగార్ల'ను ఉద్యోగుల హస్తగతమయ్యెను. స్థలములబట్టి ఆయా పదవుల పేరులలో చిరుమార్పులున్నను, మొత్తము మీద 'ఆయగార్ల' పదవులు పంద్రెండుగ ఎన్నవచ్చును.

1. కరణము, 2. పెద్దకాపు = రెడ్డి 3. తలారి 4. పురోహితుడు 5. కమ్మరి, 6. కంసాలి, 7. వడ్రంగి, 8. కుమ్మరి, 9. చాకలి, 10. మంగలి, 11. వెట్టి, 12. చర్మకారుడు.

"నీరుకట్టి=నీటివాడు" కొన్నిగ్రామములలో ఉండెడివాడు. కరణము వ్రాయసగాడు. గడికట్టు ఆయకట్టు లెక్కలు, ఊరి ఆదాయము, పన్నులు మున్నగు లెక్కలనుచూచువాడు. రెడ్డి పన్నులు వసూలుచేయు ఉద్యోగి. తలారి ఊరికి కాపుదల, రక్షకభటుడు. ఆతడు దొంగనుపట్టి శిక్షించి, దొంగసొత్తును సరియగు స్థలమునకు చేర్ప వలెను. దొంగ దొరకకపోయినచో పోయిన సొమ్మును ఆతడే గృహస్థుకు ఇవ్వవలసియుండెను. (State Insurance against theft)

కమ్మరి కుమ్మరి మున్నగు వారలాయాపనులను చేసెడివారు. ఆయగార్లు గ్రామసేవకులే గాని గ్రామాధికారులు గాదు. దేవాదాయ గ్రామములలో, అగ్రహారములలో ఆయగార్లు ప్రభుత్వముతో సంబంధమే లేక - గ్రామమహాజనసభకు, దేవస్థానమునకు లోబడి పనిచేయు చుండెడివారు. అయినను, ఆయగార్లు ప్రభుత్వమునకు ప్రజలకు వంతెనలవలె ఉభయతారకమైన సేవ చేసెడి వారని చెప్పవచ్చును.

'స్థలకరణపదవి' శాసనస్థము. అందుచే అనేక గ్రామసమాహారమైన "స్థలము"నకు ప్రత్యేక కరణము - కార్యాలయము ఉన్నట్లూహింపనగును.

ప్రతాపరుద్రుడు నీతిసారమునందు జనపదముల పరిపాలనార్థము అమాత్యులను నియమింపదగునని వ్రాసెను. వారు రాజప్రతినిధులైన మంత్రులు. గండపెండేరగంగయసాహిణి, జుత్తయవెంక గొంకారెడ్డి

ముప్పిడినాయకులు మహారాజవాడి, నెల్లూరి రాజ్యపాలకులుగ పనిచేసి యున్నారు.

## వ్యవసాయము - నీటి వనరులు.

సప్తసంతానములలో 'తటాక' మొకటిగ ప్రాచీనభారతీయ ధర్మశాస్త్రములు ఉద్ఘోషించుచున్నవి. కాకతీయసామ్రాజ్యము 'తటాక' నిర్మాణమునకు దోహదమొసగినది. కాకతీయసామ్రాజ్యమునకు పూర్వము అచ్చటచ్చట చిరుచెరువులుండెడివి. వ్యవసాయము వాననీటి మీదనే ఆధారపడియుండెడిది. నదీ మాతృకములైన భూములు మిక్కిలి తక్కువ. కాకతీయులే నీటివనరులను నిర్మించి, వ్యవసాయ రంగమున ప్రశాంతవిప్లవమును సాధించిన మొదటిరాజవంశమని చెప్పనొప్పును, విద్యానగర సామ్రాజ్యమువారు కాకతీయులు పెట్టిన ఒరవడినే అనుసరించి దేశమును సస్యశ్యామలమొనర్చి సుభిక్షము చేయ యత్నించిరి. కాకతీయయుగమున వెలసిన తటాకములు - దాతల పేరులపై 'సముద్ర' నామముద్రితములై ప్రసిద్ధికెక్కినవి.

రెండవ బేతరాజు రెండుతటాకములను - సెట్టికెరె (కెరె = కన్నడమునందు చెరువు) కేసరి సముద్రములను నిర్మించి, వరుణ ప్రతిష్ఠ సల్పెను. రుద్రదేవుడు - విధ్వస్త చోడోదయనగరమధ్యమున సువిశాల తటాకమును నిర్మించెను. ప్రతాపరుద్రచరిత్రలో గణపతిదేవుడు నెల్లూరులో, ఏలూరులో, గణపురములో, ఏకశిలానగరములో తటాకముల నిర్మించినట్లు కలదు. రాజులేగాక సామంతప్రభువులు గూడ తటాక నిర్మాణ కార్యక్రమమును భక్తిప్రపత్తులతో కొనసాగించిరి. సామంతు లలో మల్యాలవంశీయులు - రేచెర్ల వంశీయులు ఒనర్చిన కృషి ఉగ్గడింపదగినవి. చావుండసముద్రము, బాచసముద్రము, గణప సముద్రము, కుప్పసముద్రము, బుద్ధునికుంట, కుప్పాంబకాలువ, పోలిరెడ్డికాలువ, దాడ్లకాలువ, పాఖాలతటాకము మల్యాలవంశీయులు

నిర్మించినవే. సబ్బసముద్రము, నామసముద్రము విశ్వనాథసముద్రము గౌరసముద్రము, ఎఱ్ఱసముద్రము, లకుమాసముద్రము, కుడికుడీయ చెరువు, కత్యారెచెరువు, నేరెడ్లచెరువు, ఎఱ్ఱమరజాకుంట మున్నగునవి రేచెర్ల వంశీయులు నిర్మించినవి. ఘోడెయరాయగంగయదేవుడు - అంబదేవుని మహాప్రధాని ఓబలి, ఊటుకూరు - పట్టణములకడ రెండు తటాకములు అంబసముద్రములు నిర్మించెను. లేంబాకకడ; చెయ్యేరు వాగునుండి రాయసహస్రమల్లుకాలువ త్రవ్వించినది అతడే. మరియు తాళ్ళపాకకడ గంగపెండేరకాలువనుగూడ అతడే త్రవ్వించెను. గణపాపురమున రాజగురు శాంతశివదేశికులు గణపసముద్రమును నిర్మించెను.

క్రీ. శ. 1293 సంవత్సరము నాటి త్రిపురాంతక శాసనమున "కుమారసముద్ర" తటాకమునకు 24 మాడలు వెచ్చించినట్లు ఉన్నది. ఈ తటాకములన్నియు వాగులకు అడ్డకట్ట (ఆనకట్ట) వైచుటచే జలాశయములుగ ఏర్పడినవే. కొన్ని తటాకములకు సమీపనదులనుండి కాల్వలు త్రవ్వి నీటి వసరునేర్పాటుచేయుచుండిరి. మూసేటికాలువ ఇమ్మంగడికాలువ, పెనుంబాకరెడ్డి త్రవ్వించిన కృష్ణకాలువ గంగయదేవుడు త్రవించిన చెయ్యేరుకాలువ అట్టివే.

ఒకా నొక శాసనమున ఒక "ఊటకాలువ" కన్పించుచున్నది. శాసనస్థములైన కూచినేనికాలువ, ప్రోలిరెడ్డి కాలువ, రెడ్డికాలువ, దాడ్లకాలువ, మేడవిరుపుంగాల్వ, మద్దిమడ్డికాలువ, రాయసహస్రమల్లు కాలువ, గండపెండేరకాలువ మున్నగునవి కాకతీయయుగమునందలి వ్యవసాయాభ్యుదయసూచనములు.

## పన్నులు

కాకతీయ సామ్రాజ్యమునందున్న పన్నులు ఎన్నో శాసనముల బట్టి తెలియనగును. అన్నిపన్నులకంటె ముఖ్యమైనది భూమిపన్ను. తరువాత ఎన్నదగినవి వాణిజ్యసుంకములు, అరణ్యవస్తువులపై,

పచ్చికబయళ్ళపై పన్నులు. 'దరిశనము', 'అప్పనము', 'ఉపకృతి' 'కానికలు' రాజునకు సమర్పింపవలసినవి. వెలివోలము= వెలిచేను, నీరు నేల, తోంటభూమిగ భూములనువిభజించి పన్నులు వేసెడివారు. శ్రీశైల ప్రాంతారణ్యములను ఛేదించి పంటభూములుగ మార్చినట్లు శాసనాధారములు గలవు. క్రొత్తభూములకు మూడేండ్ల వరకు పన్నుండెడిదికాదు. సంవత్సరమునకు రెండువంతులలో కార్తీకమాసమున వైశాఖమాసమున పన్ను చెల్లింపనగును. పన్నులు ధాన్యరూపమున ధనరూపముననైన చెల్లింపవచ్చును. కోలకాండ్రు - తీర్పరులు ఉండెడివారు. పుట్టికోలుచు, ప్రభుత్వమునకు చెల్లింపవలసిన ధాన్యరూపమైనపన్ను. ధనరూపమైన పన్నుకు పుట్టిపహిండి యని పేరు. దేవాదాయ ధర్మాదాయపు భూములపై పన్నులేదు. లాంఛనప్రాయమైన పర (పల్లపుభూములపై) పంగములను వసూలుచేసెడివారు. పంగమనిన నాలుగవవంతు పరయన ఎనిమిదవవంతు కావచ్చును. పన్నునకు అనాటిపేరి 'అరి'. అరి చెల్లించువారు అరిగాపులు. 'పుల్లరి' పచ్చికపై చెల్లింపవ. సిన పన్ను. పుల్లు=పచ్చిక; అరి=పన్ను. గడ్డుగమాడ, గడ్డుగకానిక, ఉపక్షితి తలారిపన్ను బంతులాయము మేరలు, వర్తనలు మున్నగు పన్నులుండెడివి.

ఉప్పుకోటూరులు చినగంజాము పెదగంజాము కనుపర్తి లేవరాముపల్లి మున్నగుచోట్ల ఉండెడివి. అవి రాజోద్యోగులే నిర్వహించి వర్తకులకు అమ్మెడివారు.

"సుంకర్లు" - సుంకములు వసూలు చేసెడివారుండెడివారు. సుంకర్లు సుంకములపై పాటపాడి, పాటసొమ్ము రాజునకు చెల్లించి సుంకములను తాము వసూలు చేసికొనువారని ఎంచవచ్చును. సుంకకరణాలు ఆ లెక్కలు వ్రాసెడివారు. ఉప్పుపెరికెసుంకము, అమ్ముబడిసుంకము, గానుఫలసుంకము మున్నగునవి శాసనస్థములు.

వాణిజ్య సంఘములు

క్రీ.శ. 1304 వ సంవత్సరమునాటిది క్రీ.శ. 1322 సంవత్సరము నాటి తామ్రశాసనములు కాకతీయ సామ్రాజ్యమునందలి వాణిజ్య సంఘములను పేర్కొనుచున్నవి ఈశాసనములనుబట్టి అవర్తకసంఘముల స్వయంనిర్ణయాధికారము, ఆంతరంగికస్వాతంత్ర్యము ప్రాభవములు వ్యక్తములగుటయేగాక కాకతీయప్రభువులు వర్తకమున కొసంగిన స్వేచ్ఛ, వహించిన తాటస్థ్యము అచ్చెరువు గల్పించును. క్రీ.శ. 1322 నాటి తామ్రశాసనము ప్రతాపరుద్రునినాటిది లోకిసెట్టి పుత్రుడైన అత్తెనకు, అష్టాదశసామయా వర్తకమండలి పన్నుచెల్లింపకుండ వర్తకము చేసికొను సౌకర్యము కల్పించినది.

ఆ వర్తకసంఘము నంద్యాలస్థలములోనిది. అన్నమరాజ, సింగరాజ సుంకకరణములను అత్తెన సంహరించినందుకు వర్తకసంఘమువారు కల్పించిన ప్రతిఫలమది. అట్టిదే క్రీ.శ. 1304 నాటి శాసనము ఆ వర్తకసంఘమే పులియంసెట్టికిగూడ అట్టిసౌకర్యమును వర్తకసంఘ విద్రోహియైన కాదపాకల కాటినాయకుని సంహరించినందుకు ఏర్పరిచినది. (1) ఈ వర్తకసంఘములేర్పరిచిన "శ్రేణిబలము" సామ్రాజ్యమున ఆరవ అంగముగనేర్పడి ఆపత్సమయములలో యుద్ధములందు రాజునకు తోడ్పడుచుండెడివి. 'వీరబలంజ' వర్తకసమితివారి ప్రశస్తిలో 'బల్లాలరాయమర్ధన' ప్రయోగము చరిత్రప్రసిద్ధమైనది. ఈ వర్తకసంఘములకుగల ఆంతరంగికస్వేచ్ఛ, హత్యలు జరుగుచున్నప్పుడుగూడ రాజు కల్పించుకొనకుండుట దురవగాహములు.

(1) A. R. C. P. 0 of 1918—19.

## కా క తీ య సా మ్రా జ్య ము
## మ త ము లు

కాకతీయసామ్రాజ్యమున వర్ధిల్లిన ముఖ్యమతము శైవము. శైవము వేదప్రోక్తమనియు, రుద్రశివుని ప్రశంస వేదములలో గలదనియు శైవులు వచించెదరు. పశుపతి - శివ - రుద్ర శబ్దములు పర్యాయపదములు. పతి - పశు - పాశ శబ్దములు శైవమతమున కాద్యప్రకృతులు. పతి పరమశివుడు. పశు తతికి అధిపతి. పశుతతి పాశబద్ధము. శివుడు పరమేశ్వరుడు. పరతత్త్వము. యోగాచార్యులు-శైవమతస్థాపకులైన గురువర్యులు శివుని అవతారములే. ఇరువది యెనిమిదిమంది యోగాచార్యులలో ప్రథముడు శ్వేతాచార్యుడు. చివరిగురువు లకులీశ లేక నకులీశుడు. ప్రతి యోగాచార్యునకు నలువురు శిష్యులు. శైవమతానుయాయులైన ఆదిమశిష్యులు (28x4=112) నూటపండ్రెండుగురు లకులీశుడు - అంతిమగురువు - కలియుగమున శైవమతప్రచారమునకుద్భవించిన కారణజన్ముడు.

శైవమతమున పలుశాఖలు - కాలాముఖ, కాపాలిక, శైవ, పాశుపత శాఖలు గలవు. కాకతీయయుగమున, ప్రారంభదశలో కాలాముఖశైవప్రాబల్యమున్నను, కాలక్రమమున పాశుపతశైవమే రాజమతమై ప్రజాహృదయమును చూరగొన్నది.

మొదటిప్రోలరాజు (త్రిభువనమల్ల రెండవ బేతరాజు తండ్రి) శైవుడు. అతడు రామేశ్వరపండితుని శిష్యుడు. లకులీశ్వరాగమ మహాసిద్ధాంతనిష్ణాతుడైన రామేశ్వరపండితునకు ఆ మహారాజు వైజనపల్లి గ్రామమును శివపురియనిపేరిడి సర్వకరపరిహారముగ దానమునచ్చెను. రెండవ బేతరాజు ఖాజీపేటశాసనము రామేశ్వరపండితునిగూర్చి మరి కొన్ని విశేషములు తెలుపుచున్నది. క్రీ. శ. 1090 సంవత్సరమున రెండవ బేతరాజు రామేశ్వరపండితునకు సూర్యగ్రహణసమయమున

అనుమకొండ సమీపమునందలి కుగ్రామమును దానముచేసెను. అందు గ్రహీతయైన రామేశ్వరపండితుడు కాలాముఖశైవాచార్యుడు. పర్వతావళిశాఖీయుడు. శ్రీపర్వతమునందలి మల్లికార్జున శిలామఠము నకు చెందిన యోగీశ్వరుడు.

తెలుగుదేశమున కాలాముఖశైవము కాకతీయులకు ముందే వర్ధిల్లుచుండుట తూర్పుచాళుక్యప్రభువు రెండవఅమ్మరాజు (క్రీ. శ. 945-70) తాండికొండ శాసనమువలన తెలియుచున్నది. ఆశాసనములో యుగయుగాలలో లకులీశ్వరులవంటి అవతారపురుషులు శైవ ప్రబోధము సల్పినట్లు గలదు. కాలాముఖశైవములోగూడ శాఖోపశాఖలు గలవు. కాలాముఖయోగీశ్వరుడైన సోమేశ్వరపండితుడు- అబ్లూరు శాసనమున (1) "న్యాయశాస్త్రనిష్ణాత సరోజవనదివాకరుడు" "వైశేషికవార్ధివర్ధనశరత్సుధాకరుడు" "సాంఖ్యాగమప్రవీణ మాణిక్యా భరణుడు"గ అభివర్ణితుడు. దక్షారామమున భీమేశ్వరాలయస్థానాధిపతి రామేశ్వరదేవుడు- త్రిభువనమల్ల (ఆరవ) విక్రమాదిత్యుని సమకా లీనుడు. ఇతడే రెండవప్రోలరాజు గురువైన రామేశ్వరపండితుడు గావచ్చును. ఆదిలో కాకతీయరాజులు- కల్యాణిచాళుక్యుల ప్రభువుల వలె కాలాముఖశైవులు.

రెండప్రోలరాజు శైవుడైనను పరమత సహనముగలవాడు. వైజదండనాథుని పుత్రుడు బేతనప్రెగ్గడ భార్య మైలాంబ జైనకడ లాలయబసతిని నిర్మించెను. (2) రెండవప్రోలరాజు రెండు "మత్తరు"ల భూమిని ఆజైనవసతికి దానము సల్పెను. రెండప్రోలరాజు పుత్రుడు రుద్రుడు, అతని తమ్ముడు మహాదేవుడు పరమమాహేశ్వరులు.

గణపతిదేవునికాలమున కాలాముఖశైవ ప్రాబల్యము తగ్గి పాశుపతశైవప్రాబల్యము అధికమైనది. ఉభయశాఖలకు సమానధర్మము

(1) E I V 220.
(2) E I IX 256.

లెన్నియోగలవు. అయినను, అనుష్ఠానములోగల విభేదములు భిన్నత్వమునకు దారితీసినవి. పాశుపతశైవములో గూడ శాఖోపశాఖలుగలవు. క్రీ. శ. 9 వ శతాబ్దియందే శైవములో శైవులు, పాశుపతులు, కాపాలికులు కారుణికసిద్ధాంతులు ఉండెడివారు (1) గణపతిదేవుని కాలమున గోళకీమఠమునకు చెందిన పాశుపత శైవాచార్యులు రాజగురువులై ప్రజాదరణపొందిరి. విశ్వేశ్వరశివదేశికుడు గణపతి చక్రవర్తికి శివదీక్షాగురువు. రుద్రమదేవి మల్కాపురశాసనమున గోళకీమఠాచార్యుల చరిత్ర సవిస్తరముగగలదు. (2) నర్మదాభాగిరథీ నదీమధ్యదేశమున డాహలమండలముగలదు అందు దూర్వాసయోగి శైవమఠసంస్థాపకుడై వర్ధిల్లెను. ఆ గురుపదంపరలో సద్భావశంభువు వెలసెను. అతడు కాలచురి ప్రభువు యువరాజదేవునివలన త్రిశత సహస్రదేశమును భిక్షావందనముగ బడసెను. అతడు గోళకీ మఠసంస్థాపకుడయ్యెను. ఆ గురుపరంపరలోని సోమశంభువు సకలాగమసింధుసేతువైన "సోమశంభుపద్ధతి" యను గ్రంథమును రచించెను. ఆ గురుపరంపరలో పూర్వగ్రామశిరోమణి, గౌడదేశమందలి రాఢాసీమ వాసి, వేదవేదాంగపారంగతుడైన విశ్వేశ్వరశంభువు గణపతిదేవచక్రవర్తికి దీక్షాగురువయ్యెను. చోళమాళవ కాలచురి ప్రభువులుగూడ ఆగురువర్యుని శిష్యులే. గోళకీమఠాచార్యులు భిక్షామఠసంతానముగ,లక్షాధ్యాయి సంతానముగ అభినుతులు. యువరాజదేవుడు క్రీ శ 940 ప్రాంతమున చేది డాహల (త్రిపురి) మండలములనేలిన కాలచురిప్రభువు. కాలచురి ప్రభువులు యశఃకర్ణదేవునినుండి జయసింహునివరకు (క్రీ. శ. 1174) పాశుపతశైవులై, గోళకీమఠాచార్యులకు దీక్షాశిష్యులైయుండినట్లు జబ్బల్‌పూరు శిలాశాసనకథనము,(3)రాణిరుద్రమదేవి మాల్కాపురశాసనమును బలపరచుచున్నది.

(1) వాచస్పతి మిత్రుడు క్రీ. శ. 850.
(2) కాకతీయ సంచిక
(3) E I XX 309 జబ్బల్‌పూర్ శిలాశాసనము.

రాణిరుద్రమదేవి మాల్కాపురశాసనమున క్రీ. శ. 25-3-1261 తేదీన మందారగ్రామమును (గుంటూరుజిల్లా మందడం) వెలనాటి విషయమందలి కంద్రావతి పల్లపు భూములతోపాటు తండ్రి గణపతి వాగ్దానముమేరకు విశ్వేశ్వరశంభునకు దానముసల్పెను. విశ్వేశ్వర శంభువు ఆ గ్రామమున తనపేర ఒక శివాలయమును శుద్ధశైవమఠ మును అన్నదానసత్రమును కట్టించెను. ఆ గ్రామమున పలువురు బ్రాహ్మణులకు వృత్తులు కల్పించి విశ్వేశ్వరగోళకీమఠమునుస్థాపించెను. ఆ గ్రామమున మఠమునకనుబంధముగ "ప్రసూతి - ఆరోగ్యశాలను" నిర్మించుట గమనింపదగినది.

శైవమఠములు ఆరోగ్యసదనములుగ, విద్యాసంస్థలుగ వర్ధిల్లినవి. విశ్వేశ్వరశంభువు, కాళేశ్వరమున ఉపలమఠము నిర్మించెను. పొన్న గ్రామమును బ్రాహ్మణాగ్రహారముగ కల్పించెను. ఏలేశ్వరపురమున (నల్లగొండ మండలము) కృష్ణానదికి ఈశాన్యప్రదేశమున షోడశావరక మైన మఠము నిర్మించెను. గణపతిదేవుడు ఆచార్యదక్షిణగ కాంద్రకోట గ్రామమును పల్లినాడు సీమలో సమర్పించి, ఒక చలివేంద్రను అన్న సత్రమును నిర్మించెను. ఆంధ్రదేశమునందంతట గోళకీమఠము శాఖోపశాఖలతో విస్తరిల్లినది. భట్టిప్రోలు, త్రిపురాంతకము, పుష్పగిరి మున్నగు స్థలములలో శివాచార్యులు ఆ యా మఠాధిపతులై స్థానాధి పతులై ప్రచారము సల్పిరి. ప్రతాపరుద్రచక్రవర్తి పరమమాహేశ్వరుడు. ఓరుగల్లుపతనముతో దేశము తురుష్కాక్రాంతమైన పిమ్మట గోళకీమఠ ప్రాభవము అస్తమించెను. ఓరుగల్లు పతనానంతరము గోళకీమఠా చార్యుల ప్రస్తావించు శాసనములేమ్యము-

పాశుపతశైవముతోపాటు వర్ధిల్లిన మరియొక శైవశాఖ ఆరాధ్యశైవము. ఇది ప్రాచీనతమమైదికమతముగ అభినుతము. ఇందు ద్వాదశాచార్యులు గలరు. వీరిలో రేవన, మరుల, ఏకోరాములు సిద్ధ త్రయముగ ప్రసిద్ధులు. ఉద్భటారాధ్య, వేమనారాధ్య, విశ్వారాధ్యులు ఆరాధ్యత్రయము. నీలకంఠాచార్య, హరదత్తాచార్య, భాస్కరాచార్యులు

ఆచార్యత్రయము. శ్రీపతిపండిత, మల్లిఖార్జున, మంచన పండితులు పండితత్రయము వీరందరు గృహస్థులు. వీరు వేదవేదాంగపారంగతులు. లింగధారులు. మల్లిఖార్జున పండితుడు క్రీ. శ 1163 నుండి 1781 వరకు వెలనాడును పరిపాలించిన వెలనాటి చోడునకు (చందవోలు రాజధాని) సమకాలీనుడు. పాల్కురికిసోమన, పండితారాధ్యచరిత్ర వ్రాసి, ఈ మహాభాగునిచరిత్ర ద్విపదకావ్యముగ ఆంధ్రవాఙ్మయమున ను ప్రతిష్ఠిత మొనర్చెను. మల్లిఖార్జునుడు (పండితారాధ్యుడు) బ్రాహ్మ్యమునుజ్జగించక పోయినను, భక్తిప్రధానమైన శైవము నంగీకరించి బసవేశ్వరుని మతమును మెచ్చుకొనెను.

"భక్తిమీదివలపు బ్రాహ్మ్యమ్ముతోపొత్తు
వదలలేను నేను బసవలింగ"

అన్నచాటూక్తి తెలుగులో చిరస్మరణీయమై, అలనాటి సాంఘిక పరిణామమునకు నిలువుటద్దమైనది. పాల్కురికిసోమన ప్రభృతులు - కర్ణాటదేశమున నలుగడల విజృంభించుచున్నబసవేశ్వరుని వీరశైవ మును తెలుగుదేశములో ప్రచారమొనర్చిరి. కాని పాశుపతశైవమే రాజమతమై వర్ధిల్లెను.

శైవమతములకు అనుబంధముగ విద్యాసంస్థలు, కళాశాలలు, అన్నసత్రములు, ప్రసూతిఆరోగ్యశాలలు - చలివేంద్రలు వర్ధిల్లి విశ్వ జనీనములైనవి.

శైవముతోపాటు జైనమతము, వైష్ణవమతము కాకతీయ సామ్రాజ్యమున ప్రవర్తిల్లినవి. బసవపురాణమునుబట్టియు పండితారాధ్య చరిత్రనుబట్టియు కాకతీయులకాలమున జైనహింస జరిగినదని ఊహించుటకవకాశములేకపోలేదు. కాని-కర్ణాటదేశమున జరిగిన అత్యాచారములు ఆంధ్రమున జరిగినట్లు చెప్పుటకు ఆధారములు కన్పింపవు. ఏకశిలానగర వాస్తవ్యుడైనఅప్పలాచార్యుడు-జైనుడు జినేంద్రకల్యాణా భ్యుదయమను గ్రంథమును (=ప్రతిష్ఠాసారము) ప్రతాపరుద్రదేవుని

కాలమున రచించెను. (1) కాకతీయయుగమున వైష్ణవమతాచార్యులు పేర్కొనదగినవారుకన్పింపరు. కాకతీయులు కట్టించిన దేవాలయములు పేర్కొనదగినవి. అవి ఈ నాటికి గూడ చూపరుల సంభ్రమాశ్చర్య వివశులచేయుచున్నవి - హనుమకొండ పాలంపేట పిల్లలమఱ్ఱి మున్నగుచోట్ల కాకతీయులు కట్టించిన దేవాలయములు చెక్కించిన శిల్పములు అతిలోకరామణీయకతకు ఉజ్జ్వలోదాహరణములు. జాయప సేనాని నృత్యరత్నావళికి ఉదాహరణపూర్వకముగ చెక్కిన శిల్పభంగిమలు ఆ దేవాలయముల నలంకరించెనని జనశ్రుతి విశ్వసనీయమైనది.

ఏకవీర, మాహూరమ్మ కాకతమ్మ కామేశ్వరి ప్రజాసామాన్యము నాకర్షించిన దేవతలు. కాకతీయులనాటి తెలుగు సంఘము ప్రతిఫలించిన అద్దాలమేడ, "క్రీడాభిరామము". వీధినాటకమను ఈ తెలుగు పద్యకృతి సంస్కృత ప్రేమాభిరామమునకు వినుకొండవల్లభామాత్యుని ఆంధ్రీకృతి. ఇది శ్రీనాథకృతమని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి అభిప్రాయము. ఎట్లైన క్రీడాభిరామము చవివిన అలనాటి ఏకశిలానగరము అచ్చుగ్రుద్దినట్లు చదువరుల మనఃఫలకమున ప్రతిఫలించుననుటలో విప్రతిపత్తి లేదు. టిట్టిభసెట్టి - మంచెనభట్టు అను ఇరువురు మిత్రులు ఏకశిలానగరమును సూర్యోదయమునుండి సూర్యాస్తమయమువరకు పర్యటించి ఆయాసన్నివేశముల అభివర్ణించుట క్రీడాభిరామమునందలి ఇతివృత్తము. ధూళిధూసరితమై, భటువాహనసమ్మర్దమైన రాజమార్గము సందులుగొందులు - రాయవేశ్య ప్రతాపరుద్రుని ఉంపుడుకత్తె మాచలదేవి చిత్రలేఖనములు, కోడిపందెములు, పూటకూళ్ళపెద్దమ్మ రూకకు పెట్టు భోజనము - ఏకశిలానగరమంతయు క్రీడాభిరామమున కన్నులకు గట్టును.

కాకతీయసామ్రాజ్యమునందలి సాంఘికవృత్తముల అనుశీలింప దలచిన విద్యార్థికి క్రీడాభిరామము అవశ్యపఠనీయమైన గ్రంథము.

---

(1) అతడు పుష్పసేనాచార్యుని శిష్యుడు. శక. 1241 ఆదివారము శుక్ల దశమి మాఘమాసమున ఆ గ్రంథరచన పూర్తియైనది.

## శాలంకాయన వంశవృక్షము

- మాధవవర్మ I (440 - 60)
  - దేవవర్మ
    - మాధవవర్మ 48 సంవత్సరములు
  - విక్రమేంద్రవర్మ I (460 - 80)
    - ఇంద్రభట్టారక (480 - 515)
      - విక్రమేంద్ర II (515 - 535)
        - గోవిందవర్మ (535 - 556)
          - మాధవవర్మ II (556 - 616)
            - మంచనభట్టారక

## బాదామి చాళుక్యులు

- జయసింహా I
  - రణరాగ
    - పులకేశి I (543-566)
      - కీర్తివర్మ I 566-597
        - పులకేశి 609-642
          - చంద్రాదిత్య
          - ఆదిత్యవర్మ
          - విక్రమాదిత్య 654-681
            - వినయాదిత్య 681-696
              - విజయాదిత్య 696-734
                - విక్రమాదిత్య II 734-744
                  - కీర్తివర్మ II 744-755
          - జయసింహా
          - అంబెరా
        - విష్ణువర్ధన
        - జయసింహా
      - మంగళేశ 597-609

## పాండ్యులు

1. కడుంగో (590 - 620)
2. మారవర్మ అవనిసులామణి (620 - 645)
3. సెంద (654 - 670)
4. అరికేసరి మారవర్మ (670 - 700)
5. కొక్కడైయాన్ (700 - 730)
6. మారవర్మ రాజసింహ I (730 - 765)
7. జటిలపరాంతక నెడుంజడైయాన్ (756 - 815)
8. శ్రీమారశ్రీవల్లభ (815 - 862)
9. వరగుణవర్మ II (862 - 880)
10. పరాంతకవీరనారాయణ (880 - 900)
11. మారవర్మ రాజసింహ II (900 - 920)

## వాకాటక వంశవృక్షము

వింధ్యశక్తి

|

ప్రవరసేనుడు 280-340

| | |
|---|---|
| గౌతమీపుత్రుడు | సర్వసేనుడు |
| రుద్రసేనుడు 340-365 | వింధ్యసేన = వింధ్యశక్తి |
| పృధ్వీసేనుడు I 365-90 | ప్రవరసేనుడు |
| రుద్రసేనుడు II 390-95 | బాలరాజు |
| ప్రభావతి 395-410 | దేవసేన 460-80 |
| ప్రవరసేన II 410-445 | హరిసేన 480-515 |
| నరేంద్రసేన - 445-65 | |
| పృధ్వీసేనుడు | |

## గాంగ వంశవృక్షము

- కొంగణివర్మ (400)
  - మాధవ I (425)
    - అయ్యవర్మ (450)
      - మాధవ II
      - సింహవర్మ 475
        - అవినీత (500)
    - కృష్ణవర్మ (450)
      - సింహవర్మ (475)
      - వీరవర్మ యువరాజ

# కదంబ వంశవృక్షము

- మయూరశర్మ (345-60)
  - కంగవర్మ (360-85)
    - భగీరథ (385-410)
      - రఘు (410-25)
      - కకుస్థవర్మ (425-50)
        - శాంతివర్మ (450-75)
          - మృగేశవర్మ (470-88)
            - ⋮
              - రవివర్మ (500-38)
                - హరివర్మ (538-50)
              - భానువర్మ
              - శివరథ
        - కుమారవర్మ
          - మాంధాత్రివర్మ (488-500)
        - కృష్ణవర్మ I
          - విష్ణువర్మ
            - ⋮
              - సింహవర్మ
                - కృష్ణవర్మ II (550-65)
                  - అజవర్మ
          - దేవవర్మ

# పల్లవులు

నందివర్మ

- 1. సింహవిష్ణు (574-600)
  - 2. మహేంద్రవర్మ I (600-630)
    - 3. నరసింహవర్మ I (630-668)
      - 4. మహేంద్రవర్మ II (668-670)
        - 5. పరమేశ్వరవర్మ I (670-680)
          - 6. నరసింహవర్మ II (680-720)
            - 7. పరమేశ్వరవర్మ II (720-731)
            - మహేంద్రవర్మ III
- భీమవర్మ
  - బుద్ధవర్మ
    - ఆదిత్యవర్మ
      - గోవిందవర్మ
        - హిరణ్యవర్మ
          - 8. నందివర్మ II (731-795)
            - 9. దంతివర్మ (795-845)
              - 10. నందివర్మ III (844-866)
                - 11. నృపతుంగవర్మ (855-896)
                  - 12. అపరాజిత (879-897)

# రాష్ట్రకూటులు

దంతివర్మ

ఇంద్ర I

గోవిందరాజ I

కర్క I

ఇంద్ర II

1. దంతిదుర్గ 752 - 756

రెవా. భా. నందివర్మ
పల్లవమల్ల

దంతివర్మ పల్లవ

2. కృష్ణ I 756 - 775

3. గోవింద II
775 - 780

4. ధ్రువ
780-792

కంభకర్క

స్వర్ణవర్ష

5. గోవింద III
792 - 814

ఇంద్రరాజ

(585 వ పేజీ చూడుడు)

(584 వ పేజీ తరువాయి)

6. అమోఘవర్ష I 814 - 880

7. కృష్ణ II 880 - 915

అబ్బలబ్బె
బా. గంగబూతుగ I

శంఖా బా. పల్లవ
నందివర్మ III

లక్ష్మి బా. జగత్తుంగ బా. గోవిందాంబ

నృపతుంగపల్లవ

8. ఇంద్ర III 915 - 27

11. అమోఘవర్ష III 935 - 939

9. అమోఘవర్ష II
927 - 930

గోవింద iv
930 - 935

12. కృష్ణ III
939 - 966

13. కొత్తిగ
967 - 972

నిరుపమ

14. కర్క 972 - 973

కుమారుడు

15. ఇంద్ర iv

## చోళులు

- విజయాలయ 846 - 871
  - ఆదిత్య 1 871 - 907
    - పరాంతక 1 907 - 955
      - రాజాదిత్య 949
      - గంధరాదిత్య 949 - 959
        - మధురాంతకఉత్తమచోళ 970 - 985
      - అరింజయ 956-957
        - పరాంతక 11 956-973 (సుందరచోళ)
          - ఆదిత్య II (కరికాల)
          - రాజ రాజ 985-1016
            - రాజేంద్ర I 10.2-.044
            - కుంద వ. బా. విమలాదిత్య

587 వ పేజీ చూడుడు.

(586 వ పేజీ తరువాయి)

రాజాధిరాజ 1018-.054

రాజేంద్రదేవ II 1052-1064

వీరరాజేంద్ర 1063-1069

అధిరాజేంద్ర 1067-1070

అమ్మంగాదేవి. భా. రాజరాజనరేంద్ర (తూ. చాళుక్యుడు)

మధురాంతకి. భా. కులోత్తుంగ I (1070-1118)

రాజరాజ

ముమ్మడిచోళ

వీరచోళ

విక్రమచోళ 1118-1135

కుళోత్తుంగ II 1133-1150

రాజ రాజ II 1146-1173

## తూర్పు చాళుక్య వంశవృక్షము

- 1. కుబ్జవిష్ణువర్ధన I
  - 2. జయసింహ I
    సర్వసిద్ధి I (641-73)
  - 3. ఇంద్రభట్టారక
    - 4. విష్ణువర్ధన II
      (విషమసిద్ధి II) 673-82
      - 5. మంగియువరాజ
        (విజయసిద్ధి) 1682-706
        - 6. జయసింహ II
          (సర్వసిద్ధి) II)
          706-18
        - 8. విష్ణువర్ధన III
          (విషమసిద్ధి III)
          719-55
          - 9. విజయాదిత్య I
            (విజయసిద్ధి III)
            755-72
        - 7. కొక్కిలివర్మ I
          విజయసిద్ధి II
          718-19
          - మంగివర్మ II మహారాజ
            - వినయాదిత్యమహారాజ
        - పృథ్వీపొరి

6[illegible] వ పేజీ చూడుడు.

**About the Author** **Dr. N. V. R. Krishnamacharya**

True extract from CONTEMPORARY INDIAN LITERATURE Published by the SAHITYA AKADEMI, NEW-DELHI.

## THE NEO-CLASSICISTS

Within recent years, one notices the beginnings of a new movement, the return to classicism. If the Leftists and Surrealists rebelled against the romanticism of the earlier decades of this century, the neo-classicists like NANDURI KRISHNAMACHARYULU, Jandhyala Papayya Sastri and G. Joshua are questioning the value of the Surrealism of the years from 1935 to 1950. Harmony, instead of strife, is their ideal. In the postwar world an equilibrium has to be achieved between matter and spirit, between idealism and realism. KRISHNAMACHARYULU and his fellow poets claim that they are effecting this reconciliation. The Surrealists made light of the Romantics and spoke of them as 'escapists'. The neo-classicists in their turn are asking whereto the persistent preaching of a class-war will lead. The poverty and the misery of the people are undeniable, but how will hymns of hate alleviate that misery ? Is a class-war inevitable, and is it the function of poetry to serve as the handmaid of a political and economic revolution ? These are the questions being posed today, and the neo-classicists are anxious to regain for poetry its dignity as the symbol of all that is beautiful and true.

Dr. నండూరి రామకృష్ణమాచార్య, M. A., Ph. D.

# ర చ న లు

1. ప్రాచీన దక్షిణ భారతచరిత్ర — రు. 25—00

2. ద శ రూ ప క ము లు — 5—00
(ఉరికంబము, గీతకత్తి, తెలుగుగడ్డ,
పీరాభిషేకము, త్యాగరాజు, మరణాంతకము,
తమ్ముడు, బ్రహ్మనాయని స్వగతం,
నృత్యనాటికలు జ్యోత్స్నాభిసారిక గోదావరీ
సంగమం)

3. మూడు చారిత్రక రూపకములు — 6—50
ధర్మచక్రం, ఛత్రపతి శివాజి
శ్రీకృష్ణదేవరాయలు

4. తా రా తో ర ణ ం — 1—50
ఖండకావ్య సంపుటి

5. క వి త్ర య ము — 4—00
తెలుగు భాషాసమితివారిచే
బహుమతి వడసిన గ్రంథము

ప్ర చు ర ణ

**క వి తా ప్ర భా స గ్రం థ మం డ లి**

# ప్రాచీనదక్షిణభారతచరిత్ర

రచయిత : శ్రీ నందూరి రామకృష్ణమాచార్య

అనుక్రమణిక : శీర్షికలు : ఆరంభ పుటల సంఖ్యలు


## తొలియుషస్సులు 1.

తొలియుషస్సులు 1. ప్రాక్చారిత్రకయుగము 7. చరిత్రోదయము-ఆర్యవిస్తరణ 11.

## శాతవాహనయుగము 20.

ప్రాక్శాతవాహనచరిత్ర 20. శాతవాహనవంశము 30. ఖారవేలుడు: కళింగము 75. బృహస్పతిమిత్ర 79. ప్రాచీన దక్షిణభారత ద్వీపకల్పము : సంఘవృత్తములు; రాజ్యతంత్రము 82.

## ఉత్తర శాతవాహనయుగము 98.

పల్లవ వంశవృక్షము 98. వాకాటకులు 101. కదంబులు 104. పశ్చిమగాంగులు 107. ఇక్ష్వాకులు 108. బౌద్ధశిల్పములు 113. నాగార్జునాచార్యులు 115. పల్లవులు 119.

## త్రైరాజ్య సంఘర్షణము 134

[బాదామి చాళుక్యులు - కాంచీపల్లవులు - మధురపాండ్యులు] రెండవ పులకేశి 136.

## చోళచరిత్ర 153

ప్రాచీనతమిళసారస్వతము: చోళులు 157. సంఘవాఙ్మయము 164. అజ్ఞాతచోళయుగము 168. విజయాలయుడు 174. ఆదిత్యుడు 177. పరాంతకుడు 179. రాజేంద్రుడు 204. రాజాధిరాజు 221. మొదటి కులోత్తుంగమహారాజు 232. రెండవ రాజరాజు రెండవ రాజాధిరాజు 249. మూడవ కులోత్తుంగుడు 254. తెలుగుచోడులు 258. చోళసామ్రాజ్యము: సంఘవృత్తములు 271.

## రాష్ట్రకూట చరిత్ర 293.

కృష్ణరాజు 305. ధ్రువధరావర్ష మహారాజు 310. అమోఘవర్షుడు 316. కృష్ణరాజు ii - 320. ఇంద్రుడు 324. రాష్ట్రకూటచరిత్ర; సంఘవృత్తములు 335.

## తూర్పుచాళుక్యుల చరిత్ర 364.

కుబ్జవిష్ణువర్ధనుడు 365. గుణగవిజయాదిత్యుడు 371. పంద్రెంగుని దిగ్విజయయాత్ర 374. చాళుక్యభీముడు 376. జటాచోడభీముడు : అరాజకత్వము 382. మొదటి శక్తివర్మ 384. విమలాదిత్యుడు 385 రాజరాజనరేంద్రుడు 386. సప్తమవిజయాదిత్యుడు 392. తూర్పుచాళుక్యులకాలము : సంఘవృత్తములు 397.

## కల్యాణి చాళుక్యులు 401.

వంశవృక్షము 403. రెండవ తైలరాజు 404. సత్యాశ్రయుడు 408. రెండవ జయసింహుడు 411. మొదటి సోమేశ్వరుడు 414. రెండవ సోమేశ్వరుడు 428. ఆరవ విక్రమాదిత్యుడు 431. హొయసాలులు 434. కల్యాణి చాళుక్య రాజ్యము : రాజ్యతంత్రము : సంఘవృత్తములు 444.

## కళ్యాణి కాలచురివంశము 459.

బసవేశ్వరుడు - వీరశైవము 465.

## కాకతీయులు 471.

మొదటి ప్రోలరాజు 476. రెండవ బేతరాజు 479. రెండవ ప్రోలరాజు 479. రుద్రదేవమహారాజు 484. గణపతిదేవచక్రవర్తి 495. రుద్రమదేవి 510. కాయస్థరాజ్యము 516 ప్రతాపరుద్రదేవచక్రవర్తి 521. ముస్లిము దండయాత్రలు 523. ప్రతాపుని పాండ్యదండయాత్ర 526. కాకతీయసామ్రాజ్యమునందలిసంఘవృత్తములు 539 వంశవృక్షములు : శాలంకాయన వంశవృక్షము 577. బాదామి చాళుక్యులు 578. పాండ్యులు 579. వాకాటక వంశము 580. గాంగులు 581. కదంబులు 582. పల్లవులు 583. రాష్ట్రకూటులు 584, 585. చోళులు 586, 587. తూర్పుచాళుక్యులు 588. ప్రాచీన దక్షిణభారతదేశపటము.